ఆంధ్రప్రదేశ్

నవంబరు, 1976 * ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక * 50 పైసలు




మా తెలుగు తల్లికీ - మల్లెపూదండ!
మా కన్నతల్లికీ - మంగళారతులు!
కడుపులో బంగారు - కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు - దొరలించు మాతల్లి ॥మా॥

గలగలా గోదారి - కదలిపోతుంటేను
బిరబిరా కృష్ణమ్మ - పరుగులిడుతుంటేను
బంగారు పంటలే - పండుతాయీ
మురిపాల ముత్యాలే - దొరలుతుంటాయి ॥మా॥


అమరావతీనగరి - అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో - తారాడు నాదాలు
తిక్కయ్య కలములో - తీయందనాలు
నిత్యమై నిఖిలమై - నిలచియుండే దాక ॥మా॥

రుద్రమ్మ భుజశక్తి - మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి - కృష్ణరాయల కీర్తి
మా చెవుల రింగుమని - మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం! నీ పాటలే పాడుతాం!

జయ తెలుగు తల్లీ!
జయ తెలుగు తల్లీ!


శతశతాల చరిత్ర సంపదను
విలువైన తెలుగుగడ్డ భారత
దేశానికి ప్రకృతి ప్రసాదించిన వరం.
ఈ వరాన్ని మనం సంపూర్ణంగా వినియో
గించుకోవాలి. చారిత్రక కారణాలవల్ల
వేర్పాటు చెందిన తెలుగు ప్రజలు
సంవత్సరాల క్రితం ఏకమైనారు.
ఈనాడు మన రాష్ట్రంలో సంపూర్ణమైన
సమైక్యత వుంది. ఎన్నో ఏండ్లుగా
తెగకుండా తగాదాలకు మూలమైన
గోదావరి జలాల పంపిణీ సమస్యను
మనం చొరవ తీసుకుని పరిష్కరించు
కున్నాం. నదీ జలాల వినియోగ
చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది
ఈనాడు రాష్ట్రంలో సమైక్యత
సుస్థిరత్వం రాజ్యం చేస్తున్నాయి.
పరిస్థితి బాగుపడింది.
20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం
ఫలితంగా మన బడుగువర్గాల
జీవన పరిస్థితి మెరుగుపడింది.
ప్రజల సంపూర్ణ సహాయ,
సహకారాల వల్లనే ఇదంతా
సాధ్యమైంది. ప్రజలు చైతన్య
వంతులై ఇకముందు కూడా
ఇదే విధంగా తోడ్పడగలరని,
రాష్ట్రాభ్యుదయానికి కృషి చేయ
గలరని ఆశిస్తున్నాను.

సందేశం



భారతదేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల నిర్మాణానికి తెలుగు ప్రజలు మార్గదర్శకులయ్యారు. తెలుగు ప్రజల చిరకాల వాంఛితమైన విశాలాంధ్ర ఆంధ్ర ప్రదేశ్ పేరుతో 20 సంవత్సరాల క్రింద ఏర్పాటయింది. ఆంధ్రప్రదేశ్ 20 వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నాము. ఈ సందర్భంలో గతాన్ని ఒకసారి స్మరించుకోవటం అవసరం. తెలుగు జాతి ప్రజల ఉజ్జ్వల భవిష్యత్తుకోసం పాటుపడుతున్న సమయంలో మన రాష్ట్రం రెండుసార్లు పెడత్రోవలు త్రొక్కింది. సంకుచితమైన ప్రాంతీయ భావాల వల్ల రాష్ట్ర ప్రగతి ఎంత కుంటుపడుతుందో యీ సందర్భాలలో మనం గ్రహించాము. తెలుగు ప్రజలలో వున్న సహజమైన మంచితనం ముందు చూపు కారణంగా, మన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల సలహాలను పాటించి వారు సమైక్యతవలన కలిగే లాభాలను త్వరలోనే గ్రహించగలిగారు.

ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రజలందరూ కలిసి మెలసి జీవిస్తూ పరస్పర సహాయ సహకారాలతో అభివృద్ధిపథంలో పయనిస్తున్నారు. నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గతంలో ఎప్పుడూలేనంత సంతృప్తికరంగా వున్నది. నేడు ఓవర్ డ్రాఫ్టులు లేవు. మన వార్షిక ప్రణాళిక పెట్టుబడులు క్రమంగా పెరుగుతున్నాయి.

ద్రవ్యోల్బణం అంతరించి ధరలు తగ్గుముఖం పట్టాయి. నిత్యావసర వస్తువులు చౌక ధరలకు సమృద్ధిగా లభిస్తున్నాయి.

భూములేని పేదలు స్వంత భూములు పొందుతున్నారు. ఇళ్ళ స్థలాల పంపిణీతో ముఖ్యావసరమైన వసతి సౌకర్యం బడుగువర్గాలు పొందుతున్నారు. అట్టడుగునపడివున్న ప్రజల జీవన పరిస్థితులను మెరుగు పర్చేందుకు మన రాష్ట్రంలో అనేక కార్పొరేషన్లు స్థాపించారు.


ప్రధాని ప్రకటించిన ఆర్థిక కార్యక్రమం విశిష్టతను సామాన్య ప్రజల దృష్టికి తెచ్చేందుకు, ఆ కార్యక్రమం అమలులో ప్రజల సహకారాన్ని పొందేందుకు మన రాష్ట్ర ప్రభుత్వం ప్రచార సాధనాలన్నింటినీ విరివిగా ఉపయోగిస్తున్నది. వీటిలో అతి ప్రధానమైన సినిమా అభివృద్ధికి మన రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక సంస్థను యేర్పాటు చేసింది. మంచి ప్రబోధంగల చలనచిత్రాలకు ప్రోత్సాహం కలిగించేందుకు అనేక చర్యలను తీసుకుంటున్నది. రాష్ట్రంలో తయారైన చిత్రాలకు సబ్సిడీ యివ్వటం, థియేటర్ల నిర్మాణానికి ఋణాలు మంజూరుచేయటం, మంచి చిత్రాలకు వినోదపు పన్ను మినహాయించటం యీ చర్యలలో కొన్ని మాత్రమే.

అద్యతన భవిష్యత్తులో మన రాష్ట్రం దేశంలోని అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకం కాగలదనటంలో ఎట్టి సందేహం లేదు.


శ్రీ జలగం వెంగళరావు


శ్రీ పిడతల రంగారెడ్డి



శ్రీ జె. చొక్కారావు


శ్రీ కె. రాజమల్లు


శ్రీ రాజా సాగి సూర్యనారాయణరాజు



శ్రీ ఇబ్రహీం అలీ అన్సారీ


శ్రీ వి. కృష్ణమూర్తినాయుడు



శ్రీ టి. అంజయ్య

ఆంధ్రప్రదేశ్


శ్రీ పి. నరసారెడ్డి


శ్రీ బత్తిన సుబ్బారావు


శ్రీ ఎల్. లక్ష్మణదాసు


శ్రీ జి. రాజారాం


శ్రీ చల్లా సుబ్బారాయుడు


శ్రీ ఎం. వి. కృష్ణారావు


శ్రీ చనుమోలు వెంకటరావు


శ్రీ చేబ్రోలు హనుమయ్య



శ్రీ భాట్టం శ్రీరామమూర్తి



శ్రీ ఎ. వెంకటరెడ్డి



డా॥ సి. హెచ్. దేవానందరావు



శ్రీమతి యం. లక్ష్మీదేవి



శ్రీ వి. పురుషోత్తమరెడ్డి



శ్రీ పి. మహేంద్రనాథ్



శ్రీ డి. మునుస్వామి



శ్రీ ఆసిఫ్ పాషా

మంత్రి వర్గము



శ్రీ జె. వి. కేశవులు



శ్రీ జై. బి. నరసప్ప



శ్రీ పి. శేషావతారం



శ్రీమతి డి. కృష్ణవేణి సంజీవయ్య



శ్రీ యర్రా నారాయణస్వామి



శ్రీ పి. ధర్మారెడ్డి

ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర
20 వ వార్షికోత్సవ
ప్రత్యేక సంచిక

ప్రధాన సంపాదకులు :

శ్రీ రాజ్యం సిన్హా

సంపాదకులు

కుందుర్తి ఆంజనేయులు

ముఖచిత్రం : విదేశాలకెక్కిన తెలుగు కళావైభవం

చివరి అట్ట : సమృద్ధికి సంకేతాలు

కలర్ ఫోటోలు : శ్రీమతి ఎస్. ఎన్. దేవి

సాలుచందా : 6 రూపాయలు

వెల : 50 పైసలు

రిజిస్టర్డు నెం : హెచ్/హెచ్ డి 81

ఈ సంచికలో...

పేజీ



నవంబరు, 1976


కార్తీక_మార్గశిర 1898 శా.శ

సంపుటి: 21

సంచిక: 1



దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్



మన చరిత్రా సంస్కృతీ

చారిత్రిక కారణాల వల్ల విడిపోయి వేరుగా వుంటున్న తెలుగు ప్రజలందరినీ ఒకే పరిపాలనా వ్యవస్థ క్రిందికి తీసుకు రావడానికి జరిగిన కృషి, చేసిన త్యాగాలు, ఏ నాటికీ విస్మరించరానివి. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్యమం జాతీయోద్యమంలో ప్రధాన భాగంగానే కొనసాగింది. పరిపాలనలో ప్రజల భాగస్వాములు కావాలంటే ప్రభుత్వ భాష ప్రజల భాష అయివుండాలనే ఆశయంతో, అటు సర్కారు, రాయలసీమ జిల్లాల్లోనూ యిటు తెలంగాణంలోనూ ప్రజోద్యమాలు ప్రారంభమై ఫలవంతమైనవి. 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణ సమగ్రాంధ్ర సంస్కృతి వికాసానికి మొదటి మెట్టు.

1971 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్ జనాభా 435.03 లక్షలు. మన రాష్ట్ర విస్తీర్ణం, 2,76,754 చ. కి. మీటర్లు. భారత దేశంలో జనాభా దృష్ట్యా మన రాష్ట్రానిది నాలుగవ స్థానం. విస్తీర్ణంలో ఐదవ స్థానం. దేశంలో హిందీ మాట్లాడే వారి తరువాత తెలుగుభాష మాట్లాడే ప్రజలే అధిక సంఖ్యాకులు.

ఐతరేయ బ్రాహ్మణంలోని ఆంధ్రుల ప్రసక్తి మొదలయిన పురాతన గాథల్ని అలా ఉంచితే, శాలివాహనులు, లేక శాతవాహనులతో మనకొక చారిత్రిక స్వరూపం యేర్పడింది. సకలాంధ్ర దేశాన్ని పరిపాలించిన మొట్టమొదటి రాజులు శాలివాహనులు. ఈ వంశీయులు మొత్తం నాలుగువందల యాభై సంవత్సరాలు రాజ్యం చేశారు. వీరి మూల పురుషుడు శ్రీముఖుడు. క్రీస్తుకు

(తరువాయి 109 వ పేజీలో)

ప్రాచీనాంధ్ర సాహిత్యము

—కళాప్రపూర్ణ విశ్వనాథ సత్యనారాయణ

సాహిత్య మనగా నేమి ? సహితానాంభావః సాహిత్యమ్. సహితములైన వానియొక్క భావము సాహిత్యము, సహితమనగా కూడుకొనియున్న అని యర్థము లోకమునందు చెప్పుచున్నారు. కాని నిజముగా హితమైన దానితో కూడి యున్నదని యర్థము. హితమనగా నేమి ? 'హితం మనోహారిచ దుర్లభం వచః' అని భారవి వ్రాసినాడు. హితమును మనోహారియునైన వాక్కు దుర్లభము. ఏ మాట మనోహారిగా నుండునో మనస్సునకు తాత్కాలికమైన యొక పొంగును తెచ్చునో అట్టిదియు హితమైనదియునైన మాట దుర్లభము. హితమనగా నేమి ? హిత మనగా పథ్యము. అనగా తత్కాలము నందనిష్టముగా నుండి అనంత కాలమునందు మేలును సమకూర్చునది. వైద్యుడు పథ్యమును చెప్పును, అది తినుట కష్టము. కాని తిన్నచో వ్యాధి కుదురును. మొత్తము మీద సాహిత్యమనగా తత్కాలమునందు హితముగా నుండదు. అనంత కాలమునందు హితముగా నుండును. తరువాత మేలును సమకూర్చును. తరువాతనగా నెప్పుడు ? దానితో నీవు పరిచయము వృద్ధి చేసికొని దానిలోని సౌందర్యము నాస్వాదించుట కలవాటు పడి ఆ సౌందర్యము ననుభవించుచు నానందము పొందగలిగినంత జీవ లక్షణము పెంపొందించుకొని అందులో చెప్పబడ్డ మహా విషయములే యథార్థములని తెలిసికొన్న తరువాత నది సాహిత్యమగును.

తత్ప్రాంతములలో తత్తచ్ఛాఖీయులలో తత్తద్భావాభినివేశము కలవారిలో వారు తాత్కాలికముగా కవులు. దానిని సాహిత్య మనవచ్చునో రాదో తెలియదు. కొందరు కవులు తమ కవిత్వములకు ప్రచారము చేయుదురు. ప్రచారకులను నియమింతురు. శాఖా వర్ణాదికముల యభిమానముచేత ఒక కాలమునందు కొందరు కొందరు పూర్వ కవులకు ప్రచారకులగు

ఏ భాషయందైనను కులపర్వతములవలె కొందరు కవులుంటారు

పూర్వ కవులు కొన్ని వందల మంది యున్నారు. వేయి సంఖ్య దాటినదేమో తెలియదు. పాతిక ముప్పది నలువది యేండ్లు ప్రమాణముగా చూచికొన్నచో నెప్పటి కప్పుడు ప్రతి భాషలోను అనగా నాగరిక భాషలలో నసంఖ్యాకులయిన కవులుందురు. అందుకనియే "ఏ మహాత్ములు కల్గ భూమీశ సభలలో గవులకు మిగుల విఖ్యాతి కలిగె" అన్నాడు. భూమీశ సభలనగా వట్టి రాజుల సభలని కాదు. సదసద్విచారణ చేయగల సభలని యర్థము. సామాన్యముగా పూర్వ రాజులే పండితులు. అది కాక వారి సభలలో పండితులు భావుకులు సదసద్విచారణా శీలురు నుండెడివారు. పూర్వ కవులలో గొద్ది మంది మహాత్ములు, మహా సాహిత్య నిర్మాతలు. చాల మంది పద్యరచనయు ధారా శుద్ధియు పలుకుబడియు కొంత గడుసుదనమును కలవారు. వారి పేర్లు నిలువలేదు. నిలుచుట రెండు విధములు. దేశములో భావుకుల పరంపర యొకటి యుండును. వారి యందు నిలచినచో నిలుచుట. కాళిదాసు కవి నిలిచి యున్నాడు. కాళిదాసు మహాకవి యనెడు వారిలో నెంతమంది కాళిదాసును చదివినారు ? చదివిన వారిలో నెంత మందికి కాళిదాసర్థమైనాడు ? సరిగా నర్థమైన వారి సంఖ్య తక్కువ. ఈ తక్కువ సంఖ్య వారు కాళిదాసుని మహాకవి యన్నది. పరంపరయా తర తరములుగా వచ్చుచున్న తక్కువ సంఖ్యలో కల యీ భావుకులే కాళిదాసును నిలబెట్టుకొనుచు వచ్చుచున్నారు. ఇది నిజమైన నిలుచుట. రెండవ విధమైన నిలుచుట కాదు. పూర్వము కూడ వ్రాత ప్రతు లనేకములుండెడివి. వానిని చదివెడు వారుండెడివారు. ఇప్పుడచ్చుపడ్డ గ్రంథము లున్నవి. చదివెడు వారున్నారు. వందలాది కవులుండ వచ్చును.

దురు. తాత్పర్యమేమనగా యథార్థమైన సాహిత్యమును నిర్ణయించుట కష్టము. ఈ నిర్ణయ మిష్టము వచ్చినట్లుండుచున్నది.

కాని కుల పర్వతములవలె కొందరున్నారు. సంస్కృతములో నైన నింతే. సాహిత్యమును వృద్ధి పొందించుకున్న సర్వ నాగరక భాషలలో నింతే. ఇంగ్లీషులోనైన నింతే. ప్రస్తుతము హితమనగా నేమో విచారించవలయును. ఆ హితము నెరుంగుటకు మొదటనే రెండు నియమములు చెప్పబడినవి. మొదటిది యా మహా గ్రంథములతో నిత్య పరిచయ ముండుట. యథార్థమైన సౌందర్యము హఠాత్తుగా భాసించదు. చర్వణము చేసినకొలది

36—2

భాసించును. రెండవది దాని యాథార్థ్యమును జీవతః గ్రహించు పూర్వ కావ్యములున్నవి. పురా పట్టణాది వర్ణనములున్నవి. పురవర్ణనములో ప్రాకారము, అగడ్త, సౌధములు, నాల్గు వర్ణముల వారు పుష్పలావికలు మొదలైన వాని వర్ణన లుండును. ఆ కావ్యముల కిది స్థాయి.

ఆ సంఘ మట్టిది. ఆ నాగరకత యట్టిది. ఆ ధర్మమట్టిది. అప్పటికది హితము. దానిని నమ్మినచో జీవుని ప్రయాణము



సులభమగును. ఐహికాముష్మికములు సిద్ధించును. అనంత కాలము బుద్ధికి భాసించును. నిత్యముగా నున్న యీ మానవ సృష్టి యర్థమగును. యుగములుగా నీ మానవు డిట్లే బ్రతికి యున్నచో సామాన్య జీవులు తాము బ్రహ్మ పదార్థమని తెలిసికొనవలసిన యగత్య మున్నచో ననంత జన్మముల నెత్తవలసిన యవసరమున్నదని తెలిసినచో నే జన్మ కాజన్మ మంచి నడవడికతో నున్నచో నది సాధ్యమగునన్న విశ్వాసము కలిగినచో నదిహితము.

ఈ హితము రెండు విధములు. ఈ చెప్పినదెల్ల మొదటి హితము. అది జీవ సంబంధమైన హితము. సృష్టి సంబంధమైన హితము, వ్యవస్థా సంబంధమైన హితము రెండవ హితము కావ్యగతమై యుండును.

కావ్యమన నేమి? ఆలంకారికముగా విచారించుట కాదు. అలంకారములని కొందఱు నిర్దుష్టమైన శబ్దమని కొందఱు, ధ్వనియని కొందఱు పలుమంది పలు విధముల చెప్పినారు. ఈ చెప్పినదంతయు రెండు విషయములకోసమని చెప్పఁబడినది. ఒకటి పాఠకునకు కావ్యము చదివెడి శక్తి కలుగుటకు. రెండవది కావ్య నిర్మాణ వైఖరిని క్రొత్త కవులకు చెప్పుటకు. కనుక నాలంకారిక గ్రంథములు పరమ రహస్యమును చెప్పనేలేదన్న మాట. ఆ గ్రంథములు వ్రాసిన వారికా ప్రసక్తి లేదు.

ఎందుచేత? సంఘాది వ్యవస్థల విచారణ వారు చేసిచెప్పిరా? ఉన్న సంఘమును వర్ణించిరి. ఇదియునట్లే.

ఎవరు చెప్పినను తెలివిని వృద్ధి చేసికొనుటకు చెప్పుదురు తప్ప తదధికమైన దానిని చెప్పరు. తెలివి యెట్టిది? ఎక్కడ నుంచి వచ్చుచున్నది? ఆ వచ్చెడి స్థల మేది? ఆ స్థలమునందుండ వలసిన సంస్కార స్వరూప మెట్టిది? అది యెట్లేర్పడును. ఇట్టి ప్రశ్నలకు సమాధానము చెప్పబడదు. వేదములు, శాస్త్రములు, స్మృతులు సూత్రములు కూడ చెప్పవు. యోగ్యమైన కర్మ అయోగ్యమైన కర్మ వాని ఫలితములను మాత్రమే అవి చెప్పును.

కావ్య లక్షణములు

ఒక కావ్యమునందు రెండు లక్షణములు కలవు. ఒకటి శబ్దము, రెండవది యర్థము. అర్థమును విభజించి వేలమంది చెప్పినారు. శబ్దమును గురించి చాల తక్కువ చెప్పఁబడినది. శైలి, పాకము, రీతి యీమూడు మాటలలో శబ్దమును గూర్చి సూచింపబడినది. ఎందుకు విస్తరించి చెప్పఁబడలేదు? ఔచిత్యము, ధ్వని, వక్రోక్తి, అలంకారములను గూర్చి కుప్ప తెప్పలుగఁ జెప్పబడినది. రసములు, వానిలో మిత్రములు, అమిత్రములు—వీనిని గూర్చికూడ కొంత స్థూలముగాఁ జెప్ప బడినది. శైలీపాకరీతులు యెట్టివి! ఎట్లేర్పడు చున్నవి?

నన్నయ్యను పోలినవాడు సృష్టిలో మరియొకడుండడు.

శబ్దములు లేకుండ వాక్యము లేదు. అన్వయము లేకుండ వాక్యము లేదు. ఈ అన్వయము ప్రౌఢ కవులలోఁ గొన్నిచోట్ల నధ్యాహారము చేసికొన్నఁగాని కుదురదు చాల మంది చేసికోరు. ప్రౌఢకవి చెడిపోవుచున్నాఁడు. కనుక కావ్యము చదువుటకు తెలివి యవసరము మహా కవుల కావ్యములయొక్క సూక్ష్మ పరిశీలన మవసరము. దీనినిగూర్చి చాల యున్నది. వదలిపెట్టుదము. శబ్దములున్నవి కదా. శబ్దములు ఒకటి మొదలు ఆరు ఏడు ఎనిమి దక్షరములవరకు కూడిక కల్గినవున్నవి. ఆ శబ్దములను కవి సృష్టించలేదు. కొన్ని శబ్దములు వ్యాకరణ సూత్రములవలన నేర్పడుచున్నవి. ఎట్లయినను ఆ శబ్దములను మన ముచ్చరించుచున్నాము. వానియందొక యుచ్చారణ సౌలభ్యము వెనుక నేదో జీవున కిష్టమైన సవ్వడి, ఒక స్వర సంపుటి వంటిది మంచి గాయకుఁడు వేసిన సంగతి వెనుకను యొక కమ్మని రుచి యున్నది. మన జీవునకు నది తెలియును. కొందఱు జీవులు కొన్ని శబ్దములను కక్కసించుకొందురు. ఆ జీవున కా పరిణతి లేదని యర్థము. ఆ సంస్కారమా జీవునిలో లేదని తాత్పర్యము. ఇప్పటికి సూత్ర భాష్యాదులు అలంకార గ్రంథాదులు చెప్పని యొక విషయము వచ్చినది. అది యేమనగా జీవుని పరిణతి జీవుని సంస్కారము. ఈ రెంటి చేతనే శైలిగాని పాకముగాని రీతిగాని పాఠకుఁడు తెలిసికొనఁగలఁడు. ఇది యిట్లని చెప్పెడివాఁడెవ్వఁడును లేఁడు.

మైన కవి వీఁడు. అప్పుడు శైలియో, పాకమో రీతియో యేర్పడును. వానికి మించిన యిదమిత్థమని చెప్పరాని యొక సంగీత మేర్పడును. మనకున్న శబ్దములయొక్క దారిద్ర్యము చేత దానిని సంగీతమనుచున్నాముకాని అది సంగీతము కాదు. సంగీతమువంటిది. అది యాత్మానుభవవేద్యము. ఎవడును చెప్పెడిది కాదు. ఎవని యాత్మకు వానికి దెలియవలసినదే. ఇది కాళిదాసుని యందున్నది, వాల్మీకి యందున్నది, నన్నయ గారి యందున్నది. తక్కిన కొందరు మహా కవుల యందున్నదెట్టిదో యాలంకారికులు చెప్పిరి. దానిని గుణములుగా విభజించిరి. మాధుర్యము సౌకుమార్యము, ఓజస్సు మొదలైన గుణములుగా చెప్పిరి. ఈ గుణములను ప్రతిభాశాలియైన కవి, ఒక గుణముల లక్షణము కలిగిన ఒక జీవసంపత్తి కలవాడు, సమకూర్చవచ్చును. ఒక శ్రీనాథుడు శబ్దముల నెన్నుటచేత తన రచన యందు మాధుర్యమన్న గుణము వెక్కి తొక్కిసలుగా సమకూర్చును. సంస్కృతములో భవభూతి కూడ నిట్టివాడే. మురారి ఆయన శిష్యుడు. అందుచేత నా నన్నయ్య, వాల్మీకి కాళిదాసుల యందు మాధుర్య సౌకుమార్యాది గుణములు విస్పష్టముగ కన్పించవు. ఆ మహా విషయములలో నన్నయ్యను పోలినవాడు సృష్టిలో మరియొకడుండడు. ఇంగ్లీషు భాషలో నున్న ఇట్టి లక్షణము నేను జన్మచేత నింగ్లీషు వాడను కాను గనుక నాకు తెలియదు గాని మిల్టనులో నున్నదందురు. ఆ దేశములో మిల్టను ముందు షేక్స్పియర్ కూడ కవి కాదను వారున్నారు. ఈ కవిత్వ

సూత్ర భాష్యాదులు, అలంకార గ్రంథాలు చెప్పని యొక విషయమున్నది. అది జీవుని పరిణతి జీవుని సంస్కారము

ఇన్ని శబ్దములుండగా శబ్దములనంత విధములైనవి యుండగా ఆ శబ్దముల వెనుక మన మూహించనిది మనకు తెలియనిది ఒక తదక్షర సంపుటివలన నేర్పడిన సంస్కారముచేత మాత్రమే తెలిసికొనఁదగిన ఆ గానములోని ఒక సంగతి వేసినప్పుడు వేసిన ఒక స్వర సంయోజన జనిత గుణము, అదియు సంగీతము వంటిదేమో అనుకొనఁదగిన యొక సవ్వడిలోని యేదో గుణము కలదుగదా! ఇప్పుడు కవి తాను కావ్యము వ్రాయునప్పుడు తానట్టి శబ్దములను సమకూర్చుటయేగద చేయునది. తన సమకూర్పులో నొక కావ్యములో నొక పదియో పాతికయో శబ్దము లుండునుగదా. ఆ శబ్దముల యొక్క వెనుకనున్న సమీచీనత సాన్నిహిత్యము సంగీతముకాని సంగీతము సరిపోయినదా అని చూచికొనవలయును. యథార్థ

మిట్టిదని నిర్ణయించుటకు వీలులేదు. పద్య రచన వేఱు, ఇట్టి విలక్షణమై కవి రచన వేఱు. "జాన్‌స్టూవర్టు బ్లాకీ" అను నొక స్కాట్లండులోని 18 వ శతాబ్దములోని మహా గ్రీకు పండితుఁడొక వాక్యమును వ్రాసినాడు. పద్యము కవికిని తాత్వికునికిని సమానమట. తాత్వికుడు కూడ పద్యము వ్రాయును. వాని పద్యములో వంద గుణము లుండును. అనగా యథార్థమైన కవి గాడు. కవియై పుట్టలేదు.

తెలుగు కవుల్లో ప్రసిద్ధులు

తెలుగు భాషలలో ప్రసిద్ధులైన మహాకవులు మొత్తము మీద నెనమండుగురు తొమ్మండుగురికన్న నెక్కువ లేరు. వీరిలో నన్నయ్యవంటి వారు తక్కిన వారు కారు. తెలిసికొను

టకు పైన చెప్పిన మహావిషయము లవగతమైన జీవసంపుటిలోని సంస్కార పరిణతుల యొక్క యావశ్యకత కలదు. అది యెక్కడో యెందుకో తెలియదు. ఈ దృష్టితో సంస్కృతము లోననే నన్నయ్య వంటివాడు లేడు. నాకు తెలియదు. ఇంగ్లీషులో మిల్టను కావచ్చును. ఆ బాక్స్వ యొక గ్రీకు నాటక కర్త. నాటకములను తర్జుమా చేసినాడు. ఆ నాటక కర్త ఇట్టి కవి యని యతడు చెప్పినాడు. నన్నయ్య వాణిలో సరస్వతీదేవి తన కచ్ఛపి మీద చమత్కారముగా నొక వ్రేలితో తంత్రులను మీటినది. ఆ ధ్వని ముందు నారద తుంబురులను కూడ చెప్పుటకు వీలులేదేమో! ఒక యేదో పరమ నిగూఢమైన రహస్యమును చెప్పి నేను చెప్పుచున్నాను గనుక మీ రొప్పుకొనుడనుట న్యాయమే కాదేమో.

నన్నయ్య గారి రచన ఈ సహజమైన పరమేశ్వరు డిచ్చిన యొక సంగీతపూర్ణమైన యక్షర సంయోగ శబ్ద సంయోగ చాతురితో సర్వత్ర నడచుచుండగా నాయన యలంకార శాస్త్రపు మర్యాదలను గూడ చక్కగా పాటించుచుండును. ఆ సమయములో కూడ నీ సంగీత లక్షణమనుస్యూతముగానే యుండును. ఆ శబ్ద సన్నివేశము తద్గుణమును గుర్తించుటకు ప్రయోగించినాడని వెంటనే తెలియుచుండును. ఒక గుణమును పుట్టించుటకు నొక కవి కొన్ని శబ్దములనుయేరియేరి ప్రయోగించి నాడను కొనుడు. గుణము కనిపించును. దాని ఫలితము దానికి కలుగును. అయినను కవి దీని కొఱకీ శబ్దములను ప్రయోగించి నాడని తెలియుచుండును. అది యాకస్మిక ప్రత్యవభాసము కాదు. కవి తన నేర్పు చేత చేసినది. ఈ సంగతి సర్వజ్ఞుడైన పాఠకునకు తెలిసిన వెంటనే దానిలోని గుణాధిక్యము కొంత కొఱత పడును. పాఠకు డొక యానంద వీథీ విహారము చేయుచుండును. ఒక యానంద సన్నివేశానుభూతి వేళ తదనుభూతి కారణము స్పష్టముగా తెలిసినచో ననుభూతిధారకు నడ్డముతగులును. "హా మహారాజ మహామహీ రక్షణ దక్ష దక్షిణ బాహుదండ దండితారాతి". ఇది నలుడు తన చీరచించుకొని పోయినప్పుడు దమయంతి పొందిన దుఃఖము. ఇంకొక కవి యైనచో పది భావములు పెట్టి పది పద్యములు వ్రాయును: తాను కరుణ రసమును పోషించుచున్నానని యనుకొనును. ఇచ్చట నది యేమియు లేదు. ఈ చిన్న కూర్పులో ముక్తపద గ్రస్తాలంకార మున్నది. ఆ యలంకార మున్నదని లీలగా తెలియుచున్నది. ఒక యలంకారమును కవి చొప్పించినాడన్న భావము లీలగానైన మహాభావుకునకు స్ఫురించరాదు. స్ఫురించుట తోడనే యానందధార కుంటువడును. పెరభావముచేత తాడితమగును. నన్నయ్య దగ్గఱ నిది యొక నేర్పు కలదు. కూర్చిన శబ్దముల చేత రసస్ఫూర్తిని కలిగించును. ఈ పై నుదహరించినది అందులోని భావము. అవి పట్టి సంబోధనలు, అందులోనుండి రసము సముద్భవించుచున్నది. ఎచ్చటనుండి పుట్టుచున్నది. శబ్ద సంయోజనమునుండి పుట్టుచున్నది. నన్నయ్య రచన యంతయు దీని కుదాహరణమే.

నన్నయభట్టు

ఆజానులంబమానాంభోజనాళ బా
హాదండముల నందమైన వాని
భసిత త్రిపుండ్రాంకఫాలభాగమున జం
ద్రార్థ శేఖరు ప్రతియైన వాని
నిత్య గోదావరీ నియమ వేళాకృత
స్నానమ్ములఁ బవిత్రుఁ డైనవాని
ప్రౌఢాంధ్ర విజ్ఞానభాషామహాదేవి
కావాస మైన యాస్యమ్ము వాని
పచ్చుకవి నన్నభట్టుని వాఙ్మయంత
నెదురుగాఁబోయి సచివాదు లెఱిగి తేర
సముచితాసనమున శబ్దశాసనుండు
ఉదయశిఖరి మార్తాండుఁడై యొప్పుమెఱసె.

—విశ్వనాథ

తిక్కన విశిష్టత

తరువాతి వాడు తిక్కన్న. ఇద్దఱకు నిజముగా సంబంధము లేదు. బహిఃపరిస్థితులు చూచినచో నాంధ్ర రాజ్యము శాంతముగా నున్నప్పుడు నన్నయ్య జనించెను. తిక్కన పుట్టిన కాలము పెఱు దేశము భిన్నమై పోయినది. మనుమసిద్ధి చిన్నరాజు, అటు వీరశైవము విజృంభణలోనున్నది. తెలుగు శబ్దముల బాహుళ్యమునకు ప్రాచుర్యము వచ్చినది.

తిక్కన్న లేనిచో తెనుగు కవిత్వము లేదు

ఇట్టి హేతువులు మహా కవి మీద పనిచేయునా ? ఒక్కొక్కప్పుడు పని చేయును. ఛందస్సున్నది. ఆ గణముల యేర్పాటుగా పద్యము వ్రాసినచో పద్యమునకు శ్రుతివేయత తగ్గును. శబ్దములను బట్టి గణములు కాని గణములను పట్టి శబ్దములు కావు, తిక్కన్నతా నెన్నుకొన్న శబ్దములను విరిచి విరిచి పద్యములందు చొప్పించి యొకయఖండమైన కవితా నిర్మాణము చేసినాడు అది యాయనకే సాధ్యము ఇంకొకడు చేయలేడు. కాని, భాషమీద నంత ప్రభుత్వము కలవాఁడు చేయగలడుఁ. చేయును. కొందఱు చేసిరి. నేడు చేయుచున్నారు. కాని తిక్కన్న గొప్పదనము దీనిలో మాత్రమే లేదు. అనంత భావ సంపుటిని సంగ్రహించుటలో నున్నది. వానిని పొడిపొడి మాటలలో చెప్పుటలో నున్నది. సంస్కృత శబ్దములను బహుళముగా వాడి వానిని వాడనే లేదనిపించుటలో నున్నది. రసస్ఫోరకమై, భావోద్దీపకమైన రచనలో సంస్కృత సమాసములను వేయును. వేసినట్లు కనిపించదు. ఆ సమాసములు తిక్కనగారికున్న సహజ కవితావేశములో నుండి వచ్చినవి. తక్కినచోట్ల యందలి సమాసములు పాకములో నుండవు. తిక్కనలేనిచో తెనుఁగు కవిత్వములేదు. నన్నయ్య నెవ్వఁ డను సరించలేఁడు. తిక్కనను ప్రతిభావంతుఁడనుసరించవచ్చును. తిక్కన్న నుడికారమును కాకువును పలుకుబడిని పట్టుకొని గుంజును. కావ్యమంతయు రసధ్వనిమయమగును. అయినది. అపవాదములైన పెక్కు స్థలములున్నను, ప్రధానమైన తిక్కన గారి కవితా లక్షణమిది. భారతము చదువుట కష్టమని తెలుఁగులో నానుడి కలదు. ఈనానుడి పదువేను పర్వములు వ్రాసిన తిక్కన్నగారి భారతము చదువుటలో నున్న కష్టమును బట్టి వచ్చినది. సమృద్ధిగా కాకువును సంయోజింపవలయును. కంఠస్వరమును మార్చవలయును. వేదమునందువలె నుదాత్త స్వరితములను సమకూర్చుకొన్నచోగాని తిక్కన రచన చదువ లేము. చదివినచో సంపూర్ణమైన నర్థమీయదు.


శ్రీనాథుడు

శ్రీనాథుఁడున్నాఁడు. అదియొక గంగా ప్రవాహము గంగ భూమికి దిగినది కాని యథార్థముగా నామె మందాకిని. పూర్వ సంస్కృత కవులలో నున్న రమణీయ భావములు కలిగి బహు సమాసములను యథేచ్ఛముగా తన కవితలోనికి చొప్పించును. ఆయన సీసపద్యము తిక్కనగారి సీసపద్యముల కనుకరణ. కాని, ఆయన సంగ్రహించిన మాధుర్యము ధారాశుద్ధిచేత సీసమునకు శ్రీనాథుఁడైనాఁడు. విడమరచి చూపించినచో నట్టి సీసి పద్య రచన యెంత సులభమో తెలియఁగలదు. ఆయనమఱియొక చమత్కారము చేసినాఁడు సీస పద్య చరణమంతయుచేసి చివరనొక తెలుఁగు ధాతువును సమకూర్చును. దానితోనతని తెలుఁగు పద్యము తళుక్కుమనును. ఇట్టివి సర్వ కవులయందు క్రొత్తక్రొత్త మెలఁకువలుండును.ఇవి యన్నియు భావపరిపోషకములు,రసోన్మీలనములు.

సంగీత ప్రపంచకము

సంస్కృతములో వాల్మీకి వ్యాసులను వదిలినచో కాళిదాసుతో మొదలుపెట్టి కావ్యశైలి యొకయేర్పాటైనది. ఈ కావ్యశైలిలోనికి భారవిరాఁడు. తెలుఁగులో నన్నయ్య గారి దగ్గఱ నుండి కావ్యశైలియే. పెద్దనగారి కాలమునకు నీకావ్యశైలి మరియు బిగిసి తెలుఁగు పద్యమొక పట్టు జరీ చీర కట్టినసౌందర్యవతివలె సిద్ధమైనది. అంతబిగింపు అంత ధారాశుద్ధి అంతమాధుర్యమున్నచో తెలుఁగు పద్యము పునాదులుపూర్వమే పడినవి. శ్రీనాథునితో మొదలు పెట్టినవి. ఈ పద్యమునకు పెద్దన పట్టాభిషేకమును చేసినాఁడు, అందుకని ఆయన యాంధ్ర కవితాపితామహుఁడు. అన్నిటికంటె విలక్షణమైన గ్రంథమొకటి కలదు. దాని పేరు పాండురంగ మాహాత్మ్యము. శబ్దమాల వెనుకనున్న యొక సలక్షణ షడ్జమస్వరము దాని మాధుర్యము వానికే తెలియును. ఈ పూర్వాంధ్ర సాహిత్యము విలక్షణమైన యొక సంగీత ప్రపంచకము!

ఆంధ్ర ప్రశస్తి



—డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు

గాసట బీసలే చదివి గాథలు ద్రవ్వెడు నాడు, కమ్రవి
న్యాసము సల్పు శిల్పి యులియంచులు నోంకృతి పల్క తత్త్వపో
వ్యాసుడు నన్నపార్యునకు పంచమ వేదముగా ధ్వనించు, వా
చాసముదాత్త మాంధ్రుల ప్రశస్తికి నైగవ దోయిలించెదన్

కదన ముఖంబునన్ బిరికి కండలు గాననివారు, ధీరతా
స్పదులగు భర్త లుద్దవిడి శాత్రవులన్ దెస జీల్చివచ్చినన్
పదనుదొలంకు వారిఁ గరవాలపు నెత్తుటి గుంకుమాంకముల్
వదనములందు దిద్దుకొను పత్నులకెల్ల సమస్కరించెదన్

ఏ పద్మమున జుఱుకించెనో! మధువు, పె
న్నాదేవి తిక్కన స్వాదుకవిత!
ఏ వేళల ననుగ్రహించెనో! భద్రాద్రి
రామయ్య పోతన రసిక భక్తి!
ఏ పూన్కితో నాకళించెనో! శ్రీనాథ
కవిరాజు కర్ణాట క్రమఫణితి!
ఏ విక్రమము ప్రోత్సహించెనో! కృష్ణరా
యని వీరవైష్ణవం బును మథింప

వేదాద్రి నరసింహ విపుల వక్షఃపీఠ
కమనీయ కల్హార గంధలహరి
ఏడు కొండలసామి యేపూట కాపూట
భోగించు పచ్చ కప్పురపు కంపు
భ్రమరాంబికా సమర్చా కుంకుమోన్మిశ్ర
పుష్పచంద్రకితమై పొలుచు సొగసు
శ్రీకాళహస్తీశ శివతాతి రూపరే
ఖాస్నిగ్ధ నైగనిగ్యమ్ము చెలువు

భద్రగజ ధీరగతి తామ్ర పర్ణినుండి
భక్తి రసజీవనము చంద్రభాగవరకు
ఆ త్రిలింగేశ్వరులదయ నవఘళించి
'ఆంధ్రి'–యన మెత్తువారని యాత్మలేదు

కవితగా, గానముగ, చిత్రగతిగ, శిల్ప
కళయుగా రుచి నింప సాక్షాత్కరించి
'ఆంధ్రరాష్ట్రమ్ము'–దన భాష్పలవరించి
ఎదుగుగావుత! శాశ్వతాభ్యుదయ మహిమ.

తెలుగుదనం తీరు తెన్నులు

శ్రీమతి వేదవతీదేవి

ఒక్కొక్క జాతికీ ఒక్కొక్క భాషా, సాంప్రదాయమూ, సంస్కృతీ ఉంటుంది. తెలుగు జాతి చరిత్ర ఉత్తమ సంస్కృతీ సంపన్నమైనది. ఎంతో ప్రాచీనమైనది

ప్రధాన వృత్తులలో, వేష భాషలలో, ఆచారాలలో, సంస్కృతిలో—ఏ జాతి ప్రత్యేకత ఆ జాతిదే. ఆ జాతి అలా రూపొందటానికి కారణం—ఆ జాతి వృద్ధిచెందిన పరిసర నైసర్గిక ప్రభావం అయివుంటుంది.

మన తెలుగుదేశం భౌగోళికంగా సుసంపన్నమైనది. కొండలు, కోనలు, లోయలు, అడవులు—ఒకవైపున, కృష్ణ, గోదావరి, పెన్న-మరెంకెన్నో ఉపనదులు మరొకవైపున, మన దేశాన్ని సస్యశ్యామలం చేసి, అన్నపూర్ణగా భాసింపజేసినవి. ఈ నదీమతల్లులు పునీతం చేసిన తెలుగుగడ్డ కనకగర్భ. ఈ గడ్డను నమ్ముకొన్న తెలుగువాడికి వ్యవసాయం జన్మత: ఏర్పడిన వృత్తి విద్య. పాడిపంటలకు ఆటపట్టయిన మన పల్లెసీమ అసలు సిసలైన తెలుగు గడ్డ.

అందుచేత, అచ్చమైన మన తెలుగుతనం దర్శించుకోవాలంటే మన ఉనికికి ఊపిరిపట్టులైన పల్లెసీమలకు మనం పోవాలి. నీర్కావి పంచె మోకాలిపైకి ఎగగట్టి, నోట్లో పొగాకుచుట్టతో, అక్కడ పొలంగట్టుమీదే మనకు వెంకయ్యమామో, నరసయ్యతాతో, రంగయ్యబావో ప్రత్యక్షం అయితీరుతారు.

కలుపుగోలు తనం

అక్కడ అందరికందరూ బంధువులే. వయసు మళ్ళిన వారంతా పిన్నవారికి తాతలే. వయసులో ఉన్నవారంతా, ఒకరికొకరు అన్నలో, బావలో, మామలో కావలసిందే ! అట్లా వరుసలు కలుపుకోవటం, ఆప్యాయతలు ఒలకపోసుకోవటం—తెలుగుజాతి ప్రత్యేకత.

ఇలా బంధు ప్రేమలు అల్లుకుపోవటం అనేది మన కుటుంబ వ్యవస్థలోనే ఉన్నది. మన ముందుతరంవరకూ మనవి చాలావరకు ఉమ్మడికుటుంబాలే ! ఇంటికి తండ్రో, లేక పెద్దకొడుకో ఆధిపత్యం వహిస్తే మిగతావారంతా అతని అజమాయిషీక్రింద మెలిగేవారు. అందుచేత కుటుంబంలో ఒకరంటే ఒకరికి కొంత దగ్గరతనముండేది. మేమంతా ఒకటి—అనే ఆంతర్యం ఉండేది. కాని ఈ వ్యవస్థ యిప్పుడు చాలావరకు మారిపోయింది. వయసు రాగానే, ఎవరి జీవన విధానం వారు ఎన్నుకుని స్వతంత్ర జీవనం గడపటం యిప్పుడు సర్వసామాన్యం అయిపోయింది.

తెలుగువారికి సంప్రదాయపు కట్టుబాటులు, ఆచారపుటలవాటులు ప్రత్యేకమైనవి కొన్ని పరంపరాగతంగా వస్తూ వున్నవి. ప్రతి కుటుంబానికీ ఇంటిపేరు ఉంటుంది. ఒకే ఇంటి పేరున్న రెండు కుటుంబాల మధ్య వివాహ సంబంధాలు చేయరు. కుల, గుణ, రూప, విద్యా విషయాల్లో తమకు సరి అయినవారిని ఎన్నుకొని పెద్దలు పిల్లల వివాహాలు చేయటం మనకు అనాదిగా వస్తున్న ఆచారం. మేనరికాలుకూడా ఎక్కువగా అమలులో ఉన్నవే. ఇంచుమించు అన్నివర్గాలలోను వరకట్న దురాచారం ఉన్నది. ప్రభుత్వం అమలుపరుస్తూ ఉన్న కఠిన చర్యలవల్ల నైతేనేమి, మానసిక పరివర్తనం కలగటం వలన నైతేనేమి, సాంఘిక బాధ్యతలను గుర్తెరిగిన కొంతమంది అభ్యుదయగాములు ఇప్పుడిప్పుడే ఈ వరకట్న నిర్మూలనకోసం ముందుకు వస్తున్నారు.

వివాహాలు పూర్వం ఎన్నో వేడుకలతో సంప్రదాయ బద్ధంగా అయిదు రోజులు జరుపుకునే వారు. ఈ వేడుకలు ఎంతో అంతరార్థం కలిగి ఉండి, వధూవరులకే కాక, చూచే వారందరి హృదయాలనూ స్పందింపజేసి దివ్యానుభూతిని కలిగించేవిగా ఉంటాయి.

స్నాతకం తంతులో పెళ్ళికొడుకు అలిగి కాశీకి వెళ్ళిపోతాననడం, పెళ్ళికూతుర్ని బుట్టలో ఉంచి మేనమామ వేదిక దగ్గరకు తీసుకురావడం, జీలకర్రబెల్లం నడినెత్తిన పెట్టించటం, మంగళసూత్రధారణ, తలంబ్రాలు, నాగవల్లి, పల్లకిలో ఊరేగించటం, బువ్వముబంతులు, చెండ్లాటలు అప్పగింతలు-ఇలా ఎన్నో వేడుకలూ ముచ్చట్లూ జరుపుకుంటారు. ఇంచుమించు ప్రతివేడుకకూ సంబంధించినవి, సరస శృంగార రసస్ఫూర్తితో నిండినవి-అందమైన స్త్రీలపాటలు ఎన్నో ఉన్నవి.

అభ్యుదయవాదులు ఇప్పుడిప్పుడే వరకట్న నిర్మూలనకోసం ముందుకు వస్తున్నారు.



ఇప్పుడా అయిదురోజుల పెళ్లిళ్లు లేవు. ఒక్కపూట తోనే క్లుప్తంగా ముగించే ఈనాటి పెళ్ళిళ్ళలో ఈ వేడుకలకు స్థానం లేదు. గుప్తధనం వంటి ఈ పెళ్ళిళ్లపాటలు, ఆనోట ఆనోట అప్పుడప్పుడూ వినవచ్చే ఈ జానపద సాహిత్యం ఇంచు మించు ఇప్పుడు అంతరించిపోతున్నదనే చెప్పాలి. నలుగు పాటలు, వరుసపాటలు, చెండ్లపాటలు, అలకపాటలు, గంధము పాటలు, తాంబూలము పాటలు, అప్పగింతల పాటలు, శోభనం పాటలు, మంగళహారతులు - ఇవన్నీ మన స్త్రీలు పెళ్ళి వేడుకలలో ఆయా సందర్భాలలో పాడుకొనే పాటలు.

ఈ పెళ్ళిపాటలే కాక, అపారమైన జానపద సాహిత్య సంపద మనకు ఉన్నది. మజ్జిగ చిలుకుతూనో, రాట్నం వడుకుతూనో, కలుపు తీస్తూనో, నాట్లు వేస్తూనో, కోతలు కోస్తూనో, వడ్లు దంచుతూనో, తిరగలి విసురుతూనో–ఉండగా జానపదుల నోట వాగ్ధారగా ప్రవహించి వచ్చిన సహజ సరస్వతి–ఈ పల్లెపదాల సాహిత్యం. బాలగేయాలు, లాలిపాటలు, మేలుకొలుపులు, గొబ్బి పాటలు, సువ్వి పాటలు, దంపుళ్లపాటలు, ఉయ్యాల, తుమ్మెద పదాలు, రామాయణ, భారత, భాగవత కథా కల్పనలు, ఏల పాటలు, ఇలా ఎన్నో రకాలుగా, అనుశ్రుతంగా ఉబికి వచ్చిన మన జానపదసాహిత్యం కాలగమనంతో పాటు, తెరమరుగున పడిపోయింది. మనం ఎంతటి అపురూపమైన సహజ సుందరమైన సాహిత్య సంపదని పోగొట్టుకుంటున్నామో గుర్తెరిగి ఇటీవల కొంతమంది కవులూ సాహితీప్రియులూ– ఈ పాటలను సేకరించి గ్రంథస్థం చేస్తున్నారు. ఈ కృషి ఇంకా విరివిగా జరగాలి.

తెలుగునాట, అది రాజేంద్ర భోగి మందిరం కానీ, రవిచంద్రులు తొంగిచూచే పూరిల్లుకానీ, తెలుగుదనపు తేటదనం ఆ ఇంటి ముంగిలోనే మనకు దర్శనీయంగా కనిపిస్తుంది. ఊడ్చి, కళ్లాపి జల్లి, ముగ్గుపెట్టిన ముంగిలి, పసుపు పూసి కుంకుమ బొట్లుపెట్టిన గడప, మామిడాకుతోరణం కట్టినగుమ్మం, ఇదీ తెలుగింటి లక్షణం. ఉదయమే లేచి, వీధివాకిలి ఊడ్చి, గోమయం నీళ్ళతో కలిపి చల్లి, తెల్లనిరంగవల్లి తీర్చి దిద్దటం–తన ప్రథమ కర్తవ్యముగా భావిస్తుంది, శుచీ శుభ్రతా ఎరిగిన తెలుగు ఇల్లాలు. ఇలా చేయటం మంగళకరం–లక్ష్మీదేవికి ప్రీతికరం-అని మనభావన.

> "చందనమ్మున కలయంపి చల్లినారు
> ముగ్గు లిడినారు కాశ్మీరమున ముదమున
> వ్రాసినారిందు రజమున రంగవల్లి
> కంజముల తోరణంబుల గట్టినారు"

తెలుగు ముంగిట్లో ఉండే శోభనూ అలంకారాన్నీ, కవి ఇలా క్రీడాభిరామంలో వర్ణిస్తాడు.

ఇంటిని ఇంత శుభ్రప్రదంగా, శోభప్రదంగా, తీర్చి దిద్దుకునే తెలుగు ఇల్లాలు లలితకళా విశారదే కాక అలంకారప్రియకూడ అయిఉంటుంది.

ముఖానికి పై పూతగా ఛాయపసుపు రాసుకోవటం, చేతులకూ కాళ్ళకూ గోరింటాకు పారాణీపెట్టుకోవడం, ఆమె సౌందర్యారాధనకు గీటురాళ్ళు. చీర, రవిక, మట్టిగాజులు, బొట్టు, కాటుక, నల్లపూసలు, మంగళ సూత్రాలు, మట్టెలు–ఇటువంటి సామాన్యపుటలంకరణలతో కనిపించే స్త్రీమూర్తి తెలుగుతనం మూర్తీభవించిన తెలుగునారి.



నవనాగరికత తెచ్చిన కొత్త పోకడలు

కాని, కాలంతోపాటు వచ్చే మార్పులు, నవనాగరికత తెచ్చి పెట్టిన చేర్పులతో, ఈనాటి తెలుగు నారి అలంకరణలో, ఎన్నో క్రొత్తపోకడలు కనిపిస్తాయి. ఒకప్పుడు తాంబూల చర్వణంతో ఎరుపెక్కిన అధరాలకు ఈనాడు లిప్‌స్టిక్ శరణ్యమైంది అలాగే పసుపు స్థానంలో ఎన్నో క్రీములు, ఫేస్ పౌడర్లు, గోరింటాకుబదులు నెయిల్ పాలిష్‌లు వాడకంలోకి వచ్చాయి అయితే, చీర కట్టు మాత్రం అప్పటికీ, ఇప్పటికీ అలాగే నిలిచిపోయింది. రకరకాల చేనేత జరీ చీరలు, అద్దకపు చీరలు, పట్టు చీరెలు—ఎంతో సొంపుగా, సొగసుగా కట్ట నేర్చింది తెలుగు వనిత. ఈ మన చీరకట్టు దేశంలోని ఇతర ప్రాంతాల వారినేకాక, విదేశాలలోని స్త్రీలనుకూడా ఆకర్షించటంలో అతిశయోక్తి లేదు.

ఆనాడు మన స్త్రీలు ధరించిన ఆభరణాలు ఆపాద మస్తకం ఉండి, ఎంతో ఆకర్షణీయంగా ఉండేవి. అమరావతి, నాగార్జున కొండ - శిల్పాలలో కొన్ని, మన ప్రాచీన సాహిత్యంలో కొన్ని — ఈ ఆభరణాలను మనందర్శించవచ్చును. పాపటి బిందీలు, రాగిడీ, కమ్మలు, చంద్రవంక, రావిరేక, చామంతి బిళ్ళ, ముక్కెర, తిరుగుడు పువ్వులు, కుప్పెలు, గట్టి నూళ్ళు, సంది దండలు, పాశేలు, సరిపెణలు, తాలూకాలు, కాశీఉట్లు, మత్స్య బావిలీలు, కుతికంట్లు, అడ్డిగెలు, పట్టెడలు, కాసులపేర్లు, చంద్రహారాలు, ముత్తెపు పేరులు, వంకీలు, దండ కడియాలు, అంగుళీయకాలు, కడియాలు, అందెలు, పాంజేయిలు, మట్టెలు, పిల్లేళ్ళు, చల్లాలు, బొబ్బిలి కాయలు—ఇలా ఎన్నో పేర్లుగల ఆభరణాలు ఆనాటి తెలుగు నారి ధరిస్తూ ఉండేది కొన్నిటి పేర్లు తెలిసినా, ఆ ఆభరణ విశేషం ఎలా ఉంటుందో ఇప్పటి వారికి తెలియదు. అయినా, కొన్ని పేరు మార్పులతో, సవరింపులతో ఈ పురాతనమైన ఆభరణాలన్నీ మళ్ళీ ఇప్పుడు అమలులోకి వచ్చి ఆధునిక ఆభరణాలుగా రూపొందుతున్నాయి.

పారమార్థిక చింతన

తెలుగువారికి పారమార్థిక చింతన ఎక్కువ. ఎంత చిన్న ఊరయినా, ఆ ఊరికి ఒక రామాలయమో, ఒక హనుమదాలయమో, ఒక శివాలయమో, ఒక గ్రామదేవత గుడో ఉండి తీరుతుంది. రామయ్య తండ్రినీ, సీతమ్మ తల్లినీ మనవాళ్ళు అడుగడుగునా మననం చేసుకుంటారు. సీతమ్మ కష్టాలు తన కష్టాలుగా భావించి కంట నీరుపెడుతుంది తెలుగు ఇల్లాలు. చిలిపితనం చేసే చిన్నారి పసి వాడిలో బాలకృష్ణుని దర్శించి ఆనందంలో మునిగి తేలుతుంది తెలుగు తల్లి.

సంసారబంధపు నిత్య జీవన వేగంలో కూడ భగవద్భక్తిని మరిచిపోదు ఆమె పూజలు, ఉపవాసాలు, నోములు, వ్రతాలు—అంటూ—ఒక వైపున సంసార సాగరంలో ఈదుతూనే, మరొకవైపున పరమపద సోపాన మార్గం సుగమం చేసుకొనే ప్రయత్నం చేస్తూ ఉంటుంది సంవత్సరం పొడుగునా వచ్చే పండుగలు, ఎంతో దీక్షతో, ఉత్సాహంతో జరుపుతుంది.

తెలుగువారికి ప్రత్యేకమైన పండుగలు కొన్ని ఉన్నవి. ఒకొక్క పండుగకు ఒకొక్క రకమైన ప్రాముఖ్యత. కొన్ని పండుగలు పురాణ సంబంధమైనవి. మరికొన్ని ఋతుపరమైనవి.

ఉగాది చైత్ర శుద్ధ పాడ్యమినాడు తెలుగువారు ఎంతో ఉత్సాహంతో జరుపుకునే సంవత్సరాది పండుగ. షడ్రుచుల సొరుతో జీవితంలోని సుఖదుఃఖాలకు ప్రతీకగాఉండే ఉగాది పచ్చడి. పంచాంగ శ్రవణం—ఆనాటి ప్రత్యేకతలు. చైత్ర శుద్ధ నవమినాడు జరుపుకునే శ్రీరామ నవమి—తెలుగువారి ఇలవేలుపు శ్రీరామచంద్రుడు అవతరించిన దినం. ఊరూరా పందిళ్లు వేసి ఆనాడు సీతారాముల కల్యాణం వైభవంగా జరుపుతారు. శ్రావణ బహుళ అష్టమినాడు వచ్చే శ్రీకృష్ణ జన్మాష్టమి బాలగోపాలుడి పుట్టిన రోజుగా వేడుక చేసుకుంటారు. భాద్రపద శుద్ధ చతుర్థినాడు వచ్చే వినాయక చవితికి విఘ్ననాయకుడైన వినాయకుని పూజించి కుడుములు, ఉండ్రాళ్ళు, నైవేద్యం పెడతారు. దేవీ నవరాత్రులు, విజయదశమి—తెలుగువారి పెద్ద పండుగలలో ఒకటి, దసరా వేషాలు, శక్తి పూజ, శమీపూజ, ఆయుధ పూజ... ఆనాటి పూజా కార్యక్రమాలు-సరదాలు ఆశ్వయుజ బహుళ అమావాశ్యనాడు నరక సంహారానికి విజయ సూచకంగా జరుపుకునే దీపావళి పండుగ వస్తుంది. సంక్రాంతి తెలుగువారి పెద్ద పండుగ. కర్షకులకు ఆనందకరమైన ఈ పండుగ పెద్ద పండుగ. క్రొత్త అల్లుళ్ళ రాకతో తెలుగింట నవోత్సాహం వెల్లి విరుస్తుంది. చలిమంటలు, సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మ సరదాలు, హరిదాసు చిఱుతవాద్యాలు, గంగిరెద్దుల ఆటపాటలు, ఎడ్ల పందాలు, కోడి పందాలు—ఇటువంటి సరదాలు ఎన్నో! మాఘ బహుళ చతుర్దశినాడు వచ్చే మహాశివరాత్రినాడు పగలంతా పూజా పునస్కారాలతో, ఉపవాసాలతో ఉండి రాత్రికి జాగరణ చేస్తారు. శైవ క్షేత్రాలలో ఈ పర్వదినం వైభవంగా జరుపుతారు.

ఇది కాక స్త్రీలకు మాత్రమే ప్రత్యేకించిన అట్లతద్దె బ్రతుకమ్మ పండుగ, నాగుల చవితి వంటి పండుగలు ఎన్నో ఉన్నవి.

అట్ల తదియనాడు ఆడవాళ్ళు తెల్లవారగట్ల లేచి అభ్యంగన స్నానం చేసి గోరింటాకు పెట్టుకుని అట్లూ, పెసు గన్నమూ తిని, ఊరి బయట తోటలవద్దకు వెళ్ళి ఉయ్యాల లూగుతారు.

''అట్ల తద్దోయ్ - ఆరట్లోయ్
ముద్ద పప్పోయ్ - మూడట్లోయ్
పడకలమీదా - పిల్లల్లారా
లేచి రారండోయ్ !"

అనే జానపద గేయం ఈ పండుగకు సంబంధించినదే !

కార్తీక శుద్ధ చవితినాడు వచ్చే నాగుల చవితినీ, శ్రావణ శుద్ధ పంచమినాడు వచ్చే నాగపంచమినీ మనస్త్రీలు భక్తితో ఆచరిస్తారు. నాగపూజ చేసే ఆచారం మనకు అనాదిగా ఉన్నది.

"నాగుల చవితికి నాగేంద్ర నీకు
పొట్టనిండా పాలు పోసేము తండ్రి !"

అంటూ ప్రీతితో నాగేంద్రుడికి పాలు నైవేద్యం సమర్పిస్తారు.

స్త్రీలు - సుఖ సంతోషాలకోసం, సౌభాగ్యం కోసం, ఐదవతనం కోసం, కైవల్యం కోసం - ఆచరించే వ్రతాలు, నోములు - మంగళ గౌరీ వ్రతం, వరలక్ష్మీవ్రతం - వంటివి సుమారు రెండు వందలవరకు మనకు ఉండేవని అంటారు.

"చాలు ఐదవ తనము సంతాన బలము
చాలు ఐదవతనము కొమరులా బలము"

స్త్రీకి ముఖ్యమైన సౌభాగ్యం కోసం, సంతానంకోసం- ఈ నోములు నోచడాలూ, వ్రత నిష్ఠలూనూ.

మనవాళ్ళకు మగ సంతానమంటే మరీ మక్కువ. ఆడపిల్ల ఎప్పటి కయినా పరాయి యింటికి పోవలసిందే కదా-అనే ఉదాసీన భావం కనపడుతుంది. పిల్లలకి అయిదవ ఏడు రాగానే "ఓం నమశ్శివాయ" అనే షడక్షరీ మంత్రంతో విద్యారంభం చేస్తారు. పంతులుగారికి పంచెల చాపులూ ముడుపులూ అందేవి. ఆ పంతులు గారు చదువు దిట్టంగానే చెప్పేవారు కాని, తాను మధ్యాహ్నం వేళ పగటి నిద్రకు ఒరిగే వేళలో అల్లరి చేస్తే మాత్రం పిల్లల్ని కొట్టి కోదండం తీయించే వారు. గోడ కుర్చీలు వేయించే వారు. పేము బెత్తాలు పసివాళ్ళ అరచేతుల మీద విరిచేవారు. అయితే, దసరా రోజులు వస్తే మాత్రం పిల్లలు పంతులుగారిమీద తమకు గల గౌరవాభిమానాలు తెలుపుతూ,

"అయ్యవారికి చాలు అయిదు వరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పు బెల్లాలు"

అంటూ ఇల్లిల్లూ తిరిగి అయ్యవారికి విత్తం సంపాదించి పెట్టేవారు.

కాని, ఇప్పుడు విద్యా విధానం చాలా వరకు మారి పోయింది. వీధి బడుల స్థానంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు వెలిశాయి. ఆడ, మగ భేదం లేకుండా పిల్లలు పాఠశాలలకు వెళ్ళి విద్యాభ్యాసం చేస్తున్నారు.

మనకు జాతీయములైన ఆట పాటలు ఉన్నవి. పాటలు పాడుతూ ఆటలాడు కోవటం మనకు ప్రత్యేకమైన పద్ధతి. ఈ పాటలు ఎంతో అర్థస్ఫూర్తితో నిండి పిల్లలకు మాటల పొందికను ప్రపంచ జ్ఞానాన్ని అందించేలిగా ఉంటాయి. బొమ్మల పెళ్ళిళ్లు, వామన గుంటలు, గవ్వలు, అచ్చనగాయలు, వెన్నెల కుప్పలు, వంటివి ఆడపిల్లలు ఆడుకునేవి కోతి కొమ్మంచి, చెడుగుడు, పులిజూదం, చదరంగం, బొంగరాలాట-వంటివి మొగపిల్లలు ఆడుకునే ఆటలు. బాల చంద్రుడు ఆడిన బొంగరాలాట మనం ఎరిగినదే. మన ప్రాచీన సాహిత్యంలో వర్ణించిన మరెన్నో క్రీడా విశేషాల పేర్లు గాని, అవి ఆడే పద్ధతులు కాని, ఇప్పటి వారికి తెలియవు. వాటి స్థానంలో క్రికెట్, బాడ్మింటన్, టెన్నిస్-వంటి ఆటలు మనమధ్యకు వచ్చి శాశ్వతంగా నిలిచి పోయినవి.

పెద్దల కోసం ఏర్పాటు చేసుకునే వినోదాలు, ఉత్సవాలు తెలుగు నాట పురాతన కాలం నుంచీ ఉన్నవి పండుగ సమయాలలోనూ ఇతర విరామ సమయాలలోనూ - మనస్సుకూ,



జాతి జీవనంలో అనుస్యూతంగా వచ్చి నిలిచిపోయిన నానుడులు మన నుడికారానికి ఎనలేని సంపదలు

శరీరానికి ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని ఇచ్చే అనేక కళారూపాలు మనకు ఉన్నవి. తోలుబొమ్మలాటలు, బుట్ట బొమ్మలు పగటి వేషాలు, బుర్ర కథలు, యక్షగానాలు, వీధినాటకాలు, కూచిపూడి నృత్యం, జముకుల కథలు, జంగం కథలు, గొల్ల సుద్దులు, దొమ్మరాటలు-ఇటువంటి వినోద కార్యక్రమాలు ఎన్నో. సినిమాల ప్రభావం జనసామాన్యం పైన గాఢ ముద్ర వేసుకొన్న తర్వాత-మన ఈ ప్రాచీన కళా వైభవం ఇంచుమించు అంతరించిపోతూవుంది. ఈ జానపద కళా సంపదను ఇలాగే అంతరించి పోనీకుండా పునరుద్ధరింప వలసిన బాధ్యత కళాప్రియులైన తెలుగు వారందరి మీదా, ప్రభుత్వం మీదా ఉన్నది.

శిల్పం, చిత్ర లేఖనం వంటి లలిత కళలలో తెలుగు వారిది అందెవేసిన చేయి. అమరావతి, నాగార్జునకొండ, లేపాక్షి-వంటి ప్రాచీన కళా ఖండాలు ఇందుకు నిదర్శనాలు

కలంకారీ అద్దకాల వంటి కళా పరిపూర్ణమైన చేతి పరిశ్రమలు మనకు వున్నాయి. వెనుకటి కాలంలో ఇటువంటి చేతి పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు-జాతి జీవనంలో ఇమిడిపోయి వుండేవి. ఇంటింటా రాట్నం ఆడుతూ ఉండేది. శ్రీనాథుడు తన పర్యటనలోని విశేషాలను వర్ణిస్తూ పల్నాటిలోని స్త్రీలను గురించి-అచట "రంభయైన యేకులె వడుకున్" అని వర్ణిస్తాడు.

"కవ్వమాడని ఇల్లు కదురు తిప్పని కొంప
మగ్గము లేనూరు మరి కానరాదు"

కదురాడిన కవ్వమాడిన ఇంటికి దరిద్రం ఉండదని నానుడి.

నానుడులు

జాతి జీవనంలో అనుస్యూతంగా ప్రవహించి వచ్చి నిలిచిపోయిన నానుడులు మన నుడి కారానికి ఎనలేని సంపదలు, మన సంప్రదాయాన్ని జీవన సరళినీ, మన బ్రతుకు బాటనీ-విమర్శించేవీ, పరామర్శించేవీ, ఎకసక్కెమాడేవీ, హాస్యమాడేవీ, వ్యంగ్యంపు విసుర్లు విసిరేవీ-ఎన్నో సామెతలు మనకు ఉన్నవి. ఇది ఒకప్పుడు మన సాహిత్యంలోనూ, సంభాషణల్లోనూ కలమెలగా కలిసిపోయినవే అయినా, ఇప్పుడు మన వాడుకలో చాలవరకు తగ్గిపోయినవనే చెప్పాలి. ఒక్క చెణుకుతో కొండంత హాస్యం కురిపించాలన్నా, ఒక్క మాటతో వీపుమీద కొరడాదెబ్బ వేసినంత చురుకు తగిలించాలన్నా, ఒక్క విసురుతో వ్యంగ్యార్థపు బాణం విసరాలన్నా-ఒక్క తెలుగు సామెత వాడితే చాలును. ఈ సామెతల సంపదను కూడా మనం పరిరక్షించుకోవలసి ఉంది.

కళాపోషణ

ప్రాచీన కాలం నుంచీ తెలుగు దేశాన్ని ఏలిన రాజులలో-కళా పోషకులు. సంగీత సాహిత్య రసగ్రహణ చక్రవర్తులు. విద్వత్ప్రభువులు-ఎందరో వున్నారు ఆ మహారాజుల ఆస్థానాలలో ఆయా రంగాలలో ఉద్ధతులైన కవులు, గాయకులు, చతుష్షష్టి కళలలో పేరెన్నిక గన్నవారు-ప్రాపు పొంది కళా సేవ చేసేవారు

నన్నయ మొదలుకొని నవయుగ వైతాళికుల వరకు మహితాత్ములైన కవీశ్వరులు ఎందరో తెలుగు సరస్వతిని అలంకరించి తరించారు. ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు, నాదోపాసకులు, ఎందరో మహానుభావులు తెలుగుగడ్డపైన వెలిసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు.

బహుళార్థ సాధకం అయినది గృహస్థాశ్రమం అంటారు కదా! తెలుగు గృహస్థుకు అతిథి సత్కారం ముఖ్యవిధిగా భావింపబడుతుంది. వెనుకటి రోజుల్లో అతిథి ఇంటికి వస్తే, పాద ప్రక్షాళన కోసం చెంబుతో నీళ్లు అందించటంతో ఈ సత్కారము ప్రారంభమయేది. అన్నపూర్ణల వంటి ఇల్లాళ్ళు-వేళ కాని వేళలలో అతిథులు వచ్చినా, విసుక్కోకుండా పంచభక్ష్య పరమాన్నాలతో వంటకాలు చేసి వడ్డిస్తూ ఉండేవారు. కాలమాన పరిస్థితుల ప్రభావమో మనుష్యుల గుణగణాలలో వచ్చిన మార్పు ఫలితమో కాని, ఈ యాంత్రిక యుగంలో ఆ వెనుకటి ఆత్మీయతలు, బంధుప్రేమలు, అతిథి అభ్యాగతుల మన్ననలు-మన ఇళ్లలో ఇప్పుడు కరవైనవి.

మనుష్యుల మనసుల్లో, మమతల్లో, మనుగడలో, మార్పు వచ్చినట్లే, మన వేషభాషల్లోను, తినే ఆహారంలోను-వెనుకటికీ ఇప్పటికీ చాలా మార్పు వచ్చిందని చెప్పక తప్పదు.

పంచెకట్టు

తెలుగు వారి పంచెకట్టు విలక్షణమైనది. మగవాడు పై పంచె (కండువా, ఉత్తరీయం-అనేవి పర్యాయపదాలు) లేకుండా గడపదాటటం సంప్రదాయానికి విరుద్ధమైన పని. వెనక ప్రధానంగా చెంగావిరంగు వేసిన పంచెలు కట్టుకునేవాళ్లు మనవాళ్లు. కర్షక కార్మిక వర్గాలలో తప్ప ఇప్పుడు తెలుగు జనం పాంటు, స్లాక్ షర్టు-వేసుకోవటానికి అలవాటుపడ్డారు. ఉత్తరీయాలు వేసుకోవటం తగ్గిపోయింది.

మనం తినే ఆహారం మాటకు వస్తే-ఆహారధాన్యాలలో, కూరగాయలలో, అవి వండుకునే విధానాలలో, వాటిని భుజించే పద్ధతిలో అన్నిటా ఈ మార్పు కనిపిస్తూనేఉంటుంది.

యంత్రాలు రాకముందు మనవాళ్ళు దంపుడు బియ్యం వండుకు తినేవాళ్ళు. ఇంటి ఇల్లాళ్ళు సామూహికంగా చేరి పాటలు పాడుకుంటూ సరససల్లాపాలు ఆడుకుంటూ తీరిక వేళల్లో ధాన్యం దంచుకునేవాళ్లు. ఆ దంపుడు బియ్యపు చేవ ఈనాడు మరపట్టి వెల్లవేసిన తెల్లన్నంలో ఉండదు. అందు వల్లనే, ఈ తరం జనంలో ఆ వెనుకటి దారుఢ్యం, జీవశక్తి లోపిస్తూఉంది

"సువ్వని నేనొక్క పోశేసితేను
చుక్కలు పిక్కటిల్లు సూరన్న కదులు
అస్సని నేనొక్క పోశేసితేను
ఆకసమ్ము కదులు ఆరాజు కదులు"

అంటూ రోకటిపోటు వేయగలిగిన ఆ శరీర దారుఢ్యత ఇప్పుడేదీ !

ఈ కాలపు తీరు ఇలా ఉంది —
"రోకలెత్తాలేను రోలెత్తలేను
చామంతి కడియాల చేయెత్తలేను
దంపు దంచాలేను దండెత్తలేను
దంచినా బియ్యమూ వండనూలేను"

యంత్రాలు మన మధ్యకు వచ్చి, మనకు సుఖభోగాలు అలవాటు చేసి, మనలను సుకుమారులనుగా తయారుచేశాయనటానికి నిదర్శనం ఇదే !

విందు భోజనం

రుచికరమూ పుష్టికరమూ అయిన ఆహారం తెలుగువారి వంటకాలలో కానవస్తుంది. రకరకాల శాక పాకాలు, అప్పుడు కాచిన నేతులు, ముద్దపప్పు. ఊరగాయలు, రెండు మూడు రకాల పులుసుకూరలు, పప్పు దప్పళాలు, అప్పడాలు, వడియాలు, తీయని గడ్డ పెరుగులు- మన ప్రధానమైన వంటకాలు.

మన పూర్వులు ఎటువంటి భోజనం ఆరగించేవారో—కవి సార్వభౌముడూ భోజనప్రియుడూ అయిన శ్రీనాధుని అనేక పద్యాలలో, చాటువులలో- మనం తెలుసుకోవచ్చును. అన్ని జాతులవారి ఆహారపుటలవాటులను గూర్చి ఎంతో నిశిత పరిశీలనతో కూడిన వర్ణనలు ఆముక్తమాల్యదలో రాయలవారు కూడా మనకు అందిస్తారు.

"ద్రాక్షా పానక ఖండశర్కరలతో
రంభాఫలశ్రేణితో
గోక్షీరంబులతోడ మండెగలతో
క్రొన్నేతితో పప్పుతో
నక్షయ్యంబగు నేరుబ్రాల కలమా
హారంబు నిశ్శంకతన్
కుక్షుల్ నిండగ నారగించితిమి. యు
క్షుద్రక్షుధాశాంతికిన్"

అంటాడు శ్రీనాధుడు.

అరిసెలు, బూరెలు, చక్కిలాలు, పులిబొంగరాలు, చక్రపొంగలి, దద్ధ్యోజనం, పూర్ణాలు, గారెలు, బొబ్బట్లు, సున్నిఉండలు, పులిహోర, కుడుములు, లడ్లు- వంటివి కొన్ని అచ్చమైన తెలుగు పిండివంటలు.

కాలానుగుణంగా ఈ మన భక్ష్యభోజ్యాలలో కొన్ని మార్పులు వచ్చి చేరాయి. పైన వ్రాసిన కొన్ని అచ్చమైన తెలుగు పిండివంటలు మనకు ఇప్పుడు ఏ హోటల్‌లోనూ లభించవు. ఇతర ప్రాంతాలవారి వంటకాలు, పాశ్చాత్య పాకశాస్త్ర విధానాలు- ఇప్పటి మన వంటకాలలో వచ్చి చేరి, క్రొత్త చవులతో, క్రొత్త పేర్లతో, చెలామణి అవుతున్నవి అయితే ఒక్క విషయం. ఎన్ని క్రొత్త పోకడలు పోయినా ఎన్ని క్రొత్త రుచులు మరిగినా తెలుగువాడు తన తెలుగుతనం మరచిపోడు. ఆవకాయ మీదా. గోంగూర మీదా మోజు మరిచిపోడు.

అమెరికాకు వెళ్ళినా, ఆఫ్రికాకు వెళ్ళినా, ఆకాశ మండలానికి వెళ్లినా, తెలుగువాడు తనదైన జాతిగర్వాన్ని, దేశాభిమానాన్ని మరిచిపోలేడు

"కొండవీడు మనదేరా
కొండపల్లి మనదేరా
కాదని వాదుకు వస్తే
కటకం దాకా మనదేరా !"

కృష్ణదేవరాయలవారి కాలంలో చాకలివాడు బట్టలు ఉతుకుతూ ఇలా వీరావేశంతో పాడుకున్నాడట.

నవయుగ వైతాళికుడు తన జాత్యభిమానాన్ని ఎంత దివ్యమైన అనుభూతితో చెప్పుకుంటాడో చూడండి :

"ఇమ్మగఁ గాకుళమ్ము మొదలీవరకుంగల
యాంధ్ర పూర్వ రాజ్యమ్ముల పేరు చెప్పిన
హృదంతరమేలా చలించిపోవు
నార్ద్రమ్మగు చిత్తవృత్తుల పురాభవనిర్ణయమేని
ఎన్ని జన్మమ్ములుగాగ నీ తనువునన్
బ్రవహించునో యాంధ్ర రక్తముల్"

—విశ్వనాథ సత్యనారాయణ

ఇది వట్టి దురభిమానం కాదు. మహోజ్జ్వలమైన గత చరిత్రకు పొంగిపోయి చేతులు దులుపుకు కూర్చోవటమూ కాదు. ఆంధ్రులది ఆరంభశూరత్వమనే అపప్రథ ఉన్నది. అది వట్టి అపప్రథ మాత్రమేనని నిరూపించుకుంటున్న ఆంధ్ర ప్రజ— ఇప్పుడు అన్ని రంగాలలోను ముందంజవేసి దేశ ప్రగతికి దోహదం చేస్తూ ఉన్నది.

ఆధునిక ఆంధ్రసాహిత్యంమీద రవీంద్రుని ప్రభావం



డాక్టర్ అమరేంద్ర

భారత దేశానికి మణికిరీటమై శోభించే హిమాలయంలాగా, భారత భూమిని సస్యశ్యామలం చేస్తున్న మహాజీవనదులలాగా రవీంద్రుని సాహిత్యం జాతి జనులందరికీ అనుభవయోగ్యమైన గర్వకారణమైన అక్షయమైన అక్షర సంపద.

నోబెల్ బహుమానం 1913 లో లభించేవరకూ రవీంద్ర కవీంద్రుని ప్రతిభ వంగభూమికే పరిమితమై వుండిపోయింది. భారతీయ భాషలలో, ఇంగ్లీషులో ఆయన రచనలు పరివర్తన పొంది సాహిత్య రంగంలో అపూర్వ భావసంచలనం కలిగించటం ఆ తరవాతనే జరిగింది. వంగదేశంలో కూడా అంతకుపూర్వం రవీంద్ర ప్రతిభను గుర్తించి గౌరవించలేని సంకుచిత భావన పండితులుండేవారు. విశ్వవిద్యాలయ పరీక్షాపత్రాలలో రవీంద్రుని పద్యపాదాలను తప్పులు దిద్దమని ఇచ్చేవారట విద్యార్థులకు! కాని మన ఆంధ్రదేశంలో రవీంద్రుని ప్రతిభను నోబెల్ బహుమాన ప్రకటనకు పూర్వమే గుర్తించిన సహృదయులున్నారు. అసలు వంగీయులకూ ఆంధ్రులకూ మనస్తత్వాలలో చాలా పోలికలున్నాయి ఇద్దరూ ఆదర్శప్రియులు, ఆవేశపరులు. అందువల్లనే వంగ సాహిత్యంలో బయలుదేరిన ఉద్యమాలకూ ప్రక్రియలకూ ఆంధ్ర దేశం పులకించి ప్రతిధ్వనులు పలికించింది.


ముట్నూరి కృష్ణారావు

ఈ శతాబ్దారంభంలో కర్జను ప్రభువు వంగభూమిని రెండుగా ఖండించాలని పూనుకుంటే దానికి నిరసనగా దేశవ్యాపితంగా ప్రతిఘటనోద్యమం చెలరేగింది. ఆ తరుణంలో వంగదేశంలో సంచరించి వచ్చిన శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు రవీంద్ర సాహిత్య మాధుర్యాన్ని ఆస్వాదించి ఆంధ్ర దేశానికి తిరిగి వచ్చారు. కృష్ణాపత్రికలో రవీంద్ర ప్రతిభను వివరించే వ్యాసాలూ, కవీంద్రుని రచనల అనువాదాలూ ప్రచురించి తొలిసారిగా చవిచూపించారు. ప్రాచీన భారత దేశ విభవాలను, కాళిదాస కవినాటి రసజ్ఞతనూ చిత్రిస్తూ రవీంద్రుడు రచించిన సారస్వత వ్యాసాలను ప్రౌఢమైన గద్యకావ్య శైలిలో అనువదించారు. రవీంద్రునికి అంతర్జాతీయ విఖ్యాతి రాకమునుపే అపార మేధా సంపన్నులు కృష్ణారావు గారు తమ కార్యాలయ ప్రాంగణంలో జరిగే మిత్రుల దర్బారులో కవీంద్రుని భావ సంపదనుగురించి ముచ్చటించేవారట, బందరులో.

వంగభాషలలో వెలువడిన నవలలు భారత దేశమంతటా నవోన్మేషం కలిగించాయి. అనువాదాల ద్వారా ప్రేరణపొంది కొందరు స్వతంత్ర నవలా రచనకు అంకురార్పణ చేశారు. పురుషులతో పాటు వనితలనుకూడా అలరించే సరస సాహితీ కుసుమ వికాసం రవీంద్రుని గోరా, నౌకాభంగంవంటి అద్భుతమైన నవలలను ఆంధ్రీకరించటంతో ప్రారంభమయింది. ఆంధ్ర ప్రచారిణీ సంస్థ ద్వారా సరళమైన అనువాదాలు అందించి వేంకట పార్వతీశ్వర కవులు అసంఖ్యాక పాఠక మానస సరోవరాలలో మధురంగా విహరించిన కవిరాజ హంసలైనారు. శతజయంతి సంవత్సరంలో వినోదిని, కుముదిని, అక్కా-చెల్లెళ్లు, తోటమాలి వంటి నవలికలు కూడా తెలుగులోకి వచ్చాయి. నిశితమైన మనస్తత్వ పరిశీలనలో, కథా నిర్మాణంలో పాత్ర పోషణలో రవీంద్రుని అసాధారణ కౌశలానికి నిదర్శనాలైన ఎన్నో రచనలు పలువురు అనువదించారు.

రవీంద్రుని నాటకాలూ, రూపకాలూ చాలా భాగం తెలుగులోకి వచ్చాయి. ఛాందస హిందూ సమాజాన్ని గురించి అధిక్షేపిస్తూ రవీంద్రుడు రచించినటువంటి 'అచలాయతనం' అనే ప్రహసనాన్ని వేలూరి చంద్రశేఖరం గారు చాలా కాలం కిందట తెనిగించారు. రవీంద్రుని సంస్కరణాభిలాషకు నిలువుటద్దం ఈ నాటకం.

రవీంద్రుని నాటికలలో అత్యంత మనోహర రచన చిత్రాంగద. ఎందరో అనువాదం చేసినప్పటికీ ఇంకెందరినో ఆకర్షించగల రమణీయ శిల్పం వున్నది. మహా భారతంలో వున్న చిన్న సంఘటన తీసుకుని భావనా సౌందర్యంతో ఉజ్వల కళాఖండంగా రూపొందించారు. సంప్రదాయ సిద్ధంగా చేసే అంగాంగ వర్ణనల అశ్లీలత లేకుండా ఉత్తమ శృంగార రసానందం చిందించే ఈ నాటికను తెనిగించని రవీంద్ర సాహిత్యాభిమాని లేడని చెప్పవచ్చు. నవనీత కోమల శైలీ విలాసంతో ముక్తచ్ఛందస్సులో నడిచిన ఈ సుకుమార నాటికను డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు వంగ మాతృకకు చేరువగా వుండే వచనంలోనూ, మల్లవరపు విశ్వేశ్వరరావు గారు యతి నియమంలేని తేటగీతిలోనూ మనకు అందించారు. 'విసర్జన' నాటకం ఆధారం చేసుకుని కళా ప్రపూర్ణ కొండవీటి వేంకటకవిగారు 'రాజర్షి' అనే ప్రౌఢ కావ్యం రచించి రవీంద్రుని మానవతా దృష్టికి నీరాజనం సమర్పించారు.



కథక చక్రవర్తి

రవీంద్రుడు కథక చక్రవర్తి. విశ్వసాహిత్యంలో ఆయనకు దీటురాగల వారిని వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. ఒకసారి చదివితే హృదయాల మీద చెరిగిపోని ముద్రలుగా కలకాలం నిలిచే కాబూలీవాలా, పోస్టు మాస్టరు, శలవులు, సుభా, వంటి కథలను చాలా యేళ్ల కిందట కథాగుచ్ఛములనే మకుటంతో విశ్వ భారతీ గ్రంథమాల వారు తెలుగులో ప్రచురించారు. కావ్యాలలో స్వప్నలోక విహారిగా తోచే కవీంద్రుడు కథలలో వాస్తవ లోకానికి దిగివచ్చే సామాన్య మానవుల సుఖదుఃఖాలను సానుభూతితో దర్శించి ప్రదర్శించే శిల్పవేత్తగా ఆశ్చర్యం కలిగిస్తాడు. అలతి అలతి పలుకులతో చిన్న చిన్న వాక్యాలతో సాగే ప్రతి కథానికా ఒక రసభరిత కావ్యం. వాచక పుస్తకాలకు పనికివచ్చే పొడిపొడి మాటలతో కాకుండా రసానుగుణంగా చేవతో జీవంతో తొణికిసలాడే భాషలో రవీంద్రుని కథలు తెలుగులోకి రాలేదు. శరత్ బాబుకు చక్రపాణి వంటి సిద్ధహస్తుడు అనువాదకుడు కావటం గొప్ప అదృష్టం. అటువంటి అదృష్టం రవీంద్రుని నవలలకూ కథలకూ ఇంతవరకూ కలగకపోవటం శోచనీయం.

రవీంద్రుడు చేసిన ఆధ్యాత్మిక ధార్మిక ప్రసంగాలను "శాంతినికేతనం" అనే మకుటంతో ఆకురాతి చలమయ్య గారు అనువదించారు. హిందూ బౌద్ధ క్రైస్తవ మహమ్మదీయ ధర్మాల సారాన్ని గ్రహించి సమగ్ర మానవధర్మాన్ని రూపొందించిన విశిష్ట ప్రవచనాలను ఉన్నత భావాలకు అనుగుణమైన ఉదాత్తమైన వచనంలో అనువాదం నడిచింది.

గీతాల్లో పుష్పవృష్టి

విశ్వకవిగా రవీంద్రుడు ఆంధ్ర సాహిత్యం పైన గాఢమైన ప్రభావను ప్రసరించాడు. ఆంగ్ల కవి షెల్లీ మాదిరిగా తన భావాలను మధుర గీతాలలో రవీంద్రుడు పుష్పవృష్టి కురిపించాడు. బుద్ధికి పూర్తిగా అర్థంకాకపోయినప్పటికీ అనిర్వచనీయ మాధుర్యంతో హృదయాలను అలరించే లలిత కోమల రచనా శిల్పంతో రవీంద్రుని కావ్యాలు భాసిస్తాయి. ఈ శిల్పం ఇరవయ్యోశతాబ్దంలో బయలుదేరిన భావకవిత్వ మహోద్యమానికి నాయకత్వం వహించిన సత్కవులను బాగా ఆకర్షించింది. కొందరు ప్రత్యక్షంగా శిష్యులైతే మరికొందరు రవీంద్రుని కవితా మార్గాన పయనించిన అనుచరులైనారు. పాఠకునికి రెక్కలు ఇచ్చి రససామ్రాజ్యపు స్వర్ణ ద్వారం తెరిచి నీశక్తి కొద్ది విహరించు అని సూచించే రచనా విన్యాసానికి భారతీయ సాహిత్యంలో రవీంద్రునిదే అగ్రపీఠం. ఈ రచనా విలాసాన్ని రవీంద్ర కవితా భాండారం నుంచి మన కవివర్యులు దేవులపల్లి, రాయప్రోలు, అబ్బూరి, మల్లవరపు ప్రభృతులు గ్రహించారు. సూటిగానూ, పటవాలుగానూ అనుసరణలుగానూ అనువాదాలుగానూ ఈ ప్రభావం ప్రసరించి ఆంధ్ర భావ కవిత్వానికి వింత అందాలు సంతరించింది.

గీతాంజలి

''కథావాహిని'' అనే కథా సంపుటాన్ని వేలూరి శివ రామశాస్త్రిగారూ గీతాంజలిని ఆదిపూడి సోమనాథరావుగారూ, ప్రౌఢ కావ్యశైలిలో అనువదించారు. ఎందరో సుప్రసిద్ధులూ అప్రసిద్ధులూ గీతాంజలిని తెనిగించారు. గుడిపాటి వెంకట చలం గారూ, ఆచంట జానకిరాం గారూ చేసిన అనువాదాలు కవీంద్రుని హృదయానికి చేరువగా వున్నాయి. సులువైన మాటలలో విలువైన భావాలు పలికించి సంగీత సాహిత్యాలకు సంగమక్షేత్రమైన హృదయంగమ కావ్యం కాబట్టి గీతాంజలి సొగసు ఏ అనువాదంలోనూ పూర్తిగా ఒదగదనిపిస్తుంది.

భావగాంభీర్యానికి అనుగుణమైన శబ్దమాధుర్యం రవీంద్ర కృతులలో ధ్వనిస్తుంది. ఆంగ్లానువాదం పొడిపొడి ముక్కలలో తాత్పర్యం చెప్పినట్లుగా వుంటూ వంగ షతో పరిచయమున్న వారికి అసంతృప్తి కలిగిస్తుంది. అందుకే విశ్వకవి శిష్యాగ్రణి గోపాలరెడ్డిగారు రవీంద్రుని రచనలను సూటిగా వంగభాష నుంచి తెనిగించే ప్రయత్నాన్ని దశాబ్దాల తరబడిగా ఒక ఉద్యమ దీక్షతో నిర్వహిస్తున్నారు. ఊర్వశి, శివాజి, కాళిదాసు, లిపిక వంటి ఉత్తమ కావ్య ఖండాలను మూలానికి చేరువగా వుండే విధంగా అనువదించారు. ''సుందర హృదిరంజన తుమి నందన ఫూలాహార్, తమి అనంతనవవసంత సంతరే ఆమార్'' వంటి పంక్తులు చదువుతుంటే ఆంధ్రులకు నన్నయ్య ప్రసన్నకోమల మధుర సంస్కృతశైలి గుర్తుకొస్తుంది. శబ్దాలమీద రవీంద్రుని కున్న అధికారం, ఛందస్సుల నడకల్లో చమత్కారాలూ ఆంగ్లానువాదంలో అందవు. అందుకే రెడ్డిగారు వంగభాష నుంచి సూటిగా అనువదించి గురుదక్షిణలు సమర్పించు కుంటున్నారు.

తెలుగులో రవీంద్రుని ప్రతిధ్వని

అనువాదాలనుబట్టి ప్రభావం కొంతవరకే తెలుసుకోగలం. అసలు ప్రభావం స్వతంత్ర రచనలకు ఉద్దీపనం కలిగించటంలో కనబడుతుంది. రవీంద్రుని భావాల రంగుల ఛాయలు తెలుగు కవుల స్వతంత్ర రచనల్లో అక్కడక్కడా తొంగిచూస్తున్నాయి. గీతాంజలిలో ఒక ఖండికలోని భావం వేదుల రాసిన "కోసికొనుమ ఈ కోమలకుసుమము కోరివిరిసె నీకోసమె స్వామీ!'' అన్న గేయంలో వచ్చింది. "సముఖే శాంతి పారావార్, భాసావో తరణి హేకర్ణధార్'' అన్న గేయం దేవులపల్లి వారి ''పడవ నడుపుము కర్ణధారీ, కడిమి విడువక కడలి మీరి!'' అనే పాటలో ప్రతిధ్వనించింది రవీంద్రుని జీవితదర్శనం దేవులపల్లి వారి పాటలో ''సాటేది లేని సంసారము, స్వర్గము జగమంతా శాంత బృందావనము, లోచేదిమనకు లోకాలస్వామి, లోలోన కట్టె మందిరము'' అన్నప్పుడు చక్కగా స్ఫురిస్తున్నది. ''ఒక్కడవే ఒక్కడవే'' అన్న గేయంలో రజని "ఏక్‌లా చలోరే'' అనే పాటలోని భావాన్ని సొగసుగా పలికించారు. ఎవరూ తోడు రాకపోయినా నీ ఆదర్శాల మీద విశ్వాసంతో నిర్భయంగా నిశ్చయంతో సాగిపో అనే రవీంద్రుని ప్రబోధాన్ని పండిత కవి తుమ్మల తమ మహాత్మకథ లో నౌఖాలీ ఘట్టరిలో వినిపించారు.

రవీంద్రుని కవితా శిల్పానికి ఆత్మ అనదగిన లలిత కోమల మృదుపదవిన్యాసం ''జయమదీయ మధురగేయ లాక్షారుణపద యుగళా!''

"మారుతచాలిత నీరద రథసంచారి విద్యున్నారి! హారిత్రిభంగీ ధీర విషాదాకారి! వ్యోమవిహారి!" అని ఆంధ్ర కవులు పలికినప్పుడు శబ్దాలను రసాబ్దాలుగా మలచిన తీరులో కనబడుతున్నది.

మన రచయిత్రుల్లో ప్రతిభాశాలిని లత తన ఊహా గానాలలో పలుతావులలో రవీంద్రుని భావనాగరిమను ప్రశంసిస్తూ వ్యాఖ్యానిస్తూ విశ్వకవికి నివాళులెత్తి రసజ్ఞత చాటుకున్నారు.

పసిపాపల గుండెల్లో దూసుకుపోయే భావాలను పసివాడని అందచందాలతో పాటలుగా కరిగించి "శిశు'' అనే కృతిలో రవీంద్రుడు బాలసాహిత్యానికి మేలుబంతి దిద్దాడు. ఈ అపూర్వ రచనను కవిరావు "నెలవంక'' అనే మకుటంతో తెలుగు బాలలకు అందించారు. రవీంద్ర సాహిత్యం అపార సాగరం. సకల మానవ మానసముల సామ్రాజ్యమ్ము నలుప జాలిన ఆయన సత్య సుందరవాణి విశ్వమోహిని. "తపోవనీ తరుచ్ఛాయ తారాడే హరిణి, ఉపనిషన్మధువు గ్రోలి ఝుంకరించు అళిని, విభుని కొరకు పవలురేలు పలవించే విరహిణి'' రవీంద్ర రసమయవాణి. అపార వైవిధ్యంతో అలరారే కవీంద్రుని సాహిత్య ప్రభావం అనువాదాల ద్వారా స్వతంత్ర రచనల ద్వారా యిప్పటిలాగే యికముందు కూడా ప్రసరించగలదని ఆశిస్తున్నాను. "ప్రతి యింట నిలిచి ప్రతిగుండె పిలిచి'' ఆనందసౌందర్యామృతాలను అందరికీ అందించే విశ్వకవి కృతులు మంటికీ మింటికీ, నిన్నటికీ రేపటికీ, తూర్పుకూ పడమరకూ నడుమ మెరిసే బంగరు వంతెన. దానిమీద పయనించి జాతుల ఇరుకు గోడలతో ముక్కలుకాని అఖండ లోకానికి, స్వాతంత్ర్య స్వర్గధామానికి, ఆనంద బృందావనానికి, సౌందర్య శబలిత స్వప్న సీమలకు ఆంధ్ర హృదయం సాగిపోవాలని నా ఆకాంక్ష.

నవాంబరగీతి

శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

జిలుగు పైఁడి బుటాపని తళుకు మెఱయ
శబల శబల ద్యుతిచ్ఛటాంచలము లొలయ
నెఱి సునాసీర చాప విస్ఫురణ వెలయ
నామె యెవరు ? శుచిస్మిత యగుఁగ నేఁర
చెలువుగాఁ దీర్చుకొన్న కొచ్చెళుఁ పట్టు
చీర జీరాడఁ జరణ మంజీర రవత
రంగ పాళిఁ దోఁగాడు పారాణి జాడ
లడుగడుగునందు భాగ్యరేఖాంకనముల
నిడుచు నలనల్ల నడయాడు నెచటి కెచటి!
కోహో! జనయిత్రి చరణయాత్రోత్సవమ్ము!

తెలుఁగు నేల నాలుగు చెఱఁగులును పొంగ
పల్లె పల్లెకు మఱి వాడ వాడ కరిగి
పేరు పేరున బిడ్డల పెంపు సొంపు
లడిగి, పేదల సాదుల యిడుమ లెఱిఁగి
యశన వాసో నివాస దైన్యము నడంప
నభయ హస్తము నెత్తిన యాంధ్ర జనని
తానుగాఁ గాలినడకఁ బ్రస్థానకేళి
కామతించెనో! ప్రసవిత్రి కనుఁగులైన
మగలు మగువలు యువతులు మాణవకులు
జయ జయ ధ్వాన ముఖరితా శాంత వీథు
లదె యదె! నవాంబర ప్రథమానుగీతి

కార్తిక జ్యోత్స్నికా పళక్ష ప్రకాశ
మామె నెమ్మేన; భోగ పట్టాభిషిక్త
మామె శీర్షస్థలమ్ము; శ్రీరామ రక్షె
యామె నయనాంత వీక్ష; సుధాన్నపూర్ణ
మామె పాణి సరోజని; యా సవిత్రి
పాదయాత్ర శ్రీశైల పర్వతము మెట్టె;
చుట్టెఁ గాళేశ్వరమ్ము; చేపట్టె దక్ష
వాటి; నట నట దేవతాఘాట వీధిఁ
బూర్ణ కుంభ పురస్సర పూజ లందె,
నిరువదేండ్ల పురామధు స్మృతి ధురా ప్ర
హర్ష సంజాత రోమహర్షాంకురములు
తల్లి తనువల్లిఁ బొంగె; సంతతి తెలుంగు
లొక్కఁడై యెక్కడెక్కడ నున్నవారు
కొసరి పాడిరి బాసలోఁ గోటి కోటి
కంఠవాటీ నవాంబరోత్కంఠ గీతి.

మన రాష్ట్రం చేతిపనులకు చాలా ప్రసిద్ధి. చేతి పనులలో అందం ఛందం కూడా వున్నాయి. వాటిస్పర్శవల్లనే హృదయం ఉప్పొంగుతుంది. మనస్సు వికసిస్తుంది. ఏ ఇంట్లో అయినా చేతి వస్తువులు ఉన్ననాడే, యింటికి హంగూ, చూడవచ్చిన వారికి ఆనందం ! మన చేతిపనులు, గ్రామీణ జీవితంలోనూ, భారతసంస్కృతి లోనూ ఒక భాగం. ఇవి మనం దాచి పెట్టుకొన్న ఆస్తి. వీటిని పోషించి, మన నాగరికత, సంస్కృతులను, ఇతరులకు చెప్పవలసిన బాధ్యత మన మీద వుంది.

కొండపల్లి బొమ్మలు నిర్మల్ కళారంగం

డాక్టర్ ఆర్.వి.రావు

చేతిపనుల రంగంలో, ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసింది. ఇన్ని చేతి పరిశ్రమలు గాని, నిర్మాణ చాతుర్యంగాని, ఏ యితర రాష్ట్రంలోనూ లేవు. ప్లాస్టర్ బొమ్మలు ఎక్కడైనా చూడవచ్చు. కాని సహజ సౌందర్యం వెదజల్లే వస్తువులు దొరకటం కష్టం. కళాకారులు స్థానికంగా లభ్యమయ్యే ముడి పదార్థాలతో, మంచి మంచి బొమ్మలు చేస్తున్నారంటే, వారివి "మ్యాజిక్" (Magic)



నిర్మల్ చిత్రకళా ఫలకాలు


చేతులనాలి ఒక యుగంలో రాతి మీద, ఒక యుగంలో రంగులమీద పరిశోధనలు చేశారు ఆదిలాబాదులోని నిర్మల్ గ్రామంలో కొన్ని స్థానికంగా లభ్యమయ్యే ముడి పదార్థాల నుండి, బంగారం రంగువంటి రంగు తయారుచేసి, బొమ్మలపై దానిపూత వేస్తే, దాని రంగు ఎప్పుడూ మారదు. చేతి పనులు గ్రామసీమలలో, యిప్పటికీ వర్ధిల్లుతున్నందున భారతీయ సంస్కృతికి, గ్రామ సీమలు దృష్టాంతరాలనాలి.

అచ్చంగా సింహమే !

తింటే గారెలే తినాలి చూస్తే బొమ్మలే చూడాలి. నిర్మల్‌లో తయారయిన సింహాన్ని చూస్తే, నిజమయిన సింహమని పిల్లలు భయపడతారు. మానసిక శాస్త్రం ప్రకారం, పిల్లలకు బొమ్మల వల్ల ఎంతో విజ్ఞానం వస్తుంది. పిల్లలకు అవి స్నేహితులు. బొమ్మలంటే నిర్మల్ వెళ్ళాలి. కొండపల్లి వనికట్టుకొని చూడాలి. మన రాష్ట్రంలో నలుదిశలా బొమ్మలు తయారవుతున్నాయి.


మానవ సమాజ చరిత్రలో, ఆట బొమ్మలకు ఒక విశిష్టమైన స్థానంవుంది. నేటి సమాజం, ఆట బొమ్మలకు గొప్ప స్థానం యిస్తూవుంది. ఆ యా బొమ్మలు ఆ యా ప్రాంతాల ప్రత్యేకతను నిరూపించుతూన్నాయని శ్రీమతి దోంగర్ కరి చెప్పిన మాటలలో చాలా సత్యముంది. "మృచ్ఛకటికము" లో మట్టి బండెలను గురించి చాలామంది చదివే వుంటారు. దసరా, సంక్రాంతి పండుగలలో బొమ్మల కొలువులు పెడతారు. మన కళాకారులు అడవి మృగాలు, పక్షులు, దేవుళ్ళు, దేవతల యొక్క నమూనాలు మన పిల్లలకు సమకూర్చుతున్నారు. వీటి వలన మన పిల్లలకు జ్ఞానోదయం కలుగుతుంది. వెనుకటి రోజులలో ఆడుకోటానికి పిల్లలకు అనేక బొమ్మలు లభించేవి. అందచందాలకే కాదు; అవి పిల్లల మానసికాభివృద్ధికి ఎంతో తోడ్పడేవి.

ఒక ప్రాంతంలో, ఒక రకమైన ఆటవస్తువులు తయారయాయంటే, అచ్చట లభ్యమయే ముడి పదార్థాలు, నైపుణ్యం



కొండపల్లి బొమ్మల్లో దశావతారాలు

అనాలి. కొన్ని చోట్ల కఱ్ఱ ఉపయోగిస్తే, కొన్నిచోట్ల లోహం ఉపయోగిస్తారు. మరి కొన్ని గ్రామ సీమలలో అతి చవుకైన మట్టి, పేడ. ఉపయోగిస్తారు, యాంత్రిక కేంద్రాలలో యివి విరివిగా అమ్మకం అవుతాయి. పేదవారు మట్టి బొమ్మలు ఉపయోగిస్తే, వున్నవారు ఖరీదయిన వస్తువుల వాడతారు మన యొక్క బొమ్మలు, ప్రజల స్వీయ చరిత్ర వెల్లడి చేస్తాయి. మన సంస్కృతి విశదీకరిస్తాయి. వీటివల్ల ప్రజల మానసికాభివృద్ధిని గురించి కూడా మనం తెలిసికోవాలి ఉంది.



నిర్మల్ ఆటబొమ్మలు

మానవ జాతి ఎంత పురాతనమో, బొమ్మలు కూడా అంత పురాతనమని చెప్పాలి. ఒక ప్రాంతంలోని బొమ్మలు అక్కడి పరిసరాలు, సాంఘిక ఆర్థిక సాంప్రదాయం, అక్కడ లభ్యమయ్యే ముడి పదార్థాలు—వీటిపై ఆధారపడతాయి. గత 50 సంవత్సరాలు, ఆట బొమ్మలకు స్వర్ణయుగం అనాలి. ఇప్పుడే పిల్లల నిజమైన అవసరాలు పెద్దలు గుర్తించారు. సాధారణంగా పెద్దవారు, పిల్లల మానసికాభివృద్ధిని గాని వారి కోరికలనుగాని గుర్తించరు.

ఫ్రాయిబెల్, మాంటిస్సోరి మొదలగు ఆధునిక విద్యావేత్తలు ఆటలు అనుకునే వస్తువులు, పిల్లల ఆలోచనాభివృద్ధికి ఎంతో తోడ్పడుతాయని మొదటిసారి గట్టిగా చెప్పారు. దానితో యిల్లు పాఠశాలగా పరిగణింపబడి. బొమ్మలషాపులలో వివిధరకాల బొమ్మలు అమ్మబడుతూవున్నాయి. ఇది గొప్ప విషయం.

ఆట బొమ్మల ముఖ్యోద్దేశం పిల్లల నైతికాభివృద్ధికి తోడ్పడటమే. కొన్ని బొమ్మలు, పిల్లలు పరిసర ప్రాంతాలు అర్థంచేసికొనడంలో తోడ్పడుతాయి. కొన్ని బొమ్మలు పిల్లలు పని చేయటంలో తోడ్పడుతాయి. కొన్ని పిల్లల మానసిక శక్తి పెంపొంద చేయడమే గాక, వారి యొక్క ఊహాశక్తిని కూడా పెంపొంద చేస్తాయి. బొమ్మలు పిల్లల భవిష్యత్తుకు, గొప్ప తరిఫీదు యిస్తాయి. కొన్ని ఆటబొమ్మలు నిర్మాణాత్మకమైనవిగా వుంటాయి. కొన్ని కొత్త వింతలు కనుక్కొనే శక్తియిస్తాయి. ఇవి ఎంతో ఆకట్టుకొనేవిగా వుంటాయి.


''కొండపల్లి బొమ్మలాగా ...''

ఆంధ్రప్రదేశ్ కఱ్ఱ బొమ్మలకు మంచి పేరు తెచ్చుకొంది. కొన్నిటికి ప్రపంచ ప్రఖ్యాతి కూడా వచ్చింది. కొండపల్లి బొమ్మలు చూడ ముచ్చటగా వుంటాయి. అందుచేతనే "కొండపల్లి బొమ్మలాగా " అనే పాట కూడా వుంది. కొండపల్లి, నిర్మల్, ఏటికొప్పాక, తిరుపతి, పేరు కెక్కిన కేంద్రాలు. పిల్లలకు యివంటే గొప్ప ఆదరణ. ఇవి భారతీయ సంస్కృతిని ప్రతిభను చాటుతాయి. ప్రతి కేంద్రానికీ, ఒక ప్రత్యేకత వుంది. మనిషి రూపుకూ చూపుకూ కొండపల్లి బొమ్మలు పెట్టింది పేరు. మృగాలకు పక్షులకు నిర్మల్ ప్రసిద్ధి ఏటికొప్పాకలో లక్కపూత పూస్తారు. తిరుపతిలో ఎర్రచందనం కఱ్ఱతో బొమ్మలు చేస్తారు. ఇట్టి బొమ్మలు, భారతదేశంలో ఏ యితర ప్రాంతంలోనూ తయారు చేయటం లేదు. పిల్లలు వాటికి దుస్తులువేసి, బొమ్మల పెళ్లిళ్లు చేస్తారు.



కొమ్ము బొమ్మలు

కొండపల్లి బొమ్మల గురించి మనం తెలిసికొందాం. విజయవాడకు 15 మైళ్ల దూరంలో కొండల మధ్య, అడవులమధ్య కొండపల్లి గ్రామం వుంది. ఇచ్చట తయారయ్యే బొమ్మలకు, భారత దేశంలోని వివిధ ప్రాంతాలలోనే గాక, విదేశాలలో



కొండ పల్లి ఏనుగు అంబారీలు

కూడా ప్రఖ్యాతి వుందని, విదేశాలకు పోయి వచ్చిన ఆంధ్రులు నాకు చెప్పారు. గ్రామీణ వాతావరణం ప్రదర్శించే ఈ బొమ్మలు, చాలా ఆకర్షణీయంగా వుంటాయి. ఇచ్చట సులభంగా లభ్యమయే తెల్లపొనుకు కర్రతో యీ బొమ్మలను కళాకారులు తయారు చేస్తారు. పక్షులు, పౌరాణిక బొమ్మలు (ఉదాహరణకు దశావతారాలు) తయారుచేయటంలో, యిచ్చటి కళాకారులు ప్రఖ్యాతి పొందారు. ఈ బొమ్మలు చూచినట్లయితే భారత ప్రజల జీవిత చరిత్ర చదివినట్లే అనాలి. రైతుల బొమ్మలు, పోలీసుల బొమ్మలు (ముఖ్యంగా నైజాం పోలీసులు) గొప్ప, మొదలైన ఎన్నోరకాల బొమ్మలు, తేలికైన కర్రతో తయారు చేస్తారు. ఈ బొమ్మలు మన దగ్గరవుంటే, అవి మౌన భాషలో మనతో మాట్లాడుతోన్నట్లుంటుంది.

ఇక్కడ బొమ్మల పరిశ్రమ ఎట్లావచ్చిందంటే, దీని మీద రెండు అభిప్రాయాలున్నాయి. 16 వ శతాబ్దంలో, రాజస్థాన్ నుండి ఆర్యక్షత్రియ కళాకారులు, వలసవచ్చి, యిచ్చట బొమ్మల పరిశ్రమ అభివృద్ధి చేశారనేది ఒక అభిప్రాయం. దీనిలో చాలా సత్యముంది. ఇంకో అభిప్రాయం, 1350 ఆ ప్రాంతం నుండి అచ్చటి రాజులు యీ పరిశ్రమ పోషించారు గనుక యీ పరిశ్రమ పైకి వచ్చిందనే వాదన యింకోటి.

ఒకానొక కాలంలో, యీ బొమ్మల పరిశ్రమ 200 కుటుంబాలకు ఉపాధి సౌకర్యం యిచ్చేది. స్థానిక నవాబులు, రాజులు, యీ పరిశ్రమను ఎంతో పోషించారు. కొంతకాలం తరువాత, ప్రజలకు యీ బొమ్మలమీద మోజు పోయింది. 16 కుటుంబాలకు కూడా పూర్తి ఉపాధి దొరకటం కష్టమయింది. ఇట్టి పరిస్థితులలో, ప్రభుత్వంవారు వీరికై సహకార సంఘాన్ని స్థాపించి వారికి కావలసిన పెట్టుబడి. తదితర సౌకర్యాలు యిచ్చారు. సామాజిక క్షేత్రం (Common Facility Center) కూడా వచ్చింది. పని వారలు ఒకేచోట పనిచేయటానికీ, నవీన యంత్రసామగ్రి సహాయం పొందటానికీ, యీ క్షేత్రం ఎంతో ఉపకరించింది.

కొండపల్లి బొమ్మలకు మంచి గిరాకీవుంది. కాని కావలసినంత మంది కళాకారులు లేనందున, ప్రభుత్వం కొత్తవారికి శిక్షణ సౌకర్యాలు కూడా యిచ్చారు.

ఇచ్చట తయారయిన బొమ్మలకు మార్కెట్ల కష్టం ఏమీ లేదు వేగన్ల కొలది బొమ్మలు సరఫరా చేసే గిరాకీ వుండగా బుట్టలతో కూడా మనం సప్లయి చేయలేక పోవటం చాలా విచారకరమని కీ॥శే॥ శ్రీ వెంకట్రావు గారు చెప్పిన మాటలలో చాలా సత్యముంది. కొండపల్లి చరిత్రాత్మక ప్రదేశం గనుక విలాస యాత్రికులు అనేక మంది యిచ్చటకు వస్తారు. వీరే చాలా సామాన్లు కొంటారు. మద్రాసులోని విక్టోరియా సాంకేతిక సంస్థ కూడ మొదటి నుండి, యీ వస్తువులకు మార్కెటింగు సౌకర్యాలు యిస్తూంది. ప్రభుత్వ చేనేత విక్రయశాలలు కూడా తగు సౌకర్యాలు యిస్తున్నాయి.

సాలీనా లక్షరూపాయల ఆట బొమ్మలు యిచ్చట ఉత్పత్తి అవుతాయి. ఇంకా ఉత్పత్తి పెంచవలసిన బాధ్యత మనపైవుంది ఈ పరిశ్రమకు దోహదమిచ్చి, ఎంతో అభివృద్ధి చేయటానికి వీలుంది. ప్రభుత్వం యీ విషయంలో చర్య తీసికొంటూనే వుంది. ఇప్పుడు 45మంది కళాకారులు, కొండపల్లిలో యీ బొమ్మలు తయారు చేస్తున్నారు. అడవులలో లభ్యమయే తెల్లపొనక కర్ర, కొంతకాలం ఎండబెడతారు తరువాత దాని కావలసిన ఆకారమునకు తెస్తారు. చింతబంక, రంపపు పొట్టు కలిపి దీనికి రాస్తారు. తరువాత బొమ్మలకు సున్నంతో పూత వేస్తారు. దీని మీద సులభంగా



బిద్రీ బొమ్మ

వార్నీసు, వాటర్ రంగులు వేయవచ్చు. దశావతారాలు అంటే ప్రజలకు చాలా ప్రీతి. కళాకారులకు రోజుకి 4 రూపాయలు మొదలు 5 రూపాయల వరకు కూలి కిట్టుతుంది. ఈ పరిశ్రమ అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతో వుంది.

విలాసయాత్రికులకు, ప్రభుత్వం ఒక విశ్రాంతి భవనం కూడా ఏర్పాటు చేశారు.


నిర్మల్ కళలు

కొండపల్లి బొమ్మలలో రంగులు అతిరమ్యంగా వుంటాయి. నిర్మల్ కళలో, ప్రకృతి, సాంప్రదాయం ప్రతిబింబించి వుంటాయి. ఆదిలాబాదులోని నిర్మల్ పట్టణంలో, నిర్మల్ కళలు అనేక శతాబ్దాల నుండి విరాజిల్లుతున్నాయి. నిర్మల్ పరిశ్రమకు 4 శతాబ్దముల చరిత్ర వుంది. కాకతీయ రాజుల కాలంలో యీ పరిశ్రమ అభివృద్ధికి వచ్చింది. ఇప్పటికి యిచ్చట మంచి పెయింటింగులు, ఆటవస్తువులు చేస్తున్నారు.

'నగ్గిష' కులస్థులు యీ పరిశ్రమలో వున్నారు. అచ్చట లభ్యమయే రాళ్ళ, వేళ్ళ, జిగురులతో రంగులుచేసి, (అవి బంగారు వన్నెలో వుండేవి) రామాయణ, మహాభారతములలోని కొన్ని ఘట్టాలను, చిత్రించేవారు. వీటిని రాజులు ప్రోత్సహించేవారు. ప్రభుత్వంవారు, యిచ్చటి కళాకారులకు శిక్షణయిచ్చి, సామాజిక కేంద్రాన్ని స్థాపించి, పెట్టుబడికి కూడా తగు సహాయంచేసి, నిర్మల్ కళకు చాలా దోహదం చేశారు. పక్షులు, కూరలు, ఆట బిళ్ళలు, సింహాలు, నెమలి, యివన్నీ యిక్కడ చేస్తారు. ఆదిలాబాదు అడవులలో నెమళ్ళు, పెద్దపులులు విశేషంగా వుంటాయి. వాటిని అచ్చు పోసినట్లు చేస్తారు ప్రభుత్వంవారు 1955 లో, కళాకారులను సహకార రంగంలోకి తెచ్చి, యిప్పుడు 45 కళాకారులకు ఉపాధి సౌకర్యాలు యిస్తున్నారు. సాలీనా, యిచ్చట 1 లక్ష రూపాయల వస్తువులు ఉత్పత్తి అవుతాయి. ప్రభుత్వ విక్రయ శాలల ద్వారా స్థానికంగా యీ వస్తువులు సులభంగా అమ్మకం అవుతున్నాయి.

కొండపల్లి బొమ్మల వలె, నిర్మల్ వస్తువులు కూడా 'పొనక కట్టె'తో చేస్తారు. గ్రామం చుట్టూ వున్న అడవులలో యీ కట్టె సులభంగా లభ్యమవుతుంది. కొంతకాలం ఎండబెట్టి, కావలసిన సైజుకు కట్టెను కోస్తారు. మృగం యొక్క, లేక పక్షి యొక్క శరీరాన్ని మొదట తయారుచేసి, కాళ్లు, తెక్కలు, మొదలయిన అవయవాలు తరువాత బంకతో అతుకుతారు. దీనిని, చింత పిక్కల నుండి తయరుచేస్తారు. రంపపుపొట్టు, బంకకలిపి, ఒక పూత పూస్తారు. దీనితో చిన్నచిన్న రంధ్రాలు పూడిపోతాయి. తిరిగి యింకోసారి పూస్తారు. తరువాత సుద్దమట్టి దీనిమీద పూస్తారు, ఎండేవరకు బయట వుంచుతారు. తరువాత యిసక కాగితంతో పీటిని నునుపు చేస్తారు. ఆ తరువాత కావలసిన రంగులను వీటిపై పూస్తారు. దీనిపై వార్నీసుకూడా వేస్తారు. 6 అంగుళముల బొమ్మ చేయాలంటే 1 రోజు పట్టుతుంది. రోజుకు 5, 6 రూపాయల కూలి వస్తుంది. యీ సంఘానికి షోరూమ్ కూడా వుంది. దానితో చాలావరకు తయారయిన సరకులు స్థానికంగానే విక్రయం అవుతున్నాయి. వీరికి మిషన్లు, కావలసిన రంగులు (ఆరోగ్యానికి భంగంకానివి) లభ్యమయేటట్లు ప్రభుత్వం చేయాలి. వీటికిక్యాటలాగ్ కూడా తయారు చేస్తేచాలాబాగుంటుంది.

1950 ప్రాంతములో, 15 మంది కళాకారులు హైదరాబాదుకు తరలి వచ్చారు వీరికి మొదట కీ॥ శే॥ అక్బర్ హైదరిగారి కోడలు అలీహైదరి మంచి మద్దతు యిచ్చారు. తరువాత శ్రీ ఎం కె. వెల్లోడిగారు అధికారిగా వున్నప్పుడు, ప్రభుత్వంవారు యీ పరిశ్రమ స్వాధీనం చేసికొన్నారు. ఇప్పుడు యీ పరిశ్రమ ఖైరతాబాద్‌లో వుంది. నిర్మల్ పనివారలు వనమూలికల సహాయంతో, బంగారం లాగవుండే రంగు తేగలరు. ప్రభుత్వం వారు, యీ కళకు కొత్తరూపు తెచ్చారు. ప్లేటులు, పెయింటింగులు, మేజాబల్లలు, దీపస్తంభాలు, మొదలగు వాటిని తయారుచేసి, విదేశాలకుకూడా పంపుతున్నారు. అజంతాకళను కూడా యిచ్చట పునరుద్ధరిస్తున్నారు. చాలాకాలం నిలువరంగుల వలననే గాక, వన మూలికల రసాయనములతో రంగులకిచ్చే బంగారు వన్నె వలన కూడ, యీ వస్తువులకు అందం, గిరాకీ లభించింది.



రాష్ట్రపతి సతీమణి శ్రీమతి బేగం ఆబిదా అహమ్మద్ నిర్మల్ పరిశ్రమ సందర్శించినప్పుడు చేనేత శాఖామంత్రి శ్రీ కె.వి.కేశవులు నిర్మల్ కళను గురించి వివరిస్తున్న దృశ్యం.

కొండపల్లి బొమ్మలు, నిర్మల్ కళలు, మన రాష్ట్రపు సంస్కృతిని చాటుతాయి. వాటి అభివృద్ధికి ప్రభుత్వం సర్వదా తోడ్పడుతూనేవుంది. ప్రజలు వాటిని పోషించాలి. ఆ నాడే వీటికి గొప్ప భవిష్యత్తు వుందని చెప్పటానికి వీలుంది. ఆధునిక యంత్ర యుగంలో కూడా చేతి కళలు మన సంస్కృతిని నాగరికతను చాటుతాయని, వాటిని మరువరాదని వేరే వ్రాయాలా!


తెలుగు కథానికా వికాసం

— శ్రీమతి మాదిరెడ్డి సులోచన

ఆధునిక సాహిత్యములో నవలలు, చిన్నకథలు, కథానికలు, ఏకాంకికలు, నాటికలు ముఖ్య స్థానము అలంకరించాయి. ప్రారంభములో 'అనగా అనగా' కథలు ప్రారంభించేవారు. రాను రాను క్రొత్త సారస్వత ప్రక్రియలలో వ్రాసినవే జనాన్ని ఆకర్షిస్తున్నాయి. సమకాలీన సమాజాన్ని తమ రచనలలో ప్రతిబింబింపజేయాలని ఆధునిక రచయి(త)త్రులు ప్రయత్నిస్తున్నారు. అది హర్షింపతగినదే.

నవల, కథ, వ్రాయటమంత సులభముకాదు కథానిక వ్రాయటము. ఏ విషయము యెంతవరకు, యెలా చెప్పాలన్నది ఒక కళ. ఈ కళ అందరికీ సులువుగా అబ్బదు. కొందరు కథానిక వ్రాయబోయి పెద్ద నవల కుదించినట్టు వ్రాస్తారు. మరి కొందరు అయోమయంగా వదిలి వేస్తారు. నూతన ప్రక్రియలు ఆంగ్ల సాహిత్య ప్రభావము వల్ల వెలువడ్డాయని కొందరి సాహిత్యకారుల అభిప్రాయము ఈ విషయము పూర్తిగా ఏకీభవించ తగినది కాదేమో. ప్రాచీన సాహిత్యములో చిన్న కథలు చాలా లభ్యమవుతాయి ఆనాటి రచయితలు ఒక నీతి కే ప్రాముఖ్యము ఇచ్చారు. కాల్పనిక జగత్తులో విహరించారు. భాష విషయములో కూడా తమ పాండిత్యాన్నే ప్రదర్శించారు గాని, పామరునికి అందుబాటులో లేకుండా చేశారు. అందుకే మన ప్రాచీన సాహిత్యము సామాన్యులకు అర్థము కాలేదు. పండిత సాహిత్యంగానే మిగిలి పోయింది.

శ్రీ గుడిపాటి వెంకటచలము గారు అంటారు, 'కథకు ఆధారము సామాన్య మానవుడు' అని. అది నిజమే మానవుడి జీవిత సంఘర్షణ నుండి వచ్చినవే నిజమైన కథలు. ఊహాగానాల మాటేమిటి అని ప్రశ్న రావచ్చు. మానసిక సంఘర్షణ, వికాసా



సగటు మనుషులు

నేటి కథకు, కథానికకు నాయకుడు, నాయకురాలు సగటు మనుష్యులు కథకులకు కొంత శాస్త్రీయ దృక్పథముండాలి, ప్రతి ఉద్వేగమందు తర్కముండాలి. అన్నిటికన్నా ముఖ్యం వ్యక్తిగతమైన ఈర్ష్యా సూయలకు దూరంగా ఉండి రచనలను చేయటం. అది అసాధ్యమేమో అనిపిస్తుంది. చరిత్ర తిరగ

సాహిత్యం సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించాలి.

నికి తోడ్పడక పోయినా మనోల్లాసం కలిగిస్తాయని చెప్పక తప్పదు అందుకే వాటిని పూర్తిగా విస్మరించలేము. ఒక్కొక్కసారి కొంత వాస్తవానికి కల్పన జోడించక తప్పదు ఈ సమస్యకు ఈ పరిష్కారముంటే బాగుంటుందని రచయిత (త్రి) ఊహించినప్పుడు అది వాస్తవానికి దూరంగా పోవచ్చు.

వేసినా, జరుగుతున్న చరిత్ర చూస్తున్నా, పరిపాలనలో కంటే సాహిత్య రంగములో రాజకీయాలు గమత్తుగా కనిపిస్తాయి. ఒక రచయితను ఆకాశానికి యెత్తి వేయాలన్నా, దింపివేయాలన్నా అసాధ్యం కాదని నిరూపించే సంఘాలు ఏర్పడుతున్నాయి. తమకే అంతా తెలుసునని ఘాటయిన విమర్శలు చేస్తూ, ఆధునిక రచ

మంచి కథానికలు అరుదుగా వస్తున్నాయి. దీనికి కారణం పాఠకులే.

యిత (త్రు) ల పాండిత్యము పరిధి రెండు వందల పదాలలో ఇమిడి ఉందని నోటి దురుసు ప్రదర్శించుకుంటున్నారు. అది ఆరోగ్యకరమైన విమర్శ కాదు. హృదయాంతరాళంలో దాగిన అసూయా ద్వేషాలకు ప్రతి బింబం. ఈ వాతావరణము మారితేగాని నిజమైన సాహిత్యకారులు వెలుగులోకి రారని నా నమ్మకం.

ఆధునిక సాహిత్యంలో చిన్న కథకు నాంది ప్రస్తావన చేసిన వారు గురజాడ అప్పారావు గారనే చెప్పవచ్చు. (నాకు తెలిసినంతవరకు). ఆయన రచనలలో ఆనాటి సాంఘిక వ్యవస్థ చక్కగా చిత్రీకరించారు. శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణగారు, నోరి నరసింహశాస్త్రి గారు, వేలూరి శివరామశాస్త్రి గారు, శ్రీ పాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారు, కరుణకుమార్ గారు ఉత్తమ కథలు గ్రాంథిక భాషనే యెక్కువగా ఉపయోగించారు.

సాహిత్యంలో కొంత మార్పు, చిన్న కథకో రూపం తెచ్చిన వారు శ్రీ చలం, శ్రీ కొడవటిగంటి కుటుంబరావు, శ్రీ గోపీచంద్, శ్రీ బుచ్చిబాబు మొదలయినవారు. ఆ తరువాత చాలామంది రచయితలు, రచయిత్రులు ఈ ప్రక్రియను అవలంబించారు. కథను, కథానికను చాలా విస్తరింప చేశారు.

ప్రక్రియా పరిధులు

సాహిత్య జగత్తులో అన్నీ సామాన్య మానవుడిని ఆధారం చేసుకుని చేసిన రచనలే, చేస్తున్నవి కూడాను. కొన్నింటికి పరిధులెందుకు అని, ఒకే రచయిత కథ, కథానిక, నవల, నాటకం, చరిత్ర వ్రాయలేడా? అన్న ప్రశ్న వచ్చినప్పుడు లేదు, అనలేం. కొంత కష్టమని మాత్రం చెప్పవచ్చు. కథానిక అనగానే ఇతివృత్తం ఒక పరిధిలో బిగింపబడుతుంది. అలాగే పాత్రలకు పరిమితి ఉంటుంది. సంఘటనలను సంకుచితం జేయాలి. అన్ని జాగ్రత్తలు తీసుకొని తను చెప్పదలచుకున్నది, స్పష్టంగా చెప్పినప్పుడు ఉత్తమ కథానిక వస్తుంది. కథానిక వ్రాసేటప్పుడు కొన్ని విషయాలు స్పష్టంగా గుర్తుంచకోవాలి. మొదటిది సంభాషణల కుదింపు. అవసరము అనుకుంటే తప్ప పాత్రల ద్వారా కథ నడిపించడం కత్తి మీద సాము అవుతుంది. రచయిత పరంగా కథనము సాగితే కుదింపు అదే వస్తుంది. రెండవ విషయము వర్ణనలు తగ్గించి వేయటం. అవసరమైన చోట ఒకటి, రెండు వ్యాఖ్యలు తప్పితే అదే పనిగా వర్ణన సాగిస్తే కథానిక తన పరిధి దాటిపోతుంది. మూడవది పాత్రల పరిచయం. అవసరానికి పాత్రల ప్రమేయమున్నా, అతి తక్కువ పాత్రలను ప్రత్యక్షంగా కథానికలో ప్రవేశపెట్టినప్పుడే కథ సాగుతుంది, లేకపోతే పెద్ద కథలోకి, లేదా నవలలోకి లాగుతుంది.

ఈ అయిదారేళ్లల్లో కథానికల సృష్టి కాస్త వెనుకబడిందనే అనుకోవాలి. దానికి కారణము సాహిత్యము వ్యాపారముతో ముడిపడి పోవటమే అనుకుంటాను. కథానికలు వచ్చినా మంచివి అరుదుగా కనిపిస్తున్నాయి. దానికి కారణము పాఠకులే అనుకోవాల్సి వస్తుంది.

కథ అయినా, కథానిక అయినా, నవల అయినా, సమకాలీన సమాజాన్ని ప్రతిబింబింపజేయాలి. ఆ తరంనాటి సాంఘిక వ్యవస్థ ముందు తరాలవారికి స్పష్టపరిచేది సాహిత్యమే మరి.





చెల్లాయి లేఖ

.... కరుణశ్రీ

చిన్నన్నా ! క్షేమంగా ఉన్నావా !
చేతులో మర తుపాకీ పట్టుకొని
శిరస్సుపై ఉక్కు టోపీ పెట్టుకొని
క్షణక్షణం నిరీక్షిస్తున్నావా !
జన్మభూమిని రక్షిస్తున్నావా !

పంటచేను పాడుచేసే
గుంటనక్కల పళ్ళు రాలుస్తూ
గొర్రెపిల్లల కోసం గుటకలు మింగే
టక్కరి తోడేళ్ల డొక్కలు చీలుస్తూ
బద్దకం లేకుండా నిద్దుర పోకుండా
భారతదేశం సరిహద్దులు కాస్తున్నావా !
చిన్నన్నా ! క్షేమంగా ఉన్నావా !

నాన్నా అమ్మా నిన్ను తలుచుకొని
కన్నీరు పెట్టని రోజులేదు
బుజ్జితమ్ముడు నీ ఫొటోకు
పూలదండ వెయ్యని రోజులేదు
"చిట్టితల్లి" బొమ్మలో ఉన్న నిన్ను
చేయెత్తి పిలవని రోజు లేదు

కొత్తగా మనం కొన్న గోవుతల్లికి
కోడె దూడ పుట్టింది
బుజ్జాయి కాళ్లకు చిట్టితల్లి
గజ్జెలు కట్టింది
తెల్లని బుజ్జాయి బజారంతా
గల్లుగల్లున గంతులెయ్యడం మొదలెట్టింది.

పెరటిలోని గున్న మామిడి
పిందెలు వేస్తున్నది
వీధిలో ఉన్న సురపొన్న
పూలు పూస్తున్నది
గుమ్మడితీగ గోడ పాక పైకెక్కి
నీ కోసం నిత్యమూ ఎదురు చూస్తున్నది

మన వూరిప్పుడు మారిపోయింది బాగా
వెలవెల పోవటం లేదు వెనకటి లాగా
అయిదారు నెలల్లోనే అంతా వింత
అనిపిస్తున్నది
అదేదో నవ చైతన్యం అందరిలోనూ
కనిపిస్తున్నది

చెరువుగట్టు అప్పటికంటే ఎత్తు చేశారు
డొంకంతా మొరకపోసి కంకర రోడ్డు వేశారు
బసీ నుంచి సిటీ బస్సులు వస్తున్నాయి
వూళ్ళోకి
శ్రద్ధగా చదువు చెప్పే మేష్టరొచ్చారు
మన బళ్ళోకి

లాంతర్లూ చిమ్నీలూ మాయమయ్యాయి
లైట్లూ ఫ్యానులూ వెలిశాయి
వెలుగులు వెదజల్లుతూ మన వూరు
కళకళ లాడుతున్నది ప్రతి రేయి

గుడికి వెల్ల వేస్తున్నారు
బడి తలుపులు రెండు పూటలా తీస్తున్నారు
బూజు దులిపి లైబ్రరీలో
పుస్తకాలన్నీ పేరుస్తున్నారు

గుడిలో వున్న పోలేరమ్మ
కోళ్లూ పొట్టేళ్లూ వద్దంటున్నది !
కొబ్బరి కాయలతోపాటు
వడ పప్పు పానకం తెమ్మంటున్నది!

అన్నయ్యా ! మన వూరికి
హాస్పటల్ కూడా వచ్చింది
తన వెంట ప్రసూతి కేంద్రాన్ని తెచ్చింది
అప్పట్లో వైద్య సహాయం లేకనే కదా
అటువంటి వరహాల తల్లిని వదినెను
పోగొట్టుకున్నాము
ఆ మహాతల్లి ప్రేమ చిహ్నంగా
చిట్టి తల్లిని మాత్రం నిలబెట్టుకున్నాము

అసమర్థుని అహంకారం లాగా
అదే పనిగా పెరిగిన ధరలు
సిగ్గుతో తలవంచుకొని
తగ్గు ముఖం పట్టాయి
భగవంతుని వలె కంటికి కన్పించని పంచదార
ప్రార్థన చెయ్యకుండానే దర్శన మిస్తున్నది.

హాస్టలు సొమ్ము దిగమింగిన "మాస్టర్
మూర్తి"కి
ఊస్టింగ్ ఆర్డర్ పంపించారు
లంచాలు మేసి లైసెన్సులు పంచిపెట్టినందుకు
గంగిరెడ్డుల శివయ్యను గద్దె దింపించారు
నూనెలో కల్తీ కల్పిన పానకాలుకు
నూరు రూపాయలు జరిమానా పడింది.

తప్పుడు లెక్కలు వ్రాస్తూ
ఎప్పుడూ తలుపులు తెరవని
అప్పలసామి చౌక దుకాణంలో
ఆరు బస్తాల బొంబాయి రవ్వ పట్టుబడింది.

పదివేల కట్నం సమర్పించందే
ఆలిమెడలో తాళి కట్టనని
భీష్మించుకు కూర్చున్న పెండ్లి కొడుకు
పోలీసుకు ఫోను చేశారని విని
పుస్తె బిగించాడు నోరు మూసుకొని.

పాకిస్థాన్ యుద్ధంలో
ఓకాలు మోకాలు దాకా పోగొట్టుకొన్న
వీరన్న
కొయ్యకాలు మీద నడుస్తూనే
కోరమీసాలు మెలేస్తున్నాడు
తన వీరగాథలు వినిపిస్తూ
జనాన్ని సిలేస్తున్నాడు.

మన గ్రామంలోని ఆడవాళ్లంతా
"మహిళా మండలి" పెట్టారు
కుట్టూ బుట్ట అల్లడం లాంటి
కుటీర పరిశ్రమలు చేపట్టారు.

ఊరిలోని యువకులందరూ కలిసి
"యువజన సంఘం" స్థాపించారు
చదువుకునే బాల బాలికలకు
సరియైన ధరలకు పుస్తకాలిప్పించారు.

రైతులంతా కలిసి కట్టుగా
నూతన వ్యవసాయ రీతుల్లో
బంగారు పంటలు పండిస్తున్నారు
పాతర్లూ గాదెలూ నిండిస్తున్నారు.

పెద్దలకు రాత్రి పాఠశాలలూ
పిన్నలకు బాలానంద కేంద్రాలూ
సరిక్రొత్తగా వెలిశాయి
గ్రామంలో పార్టీలన్నీ కలిశాయి

తాతయ్య అయ్య పెళ్లికి చేసిన
పాత బాకీ వడ్డీకు వడ్డీలు కట్టి
రెండు వందలు పన్నెండు వందలు చేసిపెట్టి
బలవంతంగా పట్టుబట్టి
మన యిల్లు తాకట్టు పెట్టించుకున్న
పోలిసెట్టిని
నల్లధనం దాచినట్టు కనిపెట్టి
జైల్లో తోశారు
మన బాకీ పూర్తిగా రద్దు చేశారు

కిట్టిగాడి చేత రాత్రింబవళ్లు వళ్లు
పట్టించుకునే పొట్టి కరణం
గట్టిగా కాళ్లు పట్టలేదని వాణ్ణి
చితకొట్టినందుకు
"వెట్టి చాకిరీ చట్ట విరుద్ధ"మని
అయిదు వందలిప్పించింది ప్రభుత్వం
అపరాధం క్రింద;
కిట్టుడు కిళ్లీ కొట్టు పెట్టాడు రావి చెట్టు కింద

ఎదురింటి గుమాస్తాగారి సంపాదన
ఏ మాత్రం సరిపోవటం లేదని
గుమాస్తాగారి సతీమణి
కుట్టు మిషన్ నేర్చుకుంటున్నది.

పక్కింటి బంగారమ్మ మొగుడికి
ప్రభుత్వం ఒక సైకిలు రిక్షా ఇచ్చింది
ఆనందంగా బతుకుతున్నారు వాళ్లిప్పుడు
"ఓనర్సు" పీడా విరగడయింది.

హైస్కూలు వార్షికోత్సవాలలో
ఐదు ప్రైజులు సంపాదించిన బుజ్జిగాడు
పదో తరగతి పరీక్ష వ్రాసి
ఫస్టు క్లాసు తెచ్చుకున్నాడు.

ప్రభుత్వం వారు మన కుటుంబానికి
బంజరు భూమి నాల్గెకరాలిచ్చారు
నాన్నా అమ్మా ఎంతో కష్టించి
దాన్ని సాగులోకి తెచ్చారు
సామాన్యంగా పండితే ఈ యేటికి
పసిడి పంట పండుతుంది ముందు నాటికి.

ఇది వరకు ఏదోలా వున్నా
ఇప్పుడు బాగానే వుంది మన పని
ఎన్నో సార్లు అన్నాడు నాన్న
"ఇదంతా ఆ అమ్మ చలవే"నని

ప్రతి నెలా నీకు పంపే మనిఆర్డరు
పదో తారీకు దాటకుండా అందుతున్నది
ఇంటి ఖర్చులకు మాత్రమూ
ఇబ్బంది లేకుండా గడిచిపోతున్నది.

నా కోర్కె ఈ సారి కొంచెం
పెద్దదయిందనుకుంటా
కాలేజీకి పైమయింది గురి వుంటా
ఇదీ ప్రస్తుతం మన వూరి కథ

ఇట్లు
నీ చెల్లాయి "సుధ"

తెలుగువారు మర్చిపోలేని విదేశీయులు



— శ్రీ [illegible] శాస్త్రి

క్రీ. శ. 1493 వ సంవత్సరమున పోర్చుగీసు నావికుడగు వాస్కోడిగామా కన్యాకుమారి అగ్రమును చుట్టి భారత దేశ పశ్చిమ సరిహద్దు అగు అరేబియా సముద్రమును ఆనుకొనిన కాలికట్ పట్టణము చేరెను. తదాదిగా, పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీషువారలు, మన దేశమునకు వర్తక వ్యాపారార్థము వచ్చి, అనాటి పాలకులను ఆశ్రయించి, వ్యాపారమునకు కావలసిన, అనుమతి యితర సమపాయములు సాధించిరి. కాల క్రమమున దేశీయ పాలకులలో గల అనైక్యతను ఆధారముగా గైకొని, రాజ్యస్థాపన కావించిరి అందునను, విదేశీయులు, వారిలో వారే పోట్లాడుకొనిరి. తుదకు వారందరిలోను, ఆంగ్లేయులే భారత దేశమున నూటికి 90 వంతులు వారి స్వాధీనమున ఉంచుకొన గలిగిరి మిగిలినవారు చిన్న చిన్న ప్రాంతములను మాత్రమే నిలబెట్టుకొన గలిగిరి.

క్రీ శ 1579 లో ఇంగ్లాండును ఒకటవ ఎలిజబెత్ మహారాణి పరిపాలించుచుండెను. షేక్స్పియర్ వంటి మహాకవులు నివసించిన కాలమది. ఇంగ్లాండు చరిత్రలో స్వర్ణయుగము. ఆ సమయమున స్టీఫెన్ అను ఇంగ్లీషు వ్యక్తి భారతదేశమును దర్శించెను. ఆ తరువాత క్రీ. శ. 1600 లలో, భారతదేశము మొదలైన తూర్పు దేశములతో వ్యాపారము చేయు నిమిత్తము ఈస్టు ఇండియా కంపెనీ స్థాపించబడెను. కంపెనీవారు, ప్రథమమున సూరతు, మచిలీపట్టణము, బొంబాయి, మద్రాసు, కలకత్తా యిత్యాది సముద్ర తీర పట్టణములలో, తమ వ్యాపార కార్యస్థానములు నెలకొల్పుకొనిరి. క్రమ క్రమముగా, యితర పాశ్చాత్యులను అణగద్రొక్కి క్రీ. శ. 1791 నాటికి, భారత దేశమున చాల భాగము స్వాధీనపరచుకొనిరి. 1768 నాటికే ఆంగ్లేయులు తెలుగు దేశమున పలుకుబడిని స్థిరపరచుకొనిరి.

ఆంగ్లేయులు, తెలుగుభాషా సాహిత్యములలోని మందార మకరంద మాధుర్యాన్ని తెలుసుకొన్నారు. కొందరు మన చరిత్ర రచన చేసుకొనుటకు పునాదులు వేశారు. మరికొందరు మన పండితులను ఆదరించి ఆర్థిక సహాయము చేసి గౌరవించారు. మరికొందరు, మన ఆర్థిక ప్రగతికి శాశ్వత పునాదులు వేసారు. వారందరిని గూర్చి విపులముగ వ్రాయుట, యిచ్చట సాధ్యముకాదు. వారిలో ప్రముఖులైన వారిని గూర్చి మాత్రమే యిచ్చట వ్రాయుచున్నాను.

తెలుగులో ప్రథమ ముద్రిత గ్రంథము: బెంజిమన్ షుల్జ్ అను క్రైస్తవ మిషనరీ 1746–47 ల మధ్యకాలమున ప్రష్యా దేశమున గల మాగ్డిబర్గునకు చెందిన హ్యాలే పట్టణములో, "నిజమైన క్రైస్తవుడు జీవితము గడుపవలసిన నూరు విధులు" అను గ్రంథమును అచ్చువేయించెననియు అదియే తెలుగుభాషలో మొదట ముద్రితమైనదనియు, భాషా పరిశోధకులు నిర్ణయించిరి.

తెలుగు భాష ప్రాచ్య దేశపు ఇటాలియను భాష. క్రీ. శ. 1769–1840 మధ్యకాలమున జీవించిన ఏ. డి. క్యాంపుబెల్‌దొర మద్రాసు ప్రభుత్వమునకు చెందిన ఉద్యోగి. తెలుగు భాషను బాగుగా నేర్చుకొని, అందలి మాధుర్యాన్ని గ్రహించి "Telugu is the Italian of the East" అని సప్రమాణముగా నిరూపించిన యోగ్యుడు.

తెలుగు ద్రావిడ భాషా కుటుంబమునకు చెందినది. "జనని సంస్కృతంబు సకల భాషలకును అని శ్రీ నాథుడు వచించుటచే, మనవారందరును తెలుగునకు మూలము సంస్కృతమే అని నమ్మిరి. ఆదికవి అగు నన్నయ "ఆద్య ప్రకృతిః ప్రకృతిశ్చాద్యే, ఏ షాతయోర్భవే ద్వికృతిః" అని పలుకుటచే తెలుగునకు సంస్కృత ప్రాకృతములే ప్రకృతులని నిర్ణయము జరిగినది. ఈ అభిప్రాయమును పూర్వపక్షి మొనర్చినవాడు ఏ. డి. క్యాంప్‌బెల్ దొర. ఆయన తరువాత, మద్రాసు ప్రభుత్వ ఉన్నతోద్యోగి అయిన ఎల్లీసుదొర దక్షిణాది భాషల నన్నింటిని పఠించి, తెలుగు సంస్కృతము నుండి జన్మించలేదని నిరూపించెను. దక్షిణభారత క్రైస్తవ ప్రచారకుడుగా వచ్చిన బిషప్ కాల్డువెల్, ఎల్లీసు సిద్ధాంతముపై విశేషమైన శ్రమచేసి, తెలుగు ద్రావిడ భాషా కుటుంబమునకు చెందినదని సహేతుకముగా నిర్ణయించెను.

"బహాషా ఇలాంగ్ బంగ్‌షా : ఈలాంగ్"

కాల్డ్‌వెల్ కృషి ఫలితముగా ద్రావిడ భాషా పరిశోధన యందు నూతన శకము ఏర్పడినది. ఇది మలేసియా భాషలో ఒక సామెత. భాష నశించి నిర్మూలనమైననాడు జాతికూడ మాయమగును అని దీని అర్థము.

బ్రౌను దొర

తెలుగు భాషోద్ధారకుడు. ఛార్లెస్ ఫిలిప్పు బ్రౌను. (1798—1884)

ఈ దుస్థితి తెలుగుభాషకు రాకుండ తెలుగు భాషను, తెలుగుజాతిని కాపాడి రక్షించిన నాడు ఛార్లెస్ ఫిలిప్పు బ్రౌను దొర. ఈతడు మన దేశమున జన్మించిన విదేశీయుడు. మద్రాసు సివిల్ సర్వీస్‌కు చెందిన ఉద్యోగి. పలువురు, బ్రౌనుదొర గారు చేసిన సేవలకు నివాళులర్పించిరి.

"తెలుగుభాషా సాహిత్యములకై తన జీవిత కాలమునంతను కృషిచేసిన సి. పి. బ్రౌనుదొర (1798—1884) వలన కలిగినంత లాభము, తెలుగునకు మరి యే పాశ్చాత్యుని వలనను కలుగలేదనుట సత్యదూరముకాదు. ప్రబంధముల పాఠములు నిర్ణయించుట మొదలు, అచ్చునకు నీలుగునట్లు తెలుగు లిపిని సంస్కరించువరకు అతని ప్రభావము తెలుగుపై కలదు. "అతడు తెలుగు సాహిత్య రంగమున కృషి ప్రారంభించు నాటికి, తెలుగు వెలుగు సన్నగిల్లుచుండెను. సాహిత్య దీపము కనుకనుకుండెను" అని డాక్టరు కొత్తపల్లి వీరభద్రరావుగారు.

"తాళపత్ర గ్రంథ పరిశీలన తలస్పర్శిగా జరిగితేనే తెలుగు సాహిత్యము యొక్క సమగ్ర స్వరూపముగాని వైశాల్యముకాని విశిష్టతకాని మనమూహింపలేము. ఈ హేతువు చేతనే ఆదిని బ్రౌను దొరగారు, తాళపత్ర పరిశోధనతో, ఆంధ్ర సాహిత్య చరిత్రకు పునాది వేశారు..." అని కళాప్రపూర్ణ డాక్టరు నిడదవోలు వేంకటరావుగారు,

"ఆంధ్ర వాఙ్మయమునందనేక గ్రంథములు నశించినవి...... శేషించిన గ్రంథములనైన చక్కని యక్కరములతో దాటాకుల మీద వ్రాసి గ్రంథమును రక్షించిన లేఖకులు ప్రశంసార్హులు. ఈ గ్రంథ సముదాయమును విశేష వ్యయ ప్రయాసలకోర్చి సేకరించి సురక్షితము కావించిన బ్రౌను దొరగారాంధ్ర ప్రపంచము యొక్క కృతజ్ఞతకు పాత్రులు." అని కీ॥ శే॥ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావుగారు,

"గత శతాబ్దములో సి. పి. బ్రౌను ఆంధ్ర దేశములో బహుకాలము కుంపిణీ ఉద్యోగిగా యుండి, ఆంధ్రభాషకు చేసిన సేవ అసాధారణమైనది" అని బ్రహ్మశ్రీ నోరి నరసింహ శాస్త్రిగారు.

"బ్రౌనుదొర తెలుగుభాషకు అమరసింహుడు" అని కీ॥ శే॥ కురుగంటి సీతారామ భట్టాచార్యులవారు,

తెలుగు భాషకు నిర్దుష్టము సమగ్రమునైన నిఘంటువులేదు ఉన్నంతలో, చెప్పుకొనదగినవి రెండు. అందులో మొదటిది సి. పి. బ్రౌను దొరగారి బ్రౌణ్యము, రెండవది బహుజనపల్లి సీతారామాచార్యుల వారి శబ్ద రత్నాకరము బ్రౌణ్యము సకల జనోపయోగార్థము సంతరింపబడిన పెద్ద నిఘంటువు. వ్యావహారిక ప్రధానము...శబ్దార్థ జిజ్ఞాసువులకు శబ్ద రత్నాకరము కంటెను బ్రౌణ్యమే ఎక్కువగా ఉపయోగించుచున్నది......శబ్ద రత్నాకరమునకు బ్రౌణ్యమే నంచిమొదలు శబ్ద రత్నాకరములోని పదములు చాలవరకు బ్రౌణ్యములోనివే...అని శ్రీదీపాల పిచ్చయ్య శాస్త్రిగారు

ఈ విధముగా పలువురు పండిత ప్రకాండులు బ్రౌనుదొరకు నివాళు లర్పించిరి. భాగవతాది పురాణ గ్రంథములు, కళాపూర్ణోదయము, వసుచరిత్ర, మనుచరిత్ర యిత్యాద్యనేక ప్రబంధములు, బ్రౌను దొరగారి దయవలననే తెలుగువారికి లభించినవి వేమన యెడల బ్రౌనుదొరకు విశేషమైన గౌరవము.

డాక్టరు కొత్తపల్లి వీరభద్రరావుగారు, బహు కష్టములకు ఓర్చి దేశవిదేశములందు లభించిన అనేక సందేహ నిస్సందేహ సాక్ష్యములను సేకరించి, వానిని, పరిశోధించి, బ్రౌనుదొర జీవిత చరిత్రను వ్రాసి ప్రకటించియున్నారు. బ్రౌనుదొరను గూర్చి మును పెవ్వరును, ఇంత విషయ సేకరణ చేయలేదు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు, ఆ పుస్తకమును ముద్రింపించి, బ్రౌనుదొరకు తెలుగు జాతి కృతజ్ఞతలను వెల్లడించిరి. వారు ఎంత ప్రయత్నించినను బ్రౌను దొర ఛాయా చిత్రము మాత్రము లభ్యము కాలేదు.

ప్రస్తుతము, శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయము నందు తెలుగుభాషాచార్యులగు డాక్టర్. జి. వి. రెడ్డిగారి పర్యవేక్షణ క్రింద శ్రీ బండి గోపాల రెడ్డిగారు బ్రౌనుదొరపై పరిశోధనలు కావించుచున్నారు.

బ్రౌనుదొర నిఘంటువగు బ్రౌణ్యమును, బ్రౌనుదొర ఆంగ్లములోనికి తర్జుమా చేసిన 1215 వేమన పద్యములను ముద్రించి, ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీవారు ప్రకటించి ఉన్నారు.

బ్రౌనుదొర మన దేశమున సివిల్ జుడీషియల్ ఉద్యోగిగా, రాజమండ్రి, గుంటూరు, బందరు, కడప, యిత్యాది ప్రాంతములలో పనిచేసెను.

తన స్వంత ధనముతో పండితులను పోషించెను. ఉద్యోగ ధర్మకాలము ముగిసిన పిదప ప్రతి సాయంత్రము పండితులతో చర్చలు జరుపుచుండెను. ఈ పండిత సమావేశమును, బ్రౌను కళాశాల అని ప్రజలు ప్రేమతో పిలిచెడివారు.

మన జానపద సాహిత్య సేకరణకు బ్రౌనుదొరగారు మిక్కుటముగా సహాయపడిరి ...బొబ్బిలి కథను, మొట్టమొదట సేకరించిన మహానుభావుడు, సి. పి. బ్రౌనుదొర. క్రీ శ. 1812 ప్రాంతమున ఆయన మద్రాసులో ఒక జంగమువానిని తన దగ్గరనే యుంచుకొని. వానిచేత, బొబ్బిలి కథ, కామమ్మ కథ, కొమార రాముని కథ, యీ మూడింటిని పాడించి, అతడు పాడుచుండగా వానిని యథాతథముగా వ్రాయించినారు"—డాక్టరు తంగిరాల వేంకట సుబ్బారావుగారు.

సర్ ఆర్థర్ కాటన్

తెలుగు భగీరథుడు : తెలుగుజాతి ఆర్థికాభ్యుదయమునకు, భాగ్యోన్నతికి మూలపురుషుడు కాటన్ దొర. ఈయన బ్రౌనుదొరకు సమకాలికుడు కాటన్ దొర ఈస్టు ఇండియా కంపెనీ ఉద్యోగి. ఇంజనీరు. గోదావరి, కృష్ణ, పెన్న, తుంగభద్రలకు ఆనకట్టలు నిర్మించి, ఆంధ్రదేశమును అన్నపూర్ణగా రూపొందించిన తెలుగు భగీరథుడు, మహాత్మ, యోగి, అయిన సచివుడు, ప్రాతః స్మరణీయుడు. బ్రౌను దొర తెలుగుజాతి సంస్కృతీ వికాసమునకు అంకురార్పణ కావింపగా, కాటన్ దొర తెలుగుజాతి భాగ్యోన్నతికి విత్తులు చల్లెను. వీరిద్దరు, తెలుగు గడ్డపై ఏకకాలమున పరిశ్రమించుట కాకతాళీయమో, లేక భగవత్ ఆదేశమో చెప్పలేము.

వీరిద్దరు జన్మతః పాశ్చాత్యులైనను, తెలుగు వైతాళికులుగా సంస్మరింప బడుచున్నారు. వీరుభయులు, తమ శక్తిని, యుక్తిని, తెలుగుజాతికి అర్పించి ముక్తిపథమును పొందిరి. విశ్వ మానవ కల్యాణమును లక్ష్యముగా గైకొనిన యిట్టి మహనీయుల వలననేకదా సౌహార్ద సంఘీభావములు యింకను భూమిపై నిలచి ఉన్నవి ! కాటన్‌దొర నిలువెత్తు రాతి విగ్రహము ధవిళేశ్వరమున, ఆనకట్ట ఒడ్డున స్థాపించబడింది.

తెలుగు సామెతల సేకరణ కెప్టెన్ యం. డబ్ల్యు కర్ అను పాశ్చాత్యుడు, తెలుగు భాషను బాగుగా నెరిగినవాడై, తెలుగులోగల 2708 సామెతలను, 483 సంస్కృత లోకోక్తులను సేకరించి ముద్రింపించెను. మున్ను ఎవ్వరును ఈ కృషి సల్పలేదు. సేకరించిన సామెతలకు ఆంగ్ల తర్జుమాను, ఆంగ్లము, ఫ్రెంచి, ఇటాలియన్, గ్రీకు, జర్మనీ, స్పెయిను, భాషలలో సమానార్థకములుగల సామెతలను కూడ వాటితో కలిపి ముద్రింపించెను. దీనిని ఆతడు" ఆంధ్ర లోకోక్తి చరిత్ర'' అను పేర 1869 లో ప్రకటించగా, 1955 వ సంవత్సరమున, వావిళ్ళ వారు, కర్ పేరు మీద, 1185 తెలుగు సామెతలను, 32 సంస్కృత లోకోక్తులను. అకారాదిగా, ముద్రింపించి ప్రకటించిరి. కర్ కృషివలన తెలుగు సామెతలలోని అర్థము అన్య దేశీయులకు తెలిసినది.

తెలుగు చరిత్ర రచన. కల్నల్ మెకంజీ. (1764-1821)

కల్నల్ మెకంజీ

మన ప్రాచీనులు మహా పండితులు. కాని వారికి చారిత్రిక దృష్టి తక్కువ. వారు దేశమున జరుగుచున్న రాజకీయ విషయములను వ్రాసి పొందుపర్చుటకాని, చరిత్ర రచనకు కావలసిన సామగ్రిని కాని పొందుపర్చలేదు. పురాణములలోని చారిత్రిక అంశములు కేవలము కావ్యదృష్టితో మాత్రమే వ్రాయబడినవి. అందుచే వాటిని యథార్థములుగా గ్రహించుటకు సాధ్యము కానిదగుచున్నది, చరిత్ర కేవలము, నెపోలియను మహాశయుడు చెప్పినట్లు కల్పిత కథ మాత్రమే కాగలదు (What is history but a fable agreed upon). ఈ కొరతను తీర్చినవాడు కల్నల్ మెకంజీ దొర. ఈతడు ఈస్టు ఇండియాకంపెనీ ఉద్యోగిగా, మద్రాసు నుండి నెల్లూరు మీదుగా, ఒంగోలునకు దత్తమండలములను కలుపుచు, రహదారులు వేయుటకు, కావలసిన మ్యాపులు తయారు చేయుటకు 'సర్వేయరు'గా నియుక్తుడయ్యెను. ఈ నియామకము బహుశః భగవత్ ప్రేరణమేమో! ఈ కార్య నిర్వహణము నందు ఆతడు గ్రామాధికారుల రికార్డులు చూడవలసిన అవసరము ఏర్పడినది. ఈ అవసరమే ఆతనిని చరిత్ర రచనకు కావలసిన సామగ్రిని ప్రోగు చేయించినది. గ్రామాధికారుల రికార్డులకు కైఫీయతులని పేరు. వీటిలో సమకాలీన రాజకీయ పరిణామములు వ్రాయబడినవి. మెకంజీ, ఈ కైఫీయతుల నకళ్లు తయారు చేయించెను. ఈతనికి కావలి బొర్రయ్య, రామస్వామి, నారాయణస్వామి, లక్ష్మయ్య, అను నలుగురు బ్రాహ్మణ సోదరులు మిత్రులై, ఈతని కృషికి తోడ్పడిరి అందు బొర్రయ్య, దొరకు మరింత సన్నిహితుడాయెను. కాని బొర్రయ్య 1803,లో తన 27 వ ఏట ఈశ్వర సాయుజ్యము నొందెను. అయినను, దొర, ఆతనియందుగల అవ్యాజ ప్రేమచేత మద్రాసులో, ఆతడు నిర్యాణము చెందిన స్థలమున ఒక రాతి ఫలకమును వేయించి, తన అభిమానము ప్రకటించెను. అంతేకాక, బొర్రయ్య సోదరులకు, అన్ని విధముల సహాయము చేసి, తనతోనే ఉంచుకొనెను. బొర్రయ్య సాధించిన పరిశోధనలను, రాయల్ ఏషియాటిక్ సొసైటీవారి మ్యాగజైనులో, ప్రకటించెను. మెకంజీ కైఫీయతులను, కొన్ని, ఆం॥ ప్ర॥ సా॥ అకాడమీ ముద్రించెను.

విదేశీయుల పండిత ఆదరణ. కావలి సోదరులను, తనవారిగా మెకంజీ దొర చూసుకొని, వారికి అనేక విధముల సహాయము చేసి, వారిచే, తెలుగుభాషా సాహిత్యములకు, చరిత్రకు, క్రొత్త వెలుగులు సృషించెను.

రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు రచించిన ఒక తెలుగు వ్యాకరణమును, ఏ. డి. క్యాంపు బెల్‌దొర అంకితముగా గైకొనెను. శాస్త్రిగారు, సి. పి. బ్రౌను యిత్యాది పాశ్చాత్యులందరికి గురువు. బ్రౌనుదొరకు శాస్త్రిగారి యెడల అపారమైన గౌరవము

జూలూరు అప్పయ్య శాస్త్రిగారు, వద్దె అద్వైత బ్రహ్మ శాస్త్రులవారు, బ్రౌనుదొరకు సన్నిహితులైన విద్వత్ శిఖామణులు.

ఏనుగుల వీరాస్వామిగారు, బ్రౌనుదొరకు, ఉద్యోగరీత్యా, సన్నిహితుడైన సాహితీ ధురంధరుడు. బ్రౌనుచే బహువిధములుగా గౌరవింపబడి శ్లాఘింపబడినాడు.

బ్రౌను కళాశాలలో, పైగ్రపండితులతో పాటు, కంభం నరసింహాచార్యులు, పయిడిపాటి వేంకట నర్సయ్య, మల్లంపల్లి మల్లికార్జున శాస్త్రి, తాతాచార్యులు ప్రముఖులు. "The Telugus are a people quite as highly civilized as any in Europe, occasionally their modes of speech resemble those of Italy." అని బ్రౌనుదొర తెలుగువారిని గూర్చి పలికిన పలుకులు ఆణి ముత్యములు.

నవీన వచన రచనకు భగీరథుడైన పరవస్తు చిన్నయ (1806-62) కు సూరి బిరుదునిచ్చి, ఆతనిలోని ప్రతిభను దర్శించినవాడు, ఏ. జి. ఆర్బత్‌నాటు అను దొర. ఈ దొరకు చిన్నయ సూరి కృతజ్ఞతాపూర్వకముగా తన నీతి చంద్రికను అంకితమిచ్చెను.

నవయుగ వైతాళికుడగు కందుకూరి వీరేశలింగము పంతులుగారు, తమచే రచింపబడిన "రాజ శేఖర చరిత్ర" అను నవలను ఆనాడు, మద్రాసు రాష్ట్ర విద్యాధికారి అయిన కల్నల్ మెకంజీ మెక్డొనాల్డుకు అంకిత మిచ్చుచు "as a Small token of esteem for the good he has done to the Telugu country." అని వ్రాసినారు. రాజశేఖర చరిత్ర ఆంగ్లమునకు తర్జుమా కాబడి Fortune's wheel పేర కీర్తి కాంచెను. ఈ ఆంగ్లానువాదమునకు మెక్డొనాల్డు పీఠిక వ్రాసెను.

H. R. బ్రాడ్డువెల్ అనే I. C. S. దొరకు, కీ. శే. ఆదిభట్ల నారాయణదాసుగారి యెడల అమితమైన ప్రేమ. తెలుగు మాట, పాట అంటే దొరకు చెప్పలేని అభిమానము. దాసుగారి బహుముఖ ప్రజ్ఞను శ్లాఘించి, సంగీతములో, నోబిల్ బహుమతి గ్రహించవలసిన వాడవని పలుకుతూ, దొర" I believe tha prize is awarded to some one of world wide fame and you can really claim to have that." అనెను. దొర, దాసుగారికి అనేక విధముల తోడ్పడెను.

అడవి బాపిరాజు, కవికొండల వేంకటరావు గార్లలోని ప్రతిభకు నీరాజన మందించి, ప్రోత్సహించిన ఘనత, రాజమండ్రి కళాశాల ప్రిన్సిపాల్ అగు సర్ అస్వాల్డు కూల్డ్రేకు దక్కుతుంది. వీరిలోగల శక్తి యుక్తులను గ్రహించిన కూల్డ్రే వారిచే కలము పట్టించి రాయించెను.

వైద్య విజ్ఞాన శాస్త్ర విషయాలు బోధించడానికి భారతీయ భాషలన్నింటిలో తెలుగే అనువైనదని ప్రకటించిన ఘనత జె. బి. యస్. హాల్డేన్‌కు దక్కుతుంది.

దాదాబాయి నౌరోజీ మహాశయుడు ...."The natives of India are not below the average of the head and heart of any other nation in the world....The fertile soil is there, but neglected. Let it have its proper cultivation and it will again show the same fruit..." అని నుడివినాడు.


దాదాభాయి కోరిన ప్రోత్సాహమును పలువురు విదేశీయులు తెలుగువారి కందించి తెలుగు వారు మరచిపోలేని విదేశీయులైనారు.

అనిబిసెంటుఅమ్మ : ఇంగ్లాడులో జన్మించి, భారతదేశానికి వచ్చి భారతీయ సంస్కృతి వికాసమునకు తన సర్వస్వమును ధారపోసిన సహృదయురాలని అనిబిసెంటు అమ్మ. భారత స్వాతంత్ర్యము కొరకు పోరాడినది. 1917 లో కలకత్తాలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించినది. అనిబిసెంటమ్మకు, గాంధీజీ, మాలవ్యా, తిలక్, గోఖలే, ఆనందాచార్యులు, తేజ్ బహద్దూర్ సప్రూ జిన్నా, వంటి దేశీయ నాయకులందరు మిత్రులు. మన తెలుగు వారిలో ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావు పంతులుగారు ఆమెకు చాల సన్నిహితులు. కీ. శే. టంగుటూరి ప్రకాశంపంతులు తమకు దివ్యజ్ఞాన సమాజముతోను అనిబిసెంటమ్మతోడనుగల సన్నిహితమును గూర్చి..."ఇలాంటి స్థితిగతులలో అంతకు ముందు సాంఘిక మత విషయాలలో మాత్రమే పనిచేస్తూ, దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలైన బిసెంటమ్మ కూడ రాజకీయరంగములోనికి ఉరికింది .. .. బిసెంటమ్మ ఆందోళన నన్ను బాగా ఆకర్షించినది. నేను అరండేలు, వాడిమాల మోస్తారుగా ఆమె అంతరంగికుల్లోగాని, సి.పి రామస్వామి అయ్యరు గారి వంటి అభిమానుల వర్గంలోకాని ఎప్పుడూ చేరలేదు."......అని వ్రాశారు బిసెంటమ్మను తెలుగువారు మరువలేక పోవుటకు కారణము ఆమె పెంచి పెద్ద చేసిన జిడ్డు కృష్ణమూర్తి. ప్రపంచ ఖ్యాతిగాంచిన దివ్యజ్ఞాన సమాజ నాయకుడు. వక్త, ఋషి. జ్ఞాని

జిడ్డు నారాయణయ్యగారు, తహసిల్దారుగా పనిచేసి, రిటైరై మద్రాసులోని అడయారులో కాపురముండిరి. వారు అనిబిసెంటమ్మ స్థాపించిన దివ్యజ్ఞాన సమాజమున సభ్యులు, వారికి కృష్ణమూర్తి, నిత్యానందము అని యిద్దరు కుమారులు. ఇద్దరు బాల్యము నుండి మహామేధావులు, ఏకసంధాగ్రాహులు, సూక్ష్మజ్ఞాన నిలయాలు వారి మస్తిష్కాలు. శాస్త్రము, సాహిత్యము, కళ, కవిత, వారికి పంటబట్టిన విద్యలు. నారాయణయ్య సాధారణ సంసారి అందుచే తన కుమారులకు విశేషమైన విద్య నేర్పించలేని స్థితిలో ఉన్నాడు. బిసెంటమ్మకు పిల్లల యెడల ఆదరము కలిగి వారిని తన వారిగా చేసుకొనదలచి, నారాయణయ్య దగ్గర నుండి వారిని పొంది, ఇంగ్లాడులో, ఆక్సుఫర్డు విశ్వవిద్యాలయములో ఉన్నత విద్య నేర్పుచుండెను ఇంతలో చెప్పుడు మాటలు విని నారాయణయ్య, తన కుమారులను తనకు అప్పజెప్పమని అనిబిసెంటమ్మను కోరగా, ఆమె తిరస్కరించెను. దానిపై నారాయణయ

(తరువాయి 40 పేజీలో)

ఆంధ్ర ప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి



శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

తెలుగులో మొదటి టాకీ 1931లో వెలువడింది. అది శ్రీ కృష్ణా పిక్చర్స్ బ్యానర్ పై శ్రీ హెచ్.ఎమ్. రెడ్డి దర్శకత్వాన నిర్మించబడిన "భక్త ప్రహ్లాద". దానిలో ముఖ్య నటవర్గం మునిపల్లె సుబ్బయ్య, సురభి కమలాబాయి.

అంతకు పూర్వపు నిశ్చలన చిత్రాలయుగం నుంచి చలన చిత్రాలయుగంలోకి అడుగు పెట్టినప్పుడే చలనచిత్ర పరిశ్రమలో విప్లవం ప్రారంభమైనది; ఆ తరువాత మూకీ చిత్రాలనుంచి టాకీ చిత్రాలు ప్రారంభంకాగానే మరొక విప్లవం.

ఆ మొదటి రోజులలో తెలుగులో సంవత్సరానికి ఎన్నో చిత్రాలు వెలువడేవి కావు. మొదటి సంవత్సరంలో ఒకే ఒక చిత్రం 1932లో రెండు; 1933 వచ్చేసరికి ఈ సంఖ్య ఆరింటికి పెరిగింది. అంతేకాదు. ఒకేకథతో పోటాపోటీలుగా చిత్రనిర్మాణానికి కూడా అప్పుడే అంకురార్పణ జరిగింది. 1933లో రెండు "రామదాసు"లు రెండు "సావిత్రి"లు నిర్మించబడ్డాయి. ఆ తరువాత క్రమక్రమంగా సాలీనా చిత్రాలసంఖ్య పెరుగుతూ వచ్చింది. ద్వితీయ ప్రపంచ యుద్ధం ప్రారంభమైన తరువాత 1942 వరకు కూడా మద్రాసులో తెలుగు చిత్రాల నిర్మాణం బాగానే సాగింది.

భారత దేశ చలనచిత్ర పరిశ్రమ చరిత్రకు, తెలుగు చలనచిత్ర పరిశ్రమ చరిత్రకు మధ్య దూరంలేదు. భారతదేశంలో టాకీల చరిత్ర ప్రారంభమైనప్పుడే తెలుగు టాకీల చరిత్రకూడా ప్రారంభమైనది

యుద్ధ కాలంలో...

అయితే, యుద్ధకాలంలో ఏర్పడిన పరిస్థితులవల్ల 1943, 1944, 1945 సంవత్సరాలలో మన చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. తిరిగి 1946 నుంచి ఆ సంఖ్య క్రమక్రమంగా పెరగసాగింది. ఇప్పుడు సంవత్సరానికి మొత్తం తెలుగు చిత్రాల సంఖ్య 70. అంతకు పైబడి కూడా వుంటున్నది

ఈ విధంగా మద్రాసులో తెలుగు చలన చిత్రాల నిర్మాణం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతూ వచ్చింది. ఇంతలో 1956లో ఆంధ్రప్రదేశ్ అవతరించిన తరువాత తెలుగు చలనచిత్ర చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమైనది.

చిత్ర పరిశ్రమకు సంబంధించిన పన్నులు, నిర్మాణ వ్యయానికి సంబంధించి అటు ప్రభుత్వానికి, ఇటు చిత్ర నిర్మాణ ప్రదేశంలోని ప్రజలకు ఎంతో ఆదాయం వస్తుంది. అయిదారు కోట్ల రూపాయల పెట్టుబడిగల ఈ పరిశ్రమ రాష్ట్రేతర ప్రాంతంలో వుండడంకంటె రాష్ట్రంలో అభివృద్ధి కావడం వాంఛనీయమన్న అభిప్రాయం చాలామందికి కలిగింది.

హైదరాబాద్ చిత్రనిర్మాణానికి అనువైన స్థలమన్న విషయంలో సందేహంలేదు. సువిశాలమైన, ఆకర్షణీయమైన తటాకాలు, బ్రహ్మాండమైన భవనాలు, ప్రకృతి సౌందర్యం వెల్లివిరిసే రమణీయమైన పరిసరాలు, ఆధునికమైన సౌకర్యాలన్నీగల ఈ నగర రాజ్యాన్ని చిత్రనిర్మాణ కేంద్రంగా రూపొందించాలన్న కోర్కె చాలామందికి కలిగింది.

సారథి స్టూడియో అవతరణ

ఈ సందర్భంలో ముందుగా అభినందనీయులు శ్రీ వై. రామకృష్ణ ప్రసాద్, శ్రీ సి.వి. ప్రసాద్. చిత్ర నిర్మాణానికి కావలసిన మొదటి హంగు స్టూడియో. అందువల్ల, ఈ ప్రసాద్ద్వయం 1956లో — ఆంధ్రప్రదేశ్ అవతరించిన సంవత్సరంలోనే — హైదరాబాద్‌లో స్టూడియో నిర్మాణానికి ఉద్యమించారు. వీరి దూరదృష్టి ప్రశంసనీయమైనది. విజ్ఞతతో ఆనాడు వీరు వేసిన పునాదులపైనే నేడు ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమాభివృద్ధి కొనసాగుతున్నది.

హైదరాబాదులోని అమీర్‌పేటలో పదకొండున్నర ఎకరాల స్థలంలో నిర్మించిన సారథి స్టూడియోలో నిర్మించిన మొదటి తెలుగుచిత్రం "మా ఇంటి మహాలక్ష్మి". 1958 నుంచి ఈ స్టూడియో పనిచేయడం ప్రారంభించింది. అప్పటినుంచి ఈ స్టూడియోలో ఎన్నో చిత్రాలు నిర్మించబడ్డాయి. కొన్ని తెలుగేతర చిత్రాలు కూడా ఇక్కడ నిర్మించబడ్డాయి.

అజంతా స్టూడియో

ఆంధ్రప్రదేశ్ అవతరించిన పది సంవత్సరాలకు హైదరాబాద్‌లో సదరన్ మూవీటోన్ ఉన్న మరొక స్టూడియో ఏర్పడింది. 1966లో ప్రారంభమైన ఈ స్టూడియోను శ్రీయుతులు జి. కృష్ణారెడ్డి, జి. రామకృష్ణారెడ్డి, జి. సీతారామరెడ్డి తీసుకుని, దీనికి "అజంతా స్టూడియోస్" అని పేరు మార్చారు. దీనిలో "రహస్యం" వంటి భారీ వర్ణచిత్రం, కొన్ని కన్నడ, మలయాళ చిత్రాలు నిర్మించబడ్డాయి.

హైదరాబాద్‌లో అక్కినేని

అయితే, ఎంతకృషిచేసినా, ఎందరికి సానుభూతివున్నా, హైదరాబాద్‌లో చిత్ర నిర్మాణాభివృద్ధి కృషికి కొన్ని అంతరాయాలు వున్నాయి. నటీనటులు, సాంకేతిక నిపుణులు, జూనియర్ ఆర్టిస్టులు అందరు మద్రాసునుంచే రావాలి. ఇది ఎంతో వ్యయకారకం శ్రమతో కూడిన పని. చిత్ర నిర్మాతలలో ఇది కొంత నిరుత్సాహాన్ని కలిగించింది. ఈ పరిస్థితులలో ప్రముఖ నటుడు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు మద్రాసునుంచి తన మకాంను హైదరాబాదుకు మార్చడం తెలుగు చలనచిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలింపు కృషిలో ఒక ముఖ్యమైన పరిణామం. ఇది చలనచిత్ర లోకంలో కొంత సంచలనాన్ని కలిగించింది.

హైదరాబాదులో చిత్రపరిశ్రమాభివృద్ధికి శ్రీ నాగేశ్వరరావు ప్రభుత్వానికి ఎన్నో సూచనలు చేశారు. ఎన్నో అవరోధాలను అధిగమించి, చలనచిత్ర పరిశ్రమ రాష్ట్రంలో అభివృద్ధి చెందవలెనంటే, కేవలం ప్రయివేటురంగం కృషి మాత్రమేకాక, ప్రభుత్వ ప్రోత్సాహం, తోడ్పాటుకూడా అవసరమని భావించబడింది. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాదులో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధికి ఎన్నో చర్యలు తీసుకున్నది. సారథి స్టూడియోకు ప్రభుత్వం ఋణసహాయం చేసింది.

అన్నిటికంటె ముఖ్యవిషయం—హైదరాబాదులో నిర్మించిన ఏ భాషా చిత్రానికైనా 50 వేల రూపాయల సబ్సిడీని యివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించింది. ఇది చిత్ర నిర్మాతలకు ఎంతో ప్రోత్సాహాన్ని కల్పించింది. హైదరాబాదులో చిత్ర నిర్మాణానికి ఎందరో నిర్మాతలు ముందుకు వచ్చారు.

"నంది" అవార్డులు

అంతేకాదు—రాష్ట్రంలో నిర్మించే తెలుగు చిత్రాలకు ప్రభుత్వం బహుమతులనిచ్చే పథకాన్నికూడా 1964లో ప్రారంభించారు. ఈ పథకం క్రింద ప్రతి సంవత్సరం ఉత్తమ తెలుగు చిత్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులక్రింద స్వర్ణ, రజత, కాంస్య నందుల బహూకృతితోపాటు నగదు బహుమతి కూడా యివ్వడం జరుగుతున్నది. ఈ రెండు చర్యలు రాష్ట్రంలో చిత్ర నిర్మాణానికి ప్రోత్సాహం కల్పించాయి.

చలనచిత్ర సదస్సు

అయితే, ఎన్ని చర్యలు తీసుకున్నా, రాష్ట్రంలో చిత్ర నిర్మాణం అనుకున్నంతగా అభివృద్ధి కాకపోవడం నిరుత్సాహాన్ని కలిగిస్తూవచ్చింది. అందువల్ల హైదరాబాదులో చిత్ర నిర్మాణాభివృద్ధికి గైకొనదగు మరికొన్ని చర్యలను సూచించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం 1967 డిసెంబరులో హైదరాబాద్‌లో చలనచిత్ర సదస్సును ఏర్పాటుచేసింది. దీనిలో చిత్ర నిర్మాతలు, సాంకేతిక నిపుణులు, నటీనటులు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగిన ఆ సదస్సు రాష్ట్రంలో చిత్రపరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వానికి ఎన్నో సూచనలు చేసింది.

దురదృష్టవశాత్తు, ఇంతలో 1969లోను, తిరిగి 1972-73 లోను రాష్ట్రంలో రెండు వేర్పాటు ఉద్యమాలు రావడంతో హైదరాబాద్‌లో చిత్రనిర్మాణాభివృద్ధి కృషి కొంతవరకు దెబ్బతిన్నది. రాష్ట్ర భవిష్యత్తు సందేహాస్పదమైన స్థితిలో పడినప్పుడు రాష్ట్రంలో ఇతర పరిశ్రమల అభివృద్ధి కృషితోపాటు చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి కృషికూడా కుంటుపడింది. ఒక దశలో ఇక ఈ రాష్ట్రంలో చిత్రపరిశ్రమాభివృద్ధి గగనకుసుమమేనన్న నిస్పృహ కూడా చాలా మందికి ఏర్పడింది.

మళ్ళీ కొత్త శకం

ఆ పరిస్థితులలో 1973 డిసెంబర్‌లో శ్రీ వెంగళరావు ప్రభుత్వం ఏర్పడింది. ఇది రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి చరిత్రలో ఒక ఉజ్వలమైన అధ్యాయానికి ప్రారంభం. సమస్యల స్వరూప స్వభావాలను ఇట్టే ఆకళింపు చేసుకుని, వాటికి పరిష్కార మార్గాలను కనిపెట్టి, వెంటనే వాటిని సమర్థంగా, ఆచరణలో పెట్టగల నేర్పు ఈ కొత్త ముఖ్యమంత్రి సొత్తు.

శ్రీ వెంగళరావు ముఖ్యమంత్రి కాగానే చిందర వందరగా వున్న ఇతర క్లిష్ట సమస్యలతోపాటు రాష్ట్రంలో చిత్రపరిశ్రమాభివృద్ధి సమస్యను కూడా—శ్రద్ధాసక్తులతో పరిశీలించారు. ముఖ్యంగా 50 వేల రూపాయల సబ్సిడీ ఏనాడో పది సంవత్సరాల క్రితం—1964లో—ప్రవేశపెట్టినది. ఆ తరువాత ధరలతోపాటు చిత్ర నిర్మాణ వ్యయంకూడా ఎంతో పెరిగిపోయింది. అందువల్ల చిత్ర నిర్మాతల విజ్ఞప్తులను పురస్కరించుకుని సబ్సిడీని 50 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచడానికి 1974 మేలో ముఖ్యమంత్రి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. ఇది రాష్ట్రంలో చిత్రనిర్మాణాభివృద్ధి కృషిలో పెద్ద ముందడుగు. ఇందువల్ల, చిత్ర నిర్మాతలలో కొత్త ఉత్సాహం, ఆశలు ప్రాదుర్భవించాయి.

రాష్ట్రంలో చిత్రపరిశ్రమాభివృద్ధిని సాధించాలని గట్టిగా పట్టుబట్టిన శ్రీ వెంగళరావుకు తన ఆలోచనలను ఆచరణలో పెట్టగలిగిన సమర్థుడైన, సత్వర నిర్ణయాలు చేయగలిగిన పరిపాలనాదక్షుడు సమాచార శాఖాధినేతగా కావలసి వచ్చారు. 1974 సెప్టెంబరులో ఆయన తన మంత్రివర్గ పునర్నిర్మాణం చేసినప్పుడు సమాచార శాఖను, ఆర్థిక శాఖను శ్రీ పిడతల రంగారెడ్డికి అప్ప

గించడం అందరికీ, ముఖ్యంగా రాష్ట్రంలో చిత్రపరిశ్రమాభివృద్ధిని కోరేవారందరికీ ఆనందం కలిగించింది.

ఈ సందర్భంలో మరొక విశేషం కూడా వుంది. అటు ఆర్థిక శాఖకు, ఇటు సమాచార శాఖకు కూడా శ్రీ రంగారెడ్డి మంత్రి అయినందువల్ల సమాచారశాఖ మంత్రిగా తాను చేసిన ఆలోచనను ఆర్థిక మంత్రిగా ఆచరణలో పెట్టగలిగే అవకాశం కూడా ఆయనకే లభించింది.

సమాచార శాఖ మంత్రికాగానే శ్రీ రంగారెడ్డి చిత్రపరిశ్రమకు సంబంధించిన ప్రముఖులందరినీ కలుసుకుని, వారితో చిత్రపరిశ్రమ సమస్యలను గురించి కూలంకషంగా చర్చించి, వాటిని ఆకళింపు చేసుకున్నారు. శ్రీరంగారెడ్డి సారథ్యంలో సమాచార శాఖ తీసుకున్న సత్వర చర్యల ఫలితంగా రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి ఇక సుసాధ్యం కాగలదన్న ఆశాభావం అందరిలో కలిగింది

అది వరకు రాష్ట్రంలో నిర్మించే చిత్రాలకిచ్చే సబ్సిడీని చిత్రనిర్మాతలకు చాలా ఆలస్యంగా యివ్వడం జరిగేది. అది చిత్ర నిర్మాతలకు సహజంగానే అసంతృప్తి కలిగించేది. ఇప్పుడు ఆ పరిస్థితి తొలగిపోయింది. విడుదల కాని చిత్రాలకు సయితం— అవి ఇతర షరతులను సంతృప్తి పరచినప్పుడు— వాటికి సబ్సిడీలను వెంటనే యివ్వడం జరుగుతున్నది. ఇది చిత్రనిర్మాతలకు ఉత్సాహాన్ని కలిగిస్తున్నది. సబ్సిడీలివ్వడంలో ఆలస్యం జరిగే అవకాశాన్ని నివారించే నిమిత్తం సబ్సిడీకోసం వచ్చే చిత్రాలను త్వరగా చూడానికి ప్రత్యేకంగా ఒక కమిటీని నియమించడం జరిగింది. మొన్నటి వరకు ఈ పనికూడా ఫిలిం అవార్డుల కమిటీయే చూచేది. ఇప్పుడు ఈ ప్రత్యేకకమిటీకి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అధ్యక్షులు. మొన్న ఆగస్టువరకు మొత్తం 79 చిత్రాలకు సబ్సిడీ యివ్వటం జరిగింది. ఈ మొత్తం 45 లక్షల రూపాయలు.

అలాగే లోగడ ఫిలింఅవార్డుల ప్రదానం కూడా రెండు, మూడు సంవత్సరాలు పేరుకు పోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి తొలగిపోయింది. 1973,1974 సంవత్సరాల అవార్డులను కిందటిసంవత్సరం ఆరు నెలల వ్యవధిలో రెండు ఉత్సవాలను జరిపి, ప్రదానం చేయడం జరిగింది. (1975 మార్చి30, అక్టోబర్ 14) 1975 చిత్రాలను శ్రీ పి. జగన్మోహన రెడ్డి అధ్యక్షులుగా గల కమిటీచూడ్డం పూర్తి చేసింది. ఉత్తమ చిత్రాల పేర్లను ప్రకటించడం జరిగింది. ఈ నెలలోనే వీటికి బహుమతుల ప్రదానోత్సవంకూడా జరుగుతున్నది. ఈ సందర్భంలో మరొక విశేషం కూడావున్నది. 1964లో ఈ అవార్డులను ఏర్పాటు చేసినప్పటినుంచి వాటి ప్రదానోత్సవం హైదరాబాద్‌లోనే జరుగుతూ వచ్చింది. కాని యీసారి యీఉత్సవం విజయవాడలో జరుగుతున్నది. గత డిశంబర్ 14వ తేదీన విజయవాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ ఫిలింఫాన్స్ అసోసియేషన్ రజతోత్సవాల సందర్భంలో ఆర్థిక, సమాచార శాఖమంత్రి శ్రీ రంగారెడ్డి సాహసోపేతమైన ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. ఇంత వరకు సాగుతున్న ఒరవడిని మార్పించి, ఒక కొత్త నిర్ణయాన్ని చేయగలగడం పరిపాలనాదక్షునికేతగు. ఇదివరకు అంటే 1975 మార్చివరకు ఈ ఉత్సవాలు వెయ్యి, పన్నెండు వందలమంది ప్రేక్షకుల కంటే హెచ్చుమంది పట్టని ఒక హాలులో జరుగుతుండేవి. మొదటిసారిగా ఈ బహుమతుల ప్రదానోత్సవం 1975 అక్టోబరు 14వ తేదీ విజయదశమి నాడు హైదరాబాదులోని లేడీహైదరీక్లబ్ ఆవరణలో "ఓపెన్ ఎయిర్"లో జరిగి, హెచ్చుమంది ప్రేక్షకులు తన అభిమాన చలనచిత్ర కళాకారులను చూచే అవకాశం కలిగింది.

అవార్డుల నగదు బహుమతుల రెట్టింపు

అంతేకాదు—ఈ అవార్డుల విషయంలో మరొక చెప్పుకోదగిన విషయం వుంది. నందిఅవార్డుల నగదుబహుమతుల మొత్తాలు ఎప్పుడో 1964లోనిర్ణయించ బడ్డాయి. అవి చాలా చిన్నమొత్తాలుగా వుండేవి. సబ్సిడీని చేసినట్టే వీటిని 1974 వ సంవత్సరం అవార్డుల నుంచి రెట్టింపు చేయడం జరిగింది. ఉదాహరణకు, లోగడ ఉత్తమ ప్రథమ చిత్ర నిర్మాతకు పది వేల రూపాయల నగదు బహుమతి యిచ్చేవారు. ఇప్పుడిది 25 వేల రూపాయలకు పెరిగింది; లోగడ ఉత్తమ ప్రథమ చిత్ర దర్శకునికి అయిదు వేల రూపాయలిచ్చే వారు; ఇప్పుడది పది వేలకు పెంచబడింది లోగడ ద్వితీయ ఉత్తమ చిత్ర నిర్మాతకు నగదు బహుమతి అయిదు వేల రూపాయలు వుండేది. ఇప్పుడది పదివేలకు పెంచబడింది. అలాగే తృతీయ బహుమతి చిత్ర నిర్మాతకు లోగడ రెండువేలు; ఇప్పుడు అయిదు వేలు. ఉత్తమ రచయితకు లోగడ వెయ్యి రూపాయలే నగదు బహుమతి; ద్వితీయ ఉత్తమ రచయితకు అయిదు వందల రూపాయలే. ఇప్పుడివి వరుసగా అయిదువేలు, రెండు వేల రూపాయలకు పెంచ బడ్డాయి. ఇందువల్ల, చిత్ర నిర్మాతలు, దర్శకులు, రచయితల దృష్టిలో అవార్డుల విలువ పెరిగింది. ఈ చర్యల వల్ల చిత్ర పరిశ్రమ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతటి శ్రద్ధాసక్తులు కలవో చిత్ర పరిశ్రమలోని వారికి అర్థమైనది.

చలన చిత్ర అభివృద్ధి సంస్థ

రాష్ట్రంలో చిత్ర పరిశ్రమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం గైకొన్న చర్యలన్నింటికి 1975 అక్టోబర్ 14 వ తేదీన అవతరించిన ఫిలిండెవలప్‌మెంటు కార్పొరేషన్ నిర్మాణం తలమానికమైనది. దీనితో రాష్ట్రంలో చిత్ర పరిశ్రమాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని, వట్టి కబుర్లు చెప్పడం లేదన్న విశ్వాసం చిత్ర పరిశ్రమలోని వారికి గట్టిపడింది. వినోదం పన్నులో నూటికి ఏడు వంతుల మొత్తాన్ని కేటాయించడం ద్వారావచ్చే మొత్తం పెట్టుబడిగా ఈ ఫిలిండెవలప్‌మెంటు కార్పొరేషన్‌ను రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి అనుమతించబడిన మూలధనం కోటి రూపాయలు. 20 లక్షల రూపాయల పెట్టుబడితో ఇది ప్రారంభమైనది. స్టూడియోల నిర్మాణానికి సహాయం చేయడం దగ్గరనుంచి సెమీపెర్మనెంటు థియేటర్ల నిర్మాణానికి సహాయం చేయడం వరకు ఈ కార్పొరేషన్ ఆశయ లక్ష్యాలు విస్తృతమైనవి; బహుముఖమైనవి.

ఈ కార్పొరేషన్ అవతరణ చిత్రసీమలో ఎన్నో క్రొంగ్రొత్త ఆశలను, ఉత్సాహాన్ని చిగురింప జేసింది. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ ఉత్సాహ పూరితమైన వాతావరణానికి ఉత్తేజితులై

ప్రముఖనటులు శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీ ఎన్. టి. రామారావు తాము హైదరాబాద్‌లో ఫిలింస్టూడియోలను నిర్మించ గలమని ముందుకు వచ్చారు. వారితో శ్రీ నాగేశ్వరరావు నిర్మించిన అన్నపూర్ణ స్టూడియోకు కూ 24.7 లక్షలు, శ్రీ రామారావు నిర్మించిన రామకృష్ణ సినీస్టూడియోకురూ 25 లక్షలు ప్రభుత్వం ఋణసహాయం చేసింది. ఈ రెండు స్టూడియోలు ఈ యేడాది పని ప్రారంభించాయి. బంజారాహిల్స్‌పై నిర్మించిన తన స్టూడియోను అత్యంత ఆధునికమైనదిగా రూపు రేఖలు దిద్దాలని శ్రీ నాగేశ్వర రావు అభిప్రాయం. అలాగే తమ స్టూడియోను మరింతగా అభివృద్ధి చేయాలని శ్రీరామారావుకు పథకాలు వున్నాయి.

మరి కొన్ని స్టూడియోలు

ఇంకా ప్రముఖ నిర్మాత—దర్శకుడు శ్రీ ఎల్. వి. ప్రసాద్ కూడా హైదరాబాద్‌లో స్టూడియో నిర్మించాలని యత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. గుంటూరు జిల్లావద్ద మంగళగిరిలో స్టూడియో నిర్మించాలని ప్రముఖ నటుడు శ్రీ కృష్ణ సంకల్పం; విశాఖపట్నం వద్ద స్టూడియో నిర్మించాలని శ్రీ కె. ఏ. ప్రభాకర్, శ్రీబాబూరావు సోదరుల అభిలాష; ఇంకా ఒకరిద్దరు హైదరాబాద్‌లో స్టూడియో లను నిర్మించాలని తల పోస్తున్నట్టు వినికిడి.

మరొక ముఖ్యవిషయం—సినిమా థియేటర్ల నిర్మాణంలో సహాయం చేయడానికి ఫిలిండెవలప్‌మెంటు కార్పొరేషన్ ముందుకు రావడం. హాలు నిర్మాణ వ్యయం ఆరు లక్షలకు మించకూడదు ఇందులో మూడు లక్షలను కార్పొరేషన్ ఋణంగా యిస్తుంది.

మనకు సినిమా హాల్సు కావలసినంతగా లేవు. ఇంకా ఎన్నయినా సినిమా హాల్సు మనకు అవసరమే. ఫిలిండెవలప్‌మెంటు కార్పొరేషన్ చేసే సహాయంతో మన పట్టణాలలోను, గ్రామ ప్రాంతాల లోను థియేటర్ల కొరత క్రమంగా తీరగలదని ఆశించవచ్చు. అలాగే ఆడిటోరియంల నిర్మాణానికి కూడా ఈ కార్పొరేషన్ సహాయం చేయడం గమనార్హం.

దీన్నిబట్టి చూస్తే, భారత దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం తన ఫిలిం పరిశ్రమకు ఇంతగా సహాయం చేయడం లేదని చెప్పడం అత్యుక్తి కానేరదేమో! అనూహ్యమైన ఈ మార్పు అపూర్వమైన ఈ వాతావరణం రాష్ట్రంలో చిత్ర పరిశ్రమాభివృద్ధి ప్రభుత్వ కృషి చరిత్రలో "వెంగళరంగా" శకం ప్రారంభమైన గత రెండు సంవత్సరాలలోనే వచ్చిందనడం నిర్వివాదం.

రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం సుస్థిరమైన, లోతయిన పునాదివేసింది. ఈ పునాదిపై అందమైన, ఆధునికమైన, ఆరోగ్యకరమైన సుస్థిరమైన చలన చిత్ర పరిశ్రమ సౌధాన్ని నిర్మించడం పరిశ్రమలోని వారి కర్తవ్యం. ఇక రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధి కాకపోతే, అది ప్రభుత్వ లోపం కాలేదు, పరిశ్రమలోపం.

ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాలను చిత్ర పరిశ్రమ అన్నివిధాలా వినియోగించుకోవాలి రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ సుస్థిరం కావాలంటే, ఆ పరిశ్రమకు అనుబంధంగా వుండే హంగు లన్నీ ఇక్కడ ఏర్పడాలి. ఉదాహరణకు, సెట్టింగులకు అవసరమైన ముడి పదార్థాలు, ఫర్నిచర్, మేకప్ సామగ్రి, దుస్తులు రికార్డింగ్ స్టూడియోలు, కలర్ లేబరేటరీలు వగైరాలన్నీ విస్తృతంగా ఏర్పడాలి. అన్నట్టు, శ్రీ అక్కినేని నాగేశ్వరరావు, శ్రీ ఎల్. వి. ప్రసాద్‌లు హైదరాబాద్‌లో ఒక కలర్ ప్రోసెస్ లేబరేటరీని, శ్రీ రాజబాబు, శ్రీ కె. సత్యనారాయణలు ఒక కలర్ లేబరేటరీని నెలకొల్పాలని యత్నిస్తున్నట్టు ఆమధ్య వార్తలు వచ్చాయి. ఇవన్నీ అచిర కాలంలోనే కార్యరూపం ధరించగలవని ఆశిద్దాం.

రెండు దశాబ్దాల క్రితం ఆంధ్ర ప్రదేశ్ అవతరణతో పాటే ఆంధ్రప్రదేశ్‌లో సినిమా పరిశ్రమాభివృద్ధి కృషికూడా ప్రారంభమైనా, అది ఇంతకాలానికి—రాష్ట్రావతరణ 20 వ వార్షికోత్సవం నాటికైనా—ఒక కొలికికి వస్తున్నందుకు ఆనందించుదాము: ఈ ఆనందానికి కారకులైన ముఖ్యమంత్రిని, సమాచార మంత్రిని అభినందించుదాము.

తెలుగు వారు మరచి పోలేని... ...

(36 పేజీ నుండి)

వెంటనే మద్రాసు హైకోర్టులో, తన కుమారులను పొందుటకు బిసెంటమ్మపై దావా వేసెను. దావాలో నెగ్గెను. అనిబిసెంటమ్మ ఆమె వాదనను అమెయే సాగించగా ఆమెకు వ్యతిరేకముగా, నారాయణయ్య తరపున, సర్ సి.పి. రామస్వామి అయ్యరు వాదన చేసెను. మద్రాసులో ఓడిపోయిన, బిసెంటమ్మ, ప్రివీకౌన్సిలుకు అపీలు చేసుకొనెను. అపీలులో ప్రివీకౌన్సిలువారు, మద్రాసు హైకోర్టు తీర్పును త్రోయపుచ్చిరి. కాని మైనర్లయిన కృష్ణమూర్తి, నిత్యానందముల అభిప్రాయము, తెలుసుకొనగా, వారు బిసెంటమ్మ తోడనే ఉండెదమనియు, తమ తండ్రి సాధారణ సంసారి అనియు, అందుచే తమ విద్యకు భంగము కలుగుననియు, వ్యక్త పరచిరి. మైనర్ల శ్రేయస్సును దృష్టిలో నుంచుకొని, ప్రివీకౌన్సిలువారు, వారి అభిమతమునే అంగీకరించవలెచిరి. తరువాత కాలమున జిడ్డు కృష్ణమూర్తి విశ్వఖ్యాతి నార్జించి, తెలుగు వారికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను, శాశ్వత పరచినాడు.

' ప్రాగ్వి పశ్చిన్మతంబున రసము వేయి రెట్లు గొప్పది నవకథాదృతిని మించి '



రామాయణ కల్పవృక్షము సమగ్రమైన కావ్యము. కావ్యముయొక్క మహత్త్వము పాఠకునకు దాని పఠనమువలన కలుగు ఆనందము యొక్క గాఢత్వముతో కొలువ వలయును. ఆ దృష్టితో తెలుగు సాహిత్య జగత్తులో నిది అద్వితీయమైన కావ్యము.

కేవల నవ కథాదరణ బుద్ధులైన కొందరు ఇదివరకెన్ని సార్లెందరెందరో వ్రాసిన రామాయణమును మరల వ్రాసిన వాడు కవి యేమిటి అనవచ్చును. అనుచునేయున్నారు. ఇదివరకెందరో ఎన్ని విధములుగానో గానము చేసిన రాఘవేశ్వరు చారిత్రమే యిది. అవి వేరు. ఇది వేరు. నవీనత కేవలము కథలోనే యుండదు. ' రసము వేయి రెట్లు గొప్పది నవ కథా దృతిని మించి ' అన్న దానిలో చర్చకు తావే లేదు. ఇది మానవులకు ప్రత్యక్షానుభవములో నున్న విషయము కనుక.

ఇంకొక్క విషయము. మెరపు మెరసి మాయమైనట్లు తత్కాల ప్రతిభా విలసనము కలిగిన కవి ఏరుకొను వస్తువు వేరు. గాఢ ప్రతిభకల వాడు ఎన్నుకొను వస్తువు వేరు. మత్త గజవిహారమునకు మడుగులు చాలవు.

వాన కురియును. పడియ కట్టును. కొన్ని జీవులందులో ప్రవేశించి నానా ప్రకారముగా రొద చేయును. ఎండ కాయును. మడుగెండి పోవును. ఆ జీవుల గతి యేమైనదో ఎవ్వరికి తెలియదు.

అందుచేత తిక్కన మహాభారతమే వ్రాయును. పోతన శ్రీ మద్భాగవతమే వ్రాయును. కల్పవృక్ష కర్త కల్ప వృక్షమే వ్రాయును. మరొకటి వ్రాయకూడదా యన్నచో ఒకటి, నదీ ప్రవాహమునకు కాలువ గట్లు చాలవు. రెండు, ఆకవి తన జన్మ సఫలమైనట్లు భావించడు. ఈ జన్మ సాఫల్యమన్నమాట ఆయా కవులే యర్థములో వాడినను నేను పట్టి సెన్స్ ఆఫ్ అఛీవ్‌మెంటు (Sense of Achievement) అని మన వారు వాడుచున్న అర్థములో వాడుచున్నాను. ఎవరికిని అభ్యంతరముండదను కొందును.

పాఠకులు మన్నించినచో నొక విన్నపము. ఈ తెలుగు దేశములో అసలు గ్రంథము చదువకనే దానిని గురించి వ్రాయుటయో మాటాడుటయో అలవాటయినది. ఈ రామాయణ కల్ప వృక్షము సంస్కృత కావ్యమున కనువాదమనుట అటువంటి వానిలో నొకటి. అయినను దోషములేదు. కాదు కనుకనే కాదని చెప్పుట. కథారంభములోనే ఇది స్వతంత్ర కావ్యమని స్పష్టముగా తెలియును. అనువాదమైనచో ' తపస్స్వాధ్యాయ నిరతుడైన నారదుని తపస్వియైన వాల్మీకి ఇట్లు ప్రశ్నించెనని ' మొదలు పెట్టవలయును. కానిచో అయోధ్యకు రాజు దశరథుడు అతనికి మువ్వురు భార్యలు అని మొదలు పెట్టవలయును. కాని

' ఆత్మ నిత్యమ్మకాలాద్యవచ్ఛిన్నమ్ము
సచ్చిదానంద సంపచ్చయమ్ము
అద్వితీయమ్మేకమపరిణామ ప్రాప్త
మపరిమేయమ్మది యచ్చ తెలివి '

ఇట్లు మొదలుపెట్టుట యేమి ? ఆత్మ లక్షణములను వర్ణించుటకు రామకథా ప్రారంభమునకేమి సంబంధము? ఏమి సంబంధమనగా కవి తన రామాయణమును దైవములేని కలిలో నాస్తికతాకాలుష్యమును పోద్రోచుటకై ఆత్మ నిత్యత్వ ప్రతిపాదనతో ప్రారంభము చేయుచున్నాడు. ఇట్లు వ్రాయుట పదిమంది వ్రాసిన దానిని తిరుగ వ్రాయుట కాదు. తన కావ్య రచన యుద్దేశ్యమును, పరమార్థమును గుర్తెరిగిన వాడు వ్రాయుట.

ఆత్మయున్నదా ? దైవమున్నాడా ! నాస్తికత కాలుష్యమా? ఈ ప్రశ్నల కిచ్చుట తావులేదు. తా నన్నదానికి వ్యతిరేకముగా జగములో మరొకడు మాటాడకూడదనుట అందరు తన మార్గమే పట్టవలయు ననుట అభివృద్ధి నిరోధకుని ప్రథమ లక్షణము.

మరియు రామ కథ యెవని సొత్తు ? ఒక్క వాల్మీకి మహర్షికైన ఈ కథ నాది అను అధికారమున్నదో లేదో తెలియదు. ' ఈ ప్రపంచకమెల్ల యెల్లవేళ తినుచున్న యన్నమే తినుచున్న దిన్నాళ్ళు

రామాయణ కల్పవృక్షము వాల్మీకమున కనువాదము కాదు

తన గచి బ్రతుకులు తనవిగాన చేసిన సంసారమే చేయుచున్నది తన దైన అనుభూతి తనదిగాన తలచిన రాముని తలచెద నేనును నా భక్తి రచనలు నావిగాన' ఇదివరకెందరో వ్రాసిన రామాయణమును మరల వ్రాయుట యెందుకనగా నిది సమాధానము. ఇందులో రెండున్నవి. ఒకటి నా ఇష్టము. రెండవది- దేహధారణమునకు భోజనము చేయుట యెంత అవసరమో సంసార తరణమునకు భక్తి యంత యవసరము ఈ దేహమున్నంతవరకు మరల మరలి తినుట యెట్లో ఈ సంసారమున్నంతవరకు మరల మరల రామకథా శ్రవణ మటువంటిదని స్ఫూర్తి. కనుకనే 'నైకోద్రిక్త జనుర్నిమిత్తక మదేనః పుంజమున్ తానయోధ్యాకాండమ్మిది సాహితీ విమలతీర్థం బార్పుతన్' అనేక జన్మలకు నిమిత్తమైన పాప పుంజమును సాహితీ విమల తీర్థమైన ఈ రామాయణ మార్పుగాక- అని ప్రార్థన. "కవితా రూపతపస్సు చేసెదను శ్రీ కంఠా! మనస్సంయమాది విధానంబుల చేతకాని తనమైతిన్" అని మొర. మనో నిగ్రహాది విధానములతో తపస్సు తనకు సాధ్యము కాలేదు. 'ఏమి కామము? క్రోధం బది యేమి? ఏమియగు నీ మాత్సర్యమోహో ప్రభూ!' అని గుండె నిండ చెప్పరాని బాధతో కవితారూప తపస్సుతాను చేయుచున్నాడు. తన సర్వ కవితా శక్తిని శ్రీరామార్పణము చేయుచున్నాడు.

సద్యోనిర్గతమైన సర్వకవితా సంభారమున్ నీకు నై
వేద్యం బిచ్చితి రామచంద్ర! ప్రభువా! విశ్వాసముం బూనవే!
ఆద్యం బైచను జీవ లక్షణము సంహారంబు గావింపవే!

అందుకొరకే తపస్సు. 'తుది జన్మగ జేయుము. దీని ధూర్జటీ!' అని చిట్ట చివరి వేడికోలు. అసలిది యెందుకు వ్రాయుచున్నానని అడుగు యధికారము మనకు లేదు. వీలైనచో దాని మంచి చెడ్డలు విమర్శింతము. లేనిచో యూరకుందము. రచనలోని యానందము కవిది. పఠనములోని యానందము మనది.

ఇది స్వతంత్ర కావ్యమని మొదటనే మనవి చేసితిని. పాఠకునకీ కవియొక్క స్వాతంత్ర్యము, ఆయన త్రొక్కిన క్రొత్త మార్గములు అడుగడుగున కనబడును. దశరథుని మువ్వురు రాణులను వర్ణించుచు కవి'

" కౌసల్య ముక్తికాంతా సమానాకార
నలి సుమిత్ర యుపాసనా స్వరూప
విజయ రమాకార వినయాంబుధి సుమిత్ర
కైకేయి మధుసామగాన మూర్తి
కౌసల్య నవ శరత్కాల మందాకిని
సిత పుండరీకంబు శ్రీ సుమిత్ర
మందారపుష్పంబు మహిళామణి సుమిత్ర
కైకేయి నునునల్లకల్వ పూవు"

ఈ విధముగా వ్రాసెను. మనము నిత్యము చదువు కావ్యములలో వర్ణన యిట్లుండదు. రూపమును గురించిన వర్ణన ఇందసలే లేదు. ఆ యా రాణులకు కొన్ని లక్షణములను చెప్పినాడు. మరియు గమ నింపవలసినదేమనగా సుమిత్రను కౌసల్యతో కలిపి యొకసారి కైకేయితో కలిపి యొకసారి చెప్పుచున్నాడు. ఎందుకు సీసపద్యము నింపుటకా? ముక్తికాంతాసమానాకార ఉపాసనాస్వరూప, రమాకార. వినయాంబుధి, సామగాన మూర్తి. ఈ విశేషణములు వట్టివేనా? ఏమైన యర్థమున్నదా?

రామలక్ష్మణులొక జంట భరత శత్రుఘ్నులొక జంట కౌసల్య రాముని తల్లి- అందుచేత ముక్తికాంతా సమానాకార. లక్ష్మణుడుపాసనా స్వరూపుడు. శత్రుఘ్నుడు విజయమునకు వినయమునకు ప్రతీక. భరతుడు పరమ భాగవత శేఖరుడు అతనిని కన్న కైకేయి సామగాన మూర్తి. సుమిత్ర కవలలను కన్నది ఒకడు రాముని జంట. మరొకడు భరతుని జంట, అందుచేత ఆమెనొకసారి కౌసల్యతో నొకసారి కైకేయితో కలసి చెప్పుట.

మరియు నవశరత్కాల మందాకిని కౌసల్య. స్వచ్ఛమైనది శాంతమైనది. ఆమెతోనున్న సుమిత్ర సిత పుండరీకము, తెల్లని తామర పూవు. కైకేయినును నల్లకల్వ పూవు. రాజునకు మిక్కిలి ప్రియమైనది. ఉద్రేకము కలిగించునది. ఆమెతో నున్న సుమిత్ర ఎఱ్ఱని మందారము, స్పృహణీయములుగా నున్నవని పూవుల పేర్లు చెప్పుటకాదు. వారి గుణములు చెప్పుట.

కల్పవృక్ష కావ్యములో కైకేయిని మలచిన తీరే వేరు. మనకు తెలిసిన కైకేయి మిక్కిలి స్వార్థపరురాలు. సర్వజన ప్రియుడైన రాముని తనస్వార్థమునకై యడవికి పంపినది. కులఘ్ని. పతిఘ్ని. ఇది కల్ప వృక్షమునకు పూర్వమున్న కైకేయి.

కైకకు రాముని యందమితమైన ప్రేమ. ఆయనకు నంతే. 'కాళ్ళు వచ్చిన దాదిగా కైకకొరకు పరువులెత్తును శ్రీరామభద్ర మూర్తి నిద్ర మేల్కొన్నదిగ రామ భద్రుకొరకు అంగలార్చుచును కేకయాత్మజాత' ఆమె రామునికి విలువిద్యలోని మెలకువలు నేర్పినది

' బాహాపటు మూర్తి స్వామిధనురభ్యాసంబు నిత్యంబు పే
యాటయున్ కైకయి వచ్చిచూచుటయు'
' ఎలమిన్ తానిది వేళ పాళయనిలే దెల్లప్పుడున్ రామచం
ద్రులు తానున్ దన కార్ముకంబు వడిజేరున్ గైకయీసౌధభూములు
' తన విల్లే గతిబట్ట అమ్మునెటు సంధానింప కైకేయిశా
సనమే శాసనమా రఘూత్తమునకున్'

ఇది కైకేయి రామునకు విద్య నేర్పిన తీరు. రామునికి చాప విద్యా గురువు కైకేయి. అస్త్ర విద్యా గురువు విశ్వామిత్ర మహర్షి. వీరిరువురును భవిష్యద్దైత్య సంహారమునకుగా రాముని తీర్చి దిద్దినవారు. సీతారాముల కళ్యాణముతో తన బరువు దించికొని జగజ్జగీయ మానముగా బయట పడినవాడు విశ్వామిత్రుడు. కైకేయి పని అంతటితో పూర్తి కాలేదు. శ్రీరాముడడవికి పోయినగాని అసలు రామాయణము మొదలు కాదు. ఆ పని చేయగలది సర్వా

యోధ్యలో కైకేయి యొక్కతె యే. కల్ప వృక్షములోని కైకేయి ఆ పనిని తాత్కాలిక పుత్ర మోహమునకు లొంగి చేసినదికాదు. మంథర బోధనలకు లొంగిచేసినదికాదు. శ్రీరామచంద్రుని ప్రేరణతో చేసినది. ఆ కార్యాచరణలో తనకు గలిగిన మహా దుఃఖము నోర్చుకొని, యావత్స్వా స్యంతిగిరియః సరితశ్చమహీతలే ఆంతవరకు భవిష్యద్యుగములలో మాసిపోని తన యపకీర్తిని తెలిసి చేసినది. కైకేయి నట్టు తీర్చి దిద్దుటకై మొదటి నుండియు కవి జాగ్రత్త పడినాడు. ఎటువంటి రామునకు కైకేయి 'వజ్ర పుంఖితమ్ము నాటమ్ము' భిక్షగా పెట్టినది. దశరథ ప్రియ పత్నికి భిక్షగా పెట్టుటకు నాటమ్మే దొరికినదా. ఆమె పెట్టినది సాభిప్రాయమైన భిక్ష. మిగిలిన యిరువురు తల్లులు భిక్షపెట్టినప్పుడు రామచంద్రునికి కలిగిన సంతోషమును కవి వర్ణింపలేదు. కైక భిక్షయిడగనే

మొగమ్మున నింతయై మురిసిపోయెను రాముడు కైక కన్నులం
దిగము వంటింతయింతయయి యేళ్లలు వారె దదంతరంతర
స్థగిత రఘూద్వహ ప్రవిలసచ్ఛిశుమూర్తి మరింత యింతయై
జగములు పట్టరానియొకసాహస దీర్ఘతనుత్వమొప్పగన్

వారిరువురునూ ఒకరినొకరు బాగుగా నెరిగినవారు. ఈ రాముడు భవిష్యత్తులో 'దైత్యసంహారగాథా పాండిత్య సముద్ర మూర్తి' కాగలడని కైక విశ్వాసము. ఆ విశ్వాసముతోనే యతనికి చాపవిద్య గరిపినది. ఆ విశ్వాసముతోనే యతని నడవి కంపించినది. ఆమెకు కావలసినది భరతుడు రాజగుటగాదు. రాముడడవి కేగుట. ఆ రామునకు కావలసినదదియే. అతనినడవికి పంపించుటలో కైకేయి దుఃఖపడినది. దూషింపబడినది. నిందపడినది. విధవయైనది. అన్నియు నోర్చినది కాని వనములకేగవలయునన్న రాముని కోరికను సఫలము చేసినది. ఊరక మంథర బోధనలకు లొంగి పుత్ర మోహ వశయై రామునడవికి పంపెడిదైనచో మరల దశరథుని దుస్థితి చూచి మనస్సు మార్చుకొనవచ్చును. వశిష్ఠులు చెప్పినప్పుడు వినవచ్చును. సుమంత్రుని మాట వినవచ్చును. ఆమెకు కలిగినది పుత్రవ్యామోహముకాదు. స్వార్థముకాదు. క్లిష్టమైన యొక కార్యము నిర్వహింప వలసివచ్చినపుడు పరమ ధీరులకైనను కలిగెడి మనఃక్లేశము. క్షుద్రమైన హృదయ దౌర్బల్యమునుత్యజించి చివరి వరకు మేరునగధీరగా నిలబడినదామె. శ్రీరాముని వనవాసవేళ సర్వజనులకు ఏదో యొకవిధమైన వ్యామోహము క్రమ్ముకొన్నది. కలుగనిదిద్దరకు. మొదటివాడు శ్రీరాముడు. రెండవది కైకేయి. రామ వియోగ దుఃఖమామెకపారముగా కలిగినది నిజమే. కాని యాదుఃఖమును తన కర్తవ్య పాలన నతిక్రమించనీయలేదు. తనలోనే యదుముకొన్నది.

తెల్లవారిన రాముని యౌవరాజ్యాభిషేకము. ఆ రాత్రి ఉపవాసియై వ్రతనిష్ఠాపరుడైన రామచంద్రుని యెదలో దేవతలాడి " స్వామికి జ్ఞప్తియుండదు. ప్రసన్నత కల్గదు. నిర్వికారనతామహనీయ వార్ధికిని, దానవసింహము పంక్తికంధరుండేమయిపోయె మామనవులేమయిపోయె భవత్ప్రతిజ్ఞతా నేమయిపోయె కోసల నరేశ్వరుయజ్ఞహవిస్సమాహృతిన్. " అని యన్నట్లు తోచిన శ్రీరామచంద్రుడు 'మెల్లలేచి కైకేయి గృహంబులం జనియె. ఆ వచ్చిన రామచంద్రుని జూచి వ్రతస్థలమునకు భయపడిన కైకేయి ఇది యేమని యడుగగా రాముడు

'అమ్మ సమాధిలో నిటలమందునవేల్పులు వచ్చి నన్ను రా
జ్యమ్మును చేయవద్దనిన యట్లయి తోచిన యేమి తోచకే
నిమ్మెయి వచ్చితిన్ నిజమదేమియొ నాకును గూడ నట్లె రా
జ్యమ్మన యందు కోర్కి యనునట్టిది గుండియ బట్టి లేదనున్

అని చెప్పగా రాముని పరిహసించి పంపింతమనుకొన్నది కైకేయి, ఇప్పుడట్లే యుండును. రేపు సింహాసనసీమ ప్రక్కనున్న జానకిని చూచి వేరొక విధముగా నుండును పొమ్మన్నది. ఆరాముడంత తేలికగా విడివడువాడా ; రాజ్యమే చేయవలసినచో 'మున్నీవు నువ్వేత్తు నేర్పిన కోదండ కళా విచిత్ర గమనశ్రీ యేమగుంజెప్పవే'



'కనలున నమ్ములన్ బొమిడికంబున బొమ్మలు చెక్కికొందు నా
ననునతి సేయవచ్చిన జనంబుల వ్యూహములన్ బగుల్తునా'

అని యడుగును. (ఇక్కడ యిట్లున్న శ్రీరాముడు యుద్ధములో ఖరుడు తన చాపమును విరువగా 'నీవుంగార్ముక దక్షుడౌదు నగిషీల్నేర్తువు చేయన్ ధనుర్జ్యావల్లీకృత చిత్రకర్షణ నిపీషన్ కైకయీ దేవి విద్యావిష్కారము నీవెరుంగవు సుమీ! అని నవ్వెను.) ఈ మాటలు విన్న కైకేయికి ఆశ్చర్యమైనది. ఇది యేదో కదిలించిన కొలది మరింత దూరము పోవుచున్నది. 'నీ ధనువుననున్న చిక్కని సుతారము లెందులకో వచింపు' 'మని కైకేయి యడుగగా రాముడేమని చెప్పును. నేను విష్ణ్వవతారమును. రావణ సంహారమునకై వనమేగవలెనని చెప్పునా ? "శ్రీరామచంద్రుడు తల్లీ! అదికాదమ్మా

'నేను రాజ్యమ్ము చేయుట నిక్కవముగ
లేదు వేల్పుల కిష్టమ్ము లేదనంగ
రామచంద్రుని తీక్ష్ణ నేత్రములు చూచి
తాను కైకేయి సౌధము లోనికేగె'

ఇది యభిషేకము రేపనగా తల్లి కొడుకుల మధ్య జరిగిన సంభాషణ. అప్పుడు మొదలైన దామె హృదయములో మహా సంగ్రామము.

తెల్లవారుట, మంధరబోధ, వరములు కోరుట ఇవి సామాన్యమైన కథ. ఆ కథ చదువుటలో కైకేయి మనస్సులోని వ్యధ యంతయు బయట పడును. శ్రీరామ వనవాసము సర్వజనులకు దుఃఖ కారణమైనది. వారందరికన్న నెక్కుడుగా తనకు దుఃఖ కారణమైనది. అందరికి తమ దుఃఖము ప్రకటించు కొనుటకు వీలున్నది. ఆమెకు లేదు. ఇంతటి విషమ పరిస్థితిని ఎచ్చటను జారిపోకుండ రచించుటకు కవి మిక్కిలి ప్రతిభాశాలి కావలయును. అందుకే యన్నది 'కవి ప్రతిభలోన నుండును కావ్యగత శతాంశముల యందు తొంబది యైన పాళ్లు' అని.

కోప గృహమందు మొదటిసారి చూచిన కైకేయి దశరథునకు 'శోకాకృతి'గా కనిపించినది. ఆమెను గాంచి కళవళ పడిన దశరథుడు 'ఉవిదా కోపము నందియుంటివని నేనూహించితిఁగాని యింతవు శోకంబు వహించి తంచెరుగ నేలా యింత దుఃఖంబు' అనగా కైకేయి 'భూధవ కోపంబును శోక మంచనెద వద్దా వంచన ప్రక్రియల్' ఇది కైకేయికి తన దుఃఖము ప్రకటించ రాని స్థితి. ఇంతదుఃఖపడి యాపని చేయుట యెందుల కన్నచో అది శ్రీరామచంద్రుల యిష్టము. దానివలన పట్టరాని మనః క్లేశము కలిగినచో అది యోర్చుకొనవలయు నంతే.

నా వరముల మాట యేమిటన్న కైకేయితో దశరథుడు అభిషేకపు టుత్సాహములో నున్నాడు కదా 'కోరు మేపాటివా నీదు కోరికలు' అన్నాడు.

'అనినన్ గైకయి శోక కోపముల పెల్లై యేడ్వ భూమీశుడున్ వనితా చిత్తరకత్తెవాడు విదుగో వాంఛింపు మేనిత్తునన్నను, కంపంబును బొంది కైక'

తన కొడుకు రాజు కావలయు నన్నచో దశరథుడు వరమిత్తు నన్నపుడు కైకేయికి సంతోషము కలుగవలె కాని దుఃఖ మెందులకు? రాజుపై ప్రసన్నత కలుగవలెను గాని కోపమెందుకు? కోరుమని రాజు రెట్టించినపుడు కంప మెందులకు? శ్రీరామ వనవాసము క్షణక్షణము నిశ్చయమై పోవుచున్నది. ఇది యామె దుఃఖము. దశరథుడు దానికి మరింత కారణ భూతుడగు' చున్నాడు. ఇది యామె కోపము. ఆమె యేడ్పు ఇది యేదో హఠమని దశరథుడు దురర్థము చేసుకొన్నాడు. 'కంపంబును బొంది కైక ధరణీంద్రా! యిత్తునన్నంత చుల్కన కాదిచ్చుట యన్న భూమి పతియున్ కన్నుల్ సెరన్ కెంపులై' తానెత్తిన పథకము దశరథునకు తెలియదు. తానన్నమాట యతనికి తాకవలసిన చోట తాకినది. రోషగ్రస్తుడై యా మూఢుడు మరీ ఘోరమైన ప్రతిజ్ఞగా రామునిపై నొట్టిడు కొనుచున్నాడు. ఇక దశరథుడు వెనుదిరుగుటకు వీలులేదు.

'ఆ మాటల్ వినుచున్ లతాంగి భయభీతాక్షుల్ విదారించి యో
హో ఘూర్ణాండ ముఖాఖిలామరచమూ! యో భూత సంతానమా
మీమీ సాకిరి భావముల్ గనుడు భూమీనేత యీ ద్వక్ప్రతి
జ్ఞా మోహావిల పారవశ్య కలితాజ్ఞాంధ్యుడై పల్కెడున్.

అని తన వరముల కోరినది కైకేయి.

ఇంతవరకన్ని విధములుగా మాటాడిన కైకేయి తరువాత దశరథుడు శోకించినను దూషించినను వాదించినను బ్రతిమాలినను ఒక్కమాట మాటాడదు. 'హృతలేంద్రుడు దుఃఖవాచాలుడైన తరుణి కైకేయి దుఃఖ నిస్తబ్ధ యయ్యె!' తన పని తానెట్లో నిలువ ద్రొక్కుకొని చేసినది ఇక మిగిలినది శ్రీరాముడనుష్ఠింప దగినది. ఆ రాముడన్నమాట లివి.

'నీయుపకారమున్ మరువనే మరి యో జననీ'
'ఏవరయుగ్మ మీవడిగితే వరయుగ్మము రాజొసంగ నే
నావర యుగ్మ పాలన కృతార్థ జనుష్కుడ నైతినేని నా
యావర పాలనాత్త సుకృతాళి దివ్యత యందు తల్లి శ్రీ
దేవత వీవు సన్ననుమతింపుము నీదు పదాబ్జకుండుగా

ఆమె పడుతున్న కష్టమతనికి తెలియును ఆ కష్టము తనకోసము పడుచున్నదని తెలియును. అంత యయోధ్యలో ఆమెను దూషింపని వాడు లేడు. ఆమె శిలావోలె యైనది. ఆమె దుస్థితి తెలిసినవాడొక్క రామచంద్రుడు. అతని హృదయ మామె యెడ వరమస్నిగ్ధమై ఆతడామె ననునయించును 'తల్లీ! బాధ పడకు షత్రుని కతమున నగు బాధలు జనని సహింపకయ యేరు సైరింతురు' అని చివరకు వనప్రస్థాన వేళ రామచంద్రుడు.

"కైకేయి పదమ్ము లందుకొని నీవాశీస్సు లీకున్నచో వనటన్నన్ పినతల్లి మూర్ఛగని లిప్తందేరి పోవోయి నీవనముల్ నాకొడుకిందు రాజగును నీకాహా ధనుః క్రూరమార్గణముల్ చేయు నుపద్రవంబున మహా కాంతారముల్ ఘోషియన్."

"నిరభిమానను నిర్లజ్జ నిర్దయాత్మ జేసితివి నన్ను సర్వ సన్న్యాసినిన్ వనిన్ జనముఁర సవతితల్లిన్ నమున్ శపించి సవతి తల్లిగనె చూపించినావు." ఈ మాటలలో ఆమె భవిష్యజ్జీవితము లోని వైయర్థ్యమంతయు ధ్వనించు చున్నది. రాముడు తన వనమునకు తాను పోవును. అక్కడ యాతని బాణములు చేయు నుపద్రవము వలన మహాటవులు ఘోషిల్లును. కాని తానో! నిరభిమానగా నిర్లజ్జగా నిర్దయాత్మగా కేవలము సవతి తల్లిగా మిగిలిపోవును. ఇది రాముడు చేసిన పని. తాను సర్వ సన్న్యాసిని యైనది.

'అనిన నందరు ఛీఛీ యనిరి. రాముడు తల్లి చివరిదాక రక్షించుటకు సంతసించె'

ఇది కల్పవృక్ష కావ్యములో కైకేయి రామచంద్రుల సంబంధము. రామాయణ గాథలో రామచంద్రుని విశ్వస్వరూపము కొందరు ఋషులే యెరుంగుదురు. ఇక్కడ వారితోబాటు కైకేయి కూడ యెరుగును. రామచంద్రుని బదులు నేనే యరణ్యమునకు బోదునన్న భరతుని జూచి యామె జాలిపడినది. అతనితో ననుచున్నది.

'నీవేగి గానన మేమౌదువు? రామచంద్రుడనినన్ బ్రద్నాంతు తేజో వినూతన నారాయణమూర్తి కాసిత సమస్త ప్రాణి నీవేగు టాతని దౌయేగుట యొక్కడా?' అని. ఇది యామె యెటుక ఆమె పుత్ర వ్యామోహ విచలిత బుద్ధికాదు. స్వార్థపరురాలు కాదు. సుగ్రీవాంగద జాంబవదాది మహా వానరులవలె రామకార్యమందే జన్మ చారితార్థ్యమును భావించిన తల్లి.

ఒక మహాకావ్య రచనలో రచన యనేక విధములుగా సాగును. ఒకప్పుడు పరమ మధురముగా నుండుతు మరొకచోట మిక్కిలి కఠినముగా నుండును. ఒకచోట వట్టి వాక్చమత్కృతి మరొకచోట అనంతకల్పనా వైభవము. ఒకచోట బహిరముగా కనబడుచున్న వస్తువును వర్ణించి కథాగతమైన యొక వ్యక్తి మన స్థితిని వ్యక్తీకరించుట యుండును.' ఇట్లెన్నని? అన్నిటిని యుదాహరించుట కిది యదనుకాదు.

'అందముగా హొయల్ వెదలునట్లుగ నొక్కొకచో తరంగపాళిం దుముకించుచున్ విధురలీలను నొక్కొకచో నొకొక్కచో చిందుచు వక్రమై నిడివి చెన్నుల పాయలుగా నొకొక్కచో మందముగా ద్రుతమ్ముగ క్రమమ్ముగ సౌఖ్యము గాగ నేగగా'

ఇది గంగానదిని గురించిన పద్యము. ఆనది నడకవలెనే ఈ కల్పవృక్ష రచన యుండును.

'క్వచిదష్టాపద వర్ణపైకత, క్వచిత్పాదోధి గంభీరయున్
క్వచిదుద్భ్రాంత విహంగ సంతతి, క్వచిత్కాశ ప్రసూనాచ్ఛయున్
క్వచిదానీత తుషార శీతల, క్వచిత్క్రమి స్వరవ్యాప్తయున్
క్వచిదాకాశ విశాల భావకృత దృక్తాత్పర్య కృషాత్మయున్'

ఇదియు గంగానదిని గూర్చి వ్రాసిన పద్యమే. రామాయణ కల్పవృక్షములో కవిత్వ మట్లుండును. పచ్చబంగారము కుప్పలు పోసినట్లు, గంభీరమైన సముద్రములోతందనట్లు, ఉద్భ్రాంతమైన పక్షిసంతతులు కూవెట్టినట్లు, కాశపరిసూనములు సన్నగాలులకు కదలాడినట్లు, నిదాఘ తప్తుమైనవాడు జలపాతమువద్ద నిలుచున్నపుడు పైకిచిమ్మిన తుషారములచే నేనంతయు పరమసౌఖ్యము చెందినట్లు, వీణతంత్రిమీద వ్రేలితో నిటుకొట్టి అటుమెట్టుమీద నదిమిలాగినచో పుట్టిన యొకధ్వని సాతత్యము హృదంతరాళము లోనికి చొచ్చుకొనిపోయి యటు చోటుచేసికొన్నట్లు – ఈ సుఖమంతయు కల్పవృక్షము కవిత్వములో నున్నది. 'క్వచిదాకాశ విశాల భావ కృతదృక్తాత్పర్య కృషాత్మయున్' దీనియర్థము భావించ వలయును కాని చెప్పట కష్టము. పదకాఠిన్యమువలన కాదు. పదకాఠిన్యమును నిముసములో ఛేదింపవచ్చును. కాని ఒక గూఢమైన ప్రౌఢమైన భావమును పట్టుకొనుట కష్టము. నదీవైశాల్య మెక్కువగా నున్నచోట అవలి యొడ్డును ఆకాశము చుంబించుచుండగా ఈనడిమి వైశాల్యము భావింప గలిగినచో కొంత ఈ కల్పవృక్ష కవితా వైశాల్యమును భావించినట్లగు ననుకొను చున్నాను. అసమాసమనకు అర్థముకూడ కొంత కొంత భావింపబడి నట్లగు ననుకొనుచున్నాను. వ్యుత్పత్తిచేత గాక, టీకచేతగాక. భక్తిచేత సాధింప వలెననగా నిదియే. దాని ననుసరించుటకు ప్రయత్నము చేసినచో ఆ కవితాదేవి మనకు ప్రసన్నమైనపుడు వెలిగెడి యానందము వర్ణనాతీతము. రామాయణ కల్పవృక్షములోని కవితా వైశాల్య మెంతటిదనగా పదిమంది పది దృక్కోణములతో పది గ్రంథములు వ్రాయుటకు వలసిన సామగ్రి యచ్చట నున్నది. ఇది విశ్వవిద్యాలయములు చేయవలసిన పని.

రాక్షసులు

మరియొక సంగతి ప్రస్తావించి ముగింతును రామాయణము లోని రాక్షసులలోక విశిష్టమగు ప్రవృత్తి గలవారు శాపగ్రస్తులైన రాక్షసులు వారు. విరాధుడట్టివాడే కబంధు డట్టివాడే. ఆయాఘట్టములు చదివినచో ఆసాంత మెప్పుడని వారెదురు చూచుట. రాముని దర్శనమునకై వారుపడిన తహతహ, చెట్టులో చేములో, పక్షిలో, మృగములో భగవంతుడైన రాముని గొంతు వెదకి ఆతడు దొరకక కబంధుడు పడిన యాతన ఇవన్నియు అర్థమగును. రావణుడు తపస్సంపన్నుడు. యుద్ధ కాండములో మొదటి ఖండము సంశయ ఖండము. చివరిది అనగా ఉపసంహారణమున కన్న మొదటిది నిస్సంశయ ఖండము. తాను విరోధింపవలసినది విష్ణునకారమైన వానితో, ఈ రాముడు వాడగునా కాడా? మనస్సులో ఈ సంఘర్షణ రావణునకు నిరంతరము జరుగుచునే యుండును. సీతాదేవితో రావణుడు మాటాడుట దేవీ భర్తుడు మాటాడినట్లుండును. ఆ యర్థమా మహానుభావుని మాటలలో వచ్చుచుండును 'తెలిసిన మూర్ఖుడు' అని రావణుని గురించి లోకములో యనుకొను మాటలో చాలా యర్థమున్నది. ఈ కల్ప వృక్షములోని రావణుని గురించి వ్రాసినచో మరల నింత యగును. ఎక్కువయే యగును.

కల్పవృక్షములోని కుంభకర్ణుని యుద్ధరచన యొక్క యాశ్చర్యము. రాముని సమీపించుటకై వాడు పడిన తపన యంతయు ఆ రచనలో నున్నది.

ఇవన్నియు ఎవరికి వారు చదివి భావించి గ్రహింపవలసిన విషయములు. మరొకడు చెప్పినపుడు కావచ్చు ననిపించును గాని ఆ యానందము కలుగదు, ఈ కల్పవృక్ష కావ్యము 'భక్తి యున్నట్టిచో మెత్తబడెదు దేవి' సుభద్ర సమార్ద్రి దీని పఠనము వలన కలిగిన యానందములో పాఠకులకు పాలుపంచుటకై ఇదినేను చేసిన ప్రయత్నము. అపండితుడనైనను యీసాహసమును మన్నింప వలసినదని పరమ వినీతుడనై ప్రార్థించు చున్నాను.

'ఎదకు పురాంధ్ర సంస్కృత కవీశ్వర భారతి దీప్తి గల్గినన్
సదమలబుద్ధికిన్ సకలశాస్త్ర రహస్య వివేక మబ్బినన్
మదికి నసంత కల్పనల మక్కువ కల్గిన విశ్వనాథ శా
రద సకలార్థదాయిని సురద్రువు రామకథన్ భజింపుమా.'

ఆంధ్రోద్యమ నిర్మాతలు

శ్రీ జి. కృష్ణ

ఆంధ్రోద్యమం అంటే తెలుగువారు తాము తెలుగు వారమనీ, ఏఏ ప్రభుత్వాల పరిపాలన క్రింద ఈ తెలుగుగడ్డ విభాజితమై ఉన్నప్పటికీ, తాము ఒకే జాతివారమనీ అనుకునేటట్లు చేసిన ఒక కృషి చరిత్ర.

ఈ కృషి ఇంకా కొనసాగవలసి ఉన్నదే.

ఎరిగినంతలో తెలుగు నేలనంతటినీ కలిపి పాలించిన రాజులుగానీ రాజవంశాలుగానీ—శాతవాహనులు, విష్ణుకుండినులు, కాకతీయులు, కుతుబ్‌షాహీలు మాత్రమే, కొంత కాలం అసఫ్ జాహీలు కూడాను.

రాజులనుబట్టి, వారి ఉద్యోగులనుబట్టి తెలుగు ప్రజలకు వివిధమైన అలవాట్లు, ఆచారాలు సంక్రమించినాయి. ఈ వైవిధ్యాలన్నీ సహజవిభేదాలుగా బ్రిటిష్ పరిపాలనలో స్థిరపడినవని తోస్తున్నది. ఈ విధంగా, ఆంధ్ర చరిత్రగతిలో బ్రిటిష్ పరిపాలకుల ప్రజ్ఞాఫలాలు శాశ్వతంగా నిలుస్తాయి.

నన్నయ ఆంధ్రంలోనే వ్రాస్తున్నానన్నాడు. విద్యానాథుడు ఏకశిలానగరాన్ని ఆంధ్రమహానగరం అన్నాడు. కాకతీయుల రాజ్యం విచ్ఛిన్నమైన తర్వాత గూడా వారివద్ద పనిచేసిన నాయకులు పలువురు రాజులై ఆంధ్ర శబ్దాన్ని ఆత్మీయంగా ఉపయోగించుకున్నారు.

వివిధ రాజుల ఏలుబడిలో ఉన్న వివిధ ప్రాంతాలలో ఆంధ్రభాష పలుకుబడి కూడా వివిధ సౌందర్యాలను సంతరించుకున్నది. బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమే అయింది—దాని ప్రాగల్భ్యం ఎందరికో అవగతమైనది అనేది వేరుమాట.

చీలిన మనస్సులు

ఆంధ్ర అనేది ఒకటే, ఒకే ప్రాంతీయత అనే విశేషం అవగతం కావడం కూడా అసాధ్యం—అప్పటిస్థితి. "పాటూరు (నెల్లూరువద్ద) నుంచి తిక్కన్నవచ్చి ఏకశిలానగరంలో భారతం వినిపించాడయ్యా—ఇదంతా ఒక్కటే" అని చెప్పినప్పటికీ, ఇన్ని ప్రభుత్వాల మధ్య చీలికలైన దేశీయులకు ఏకభావం కుదరకపోవడంలో వింత ఏమున్నది? అందరికీ విశాల దృక్పథం ఉండాలని శాసించడం ఎవరితరం!



ప్రభువునుబట్టి కొత్త కొత్త వికారాలు అలవర్చుకొనడం అనేకులకు సహజం.

ఇది ఇట్లా ఉంచి, తెలుగు భాషకు ప్రాంతీయం బెడదతో పాటు, పండిత పామరవ్యత్యాసాల బెడద కూడా ఉన్నది. ఇప్పటికీ

నూటికి కోటికి ఒక తెలుగువాడు చక్కటి తెలుగు మాట్లాడితే, ఆ మాటలువిని తెలుగు అభిమానులు ఎంతో ముచ్చటపడ్డారు. సాదా ప్రజలకు తెలుగు దేనికి? గట్టిగా తెలుగు మాట్లాడితే, 'వీడు తెలుగు వీరుడు' అని ముక్కున వేలు వేసుకుంటారు.

అచ్చు కూటాలు పుట్టుకొచ్చేవరకూ, తెలుగు తనం ఒకచేసన్న భావానికి పెద్ద బలంలేదు. అచ్చు కూటాలు పుట్టుకు వచ్చే వరకూ ఎవడి తాటియాకువాడిది, ఎవడి గొప్పవాడిది.

తాటియాకుల గ్రంథాలు అందరివద్దా ఉండవుగదా. పైగా చదువుకొనగూడనివారు, చదువు అక్కరలేనివారు, లింగభేదం రీత్యా, కుల భేదం రీత్యా పలువురు ఉండేవారు. గ్రంథాలు కొద్ది మంది వద్దనే ఉండేవి కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు; కొన్ని చత్తడ శ్రీవైష్ణవ కుటుంబాలు, కొన్ని మాల దాసరి కుటుంబాలు, కొందరు జమీందార్లు, కొన్ని మఠాలు, కొందరు భోగస్త్రీలు-వీరి వద్దనే గ్రంథసంచయం. మిగిలినవారు విని పుణ్యం ఆర్జించుకోవచ్చు.

మన సంగతి మనకే చెప్పారు

యూరపియన్లు తాము బాగుపడడానికి, ఇక్కడివారిని అణచి ఉంచడాని ఈ దేశానికి వచ్చినప్పటికీ, తమ గొప్పకోసమో, తృప్తి కోసమో, సహజ సౌజన్యం వలననో, కొన్ని మంచి పనులు చేశారు. అటువంటివారి సంఖ్య స్వల్పమేకావచ్చు. వాళ్ళు మొదట మొదట ఈ తాళ పత్రగ్రంథాలు సేకరించి, అచ్చువేయించి, మన గొప్పతనాన్ని మనకో పలువురికి ఎరిక పరిచారు.

దురదృష్టం–ఇంగ్లీషువాళ్ళు ఇటువంటి మంచిపని ప్రారంభించే నాటికి తెలుగు వారిని మూడు నాలుగు ప్రాంతాల క్రింద విభజించివేశారు. కొందరు మద్రాసు రాష్ట్రంలో, కొందరు హైదరాబాదు సంస్థానంలో, కొందరు మైసూరు సంస్థానంలో– ఇట్లా వివిధ ప్రాంతాల వారినిగా చేశారు. మరికొన్ని సంవత్సరాల తర్వాత కొన్ని ప్రాంతాలను ఉత్కళలో కూడా చేర్చివేశారు. అదేనేటికి తెలుగు వాళ్ళల్లో వదలని ప్రాంతీయ ప్రత్యేకతలకుదారి తీసింది. ఇంగ్లీషువాళ్ళు పెట్టిన భిక్షల్లో అదొకటి.

1802 మే 1న ఈస్టు ఇండియా కంపెనీవాళ్ళు మద్రాసులో ఒక పుస్తక ప్రచురణ సంస్థ నెలకొల్పారు. పుస్తకాలన్నీ ఒక చోట చేర్చే గ్రంథాలయాలు కూడా నెలకొల్ప నిర్ణయించారు.

నౌకరివిద్య : తెలుగు పుస్తకాలు

1857 సెప్టెంబరు న మొదటి మెట్రిక్యులేట్ తయారైనాడు. అప్పుడు ఇంటర్మీడియట్ లేదు...1863–64 లో ఇంటర్మీడియట్ తరగతులు పెట్టారు. 1858లో మొదటి బి. ఏ తల ఎత్తాడు. 1881 వచ్చేసరికి మద్రాసు రాష్ట్రంలో 155 మంది మెట్రిక్యులేట్లు. 21 మంది బి. ఏ లు తయారైనారు. ఈస్టు ఇండియా కంపెనీకి ఉద్యోగులు తరపరంపరగా తర్ఫీదు కాసాగారు. వీళ్ళలో తెలుగువారికి తెలుగు భాషను కొత్త దృష్టితో చూసే పద్ధతి అలవడింది.

పుస్తక ప్రచురణ సంస్థకోసం, గ్రంథాలయం కోసం, సి.పి. బ్రౌన్ అప్పటికే 2440 తాళపత్ర గ్రంథాలు సేకరించాడు. ఇవిగాకకంపెనీవాళ్ళు కూడా 2106 తాళపత్ర గ్రంథాలు సేకరించారు ఇవన్నీ 1793–1818కి మధ్య కల్నల్‌కాలిన్ మెకంజీ ఆధ్వర్యంలో కావలి వెంకట బొర్రయ్య ప్రభృతులు సేకరించిపెట్టినవి. మెకంజీ 1821 లో చనిపోగా, అతని భార్యవద్ద నుంచి కంపెనీ వాళ్ళు ఈ గ్రంథాలను, శిల్పాలను, శాసనాలను కొన్నారు. మెకంజీ సేకరించిన వాటిల్లో, మొత్తానికి–1568 సంస్కృత గ్రంథాలు, 2070 తెలుగు, తమిళ, కన్నడ మరాటీ గ్రంథాలు ఉన్నాయి. 2630 శిల్పాలు, 6218 నాణెములు కూడా ఉన్నాయి. బ్రౌన్ వీటన్నింటికీ వర్ణనాత్మకమైన జాబితా తయారు చేయించాడు. 1836లో విలియం టైలర్ అనే ఉద్యోగి, 570 పుటల వివరణ పట్టిక తయారు చేశాడు.

1853 కల్లా అప్పటికి 900 సంవత్సరాల చరిత్ర అంశాలను వరసక్రమంలో తయారు చేయించగలిగాడు బ్రౌన్.

తెలుగుకు స్పష్టత

తెలుగు వాళ్ళకు స్పష్టత కలగజేసింది బ్రౌన్. కామాలు, ఫుల్‌స్టాపులు వగైరాలు ఉపయోగించి గ్రంథాలను అచ్చువేయించనారంభించాడు. శబ్దకోశాలు వ్రాశాడు కాని, న్యాయస్థానాలలో, పరిపాలనలో వాటిని ఉపయోగించక పోయినట్లుంటే, అవి మూల పడేవి. పంక్చుయేషన్ అనేది తెలుగుకో మిగిలి ఉంటుంది.

బ్రౌన్ మొత్తానికి 900 సంవత్సరాల ఇతిహాస గతిని కొలదిగా చూపాడు గదా. దాన్ని దొరకబుచ్చుకుని వీరేశలింగం వరకూ వ్రాతలు కొనసాగినై, అదీ తెలుగు వికాసానికి దారి తీసినది.

1865 ప్రాంతాలలో బహుజనపల్లి సీతారామాచార్యులు, కె. సుబ్బరాయలు నాయుడు, వి. కృష్ణమాచార్యులు – "సుజన రంజని" అనే మాస పత్రిక నడిపారు. దానిలో మొదటిసారిగా, తెలుగు భాషా ఇతిహాసం ప్రచురించనారంభించారు

అదే పెద్ద కథ అయింది గురుజాడ శ్రీరామమూర్తి చేతులలో–మరింత పెద్దదయినది వీరేశలింగం చేతులలో.

అయితే ఇవన్నీ కవుల జీవితాలకు, వారి వారి రచనలకూ సంబంధించిన వ్రాతలే. కొత్తగా కనిపెట్టిన విశేషాలు లేవు. ప్రజలు, ప్రభుత్వాలు వీటిల్లో చేరిన అంశాలుకావు.

అసలు వికాసం ప్రారంభం

ఇరవైయవ శతాబ్ది ప్రథమ దశాబ్దంలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, తెలుగు పరిశోధనా ప్రపంచంలో అడుగు పెట్టేవరకు

తెలుగువారికి తమకొక ఉజ్జ్వల ఇతిహాసం ఉన్నదనీ, ఉజ్జ్వల భవిష్యత్తు సాధ్యమనీ విస్తృతంగా తెలియదనే చెప్పాలి.

ఇరవైయవ శతాబ్దం రావడానికిముందు ఆశుకవితల్లి, రాజులను, ధనవంతులను మెప్పించుతూ ఉండేవారు. ఈ శతాబ్దం ప్రారంభంనుంచీ. ఆశుకవితలు హరికథలవలే, ప్రజల సమక్షంలో జరగనారంభించడం తెలుసుకొనదగు విశేషం. ఆశుకవితా ఉద్యమమే అది. ఉద్యమంగానే నడిపారు తిరుపతి వెంకట కవులు. పోటీ అవధానాలు ఎన్ని జరిగినప్పటికీ, వీటి నన్నింటినీ ఒకవిధంగా ఆంధ్ర భాషా కార్యక్రమాల జాబితాలోనే వేసుకోవచ్చు. ఇటీవలి వరకూ, ఇప్పుడు కూడా, ఆశుకవి బాణీ పలువురిలో చక్కటి తల తిక్కకింద కానవస్తూ ఉంటున్నది. కొన్ని సంవత్సరాలపాటు, తిరుపతి వెంకట కవులవలె దుస్తులు వేసుకొనడం, మాట్లాడడం, పొడుం పీల్చడం చదువుకున్నవారికి ఒక సోకు అయింది. అవధానాలు విని అవధానులైనవారనేకులు. వాళ్ళు ప్రజలను అలరించడం ప్రజలు వారిని సత్కరించడం...తెలుగు నాట ఒక ఆచారంఅయింది.

కావ్యకంఠ శ్రీ వాశిష్ఠ గణపతిముని చెప్పినట్లు కవుల నూతన యుగాన్ని (నిర్మాతి నూత్న సమయం) సృష్టించారు. రాజులే సృష్టిస్తారు అనే నానుడిని మరిపింపజేశారు.

తెలుగు ఇంతగా మీరుతుంటే, వ్యావహారికం వ్రాయాలనే ఉద్యమం తలెత్తడంలో అసహజం ఏమున్నది?—అది ఈ తెలుగు ఉద్యమానికి మరింత చైతన్యం కలగజేసింది. వాదోపవాదాలు కూడా. ఒక్కపరి వెనుదిరిగిచూస్తే, ఆంధ్రోద్యమానికి లేక తెలుగు వికాసానికే దోహదం చేసినాయి.

తెలుగురాని తెలుగుదేశం రాజులు

నిజాం సంస్థానంలో మిగిలిఉన్న తెలుగుజిల్లాలలో పరిస్థితులు, బ్రిటిష్ ప్రాంతంలోని జిల్లాలలో పరిస్థితులంత శీఘ్రగతిన మెరుగు కాలేదు. సంస్థానాధీశ్వరులలో ఎవ్వరికీ తెలుగురాదు, పోనీ మరాటీరాదు, కన్నడమూరాదు. ప్రాంతీయ భాషలురావు. రానక్కరలేదు.

1884 ఫిబ్రవరి వరకూ పరిపాలనా భాష పార్శీ. అప్పుడు ఉర్దును పరిపాలనా భాష అన్నారు. అప్పటి ప్రధానమంత్రి. పార్శీని తొలగిస్తే ఇస్లాంమతం క్షీణిస్తుందని వాపోయాడు గూడాను. నిజాం నవాబుకు యజమానులైన బ్రిటీష్‌వాళ్ళు మాత్రం హైదరాబాదు సికింద్రాబాదులలో ఇంగ్లీషు చదువులకు పునాదులు వేశారు.

1885లో హైదరాబాదులో దారుల్ ఉలూం, సిటీ హైస్కూలు, చదర్ఘాట్ హైస్కూలు, మదర్సా ఆలియా, మదర్సా ఐజా అనే విద్యాలయాలను నిజాం ప్రభుత్వం స్థాపించింది. హైదరాబాదులో బడికి వెళ్ళేవారిలో సహజంగా తెలుగువారు తగినంతమంది ఉంటారు. ఒక అభివృద్ధి కార్యక్రమం ప్రారంభం అవుతే, ఇతర అనుబంధ కార్యక్రమాలు వెంటనేగానీ, కొంచెం ఆలస్యంగాగానీ ప్రారంభంఅయి తీరుతవి. అంతే జరిగింది నిజాం సంస్థానంలోనూ. చదువురుచి మరిగిన వారిలో కొందరైనా, స్వతంత్రంగా ఆలోచించుకుని, ఇంకొకరికి తోడ్పడగలుగుతారు.

నాయక లక్షణాలుగలవాడు ఇతరుల విషయం గూడా గుర్తించి సాయపడ్తాడు. ఆటువంటి లక్షణాలు లేనివాడు తనుబాగుపడ్తాడు.

నిజాం ప్రభుత్వం ప్రజలకు ప్రాథమిక హక్కులు లేకుండా చేస్తుంటే, చదువుకున్నవారు ప్రాథమిక హక్కులకై సాత్వికంగానో దౌర్జన్యంగానో పోరాడుతూనే ఉన్నారు. ప్రజలకు ఆదొక వికాస కారణం.

ఉప్పు-గ్రంథాలయం

గాంధీజీ, ప్రజలు ఉప్పుచేస్తారు అనిపిడికెడు ఉప్పుతో బ్రిటిష్ ప్రభుత్వాన్ని కలవరపెట్టారు. అట్లాగే కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు, ప్రజలు పుస్తకాలు చదువుకొంటారు అన్నారు. తెలుగువారికోసం తెలుగు పుస్తకాల ప్రచురణ, సేకరణ, పాఠకుల సమీకరణ వారి ఉద్యమానికి లక్షణాలు. 1901లో, చిన్న ఎత్తున శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం నెలకొల్పారు, హైదరాబాదులో. అది నేటికీ తెలుగువానిలో తెలుగుదనం వికసింపజేసిన విజ్ఞాన క్షేత్రంగా నిలచి ఉన్నది.

పెద్దపెద్ద గ్రంథాలయాలనేకం వెలుస్తున్నాయి, విజ్ఞానానికి తల్లులవలె. శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం 'అమ్మలగన్నయమ్మ'.

ఈ సందర్భంలో ఆంధ్రజాతి మరువరాని వ్యక్తులు— శ్రీరావిచెట్టు రంగారావు దంపతులు, శ్రీనాయని వెంకటరంగారావు, శ్రీ మైలవరపు నరసింహశాస్త్రి, శ్రీ ఆదిపూడి సోమనాథరావు— ఆనాడు భాషానిలయం స్థాపన సభకు వచ్చిన వారందరూ.

ఆ తర్వాత ఇక్కడనే విజ్ఞాన చంద్రికా గ్రంథమాల వెలసినది. దానిని నిజాం సంస్థానం నుంచి పనిచేయనీయలేదు అప్పటి ప్రభువులు. అప్పుడు విజ్ఞాన చంద్రిక మద్రాసు నుంచి పనిచేయ నారంభించింది. కొమర్రాజు వెంకట లక్ష్మణరావుగారు ఎక్కడ ఉన్నా అది తెలంగాణమే అయింది.

ఆంధ్రోద్యమానికి ఊతనిచ్చిన వ్యక్తి ఒకడు 1921 లో కానవస్తాడు. వెటకారం కాదుగానీ, అతడిపేరు తెలియదు—హైదరాబాదులో సంఘ సంస్కరణల సభ జరుగుతున్నది—శ్రీ అలంపల్లి వెంకటరామారావు తెలుగులో మాట్లాడ ప్రారభించగా హేళనచేశాడు. అంతే. తెలుగు వారు తెలుగులో మాట్లాడాలనే భావంగట్టి చేసుకున్నారు. ఆంధ్ర జనసంఘం ఏర్పడింది. ఆంధ్ర

సరస్వతీ సాక్షాత్కారానికి. హల్లాపెల్లా హంగుచేసిన ఆవ్యక్తి కేవలం నిమిత్తమాత్రుడై ఉంటాడు.

ఆంధ్రోద్యమంలో గొప్ప అధ్యాయం

ఇక ఆంధ్రోద్యమంలో మరొక గొప్ప అధ్యాయం ప్రారంభమయింది.

నిజాం సంస్థానంలో ఆంధ్రోద్యమం కేవలం ఉపన్యాసాలకూ, అర్జీలకూ పరిమితం కాలేదు. కేవలం వ్యక్తుల ఘనత పైన ఆధారపడలేదు.

ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, నిజాం సంస్థానంలో, ఆంధ్రోద్యమం విశ్వరూపవతుగా సాగింది. గ్రంథాలయాల స్థాపన, ప్రాథమిక హక్కులకోసం ఆందోళన, హరిజన అభ్యున్నతి ఎన్నోఎన్నో. ముఖ్యం-తెలుగువారికై పాఠశాలల స్థాపన. ఇది ఎంతకష్టమో అనుభవించిన వారికి గానీ అవగతం కాదు. అసలే నిజాం సంస్థానం ... అందునా ధనం సేకరించాలి, ..సంస్థను నవ్వులాటపాలు కాకుండా నిర్వహించాలి. ఆంధ్ర విద్యాభివర్ధని పాఠశాలలని అనేక చోట్ల నెలకొల్పారు. వీటి నిర్వహణ వ్యవహారాలు కీ॥ శే॥ శ్రీ. కె. రావు చూస్తూ ఉండేవారు. ఒక సంస్థ కాగితం ముక్క మరొక సంస్థకు ఉపయోగించేవారు కాదు ! ఆయవ్యయ వ్యవహారాలలో ఎంత నిష్ఠురత ! అదే బాణీ ప్రవర్తన శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారలది.



నిష్ఠుర వ్యక్తిత్వం

ఆంధ్రోద్యమం ప్రసాదించిన సమగ్ర వ్యక్తులు వీరు. ఇప్పుడిటువంటి నిష్ఠుర వ్యవహారణ లేదు అంటే అతిశయోక్తిలేదు.

ప్రతాపరెడ్డిగారు గోల్కొండ చరిత్రలో కొన్ని అంశాలను బయటపెట్టారు. ఆ కాలంలో ఎంత ప్రమాదమో ఆలోచించండి. నేటికీ గోల్కొండ చరిత్ర సరిగా వెలువడలేదుగదా.

ఇంతకూ ఈ వ్యక్తులు చేసిన ప్రతి పనీ ఆంధ్రోద్యమానికి తోడ్పడింది. బ్రిటిష్ పాలిత ఆంధ్రదేశంలో వ్యవహరణకుగల సౌకర్యాలు స్వేచ్ఛలేని చోట, లేనికాలంలో, వీరు చేసినపని చాలా చిన్న కార్యక్రమంగా ప్రారంభించి పెద్ద ప్రచారాన్ని చేసిన పని చాలా గొప్పది.

చిన్న కార్యక్రమంగా ప్రారంభించి పెద్ద ప్రచారాన్ని చేసిన వ్యక్తులు కూడా ఉద్భవించారు ఆంధ్రోద్యమంలో భాగంగా. నేడు ఇది గొప్పగా కానరాకపోవచ్చు. ఆణాగ్రంథమాల అనిపెట్టి, మంచి పుస్తకాలు ఆంధ్రోద్యమానికి ఊతగా వెలయించిన శ్రీ పెద్దిత్రి మాణిక్యరావు కృషిని ఏమనాలి ?

మరొకటి-మరువరానిది. కర్ణాటక సంగీతం విజయనగరంలో పుట్టినా, పెరిగింది తంజావూరు మధురలలో. త్యాగరాజ కృతులను బాగా పాడి ప్రచారంలోకి తెచ్చిన వారికి గూడా ఈ శతాబ్దం ఆంధ్రోద్యమ ఆసక్తులు కృతజ్ఞులు. తెలుగునాట నివసించని ఈ సాధుపురుషుడు తెలుగు. విజ్ఞానికి కల్పించిన ఉత్తేజం దొడ్డది.

అన్నట్లు 1916 ప్రాంతంలో మధురవద్ద ఒక తెలుగు జమీందారు, ఆంధ్ర సాహిత్యపరిషత్తు (కాకినాడ) వార్షిక సమావేశం జరిపించాడు. తెలుగు విద్యావంతులందరూ అక్కడికేవెళ్లి సాహిత్యం మాట్లాడి, విని, ఆతిథ్యం స్వీకరించి వచ్చారు.

రాజకీయం అయింది

విద్యావంతులలో ఇందరు ఇంతగా తెలుగుదనం కల్పించారు. కాల్డ్వెల్ దక్షిణాది భాషల ప్రత్యేకతను, ఒకందుకు వ్రాస్తే, తెలుగువారి ప్రత్యేకత మరొకందుకు వెల్లివిరియ నారంభించింది. ఇంతతతంగం జరుగుతుంటే, సహజంగా దీనిని ప్రోద్బలకంగా తీసుకుని, కొంత రాజకీయం కల్పించుకుంటారు రాజకీయ వాదులు. ఎవరు అధికారంలో ఉంటే, వారి ప్రతి పక్షంవారు ఈ రాజకీయాన్ని గూడా అవలంబించి తెలుగువారి అభిమానం పొందయత్నిస్తారు గదా. అట్లాగే జరిగింది పాత చెన్న రాజధానిలో.

ఏమైనప్పటికీ పొట్టి శ్రీరాములు తెలుగు నాయకులలో ఐకమత్యం కోసం ఉపవాసం చేయడం వలన, ఆంధ్రోద్యమానికి రాజకీయంగా ఒక బలం కలిగింది. కేవల ఐకమత్యం అసహజమే అనైక్యం ముప్పు. పొట్టి శ్రీరాములు బలిదానం వలన ఈ ఐక్యానైక్యాలకు సమన్వయం కుదిరింది.

ఇటీవలి కాలంలో, ఆంధ్రోద్యమం కేవలం శుష్క రాజకీయం పైన ఆధారపడి నిలవలేదని విదితమైనది. ఉత్తమ రాజకీయం ఉత్తమ పరిపాలనను ఆధారం చేసుకుని ఉంటుందని ఒక విధంగా గ్రహించుకున్నారు. దానికి విజ్ఞాన, ఆర్థిక సాంఘిక కృషి ఉత్తమ స్థాయిలో జరగాలి. దాని [నిర్మాతలు] నిర్మిత మవుతున్నారు.

ఆంధ్రలో కుల నిర్మూలనోద్యమం

— శ్రీ జె. వీరాస్వామి



ఆంధ్రప్రదేశ్‌లో ప్రథమ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం

తరతరాలుగా భారతజాతిని బలహీనపరచిన కులవ్యవస్థ, ఈనాటికీ జాతీయ సమైక్యతకు, సాంఘిక సౌష్ఠవానికీ భంగం వాటిల్లజేస్తూనే వుంది. యుగాలతరబడి, అంచెలవారీ హెచ్చుతగ్గులు సృష్టించిన కులవ్యవస్థ, హిందూ సమాజాన్ని కొన్ని వందల కులాలుగా విభజించి, జాతిలో ఐకమత్యము, సంఘీభావము పరస్పర ప్రేమాభిమానములు లేకుండా చేసిన కారణంగా భారత దేశంపై దాడిచేసిన దురాక్రమణదారులందరూ సులభంగా విజయం సాధించగలిగారు. దేశము విదేశీయుల పాలనకు లోనైనది. "అందరమూ మానవులం, అందరమూ సోదరులం" అనే భావం పోయి, ఏ కులాని కాకులం, సంకుచితంగా స్వార్థంతో వ్యవహరించడం జరిగింది. పంచములనబడే కులాలవారు అంటరాని కులాలుగా పరిగణింపబడి, వారి ఆత్మగౌరవానికీ, వ్యక్తి స్వేచ్ఛకే భంగం వాటిల్లింది. కులస్వామ్యం ప్రజ్వరిల్లింది.

ఎందరో మహానుభావులు, యుగపురుషులు, జాతీయ నాయకులు, పీఠాధిపతులు, సాంఘిక సంస్కరణ సంస్థలు, మానవతావాదులు ఈ హిందూ సమాజాన్ని సంస్కరించడానికీ, కులతత్వ దురాచారాన్నీ మూఢ విశ్వాసాలనూ, అమానుషమైన అంటరానితనాన్ని రూపుమాపడానికీ, వివిధకాలాల్లో అంకితమై అపారమైన కృషిజేశారు. వీరు వెదజల్లిన సంస్కరణ బీజాలు దేశమంతటితో పాటు, ఆంధ్రలోగూడ వ్యాపించి తెలుగువారిని ప్రభావితంజేశాయి.

కుల వ్యవస్థను నిశితంగా ఖండించినవారిలో ప్రథముడు గౌతమ బుద్ధుడు. శతాబ్దాల పర్యంతం, ఉద్ధృతంగా సాగిన బౌద్ధ

కుల వ్యవస్థను నిశితంగా ఖండించినవారిలో ప్రథముడు గౌతమ బుద్ధుడు

మత ప్రచారంలో భాగంగా, ఆంధ్రదేశంలో ప్రసిద్ధ బౌద్ధ కేంద్రాలైన అమరావతి, నాగార్జున పీఠములనుండి ఆనాడే కులనిర్మూలన ప్రచారంసాగి, మానవతావాదం పెంపొందినట్లు మనకు ఆధారాలు కనబడుతున్నాయి. బౌద్ధమతము జాతి, కుల భేదములను పాటింపలేదు. బ్రాహ్మణుడు మొదలు పంచమునివరకు అందరూ బౌద్ధమును పొందుటకుగాని, అర్చనాదులందు పాల్గొనుటకుగాని సమానమైన, అధికారముగలవారని. ధాన్యకటక స్థూపమునందలి శాసనము బట్టి ఋజువైనది.

అందరికీ మోక్షమార్గం

విశిష్టాద్వైత సిద్ధాంత కర్తయైన రామానుజుడు కులభేదములను తిరస్కరించాడు. సాంప్రదాయమును ధిక్కరించి, పంచములకుగూడ సమాజములో సమాన స్థానమునిచ్చి, అందరికీ మోక్షమార్గాన్ని బోధించాడు రామానుజ మత ప్రభావంవల్ల ఆంధ్ర ప్రాంతంలోగూడ కులవ్యవస్థ కట్టుబాట్లు కొంతవరకు సడలినవి. వీరశైవాన్ని వ్యాపింపజేసిన బసవేశ్వరుడు, దాదాపు ఎనిమిది శతా

పల్నాడులో మంత్రి బ్రహ్మనాయుడు కులభేదాల నిర్మూలనకు నడుం కట్టాడు

ద్వారా క్రితమే, కులవ్యవస్థ నిర్మూలనకు తిరుగులేని పద్ధతిని సూచించాడు. అదే కులాంతర వివాహాల పద్ధతి కులాంతర వివాహాలు జరిపించి, ప్రోత్సహించాడు. వీరశైవ వ్యాప్తివల్ల ఆంధ్ర, కర్నాటక తదితర దక్షిణ భారత ప్రాంతాల్లో కులభేద నిర్మూలన ప్రచారం కొంత సాగింది.

పల్నాడు సీమలో, మంత్రి బ్రహ్మనాయుడు కుల బేధాలను నిర్మూలించటానికి నడుంకట్టాడు. వివిధ కులాలకు చెందిన బిడ్డలను తెచ్చి తన పుత్రునితో సమంగా పెంచాడు. కన్నమదాసు అను హరిజన బాలుని తాను దత్తు తీసికొని, విద్యాబుద్ధులు నేర్పి, తన కుటుంబములో ఒకరుగా పెద్దవాణ్ణి జేశాడు సహపంక్తి భోజనాలు (చాపకూడు) నిర్వహించాడు. వేమన్న కవీంద్రులు కులవ్యవస్థను గర్హిస్తూ, ఎన్నో పద్యాలు వ్రాశారు

ఆధునిక భారతదేశంలో, సంఘ సంస్కరణోద్యమానికి, మూలపురుషుడు రాజారామమోహనరాయలు. క్రిందటి శతాబ్దపు ప్రథమపాదంలో, ఆయన సాంఘిక దురాచారాలతో గణనీయమైన పోరాటాన్ని సాగించారు. వారి కృషితోనే సంఘ సంస్కరణోద్యమం ప్రారంభమయిందని చెప్పవచ్చు. రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, దయానంద మొదలగు మహనీయులు సాగించిన ఆధ్యాత్మికోద్యమాలు, ప్రబోధాలు కులభేద నిర్మూలనకు, అస్పృశ్యతా నివారణకు ఎంతో దోహదం జేశాయి. రాజా రామ మోహనరాయలు బ్రహ్మ సమాజ వ్యవస్థాపకుడు. బ్రహ్మ సమాజం అన్ని మతాలలో ఉన్న సత్యాలను సమన్వయం చేసుకొన్నది. కుల–వర్గ–మత–ఆర్థిక ఇత్యాది భేదాలు పాటించదు. తెలుగుదేశంలో బ్రహ్మసమాజం, ఆర్యసమాజం, దివ్యజ్ఞాన సమాజం, రామకృష్ణమిషన్, థియోసాఫికల్ సొసైటీ, మొదలగు సంఘ సంస్కరణ, సంఘసేవా సంస్థలు కులభేదాలను విస్మరించి, సర్వ మానవ సౌభ్రాతృత్వ విధానాన్ని అవలంబించి, సమాజాన్ని సంస్కరించడానికి విశేషమైన కృషి జేశాయి. భక్తి మార్గ ప్రబోధకుడైన రామానందుడు. రామానందుని శిష్యులైన కబీరుదాసు, రామదాసు, దాదూ మున్నగువారందరు కులభేదాలను అస్పృశ్యతను గట్టిగా విమర్శించి, సన్మార్గమును ప్రబోధించారు గురుదేవులు రవీంద్ర కవీంద్రులు జాతీయ సమైక్యతనుగురించి ఒక సమయంలో ఏమన్నారంటే "తాత్కాలికమైన ఆవేశం" ఆవహించినప్పుడు, మనమంతా ఐక్యతా సూత్రంతో బంధితులమయ్యామని భావిస్తాం. కాని మన సాంఘిక జీవితం వాస్తవానికి భిన్నంగా ఉంటుంది. అందులో ఎన్నో పగుళ్లు, చీలికలు, రంధ్రాలు ఉన్నాయి. కాని, అవేవీ పైకి కనుపించవు. రహస్యంగా తమ పనిని తాము చేస్తూ ఉంటాయి. ఈ చీలికలవల్ల ఐక్యతా సూత్రం ఎక్కువ కాలం నిలబడదు. ఈ ఉన్నతాదర్శాన్ని మనం కాపాడుకోలేము."

మేధావులు, జాతీయనాయకులు అయిన అరవిందఘోష్, వీరసావర్కార్, లాలా లజపతిరాయ్, బిపిన్‌చంద్రపాల్, ఎం. ఎన్. రాయ్, రామ మనోహర్ లోహియా, పెరియార్ ఇ.వి రామస్వామి నాయకర్, అన్నాదురై ప్రభృతులు కుల దౌష్ట్యమును రూపుమాపుటకు కృషిచేశారు సర్వోదయ నాయకుడు శ్రీమన్నారాయణ్ తనపేరు చివరినుండి కులసంకేతమైన అగర్వాల్ అను పదమును తొలగించి, కులాన్ని అన్ని రూపాల్లో నిర్మూలించాలని దేశానికొక మార్గం చూపారు

రాజాజీతో వియ్యం

జాతిపిత మహాత్మాగాంధీ, తను రూపొందించి జీవితాంతం నిర్వహించిన నిర్మాణ కార్యక్రమములో హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ కార్యక్రమమును ప్రధాన కార్యక్రమముగాచేపట్టి, హరిజన దేవాలయ ప్రవేశాలు, వర్ణాంతర వివాహాలు, సహపంక్తి భోజనాలు మొదలగు కార్యక్రమాలు దేశమంతటా నిర్వహించారు. తన కుమారుడైన దేవదాసు గాంధీకి, రాజాజీ కుమార్తెకు వర్ణాంతర వివాహం జరిపించారు.

బాబాసాహెబ్, డాక్టర్ అంబేద్కర్ దళిత వర్గములను ఉద్ధరించుటకు కులనిర్మూలనే ఏకైక మార్గమని ఎలుగెత్తి చాటారు. అస్పృశ్యులైన కులాలవారి ప్రాథమిక హక్కులకొరకు నిర్విరామంగా పోరాడి అమోఘమైన ఉద్యమాలు నడిపారు.

వీరందరి కృషి ప్రభావం అమితంగా ఆంధ్రప్రజానీకాన్ని చైతన్యవంతం జేసింది. ఆ ఉద్యమాల్లో తెలుగువారు ముందుండి పాల్గొనేవారు.

ఆంధ్రదేశంలో ప్రథమ సంఘసంస్కర్తగా ప్రసిద్ధికెక్కినది, కందుకూరి వీరేశలింగంగారు. వీరికి ఆంధ్ర రాజా రామమోహనరాయలనిగూడా నామకరణం చేశారు. శ్రీ జనాభ్యుదయం, అస్పృశ్యతా నివారణ సాంఘిక దురాచార నిర్మూలన ధ్యేయంగా పెట్టుకొని బృహత్తర కృషిజేశారు వితంతు వివాహాలతోను కులాంతర వివాహాలు, సహపంక్తి భోజనాలు నిర్వహిస్తూ, తాను చేపట్టిన సంస్కరణోద్యమానికి సాహిత్యాన్నొక ఆయుధంగా ఉపయోగించారు. పత్రికల ద్వారా, నాటకములు, ప్రహసనముల ద్వారా, సాంఘిక దురాచారములను బట్టబయలుచేసి, చెడుగులను దిద్దే ప్రయత్నం నిర్విరామంగా కొనసాగించారు. కుల చిహ్నమైన జంధ్యం విసర్జించి, సర్వమానవ సమానత్వాన్ని చాటి చెప్పారు. తన యావదాస్తిని హితకారిణి అనే సంస్థను స్థాపించి ప్రయోజనకరమైన పనులు చేపట్టడానికిగాను దానికి ఇచ్చి వేశారు. వీరేశలింగం గారితోపాటు బ్రహ్మసమాజానికే చెందిన రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు అంటరానితనం నివారణకు, విద్యాభివృద్ధికి మహోన్నత కృషి చేశారు. వెంకటరత్నం నాయుడుగారు హరిజన బాలికలను పెంచి, పెద్దవారినిచేసి, విద్యావతులను గావించి వారికి పెండ్లిండ్లు చేశారు సచ్ఛీలము, సౌజన్యము మూర్తీభవించిన వాడు ఆయన. ఆంధ్రదేశం, రఘుపతిని బ్రహ్మర్షి అని కీర్తిం

చింది. బ్రహ్మసమాజ ప్రభావితులైన అగ్రవర్ణస్థులనేకులు పెక్కు సంఖ్యలో కుల చిహ్నమైన జంధ్యములను పరిత్యజించడం, కులాంతర వివాహాలు గావించడం, ఆంధ్రదేశంలో గొప్ప సంచలనాన్ని కలుగజేసింది. ఈ గొప్ప పరిణామం యువతరాన్నెంతగానో ప్రభావితం చేసింది. జంధ్యం తీసివేసి అనుష్ఠానిక బ్రహ్మసమాజికుడు కావడానికి, వీరేశలింగంగారికి మార్గదర్శకుడైనాడు, దేశరాజు పెదబాపయ్య. ప్రముఖ బ్రహ్మసమాజికులు శ్రీ తల్లాప్రగడ ప్రకాశరాయుడు, శ్రీ తారకంగారు, మరి ఎందరో ఈ కృషిని ఇంకమా కొనసాగిస్తూనే వున్నారు. శ్రీ తారకంగారు హరిజన యువతిని పెండ్లాడి మార్గదర్శకులయ్యారు. హరిజనోద్ధరణకు బాపూజీ కార్యక్రమాలను శ్రీ తారకంగారు అమలుపరచారు. చిలకమర్తి లక్ష్మీనరసింహం బాపూజీ హరిజనోద్యమాన్ని చేపట్టడానికి ముందే, రాజా రామ్మోహనరాయలవారి పేరిట, రాత్రి పాఠశాలలను స్థాపించి పంచములనబడేవారికి విద్యాప్రదానం చేయటానికి పాటుపడ్డారు.

పిఠాపురం మహారాజా, కష్టనష్టాలను లెక్కజేయక హరిజనులలో విద్యాభివృద్ధికి విద్యాసంస్థలు స్థాపించి, వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించిన త్యాగశీలి. కుల, మత, జాతి వివక్షతను కూలగొట్టుటకు కృషి చేస్తూ కులవ్యవస్థ ఆధారంగా ఔన్నత్యాన్ని ఆపాదించుకున్నవారిపై తిరుగుబాటు చేశారు. "కవిరాజు" త్రిపురనేని రామస్వామి చౌదరి, భావవికాసోద్యమానికి మూఢ విశ్వాసములపై దాడిచేసి, కులమత వివక్షతలను నేలమట్టము గావించుటకు ఎన్నో రచనలు చేశారు. తెలుగు నాట ఎన్నో వర్ణాంతర వివాహాలను ప్రజలకు తెలిసిన భాషలో త్రిపురనేని చేయించారు. మానవతావాది అవుల గోపాలకృష్ణమూర్తిగారు వర్ణాంతర వివాహాలను ప్రోత్సహించాడు. తన పెండ్లినాడే సహపంక్తి భోజనము చేయించాడు.

ప్రముఖ నాస్తికుడు, సర్వోదయ నాయకుడు అయిన 'గోరా' (గోపరాజు రామచంద్రరావు) గారు కుల, మత విభజనకు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటం సాగించారు. వారి కుటుంబంలోనే హరిజనులతో వర్ణాంతర వివాహాలు చేయించారు. కులం కారణంగా నానా ఇబ్బందులకు గురియై, కుల సంకెళ్ళను త్రెంచుకొని స్వేచ్ఛగా కవితా మాధురిని వశపరచుకొని చాతుర్వర్ణ వ్యవస్థ అను నాలుగు పడగల నాగుబాముపై పగ సాధించారు జాషువా కవి. తెలంగాణా ప్రాంతంలో హరిజనోద్ధరణకు పాటుపడిన మహావ్యక్తి శ్రీ భాగ్యరెడ్డి వర్మ. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ మంత్రిగా పనిచేసిన అరిగె రామస్వామిగారు కొన్ని వందల వర్ణాంతర వివాహాలు చేయించారు. వారి కుటుంబ సభ్యులు చాలా మంది వర్ణాంతర వివాహాలు చేసుకొన్నారు. సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని చాటుతూ, మూడు మతములను మేళవించి తన పేరు పెట్టుకున్నారు శ్రీ ఫ్రాంక్లిన్ రాం మహమ్మద్.

కులపు గోడలను బ్రద్దలుచేస్తూ సువిశాల ప్రపంచంలో స్వేచ్ఛగా జీవించుటకు అనువుగా దేశ నాయకులు కొన్ని శాసనములు గావించారు. భారత రాజ్యాంగం ద్వారా అస్పృశ్యత నిషేధించబడింది. కుల రీత్యా ఏ ప్రాధాన్యత ఉండగూడదని రాజ్యాంగము శాసించింది. షెడ్యూలు కులాలకు, బడుగు వర్గాలకు కొంత కాలం ప్రత్యేక సదుపాయాలు ఇవ్వబడ్డాయి. ప్రత్యేక వివాహముల చట్టము, హిందూ వివాహముల చట్టమువంటి శాసనాల ద్వారా మతాంతర, కులాంతర వివాహాలకు చట్టముయొక్క ఆమోద ముద్ర లభించింది.

సాహిత్యంలో సంఘసంస్కరణ

సాహిత్యపరంగా సాంఘిక దురాచారాలను తొలగించడానికి, ప్రజలలో సంస్కరణాభిలాషను పెంపొందించడానికి "మలిన దేహుల మాలలనుచును, మలినచిత్తుల కధిక కులముల నెలవొసంగిన వర్ణ ధర్మమ ధర్మంబె" అని గురజాడ అప్పారావు వర్ణాశ్రమ ధర్మాలలోని దురాచారాలను నిరసించారు. బసవరాజు అప్పారావు హరిజనులపట్ల అత్యాచారాలను నిరసిస్తూ పాటలు వ్రాశారు. ముట్నూరి కృష్ణారావుగారు తన "కృష్ణాపత్రిక" ద్వారా విస్తృత సేవ చేశారు. ప్రముఖ పాత్రికేయుడు శ్రీ వి ఆర్. నార్ల తన పత్రికలద్వారా సంఘసంస్కరణ బీజాలను సమాజంలో విస్తారంగా నాటుతున్నారు. కాశరాజు హనుమంతరావు, తాపీ ధర్మారావు ప్రభృతులు మూఢనమ్మకాలను, అస్పృశ్యతా దురాచారాన్ని తొలగించడానికి సాహిత్య రంగంలో గణనీయమైన కృషి చేశారు. వేమూరి రాంజీరావు, మంగిపూడి వేంకట శర్మ, ఆదిపూడి సోమనాధరావు, బండారు అచ్చమాంబ తదితరులు ఆంధ్ర దేశంలో అస్పృశ్యతా నివారణకు చేసిన కృషి ప్రశంసనీయము. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' సాంఘిక నవల తెలుగు దేశంలో గొప్ప సంచలనాన్ని కల్గించింది. ఆ నవల ప్రధానాశయం, సంఘ సంస్కరణ ప్రబోధమే. హెచ్చు తగ్గులు ఏ రంగంలో ఉన్నా ఆ దేశం బాగుపడదని స్పష్టం చేసింది. గుణం, శీలం ప్రధానం కాని కులాన్నిబట్టి మానవులను వేరుపరచరాదని 'మాలపల్లి' మహోదాత్తంగా ప్రబోధిస్తుంది. గూడవల్లి రామబ్రహ్మంగారు 'మాలపిల్ల' సినిమా తీశారు. పద్మశ్రీ బోయి భీమన్నగారు తన "కూలి–రాజు" నాటకంలో నిష్కళంక పాత్రను సృష్టించి, కుల రహిత సమాజ ఆశయాన్ని వెలిబుచ్చి, "ధర్మంకోసం పోరాటం"లో దళిత వర్గాలను మేల్కొల్పారు. కొన్ని రాజకీయ పార్టీలు, నాటక సంఘాలు సాంస్కృతిక రంగంలో కల్గించిన సంచలనం ఫలితంగా కులాంతర వివాహాలు, పూలదండల పెండ్లిండ్లు కొంత కాలం జరిగాయి.

కొద్దిమంది యువకులు, కులరహిత సమాజ నిర్మాణ ధ్యేయంతో వర్ణాంతర వివాహాలు చేసుకోవలెనని దీక్షబూని అట్టి వివాహాలు చేసుకున్నారు.

ఈ విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పురోగమిస్తున్న సంఘ సంస్కరణోద్యమం 1971లో "ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం" స్థాపనతో ఒక నూతన రూపాన్ని ధరించింది. ఇంత వరకూ కుల నిర్మూలనకు జరిగిన కృషి ఒక ఎత్తూ. కుల నిర్మూలన సంఘం స్థాపనానంతరం జరుగుతున్న కృషి ఒకఎత్తూ. ఇంతవరకూ వ్యక్తిగతంగానూ, సంఘటితంగానూ కులాల వ్యత్యాసాలను తొలగించడానికి, అస్పృశ్యతను రూపుమాపడానికి ఎంత కృషి జరిగినప్ప

టికీ, "కుల నిర్మూలన" అనే పేరుతో ఉద్యమం నడవలేదు. తటస్థంగా వున్న ప్రజలలో సంచలనం వచ్చి సంస్కరణ కృషి చురుకుగా సాగించడానికి ఒక సంఘం అవసరమని భావించి సంఘ సంస్కరణాభిలాషి శ్రీ జి. సురమౌళి పూనికతో 1971 సెప్టెంబరు 19, 20 తేదీలలో హైదరాబాదులో చరిత్రాత్మకమైన "కుల నిర్మూలన సదస్సు" నిర్వహింపబడింది. ఆ సదస్సు తీర్మానానుసారం, ఈ రచయిత అధ్యక్షతలో ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం అవతరించింది. 1972 రిపబ్లిక్ దినోత్సవం నాటికి పబ్లిక్ సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం క్రింద సంఘం రిజిష్టరు గావింపబడింది. రాజధానిలో ఇన్నాళ్ళూ కుల సంఘాల బోర్డులను మాత్రమే చూచుటకు అలవాటుపడిన పురజనులకు సంఘ కార్యాలయం వద్ద పెట్టిన కుల నిర్మూలన సంఘం బోర్డు విచిత్రంగా కన్పించింది. ఆశ్చర్యంతోపాటు ఆలోచనల్నిగూడ రేకెత్తించింది. అభ్యుదయ భావాలుగల వారెందరో ఆకర్షితులయ్యారు. ఈ రకంగా కుల నిర్మూలన సంఘ స్థాపనతో కుల నిర్మూలన ఉద్యమం ఒక ప్రత్యేకతను సంతరించుకొంది

కులాంతర వివాహాలు జరిపించుట, ప్రోత్సహించుట, అట్టి వివాహములు చేసుకొన్నవారికి, చేసుకొనదలచిన ఔత్సాహికులకు అండదండలుగానుండుట ముఖ్య కార్యక్రమంగా చేపట్టింది కుల నిర్మూలన సంఘం. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో సభలు, గోష్ఠులు నిర్వహించటం, దిన, వార, మాస పత్రికలలో వ్యాసాలు, రేడియో ప్రసంగాల ద్వారా విశేషమైన కృషి జరిగింది. సంఘాధ్యక్షుని వ్యాసాలపై వార్తా పత్రికలలో తర్జన భర్జనలు జరిగి నూతనోత్సాహాన్ని పురికొల్పినవి. కేవలం ప్రసంగాలతో సరిపెట్టకుండా, కుల నిర్మూలన సంఘం ఆచరణలో వర్ణాంతర వివాహాలు ప్రత్యక్షంగా జరుపుతూ, ఆ వివాహ వేదికల ద్వారా కుల నిర్మూలన ప్రచారం సాగిస్తున్నది. రాష్ట్రంలో సంఘ నాయకులు వివిధ జిల్లాలలో పర్యటించి సభలు జరిపారు. ఆ సభలలో, కులాంతర వివాహాలు చేసుకున్న వారికి సన్మానాలు జరపడం తప్పనిసరి కార్యక్రమం. రాష్ట్రమంత్రి వర్యులుగూడా ఆ వివాహ కార్యక్రమాలకు హాజరవుతూ, చేయూతను, సహకారాన్ని అందిస్తూ ఉన్నారు. ఇంతవరకు కులాంతర వివాహాలకు వున్న అల్పభావం పోయి, వాటికి ఒక వేదిక ఏర్పడి గర్వింపదగిన గౌరవ స్థానం లభించింది. రాజధానిలో ప్రారంభమైన యీ ఉద్యమం క్రమేణా జిల్లాలకు వ్యాపించి, జిల్లా కుల నిర్మూలన సంఘాలేర్పడినవి.


కుల నిర్మూలన సంఘం సభ్యుల తోడ్పాటుతో, అప్పటి సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారి కృషితో భారత దేశంలోనే ప్రప్రథమంగా జరిగిన "సాంఘిక సంస్కరణల సదస్సు"ను ప్రభుత్వం 1972 సెప్టెంబరులో నిర్వహించింది. ఈ సదస్సులో కులాంతర వివాహాల విశిష్టత వివరించడమే కాకుండా, కులాంతర వివాహాల ప్రోత్సాహానికి అనేక ఆచరణ సాధ్యమైన, యోగ్యమైన సూచనలు కూడ చేయబడినవి. కందుకూరి వీరేశలింగం గారి 125వ జన్మదిన ఉత్సవాల సమయంలో, గత సంవత్సరం విజయవాడలో జరిగిన రెండవ సాంఘిక సంస్కరణల సదస్సు కార్యక్రమంలో, ఇటీవల జరిగిన రాష్ట్ర హరిజన మహాసభల సందర్భంలో జరిగిన కులాంతర వివాహాలు, కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులకు సన్మానాలు, ప్రభుత్వ అధ్వర్యంలో కుల నిర్మూలన సంఘం జరిపించింది. ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి ప్రోత్సాహంతో, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గారి పూనికతో రాష్ట్ర ప్రభుత్వం వర్ణాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారికి నగదు బహుమానాలను ప్రకటించింది. హరిజనులతో వర్ణాంతర వివాహం చేసుకున్న దంపతులకు వెయ్యిరూపాయలు వెనుకబడిన కులంతో కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు ఐదు వందల రూపాయలు బహుమతి ప్రకటించింది. 1976–77 వ సంవత్సరానికి, 8 లక్షల రూపాయలు వివాహ బహుమతులకు కేటాయించింది. వర్ణాంతర వివాహాలకు స్వయంగా ఆహ్వానించినచో విధిగా హాజరు కావలసినదిగా ప్రభుత్వాధికారులకు ఆదేశాలిచ్చారు. తమ పేర్లనుండి కుల సంకేతాలు తొలగించుకొనేవారికి ప్రభుత్వ గజెటులో పేరు మార్పు ప్రకటన ఉచితంగా ఏర్పాటుచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులిచ్చారు. వర్ణాంతర వివాహం చేసుకున్నవారికి, వారి పిల్లలకు విద్యార్థి వేతనములు, మొదలగు ప్రోత్సాహాలు కలుగజేశారు. రిజిష్టరు వివాహాల విధానం అందరికీ అందుబాటుగా నుండుటకు సబ్ రిజిష్ట్రార్లనుకూడ వివాహ రిజిష్ట్రారులుగా చేశారు. వర్ణాంతర, మతాంతర వివాహములకు ప్రత్యేక వివాహముల చట్టం క్రింద రిజిస్ట్రేషను రుసుమును రద్దు చేశారు. సంస్కరణ వివాహాలు నిర్వహించటానికి రాష్ట్రంలో హైదరాబాదు, విశాఖపట్నం, కర్నూలు నగరాలలో, వీరేశలింగం హాలులను కట్టుటకు ప్రభుత్వం అంగీకరించింది.

"గామాగో"

శాసన సభ్యులు, కుల నిర్మూలన సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిన శ్రీ యం.వి. సుబ్బారెడ్డి గారు సంఘ కార్యక్రమానుసారం తమ పేరునుండి "రెడ్డి" అనే కుల సంకేతాన్ని తొలగిస్తూ, తమ పేరును మహాత్ములు "గాంధీ, మార్క్స్, గోరా" గార్లను స్ఫురింపజేస్తూ "గామాగో" అని మార్చుకున్నారు.

రాష్ట్రంలో కుల నిర్మూలన సంఘ స్థాపనానంతరం వర్ణాంతర వివాహాలు ఐదు వందలకు పైగా జరిగాయి. వీటిలో హరిజనులతో జరిగిన వివాహాలు ప్రధానంగా వున్నవి. అనేక క్లిష్ట పరిస్థితులలో ధైర్యంగా నిలబడి, లక్ష్యసాధననే దృష్టిలో వుంచుకొని, పెక్కు వర్ణాంతర వివాహాలు నిర్ణయించింది, కుల నిర్మూలన సంఘం. సంవత్సరాలు గడిచినకొద్దీ వర్ణాంతర వివాహాల సంఖ్య రాను, రాను పెరుగుతూనే వున్నది గాని, తరగటం లేదు. కుల నిర్మూలనోద్యమం ద్వారా, సమాజంలో గత నాలుగైదేండ్లలో గొప్ప మార్పు గోచరిస్తూంది. కులాంతర వివాహాల యెడల వృద్ధతరం వారికి సానుభూతి, యువతరానికి ఉత్సాహం పెరిగింది. ఇదే కుల నిర్మూలన సంఘం ఆశించిన పరిణామం. ఇదే వేగంతో ఉద్యమం నడిస్తే, కొన్ని సంవత్సరాలలో కులాంతర వివాహాలు సర్వసామాన్యం గాకపోవు!

ఇంతవరకు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని అర్థించకనే సభ్యుల ఇతోధిక విరాళాలతో సంఘ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నవి. కుల నిర్మూలన సంఘ కార్యవర్గ సభ్యులలో ఎక్కువ మంది వర్ణాంతర వివాహాలు చేసికొన్నవారే. అందువల్ల అకుంఠిత దీక్షతో, స్వలాభాపేక్షలేని నిస్వార్థ సాంఘిక సేవజేయ కల్గుతున్నారు. వారిలో ముఖ్యంగా పేర్కొనదగినవారు, శ్రీయుతులు జి. సురమౌళి సంఘ ఉపాధ్యక్షులు, శ్రీ డి. జి. రామారావు, జంటనగరాల అధ్యక్షులు. శ్రీ నాగేశ్వర్, జనరల్ సెక్రటరీ. కీర్తి శేషులు గోరాగారి కుమారుడు శ్రీ లవణం, కోడలు శ్రీమతి హేమలతా లవణంగారు కూడా పేర్కొనదగిన సంఘ కార్యకర్తలే.



1976 జూలై 16న హైదరాబాదు గాంధీ జ్ఞానమందిర్‌లో జరిగిన వర్ణాంతర వివాహానికి ముఖ్యమంత్రి హాజరై వరుడు చి. సాయులును, వధువు చి. సౌ. జ్యోత్స్నను ఆశీర్వదించారు

16–7–76 న హరిజన యువకునకు మరియొక కులమునకు చెందిన యువతికి జరిగిన వివాహమునకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు శ్రీ జలగం వెంగళరావుగారు విచ్చేసి, సంఘ కార్యకలాపాలను శ్లాఘిస్తూ, తగు ధన సహాయము సంఘమునకు చేయు సూచన పరిశీలిస్తామని శలవిచ్చారు.

సాంప్రదాయ సమాజంలో కులాంతర వివాహాలు చేసుకొన్న వారిపై జరుగుతున్న అత్యాచారాలను నివారించటానికి కులనిర్మూలన సంఘం ప్రయత్నిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక ఉన్నత స్థాయి సంఘం యొక్క సహకారాన్ని కూడా ఉపయోగించుకుంటున్నది. ప్రభుత్వ సహాయ, సహకారములవలన నేడు నిర్భయంగా యువతీ యువకులు కులాంతర వివాహాలకు పూనుకుంటున్నారు. తల్లిదండ్రులుగూడ సర్దుకొని పోతున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర హరిజన మహాసభల సందర్భంగా ఏర్పాటైన ఎగ్జిబిషన్‌లో కుల నిర్మూలన ప్రచార సాధనంగా, కులాంతర వివాహాలు చేసుకొన్నవారి ఛాయాచిత్ర పటములతో ఏర్పాటుజేయబడిన స్టాలు, వేలాది ప్రజలనాకర్షించింది. ఈ స్టాలు స్వచ్ఛంద సంస్థల స్టాలులలో ప్రథమ బహుమతినందుకుంది.

ఇటీవల రాజ్యాంగ సవరణలకు సంబంధించి ఏర్పాటైన స్వరణ్‌సింగ్ కమిటీవారికి ఆంధ్రప్రదేశ్ కుల నిర్మూలన సంఘం, కుల వ్యవస్థను రద్దు చేస్తూ రాజ్యాంగ సవరణను తీసుకొని రావలసినదిగా సూచిస్తూ ఒక విజ్ఞప్తిని సమర్పించింది. ఈ సూచనను కమిటీ దృష్టికి తెచ్చినట్లు, ఆలోచనలో వున్నట్లు, కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి తెలియజేశారు. వెంటనే నిర్ణయము తీసుకొనలేకపోయినచో, ప్రజాభిప్రాయమును సేకరించుటకు ఈ ప్రతిపాదనను ప్రజలకు వెల్లడి చేయవలసినదిగా కుల నిర్మూలన సంఘం వారికివిజ్ఞప్తి చేసింది.

యువతకు పిలుపు

ఇంతలో యువజన కాంగ్రెసు నాయకుడు శ్రీ సంజయగాంధీ తాను ప్రకటించిన కార్యక్రమంలో ఐదవ సూత్రంగా కులనిర్మూలనను జేర్చి, యీ కార్యక్రమమును పట్టుదలతో నిర్వహించవలసినదిగా భారత యువతకు పిలుపునిచ్చుట ముదావహము. తత్ఫలితంగా, ఆంధ్రప్రదేశ్‌లోని యువజన కాంగ్రెసుగూడ పెద్దపెట్టున వర్ణాంతర వివాహాలు నిర్వహించే అనుకూల వాతావరణం ఏర్పడినది.

ఆంధ్రప్రదేశ్‌లో కుల నిర్మూలనోద్యమం గట్టి పునాదులు వేసుకున్నదనడంలో సందేహంలేదు. భారత యువత తొలినుండి త్యాగానికి పేరుమోసింది. వంగ రాష్ట్రము, తెలుగు ప్రాంతం, అన్ని జాతీయ ఉద్యమాలలో సంఘ సంస్కరణ ఉద్యమాలలో, ముందంజ వేసి ఖ్యాతిని తెచ్చుకున్నాయి. కుల నిర్మూలన ఉద్యమంలో గూడా తెలుగువారు ప్రథమ శ్రేణిలో ఉంటే ఆశ్చర్యంలేదు. ప్రభుత్వ సహాయ సహకారములతో సంజయ్ గాంధీ గారు, తదితర యువజనుల కార్యదీక్షతో క్రమేపి ఈ ఉద్యమం బలాన్ని పుంజుకొని, భవిష్యత్తులో యావద్భారతదేశంలో కుల రహిత సమాజం ఏర్పడగలదని ఆశించవచ్చు.

మేటి రేవు మన విశాఖపట్నం

- శ్రీ వి. పాండురంగరావు

* మన దేశంలో పెద్ద రేవులు పది వున్నాయి. వాటిలో మూడవస్థానాన్ని—అలంకరిస్తున్నది మన విశాఖపట్నం రేవు.
* తూర్పు తీరాన వున్న పెద్ద రేవులలో మొదటి స్థానం విశాఖపట్నానిదే।
* సరుకుల రవాణాలో అత్యధిక శాతం యంత్రాలతో చేయించే ఘనత ఈ రేవుదే.
* టగ్‌లు, క్రేన్‌లు మొదలయిన సాధన సంపత్తిలో ఇతర రేవుల కన్న ముందున్నది విశాఖపట్నం రేవు.
* ఇనుపఖనిజం రవాణాకు 'మెకానికల్ టిప్లర్స్'ను 'కన్వేయర్ సిస్టమ్'ను నెలకొల్పిన మొదటి భారతీయరేవు విశాఖపట్నం.
* దేశంలోకెల్లా అతి లోతైన రేవు విశాఖపట్నం ఔటర్ హార్బర్।
* ఆసియాలోకెల్లా అతిపొడవైన 'కన్వేయర్ సిస్టమ్' వున్నది విశాఖపట్నం ఔటర్ హార్బరు।
* గత సంవత్సర కాలంలో సరుకుల నెత్తడంలో దించడంలో సగటున నాలుగురోజులకొక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పిన ఖ్యాతి విశాఖరేవు కార్మికులది॥

'దూరపుకొండలు నునుపు'—

'ఏటి ఆవలి ఒడ్డు పచ్చన'—

'పెరటిచెట్టు మందుకు పనికిరాదు'— అవన్నీ తెలుగు సామెతలు కావడం వల్ల కాబోలు తెలుగువాడికి తనవాటి పట్ల మక్కువ తక్కువ. వాటి గురించి తెలుసుకోవాలన్న జిజ్ఞాసగాని, తెలిసినవాటిపట్ల గర్వం సంతోషం కాని వుండవు తెలుగువాడికి... అటువంటి అలసత్వానికి గురి అయినదే విశాఖపట్నం రేవు.


ప్రపంచంలోని అత్యుత్తమమైన, అత్యాధునికమైన, అతి లోతైన రేవులతో దీటుగా రాణిల్లుతున్న విశాఖపట్నం రేవు గురించి చెప్పవలసింది ఎంతో వుంది; తెలుసుకోవలసింది ఎంతో వుంది.

నలభై మూడు సంవత్సరాల కింద 1933లో అక్టోబర్ 7వ తారీకునాడు 'జలదుర్గ' అన్న భారతీయ నౌక ప్రవేశించడంతో— విశాఖపట్నం రేవు (ఇన్నర్ హార్బర్) చరిత్ర మొదలయింది.

అందాల రేవు

మేఘాద్రిగెడ్డ అన్న నదీ ముఖద్వారం వద్ద ఒక పాయను డ్రెడ్జర్ల(త్రవ్వోడ) సాయంతో త్రవ్వగా ఏర్పడిన విశాఖపట్నం రేవు, ఇటూఅటూ కొండలతో సహజసుందరంగా భాసిస్తున్నది.

బంగాళాఖాతం నుండి ఇన్నర్ హార్బర్‌లోకి నౌకలు వెళ్ళే దారిని 'ఎంట్రన్స్ ఛానల్' అంటారు. ఆ ఛానల్‌కు అటు డాల్ఫిన్స్ నోస్' అనబడే యారాడకొండ, ఇటు రాస్‌హిల్ వున్నాయి. రాస్ హిల్ మీద చర్చి, ఆ ముందున్న గుట్టలపై ఒక దర్గా, వేంకటేశ్వరస్వామి ఆలయమూ వున్నాయి. ఈ విధంగా మన దేశపు



విశాఖ ఔటర్ హార్బర్ ఓర్ బెర్తిమీద షిప్ లోడర్

"సెక్యులర్" ప్రాతిపదికను ప్రతిబింబించే ఈ విశాఖరేవు ముఖం అనన్య సామాన్యమైన అందంతో కనబడుతుంది.

లోపలి రేవులో ప్రస్తుతం మొత్తం 18 నౌకలు ఒక్కసారిగా లంగరు వేయడానికి వీలుంది. నౌకలు ఆగి సరుకులు రవాణాచేసే చోటుని 'బెర్తు' అంటారు. రైలుబండికి 'ప్లాట్‌ఫారమ్' ఎలాంటిదో నౌకకు 'బెర్తు' అలాంటిది.

అయస్కాంతం వంటి రేవు

విశాఖ రేవు ఎగుమతి దిగుమతులలో సగభాగాన్ని ఆక్రమించేది ఇనుపఖనిజపు ఎగుమతి. అందుకనే ప్రత్యేకంగా ఇనుప ఖనిజపు నౌకలకని రెండు బెర్తులు కేటాయించారు. వాటిని 'వెస్టు ఓర్ బెర్తు' లంటారు. ఇక్కడ నౌకలలోకి గంటకు 3000 టన్నుల వేగంతో ఖనిజాన్ని వర్షించే 'షిప్‌లోడర్లు' రెండున్నాయి. బైలదిల గనుల నుండి వచ్చే రైలువ్యాగన్ల నొక్కొక్కదానిని అమాంతంగా పైకెత్తి బోర్లించే 'వేగన్ టిప్లర్లు' రెండున్నాయి. ఇలా పడిన ఖనిజం కన్వేయర్ మీదుగా వచ్చి, "షిప్‌లోడర్" గుండా నౌకలలోకి పడుతుంది. ఈ విధంగా వేగన్ల నుండి యాంత్రికంగా ఖనిజాన్ని దించుకునే భారీ ప్రమాణపు "ఓర్ హాండ్లింగ్ ప్లాంట్" విశాఖరేవులో 1965లో నెలకొల్పబడింది. ఇదే మనదేశపు మొదటి ఓర్ హాండ్లింగ్ ప్లాంట్; ఇది 75 టన్నుల ఖనిజం వున్న ఒక వేగన్‌ను 2-3 నిమిషాలలో ఖాళీచేస్తుంది. 40 రైలు వేగన్ల బండి నీవిధంగా ఖాళీచేసి వెనక్కు పంపడానికి గంటన్నర కాలం మాత్రమే పడుతుంది.

ఇనుపఖనిజానికి వున్నట్లుగానే రసాయన ఎరువుల నిమిత్తం ఒక ప్రత్యేకమైన ఫెర్టిలైజర్ బెర్తు, ఇంధన తైలాల నిమిత్తం ఒక ఆయిల్ బెర్తు వున్నాయి.

ఈ విధంగా 18 బెర్తులున్న విశాఖ ఇన్నర్ హార్బర్‌లోకి 36000 టన్నుల బరువు దాకగల నౌకలు రావచ్చును. కాని అంతకంటె బరువైన నౌకలు రావడానికి సరిపడే లోతులేదు. అందులోనూ విశాఖనుండి ప్రధాన ఎగుమతి అయిన ఇనుప ఖనిజం రవాణాలో ప్రపంచమంతటా లక్ష లేదా అంతకన్న ఎక్కువ టన్నుల నౌకలను వాడుతున్నారు. నౌకలు పెద్దవయిన కొద్దీ సరుకు రవాణాఖర్చు తగ్గుతుంది. అంచేత అంతర్జాతీయ విపణిలోని పోటీకి తట్టుకుని, గిట్టుబాటయే ధరకు మనదేశం ఇనుపరాయిని అమ్మాలి అంటే లక్ష టన్నుల ఓడలకు ఆశ్రయం ఇవ్వగల హార్బర్లను నిర్మించాలి.

అపూర్వమైన రేవు

ఆ కారణంచేతనే సుమారు వందకోట్ల రూపాయలతో విశాఖపట్నం ఔటర్‌హార్బర్‌ని కట్టారు. ఈ ఔటర్ హార్బర్‌కు ఇంకా లాంఛనంగా ప్రారంభోత్సవం జరగలేదు. కాని ఇది అప్పుడే (సెప్టెంబర్ 75 నుండి) పనిచేస్తూంది; నేటికి ఒకకోటి రూపాయలపైగా ఆర్జించింది. ఈ హార్బర్ ప్రస్తుతం లక్ష టన్నుల ఓడలకు ఆశ్రయం ఇస్తూంది. మున్ముందు రెండు లక్షల టన్నుల ఓడలకు ఆశ్రయం ఇవ్వడానికి వీలుగా దీని నభివృద్ధి పరుస్తారు దీని నానుకుని నాలుగుకోట్ల రూపాయల చేపలరేవు చురుకుగా తయారవుతుంది.

విశాఖ ఔటర్‌హార్బర్ నిర్మాణం ప్రపంచరేవు నిర్మాణ చరిత్రలో ఒక ఉజ్జ్వల అధ్యాయం. మానవ సంకల్పం, శక్తి, దీక్ష సాధించగలదానికి ప్రత్యక్ష నిదర్శనంగా అలరారుతున్న ఈ హార్బర్ నిర్మాణంలో అనేకానేక అద్భుత విజయాలను సాధించారు.

(i) లక్షటన్నుల ఓడలు నిలవడానికి తగిన నిలకడ, తగిన (అంటే 16.5 మీటర్ల) లోతు గల 200 హెక్టార్ల ప్రశాంత జలాశయం.

(ii) అలల తాకిడిని తగ్గించి జలాశయాన్ని ప్రశాంతంగా వుంచగల మూడు 'బ్రేక్‌వాటర్లు' (అనబడే సముద్రమధ్యాన నిర్మించిన కొండల వంటి గోడలు).

(iii) రెండు భారీ ఇనుపఖనిజపు నౌకలు చెరొకవైపు నిలవగల ఓర్ బెర్తు.

(iv) ఔటర్‌హార్బర్‌లో నిలిచిన నౌకలలోకి ఇనుపఖనిజాన్ని చేరవేయగల, 4.83 మీ. పొడవు గల (ఆసియాలోకెల్లా పొడవయినదయిన) కన్వేయర్ సిస్టమ్, దాని చివర గంటకు 8000 టన్నుల ఖనిజాన్ని కుండపోతగా వర్షించే 'షిప్ లోడర్'

—ఇవి ఔటర్‌హార్బర్ నాలుగు ప్రధానాంగాలు.


'సిరి' గల రేవు

1933-34లో 1.28 లక్ష టన్నుల సరకులను రవాణా చేసిన విశాఖరేవు 1975-76లో 91.11 లక్షల సరకులను రవాణా చేసి భారతదేశపు పది పెద్ద రేవులలో మూడవస్థానాన్ని, తూర్పు తీరపు రేవులలో కలకత్తా మద్రాసులకు తీసిపోవని మొదటిస్థానాన్ని ఆక్రమించింది. దేశంలో ఇంకేరేవుకూ లేనట్టి 150 టన్నుల బరువునెత్తే 'భీమ' క్రేన్ 3 టన్నుల 'బొలార్డుపుల్' గల అతి శక్తివంతమైన స్వయంచోదితమైన టగ్ 'సిరి' వంటి సాధన సంపత్తి ఈ రేవుకున్నాయి.

ఇనుపఖనిజం, భిలాయ్ నుండి ఇనుము ఉక్కు సామాగ్రి, మాంగనీస్, పంచదార, అల్యూమినం మొదలగు ఎగుమతులనూ, ఆహారధాన్యాలు, రసాయన ఎరువులు, వాటి ముడిపదార్థాలు, క్రూడ్ ఆయిల్ వంటి దిగుమతులనూ చేస్తున్న ఈ రేవు కారణంగా ఈ ప్రాంతంలో అనేకానేక పరిశ్రమలు వర్ధిల్లాయి; మున్ముందు ఉక్కు కర్మాగారంతో సహా ఎన్నో రానున్నాయి.

ఔటర్‌హార్బర్ నిర్మాణంతో ప్రపంచంలోని అతి లోతైన అతి ఆధునికమైన కొద్ది రేవులలో ఒకటి అయిన విశాఖపట్నంరేవు రానున్న దశాబ్దాలలో మన దేశ ఆర్థిక చరిత్రలో మహత్తరమైన పాత్ర వహించ తీరుతుంది.

అందుకు సందేహం లేదు.



తెలుగులో అముద్రిత గ్రంథ సంపద

కళాప్రపూర్ణ వడ్లమూడి గోపాలకృష్ణయ్య

> తెలుగు భాషా సాహితీ సంస్కృతులు అతి ప్రాచీన కాలంలోనే మూడు పూవులు ఆరు కాయలుగా వికసించి ఫలించాయని, తెలుగు భాష మూల ద్రావిడ భాష కంటే కూడా ప్రాచీనతమమైనదని, సాధికారికంగా నిరూపించడానికి తగిన ఆధారాలు గత కొద్ది సంవత్సరాలుగా నేను జరుపుతున్న బహుముఖమైన పరిశోధనవల్ల నిరూపించడానికి తగిన అవకాశాలు లభించాయి.

కళా ప్రపూర్ణ. డాక్టర్ కేశిరాజు వేంకటనృసింహ అప్పారావుగారు కూడా శ్లోకికా లౌకిక సంస్కృత భాషలకు, ద్రావిడ భాషలకు ప్రత్యేకించి తెలుగు భాషకు వున్న సంబంధాల గురించి గత నాలుగు సంవత్సరాలుగా చేస్తున్న పరిశోధనలవల్ల కూడా తెలుగు అత్యంత ప్రాచీనతమమైన భాష అని, నిరూపించడానికి తగిన ఆధారాలు లభిస్తున్నాయి.

మామూలుగా కావ్య భాషకు శ్రీకారం చుట్టి క్రీ.శ. 11 వ శతాబ్దంలో నన్నయభట్టు మనకు సాహిత్య భిక్ష పెట్టాడని చాలామంది భావం. నన్నయభట్టే ఆంధ్ర శబ్ద చింతామణి రచించిన తొలి వ్యాకరణ కర్త అని మరికొందరి భావం. వాస్తవం పరిశీలిస్తే నన్నయకు అత్యంత ప్రాచీన కాలంలోనే ఆంధ్ర భాష మూడు పూవులు, ఆరు కాయలుగా వికసించి ఫలించి అనంతరం మతకల్లోలాలతో, దేశ కల్లోలంతో అప్పటి ఆంధ్ర సాహిత్యం కాలగర్భంలో కలిసిపోయి తిరిగి కొన్ని శతాబ్దాల తరువాత రాజరాజనరేంద్రుని కాలంలో, మొగ్గ తొడిగి పూచి కాచిందేమోనని అనిపిస్తుంది.

ఆంధ్రవిష్ణువు కాలంలో "త్రిలింగ క్షేత్రం"

క్రీ.శ. 1050 ప్రాంతంలో వున్న నన్నయ భట్టునకు పూర్వమే, కాస్తాకూస్తా కాదు దాదాపు పధ్నాలుగు వందల సంవత్సరాలకు పూర్వమే—అంటే క్రీస్తుకు పూర్వం నాల్గవ శతాబ్దంలోనే ఆంధ్ర విష్ణువు రాజ్య కాలంలో తెలుగు దేశం త్రిలింగ దేశంగా ప్రసిద్ధి చెంది తెలుగు సాహిత్య సంస్కృతులు మహోచ్ఛ దశనందుకున్నట్లు తెలుస్తున్నది. సుచంద్రుని కుమారుడైన ఆంధ్ర విష్ణువు రాక్షస స్వభావంకల నిశుంభుడనే దుష్టరాజును వోడించి శ్రీకాకుళంలో—అంటే నేటి కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో రాజ్యాన్ని స్థాపించి నిష్కంటకంగా పరిపాలన కొనసాగించాడట. ఆ ఆంధ్ర విష్ణువు తన రాజ్యానికి శ్రీశైలం, భీమేశ్వరం, కాళేశ్వరం అనే మూడు పుణ్యక్షేత్రాలను తన దేశముఖ ద్వారాలుగా ఎన్నుకొని వాని పరిధిలోని దేశాన్ని పాలించాడట. అతని కాలాను చే ఆంధ్ర దేశం త్రిలింగ క్షేత్రమని ప్రసిద్ధి చెందినదని తెలుస్తున్నది. ఈ విషయాలకు ఉపబలంగా ఈ క్రింది బ్రహ్మాండ పురాణాంతర్గతమైన సుచంద్రుని గాథ కనిపిస్తున్నది.



"ఆంధ్ర నాథో మహా విష్ణుర్నిశుంభదను జాపహో
పురాస్వయంభు వమనోః కాలే కలియుగే హరిః
కాకులే రాజవర్యస్య సుచంద్రస్య తనూభవః
అథవత్సర్వ దేవైశ్చ వేష్టితో లోక పూజితః
శ్రీశైల భీమ కాళేశ మహేంద్రగిరి సంయుతం.
ప్రాకారంతు మహత్కృత్వా త్రీణి ద్వారాణిచాకరోత్
త్రిలోచనో మహేశస్త్రి శూలంచ కరే వహన్
త్రిలింగ రూపీన్య వసత్ త్రిద్వారేషు గణైర్వృతః
ఆంధ్ర విష్ణుస్సురయుతో దనుజేన నిశుంభునా
యుద్ధ్వాత్రయోదశయుగాన్ హత్వాతంరాతు నోత్తమా
అవసత్త్రత్ర ఋషిభిర్యుతో గోదావరీ తటే
తత్కాల ప్రభృతి క్షేత్రం త్రిలింగమితి విశ్రుతమ్"

వేదంలోనే ఆంధ్రజాతి ప్రసక్తి వున్నప్పుడు- ఉన్నదని చారిత్రికులందరూ శిరసావహించి ఆమోదించినప్పుడు బ్రహ్మాండ పురాణాంతర్గతమైన ఈ ఆంధ్రవిష్ణువు ప్రస్తావనను అప్రామాణికమని, పుక్కిటిపురాణమని త్రోసిపుచ్చలేము. బ్రహ్మాండ పురాణం, తక్కిన పురాణాలతోపాటు వేదకాలానికి ఎన్నోవేల సంవత్సరాల తరువాత అవతరించిందే కదా ! ఆంధ్రసాహిత్యం సంస్కృతి ఎంతో అభివృద్ధి చెందిన దశలో ఆంధ్ర విష్ణువు పరిపాలకుడుగా రంగంలోకి వచ్చినట్లు అతని పేరే చెప్పక చెప్ప గలదు. ఆంధ్రజాతి బహుముఖంగా అభ్యుదయం చెందకుండానే వుంటే ఏ విధంగానూ అభ్యుదయం చెందని ఆ జాతిని దృష్టిలో పెట్టుకొని, ఆ జాతి దేవుని పేరు మీద ఆంధ్ర విష్ణువు తలఎత్తేవాడే కాదు. సృష్టి స్థితి అభ్యుదయానికి మూలకారకుడు మహావిష్ణువు. ఇదే విధంగా ఆంధ్రజాతి స్థితికి, అభ్యుదయానికి బహుముఖ వికాసానికి మూలభూతుడవుతాడన్న దృష్టితో వేద జ్యోతిష శాస్త్రజ్ఞుల సలహాపై సుచంద్రుడు తన సుపుత్రునికి "ఆంధ్ర విష్ణువు' అని పేరు పెట్టి వుండవచ్చును అందువల్ల ఆంధ్రవిష్ణువు రాజ్యకాలంలో ఆంధ్రసాహిత్యమూ, సంస్కృతీ ఎంతగా అభివృద్ధి చెందివుంటాయో మన ఊహకైనా అందని విషయం.

మత కల్లోలాలు, వర్గ విభేదాలు

అయితే క్రీస్తుకు పూర్వం నుంచీ 11 వ శతాబ్దంలో వున్న నన్నయ్యభట్టు కాలం వరకు అవతరించిన వివిధ సాహిత్యగ్రంథాలన్నీ విభిన్న మత కల్లోలాలతో వర్గకలహాలతో కాలగర్భంలో కలిసి పోయినట్లు కనిపిస్తున్నది. నన్నయ్యకు పూర్వకాలంలో అత్యధికంగా ఆంధ్రదేశంలో జైన, బౌద్ధమతాలకు చెందిన, వివిధ గ్రంథాలు అవతరించినట్లు కనిపిస్తున్నది. ఇందుకు ఉదాహరణగా నన్నయ్యకాలంలోనో, ఇంచుక పూర్వకాలంలోనో, రచింపబడిందనుకుంటున్న వేములవాడ భీమకవి రచనగా ప్రసిద్ధిచెందిన "మల్లియ రేచనకృతమైన కవిజనాశ్రయం" అనే ఛందో గ్రంథాన్ని పేర్కొనవచ్చును రేచన జైనకవి అని చెప్పడానికి, ఈ గ్రంథంలో నూటికి నూరుపాళ్ళు ఆధారాలు ఉన్నాయి. నన్నయ్య, నన్నెచోడులకు పూర్వకాలంలో

అవతరించిన సాహిత్యమంతా, శైవ, వీరశైవ, వైష్ణవ, వీరవైష్ణవ, వైదిక, జైన, బౌద్ధాదిమత కల్లోలాలతో సర్వనాశనమైపోయి వుంటుందని దృఢంగాచెప్పవచ్చును. నన్నయ్య భట్టుకు, తిక్కనకుమధ్య దాదాపు 200 సంవత్సరాల అంతరం వున్నది. ఈమధ్య కాలంలో నన్నెచోడుని కుమారసంభవం, పాల్కురికి సోమనాథుని వివిధ శైవ వాఙ్మయ రచనలు అన్నమయ్య సర్వేశ్వర శతకం, అంతకు పూర్వం పండితారాధ్యుని రచనలు మనకు లభించాయి. ఇవన్నీ శైవ, వాఙ్మయానికి సంబంధించినవే. నన్నయ తరువాత హరిహరాభేదాన్ని పునరుజ్జీవింపచేసి తిక్కన గంటం పట్టేవరకూ అసలు అటు వైదిక వాఙ్మయంకాని, ఇటు వైష్ణవ వాఙ్మయంకాని తెలుగులో ఏ మాత్రం అవతరించలేదని, మనం చెప్పగలమా! నన్నయ, తిక్కనల మధ్యకాలంలో ఆయా మతాలకు సంబంధించి వేలాది గ్రంథాలు అవతరించే వుంటాయి. ఆ గ్రంథాలన్నీ వీరశైవ, మత ప్రభావం ముందు నిలువలేక అగ్నికి ఆహుతైపోయి వుంటాయని నిశ్చయంగా చెప్పవలసి వున్నది. అప్పటి మత కల్లోలాలలో ఎన్నెన్నో గ్రంథాలను. పీటస్థానాల వంటి మఠాలను అగ్నికి ఆహుతి చేసినట్లు కనిపిస్తున్నది. మన చరిత్రలో శివాలయాలు, వైష్ణవాలయాలగాను, విష్ణ్వాలయాలు శివాలయాలుగాను మార్చివేసిన సంఘటనలు లేకపోలేదు. ఎన్నెన్నో బౌద్ధస్తూపాదులు, అంతకుపూర్వమే ఇతర దేవాలయాలుగా మతోన్మాదులు మార్చివేసినట్లు చరిత్ర చాటుచున్నది. పాపభీతి, దైవభీతి లేకుండా దేవాలయాలనే రూపుమాపగల మతోన్మాదులకు సాహిత్య గ్రంథాలు లెక్కాపత్రమా! అందువల్ల నన్నయ తిక్కనల నడిమికాలంలో అవతరించిన, శైవేతర సాహిత్య మంతా నన్నయకు పూర్వం అవతరించిన, వైదికేతర మతాలైన బౌద్ధ, జైనాది మత గ్రంథాలన్నీ మతోన్మాదుల దుశ్చర్యలకు ఆహుతి అయిపోయి వుంటాయనడంలో సందేహం లేదు.



ఆంధ్ర సాహిత్య పరిషత్ గ్రంథాలయం

ఏది ఏమైనా అమూల్య అపూర్వకృతులైన నన్నెచోడునికుమార సంభవం, నన్నయ ఆంధ్ర మహాభారతం (క్రీ.శ. 1050 ప్రాంతం) మొదలు 19 వ, శతాబ్ది చివరివరకు మనకు అనేక వేల తాళపత్ర గ్రంథాలు లభించాయి. భారత రామాయణాది గ్రంథాలు, అనేక కావ్యాలు, కొన్ని ఛందో గ్రంథాలు, అలంకార వ్యాకరణ గ్రంథాలు, జ్యోతిష, సాముద్రికాది గ్రంథాలు అనేకం ముద్రితాలైనాయి. కాకినాడలో వున్న ఆంధ్ర సాహిత్య పరిషత్ పుస్తక భాండాగారంలో 432 తాళప్రతులు ఇతర వ్రాతప్రతులు వున్నాయి. అలంకార-ఖడ్గ-ధనుర్విద్యా - వాస్తు - కామాది శాస్త్రాలే కాక - ఇతిహాసం - కథలు - కల్ప గ్రంథాలు-గణిత-వ్యాకరణ - ఛందో - జ్యోతిష-ధర్మశాస్త్ర-నిఘంటు గ్రంథాలు

వివిధ మత గ్రంథాలు-పురాణాలు - ప్రబంధాలు - చరిత్ర రచనలు - మాహాత్మ్యాలు - వేదాంత గ్రంథాలు-వైద్య గ్రంథాలు - శతకాలు - వివిధ స్తోత్రాలు-యక్షగానాలు-అనేక రకాల చాటు పద్యాలు-ద్విపదలు-రగడలు-రకరకాల గేయాలు వీటిల్లో వున్నాయి. వీటిల్లో పరిమితంగా వివిధ గ్రంథాలను కొన్నింటిని గత 30 సంవత్సరాలలో ప్రకటించారు.

ఆంధ్ర విశ్వకళా పరిషత్తు లైబ్రరీలో ఒక భాగంగా ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, కాగితపు వ్రాతప్రతుల గ్రంథాలు, 3 వేలు పైగా తెలుగు, సంస్కృత భాషల్లో వున్నాయి. వీటిల్లో సుమారు ఒక వేయి వరకూ తెలుగు వ్రాతప్రతు లున్నాయి. అందులో అముద్రితాలుగా అనేక గ్రంథాలు న్నాయి. వీటిల్లో వివిధ కావ్యాలు - వ్యాకరణ ఛందో అలంకారాది శాస్త్ర గ్రంథాలు-జ్యోతిషం-ధర్మ శాస్త్ర-మత గ్రంథాలు - నిఘంటువులు - వైద్య గ్రంథాలు - వేదాంత గ్రంథాలు - యక్షగానాలు - శతకాలు-వివిధస్తోత్రాలు - ద్విపదలు - రగడలు అనేకం వున్నాయి.



తంజావూరులో వున్న శ్రీ శరభోజి సరస్వతీ పుస్తక భాండాగారంలో సుమారు 800 ప్రాచీన తాళ పత్ర గ్రంథాలు కాని, కాగితపు వ్రాత ప్రతులు కాని, వివిధ తెలుగు రచనలున్నాయి. వీటిల్లో చాలా వరకు ముద్రితాలే అయినా, ఇంకా వంద గ్రంథాలకు పైగా అముద్రితాలుగా పడి వున్నాయి. సంగీత — వేదాంత — ఛందో గ్రంథాలు — నాట్య — జ్యోతిష గ్రంథాలు — ప్రబంధాలు — యక్షగానాలు — మత — మాహాత్మ్య గ్రంథాలు అనేకం వున్నాయి

మద్రాసులో . . .


మద్రాసులో వున్న ప్రభుత్వ ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంలో వేలాది తెలుగు గ్రంథాలువున్నాయి. వీటిల్లో అముద్రితాలుగా వివిధ శాస్త్రాది విషయాలలో వేయి గ్రంథాలకు పైగా వున్నాయి. అయితే ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి. ఆంధ్ర రాష్ట్రం విభజన జరిగినప్పుడు ఆంధ్ర ప్రభుత్వం వాటా క్రింద కొన్ని తెలుగు, సంస్కృత గ్రంథాలను మాత్రమే ఇవ్వడం, జరిగింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిన ఈ తాళ పత్ర గ్రంథాలు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ రీసర్చి ఇనిస్టిట్యూట్ లో భద్రపరచడం జరిగింది. అయితే అంతకు పూర్వమే తిరుపతి దేవస్థానం వారు వేలాది సంఖ్యలో వున్న అన్నమాచార్య కృతులను, తదితర గ్రంథాలను కొన్నింటిని సేకరించి ఓరియంటల్, రీసర్చి ఇనిస్టిట్యూట్ లో భద్రపరచి కీర్తిశేషులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి ప్రభృతుల ఆధ్వర్యంలో అనేక పరిశోధనలు చేయించారు. మద్రాసు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారంనుంచి, ఆంధ్ర రాష్ట్రం వాటాగా తరలించిన గ్రంథాలు, తరలించగా, ఇంకా అనేక తెలుగు అముద్రిత గ్రంథాలు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలోనే వుండిపోయాయి. వీటిల్లో అలంకార—అశ్వ-ఆయుధ-శిల్ప-వాస్తు-జ్యోతిష-గణిత-శకున, స్వప్నాదిశాస్త్రాలు ఛందోవ్యాకరణ గ్రంథాలు—ధర్మశాస్త్రాలు—నిఘంటువులు—పురాణాలు-అనేక ప్రబంధాలు-వివిధమత-మహాత్మ్యగ్రంథాలు, వేదాంత, వైద్య గ్రంథాలు—పెక్కుస్తోత్ర-శతక-గ్రంథాలున్నాయి.

స్టేట్ ఆర్క్యైవ్స్ శాఖ

ఆంధ్ర ప్రదేశ్ బృహత్ రాష్ట్రంగా అవతరించిన తరువాత, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం పక్షాన బహుముఖమైన మన

అముద్రిత గ్రంథాల ప్రతులు ఇరవై రెండువేలకు పైగా వున్నాయి

భాషా సాహితీ సంస్కృతులను పునరుజ్జీవింపచేసి అభివృద్ధి పరచాలనే దృష్టితో మొట్టమొదటి సారిగా 1969లో స్టేట్ ఆర్క్యైవ్స్ డిపార్టుమెంటులో ఒక భాగంగా ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీ అండ్ రిసర్చి ఇనిస్టిట్యూట్ నెలకొల్పబడింది. వివిధ వ్రాతప్రతులను ముద్రిత గ్రంథాలతో తులనాత్మకంగా పరిశోధకులు, పరిశోధించుకోవడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వ కేంద్ర గ్రంథాలయ భవనంలోని రెండవ అంతస్థులో ఈ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీని నెలకొల్పడం జరిగింది. దీనిని నెలకొల్పినపుడు తెలుగు, సంస్కృతం, పర్షియన్, అరబిక్, ఉర్దూభాషల్లో 2300 పుస్తకాలు వున్నాయి. ఆ తరువాత అనేక మంది వ్యక్తులనుంచి దానంగా గాని, కొనడం ద్వారాగాని, మరికొన్ని గ్రంథాలు సంపాదించడం జరిగింది. ఈ మాన్యుస్క్రిప్ట్సు లైబ్రరీని ఒకానొక విశిష్టమైన గ్రంథాలయంగానూ, పరిశోధనాలయంగా సైతం బహుముఖంగా అభివృద్ధి పరచాలనే సంకల్పంతో 1971లో ప్రత్యేకాధికారాలతో నన్ను జాయింట్ డైరెక్టరుగా నియమించడం జరిగింది. ఆ తరువాత ఈ గ్రంథాలయాన్ని బహుముఖంగా అభివృద్ధి చేయడమే కాక, అనేక అముద్రిత గ్రంథాలను ముద్రించే కార్యక్రమం కూడా చేపట్టడం జరిగింది. గౌరవనీయులైన శ్రీ జలగం వెంగళరావుగారు ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ గ్రంథాలయాన్ని విశిష్టప్రతిపత్తితో మరింతగా అభ్యుదయ పథంలో పురోగమింప చేయాలనే దృఢ సంకల్పంతో 1975 జనవరి 1వ తేదీనుంచి స్టేట్ ఆర్క్యైవ్స్ నుంచి దీన్ని విభజించి ప్రత్యేక డైరెక్టరేట్‌గా ఏర్పరచి నన్ను డైరెక్టరుగా నియమించడం జరిగింది అనంతరం ఈ గ్రంథాలయాన్ని ఆశించిన దానికంటే ఎక్కువగా అభివృద్ధి పరచడం జరిగింది. అనేక వ్యక్తులనుంచి దానంగా స్వీకరించడంగా కాని, కొనడంద్వారా కాని, అక్కడక్కడ వివిధ గ్రంథాలయాలలో పడివున్న వ్రాతప్రతులను ఈ గ్రంథాలయంలో కేంద్రీకృతం చేయడంద్వారా కాని ఈ శాఖలో వ్రాతప్రతుల సంఖ్య 22 వేలకు పైగా దాటింది. తెలుగు, సంస్కృతం, తమిళం, కన్నడం, మహారాష్ట్ర, హిందీ, అరబ్బీ, పర్షియన్, ఉర్దూ, టర్కిష్, పంజాబీ, సింధీ, గుజరాతీ, పిస్తో భాషలలో వివిధ విషయాలలో ఈ గ్రంథాలున్నాయి. ప్రస్తుతం తెలుగులో తాళపత్ర గంథాలు కానీ, కాగితపు వ్రాతప్రతులు కానీ దాదాపు వేయి గ్రంథాలున్నాయి. పురాణాలు—కావ్యాలు-ఖగోళ-జ్యోతిష- గణిత-మంత్ర-తంత్ర వైద్య గ్రంథాలు — ఛందో వ్యాకరణ రసాలంకారాది గ్రంథాలు-సంఖ్యాశాస్త్ర గ్రంథాలు-నిఘంటువులు-వివిధ మత గ్రంథాలు-యక్షగానాలు—దండకాలు—స్తోత్రాలు—కొన్ని ప్రాచీన వచన గ్రంథాలు వున్నాయి.



అపూర్వమైన క్యాలండరు

ఇటీవలనే శ్రీ కాకుళంనుంచి శ్రీ ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులద్వారా అమూల్యాలైన కొన్ని అముద్రిత గ్రంథాలు సేకరించడం జరిగింది. వీటిల్లో ప్రత్యేకించి పేర్కొనతగినది క్రీ శ 1803 వ. సంవత్సరంలో బొబ్బిలి సంస్థానసిద్ధాంతి అయిన శ్రీ కొటికెలపూడి నరసింహ శర్మగారు, తెలుగు—ఇంగ్లీషు భాషలలో ఒకేవొక్క పేజీలో మహాప్రతిభావంతంగా క్రీ. శ. ఒకటవ సంవత్సరం మొదలు 20,000 సంవత్సరాలవరకు రూపొందించిన 20,000 సంవత్సరాల క్యాలండరు. ఈ క్యాలండరును చూచి లీప్ సంవత్సరం తోసహా ఏ సంవత్సరంలో నైనా, ఏ నెలలోనైనా, ఏ తేదీనాడైనా ఆది, సోమ, మంగళ, బుధ మొదలైన వారాలలో ఏ వారంవస్తుందో ఐదు నిమిషాలలో గుర్తించి చెప్పవచ్చును.

ఆంధ్రప్రదేశ్‌లోనూ, మద్రాసు రాష్ట్రంలోనూ వున్న వివిధ ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారాలలో అనేక అముద్రిత గ్రంథాలున్నాయి. వాటిల్లో విషయవైవిధ్యాలను దృష్టిలో పెట్టుకొని స్థలాభావంవల్ల కొన్ని గ్రంథాలను ఉదాహరించడం జరుగుతున్నది. కర్త పేరు తెలియని దేశిపదనిఘంటువులూ- హరిభట్టు వరాహపురాణం, క్రొత్తలంక మృత్యుంజయ కవి బృహన్నారదీయం, ఎల్లయ్య కవి బ్రహ్మాండపురాణం, బహిరి పోమనాయకుని భార్గవ పురాణం, శారిగడుపుల ధర్మయ నృసింహపురాణం, మొదలైన పురాణాలూ- పంతుల బ్రహ్మదేవకవి ఇందుమతీ పరిణయం, లింగమగుంటతిమ్మకవి ఉత్తర హరిశ్చంద్ర (ద్విపద), ముడియం వేంకటరమణ కవి కళాధరోపాఖ్యానం, చామర్తి సుందరశేషగిరి రాయకవి కాళిందీ పరిణయం, మను చరిత్రను మించిన పోచరాజు వీరన కృత

మైన మను వంశపురాణం, దూర్జటి వెంకటరాయ కవి రత్నావళీ పరిణయం, కృష్ణ పఠానీ కృత ధర్మరాజ అశ్వమేధం. భద్రకవి లింగకవి సానంద చరిత్ర, మరిగంటి వెంకటనరసింహ కవి తారాశశాంకనందినీ పరిణయం, చిల్వశిడంబు రేని చరితం, రత్నాకరం గోపాలరాజు సౌగంధికాపహరణం, గడివేముల సంజీవయ్య హనుమదర్జున సంవాదం, వేంకటకవి విజయాంకిత చరిత్ర, గోగులపాటి కూర్మనాథ కవి మృత్యుంజయవిలాసం, తడకమల్ల వేంకట కృష్ణారావు రచించిన విశిష్టకృతులైన కళా పూర్ణోదయ కథాసూత్ర సీసమాలిక, కాంచీపుర పుష్పమంజరి, మొదలైన కావ్యాలూ—పూసపాటి విజయ రామరాజు పారాశరహోర (జ్యోతిష గ్రంథం)—పుసులూరి వైద్యనాథ సిద్ధాంతి రచించిన భూ భౌగోళ దీపిక—తిక్కన సోమయాజి కవి వాగ్బంధం, ఉప్పులూరి వెంకటరెడ్డి సకలసార సంగ్రహ చింతామణి, వీర భూపాలుని వీర భూపాలీయం, లింగమగుంట తిమ్మకవి సులక్షణ సారం, బాలబోధ ఛందస్సులు, అథర్వణ ఛందం వంటి ఛందో గ్రంథాలూ—కొండన కవి, మల్లయ కవులు ద్విపద, మంజరీ ద్విపదలలో రచించిన విభిన్న పల్నాటి వీర చరిత్ర గ్రంథాలు—గన్నమాచార్యుని మయ శిల్ప శాస్త్రం, కర్త పేరు తెలియని మరికొన్ని శిల్పశాస్త్ర గ్రంథాలూ—ఘనగిరి రామకవి యథా వాల్మీకి రామాయణం, కొమ్మాజీ సోమనాథ శిల్పాచార్య రచించిన విచిత్ర రామాయణం వంటి ఇతిహాసాలూ—శివరామ లింగకవి రచించిన వీరశైవాచార సంగ్రహం, కర్త పేరు తెలియని విశిష్టాద్వైతం, వైష్ణవ ప్రపత్తి, ప్రమాణ తిరట్టు (వచనం), భాగవత చరిత్ర (వచనం), వంటి మత, మతకర్తల, ప్రచారకుల చరిత్ర గ్రంథాలూ—అంగ పాతాళ సంఖ్య, యుగకాల సంఖ్య, గణిత శాస్త్రం మొదలైన గణిత గ్రంథాలూ—మనుమంచి భట్టు హయలక్షణ విలాసం—పెక్కు మంది రచించిన చాటు పద్యాలూ—గడ్డం నరసింహారెడ్డి, పనుగు తిమ్మయకవి, కెళ్ల కప్పయ్యకవి, మొదలగు కవులు రచించిన చెన్నకృష్ణవిలాసం, రుక్మిణీ పరిణయం, శివలీలా విలాసం, తారాశశాంక విజయం మొదలుగాగల అనేక యక్షగానాలూ—దత్తోజి పండితుని భగవద్గీత, చెన్న వీరయకవి విజ్ఞాన ప్రదీపిక, కర్త పేరు తెలియని వేదాంతసారం, గురు భక్తి యోగం, ముముక్షుజన కల్పకం, వివేకసారం, మొదలైన వేదాంత గ్రంథాలూ – ముడుంబా వేంకటాచార్యులు రచించిన రస ప్రదీపిక, మంత్రి అప్పన చారుచర్య, వేంకటకవి భేషజకల్పం, దేవులపల్లి వెంకయ్య ఆంధ్ర చింతామణి, వంకాయల నరసింహం అనుభవవైద్య గ్రంథంవంటి వైద్య గ్రంథాలూ – అనేక మంత్ర, అంజన, యంత్ర గ్రంథాలూ – సీసమాలికాం గ్రంథాలూ – పెక్కు శతకాలూ – వివిధ పదములూ—వెంకటనారాయణ గౌడ భూపాల, కెళ్ల కప్పయ్య దారపు రెడ్డి వీరయ, ప్రభృతులు అనేకులు రచించిన కీర్తనలూ దండకాలూ – శాహాజీ రచించిన త్యాగేశ పదాలూ—రకరకాల స్తోత్ర గ్రంథాలూ – ఈ అముద్రిత గ్రంథావళి సముద్రంలో కెరటాలవలె వున్నాయి.

మైక్రోఫిల్మ్ సంకల్పం

అన్ని గ్రంథాలయాలలోనూ వున్న ముఖ్యమైన వ్రాత ప్రతులనన్నింటినీ మైక్రో ఫిల్మ్ చేయించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇప్పటికీ మన దేశంలో అనేక మంది గృహాలలో, బీరువాలలోనూ చెక్క పెట్టెలలోనూ భోషాణాలలోనూ అటకలమీదనూ, అనువంశికంగా తాతముత్తాతల సంపదగా, అనేక ప్రాచీన అమూల్య తాళపత్ర గ్రంథాలు వున్నాయి. వీటినన్నింటినీ మనం పునరుద్ధరించుకొని ఆధునిక వైజ్ఞానిక పద్ధతులలో భద్రపరచి అవసరమైన వాటిని, ముందు తరాలవారికై మైక్రోఫిల్మ్ చేసి, రక్షించుకొనవలసిన బాధ్యత ఆంధ్ర దేశ ప్రజలందరి పైనా వున్నది. అముద్రితాలై వున్న వివిధ గ్రంథాలను ముద్రించి ప్రజలకు అందజేయవలసిన అవసరం ఎంతైనా వున్నది. ఈ దృష్ట్యా మన భాషా, సాహితీ సంస్కృతులను పునరుద్ధరించి, పునరుజ్జీవింప చేయడంలో ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీ అండ్ రిసర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టరేట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న మహత్తరమైన కృషిలో ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా పాలు పంచుకొని సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను.





సమస్యాపూరణము

డాక్టర్ దివాకర్ల వేంకటావధాని

తెలుగు భాష ప్రత్యేకత - అవధాన ప్రక్రియ

సమస్యఅనుపదము "సమ్" అను నుపసర్గతోకూడిన "అస్" ధాతువునుండి యేర్పడినది. 'సమస్' ధాతువునకు దగ్గఱగా నుంచుట, కలుపుట, సమాసముగా చేయుట, సమూహముగా గ్రహించుట—అను నర్థములున్నవి. దీనిని బట్టి సమస్యాపదము నకు ఇంకొకదానితో కలిపి సమగ్ర మొనరింపదగినదను నర్థ మేర్పడును. దీనిని తెలుగున కైపద మందురు. కవి పరిజ్ఞాన పరీక్షార్థము పూరింప నిచ్చెడి పద్యాంశము నిప్పుడు సమస్య అను చున్నారు. అనంతుడు భోజరాజీయ ద్వితీయాశ్వాసమున "కైపద మిచ్చువారలను గ్రక్కున పద్యము జెప్పు వారలన్" అని కైపదమును ప్రయోగించి యున్నాడు. సమస్యలు రెండు విధములుగా నుండును. పద్యమునందలి చివరిపాదము నొసంగి అర్థవంతముగా పైమూడు పాదములను పూరింపు మనుట అందొకవిధము. ఒక్కొక్కప్పుడీ చివరిపాద మర్థరహితముగనో, అసంబద్ధార్థముగనో, అన్వయ రహితముగనో కనవచ్చును. కవి పై మూడు పాదములను దీనితో సంబంధ ముండునట్లు, దీనికిగూడా చమత్కార సహితమైన అర్థమును అన్వయమును ఏర్పడునట్లు పూరింపవలయును. ఇట్లు పూరించుట కెంతయో ప్రతిభయు, పాండిత్యమును, సమయస్ఫూర్తియు నావశ్యకములై యుండును. ఒక్కొక్కప్పుడు పరస్పర సంబంధము లేని మూడు పాదములొసంగి సంబంధమేర్పడు నట్లుగా నాల్గవ పాదమును చెప్పి పద్యమును పూర్తి చేయ మందురు. ఇది రెండవ విధమైన సమస్య. దీనిని గూడా పూరించుట సులభసాధ్యమైన పనికాదు. అందుచేతనే లోకమున సమస్యఅనగా గడ్డైన, క్లేశకరమైన పని లేక పరిస్థితి అను నర్థమేర్పడినది. కొన్ని చిక్కు సమస్యల నుండి బైటపడుట దుష్కరము. ప్రతిభావంతులెట్లో వానినుండి తరించి విజయము సాధింతురు. కవితా విషయములో కూడా చమత్కార సహితముగా సమస్యను పూరించుట యెంత ప్రతిభాస్ఫోరకమో అంత ప్రశంసాపాత్రము.

అవధాన మొక సారస్వత వినోద ప్రక్రియ. ఇది ఒక్క ఆంధ్ర దేశమునందే ఎక్కువ ప్రచారమందున్నది. వామనుడను లాక్షణికుడు 'చిత్తైకాగ్ర్యమవధాన'మ్మని అవధానమును నిర్వచించెను. చిత్తైకాగ్ర్యమనగా చిత్తమునొకే విషయము నందు కేంద్రీకరించుట అని యర్థము. అవధానము కలవా డవధాని, సాధారణముగా వేద పండితుల కవధాని అను బిరుద నామముండును. అందుకు వేద మంత్రములను సుస్వరముగను సస్వరముగను ఉచ్చరించుటకు ఎక్కువ అవధానమవసరమై యుండుటయే కారణము. వేదములు స్వరప్రధానములైనవి. అందలి మంత్రములను అపస్వరముతో నుచ్చరించినచో అభిలషితమైన అర్థమరుదేరక పోవుటయేకాక ప్రత్యవాయము కూడ నావహిల్లును. అందుచే వేదమంత్రోచ్చారణ విషయమున నవధాన మత్యంతావశ్యకము. క్రమముగా నవధానపదము వేదరంగమునుండి సారస్వతరంగమున కవతరించి యెక్కువ ప్రచారము పొందినది. అవధానమునందనేక విధములున్నవి. అష్టావధానము, శతావధానము, సహస్రావధానము, నాట్యావధానము, నేత్రావధానము మున్నగునవి. వీనిలో అష్టశతావధానములకును, ఈ రెండింటిలో మరల అష్టావధానమునకును, ప్రాచుర్య మెక్కువ.

అష్టావధానము

అష్టావధానమనగా ఎనిమిది విషయములందు లేక కార్యములందు చిత్తము నేకకాలమున నేకాగ్ర మొనరించుట.

ఈ యెనిమిది విషయము లేవను సందర్భమున అభిప్రాయ భేదములున్నవి. వర్ణనము, దత్తపది, నిషిద్ధాక్షరి, వ్యస్తాక్షరి, పురాణ పఠనము, అప్రస్తుత ప్రశంస ఘంటాగణనము, సమస్యాపూరణము—అనునవి సాధారణముగా ఆ యెనిమిది అంశములై యుండును. అవధానమొనరించు వారు తమ అభిరుచి సామర్థ్యముల ననుసరించి వీని నన్నే యుంచుట కాని వీనిలో కొన్నిటికి బదులు మఱికొన్నిటిని చేర్చుట కాని చేయుచుందురు. వీనిలో వేనిని మార్చినను సమస్యాపూరణమును మాత్రము తొలగింపరు. అది అష్టావధానమున అపరిహార్యము. శతావధానములందుకూడ నొక్కొకప్పుడు సమస్యాపూరణములు జరుగుచుండును.

పృచ్ఛకులు

అవధానములందు ప్రశ్నలడుగు వారిని పృచ్ఛకులందురు. సమస్యనడుగు పృచ్ఛకుడు బాగుగా నాలోచించి తానీయదలచు కొన్న సమస్య నవధాని కొసంగును. అవధాని ఒక్కొక్క పాదము చొప్పున మూడు పాదములను చెప్పి చివరికి నాల్గవ పాదమైన సమస్యను కూడ చేర్చి పద్యమునంతను పఠించును. అవధానములందే కాక సాధారణ సందర్భములందు కూడ వినోదార్థము, పరీక్షార్థము సైతము కవులచే సమస్యలను పూరింపజేయు చుందురు. విజయవాడ యందలి ఆకాశవాణి వారు చాల నాళ్ళు సమస్యాపూరణ కార్యక్రమమును నిర్వహించిరి. వారు ప్రతివారము ఒక సమస్యను ప్రకటింపగా పలువురుత్సాహవంతులైన కవులు, ముఖ్యముగా యువకులు, వారికి పూరణములు పంపుచుండుటయు, వానిలో నుత్తమములైన వానిని వారు చదువు చుండుటయు జరుగుచుండెను. సమస్యా పూరణము శ్రోతకు వినోదప్రదమును, కవితా రచన చేయుదలంచు నారంభకుల కభ్యాసప్రదమును, ప్రౌఢకవులకు ప్రతిభా పాండితీ ప్రదర్శనావకాశ ప్రదమును కాజాలును.

పృచ్ఛకుడు భిన్న సందర్భములందలి పద్యములకు కాని శ్లోకములకు కాని సంబంధించిన మూడు పాదముల నొసంగ నర్థవంతముగా నాల్గవ పాదమును చెప్పి పద్యమును పూరించుట కూడ నొకవిధమైన సమస్యయే యని యిదివఱకు చెప్పబడినది. సాధారణముగా నిట్టి సమస్యా పూరణము సంస్కృతము నందే కానవగును. "వాగర్థా వివ సంపృక్తౌ, శతకోటి ప్రవిస్తరం, తురాసాహం పురోధాయ" అను మూడు పాదములతో కూడిన సమస్య యీ విధముగా పూరింపబడినది. ఈ మూడు పాదములును మూడు భిన్న సందర్భముల నుండి గ్రహింపబడినవి. వాక్కును అర్థమును వలె కలసి యున్నవారు, శతకోటి శ్లోకముల విస్తృతి కలది, ఇంద్రుని ముందుంచుకొని అని పై మూడు పాదముల అర్థము. వీనికా పరస్పర సంబంధ మేదియు లేదు.

వాగర్థావివ సంపృక్తౌ, శతకోటి ప్రవిస్తరం
తురాసాహం పురోధాయ, నేము స్సర్వే సురాశ్శివౌ.

అనునది పూరింపబడిన శ్లోకము. దేవతలు వజ్రాయుధ ధరుడైన (శతకోటి యనగా వజ్రాయుధమను నర్థము కూడా నున్నది) యింద్రుని ముందుంచుకొని వాగర్థములవలె కలసియున్న శివ పార్వతులకు నమస్కరించిరని దీని యర్థము. కవి నేర్పుతో "నేము స్సర్వే సురాశ్శివౌ" అను పాదమును చేర్చి సంబంధము లేని మూడు పాదములకును సుందరమైన సంబంధము కల్పించి శ్లోకమును పూరించెను. ఇట్లే కీ.శే. తిరుపతి వేంకటకవులకు తపస్స్వాధ్యాయ నిరతం (తపస్సు, వేదాధ్యయనము అనువాని యందాసక్తుడైన వానిని) రామాయ రామభద్రాయ (శ్రీరాముని కొఱకు) వేణీ సంహారనాటకం (వేణీ సంహార నాటకమును) అను మూడు పాదములనిచ్చి శ్లోకమును పూరింపుడని యెవ్వరో సమస్య నొసంగగా వారు

తపస్స్వాధ్యాయనిరతం, గురుం పత్వాతరోత్కవిః
రామాయ రామభద్రాయ, వేణీ సంహార నాటకమ్.

అని పూరించిరి. తపస్స్వాధ్యాయ నిరతుడైన గురుని నమస్కరించి కవి శ్రీరామ చంద్రుని కంకితముగా వేణీ సంహార నాటకమును రచించెనని పై శ్లోకమున కర్థము. పరస్పర సంబధములేని మూడుపాదములకును వారు కూర్చిన నాల్గవ పాదము చక్కని సంబంధము కల్పించి శ్లోకము నర్థవంతమొనరించినది. ఇట్లు చేయుటకు పాండిత్యముతోపాటు సమయస్ఫూర్తి కూడా విశేషముగా నుండవలయును. తెలుగున సైతమిట్టి సమస్యలను పూరించుట కవకాశము లేకపోలేదు కాని యవి యరుదు.

పృచ్ఛకులు నాల్గవ పాదమును సమస్యగానిచ్చి పై మూడు పాదములను పూరింపుమని యడుగు పద్ధతి తెలుగునను సంస్కృతమునను కూడ కానవచ్చును. శ్రీనాథుడు రావు సింగ భూపాలుని దర్శింప నరిగినపుడతనికి "కుక్కవో, నక్కవో, ఫణివో, క్రోతివో, పిలివో బూతపిల్లివో" అను సమస్యయీయ బడెననియు నాతడు దానిని ఈ క్రిందివిధమున పూరించె ననియు చెప్పుదురు.

తక్కక రావు సింగ వసుధావరుఁడర్థుల కర్థమిచ్చుచో
దిక్కులేని కర్ణుని, దధీచిని, ఖేచరు, వేల్పుమ్రానును, పెం
పెక్కినకామధేనువు శిబీంద్రుని నెన్నెదు భట్ట దిట్టవై
కుక్కవో నక్కవో ఫణివో క్రోతివో పిల్లివో బూతపిల్లివో

ఇందు రావు సింగభూపాలుడు దధీచి కర్ణ జీమూతవాహన కల్పవృక్ష కామధేను శిబిచక్రవర్తులకంటెకూడ నెక్కువ దాతయని చెప్పబడినది. అట్టి వాడర్థులకు కోరిన యర్థము లొసంగుచుండ

నెప్పుడో కీర్తి శేషులైన కర్ణ దధీచ్యాదులను కల్పవృక్ష కామధేను వులను ప్రశంసింతువేలయని కవి భట్టును గేలిచేయుచున్నాడు. కుక్కవో నక్కవో యిత్యాదులు నిందాస్ఫోరకములై భట్టు న్నతను తెలియజేయుచున్నవి.

భువన విజయసభలో...

సాహితీసమరాంగణ చక్రవర్తియైన రాయలవారి భువన విజయసభలో నాశుకవిత్వ ప్రదర్శనలు,దత్తపదులు,సమస్యాపూర ణములు మున్నగునవి జరుగుచుండెను. రాయలవారొకప్పుడు కవులందఱును కూర్చుండియుండగా ''రవిగానని చో కవిగాంచునే కదా'' అను సమస్యనిచ్చి పూరింపుడని కోరిరట! అప్పుడు భట్టుమూర్తి దాని నిట్లు పూరించెనని చెప్పుదురు.

అరవి వీరభద్రుని పదాహతి డుల్లిన బోసి నోటికిన్
నేరఁడు, రామకృష్ణ కవి నేరిచెఁబో మన ముక్కుతిమ్మరా
ట్భూత్కర పదాహతిం బడిన కొక్కిరి పంటికి దుప్పికొమ్మప
ల్గారచియింప, సౌర ! రవి గాననిచో కవి గాంచునే కదా!

ఈ సమస్య పూర్ణపాదరూపమునలేదు. అది పాదమునందలి ఏక దేశము మాత్రమే. ఈ పూరణమునకాధారమైన వృత్తాంతము నిట్లు చెప్పుదురు. ఒకప్పుడు ముక్కుతిమ్మన ఊయెల మంచముపై కూర్చుండియుండగా తెనాలి రామకృష్ణ డతని చూచుట కరిగి ''తాతా ! ఊతునా ?'' అని అడిగెనట ! తిమ్మన 'ఊ' అని అంగీకారమును తెల్పెను. రామకృష్ణుడు హాస్య ప్రియుడగుటచే ఊచు పదమునకు గల రెండవ అర్థమును గ్రహించి ఆతనిపై ఉమిసెనట! తిమ్మన ఆగ్రహించి కాలిపాదుక నతనిపై విసర నతని పన్నొకటి ఊడిపడెను. రామకృష్ణుడు మెల్లగా నింటికేగి జరిగిన విషయమెవరికిని తెలియకుండ కప్పిపుచ్చుటకై దుప్పి కొమ్ముతో దంతము చేయించుకొని మఱునాడు సభకరుదెంచెను. రాయలవారు పై సమస్య నిచ్చిరి. రామకృష్ణుడెంత కప్పి పుచ్చినను విషయము బట్టబయలైనది. భట్టుమూర్తి పై విధమున సమస్యను పూరించెను. తరువాత రాయలవారడుగ నావృత్తాంతము వివరింపబడెను. రాయలవారు రామకృష్ణునికి జరిగిన అవమానమునకు కొంచెము విచారించినను పూరణము నందలి యౌచిత్యమునెంతో ప్రశంసించియుండిరి. మున్ను దక్షాధ్వర ధ్వంససమయమున వీరభద్రుడుగ్రుడై పూషార్కు మెఱుగు బండ్లూడ దన్నినగాథనిచ్చట ననుసంధించుకొన వలయును. రవికూడిన పండ్లను దుప్పికొమ్ముతోనో మఱి దేనితోనో మరల పెట్టించుకొనవచ్చునను సంశము తెలియదు. కవి యైన రామకృష్ణునకు ఉపాయము తెలియును అప్పటినుండియు నీసమస్యలోకోక్తియైనది. కర్మసాక్షియైన రవియెఱుంగని విషయములను సైతము కవిభావనా మహిమచే నూహింప జాలునను నర్థముకూడ దీనివలన స్ఫురించుచున్నది.

"హా తెలిసెన్"

ఒకప్పుడు రాయలవారు ధూర్జటి కవితామాధుర్యమున కలరి "స్తుతమతియైన యాంధ్రకవి ధూర్జటి పల్కులకేలకల్గెనీ యతులిత మాధురీ మహిమ?" యని పల్కిరట! ఇది ప్రశ్నరూపమున నున్నది. దీనిని తెనాలిరామకృష్ణుడు :

"హాతెలిసెన్, భువనైక మోహనోద్ధతసుకుమారవార వనితా జనతా ఘనతాపహార సంతతమధురాధరోదిత సుధారస ధారలు గ్రోలుటం జుమీ!" అని పూరించెను. ఇందు ధూర్జటి వేశ్యాలోలత్వము వెల్లడిచేయబడినది. ఇది సాధారణమైన సమస్య కాదు. ప్రశ్నరూపమైన సమస్య. దానిని రామ కృష్ణుడు కొంత సభ్యతాలోపమున్నను రసవంతముగా పూరించెను.

సమస్యలనేకవిధములుగానుండును యథాతథముగా చూచిననవి యసంబద్ధములుగా గోచరించును వానికి ముందొక పదమునో, అక్షరమునో, చేర్చుటచేతనో, సమస్యను విడిచి చక్కని అర్థము స్ఫురించునట్లు ముందు కొన్ని పదములను చేర్చుటచేతనో, క్రమాద్యలంకార ప్రయోగము చేతనో కవులు వానిని హృద్యమముగా పూరించుచుందురు. "కుంజర యూథంబు దోమకుత్తుకచొచ్చెన్ "అను సమస్యను రామకృష్ణు డిరు తెఱగుల పూరించెనని చెప్పుదురు.

గంజాయి త్రావి...
సంజాతులగూడికల్లు చవిగొన్నావా ?
లంజల...యెక్కడ
కుంజర యూథఁబు దోమకుత్తుకచొచ్చెన్ !
గజయూథము దోమకుత్తుకయందుచొచ్చుట అసంభవము.

సురాపానమత్తులు కాని ఉన్మత్తులుకాని అట్లసంబద్ధముగా పల్కవచ్చును. రామకృష్ణు డెక్కడ అను ప్రశ్నార్థక పదమును ముందు చేర్చి దానికి తగినట్లుగా పూర్వభాగమును కల్పించి సమస్యను చక్కగా పూరించెను. ఇందుకొంత అసభ్యత యుండుటచే నతడు దానికే మరల సభ్యతా యుక్త ముగా నిట్లు పూరించెను.

రంజనచెడి పాండవు లరి
భంజనులై విరటుగొల్వ జాల్పడిరకటా!
సంజయ! యేమని చెప్పుదు
కుంజరయూథంబు దోమకుత్తుకచొచ్చెన్ !

ఇచ్చట సమానధర్మము బింబప్రతిబింబభావమున చెప్పబడుటచే దృష్టాంతాలంకారమున్నది. పాండవులు విరటుకొల్వు చొచ్చుట కుంజర యూథము దోమకుత్తుక చొచ్చుటవలె నున్న దని భావము "గౌరి ముఖమును చుంబించె కమలభవుఁడు" అను సమస్య అసంబద్ధముగను, అనుచితముగను గోచరించు చున్నది. దీనినొక కవి క్రమాలంకారము ప్రయోగించి యిట్లు పూరించెను.

"పార్వతికి వేఱుపేరేమి ? వదనమునుచు
దేనినందుము ? వేఱొక తీరు చెపుమ
ముద్దుగొనెనన ? వచ్యుతుపుత్రుఁడెవరు?
గౌరి, ముఖమును, జుంబించె, కమలభవుఁడు"

పైమూడు పాదములందలి ప్రశ్నలకును క్రమముగా గౌరి, ముఖమును మొదలగునవి సమాధానములు, ఏవిధముగను పూరించుటకవకాశము లేనప్పుడు సాధారణముగా కవులు క్రమాలంకారము నాశ్రయింతురు.

"అంధుం డర్ధ నిశీధ మందుఁగనె నయ్యర్కేందు బింబమ్ములన్" అను సమస్యపైకి మిక్కిలి విరుద్ధముగా కనబడుచున్నది. ఇందు అసందర్భాంశము లనేకములున్నవి. గ్రుడ్డివాడు చూచుట, అర్ధరాత్రమున చూచుట, రాత్రి చంద్రబింబమునే కాక సూర్య బింబమును కూడ చూచుట అనునవి యిందలి అసందర్భములు. శ్రీ తిరుపతి వేంకటకవులంధ శబ్దమునకు ముందు నిద్రా శబ్ద మును చేర్చి దాని నెంతోరమ్యముగా పూరించిరి.

పుంధర్మేత సరస్వతీకవులతో భూపాలకుండాదితే
యాంధ స్తీక్ష్ణగ భ స్తి బింబముల నుద్యద్వృత్తి వర్ణించి స
ద్గ్రంథమ్మున్ రచియింపుడీఁ యనఁగఁ దద్గ్రంథానుసంధాన ని
ద్రాంధుండర్ధనిశీథమందుఁగనె నయ్యర్కేందు బింబమ్ములన్

పుంభావ సరస్వతులైన కవులతో రాజు సూర్యచంద్ర బింబమ్ము లను చక్కగా వర్ణించి సద్గ్రంథములు రచింపుడని కోరగా నట్టి గ్రంథమును కూర్పనెంచుచు నిద్రచే నంధుడైన (నిద్రించిన) యొకకవి (కలలో లేక భావనలో) నర్ధరాత్రమున సూర్యచంద్ర బింబముల వీక్షించెనని దీనియర్థము. సమస్యలోని అసందర్భముల నన్నిటి నొక్క నిద్రతో తొలగించిన కవుల ప్రతిభ ప్రశంసనీయ మైనట్టిది.

"దారముచేఁ జిక్కిచచ్చె దైత్యుండకటా" అను సమస్యను ఆశుకవిత్వమందును, అవధాన విద్యయందును అఖండ ప్రజ్ఞా ధురంధరులైన శ్రీ గాడేపల్లి వీరరాఘవ శాస్త్రి గారిట్లు పూరించిరి.

ఘోరాకార హిరణ్యా
క్షారూఢిన్ వెడలి పుడమి నటు చాఁపఁగ దో
స్సారమునఁ జుట్టుచును భూ
దారముచేఁ జిక్కి చచ్చె దైత్యుండకటా !

భూదారమనగా వరాహము. హిరణ్యాక్షుడు వరాహావతార మెత్తిన నారాయణునిచే చచ్చెనని భావము. భూ అను పదమును చేర్చుటచే పద్యమునకు హృద్యమైన అర్థమేర్పడినది.

"అంగము చేతఁ బట్టుకొని ఆడి రుగాదిని పండితోత్తముల్" అను సమస్యను రెండేండ్ల క్రింద సంవత్సరాదినాడు 'రేడియో' లో చేసిన అష్టావధానమున నేనిట్లు పూరించితిని.

జంగమజాతసంతతియు, స్థావరవస్తుచయమ్ము, కాంతిపూ
ర్ణాంగములయ్యె, నెల్లెడ పికాళిరవంబులెసంగె, వల్లికీ
సంగతి భూజముల్ చెలగె చారుసుమ ప్రకరమ్ముతోడ, పం
చాంగము చేత బట్టుకొని ఆడి రుగాదిని పండితోత్తముల్

పంచాంగమని చెప్పుటచే సమస్యయందలి అశ్లీలత తొలగు టయే కాక పద్యమౌచిత్య శోభితమగుట కూడ సంభవించినది.

ఈయబడిన సమస్య అర్థరహితముగా కనబడినప్పుడు దానిని విడిచి ముందు కొన్ని పదములు చేర్చి, అర్థవంతముగా పూరించు విధానము మిక్కిలి హృద్యముగా నుండును. తిరుపతి వేంకటకవులు "సంధ్యావందన మాచరింపవలదా చౌశీతిబంధమ్ములన్" అను సమస్య నీవిధముగా పూరించిరి.

వింధ్యాద్రి ప్రభనొప్పు బల్కుచములన్ వేపట్టి పెంపొందు కా
మాంధ్యం బార్పఁగ లేక వెట్టివలె నేలామంచి యీరాతిరిన్
వంధ్యం జేసెదు, కాముకేళి యనఁగాఁ బాండిత్యామా, లేకనీ
సంధ్యా వందనమా, చరింపవలదా చౌశీతి బంధమ్ములన్

చౌశీతి బంధములనగా నెనుబదినాల్గు బంధములు. వీనికిని సంధ్యా వందనమునకును ఎట్టి సంబంధమును లేదు. చౌశీతి బంధములు రతీ క్రీడకు సంబంధించినవి. సంధ్యావందనము నిత్యానుష్ఠానమునకు సంబంధించినది. కాముకేళి యనగా సంధ్యావందనమనుకొంటివా యేమి ? ఎనుబదినాల్గు బంధములను ఆచరింపవలదా అని సమస్యను విఱిచి కవులు దానినెంతో రసవంతముగా పూరించి యుండిరి. శ్రీ రాఘవశాస్త్రిగారు నెల్లూరు శతావధానమున నెవరో "పతి తలకోసి వండెనొక పాంథుని నాతి మనోహరం బుగన్" అను సమస్య నీయగానిట్లు రించిరి.

కుతుకము మీఱ శ్రీగిరి కకుంశిత భక్తిని బోవుచుండి వి
స్తృత నవపల్లవావృత దిదృతు ముదావహ తింత్రిణీ కుజా
ప్రతిమపు నీడలో విడిసి, పప్పుడుకైదునంత నాకురుట్పతితలఁ
గోసి వండెనొక పాంథుని నాతి మనోహరంబుగన్.

తింత్రిణీ కుజ మనగా చింత చెట్టు. ఆ నాతి తన పతి తలనుగాక కురుడ్ + పతి (వృక్షరాజము) తల అనగా చింత చిగురు కోసి పప్పులో వేసి వంట చేసేనని భావము. తిరుపతి వేంకటకవులు "గణచతుర్థినాఁడు ఫణిచతుర్థి" అను సమస్యను చక్కగా విఱిచి అర్థవంతముగా పూరించిరి.

"ఎన్ని దినములాయె నిట నన్నుడించి సీ
వరిగి" యనినఁ బత్ని కనియె భర్త.
"నేఁటి కెన్నఁగఁ బదినెలలాయెఁగా, నేఁడు
గణచతుర్థి, నాఁడు ఫణిచతుర్థి"

ఫణిచతుర్థి యనగా నాగుల చవితి. అది కార్తిక మాసమున వచ్చును. గణచతుర్థి భాద్రపద శుద్ధమున వచ్చును. భార్య ప్రవాసియై తిరిగి వచ్చిన భర్తను "నీవు నన్ను విడిచి యెన్ని నాళ్ళయ్యె"నని యడుగ భర్త "పది నెలలైనది. నేను విడిచి యేగిననాడు నాగచతుర్థి, నేఁడు గణచతుర్థి" అని సమాధానము చెప్పెను. సమస్యను యథాతథముగా చూచిన గణచతుర్థి వాడే ఫణిచతుర్థి అను అసంగతమైన అర్థము వచ్చును. కవులు నేడు గణచతుర్థి, నాడు ఫణిచతుర్థి అని విఱిచి అసంగతత్వమును తొలగించి ఔచిత్యమాపాదించిరి.

ఒక్కొక్కప్పుడు సమస్య అర్థవంతమయ్యు ప్రకృతి విరుద్ధముగా కనిపించును. కవులట్టివానిని పురాణములందలి కథల సాయమున రసవంతముగా పూరింతురు. "మదగజ యానకున్ రవిక మాత్రమె చాలును చీరయేటికిన్" అను సమస్యను యువావధానులలో నగ్రగణ్యులైన శ్రీగాడేపల్లి కుక్కుటేశ్వర రావు గారిట్లు పూరించిరి. హృదయమునందు భగ్గుమనియెన్ ధృతరాష్ట్రుని యగ్రసూతి కయ్యెదనున నవ్వ ద్రౌపది, రయంబునఁదమ్మునిబిల్చి గర్వమే పొదవ వచించె "నిండుసభ నొల్వుము చీరల నిద్దురాత్మయీ మదగజయానకున్ రవిక మాత్రమె చాలును చీర యేటికిన్". ఈ సమస్య ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భమునకు చక్కగా సరిపోయినది. మార్కాపురమునందలి శతావధానమున నెవ్వరో "ఉష్ణీషంబునఁ గట్టవచ్చునే మద వ్యాఘ్రోగ్ర శుండాలమున్" అను సమస్యనీయగా భారతార్థము వచ్చునట్లుగా శ్రీగాడేపల్లి వీరరాఘవశాస్త్రి గారిట్లు పూరించి యుండిరి.

ఉష్ణాంశు ప్రతిమానతేజ ! ధృతరాష్ట్రోర్వీశ ! నీనూనుఁడీ కృష్ణున్ సర్వజగత్ప్రపూర్ణుఁడని యొక్కింతైన లోనెంచకే తృష్ణాపాశ వినిర్గతాత్ముఁడయి బంధింపంగఁ దానెంచెనో, యుష్ణీషంబునఁ గట్టవచ్చునె మదవ్యాఘ్రోగ్రశుండాలమున్. దుష్కరప్రాసముతో గూడిన యీ సమస్యను శ్రీశాస్త్రిగారు పూరించిన విధము ప్రశంసా పాత్రమై యున్నది. ఆశుప్రోక్తమైనను పద్యము ధారాళమును, భావగంభీరమునై యొప్పుచున్నది. అధర్వణుని భారతమునందలివిగా లభించుచున్న కతిపయ పద్యములలో నొకదానయున్న అర్థాంతర న్యాసమీ సమస్య. ఈ విధముగా నర్థాంతరన్యాసములందలి సామాన్య వాక్యము లను సమస్యలుగా నీయవచ్చును.

కవయిత్రులు

కవయిత్రులు పూరించిన సమస్యలు కూడ కొన్ని యున్నవి. తంజావూరు రఘునాథ నాయకుని యాస్థానమున పలువురు కవయిత్రులు కూడ నుండిరి. వారిలో రామభద్రాంబ, మధురవాణి అనువారు ముఖ్యురాండ్రు. వారాంధ్రమున నేకాక సంస్కృత ప్రాకృతములందు నైతమాశువుగా కవిత్వము చెప్పజాలి యుండిరి. "రాజాజని అచ్యుతేంద్ర రఘునాథనృపా" అను సమస్యను రామభద్రాంబ యిట్లు పూరించెనని రఘునాథాభ్యుదయ యక్షగానమున చెప్పబడినది.

ఏరీ నీ సరిరాజులు
భూరమణులు నిన్నుఁజాలఁబోగడుదురు భళీ!
స్వారాజని, రేరాజని,
రారాజని యచ్యుతేంద్ర రఘునాథనృపా!

ఇది కేవల స్తుతిమయమేయయ్యు సరసముగా నున్నది. భూరమణులన రాజులు, భూమి యందలి కాంతలనియు నర్థము చెప్పవచ్చును. ఆమెయే "కోతే సంతాన పాదపాయంతే" అను సంస్కృత సమస్యను కూడ రఘునాథ స్తుతిపరముగా మిక్కిలి హృద్యముగా పూరించెను. కతికతి నజాతి పతయః (ఎంతమంది రాజులు లేరు) కోతే రఘునాథ నాయకాయంతే ? (వారు రఘునాథనాయకులగుదురా!) భువి బహవః కౌలతరః (భూమినెన్నో వృక్షములున్నవి) కింతే సంతాన పాదపాయంతే (అవి కల్పవృక్షములగునా) అలంకార రమణీయమైన యీ శ్లోకము భావబంధురమును సరసమునై యున్నది. రసజ్ఞుడైన రఘునాథుడే · పూరణమును విని యెంతైననానందించి యుండును.

తిరుపతి వేంకటకవులు, పిశుపాటి చిదంబరశాస్త్రిగారు, వేలూరి శివరామశాస్త్రిగారు మున్నగు విద్వత్కవులు సంస్కృతాంధ్రములు రెండింట నాశువుగా కవిత్వము చెప్పజాలి ఆ రెండు భాషలలో నెన్నో సమస్యలను పూరించి యుండిరి.

నా పేరు విన్నంతనే రాముడు పారిపోవునని నిర్భయముగ పలుకుచున్న రావణునితో సీత "ఔనప్పుడు లేడినిచూచి పులి పరుగెత్తు" నని పల్కెను. ఈ రెండును అసంభవములే అని భావము. సీత రాముని పరాక్రమమును తెల్పుచునే రావణుని హేళనచేయుట యిందు రమ్యముగా వర్ణింపబడినది.

సమస్యాపూరణ మత్యంత వినోదప్రదమైనది. ఆంధ్ర సంస్కృతములందవధాన సందర్భములందేకాక గోష్ఠి సందర్భములందు కూడ కవి పుంగవులు పూరించిన సమస్యలెన్నోయున్నవి. ఆంధ్రదేశమున పూర్వమవధానాశుకవిత్వములం దారితేరిన కవీంద్రులెందరో యుండిరి. ఆధునిక కాలమున నైతమానంద ప్రదముగా నవధానము లాచరించు యువకులు తెలుగు దేశమున పలువురున్నారు. వారు సరసముగా పూరించిన సమస్యలు కూడ నెన్నో యున్నవి. స్థలాభావముచే వానిలో నన్నింటి నుదహరించుటకు వీలులేకపోయినది. సమస్యా పూరణమునకు ఆశు కవితా కౌశలము, సమయస్ఫూర్తి, భాషాశాస్త్ర పాండిత్యము, పురాణ విజ్ఞానము, సభారంజకశక్తి మున్నగు లక్షణములుండవలయును: అవధాన ప్రదర్శనము లాంధ్రమున జరుగుచుండు నంతదనుక సమస్యా పూరణములును జరుగుచునే యుండును.



స్థూలంగా రచనా రంగాన్ని పరిశీలిస్తే ఏకాలానికిచెందిన రచయిత్రుల సంఖ్య అయినా ఆ కాలానికి చెందిన రచయితల సంఖ్యకంటే చాలా తక్కువ. ఇది స్త్రీజాతి మొత్తానికిచెందిన నిరక్షరాస్యగుణం మీద ఆధారపడిన సత్యం. ఇక సాహిత్యానికి సంబంధించిన వివిధ శాఖల్నిబట్టి చూస్తే తెలుగు సాహిత్యంలో కవిత, నాటకం, వ్యాసం, వ్రాసే స్త్రీలకంటే ఈనాడు నవలలు, కథలు వ్రాసే వాళ్లు ఎక్కువ. మళ్లీ ఈ రెండు ప్రక్రియల్లోనూ కథలకంటే నవలల్నే రచయిత్రులు ఎక్కువ అభిమానించి ఆవిష్కరించడం జరుగుతున్నది.

స్త్రీ - తెలుగు నవలా వికాసం

- డాక్టర్ నాయని కృష్ణకుమారి

ఈనాటిదాకా ఈ విషయాన్ని గురించి ఎంతో మంది కూలంకషంగా పరిశీలించి, లెక్కలుగట్టి తెలుగు లోకానికి అందించే ఉన్నారు. కవిత్వం, నవల, కథానిక, వ్యాసం, నాటకం, మొదలైన ప్రక్రియల్లో తెలుగు స్త్రీ ఎంత కృషి చేసిందీ ఎటువంటి స్థానాన్ని పొందిందీ, ఎన్ని రచనల్ని తెలుగు లోకానికి అందజేసిందీ అన్నీ లెక్కలుగట్టి ఒప్పజెప్పే పని ఇక్కడ నేను చేయబోవడం లేదు. అలాచేస్తే అది చర్విత చర్వణమై ఉపయోగాన్ని కోల్పోతుంది.

ఇక్కడ ఒక ప్రశ్న. రచయితలూ, రచయిత్రులూ అనే విభాగం రచనా రంగానికి తగునా అన్న సందేహం బుద్ధిజీవు లలో తలయెత్తుతున్నది. రచనకు ఆడ రచనా మగ రచనా అనే తేడా లేదని వాదించేవారు ఎందరో ఉన్నారు. కాని ఏ భాషకు సంబంధించిన సగటు రచయిత్రుల రచనల్ని పరి శీలించినా అవి పై వాదానికి విరుద్ధంగా సాక్ష్య మిస్తున్నట్లుగా తెలిసిపోతుంది.

స్త్రీ పురుషుల మధ్య వైవిధ్యం

సంఖ్యలు తక్కువ ఎక్కువ అనే అంతరం స్త్రీ పురుషుల మధ్య ప్రముఖంగానే ఉన్నట్లు చెప్పుకున్నాం. సంఖ్యలో తక్కువైనా స్త్రీలు పోటీలో పురుషులతో సమానంగా రచనా రంగంలో నిలబడడం అసాధ్యం కాకపోవచ్చును. కాని ప్రస్తుతం కష్టసాధ్యమైన పని. ఈనాడు స్త్రీ పురుష సమానతలనుగురించి ఎంతో కృషి జరుగుతున్నమాట ఎవరూ కాదనరుగాని, ఎన్నాళ్ల నుండో ఎన్నేళ్ళనుండో వంటింటికీ నాలుగు గోడల మధ్య నేలకూ మాత్రమే పరిమితమైన స్త్రీ ఆలోచన అన్ని సంవత్సరాల ఆలోచనా పరిణామాన్ని ఒక్కసారిగా పొందగలగడం దురాశ. బయట తిరిగి ప్రపంచం చూస్తూ వ్యవహారం నడిపే పురుషుల తో సమానంగా స్త్రీ ఆలోచనాసరళి సాగడానికి ఇంకా ఎంతో కాలం పడుతుంది. అది సహజం. అది క్రమానుగతంగా పరిణామ పద్ధతిననుసరించి రావలసిందేగాని మనం కోరుకుంటున్నాంగదా అని ఒక్క ఉదుటున వచ్చి మన ఒళ్ళో వాలదు. అలా జరిగితే అది అసహజం. ఇట్లా అన్నానని స్త్రీలలో, పురుషులతో సమానంగా ఆలోచించి రచనలు చేసేవారు లేనేలేరన్నది నా భావన కాదు. పైన నేను చెప్పేదంతా అధిక సంఖ్యాకులకు వర్తించే విషయం. అపవాదాలు (Exceptions) అందరికీ అన్ని విషయాలలోనూ ఉండవచ్చు.

స్త్రీ పురుషుల మధ్య సంఘం అనాదిగా కల్పించిన అసమానతలను గుర్తించి వాటి ప్రభావాన్ని తక్కువగా అంచనా వేయని పరిశీలకుడు రచనారంగంలో కూడా వీళ్ళ మధ్య ఈ అసమానతలు ఉన్నవనే ఒప్పుకుని తీరవలసి వస్తుంది. రచనా సమూహంలో ఆడ రచయితల రచనల్ని తేలికగా గుర్తుపట్టగల ముద్ర మన కళ్ళఎదుట తాండవిస్తూనే ఉంటుంది. అంతేకాదు ఒకవేళ మగవాడు ఆడపేరు పెట్టుకుని వ్రాసినా అది ఆడరచన కాదనే తీర్మానాన్నికూడా ఈ ముద్రే

చేయగలుగుతుంది. ఇటువంటి ముద్ర కలిగి విపరీతంగా తెలుగు నవలారంగంలో పరిశ్రమిస్తున్న రచయిత్రుల రచనా పద్ధతుల్ని విమర్శించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ఈనాడు పరంపరగా స్త్రీలు వ్రాస్తున్న నవలల్లో సర్వసాధారణంగా కనిపించే ఇతివృత్తం ఎటువంటిది? వెనక కాలంలో వందలకొద్దీ జీవితాలను పరిశీలించి సమన్వయిస్తేకాని ఒక సందేశాత్మకమైన నవల పుట్టేది కాదు. ఇప్పటి నవలల్లో ఈ అభిప్రాయంతో సరితూగే నవలలు మొత్తంమీద ఎన్ని? అందునా స్త్రీలు వ్రాసిన నవలల శాతం ఎంత?

వెనక కాలంలో కుంకుమ భరిణ, చిన్నకోడలు, మాలపల్లి, చివరకు మిగిలేది. అసమర్థుని జీవయాత్ర వంటి సాంఘికేతివృత్తం కలవీ, గోనగన్నారెడ్డి, మొగలాయీ దర్బార్, ఏకవీర వంటి చారిత్రకేతివృత్తం కలవీ, జాగిలం, భిన్నహస్తం వంటి అపరాధపరిశోధకేతివృత్తం కలవీ, ఇట్లా ఎంతో విషయ వైవిధ్యం కల నవలలు కనిపించేవి.

ఈ నాటి నవలలన్నీ అందునా స్త్రీల నవలలన్నీ దాదాపు నూటికి నూరు పాళ్ళు సాంఘికేతివృత్తం కలిగినవే. ఈ ఇతివృత్తాన్ని మలచడంలో స్త్రీల ధోరణి ఒక విధంగా ప్రత్యేక ముద్రను కలిగి ఉంటున్నది. స్త్రీల నవలల్లోని ఈ ఇతివృత్త చిత్రణను గురించి ఏ విధంగానైనా సమాలోచించే ముందు రచయిత్రిగా ఆవిడకా అధికారాన్ని కల్పించి పెట్టిన పరిస్థితుల్ని అవగాహన చేసుకోవలసి ఉంటుంది.

పత్రికల ప్రోత్సాహం

ఇప్పుడు తెలుగులో నవలలు వ్రాస్తున్న స్త్రీల సాంఘిక స్థితిని గ్రహిస్తే, అందరూ ఇంచుమించు మధ్యతరగతి గృహిణులు. వీళ్ళలో, వీళ్ళు మళ్ళీ జీవితంలో కుదురుకున్న వాళ్ళతో పాటు, అప్పుడే చదువు పూర్తి చేసి జీవితరంగంలో కాలుపెడుతున్న విద్యార్థినులూ, నవ వధువులూ కూడా ఉన్నారు. ఈ మధ్య నాలుగైదు సంవత్సరాల నుండీ పత్రికలిస్తున్న ప్రోత్సాహం వల్ల, వీళ్ళే ఎక్కువగా నవలల్ని ప్రకటిస్తున్నట్లుగా మనం గమనించవచ్చు. వీళ్ళకు జీవితాన్ని వివిధ కోణాలలో తరిచి చూచి, అనుభవించి, ఆ అనుభవాన్ని నలుగురికీ అందించే అవకాశం ఉండడానికి, వయస్సు చాలదు. అటువంటి కలాల నుండి రూపుచెందిన ఇతివృత్తం ఎట్లా ఉంటుంది? నిజానికి నవలలోనూ, కథలోనూ కవిత్వానికి ఉండే విధంగా, ఊహాకూ భావావేగానికీ ఎక్కువ చోటు ఉండకూడదు. నవల

వెనకటి కాలంలా వందలకొద్దీ జీవితాలను పరిశీలించి సమన్వయిస్తేకాని ఒక సందేశాత్మకమైన నవల పుట్టేది కాదు



ఒక జీవితం యొక్క యథార్థ చిత్రణం కావాలి కాని కల్పనా చిత్రం కాకూడదు. బహుశా పైన చెప్పిన కారణం వల్లనే అనుకుంటాను ఎక్కువ మంది రచయిత్రుల నవలలు జీవితం యొక్క సత్య కథనాలుగా, సమగ్ర చిత్రాలుగా కనిపించవు. నవలఅంటే, కేవలం ఊహాకులాంగిన, కాల్పనికమైన గద్య రచన అని కాబోలు వీరి భావన.

ఈ నవలల్లో ఉండే ఇతివృత్తానికి సర్వసాధారణంగా స్త్రీపురుషుల మధ్య ప్రేమ ప్రముఖాధారంగా ఉంటుంది. ప్రేమ కథలు ముగ్గురి మధ్య నడిచేవి కోకొల్లలు. నాయికా నాయక స్థానంలో ఇద్దరు కుదురుకొగా మరోపాత్ర, అయితే దుష్ట పాత్రో, కాకపోతే త్యాగపాత్రో, కాక తప్పదు. ఇక అపోహలూ, కష్టాలూ కన్నీళ్ళూ, ఏక మనిషి త్యాగం వీటితో చివరికి కథ సుఖాంతమైపోతుంది. అప్పుడప్పుడూ విషాదాంతం కూడా కావచ్చును. తాను ప్రేమించి పెళ్ళాడ దలచిన వాడికోసం ఒక నాయిక ముసలివాన్ని కట్టుకుంటే, మరొకతె దేశాంతరాలు పట్టిపోతుంది. ఇంకొకతె సరాసరి ఆత్మహత్యే చేసుకుంటుంది. పాఠకుల్లో ఉత్కంఠను పెంచడానికి ఈ ప్రేమ కథల్లో ఎన్నో మలుపులు, ఒక్కొక్కసారి ఈ మలుపులకోసం సృష్టించిన అర్థంలేని సంఘటనలూ,

నవల జీవిత యథార్థ చిత్రణం కావాలి, కాని కల్పనాచిత్రం కారాదు

అయోమయపు ముగింపులూ చిరాకు తెప్పించేవిగా ఉండక తప్పడంలేదు.

నిజానికి ప్రతినవలలోనూ ఒక మలుపు తప్పకుండా ఉండి తీరాలన్న నియమం ఏమన్నా ఉన్నదా ? అదేమీ లేదే! అదీకాక నవలలో ఎల్ల వేళలా సామాజిక సమస్యా పరిష్కారం చేసి తీరాలని లేదు. ఈ సంఘంలో బ్రతుకుతున్న వ్యక్తుల విభిన్న జీవన పద్ధతుల్ని గమనించి అవి అలా ఎందుకున్నాయో విశ్లేషించి చెప్పినా నవలే అవుతుంది. కళ్ళముందుండి మన కర్త మవుతున్న మనస్తత్వాన్ని యథాతథంగా చిత్రించినా నవలే అవుతుంది. అయితే ఈ రకమైన విశ్లేషణ శాస్త్రీయంగా మాత్రం ఉండాలి. అలా ఉండడానికి రచయితో, రచయిత్రో ఆయా సన్నివేశాలతోనూ, పాత్రలతోనూ నిత్య జీవితంలో ఎంతో అనుభవం సంపాదించి ఉండాలి. నిజానికి పాశ్చాత్య సాహిత్య ప్రపంచంనిండా ఇటువంటి నవలలే! వాటిల్లో మన రచయిత్రులు సృష్టించే మలుపుల్లాంటి మలుపులు ఎక్కడో చాలా అరుదుగా గాని కనపడవు.

రచయిత కానీ రచయిత్రి కానీ, తమ జీవితాల్లో, కలిసి బ్రతకడంలో గల సుఖాన్ని తనివితీరా ఆస్వాదిస్తూ తమకు అందుబాటులోలేని ప్రేమత్యాగాన్ని గురించి తపించి, చేసే ఊహాత్మక రచనలివి. ఇక్కడ వీళ్లు విపులీకరించ ప్రయత్నించేది మనుష్యులమధ్య గల ప్రేమ తత్త్వాన్ని కాక, ప్రేమను త్యాగం చేస్తే కలగవలసిన అనుభూతమైన పరిస్థితిని మాత్రమే, సుప్త చేతన స్థితిలో అతి గుప్తంగా ఉండిపోయే అలభ్యప్రేమను తీరుతీరులుగా విషాదాత్మకంగా వర్ణించాలనే కోరిక బహుశా దీనికి కారణం కావచ్చును.

ఇక వీళ్ళు చేపట్టే రెండో అంశం స్త్రీలూ–స్త్రీల సమస్యలూ, వాళ్ళకు జరుగుతున్న అన్యాయాలూ! ఈ విషయంలో చక్కని సామాజిక స్పృహ కలిగి నిజంగా ఏవి సమస్యలో వాటిని మాత్రమే వివరించి పరిష్కార మార్గాన్ని సూచించే రచనలు లేవని కాదు. బహు కొద్దిగా అటువంటివి కనిపిస్తాయి. మిగిలిన వన్నీ సమస్యలు కానివాటిని సమస్యలుగా స్వీకరించి సతమతమయ్యే రచనలు.



స్త్రీ, శీల పావిత్ర్యాన్ని గురించి తర్జన భర్జనలూ, ఆ శీలాన్ని ఎల్ల వేళలా అపహరించడమే తప్ప వేరే పనిలేని పురుష రాక్షసులూ, వాళ్ళకు బలై జీవితాన్ని దయనీయం చేసుకుని సంఘంనుంచి సానుభూతికోరుకునే స్త్రీలూ ఇక్కడకోకొల్లలుగా కనిపిస్తారు.— ఈ సమస్యల్లో చదువుకున్న స్త్రీనీ, చదువులేని స్త్రీనీ, అనే తేడా కనిపించదు. ఎంత కూలి చేసుకునే స్త్రీ అయినా. ఎంత విద్యావంతురాలైనా, ఇద్దరికీ ఒకటే పరిస్థితి. అది శారీరకంగా పతనం కావడం, తర్వాత సమాజం సానుభూతి కోరడం!

మనో విశ్లేషణ

మన రచయిత్రులు ప్రేమను దాదాపు తమ అన్ని రచనల్లోనూ పొదుగుతున్నారు కదా! కాని ఆ ప్రేమకు సంబంధించిన మనో విశ్లేషణ ఎక్కడైనా కనిపిస్తుందా?

నవలామణుల అడుగు జాడల్లో...

ఈ నవలామణుల అడుగుజాడల్లో పడి పురుష రచయితలు కూడా ప్రతి పురుషుణ్ణి కేవలం ఆడవాళ్ళను పాడు చెయ్యడానికి మాత్రమే తయారయిన సెక్స్ యంత్రంగా



సృష్టించడం ఆరంభించినట్లు కనిపిస్తుంది. ఆఫీసుల్లో, కాలేజీలో, రైలు పెట్టెల్లో, రోడ్డు పక్కక సముద్రం ఒడ్డున అక్కడా ఇక్కడా అనేమిటి ఎక్కడపడితే అక్కడ భయంకర మృగంగా చిత్రింపబడుతున్న పురుషుడు! ఈ పురుషుడికిక పనేమీలేదా! వ్యాపకాలే లేవా? నిజ జీవితంలో, మన అన్నలో, తండ్రిలో,

సంఘానికి అవసరమైన చైతన్యాన్ని అందించే వాహిక కథలు

స్నేహితుడిలో చివరకు భర్తలోనైనా ఈ మృగాన్ని మనం చూస్తున్నామా! లేదే! ఒక్కో వ్యక్తి తన జీవితానికి సంబంధించిన అనేక వ్యాపకాలతో తొణికిసలాడుతూ పరిపూర్ణ వ్యక్తిలా అనుక్షణమూ కనిపిస్తూనే ఉంటాడు కదా! అన్ని కోణాలనుండి పరిశీలించి చిత్రించవలసిన మహత్తర మానవ జీవితాన్ని, కేవలం జీవితంలో ఒక చిన్న భాగమైన సెక్స్‌స్థాయికి కుదించి భయంకరంగా చిత్రించడం క్షమించరాని నేరంకాదా! దీనివల్ల సాధించదలచుకున్నది శారీరకంగా బలహీనురాలైన స్త్రీమీద సమాజం చూపించే సానుభూతి మాత్రమే అనుకుంటే, అది పొరపాటు అభిప్రాయమని నా తీర్మానం.


ఇక సమస్యల చిత్రణలో స్త్రీకి చదువుకున్నా, చదువుకోకపోయినా పెద్ద తేడా ఏమీ లేదు. కాని నవలల్లో నాయికలందరూ చాలావరకూ బి.యే అయినా పాస్ అయి ఉంటారు. కొందరు ఉద్యోగాలుకూడా చేస్తుండవచ్చు. ఇక వాళ్ళకు రాక్షసుల్లాంటి భర్తముందు ఎలా నడుచుకోవాలో తెలీని సమస్య! బయటకుపోతే బస్సు ఎక్కడం దగ్గరనుండి ఆఫీసులో మేనేజరు, తోటి గుమస్తాలు చివరకు మగ ప్యూన్లు అందరూ ఆవిణ్ణి పెట్టే పాట్లన్నీ అదో సమస్య.—ఇంట్లో భర్త మనస్సులో అనుమానపు పెనుభూతం. పెళ్ళాం సంపాదించే డబ్బంతా చివరకు కాఫీ ఖర్చుకుకూడా ఉంచకుండా లాక్కునే భర్త రాక్షసుడు -ఇటువంటివే అన్నీ. సమస్యల తోరణాల కూర్పు!

ఇక కథానుగతంగా లోక వృత్తాన్ని గురించి చెప్పవలసి వస్తే బయటి ప్రపంచం లౌకిక వ్యవహారాలూ క్షుణ్ణంగా తెలీని కారణాన తప్పుడు సమాచారాలు (Factual Mistakes) ఇవ్వవలసి రావడం. ఎవరికైనా తెలియక పోవడం నేరం కాదు గాని ఏం రాసినా చదువుతున్నారుగదా అని తెలియని తనాన్ని అక్షర రూపంలో బంధించి నిర్లక్ష్యంగా నలుగురికీ అందించడం మాత్రం భావ్యంకాదు.

ఈ రకంగా ఒకటి రెండు తరహాల కథల మూసల్ని మాత్రమే గ్రహించి రచయిత్రులు నవలల్ని పుంఖాను పుంఖాలుగా అనుసంధించడం జరుగుతున్నది వసుచరిత్రకు పిల్ల వసు చరిత్రలు పుట్టినటుగా, ప్రజాదరణ పొందిన ఒక నవల వెనక తోక నవలల్ని ఎన్నిటినో మనం చూడవచ్చు. ఈ నాడు ఇటువంటి నకలు నవలల్ని పత్రికల ధర్మమా అంటూ నెలకు కనీసం రెండు మూడయినా పట్టుకోవడం కష్టంకాదు.

పలాయనవాదం

మరి ఇటువంటి నవలలమీద జనానికి మోజు ఎందుకు పెరుగుతున్నట్లు? వీటిని ఎవరు ఎక్కువగా చదువుతున్నారు?- అనుభవజ్ఞులూ, విజ్ఞులూ కొందరు పరిశీలనా దృష్టితో వీటిని చదువుతున్నా ఎక్కువగా లేత వయసు విద్యార్థులూ, ఆఫీసు గుమస్తాలూ, వంటింటి ఆడవాళ్ళూ వీటిని చదువుతున్నారు. వాళ్ళకు కావలసిందేమిటి? ఉద్రేకపూరితంగా తమలోసాగే అనుభవరహితమైన కాల్పనికోహాలకు ప్రోత్సాహం. తాము ఊహల్లో ఊరేగుతూ కళ్ళు తెరుచుకుని కనే బంగారు కలలకు అక్షర రూపం. తమ తమ భవిష్యత్తులనుగూర్చిన చేదు నిజాల కన్నా తమ ఊహాలకు సంబంధించిన అందమైన చిలక జోస్యం కావాలి. దీన్నే మనస్తత్త్వవేత్తలు పలాయనవాదం (Escapism) అంటున్నారు. నిజాలమధ్య ఇరుకిరుకుగా ఇబ్బందిగా బ్రతుకుతూ, అబద్ధమని తెలిసికూడా అబద్ధాల అందాల ఆకాశంలోకి క్షణంసేపయినా రెక్కలల్లార్చుకుంటూ ఎగిరిపోవడమే ఈ వాదం పరమార్థం. పైన చెప్పిన తెలిసీ తెలియని ఆలోచనల్ని ప్రోగుచేసుకుంటున్నవారంతా ఈ రంగుల కలలకూ, అందమైన అబద్ధాలకూ మత్తు పదార్థాల కలవాటు పడినంతగా దాసులైపోతున్నారు. ఆ మత్తులో నుండి బయటికి రావడం ఇష్టంలేక, జరుగుతున్న కాలంలో నడుస్తున్న చరిత్రను గురించీ, అందులో తాము




రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ **అలీ** అహమ్మద్ సెప్టెంబరు 9వ తేదీన మహబూబ్‌నగర్‌లో మహాసభకు వచ్చిన అశేష ప్రజానీకాన్నుద్దేశించి ప్రసంగించారు.


జిల్లాల్లో



పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరులో విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శ్రీ రాజారాం పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. చేబ్రోలు, నారాయణపురం హరిజనులకు రిక్షాలను పంపిణీ చేశారు



ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళ రావు సెప్టెంబరు 18 వ మహబూబ్ నగర్‌లో "తెలుగు తల్లి" ప్రతిమను ఆవిష్కరించారు.



సెప్టెంబరు 20వ వరంగల్లులో మంత్రి వర్యులు శ్రీయుతులు బత్తిన సుబ్బారావు, టి ధర్మారెడ్డి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బలహీన వర్గాలవారికి మంజూరుచేసిన రుణాలను పంపిణీ చేశారు.

పౌర సంబంధశాఖ
చీరాల.

విజయగీతము

కళాప్రపూర్ణ తుమ్మల సీతారామమూర్తి

అంజలించెద నతశిరమ్మున
నాంధ్రరాష్ట్ర విధాతృకోటికి
మొదటి మ్రొక్కులు పొట్టి శ్రీరా
మునకుఁ జెల్లింతున్

ఇరువదేం డ్లొకలెక్క గా ది
యినుఁడు తారక లుండునంతకుఁ
దెలుఁగుజెండా రెపరెపల్ నలు
దెసల మ్రోఁగవలెన్

తెలుఁగుసంస్కృతి వన్నెకెక్కెను
తెలుఁగుసంపద పొంగిపొరలెను
రాష్ట్రరమతోఁ దెల్గువానికి
రాణ చేకూరెన్

విలయవార్ధులవోలె నెగసిన
విప్లవంబులు రెండు సమసెను
ఐదుకోట్ల తెలుంగుప్రజలో
హార్దములు పూచెన్

తరతరాల తెలుంగు పెద్దల
తపమునకు వెలలేని పంటగ
నాధికారికభాషయై తెలుఁ
గందె గౌరవమున్

తెగువచూపి నదీ నదమ్ముల
తగవులను దెగటార్చి రాష్ట్ర
ప్రగతి కండగ నిల్చిన జగా
ప్రగడ కగు జయముల్ !

మంత్రిమండలి కొమ్ము గావఁగ
మహి వెలుంగు తెలుంగు లందఱు
నొక్కవేదికఁ జేర్చి ప్రస్తుతి
కెక్కె నీదిట్ట


అభయ మన్నది దైవసంపద
నాదిమం బని గీత పల్కెను
మంచిపనికిఁ దెగించువాఁడే
మానవోత్తముఁడు

దారితప్పినవారి యెడఁదల
దడదడలు చెలరేఁగె నేఁటికి
పల్లెపట్టులు మొగ్గవిచ్చిన
మల్లెపొద లాయెన్


అసలుకంటెను వడ్డి బరువై
కుసులువిఱిగిన బడుగుమానిసి
కోలుకొని తలయెత్త వచ్చెను
గ్రొత్తసంక్రాంతి

ఆంధ్రభూమికి సాటిలే దని
యాంధ్రజాతికి నుద్దిలే దని
యెల్లరాష్ట్రము లుగ్గడించిన
వేకకంఠముగన్

మంచెపై నిలుచున్న కన్నియ
మంజుమంజురవమ్ము లొల్కఁగ
విజయగీతము పాడుచున్నది
వినుఁడు తెలుఁగన్నల్ !



చేతి పనులు



డాక్టర్ ఎం.ఎస్. ప్రకాశరావు

వారణాసి వద్ద గంగకు ఆవలివొడ్డున ఉన్న పుణ్య క్షేత్రానికి ఉత్తరకాశి అని పేరు. అక్కడ కాశీరాజావారి రామనగర్ రాజభవనం ఉంది. అది అంతా ఒక కళా పేటిక. భరత వర్షంలోని అద్భుతమైన చేతి పనుల నమూనాలు చాలా వరకు అక్కడున్నాయి అనవచ్చు.

మొన్న మొన్నటి వరకు (అంటే 19వ శతాబ్దాంతం వరకు) రాజాస్థానాల్లో పాండిత్యం విషయమై పోటీలు జరుగుతున్నట్లే పనితనంలో కూడా పోటీలు జరుగుతూండేవి. ఆస్థానపు పనివాండ్రు ఆ పోటీల్లో నెగ్గితే, ఆస్థానానికి గౌరవం నిలుస్తుంది; లేకపోతే గౌరవానికి లోటుకలుగుతుంది. అది అనాటి సదాచారం.

బ్రిటిషు పరిపాలన మొదటి పాదంలో మొదటి గవర్నర్ జనరల్ అయిన వారన్ హేస్టింగ్స్ దురాక్రమణ ఫలితంగా పదచ్యుతుడైన రాజా చైత్ సింగ్ ఈ రామనగర్ రాజభవన నిర్మాత. ఆనాటి నుంచీ ఒక మర్యాద అక్కడ స్థిరపడిపోయింది పరాయి ఆస్థానాల తాలూకు పనివాండ్రెవరైనా వచ్చి తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తే కాశీ ఆస్థానపు పనివాండ్రు ఆ నైపుణ్యాన్ని మించక పోతే ఆస్థాన గౌరవానికి భంగం కలిగినట్లే భావించేవారట.

కుంకుడు, గురివిందల్లో ఏనుగులు !

ఒకప్పుడు దక్షిణాదినుంచి పనివాండ్ర బృందం ఒకటి వచ్చి దానికి నాయకురాలైన శిల్పి తననైపుణ్యాన్ని ఈ విధంగా ప్రదర్శించిందట. ఒక కుంకుడు కాయని రెండు సమభాగాలుగా నరికి, ఆ దొప్పల్ని రెండింటిని దొలిచి, 7 దంతపు ఏనుగుల్ని చెక్కి ఆ దొప్పల్లో ఇమిడ్చి, రెండు దొప్పల్ని మళ్లీ అతుకు పెట్టేసింది.

కాశీరాజు ఆస్థానపు శిల్పి ఈ సవాలును అందుకున్నాడు. ఒక గురివింద గింజను రెండు సమభాగాలుగా నరికి ఆ దొప్పల్ని దొలిచి, 7 దంతపు ఏనుగుల్ని చెక్కి., ఆ దొప్పల్లో ఇమిడ్చి, వాటిని మళ్లీ అతుకు పెట్టేశాడు. ఆస్థానపు గౌరవం నిలిచింది. ఆ కుంకుడు గింజ, గురివింద గింజ ఏనుగులు సహితంగా ఈ నాటికీ ఉన్నాయి. చూడవచ్చు.

ఇందుకు తొలిపలుకులాగ రెండు మాటలు భారతీయ చేతిపనుల్ని గూర్చి చెప్పాలి. ఈ చేతిపనులనైపుణ్య విశేషం జగద్విఖ్యాతి కెక్కినది. వీటిని ఏవో ఒకానొక హీనజాతి పనుల క్రింద వర్గీకరించడం సమంజసం కాదు, వీటిని కళలని వర్గీకరించడం భావ్యం. ఢక్కామజ్లిన్లు, మైసూరు మంచి గంధం. కేరళ దంతం చెక్కడాలు, అలంకరించిన పచ్చల జయపూరు నగలు, కొండపల్లి దశావతారపు బొమ్మలు, కాంచీపురపు పట్టుచీరలు, కాశ్మీరపు శాలువలు, నిర్మల్ పాత్రాలంకరణాలు, లక్నో "చికన్" అల్లికలు....ఇంకావెన్నో — ఇవన్నీ



శిల్పాలనీ, అసాధారణ కౌశలాన్ని ప్రదర్శించే శిల్పాలనీ, భావిస్తే సవ్యంగా ఉంటుంది. 19 వ శతాబ్దాంతాన్ని వీటిని ఈ విధంగా భావించే, సర్ జార్జ్ బర్డ్‌వుడ్ (Sir George Birdwood) వాటిని వేనోళ్ల ప్రశంసించాడు వాటిని గూర్చి సచిత్రంగా సంపుటాల్ని ప్రకటించాడు.


మన నిత్యజీవితంలోకి ఉపయోగ్యతతో చాతుర్యంగా సౌందర్యాన్ని మేళవించి శిల్పాన్ని సౌందర్యాన్ని పరోక్షంగా నైనా ప్రవేశ పెట్టి వికారమైన జీవిత సరళిని ఆనందదాయకంగాను, కన్నుల పండుగగాను చేసేందుకు యీచేతి పనులు సాధనాలు. వేలకొలది యేండ్లనుండి, వంశ పారంపర్యంగా. నిత్యస్రవంతిగా వస్తూన్న నైపుణ్యసంపద వాటిల్లో పువ్వులోని పరిమళంలా భాసిస్తూంటుంది. అయితే, ఈ నైపుణ్య విన్యాసంలో అనేక అంతస్థులున్నాయి. పూరి గుడిసెల్లోని పేడ బొమ్మల్లోను, రాజభవనాల్లోని మణిమయాలంకారాల్లోనూ అది వికసిస్తుంది. అయినా కొద్ది గొప్ప భేదాన్ని పాటించకపోతే, అన్నిస్థాయిల్లోను కూడా ప్రత్యక్షమయ్యేది పనివాని ప్రతిభావిశేషమే ; అందచందాల ఆదర్శమే.

స్వర్ణయుగాలనేవి సాహిత్య, శిల్పాది మానవ కృషిలో బంగారు పంట పండిన సమయాలన్న మాటేకదా ! ఇలాంటి విశేషమైన సంఘటనలు అకస్మాత్తుగా ఏదో ఒకనాడు మేఘమే లేకుండా కురిసిన వర్షాలు కావు. వాటికి పూర్వం నిర్విరామ కృషి ఎంతైనా జరిగి ఉండాలి. , శిల్పులనేకులు తపస్సుచేసి ఉండాలి. అన్నిటికంటే ముఖ్యంగా, వచ్చేపండగకు ముందుగా ఇల్లలికి ముగ్గు పెట్టినట్లుగా, అనుకూలవాతావరణం తయారై ఉండాలి. ఆదివారంనాడు మాత్రమే ఆధ్యాత్మిక చింతన, గుడిలో గంట కొట్టుట మాత్రమే—అధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించడానికి చాలవు కదా! అల్లాగే, శిల్ప సౌభాగ్యాన్ని అర్థం చేసికొని అనుభవించేందుకు కావలసిన "రసికత" కాలానుగుణంగా అన్ని రంగాల్లోను క్రమంగా వికసించాలి. నిత్య జీవితంలోకి జొరబడిన చేతిపనుల శిల్ప సౌందర్యాలు కావలసిన వాతావరణ కల్పనకి పనికి వస్తాయి.

బొమ్మల కొలువు

ఆశ్వీయుజ మాసంలో ఇంటింట వెలిసే బొమ్మల కొలువు, చిరస్థాయిగా నెలకొల్పబడిన జాతీయ మ్యూజియము సజాతీయమైన ప్రదర్శనాలే—తరతమ వ్యత్యాసాన్ని మినహాయిస్తే. అంటే, బొమ్మల కొలువు అనే ఆంధ్ర సంప్రదాయం భారతీయ సంస్కృతికి మచ్చుతునక అన్నమాట. ఆటబొమ్మల ద్వారా ఆనందాన్ని, శిల్ప విశేషాన్ని జతచేసినందువల్లనే, కొండపల్లి బొమ్మల చేతిపని నేటికీ విరాజిల్లుతోంది.

కాశ్మీరు శాలువలు, కాంచీపురపు పట్టు చీరలు, పచ్చలతో స్థగితమైన జైపూర్ నగలు, ఢక్కా రవ సెల్లాలు, తిరువనంతపురం దంతపు చెక్కడాలు, మైసూరు మంచిగంధపు చెక్కడాలు, కొండపల్లి దశావతారాలు, నిర్మల్ అలంకారాలు, భాగ్యనగరపు బిద్రీ (Bidri) పనులు, వరంగల్లు రత్నకంబళ్లు లక్నో చికన్ అల్లికలు, ఆగ్రా చంద్రశిలా చెక్కడములు, వారణాశి పూజాద్రవ్య వైభవాలు, జారజార్ చికిలీ విశేషాలు ఇలాంటివి ఇంకనూ ఎన్నో జగద్విఖ్యాతమైన చేతిపనులు భరత వర్షానికి కీర్తిగడించినవి. ఇవి ఇంకా సజీవంగానే ఉన్నాయి. అయితే, ఇవి పోగా మిగిలినవి. తగు శ్రద్ధ తీసికొని పోషించకపోతే అచిర కాలంతో శుష్కించి పోవచ్చు.



అదృష్ట వశాత్తు ఈ ఆపద ఆంధ్రప్రదేశ్‌లో కలుగకుండా రాష్ట్రావతరణం అయింది లగాయితు రాష్ట్ర ప్రభుత్వం చర్య తీసుకొంటోంది. ఈ క్రింద ప్రదర్శించిన జాబితా ఆ చర్యని కొంత వివరిస్తుంది.

ఇంతేగాక ఇల్లాంటి పథకాలు మరెన్నో దరిమిలాను అమలు జరిగాయి. (1) ట్రెయినింగు, (2) విక్రయశాలలు, (3) అమ్మకానికి సహకార సంఘాలు ముఖ్యమయిన పథకాలని గుర్తించాలి.

ప్రభుత్వం తీసికొన్న ముఖ్య చర్యల్లో ముఖ్యమైనది. 1953 లో నిజాం ప్రభుత్వం "చేతిపనుల సలహా సంఘాన్ని" రెండేండ్ల పాటు నియమించింది. ఆంధ్ర ప్రదేశ్ అవతరణానంతరం ఈ బోర్డును 1956 వరకు పొడిగించారు. ఈ బోర్డు నిర్వర్తించదలచు కున్న ఆశయాలు :

1. మంచి పద్ధతుల్ని, పరికరాల్ని ప్రవేశపెట్టడం;
2. గుణ ప్రధానమైన ప్రమాణాల్ని నియమించడం, వాటిని అమలు జరపడానికై చర్య తీసుకోవడం;
3. పనివాండ్రకు ట్రెయినింగు ఇవ్వడం:
4. పరిశోధనని పెంపొందించడం;
5. రంగవల్లులకు (Designs) మెరుగులు దిద్దడం, కొత్త రంగవల్లుల్ని వ్రాయించడం;
6. గృహ పరిశ్రమ సామగ్రి గూర్చి విరివిగా కేటలాగులు, డైరెక్టరీలు, గైడ్లు, పోస్టర్ల ద్వారా ప్రచారం చెయ్యడం.

7. ముడిసరుకు సప్లయికై ఏర్పాట్లుచెయ్యడం, రాష్ట్రంలోను ఇండియాలోను, దేశాంతరాల్లోను చేతిపని సరకు అమ్మకానికై ప్రయత్నాలు చెయ్యడం.

8. వాటి విషయమై ఆర్థిక సర్వేలు చేయించి, సంఖ్యా సమాచారాన్ని సేకరించడము.

ఈ ప్రయోజనాల్ని పరిశీలించి, ఆమోదించి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 15 సభ్యులతో ఈ బోర్డును పునర్వ్యవస్థీకరించారు. వీరిలో ముగ్గురు అధికార సభ్యులు, 12 గురు అనధికార సభ్యులు వున్నారు.

తక్కిన వన్నీ అటుంచి కొండపల్లి బొమ్మలు పరిశ్రమ వృద్ధిపొందింది, స్థిరపడింది. అంతేకాక, 'రాష్ట్ర' అవతరణం నాటినుంచి, జాత్యభిమానం పెరుగుదలతో పాటు, ఆంధ్ర ప్రతిభను గుర్తించాలని, ప్రశంసించాలని, చైతన్యం ప్రజ్వలిస్తున్నది. కాగా, నాగార్జున మహాచైత్య శిల్పపు స్వర్ణయుగం మళ్లీ సంభవించడానికై అనుకూల వాతావరణం ఏర్పడుతోంది.

చేతిపనుల ఉత్పత్తి ఇండియా మొత్తం మీద 1975 లో రూ. 400 కోట్లు విలువ కలదనీ, పంచమ ప్రణాళికాంతానికది రూ. 600 కోట్లు వరకు పెరుగుతుందని అంచనావేశారు. విదేశాలకై ఈ కళాసామాగ్రిని ఎగుమతి చెయ్యడానికై చేసిన అనేక ప్రయత్నాల ఫలితంగా 1967—68 లో ఎగుమతుల విలువ రూ 22.18 కోట్లు కాగా, 1973-74 నాటికి అది రూ. 60.30 కోట్లు వరకు పెరిగింది. అయిదవ ప్రణాళికాంతానికి అది 110 కోట్లు కావాలనే లక్ష్యం పెట్టుకున్నారు.

చేతిపనుల ఉత్పత్తిని, వాటి ఎగుమతిని వృద్ధిచేసే నిమిత్తమై 1952 లో అఖిల భారత చేతిపనుల బోర్డును స్థాపించారు. దానికి 5 ప్రాంతీయ బ్రాంచీలు బొంబాయి, కొత్త ఢిల్లీ లక్నో మద్రాసు లలో నెలకొల్పారు. హైదరాబాదులో బ్రాంచీ లేని కొరత త్వరలోనే తీరాలి.

చేతిపనుల రంగంలో 14 లక్షల పనివాండ్రకు జీవనోపాధి కలుగుతోంది. అయిదవ ప్రణాళికాంతానికి ఈ సంఖ్య 18 లక్షలకు పెరగాలని లక్ష్యం. దేశమందెల్లెడల చేతిపనుల విక్రయశాలలు నేటికి 250 ఉన్నాయి. ఇవి చాలవు. ప్రదర్శనం, అమ్మకం ప్రాణావసరమైన దోహదాలు.

శిల్పము, శోభ, ఆనందం, భుక్తి—అన్నింటినీ జలివిగా ప్రసాదించే చేతిపనుల అభ్యుదయమే రానున్న ఆంధ్రాభ్యుదయానికి మరొక పేరనడంలో అతిశయోక్తి లేదు.

*** ప్రభుత్వం పురమాయించిన చేతిపనుల పథకాల జాబితా ***

నెం.	పథకం పేరు	మంజూరు చేసిన ఆర్థిక సహాయం			
		1955-56	1956-57	1957-58	మొత్తం
1.	వరంగల్లులోని కంబళి, గొంగళి పరిశ్రమ పథకం	60,000	2,940	1,840	81,580
2.	మహబూబ్ నగర్‌లోని చాప అల్లిక పథకం	3,900	1,200	—	5,100
3	హైదరాబాద్‌లోని దంతపు కొమ్ముల పని పథకం	—	16,000	8,760	24,766
4.	గవర్నమెంటు కుటీర పరిశ్రమ విక్రయ డిపో పథకం	—	1,00,000	30,800	1,30,800
5.	కరీంనగర్‌లోని వెండి ఫిలిగ్రీ పని పథకం	—	30,000	—	30,000



1	2	3	4	5	6
6.	విజయవాడలో కేంద్ర విక్రయశాల పథకం	36,000	11,566	—	47,516
7.	వెదురు, వేముతో బుట్టలు వగైరా అల్లడానికై నెల్లూరు, తుమ్మపాల కోడూరులలో ట్రెయినింగ్ కేంద్రాన్ని స్థాపించడానికి పథకం	—	—	12,780	12,780
8.	తిరుచానూరులో కర్రబొమ్మల తయారీకై ట్రెయినింగ్ కేంద్ర పథకం	—	12.780	—	12,780
9.	ఏటికొప్పాకలో కర్రబొమ్మల తయారీకై ట్రెయినింగ్ కేంద్ర పథకం	—	18,500	—	18,500
10.	గుంతకల్లు, అరకులోయల్లో వెదురు, వేముతో బుట్టలు వగైరా నేసేందుకై రెండు ట్రెయినింగు కేంద్రాల్ని స్థాపించడానికి పథకం	—	9,624	—	9,62
11.	రాజమండ్రిలో విక్రయశాల స్థాపించడానికై పథకం	—	8,000	2,000	10.000
12.	తిరుపతిలోని విక్రయశాల స్థాపనకై పథకం	—	—	23,000	28,000
13.	ఏలూరులో ఉన్ని బాగుచేసి రంగు వేయడానికై కేంద్ర స్థాపనా పథకం	—	—	1,34,700	1,34,700
14.	బందరులో కలంకారి అద్దకపు, బత్త్యాల గూడెం కుటీర పరిశ్రమ సహకార సొసైటీ పథకం	—	—	9,200	9,200
15.	చీరాల, పేరాల, ఆశియా రుమాలు పథకం	—	—	28,500	28.500
	మొత్తం	99,900	1,97,786	2,90,280	5,87,966

(మూలం :—పారిశ్రామిక, వాణిజ్యశాఖ డైరెక్టరేటువారు ప్రచురించిన "ఆంధ్ర ప్రదేశ్ చేతి పనులు" అనే సమాచార చిరు గ్రంథం—పుట 25—1957).

తెలుగువారి సంగీతదృష్టి

శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు



సంగీతాన్ని గురించి వివరించిన మొదటి శాస్త్ర గ్రంథం మన దేశచరిత్రలో భరతముని నాట్య శాస్త్రము. ఈ నాట్య శాస్త్రం కాళిదాసుకూ, రామాయణ కర్తయైన వాల్మీకికి ముందరి యుగానికి చెందినది. అలనాటి ఆధారాలు ఆ గ్రంథాలలోనే వున్నాయి.

రామాయణ గానం

రామాయణంలో బాలకాండ తొలి అధ్యాయాల్లో గాంధర్వ తత్వ కోవిదులైన కుశలవులు వాల్మీకి రచించిన రామాయణ శ్లోకాలను గేయములుగా తంత్రీలయ సమన్వితంగా ఏడు శుద్ధ జాతులలో గానం చేశారు అని కనబడుతుంది. ఆనాడు రాగములకు జాతులని పేరు.

భరతుని నాట్యశాస్త్రంలో 'షడ్జ గ్రామము', 'మధ్యమ గ్రామము' అను రెండు గ్రామములు, ఆ గ్రామములనుండి పుట్టిన ఏడు శుద్ధ జాతులు, పదకొండు వికృత జాతులు, అని పిలవబడే రాగాల్లో పాడే ఆనాటి సంగీతాన్ని గాంధర్వమనీ గానమనీ అనేవారు. భారతీయ సంగీతము సామవేదము నుండి పుట్టినదని తరచు వింటుంటాము గదా ! అంతే గాక సృష్టికర్తయగు బ్రహ్మయే ఋగ్వేదము నుండి పాఠ్యమును సామవేదము నుండి గీతమును, యజుర్వేదము నుండి అభినయమును, అధర్వ వేదము నుండి రసములను గ్రహించి ధర్మప్రతిపాదకము, శిల్ప విశిష్టము, యితిహాస సహితమును అగునట్లుగా 'నాట్యము' అను పంచమ వేదమును సృష్టించి భరతమునికి ఉపదేశించెనని నాట్య శాస్త్రములో కనబడుతుంది. నాట్య వేదములో సంగీత మొక ప్రధాన భాగమన్న మాట. ఆనాటి ఆర్యసమాజములో వేదములపై ఆధార పడిన యితివృత్తముగల సంగీతమునకు "మార్గం" అనీ, దేశములోని ఆయా ప్రాంతముల సామాన్య జనులు తమ నిత్య జీవితములో పాడుకొను సంగీతమునకు 'దేశి' యని వ్యవహార ముండేది. షడ్జ గ్రామ, మధ్యమ గ్రామములనుండి పుట్టిన 'శుద్ధజాతులు' అనే రాగములను వైదిక సంబంధమైన గేయములను పాడుటకుపయోగించే వారు. క్రమక్రమముగా ఆంధ్ర నిషాద పుళిందశబరాది ఆర్యేతర జాతులతో సంబంధ బాంధవ్యాలు స్థిర పడుతున్న కొద్దీ ఆ జాతులవారు గానముచేసే రాగములు కూడా స్వీకారయోగ్యమవుతూ వచ్చాయి. అవే వికృత జాతులు అట్టి వికృత జాతులలో కొన్ని ముఖ్యమైన పేర్లు షాడ్జో దీచ్యవి, గాంధారో దీచ్యవి, మాధ్యమో దీచ్యవి, ఆంధ్రీ, నందయంతి, కార్మ్మారవి మున్నగునవి. ఉదీచ్యవి అనే పేరుగల. రాగాలు. ఆర్యావర్తమునకు ఉత్తర సరిహద్దులోని జాతులరాగాలు. ఆంధ్రి ఆర్యావర్తానికి దక్షిణ సరిహద్దులో వెలసిన ఆంధ్ర జాతి వారిరాగం.

భరతుని నాట్యశాస్త్రము నాటికే, అనగా క్రీస్తు పూర్వము నాలుగో శతాబ్ది నుండి. ఒకటో శతాబ్ది లోపున ఆనాటి ప్రాచీనాంధ్ర జాతి కృషి ఫలితమైన ఆంధ్ర జాతి అనే రాగపు లక్షణము భరతుని నాట్య శాస్త్రంలో లభిస్తోంది. సుమారు క్రీస్తు తరువాత ఆరో శతాబ్దము నాటి వాడైన మతంగుని 'బృహద్దేశి' అనే సంగీత గ్రంథంలోకూడా అదే లక్షణంగల ఆంధ్ర జాతి భాషా రాగములలోనూ, విభాషా రాగములలోనూ, మరిరెండు రకముల ఆంధ్ర రాగములు వుండి నట్టు తెలుస్తోంది. పదమూడో శతాబ్దము దక్కనులోని దేవగిరివాస్తవ్యుడైన శార్ఙ్గదేవుని 'సంగీత రత్నాకరము' లో భరత మతంగులు వివరించిన జాతి రాగములలో పాడవలసిన సంస్కృత గేయములు స్వర సహితముగా మనకు

లభిస్తున్నవి. వాటిలో ఆంధ్ర జాతి గేయమును యిక్కడ ఉదాహరిస్తున్నాము. భాష సంస్కృతము : ఇతి వృత్తము శివస్తుతి : ఇటువంటి స్తుతిగీతాలను సృష్టికర్తయైన బ్రహ్మయే రచించాడని ఆనాటి వారి విశ్వాసము.

గరి రీ రీ రి రి రీ రిగ రిగ రీ ఈ

తరుణేందు కుసుమ ఖచిత జ టం ;

రిరి గగ రిరి మమ రి గ స దని నీ ;

త్రిది వన దీ సలిలి ధౌత ముఖం ;

నిరి నిరి ని ని దని ప ప మ ప మ రిగ గా ఆ :

నగ సూ ను ప్ర ణయం నే ద ని ధిం ;

రిరిగ సస మమ పప మ ప మ రిగ గా ;

పరిణా హితుహిన శైల గృహం :

దని గగ గా పప మ దిగ గా ;

అమృతభిపం గుణర హితం ;

నిని నిని రిరి రిరి రిరి గని స నినిస

తమవని రవిశశి జ్వలనజ ల ప వ న

ప ప మ రిగ గా ;

గ గ న ప నుం :

రి రి గ స మ మా మ ప ప ;

శరణం వ్ర జా అమి ;

మ మ ని ని స నిగ ప రి గ గా ; ; ;

శుభ మతి కృతనిల యం ; ; ;

మపదని సరిగమ-మగరిస నిదపమ—ఇది మధ్యమ గ్రామపు సౌవీరి మూర్ఛన ; దీనిలో గాంధారాంశక మూర్ఛన -గమపదని సరిగ.

గరిసనిదపమగ—అను ఈ స్వరాల్నే సనిదపమగరిస—అని మార్చు కొని పాడితే అవే నేటి కల్యాణి రాగస్వరములుగా గుర్తింపవచ్చు.

భరతుడూ, మతంగుడూ, శార్ఙ్గదేవుడూ చెప్పిన లక్షణముల ప్రకారము మధ్యమ గ్రామంలోంచి పుట్టిన సౌవీరి మూర్ఛనలో గాంధారాంశక మూర్ఛనగా ఆంధ్ర జాతిని గానము చేయవలెను.

భరతుని షడ్జ గ్రామము నేడు మనకు తెలిసిన ఖరహర ప్రియ రాగముతో సమానము. మధ్యమ గ్రామము నేడు మనకు తెల్సిన హరి కాంభోజితో సమానము. ఆనాటి మధ్యమ గ్రామపు



గాంధారాంశక మూర్ఛన నేటి హరికాంభోజి నిషాదాది మూర్ఛనతో సమానము. అనగా నేటి కల్యాణికి బీజప్రాయమైన రాగమే నాటి ఆంధ్రి.

యమన్ : కళ్యాణి

భరతుని నాటి నుండి పదమూడో శతాబ్ది నాటి శార్ఙ్గదేవుని వరకు ప్రచారములో నుండిన ఆంధ్రి 13 వ శతాబ్ది నాటి అరబు, పారశీక సంస్కృతి ప్రభావమునకులోనై ఆంధ్ర నామము మరు గునబడి అదే స్వర బంధముతో కూడిన యమన్ రాగముగాను కళ్యాణి రాగముగాను అమీర్ ఖుస్రో, మున్నగు పారశీక విద్వాం సుల ప్రాబల్యము ద్వారా గుర్తింపుట మొదలైనది. అదే రాను రాను హిందూస్థానీ సంగీతములో యమన్ రాగముగానూ, కర్ణాటక సంగీతములో కల్యాణి రాగముగాను తేలినది. మొగల్ దర్బారులో

తాన్‌సేన్ వంటి ప్రసిద్ధ గాయకుల రచనల ద్వారా యమన్ రాగము ప్రసిద్ధి పొందింది. భద్రాచల రామదాసు, క్షేత్రయ్య, త్యాగరాజు, శ్యామశాస్త్రి, దీక్షితులు కల్యాణి రాగములో అనేక భక్తి రస పూరిత కృతులను రచించారు. పద్దెనిమిదవ శతాబ్దిలో వెంకటమఖి కల్యాణీ రాగము తురుష్క సంజాత మగుట చేత శుభ సందర్భములలో ప్రయోగించుటకు పనికిరాదని వ్రాయడం చరిత్ర తెలియని తొందరపాటు వలన కలిగిన ప్రమాదము.

భరతుని నాట్య శాస్త్రములో గాంధారోదీచ్యవీ, మాధ్యమోదీచ్యవి మున్నగు ఆర్యావర్తమునకు ఉత్తర హద్దులలో నుండు ఆర్యేతర జాతులవారి రాగముల పక్కనే దక్షిణ సరిహద్దులోని ఆంధ్రజాతి వారి రాగమునుకూడ యిచ్చుట గమనింపదగినది. అంతేకాదు రుద్రముని మొదటి సంస్కృత శాసనములో గౌతమీ పుత్ర శాతకర్ణిని "దక్షిణాపథపతిం ద్విరపి విజిత్యా" అనేప్రయోగములో ఆంధ్ర చక్రవర్తియైన గౌతమీ పుత్ర శాతకర్ణిని గురించి 'దక్షిణా పథ పతీ,' అని ప్రయోగించుట, మరియొక శాసనములో 'అంధపథీయో గామో' అని దక్షిణాపథమునకే అంధపథ మనీ, ఆంధ్ర పథమనీ వ్యవహరించుట యివి అన్నీ కలిపి ఆలోచిస్తే 'ఆంధ్ర' 'దక్షిణ' శబ్దములు ఏకార్థకములని స్పష్టము కావటము లేదు.

తెమ్మెర — దక్షిణపు గాలి, చల్లనిగాలి; తెంకణ, టెంకణం దక్షిణం. తెంకణాదిత్యుడనేది, నన్నెచోడ కవిరాజు బిరుదం, తెన్నాడు — దక్షిణ ప్రాంతము (తమిళంలో) తెన్‌గాశి — దక్షిణ కాశి.

ఇటువంటి ప్రయోగములవలన తెలుగుకూడా దక్షిణార్థ బోధకమే. ఐతరేయ బ్రహ్మణమునాడు అంటే క్రీస్తుకు కొన్ని శతాబ్దముల ముందు విశ్వామిత్రుని సంతతివారైన ఆంధ్ర, శబర, పుళింద, మూతిబాలను జాతుల వారిని తండ్రి శాపమువలన ఆర్యావర్తపు సరిహద్దుల అవతలికీ తరిలి పోయినట్లు తెలుస్తుంది. మెగస్తనీసు కాలమునాటికి వింధ్యకు దక్షిణ సరిహద్దులో మౌర్యులకు సమకాలికులుగా ఆంధ్రులు దిట్టమైన దుర్గాలతో, బలవంతమైన సైన్యాలతో ఏలుబడి కొనసాగిస్తున్నట్లు తెలుస్తుంది. తమిళ సంస్కృతి అత్యంత ప్రాచీనమైనదని తమిళ సోదరులు చెప్పుతూ ఉంటారు. తొల్కాప్పియం శిలప్పధికారం అనే తమిళ సంగం వాఙ్మయ గ్రంథాల్లో-ఆనాటి చేర చోళ పాండ్య రాజ్యములతో కూడిన తమిళక దేశమునకు ఉత్తర సరిహద్దున మహిషమండలమూ (మైసూరూ) తిరువెంగడమూ (తిరుపతి) కలవనీ అటనుంచి వింధ్య వరకూ వ్యాపించిన రాజ్యానికి నూర్‌కన్నార్ (శాతకర్ణి) రాజనీ చెప్పబడింది. ఆంధ్రీ సంస్కృతి ఆ రాజ్యానిదే. ఐతరేయ గాథ అంతకు మించి ప్రాచీనమయినదన్నమాట. ముందు చెప్పుకొన్న శార్ఙ్గదేవుడు దేవగిరిలో యాదవరాజుల కొలువు చేస్తూండినప్పుడు (1210 ప్రాంతం) ఓరుగల్లులో కాకతీయ గణపతి దేవుని కొలువులో జాయప సేనాని కేవల గజ సైన్యాధ్యక్షుడుగానేకాక నృత్త రత్నావళి, గీతరత్నావళి, వాద్య రత్నావళి అనే గ్రంథాలను రచించి ప్రసిద్ధి కెక్కాడు. ఈ గ్రంథాల్లో జాయప సేనాని వైదిక సంప్రదాయమును అనుసరించిన మార్గనృత్యము, మార్గ సంగీతము మాత్రమేకాక తెలుగువారికి జాతీయములనదగిన దేశనృత్య రీతులను, దేశి సంగీత రీతులను అనేకముగా వివరించినాడు. ప్రాచీనాంధ్ర రాజధానియైన శ్రీకాకుళం సిద్ధేంద్రయోగి నాట్యకళ కాలుపెట్టిన కూచిపూడి, పదకర్తయైన క్షేత్రయ్యకు జన్మస్థానమైన మొవ్వా, వెలసిన ""దివిసీమ""యే జాయపసేనాని జన్మసీమ కావడం మరొక ముఖ్య విశేషం. కాకతీయులు చాళుక్యులకు తర్వాత ఆంధ్ర సామ్రాజ్యమును ఏలినవారు. అంతవరకు రాజకీయ భాషలుగా సంస్కృత, ప్రాకృతములు పొందుచుండిన గౌరవస్థానమును తొలిసారిగా ప్రజల భాషయైన తెలుగునకిచ్చినవారు చాళుక్యులు. చాళుక్యుల కాలములో ప్రారంభమైన భారతాంధ్రీకరణము కాకతీయుల కాలములోనూ, తరువాత రెడ్ల కాలముతోనూ పూర్తి అయినది. కాని, తెలుగువారి సంగీతమునకు ఆది పీఠమైన ద్విపద ఛందస్సునకు కావ్య గౌరవమిచ్చి రంగనాథ రామాయణమును ద్విపదంలో సామాన్యజనుల వినోద వికాసములకు తోలుబొమ్మల వారికికూడ గానయోగ్యమగునట్లుగా రచించినవారు గోన బుద్ధారెడ్డి, అతని కుమారుడు. ఇదే కాలములో మరొక పక్క శివకవుల జానుతెనుగు పద్యములో వీరశైవావేశముతోపాటు సర్వకుల సమానత్వము, దేశీయచ్ఛందః ప్రచారము, పాల్కురికి సోముని ద్విపద కావ్యములద్వారా దేశ వ్యాప్తి పొందాయి. అదే కాకతీయ యుగంలో (పదమూడవ శతాబ్దం) రాయలసీమలో జన్మించి సాగరాంత్రములోని సింహాచల దేవుని భక్తుడై, ఓరుగల్లులోని ప్రతాపరుద్రుని ఏలుబడి కూడా చవిచూసిన కృష్ణమాచార్యులు సింహగిరి వచనాలను పేర భక్తి కీర్తనలను వ్రాసిన తొలి తెలుగు, వాగ్గేయకారుడు. తర్వాత యుగంలో ఆంధ్ర రాజ్యాన్ని రెడ్డి వెలమరాజులు పంచుకున్నారు. రెడ్లకు అద్దంకి, కొండవీడు, రాజమహేంద్ర వరములు రాజధానులు కాగా, వెలమలకు రాచకొండ రాజధాని. కొండవీడునేలిన కుమారగిరి భూపాలుడు అసమాన నర్తకియైన లకుమాదేవికి ప్రియుడు, భరతుని నాట్యశాస్త్రానికి వసంత 'రాజీయము' అనే వ్యాఖ్య రాశాడు. పెదకోమటి వేమారెడ్డి 'సంగీత చింతామణి' అనే లక్షణ గ్రంథం రాశాడు. రాచకొండ వెలమ భూపతి సర్వజ్ఞ సింగమనీడు శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరానికి 'సంగీత సుధాకరం' అనే వ్యాఖ్యానం రాశాడు. విజయనగర సామ్రాజ్య స్థాపకుడు విద్యారణ్యస్వామి హరిహర బుక్కరాయలకు రాజగురువు మాత్రమే గాక 'సంగీత సారం' అనే లక్షణ గ్రంథాన్ని రచించాడు. 15వ శతాబ్దిలో విజయనగర సింహాసనంపైన దక్షిణాధీశుడై ప్రసిద్ధిపొందిన ఇమ్మడి (ప్రౌఢ) దేవరాయల ఆస్థానం ఆంధ్రకవి సార్వభౌముడయిన శ్రీనాథుని దీనారటంకాలతో తీర్థమాడించినందుకే కాక, చతురకల్లినాథుడనే సంగీత నాట్య శాస్త్ర కోవిదునిచేత శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరానికి 'కళానిధి' అనే వ్యాఖ్యను వ్రాయించినందుకు కూడా చరితార్థమయింది.

తాళ్ళపాక అన్నమయ్య

15 వ శతాబ్దిలో తాళ్లపాక అన్నమాచార్యు లుదయించే వరకు తెలుగుపాట పల్లెసీమలలోను, పామరజన వినోదాలలోను మేలుకొలుపులు, సువ్విపాటలు, పంటపొలాల పాటలు, తుమ్మెద పదాలు, వెన్నెల పదాలు, అల్లోనేరేళ్లు జాతర (జాజర) పాటలు, అక్కల పాటలు, వీరుల పాటలు, ఇత్యాదిగా లిపిబద్ధము కాక, ఆనోటినుంచి ఆనోటికి వ్యాపించి, సభాగౌరవం కాని, పూజా పురస్కారాలు కాని లేకుండా ఉండేది. పద్యకవితయే సాహిత్యం. శివకవులు మొదలుగా కొందరు ద్విపదకావ్యాలు వ్రాసినా, వాటికి సాహిత్య గౌరవం అంతగా ఉండేది కాదు. అటువంటి స్థితిలో తిరుపతి వేంకటేశ్వరస్వామి భక్తుడుగా వెలసి, వేలకొలది తెలుగు పాటలను స్వామికి అంకితంగా, స్వామియే నాయకుడుగా, సామాన్యజనుల జాను తెలుగులో శృంగార కీర్తనలను, శిష్ట భాషలో అధ్యాత్మ కీర్తనలను రచించి, దేవుడి కొలువులో తెలుగు పాటకు పెద్ద పీట వేయించిన పదకవితా పితామహుడూ సంకీర్తనాచార్యుడూ తాళ్లపాక అన్నమయ్యగారు. అందుకనే, ఆ కాలపు పండితులకు తెలుగుపాట ఇంపుసొంపులు అందించి ఒప్పించడానికే ఆయన సంకీర్తన లక్షణం అనే గ్రంథాన్ని సంస్కృతంలోనే వ్రాస్తే, ఆయన మనుమడు చినతిరుమలాచార్యుడు దానిని తెలుగులోనికి అనువదించాడు. అన్నమాచార్యులే కాక, ఆయన కుమారుడు పెదతిరుమలాచార్యుడు, మనుమడు చినతిరుమలాచార్యుడు కూడా వందలకొలదీ కీర్తనలు వ్రాసి, స్వామికి అంకితమిచ్చారు. ఆధునిక యుగంలో శాంతినికేతనానికి గురుదేవుడు రవీంద్రునిలాగా, ఆనాడు అన్నమాచార్యులు స్వామికి అంకితంగా కూర్చిన కీర్తనలు ఎన్నో విధముల ఇతివృత్తములనో, అలంకార శాస్త్రములో చెప్పిన నాయికా నాయక భేదములకు, అవస్థాభేదములకు దృష్టాంతములుగా స్త్రీపాత్రలుపాడుకొనేవి, పురుషపాత్రలు పాడుకొనేవి, సంవాదగీతులు, స్వామివారి వేరువేరు దైనందిన సేవలకు, బ్రహ్మోత్సవ, గరుడోత్సవవాది ఉత్సవాలకు, ఎన్నో సందర్భాలకు పనికివచ్చే కీర్తనలు, తాత్త్వికములు, లౌకికములు, రాజకీయములు, సాంఘికములు, నీతినియమాలు చొప్పించినపదాలు ఏలలు, జాజరలు, వెన్నెలపదాలు, లాలిపాటలు, శోభనాలు, మేలుకొలుపులు, దంపుళ్లు, నలుగులు, కూగూగులు, చాంగుభళాలు తందానలు, ఇత్యాదులుగా తాళ్లపాకవారు తెలుగుపాటను దిద్దితీర్చినన్ని విధాల మరేవాగ్గేయకారుడూ ఏభాషలోనూ చేయలేదంటే అతిశయోక్తి ఎంతమాత్రమూకాదు. ఈపాటలన్నీ విదితప్పకుండా, స్వామివారి ఆలయమండపములో నృత్యగానములతో ప్రదర్శిస్తూ వుండేవారన్న విషయం గుర్తుంచుకోవాలి. అచ్యుతదేవరాయల ఆదరముతో పెదతిరుమలాచార్యులు, చినతిరుమలాచార్యులు ఈ కీర్తనలను రాగిరేకులపై చెక్కించి, తిరుపతిలో సంకీర్తనభాండారము అనే అరలోపెట్టించి ఉండకపోతే ఈ సంకీర్తన సంపద తిరుపతి దేవస్థానము వారిద్వారా ఇప్పటికీ 22 సంపుటములైనా మనకులభించేవికావు.

ఇంకొక ముఖ్య విశేషమేమంటే పద కవితా పితామహు డైన అన్నమాచార్యుడు కర్నాటక సంగీత పితామహుడు, కన్నడ పదకకర్త అయిన పురందర దాసులకు సమకాలికుడూ, వయస్సులో జేష్టుడు కూడా ! ఈయిరువురి మహాభక్తుల సమావేశమును గురించి అన్నమాచార్యులమనుమడు చిన తిరుమలాచార్యుడు తాను రచించిన అన్నమాచార్య చరిత్ర అనుద్విపద కావ్యములో మనోహరంగా వర్ణించాడు. అన్నమాచార్యుల మనుములూ, పురందరదాసులు విజయనగర పాలకులైన అచ్యుత దేవరాయల, సదాశివ దేవరాయల ప్రోత్సాహముతోనూ స్వరమేళ కళానిధి రచించిన రామామాత్యుని తోడ్పాటుతోను కర్నాటక సంగీతమును సరళీ, జంట స్వరములూ గీతములూ, అలంకారములు, వర్ణములూ అనే క్రమతరగతి పద్ధతిలో సంగీత విద్యార్థులకు శిక్షణ మార్గము నేర్పాటు చేసినట్లునూ రాజులు కన్నడ రాజ్యరమారమణులుగనుక రాజకీయ వ్యవహార భాష తెలుగైనను మన సంగీతమునకు కర్నాటక సంగీతమని పేరు పడి పోయింది.

తాళ్ళపాకవారు పెట్టిన వరవడులలో మన సంగీత వాహిని ఆ తరువాతి శతాబ్దాలలోని మూడు పెద్దపాయలుగా ప్రవహించింది. తాళ్ళపాక వారి శృంగార పదముల ననుసరించి పదకవితను మరింత పరిపక్వ స్థితికి తీసుకొచ్చినవాడు క్షేత్రయ్య. ఇతడు కృష్ణాజిల్లా మొవ్వ నివాసి. దాదాపు యితని పదములన్నీ మొవ్వలోని మువ్వగోపాలునికే అంకితములు. మువ్వగోపాల భక్తుడగు క్షేత్రయ్య తన పదములన్నింటిని నాట్యాభినయమున కనుగుణముగా సాహిత్య రసభావము రాగస్వరూపములో పెనవేసికొని విభిన్న మనోవస్థలను సాత్విక భావములను అభినయించుటకనువుగా రచించెను. ఈ విధముగా పదకవితా శాఖను పెంపొందించిన ప్రముఖులలోని కొందరు సారంగపాణి సభాపతయ్య, గోవింద స్వామి, ఘనం శీనయ్య మున్నగువారు.

శృంగార కీర్తనలు క్షేత్రయ్యాదుల రచనలలో పదములుగా స్థిరపడగా అధ్యాత్మ భావము, భక్తి భావము ఆధారము చేసికొన్న పాటలు కీర్తనలుగానూ, సంకీర్తనలుగాను పేరు పడ్డాయి. ఈ సంకీర్తనలు భక్త సమూహము బృందములుగా, మండలములుగా ఆలయ ప్రాంగణములో తీర్చి కూర్చునిగాని, లేక రాసపద్ధతిలో వలయాకారముగా నృత్యముచేస్తూ తిరుగుతూ గానీ, గానము చేసే భజన, సంకీర్తన గోష్ఠుల సంప్రదాయము ఏర్పడింది. ఇట్టి కీర్తనకారులలో ఆది పురుషుడు కంచెర్ల గోపన్న, లేక భద్రాచల శ్రీరామ భక్తుడైన రామదాసు, గోల్కొండ తానీషా కొలువులో తాసిల్దారయిన గోపన్న భద్రాచలంలోని శ్రీరాముని ఆలయ కైంకర్యమునకు గాను ప్రభుత్వ ధనము వెచ్చించుట, గోల్కొండ తానీషా గోపన్నను చెఱసాలలో నుంచి బాధించుట మొదలుగాగల కథ ఆంధ్ర దేశములోని ఆబాల గోపాలమునకు పరిచితమే. ఆంధ్ర దేశములోని రామమందిరములేని గ్రామము లేదు, రామదాసు కీర్తనలు పాడని మందిరము లేదు.

సంకీర్తన శాఖను పెంపొందించిన వారిలో రామాయణ కథను అధ్యాత్మపరముగా చక్కని రాగవరుసలలో కీర్తనలుగా రచించిన 'అధ్యాత్మ రామాయణ' కర్తయైన మునిపల్లె సుబ్రమణ్య కవీ, తరువాత 'మోక్షగుండ రామాయణ' కర్తయైన తాళ్ళూరి నారాయణ కవి.

తాళ్ళపాకవారు ఒరవడి వేసిన సంగీత సంస్కృతి వాహినిలో మూడో పాయ 'యక్షగాన పద్ధతి'. ఈ పద్ధతిలోనే తయారయిన సిద్ధేంద్రయోగి 'భామా కలాపం'. నారాయణ తీర్థుల 'కృష్ణలీలా తరంగిణి' కూచిపూడి నర్తక కుటుంబాల నాట్య ప్రదర్శనకు ఒరవడులైనవి.

1565 లో విజయనగర సామ్రాజ్యము పతనమయ్యాక సామంతులైన నాయక రాజులు తంజావూరులో స్వతంత్ర రాజ్యము నెలకొల్పుకున్నారు. సంగీత విద్వాంసులూ, నర్తకులూ, కవి పండితులూ, మన ఆంధ్రదేశ ప్రాంతములనుండి రాజాశ్రయం కోసం తంజావూరు వలసపోయేవారు. అటువంటి నర్తక కుటుంబాలలో ఒకటి అచ్యుతప్ప నాయకుని నుండి మేలట్టూరు అనే గ్రామాన్ని అరణంపొంది అక్కడ స్థిరపడ్డారు. మేలట్టూరి వీరభద్రయ్యా, కాశీనాథయ్యా, వెంకట్రామశాస్త్రీ యీ మనుషుల్లో గొప్పగా చెప్పుకోతగ్గ వాగ్గేయ కారులు. వీరభద్రయ్య యెన్నో పదములూ, కీర్తనలూ రచించాడు. నాట్యాభినయానికి పనికివచ్చే శబ్దాలను రచించాడు కాశీనాథయ్య. ఉషాపరిణయమూ, రుక్మాంగదా, ప్రహ్లాదా మున్నగు యక్షగానాలను రచించాడు వెంకట్రామ శాస్త్రి.

నాయక రాజులు

నాయక రాజులలో రఘునాథుడూ, విజయ రాఘవుడూ, విద్వత్ కవిపోషకులు మాత్రమే కాక స్వయముగా కవులూ, వాగ్గేయకారులు. విజయ రాఘవుడు రచించిన యక్షగానం 'విప్రనారాయణ చరిత్ర' బహురసవంతంగా వుంటుంది. ఆయన ఆస్థాన కవయిత్రి రంగాజమ్మ 'మన్నారుదాసు విలాస' మనే యక్షగానాన్ని రచించింది. అందులో కథానాయకుడు విజయ రాఘవుడే నాయక రాజులు 'సరస్వతీ మహల్' అనే పుస్తక భాండాగారాన్ని నెలకొల్పి 'విజయ భువన' మనే రంగశాలలో యక్షగానాలను ప్రదర్శించేవారు.

నాయక రాజులను ఓడించి తంజావూరు నాక్రమించిన మహారాష్ట్ర రాజులు నాయకరాజులు నెలకొల్పిన సంస్కృతి సంప్రదాయాలన్నిటినీ కొనసాగించారు. రాజకీయ సాంస్కృతిక, విద్వత్ భాషయైన తెలుగును తాముకూడ నేర్చుకుని అందులో విరివిగా కావ్యములను, పదములను, యక్షగానములను రచించారు. అట్టివారిలో గణనీయుడు 'శాహజీ' తిరువారూరులోని శివమూర్తియైన త్యాగరాజస్వామి సేవకై 'శంకరపల్లకి సేవా', విష్ణుమూర్తి సేవకై 'విష్ణుపల్లకి సేవా', అనే గేయ ప్రబంధాలను శాహజీ రచించారు. ఈ ప్రబంధాలను యిప్పటికీ, అక్కడి ఆలయాల్లో నాట్యాభినయములతో ప్రదర్శిస్తుంటారు. శాహజీ మహారాజుకు ఆస్థానకవియైన 'గిరిరాజ కవికి స్వయాన పౌత్రుడే, ప్రసిద్ధ వాగ్గేయకారుడు త్యాగరాజు. శాహజీ సోదరుడు తులజాజీ మహారాజు 'సంగీత సారామృతం' అనే లక్షణ గ్రంథం రచించారు.

కీర్తన రచనాశిల్పమును సంగీత బంధములో మరింత కట్టుదిట్టము జేసి, నేటి సంగీత సభా సంప్రదాయమునకు మూలకందమైన, కృతిగా దిద్ది తీర్చిన వాగ్గేయ కారులలోని ప్రధానులు త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రీ: వీరిని కర్ణాటక సంగీతమూర్తిత్రయం అంటారు. ముగ్గురి కృతులలోను ఇష్టదేవతాభక్తి ప్రధానము. త్యాగరాజ కృతుల చివర 'త్యాగరాజనుత' అనీ శ్రీరామునకు అంకితములుగాను, దీక్షితుల కృతుల చివర 'గురుగుహ' అనే సుబ్రహ్మణ్యస్వామికి అంకితములుగాను, శ్యామశాస్త్రిల కృతుల చివర శ్యామకృష్ణసహోదరి అని వారింటి ఇలవేలుపయిన కామాక్షీదేవికి అంకితములుగాను రచించారు. సాంప్ర



దాయిక సంగీతవాహిని ఈ ముగ్గురి రచనలలోను పెద్ద జలాశయ రూపంలో పోగుపడి, సంగీతసభా సంప్రదాయం అనే నూతన మైదానంలోనికి ఆకస్మికంగా జారిపడే బహువేగ పూరితమైన జల ప్రపాతంలాగా కనిపిస్తుంది. వీరిలో ఏ ఒక్కరి రచనయైనా పాడనిదే ఈ నాడు ఏ కర్ణాటక సంగీత సభా రక్తికట్టదు అంటే అది ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు.

తెలుగువారు కాక పోయినా తెలుగులోను, (సంస్కృతం లోను) కృతులను రచించిన మూర్తిత్రయానంతర వాగ్గేయకారులలో ప్రసిద్ధులైనవారు తంజావూరు చతుష్టయం అని పేరు పొందిన వడివేలు, పొన్నయ్య, శివానందం, చిన్నయ్యగార్లు తిరువాంకూరు మహారాజు స్వాతి తిరునాళ్, మైసూరు సదాశివరావు, మైసూరు వాసుదేవాచారిగారలు।

సంస్థానాల్లో పోషణ


దక్షిణాదిని తంజావూరు, మైసూరు తిరువాంకూరు దక్కనులో గోలకొండ హైదరాబాదులలో సంస్థానాధీశుల వలెనే, ఉత్తరాంధ్రంలో విజయనగరం, బొబ్బిలి, పిఠాపురం, దక్షిణాంధ్రలో వెంకటగిరి, కార్వేటినగరం మొదలగు ప్రాంతాల తెలుగు జమీందార్లు సంగీత సాహిత్య విద్వత్కవులను పోషించేవారు. విజయనగర పాలకుడయిన ఆనంద గజపతి మహారాజు స్వయంగా విద్వాంసుడు, బహు భాషాకోవిదుడు, సంగీతజ్ఞుడు. ఆయన ఆశ్రయంలో వీణవేంకటరమణదాసు, నందిగామ వెంకన్నగార్లు, దుర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు, హరికథా పితామహుడు అజ్జాడాదిభట్ల నారాయణదాసు గారు వర్ధిల్లారు. పిఠాపురం ఆస్థాన విద్వాంసులైన ప్రసిద్ధ వీణాచార్యులు తుమరాడ సంగమేశ్వరశాస్త్రి గారు దాసు శ్రీరాములు గారితో కలిసి కొన్ని కృతులు, జావళీలు రచించారు. సంగమేశ్వరులు శాంతినికేతనంలో రవీంద్రుని అతిథిగా ఆయనకు కర్ణాటక సంగీతాన్ని వినిపించి మెప్పించిన మనీషి. వాయులీన విద్వాంసులు ద్వారం వేంకటస్వామి నాయుడు గారు విజయనగర దర్బారులోనే తమ కళా విద్వత్ జీవితానికి ప్రాతిపదికలు వేసుకొన్నారు.

త్యాగరాజు శిష్యులకు ప్రశిష్యులయిన పారుపల్లి రామకృష్ణయ్య పంతులు, హరినాగభూషణం, పిరాట్ల శంకరయ్యగారలు తమ అసంఖ్యాకులయిన శిష్యుల ద్వారా కర్ణాటక త్రిమూర్తుల సంప్రదాయం ద్వారా వెలువడిన సంగీత వాహినిని బహుముఖాలుగా విస్తరింప జేశారు.

ఈ శతాబ్ది డెబ్బది ఏండ్లలో కర్ణాటక సంగీత ప్రచారమునకు తెలుగు దేశములో బహువిధ ప్రోత్సాహం లభించింది. ఏబది ఏండ్ల క్రితం మద్రాసులో కాక, ఏ కాకినాడలోనో విజయనగరంలోనో విజయవాడలోనో గుంటూరులోనో ఒక్కొక్క సంగీత సభ ఉండేది. దాని (కచ్చేరీలు) గాన సభలలో పాల్గొనడానికి తప్పనిసరిగా మద్రాసు ప్రాంతంనుంచే సంగీత విద్వాంసులను ఆహ్వానించేవారు, శ్రోతలుగా, ఆనాటి సమాజంలో తలపాగాల నెక్టైలవారు మాత్రం వచ్చేవారు. పదేసి ఇరవయ్యేసి ఏండ్లకు, ఒకవైపు పాల్గొనే ప్రామాణికులయిన తెలుగు సంగీత విద్వాంసుల సంఖ్య హెచ్చుడము, రెండవవైపు శ్రోతల సంఖ్య కూడా హెచ్చుడమూ చెప్పుకోతగ్గ మార్పు. జిల్లా కేంద్రాలలోనే కాక, మారుమూల గ్రామాలలో కూడా త్యాగరాజ సంగీత సభలు నెలకొల్పి, దేశం నలుమూలల నుంచి విద్వాంసులను పిలిపించి గాన సభలు చేయించడం, గ్రామఫోను, రేడియో, రేడియో కేంద్రాల సంఖ్య పెరగడంతో, నిత్యసంగీత కార్యక్రమాల ద్వారా మన సంగీత సంప్రదాయం పట్ల అపరిచియం రానురాను తగ్గి, అవజ్ఞ కూడా నానాటికీ పెరుగుతోంది. అయినా, ఇంకా, ఈనాడు సభకు వస్తూండే వేలాది శ్రోతలలో ఆ వింటున్న సంగీతములో ఇది నాదీ నా వారసత్వమే అనే భావం కలగవలసినంతగా కలగకపోవడానికి కారణాలు–మన సంగీత సభలు ప్రత్యేక వ్యక్తి ప్రతిభా ప్రదర్శకాలుగామాత్రం కాకుండా, మన సంప్రదాయాల ప్రచారానికై పద్ధతి ప్రకారం సమాచార సమన్వితంగా సభలు ఏర్పాటు చేస్తూ ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంతేకాక, బహుసంఖ్యాక జనం పాల్గొని ఆనందించడానికి వీలయిన సామూహిక గాన గోష్ఠులయిన మన సాంప్రదాయిక సంకీర్తన గోష్ఠులను, భజన గోష్ఠులను, జానపద కళామేళలను ఏర్పాటుచేసి, మన కళలలో ఇది భాగ్యవంతుల కళ, ఇది పేదవారి కళ అనే వ్యత్యాసాలు రాను రాను నిర్మూలం కావడానికి తోడ్పడే రీతిని, తగుప్రయత్నాలు స్వతంత్ర సంగీత సంస్థల ద్వారాను, ప్రభుత్వం ద్వారాను జరగవలసి ఉంది. అనాడు మన సంగీత సంపద–తెలుగువారైన ప్రజలందరికీ సమానంగా ఆస్వాదయోగ్యంకాగలదు.



జానపద గీతాల్లో సాంఘిక జీవనం



డాక్టర్ ఎస్. గంగప్ప

నిసర్గమనోజ్ఞమై, సహజ సుందరమైన కవితా పాటవం గల తెలుగు జానపద సాహిత్యం మన జాతికి ప్రతిబింబం: ఎన్నటికీ తరిగిపోని కాణాచి; అనంత విజ్ఞాన వినోదాలకు ఆటపట్టు; పల్లె పట్టుల అమాయక జీవితాల్లోని వివిధ విషయాల వ్యక్తీకరణకు మూలం; గ్రామీణ జీవితంలోని శోభను, సౌందర్యాన్ని, సౌకుమార్యాన్ని మన కన్నులకు కట్టేట్టు దృశ్య సాక్షాత్కారం గావించి, చెరగని ముద్ర వేయగల చక్కటి సాధనం.

మన దేశానికి వెన్నెముక గ్రామాలు. మన నిజమైన నాగరకత, సంస్కృతులు గ్రామాల్లోనే ఉన్నాయి. గ్రామీణ జీవితాన్ని అభివ్యక్తం చేసే పల్లె పాటల్లో సొగసంతా ఇమిడి ఉంది. అనునిత్యమూ పల్లె ప్రజలు చేసే పానిపాట్లకూ, పొందే సుఖ దుఃఖాలకూ ప్రతిబింబంగా ఉంటాయి జానపద గీతాలు. ఇవి ఒకరు రాసిపెట్టినవి కావు; పుస్తక రూపంలో ఉండేవీ కావు. ఈ జానపద గీతాలు రచించిన కవులు పల్లె ప్రజలే; వారందరూ అజ్ఞాత కవులూ, కవయిత్రులూను. ఈ గీతాలు 'ముఖేముఖే సరస్వతీ' అన్నట్లు వాగ్రూపంతో ఒకనోటి నుంచి మరోనోటికీ, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికీ మారడంవల్ల ఎన్నో మార్పులు, చేర్పులు, కూర్పులూ వచ్చి, కొంత కొత్తదనాన్ని సంతరించుకొంటూ ఉంటాయి. అయినా మానవ సహజమైన సుఖ దుఃఖాలు, ఆవేశకావేషాలు, బాదరబందీలు, ఆనందోత్సాహాలు, వలపూ వగలు, ప్రేమ విరహాలు తప్పక ఈ గీతాల్లో ప్రతిబింబిస్తాయనడం సహజమే. శ్రామిక, వినోద గీతాల్లో గ్రామీణ జీవితం సుస్పష్టంగా మనకు అవగతమవుతుంది. ఇంట విసర్రాయి పదాలు, దంపుళ్ల పాటలూ, బయట నాట్లు వేసేప్పుడు, కలుపు తీతల సమయంలో, కోత కోసే సందర్భంలో, నూర్పులప్పుడు, కపిలితోలేప్పుడు, ఏతాం ఎత్తేప్పుడు, మాడు వేసే సమయంలో కర్షకులు పాడే గీతాలు, పడవ సరంగులు, బరువులు లాగే శ్రామికులు పాడే పాటలు, పండగ పబ్బాలు, పెళ్లి పేరంటాలు, ఉత్సవాలు, ఊరేగింపులు మొదలైన సందర్భాల్లో ఉత్సాహంగా పాడుకొనే వినోద గీతాలూ సుస్పష్టంగా గ్రామీణ జీవితాన్ని ప్రతిబింబిస్తాయి.

ప్రజల స్థితిగతులూ, మనఃప్రవృత్తులూ, సంఘంలోని అలవాట్లు కట్టుబాట్లు, విశ్వాసాలు, మతం, భక్తి, తినే తిండి, కట్టే బట్ట, ధరించే ఆభరణాలు, ఇల్లు వాకిళ్లు లాంటి నిత్య జీవితంలోనివన్నీ జానపద గీతాల్లో వ్యక్తమవుతాయి. అంటే తెలుగు జాతి నిండు గౌరవం నిలబెట్టగల ఈ గీతాల్లో సర్వమూ విదితమే. నా సేకరణలోని జానపద గీతాల్ని ఉదాహరిస్తూ అందులో తెలుగు జాతి ప్రతిబింబించిన తీరు తెన్నులను వివరిస్తాను. నా సేకరణలోని గేయాలు అనంతపుర మండలానికి పరిమితమని మనవి.

నిసర్గమనోజ్ఞ కవిత

పల్లెటూరి వాతావరణమూ, ఇల్లు వాకిళ్లూ, గుడిసెలూ మొదలైన వాటిని పామర కవులు కన్నులకు కట్టేట్లు వర్ణించగలరు. వర్ణన అనే సరికి ప్రౌఢ కవులతో పామర కవులను పోల్చకూడదు. ఇది నిసర్గమనోజ్ఞమైన కవిత. ఈ క్రింది కలుపు పాటలో "నీ యిల్లు నేనెరుగ, నిన్న గురుతెరుగా" అన్న ప్రియునితో ప్రియురాలు తన యింటి గుర్తులు చెబుతూంది—

"జాలిమాను నాయిల్లు జాల జారుబండా
2యాపమాను నాయిల్లు ఎదురుపడ సాలీ
3సిరిగంధపు చెక్కల్లో బోరు తలుపులూ
కడ4తొట్టు నాయిల్లు 5కానిఃప్పడమలా" అని

సమాధాన మిచ్చింది. [1. తుమ్మమాను, 2. వేపమాను, 3. సిరిగంధపు చెక్క ఇల్లు, 4. తట్టు–వైపు, 5. కొండగడ్డి]. ఇది పల్లెటూరి ఇంటి వర్ణన. కపిలి పాటలో ఓనాయక "ఈతాకు తాటాకు నడిమధ్య తూటగుడిసే" అంటుంది. రాచరికమున్న వాళ్ల ఇళ్ల వర్ణన సైతముంది—

"ఉక్కువే దూలాలు ఉక్కువే స్తంభాలు ఇది ఎవరి నగరిసాలీ
చక్కన్ని శ్రీరాము కుంబకర్నుని నగరిసాలీ
టేకువే దూలాలు టేకువే స్తంభాలు ఇది ఎవరి నగరసాలీ

చక్కని శ్రీరామ ఇంద్రజిత్తుని నగరిసాలీ
ఇప్పివే దూలాలు ఇప్పివే స్తంభాలు ఇది ఎవరి నగరిసాలీ
చక్కన్ని శ్రీరామ ఇభీషనుని నగరిసాలీ
వెండివే దూలాలు వెండివే స్తంభాలు ఇది ఎవరి నగరిసాలీ
చక్కన్ని శ్రీరామ రావణుని నగరిసాలీ''

ఇంక గ్రామీణ పరిసర వాతావరణం సైతం గమనించ దగ్గది. ఒక స్త్రీ చెబుతూంది—

"అదిగడ్డ ఇదిగడ్డ నల్లరేగడి గడ్డ
[6]ఎర్రగెరను గడ్డ
అది [7]రోటు ఇది రోటుపైన [8]పగబండి రోటు
ఆకు తోటలులోన అగిసి తోటలోన [9]ఎర్రజొరపు ఆకుంది"

[6. ఎర్రమట్టి, 7. రోడ్డు, 8. పాగబండి రోడ్డు—రైల్వే లైను, 9. ఎర్రజరపు ఆకు] ఇవి ఆకు తోటకు సంబంధించిన వర్ణన. ఇల్లే నిచ్చుమల్లి తోట చక్కగా వర్ణితం.—

"చందమామ కూతురులు నీలారి కన్నెలు
నీలారి కన్నెలకు ఒక చేరబాయో
ఒక చేర 10బాయికి ఒక చేర 11బిళ్లో
ఒక చేర బిళ్లకీ ఒక చేద తాడో
ఒక చేద తాడుకీ ఒక చేద 12దుత్తో
ఒక చేద దుత్తకూ ఒక పోలతోట
నిచ్చుమల్లి తోటకి నీరెత్తి పోయా."

[10. బావి, 11. కప్పి, 12. కడవ.] ఇలాగా పల్లెపట్టులను చక్కగా నిసర్గమనోజ్ఞంగా జానపద గీతాల్లో వర్ణించి ఉండడం గమనించ దగ్గది.

స్థానిక చరిత్రలు

ఈ జానపద గీతాల్లో చారిత్రక విషయాలు కూడా కొంతవరకు తెలియక పోవు. నిజానికి స్థానిక చరిత్రలు మనకు తెలియడం ఎంతైనా అవసరం. అక్కడక్కడా ఈ జానపద గీతాల్లో స్థానిక చరిత్రకు సంబంధించిన విషయాలు కనుపిస్తాయి. ఈ క్రిందిది కోలాటపాట.

"అది గదిగో అనంతపురము అంచనాలెక్కయ వనమూ
పక్కలోనే 13పామి డేరన్నా
నీయమ్మ జాన 14వొట్టి కొవ్విరి వాలలాడన్నా
15దర్మారం సంతలోన దండిగా పూలుంగాయగాన
నాకొక్క దండ పంపారా
నీయమ్మ జాన చాలకుంటే చైనాలం పూరా
గుట్టూరి సంతలోన గుండ్లు దండ్లు చాలగలవూ
నాకు ఒక్క దండ పంపారా ॥నీయమ్మ॥"

[13. పామిడి పక్కన పారుతున్న ఏరు—పెన్నానది; 14. ఎండు కొబ్బెర. 15. ధర్మవరం] ఇందులో

అనంతపురం, పామిడి, ధర్మావరం, గుట్టూర్లనుగూర్చి చెప్పడం జరిగింది. భౌగోళిక విషయాలు అభివ్యక్తం కావడం గమనించదగ్గది. ఇలాగే అనంతపురం జిల్లా పెనుకొండ తాలూకా లోని ముఖ్యమైన పల్లెటూళ్లు ప్రస్తావించబడ్డాయి ఈ క్రింది కపిలి పాటలో—

"16పాగొండ కర్రెంటు 17కోడిమొడుగు దీపాలు
రొద్దమూకచేరి రౌలిపెనుగొండా" [16. పావగడ్, 17. కొడిమడుగు], ఇట్లానే గుత్తి. కర్నూలు ప్రస్తావించ బడ్డాయి ఈ క్రిందిపాటలో.

"గుత్తిసీమ గురికానిబిడ్డా గుర్రమొచ్చాకానలేమే
కాలసన్నం నీలిగుర్రం కందనెల్లి బాటంటిపాయా''

ఇందులో 'కందనెల్లి' అంటే కందననోలు-కర్నూలు అని అర్థం, కర్నూలు పూర్వరూపమైన 'కందనెల్లి', ఈపాటలో మనకు కనిపిస్తూంది. ఆ శబ్దం చారిత్రక స్వరూపాన్ని మనం తెలుసుకోడానికి దీనివల్ల వీలవుతుంది. ఇలాగా గ్రామీణ వాతావరణం సువిదిత మవుతుంది.

వంట వార్పులూ, భోజనాదికాలూ సైతం ఈ జానపద గీతాల్లో వర్ణితమై ఉండడం గమనించవచ్చు. ఈ క్రింది కలుపు పాటలో మాయజంగానికి ఒక ఇల్లాలు వంటవండి పెట్టడం వర్ణితం—

''నడిమిదొంతిలోది నల్ల కేసరులు
గిసిగిసి గిద్దెదొడ్ల కేదిశ, ఆరియాకుల్లోన వడ్లారబోశ
ఆరియాకుల్లోన ఒడ్లారబోసి, గోరులతో వొలిశానో
18ఏళ్లతో సెరిగానసన్నంపు సూదులతో 19బీముపోశేశా
20కంచుకుండ్లూ కడిగి కలిఎసురుపోసి
అంటకుండ్లూకడిగీ అగ్గి రవిలేశా
అగ్గిరవులేసి గందపురిచెక్కలతో గజమంటలేశా
గజమంటచేసి ఏరిన్ని సన్నబీము ఎసురుపోశ
గిలకల్ల తెడ్డేసి గిర్రున్న తిప్పా
మేలంపు తెడ్డేసి మెదుకొత్తి చూశా
మేలంపు తెడ్డేసి మెదుకొత్తి చూసీ
జాలారి సిచ్చేసి జల్లన్న వంచా
జాలారి సిచ్చేసి జల్లన్న ఒంచీ
కూడు కూరాకు చేసి కుదిటప్పగించా

కూడు కూరాకూ కుదిటప్పగించీ
చామంతిపూలల్లే చెంబుల్లు తోమా
గన్నేరుపూలల్లే గిన్నెల్లుతోమా
బోంచేతువు రావయ్యా ఏలిదిజంగామా''

[18 వ్రేళ్లతో, 19 బియ్యం చెరిగి, 20 కుండలు] ఇందులో వంటవండే తీరు చక్కగా పామరకవి వర్ణించాడు. కొంత గ్రామీణ జీవితాన్ని వ్యక్తంచేస్తూనా కొంత కవిత్వం కూడా ఉంది. ఇదే ఇందులోని విశేషం.'

శకునం

మనం శకునాలకూ, మూఢ విశ్వాసాలకూ ప్రాధాన్యం ఇవ్వడం అనాదినుంచి వస్తూన్నదే. ఈ జానపదగీతాల్లోను శకునాలు, విశ్వాసాలు, నియమాలు డా ఉన్నాయి. ఒక తల్లి ఊరకు వెళ్లుతూన్న కుమారునితో శుభశకునం కాలేదంటూ ఈ క్రింది వలుపుపాటలో చెబుతూంది—

"ఊర్వాకి వెల్లుతానే ఊరిపిల్లడ్డమాయా
సగినాలుకావురాసక్కన్ని కొడుకో !
పొడిండే సేనిలో పాముడ్డమాయా
సగినాలుకావురా సక్కన్ని కొడుకో !
దున్నిండే దుక్కిల్లోన దుప్పడ్డమాయా
సగినాలు కావురా సక్కన్ని కొడుకో"

[21. శకునాలు: 22. పండిన] అనితల్లి చెప్పినా వినక వెళ్లిన పుత్రుడు అకాల మరణం పొందుతాడు. పల్లె ప్రజల



నమ్మకం ప్రకారం పైనిర్ణయించినట్లు శుభశకునాలు గావని ఈ గేయంలో స్పష్టం.

పూతన ప్రాణాల్ని బలిగొన్న బాలకృష్ణునికి గోపికలు దృష్టి తీయడం ఈ కింది కలుపు పాటలో చక్కగా వర్ణితం.

"అన్న వెగసెనని ఎదురు గూళు చేసి ఎత్తి పాగచెల్లిరి
పాపడెరిసెనని పసురుగూళ్లు చేసిపొట్టి పారిచెల్లిరి"

[23. చల్లిరి, 24. పట్టి] మనవాళ్ల విశ్వాసానికిది నిదర్శనం.

మొరటు శృంగారం

గ్రామీణ ప్రజల్లో చక్కటి నియమాలుకూడా ఉన్నాయి కపిలిపాటల్లో చాలావరకు మొరటు శృంగారానికే ప్రాధాన్య మెక్కువ. అయినా అది పల్లె ప్రజల స్వాభావికతకు సహజంగా ఉంటుందనడంలో సందేహంలేదు.

"సాలు సాలు నీతోపొందూ సాలురా సంసారి పొందూ
ఒద్దు ఒద్దు నీతో పొందూ ఒద్దురా మగనాలి పొందూ''
సంసారి పొందు, మగనాలి పొందూ కూడదనీ
"కూడినంక కూడవల్లా కుర్రపాయం చిన్నదాన్నీ
ఏలినంక ఏలవల్లా పెండ్లిగానీ చిన్నదాన్నీ ''—అనీ
"మనుగపువ్వు ముడువరాదూ ముండపొందు
చెయ్యరాదు చేతినిండా గాజులుంటే చెయ్యవల్ల
చెలియపొందూ"

—అనీ పల్లె ప్రజల నియమాలు సువిదిత మవుతాయి.

సంఘంలోకొన్ని అలవాట్లు, సంప్రదాయాలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. ఈనాడు కట్న పిశాచం పీడిస్తూ ఉండగా, ఒకనాడు కన్యాశుల్కం కాల్చివేస్తూండేది. కొన్ని జాతుల్లో ఈనాడు ఈ కన్యాశుల్కం ఉంది. దాన్నే ఓలి అంటారు, అలాంటి 'ఓలి' ప్రస్తావన ఉందీ కింది కలుపు పాటలో, పైగా పల్లెటూళ్లలో సామాన్య యువతీయువకుల ప్రణయం సైతం మనోజ్ఞంగా వర్ణించబడడం ఇందులోని విశేషం.

"అమ్మరో ఓయమ్మ మముగన్న తల్లీ
నీలి చీరాగట్టి నీళ్లకే నేబోగా
కామంచి వనములో కాముడెదురాయా
కాతకొంగులు పట్టి విడవజాలాయ
పచ్చున్ని చెట్టుకింది వస్త్రమే పొరిసీ
చెయ్యి తెరిసి చెయ్యినిండ వరహాలుపోశా
నోరు తెరిసి నోట్నిండ బోగాలెపోశా
ఒప్పితివా ఒప్పలేవా బాలాకన్యా
ఒప్పితేను నేనెరగ ఓలినేనెరుగా
మల్లపోయి మాయమ్మనంది అడిగొస్తానంటి
అరవై రూపాయలు ఓలై నాసాలు
అర్జునుడు మనఇంట అల్లుడై నాసాలు
ముప్పైరూపాయలు ఓలై నాసాలు
ముద్దురుడు మనయింట అల్లుడై నాసాలు"

[25. వరచి, 26. మళ్లీ.] అర్జునిడి లాంటివాడు అల్లుడైతే అరవై రూపాయలూ.'ముద్దురుడు' లాంటివాడుఅల్లుడైతే ముప్పైరూపాయలే ఓలి, చాలంటుంది తల్లి. ఓలితక్కువైనవరుడు మంచివాడు కావాలంటుందని అర్థం,

స్త్రీకి ఈ నాడు పురుషునితో సమానత్వం కలిగింది. పూర్వం స్త్రీకి ఆస్తిలో వాటా ఉండేదికాదు. చీరసారెలరూపంలో, పసుపు కుంకుమ పేరుతో అంతో ఇంతో తల్లి దండ్రులు ఇచ్చే వాళ్లు. ఒక చెల్లి అన్నతో ఆస్తిలో భాగమిమ్మంటే, కుదరదంటే ఒడిబాలు, అంటే సారెఅయినా ఇమ్మనికోరుతుంది ఈ కింద విస్రాత పదంలో—

"ముగ్గురన్నలతోడ నేబుట్టినాను
ముగ్గురకుమూడు పాళ్లు నాకుసరిపాలు
సరిపాలు నీకైనా ఎట్లొచ్చునమ్మా
సరిపాలు ఈకున్న అరపాలు ఈయన్నా
అరపాలు నీకైనా ఎట్లొచ్చునమ్మా
అరపాలు ఈకున్న బడిబాలు' ఈయన్నా
బడిబాలు నీకైతే ఈవచ్చు నమ్మా
అముడొన్నిల చీరా, అద్దాలరైకో
ఆరితీగా అత్తిండ్లుపోయి రావమ్మా''

(27. వన్నెల సీర) 'సారె' అని కొన్ని ప్రాంతాల్లోను, 'బడి బాలు' అంటు మరికొన్ని చోట్లా ఈ నాడూ ఈ సంప్రదాయం ఉన్న సంగతి మనకు తెలుసు.

సుంకం చెల్లించడంతో పాటు లంచ మివ్వడంగూడానుంది జానపదగీతాల్లో ఇది విస్రాతి పదం.

"రేపల్లెరెడ్డి కొడుకు సుంక మడిగెనో
సుంకమూ నేనీను సురటి గొల్లాలు,

లంచమూ నేనీను రాజు బిడ్డాను" అని అంటుందో స్త్రీ వేశ్యకిచ్చేది గూడా లంచంగానే చెప్ప బడిందీ కింది గీతంలో, పైగా ఆనాటి సంఘ వ్యవస్థ వర్ణించ బడడం గమనించదగ్గది.

"లంజకీ లంచాము ఏమిస్తివన్నా
28. సింస్తి నారిస్తి సిరిగందమిస్తీ
ఆలికిన్ని ఇల్లిస్తి ఆకుతోటిస్తీ
పూసిన్ని ఇల్లిస్తి, పూలతోటిస్తీ

అదిపొయ్యే దాపులో చెరుకు నాటిస్తి
చెరుకుతిని చెయ్యికడగ చెలిమి తొగిస్తి"

(28. చీర ఇస్తిని, 29. తోవలో, 30. తవ్విస్తి).


వేశ్యావ్యామోహం అలాంటిది. సంఘ సంస్కర్తల చేత వేశ్యా వృత్తి నిర్మూలనం చేయబడడం వల్ల ఈ నాడు ఈ బెడద పోయింది సంఘంలోని కుళ్లు తొలగిపోయింది.

ఆడ మగ భేదం లేకుండా రకరకాల ఆభరణాలు ధరించేవారు పూర్వం. అలాంటివి కొన్ని చక్కగా జానపద గీతాల్లో వర్ణితం—

"చేతికి చేరండి కడియాలు చెవులకి 31 నాగపాడిగలు
పట్నల్ పగడంపు మేడన పసుకుచ్చొలొంకిలో
సింగారించిన చిన్న బాలుడు ఘల్లు ఘల్లున తొక్కగా"

(31. నాగపడిగ). ఇలాగే ఆభరణాలతో వస్త్రాలు ఈగీతంలో స్పష్టం.

"ఏరే మీయన్నలూ తుమ్మిదా ఎటువంటి వారే తుమ్మిదా
మునుగు పూ వస్త్రాలు తుమ్మిదా ముద్దుటుంగరాలూ తుమ్మిదా
అగిసి పూ వస్త్రాలు తుమ్మిదా అంటు పోగులు తుమ్మిదా"



కపిలి పాటలు శ్రామిక గీతాలే అయినా, అందులో శృంగారం అధిక ప్రాధాన్యం వహిస్తుంది. మరి శృంగారం సర్వజనాన్ని సంతసింప జేయగలదన్న సంగతి మనకు విదితమే. కాకుస్వరాలకూ, చమత్కారానికీ, వ్యంగ్యానికీ, సరసాలకూ ఇందు కొదవ వుండదు కపిలి పాటల్లో ఇలాంటివి మనమెన్నో చూడగలం.

గ్రామీణుల్లో సమైక్యం మనం చూడగలం. వాస్తవానికి సమైక్యం దేశపురోభివృద్ధికీ, పటిష్ఠతకూ అతిప్రధానమైంది. పూర్వం కుల మత జాతి వర్గ విభేదం లేకుండా, అక్క, చెల్లి, అత్త, పిన్ని, తమ్ముడు, అన్న, బావ, మామ వరుసలతో స్త్రీ పురుషులు పిలుచుకొనేవాళ్ళు. ఒకే కుటుంబంలోని సభ్యుల్లాగా మసలుకొనేవాళ్లు. అలనాటి జన జీవన విధానం మనం ఈ కింది చంద్రమ్మ పాటలో చక్కగా చూడవచ్చు. పల్లెలోని ముత్తయిదులు, కన్యలూ కలసి రచ్చబండదగ్గర రకరకాలుగా ముగ్గులుపోసి, చంద్రమ్మను పూజిస్తారు; కలశాలు వెలిగిస్తారు.

35"ఈవి ఈదీ ఈదీ 36నుంటీ కాపువారి నగరినుంటీ
జోడుకలశా లెల్లెనమ్మా చందరమ్మకీ
ఈది ఈదీ ఈదీ నుంటీ ఈరిగో నగరినుంటీ
37గెటుమున్డవా చెల్లెరమ్మా చందరమ్మకీ
38సొందు సొందు సొందూనుంటీ చాకులోల్లు సొందునుంటీ
చలువచీరా లెల్లెరమ్మా చందరమ్మాకీ
ఈది ఈదీ ఈదీ నుంటీ మంగలోల్లు నగరినుంటీ
సన్నమేళా లెల్లెరమ్మా చందరమ్మాకీ
ఈది ఈదీ ఈదీనుంటీ మాదిగవారి నగరినుంటీ
జోడు తప్పెట్లు ఎల్లెరమ్మా చందరమ్మాకీ"

[35 వీధి, 36 నుండి, 37 ఘటము, 38 సందు]

ఇందులో గ్రామీణ జీవన విధానంలో ఎతో ఐకమత్యమూ, కలిసి మెలిసి జీవించే పద్ధతి సుస్పష్టం కావడం గమనించదగ్గది. ఇది ఒకనాటి గ్రామీణ జీవితం క్రమంగా ద్వేషాలు, రోషాలు, మోసాలు, దగాలు పెచ్చుపెరిగిపోయి గ్రామీణ వాతావరణం మారిపోయింది. అయినా మళ్లీ గ్రామ వ్యవస్థను పునర్నిర్మాణం గావించడంలో మన ప్రభుత్వం శ్రద్ధ వహిస్తూంది. ఇందుకై మనం సైతం ప్రయత్నించాలి. ఆనాడే మన సంఘం సముచితమైన స్థానాన్ని పొందగలదు.

ఇలాగే జాతి జీవనాన్ని ప్రతిబింబిస్తూన్న మన జానపద గీతాల్ని సేకరించి, వాటికి స్థిరమైనస్థానం కల్పించడం మనందరి బాధ్యత. ఇలాంటి గీతాల్ని సేకరించి మన జాతి గౌరవాన్ని కాపాడుకోవడం ఎంతైనా అవసరం. సాహిత్య పక్షపాతు లందరూ ఇందుకై ప్రయత్నిస్తారని ఆశించవచ్చు.

పెజారాజ్యం

తోలు బొమ్మలాట

శ్రీ మోనా

తెరపైకి బంగారక్క ప్రవేశం

(తెర వెనుక పాట)

బంగారక్కా వచ్చేనమ్మా భామాలారా ॥బంగా॥
ఓహో॥ ఊహూ॥ ఆహా॥ ॥బంగా॥

రంగులా రయికా తొడిగీ
పొంగు వయసూ నీటుగత్తె ॥బంగా॥

ఓరసూపులు వలలు యిసురుతూ
దోర నవ్వుల ఎరలు సూపుతూ ॥బంగా॥

పక్కిటా పొగాకు నవులుతూ
పొక్కిలికిందకి సీరాకట్టి ॥బంగా॥

బంగారక్క (వచనం)

(దిక్కులు చూస్తూ) అల్లుడా! పల్లికొండ్రాయడా! గజ్జల్లో పండా! గసినిమ్మ సెండా! రారా నాయల్లుడా! రంగైనా సోగ్గాడా!

బుడ్డకేతిగాడు ప్రవేశం పాట తెరవెనుక

• కేతిగాడు ఏతెంచేనే జనులారా
మూతిమీసం మెలేయుసూ ॥కేతిగాడు॥

కిఱ్ఱు చెప్పులు కిటకిటలాడ!
బిఱ్ఱు కండలు పిటపిటలాడ ॥కేతిగాడు॥

సెంగిడిసి పంచాగట్టి
ఉంగరాల ఏళ్లాబెట్టి ॥కేతిగాడు॥

తొంగి తొంగి సూసుకొంటూ
బంగారక్కా మేనల్లుడూ ॥కేతిగాడు॥

కేతిగాడు ప్రవేశించి పాట

అత్తా! అందాల నాయత్తా!
ఎందుకే పిలిసావు అత్తా!
ఆ యివరాలు సెప్పవే విప్పి! ॥అత్తా॥

మావాకు నీకూ
మాటా పట్టింపొచ్చిందా
మాటా పట్టింపొచితే
మనసైనా అల్లుణ్ణి నేనుండాగదే

బంగారక్క పాట

అల్లుడా! మేనల్లుడా!
అందాల బుల్లల్లుడా!
మెలికమీసాల మేనల్లుడా ॥అల్లుడా॥

బేంబడికి పప్పాస
అత్తకూ అల్లుడాశ
కొత్తే మికాదుగదరా ॥అల్లుడా॥

వచనం

ఆయీది, యీ యీది తిరిగొచ్చిన అల్లుడా నా అంటు మామిడిపండా! మీ మావేడిరా!

కేతిగాడు వచనం

అత్తో! మొగత్తూరు దుత్తో! నీ యబ్బడాల అత్తో! మన పూళ్లో జనాలంతా యియ్యాళ మాపిటికి కొత్త రకం బొమ్మలాటంట 'పెజారాజ్జ' మంట, దాన్ని సూడాలని వడీదిలో సావిటి కాడికెళ్లేరే! సీయమ్మాసానే! నీకేం తెల్నే తెలోదంటే..రాజ్జంలో రకరకాల మారుపులు మనలాంటోళ్ల బాగుండే దానికి జరిగిస్తూంటే— సర్కారోళ్ల నీకేం తెలవదంటావేందహే....



పాట

నంగనాసి టుంగుబుజ్జివే టింగురంగా
బుంగమూతి బుల్లి పెట్టవే టింగురంగా
ఓలిఓలి ఓలత్తో :...ఓ యత్తో !

బంగారక్క (వచనం)

ఓరినీ జిమ్మడా, అందుకేనంట్రా పక్కింటి సీతాళి, పొరుగింటి పుల్లక్క, యిరుగింటి ఎంగటమ్మ, ఎదురింటి ఎంకి, ముందింటి ముద్దవ్వ, తోటకాడి కావిలికాడి బాసేలి, చేలుకాడి చెంచన్న, మడవకాడి మస్తాను, కర్ణంగారి పెద్దాయన, మునసబుగారి సిన్నాయన, నాయుడోళ్ల నడిపాయన, పెద్దకాపు, చినకాపు అందరూ పెకపెకపెక పోతావున్నారే సందకాడ....అయినా మనం లేకుండా బొమ్మలాటెట్టా జరగద్దిరే ?

జుట్టుపోలుగాడు ప్రవేశం (తెరలోపాట)

వచ్చేనయ్యా పోలుగాడు
వగలమారి సచ్చినోడు
గుబులుమారి గుమ్మడోడు,
సీటుకాడు బలే ఏటుకాడు
అంగలంగా లేసుకొంటూ
అందంగా నడుసూకొంటూ
మీదమీద సూసూకొంటూ
మీసాలూ మెలేసుకొంటూ
కిర్రు సెప్పులేసుకొని
కర్ర చేతబట్టుకొని
జుట్టూ పోలుగాడంట
బంగారక్కా మొగుడంటా
బొంబాడాయి ముక్కుల్లోడూ
బొమ్మలాటా లేసేఓడూ
సిర్రుబుర్రు లాడేఓడూ
జెట్టిపోతూ లాంటిఓడూ
ఓయబ్బో ! వాడి సోకుమాడ
ఓయమ్మో ! వాడి సోకుమాడ

జుట్టుపోలుగాడు (వచనం)

ఓసి నీ సిగదరగా ! నే లేకుండా సూసే ఆ నాయాలు బుడ్డకేతిగాడితో నువ్వు సరసాలాడతుండావంటే, ఓస్ వసపిట్టా యికయికలు — పకపకలు.... సెకలు బడతుండావుగదే నీయమ్మా బడవా !

పాట

ఓసే ! బంగారక్కా
ఒయ్యారి రామసిలకా :ఓసే:
నీకేమి తక్కువ సేసానే
కేతిగాడి మూతిపైన మూతిబెట్టి
ఆ తీరున అల్లరి సేస్తూండావు :ఓసే:

బంగారక్క (వచనం)

[కేతిగాడు బంగారక్క సాటునక్కుతాడు] లేదు మాఁవా ! నీమీదొట్టే మాఁవా ! సత్తె పెమాణకంగా మాఁవా !

పాట

అల్లరి సిల్లరిదాన్ని కాదురో మొగుడో !
కల్లాకపటామెరుగనీ దాన్నిరో మొగుడో !
ఒయ్యారి మొగుడో
వల్లంగి పిట్టనురో నిన్నొ
దిలే పెట్టనురో, నీ
ఒళ్ళో వాలేనురో...

జుట్టుపోలుగాడు (వచనం)

నీయమ్మానోనే నిన్నేమిసేశానే ! ...హరిజనులకా సరకారోళ్లు కొత్తిల్లు కట్టేశారే...ఆ యింట్లో సేరిన పాట .. ఆ పెబుత్తం సేసే మారాజులు సల్లంగుండాలే ! కడుపులో సల్ల గదలకుండా ఎమ్మేల్లుండాలే...ఆ కొత్తిళ్ళల్లో మనం సేరిన పాట నీ కడుపు కాయగా సద్దిలేయే నా పయిడిగంటా ! నాపక్కపిల్లా !

బంగారక్క (వచనం)

నా కడుపున కాయగాసే దానికి ఆ పెబుత్తమోళ్లా సల్లంగుంట మెందుకురో ?, నా మొగుడో ; నా సీటుకాడో ; నా ఏటుకాడో !

జుట్టుపోలుగాడు (వచనం)

ఓస్ నీయాలి ముండమొయ్యా ! పేదసాద బాగుపడాలనే యిరవై సూతరాలు పెట్టేశారే, పెబుత్తమోళ్లు !......ఆ ఎవ్వారం నీకింకా తెల్దంటే ఏందేందో సూతరాలు యిరవ్వయ్యంట హరిజనుల కిళ్ళంటా...దున్నుకొనేవాడిదే బూమంటా..దొంగవేపారం సేసే దొంగనాయాళ్ళందరే వాళ్ళని అత్తోరింటికి పంపేసారంటా ...

బంగారక్క (వచనం)

ఏందిమాఁవా ఏందేందో సెప్పేస్తుండావే...నా బుర్రకెక్కలేదు మామో సెరామసిగా గుడ్డిగిత్త సేలో బడ్డట్టు సెప్పకుంటానే పోతుండావుగదే మాఁవో ! యీ యిరవయ్యి సూతరాల పథకాలు నాలాంటి ఆడకూతురే నంటగా పెయేశపెట్టింది. అది నీకు తెలుసంటే మాఁవా !

పాట

అమ్మా ! యిందిరమా !
పేదసాదా బాదాలెరిగినమ్మ
నహురూ నాయకుని
నాజేల కూతురు

మొలతాడూ గట్టిన
మొగరాయుళ్లు సెయలేనిపన్లు
సేసి సూపించిందంటా
మన పదాన్నమంతిరి
అమ్మా యిందిరమ్మా
బంగారు తల్లి ! యిందిరమ్మా !

జుట్టుపోలుగాడు (వచనం)

ఎబ్బెల్లా ! ఓసినీ యబ్బడాల బంగారక్కా ! నా బొడ్లో
పొవ్వాకు, సెక్కా !......ఓస్ నీయక్కా నేనా...
నేనా...నీ బుర్రకెక్కిండాయిగదే !

బంగారక్క (వచనం)

అవున్రా మొగుడో ! నా మాయదారి మొగుడో !
ఐసాపయిసా ఆ ఎవ్వారాలంతా మన బుడ్డకేతిగాడికి బాగా
తెల్సంట !

జుట్టుపోలుగాడు :

ఏదోడ ? ఎక్కడ నక్కిండాడు ?

బుడ్డకేతిగాడు (పాట)

మామో ! నా బంగారు మామో !
నా ముద్దుల మేనమామో !
అత్త బంగారక్కా
మొత్తాసాటున నేను
నక్కి ఉండానయ్యో మావో !
దక్కి ఉండానయ్యో మావో !
ఉక్కలోబడి ఉక్కిపోయితి
సిక్కులోబడి సిక్కిపోయితి
అత్తాటడి సాటున
మెత్తంగా దాంకొంటి
కంటాబడితే నీవు
ఒంటీతా టొలుస్తావని
అత్త సాటున నేను
మెత్తంగా అనుకొంటి మావో !......

వచనం

సెమించుమావో ! నేనేం సేలేదు మావో ! యిందాకట్నుంచి
మీరనుకొనే ఎవ్వారాలన్నీ నాకంతా తెల్సుమావో ! అద్దే
మావా ! యిరోజో గెమిడిగెమిడికాడా సాటింపేసిన
"పెజారాజ్జం" తోలు బొమ్మలాట...!

జుట్టుపోలుగాడు, బంగారక్క : (యిద్దరూకలసి ఒకేసారి పాట)

అల్లుడో ! మా యల్లుడో
మేనల్లుడో !
ఆయివరాలు సెప్పర అల్లుడో
అల్లుడో ! బుల్లల్లుడో
బుజ్జల్లుడో !
పొట్టల్లుడో !
గట్టల్లుడో
ఆ యివరాలు సెప్పర అల్లుడో !
కూటికి కుమిలే మనలాంటోళ్లను
నిలవనీడలేని నిట్టదరిద్దుర్లను
ఎట్టిసేకిరితో ఏడ్సే వాళ్లను
బూవికి బరువై బతికేవాళ్లను
కులాలవల్ల కూలబడినోళ్లను
అసలు సచ్చిన అద్దానవోళ్లను
పిల్లా జెల్లా అల్లాడే ఓళ్లను
పనులు దొరక్క వస్తులు మాడుతు
బిక్కుబిక్కుమని సూసేవోళ్లను
తాతల తండ్రుల తరాల నుంచి
మోసపోయిన మనలాంటోళ్లను
బాగుపరుసుటకు
బాగుసేయుటకు
పెబుత్తం సేసిన
యిరవయి బంగరు సూతరాలేమో
సెప్పర అల్లుడ ! సెప్పరా ! ఆ
మంచిసెబ్బరలు యిప్పర
మా ఒప్పులకుప్పా ! సెప్పరా
మహ ఒయ్యారపోడా : సెప్పరా !

బుడ్డకేతిగాడు (పాట)

అత్తమావళ్లూ !
అంటుమాయిళ్లూ !
ఇంటుతేనెల్లా !
ఇంట ఎన్నెల్లూ !
యివరంగా సెపతా యినుకోయె అత్తా
వయినంగా సెపతా యినుకోర మావా !
యిడమరిసి సెపతాను యిరయ్యి సూత్రాలు
సేసే మేలులు సిన్నారి అత్తో
నా సిలకంటి అత్తో
రాసిలకంటి అత్తో
వయినంగా సెపతా యిరవయ్యి సూత్రాలు
సేసేటి మేలులు పొన్నారి మావో
నా వయ్యారి మావో
పగటి సందమామో !

జుట్టుపోలుగాడు: :వచనం:

సెప్పరా అల్లుడా అంటే యీగలు గుట్టిన పసరంలా సిందుల్దా
కుతావెందుకురే అల్లుడో! తీరుగా సెప్పరా అల్లుడుబిడ్డా
నాగెనుసుగెడ్డా ! ఏమేటా సేలే బంగారక్కా ! నీయక్కా!
నాబీడిముక్కా !

బంగారక్క (వచనం)

ఓరి దొంగసచ్చినోడా! నాయక్కనెందుకురే అంటావో!
పీడిఓవ్మడా! ఓరే మాఁవో! నాయక్క నింకెప్పుడైనా
అన్నావంటే సెక్కతో నీబోర బగలగొడతారే! బుడ్డకేతిగాన్ని
నా ముద్దులల్లున్ని అడిగిన ఎవ్వారమేంటి...నీ కోణంగి
సేష్టాలేందిరా మాఁవో!

జుట్టుపోలుగాడు (వచనం)

(బంగారక్క జుట్టుపట్టుకోబోతూ)
నాయి కోణంగి పేష్టాలంటావంటే బంగారక్కా!నీ బొక్క
పగల్నూకపోతే నాపేరు జుట్టుపోలుగాడేగాదే......
ఎంత పొడుసుకొనొచ్చిందే నీకు రోసమా? నీయమ్మానోనే!
గజ్జెల కోడిపెట్టెగిరినట్టెగరుతుండావ్‌గదే!...

:పాట ఒక చరణం ఒకరు, యింకొకటి మరొకరు:

అతడు:

తొడలు పలసనదానా
తొండా నడకలదానా
కంతిరీగా నడుమూదానా
బంతిపూలా కొప్పుదానా
ఓయబ్బో! ఎంతకోపమొచ్చిందే!
కోపమొచ్చి ముగమంతా కందగడ్డ అయ్యిందే...

బంగారక్క:

లట్టూ కండల ఓడా
లావైన పొట్టగలోడా
కొట్రాచూస్తాను, నిన్నూ
నాకొకబిగి మొగుడా..
నా కోనంగి మొగుడా..

అతడు:

కొడితే ఏంజేస్తావే
తిడితే ఏంజేస్తావే

ఆమె:

తిడితే గూబతిరగుమాతబెడతా
కొడితే దొక్క దోలు కొట్టేస్తా

అతడు:

ఓయబ్బో సింగినాదమో!

ఆమె:

ఓలమ్మో జీలకర్రో!

అతడు:

ఎట్టెట్టా!
ఏమేమొకూస్తావ్
ఎర్రిఏగురులెగరతావు ఓలమ్మే...ఓలమ్మే...!

ఆమె:

ఏందేందా!
ఏందేందా సేస్తావు
పిచ్చి కూకలేస్తావు..ఓలయ్యో... ఓలయ్యో!

అతడు:

అయితే సూడే నాతడాఖా;

ఆమె:

అయితే సూడ్రా నా మజాకా!

(యిద్దరూ కలబడతారు. బుడ్డకేతిగాడు అడ్డమొచ్చేటప్పటికి వాడికే దెబ్బలు తగులుతాయి)

బుడ్డకేతిగాడు (వచనం)


ఆపండహే! ఆపండి! ఏందిరే యిది కోళ్లసేసినట్టు పోరు
సేసుకుంటారూ! (ఇద్దరూ ఆపుతారు)
దేశంలో యిట్టా ఏడబట్టినా కొట్లాటలు. ఆగాలు. భోగాలు
రచ్చరాయిళ్లు, గలాటాలు రేగతాయనగదో
మన పెదాని యిందిరమ్మ తల్లి ఎమరసెన్సు పెట్టేసింది!
నాయాల్టికి. అది పెట్టకుంటే యీయ్యాల్టికే పెజల్లో అరాచ
కాలు రేగే గగ్గోలుబుట్టే గబ్బెత్తిపొయ్యిందేమో పూళ్లన్నే...
ఉత్తపున్నేనికునోళ్లకూడా యిబ్బందలొచ్చేనుండేయే,
ఒర్ దొంగనాయాలు మాఁవో! ఓస్ పున్నతేలు అత్తో!
యివరాలడిగితిరీ బుద్దిగా యినుకోక కలబడి కొట్టుకుంటా
రేందహే...దేశంలో యిరవయి సూతరాల వల్ల సరిగే

మంసీ సెట్టా యినుకోండహే!

జుట్టుపోలుగాడు, బంగారక్కా యిద్దరూ (వచనం)
యియ్యన్నీ నీకెట్టా తెలిసేయ్రే! లేతలేత సొరకాయలు
తరిగేస్తుండావ్రే! ఆపబెద్దు తిన్నట్లు తినే పనీబాట లేకుండా
ఆయూరీయూరు తిరిగే తిమ్మిరెక్కి సెప్పుకొంటుండా వేమిరా!
మనం బాగుపడాలంటే ముందాడి సోమారితనం
పోవాలహే!

బుడ్డకేతిగాడు (వచనం)

కాదండహే! యీ మద్దనే ఆయిదరాబదలో మర ప్యాక్టిలో
పనిచేసే మా బావ బలరాముడికాడికెళ్లేసా. ఆడనుంచి
సెన్నపట్టం ఆసిపత్రిలో వుండే మా సిన్నత్త కాడికెళ్లి కొన్ని
తెల్సుకొన్నా—ఆ పాట సీకాకుళానుండే మా సిన్న



తమ్ముడో లంబాడి రావుడి కాడికెళ్ళే కొన్ని తెలసాయే !
అంతేగాదే హె ! మనోడో తెలంగాణలో అదరాబదరా ఎంబడేడ్నో
యిరవై ఏళ్ళ నుంచి ఎట్టిసేకిరి సేసుకుంటుండాడే వాడీరోజు
మనూరికొచ్చేసాడు...యింకెప్పటికీ సేకిరికి పోనేపోడంట !
పోనేబళ్ళేదంట ! యీ యిరవయి సూతరాల పదక మొచ్చె
ఆడికే పొట్టిగిల్లిడికి ఎట్టిసేకిరి తీసేసిందే !

పాట

యినుకోర మాఁవా !
యినుకోయె అత్తా !
యిరవయ్యి సూతరాలు
యిందనక సేసినమేలులూ ! సేసేమేలులూ !
ఓహో...! ఓహో...! ఓహొహా
ఆహోఁ...! ఆహోఁ...! ఆహోః...హో !

దున్నేవాడిదె యీ బూవి యని
బూసంస్కరణాలు పెయ్యేళపెట్టారు.
పేదకు సాదకు బంజరులు పంచారు
కులాల ఊబిల్లో కూరుకుపోయిన
మనసున్న ఓళ్ళను, మనలాంటి ఓళ్ళను
మనుసుల్లో కలిపి, మవతల్లు సూపి
యిళ్ళపట్టాలు, పొలాలపట్టాలు
యిచ్చాయయ్యో మాఁవయ్యోయ్ !
యిచ్చాయమ్మో అత్తమ్మోయ్ !
ఓహోహె ! ఓహొహా ! ఓహోహో !
ఆహాహా ! ఆహాహా ! ఆహాహా !

పనులు దొరక్క పస్తులు పడుతూ
సదువులు సదివి ఉద్దేగాల్లేని
గిరిజన హరిజన సన్నజనానికి
ఉద్దేగాలు సూపించాయి
యిరవయి సూతరాలంటే
యిరవయి బంగరు వాకిళ్ళోయ్
యిరవయి పండగల ఒకేరోజూ
కలసినెట్టుకొని వచ్చినట్టులోహో...!
బతుకంతా బానిసలాగా
మనిసంతా సీకటిరాగా
సేకరి ! సేకరి ! అస్తమానమూ అదే సేకిరిగ !
కుంగను దీసే, కూలగదోసే
ఎట్టిసేకిరిని ఎత్తేశాయి
ఎన్నెట బతుకులు వుతికేశాయి...
బూసంసరణాలను పూరితి జేసి
కాలే కడుపుకు అమృతం పోసాయి.
ఓహో...! ఓహోహో ! ఓహోహో !
అహాహా ! అహా ! అహాహా !

యినరా మాఁవా ! యినవే అత్తా !
యిరవయి సూతరాల యివరాలన్నీనూ
సెప్పులు కుట్టే, సేపలు పట్టే
బట్టలు నేసే, బుట్టలు అల్లే
పనివాళ్ళ బతుకుల
పండు ఎన్నెల్లు కురిపింసాయి.
బక్కసిక్కిన బడుగు వారలకు
ఎన్నోబాగులు ఎన్నెన్నోమేలులు
సేసేశాయి....! సేస్తున్నాయి...!
సన్నజనాలా యవసాయానికి
బేంకుల్లో అప్పులు దయసేసాయి....
మిడి మిడికాలి మింటికి లేసిన
సరకుల దరలను నేలకు సరిసాయి
యినుకోర మాఁవ ! యినకోయె అత్తా !
మేలులు బాగులు మిన్నగ సెపతాను !
బీదాబిక్కి కిలకిల నవ్వంగ
పిల్లా జెల్లా కలకల లాడంగ
చర్మకారులకు, సిలపకారులకు
నిరుద్దోగులకు నీతిమంతులకు

పనిపాట సూపించి
బతుకుల్ని సరిసేసి
ఎన్నెన్నో మేలులు సేసాయి...!
ఎన్నెన్నో బాగులు సూపాయి....!
హరిజన, గిరిజన నిరుపేదలకు
సల్లంగ బతికే సౌభాగ్గానికి
తీరులు సేశాయి—'పూలదారులు ఏసాయి—'
ఓహో—ఓహో—ఓహోహో
ఆహా—ఆహాహా—ఆహాఆహా ఆహాహా
యిరవయి సూతరాలంటె
తెలుగు తోటలో యిరవయి రంగుల పూలు
బరతబూవికి యిరవయి బంగారు ముంగిళ్లు
యినవయ్య మావా! యిపరాలూ, యినావయ్యా!
యినుకోరా జుట్టుపోలుగా
తెలుసుకోరా డోలుగా!

పొట్టిగిల్లడు ప్రవేశం
పాట (తెరవెనుక)

వచ్చినాడయ్యా పొట్టగిల్లడు!
మెచ్చినా మనసున్నోడు!
మెరమెచ్చులు తెలియని ఓడు! (వచ్చె)
తలకూ తుమాలా సుట్టీ
తమలపాకూలు సేతబట్టీ
దూరాబారాము నుండి
ఏళ్లు పూళ్లు గడిసినాక
ఎట్టిసేకిరి రద్దూకాగా
ఏతెంచేనయ్యా
పుట్టినూరికి పొట్టిగిల్లడు (వచ్చి)

పొట్టిగిల్లడు (వచనం)

ఒరెబరెబరె! అందరీన్నెవుండారే! పోలన్నా సేమ్మా!
బంగారక్కో బావుండా! కేతిగా కత్తిరి నాయాలా!
బావుండారే
(వూళ్లో జనమంతా అక్కడకు చేరుతారు)

(పాట)

(జనాన్నందరిని చూచి)
అన్నలారా! తమ్ముళ్లారా!
సన్నజాజి మొగ్గాలారా!
అక్కలారా! సెల్లెల్లారా!
సక్కనైనా సుక్కల్లారా!
అందరూ బాగుండారా?
(అందరూ బాగున్నామన్నట్టు తలలూపుతారు)

కేతిగాడు (వచనం)

ఓరోరిగిల్లా! ఎప్పుడొస్సేశావరే! ఓర్ పీయబ్బడాలా!
యివయేళ్లు ఐపోయిందిగదరే నిన్నుసూసి! సేవావేనా
దూరాబారంలో ఉండిపొయ్యింటివే—! ఎలా ఒస్సేశావహే!
మీ ఆసామి కాణ్ణుంచి పరిగెత్తొస్సెయ్యేలేదుగదరేఁ! దొంగే
సేలేసి దొడ్డిదోవన ఉడాయించి వస్సేసావేంరా!—
యిరవయి సూతరాల పదకమొస్సినట్లొస్సేశావ్‌గదరే—

పొట్టిగిల్లడు (వచనం)

ఓర్ నియబ్బా! నీ దొంగకోళ్ల తినే బుద్ధిపోనిస్సేవు
కాదురే!

(పాట)

ఓరామ రాగవ! ఓ రామ రాగవ!
కరుణించి కాపాడె సీరామ రాగవ! ఓ॥
సిన్ననాడే సిరతనాడే వూహనాకు తెలనినాడే
కొండదాటి కోనదాటి నల్లబబ్బుల వాగుదాటి
వాగులోన నీరులు దాటి వన్నెల మెకములదాటి
మూరుమూలా పల్లెసేరి పేరుమోసిన మోతుబరికాడ
కడుపు కూటికే సేరేనయ్యా ఓ॥
కండలన్నీ కరగాదీసి రెక్కలన్నీ ముక్కలు సేసి
కాయకష్టము సేసీసేసి పడిన అప్పున తీర్సగలేక
ఎట్టిసేకిరీ సేసేనయ్యో ఓ॥
ఏళ్లు గడిసే పూళ్లుగవిసే వడ్డీకి వడ్డీ తీర్పంగలేక
తీర్సలేక దోవలేక కళ్లలో నీరూ కమ్ముకురాగా
మనసంతా సీకట్లు కమ్మా ఆసామి కోసం వయసు కర్సేసి
బతుకంతా బానిసలాగ ఎట్టిసేకిరీ సేసేనయ్యో ఓ॥

(వచనం)

సరకారోళ్లు సేసిన యిరవై సూతరాలంట అమ్మతల్లి
వెదాని యిందిరమ్మతల్లి! బెజవాడ కనకదుర్గ దయతో
సల్లంగుండాలి యిందిరమ్మ తల్లి! ఏడుకొండలోడి
దయతో ఎయ్యేళ్లు పెబుత్తం సెయ్యాలతల్లి! ఆ సూతరాల
వల్లె మరే బతికి బయటపడి ఎట్టిసేకిరి తప్పిపోయింది.

(పాట)

ఓసామి మల్లేశ! నాసామిమల్లేశ!
సీసెయిల మల్లేశ!
కరునించి నావయ్య దయగల్ల సామీ మల్లేశా ॥ఓ॥
ఎట్టిసేకరీ తప్పిపోయే
పుట్టినూరికి సేరుకొంటి
కూలీనాలీ సోసుకోని
నాలుగు డబ్బులు సూసుకొని
మరదలు పిల్లా!
మనసిచ్చినమ్మో!
మంగళసూతరం ఎంకిమెళ్లో
కట్టేసుకొంటా సల్లంగవుంటా ॥ఓ॥

యిల్లువాకిలి కట్టూకొంటా
పిల్లాజెల్లను కనూకొంటా
కల్లాకపటము లేక
సల్లంగా బతుక్కొంటా ॥ఓ॥

జుట్టుపోలిగాడు (వచనం)

యీ యిరవయి సూతరాల పదకాలు మేలు మా బుడ్డ కేతిగాడు సెప్పినట్టు సాలా జరిగాయన్నమాట!

పొట్టిగిల్లడు (వచసం)

అవునుగదహే మరే! హరిజన గిరిజనులకే సన్న కారు జనాలకే, కాదహే బీదాబిక్కాకీ. పేదాసాదకి ఎన్నో మేళ్లు సరుగుతుండాయి. మరె!

బంగారక్క (వచసం)

మనకేతిగాడు సెపితే నమ్మకపోయెగదె మాఁవో! వాడో సాలాసాలా దేశం తిరిగేశాడె. వాడు సూసొచ్చింది చెపితే నమ్మాలి మాఁవా!

బుడ్డకేతిగాడు (వచనం)

యత్తో! ఓయత్తో! వాడు దొంగనాయాలే! వాడికే సొంత బుద్దిలేదో! సొయంగా తెలవదు! యింకొకళ్లు సెపితే యినుకోడు! యీ యిరవయి సూతరాలవల్లా యింకా ఎన్నెన్నో మంసి పనులు జరగతాయంటే! మన బోటోళ్లు బతుకులు బాగుపడి సంబరంగుంటాయంట హే!

(జుట్టుపోలిగాడు, బంగారక్క, బుడ్డకేతిగాడు, పొట్టిగిల్లడు యింకా అక్కడికొచ్చిన జనాలంతా చేతులు చేతులు కలుపుకొని ఆడుతూ పాడతారు)

సంబారమే! సంబారమే!
బీదకూ బిక్కాకీ సంబరమే

ఓరి! ఓరి! ఓరయ్యో!
ఓల. ఓల. ఓలమ్మో ॥సంబా॥
నిజం మనం తెలుసుకొని
బుణం బుణం కలుపుకొని
ఒక్కడికొరకూ అందరు నిల్సి
అందరిమేలూ ప్రతి ఒక్కడు తెల్సి
పాటు పడదామో ॥సంబా॥

ఏళ్లకొచ్చిన పండగ ఎన్నో
జనముల కొచ్చిన పండగా
పూళ్లకొచ్చిన పండగా, అన్ని
వూళ్లకొచ్చిన పండగా
అందరి కొరకూ పండగా

యిరవయి సూతరాల పండగా ॥సంబా॥
మనకోసమే వస్సిందంటా
మంచెంతో తెచ్చిందంటా
నువ్వూ నేనూ, వాడూ ఆమె

మనమూ, మేము, మీరూ వారూ
పిల్లా జెల్లా కలిసీ మెలిసీ
బిడ్డా మేకా ఒకటిగ సేరి
పాడుకొందామే!
ఆడుకొందామే! ॥సంబా॥



కృష్ణా పుష్కరాలు (ఫోటో: శ్రీ కె. రవి, విజయవాడ)

ప్రజానీకంలో ఒక పెద్ద వర్గాన్ని అంటరానిదిగా ఎంచి, వీరికి ప్రాథమిక మానవహక్కులు లేకుండా చేసిన క్రూర సంప్రదాయం మన సమాజానికి ఘోరకళంకంగా రూపొందింది. గాంధీజీ జీవించినంతకాలమూ ఈ అన్యాయాన్ని ప్రతిఘటించారు. హరిజనులు అనబడేవారిని అస్పృశ్యులుగా పరిగణించే ఆచారాన్ని మన రాజ్యాంగం నిషేధించింది. అంటే ప్రజాప్రభుత్వం సంఘానికీ తనకూ వున్న సంబంధాన్ని గుర్తించిందన్నమాట.



ఆంధ్రప్రదేశ్‌లో హరిజనాభ్యుదయం

* శ్రీ రాళ్ళల సూర్యనారాయణ మూర్తి

భారతదేశంలో జన్మించినందుకు మనమంతా గర్విస్తుంటాం. ఎందుకు ? మనం ఈ దేశంలో పుట్టి మంచిసంపన్నమైన సంస్కృతికీ, అత్యుత్తమ విలువలకీ, చక్కని సంప్రదాయాలకీ వారసులమయ్యాం. దీనికితోడు పూర్తిగా స్వేచ్ఛను అనుభవిస్తూ గౌరవ మర్యాదలతో జీవించడానికిఅనువైన వాతావరణంలో ఉద్భవించినందుకూ మనం గర్వించాలి.

అతి హీనస్థితిలో నుంచి హరిజనులను ఉద్ధరించడం మన స్వరాజ్యోద్యమంలో ముఖ్యమైన పవిత్రమైన కర్తవ్యంగా భావించబడింది. తరువాత మన ప్రభుత్వం వీరిని వెనుకకు నెట్టుతున్న అవరోధాలన్నిటినీ రద్దుచేసింది. సంఘంలో మిగతా ప్రజలకున్న స్థానం ప్రభుత్వ శాసనాల మూలంగా వీరికి లభించింది. వీరి జీవితంలో అన్నివైపులా సక్రమంగా అభ్యుదయాన్ని సాధించడమే మన ప్రభుత్వ విధానం.

కేవలం దురాచారాలను నిర్మూలించడమే కాకుండా హరిజనులకు ఇల్లు వాకిలీ, చదువూ సంధ్యా, పొలం పుట్రా వంటి వాటివిషయంలో కూడా ప్రభుత్వం సహాయపడుతున్నది. హరిజన సంక్షేమానికి ఇటీవల పెద్ద ఎత్తున ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. మన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఇరవై అంశాల ఆర్థిక కార్యక్రమం ప్రకటించిన తరువాత వీరికి ఇళ్ళ స్థలాలకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేయడం, భూములను పంచడం, ఆర్థిక సహాయం అందజేయడం మొదలైన కార్యక్రమాలు ముమ్మరంగా అమలు జరపబడుతున్నాయి.

మన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు పరిశ్రమలకు ఎంత ప్రాముఖ్యం యిస్తున్నారో బలహీనవర్గాల వారి సంక్షేమానికి కూడా అంత ప్రాధాన్యం యిస్తున్నారు బలహీనవర్గాల సంక్షేమానికి యింకా అనేక కార్యక్రమాలను రూపొందించి. వారి జీవనప్రమాణాలను పెంపొందించడం నా ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నాను." అని ముఖ్యమంత్రి గారు ప్రకటించారు. మారుతున్న సాంఘిక విలువలను మెరుగు

పరచడానికి తీసుకోవలసిన చర్యలు వీరి ఆర్థిక స్తోమతను అభివృద్ధిచేయడానికి అవసరమైన వనరులను కల్పించడం వంటి అంశాలపై చర్చించే నిమిత్తం ఇటీవల ఆంధ్రప్రదేశ్ హరిజన మహాసభలు హైదరాబాదులో భారీ ఎత్తున నిర్వహించబడ్డాయి.


హరిజనుల సాంఘిక ఆర్థికాభివృద్ధికి పథకాలను రూపొందించి, అమలు జరిపే బాధ్యత రాష్ట్రంలో హరిజన సంక్షేమ శాఖవారిది. ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పటి నుంచి 1974–75 సంవత్సరాంతం వరకూ సాంఘిక సంక్షేమ పథకాలపై 78.76 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగింది. అందులో నాలుగింట మూడువంతులు హరిజనాభ్యుదయ కార్యకలాపాలకు వ్యయం చేయబడింది. వివిధపథకాలను అమలు జరపడానికి హరిజన సంక్షేమ శాఖకు 1975-76 లో 13.35 కోట్ల రూపాయలు, 1976-77లో 14.26 కోట్ల రూపాయలు కేటాయించారు. ఈ శాఖ చేపట్టిన సంక్షేమ పథకాలను గృహవసతి, ఆర్థికాభివృద్ధి, విద్యా సౌకర్యాలు, సాంఘిక భద్రత, ఇతర పథకాలు అని ఐదు రకాలుగా విభజింపవచ్చు.

గృహవసతి, ఆరోగ్యం

హరిజనులు, గిరిజనులు, ఇతర పేద వర్గాల ప్రజలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం కూడా సంక్షేమ కార్యక్రమాలలో ఒక ప్రధానాంశం. ప్రభుత్వం సేకరిస్తున్న ఇళ్ళస్థలాల్లో 25 శాతం వెనుకబడ్డ తరగతులకు కేటాయించారు. అంటరానితనాన్ని రూపుమాపడం, సాంఘికంగా కలిసిమెలిసి జీవించడం దీని మూలంగా వీలవుతుంది. ఇళ్లస్థలాల కేటాయింపు సత్వరంగా, సమర్థవంతంగా జరగడానికి వీలుగా అనేక ప్రభుత్వ నిబంధనలను సులభతరం చేశారు. అదనంగా సిబ్బందిని నియమించారు.

1974-75 సంవత్సరంలో 67,671 హరిజన కుటుంబాలకు ఇళ్ళ స్థలాలు మంజూరు చేశారు. వీటికోసం అయిన ఖర్చు 1.23 కోట్ల రూపాయలు. 1956-57 ఆర్థిక సంవత్సరం నుంచి 1974-75 సంవత్సరానికి 1,69,084 కుటుంబాలకు ఈ సదుపాయం లభించగా, ఒక్క 1975-76 సంవత్సరంలోనే 3.35 లక్షల కుటుంబాలు ఇళ్ల స్థలాలు పొందాయి. దీనిని బట్టి ఈ విషయంలో ప్రభుత్వం చేస్తున్న ప్రత్యేక కృషి అర్థమవుతుంది. 1976-77 సంవత్సరం బడ్జెటులో 3.20 కోట్ల రూపాయలు ఈ పథకం క్రింద మంజూరు చేశారు. ఈ సంవత్సరాంతానికి గృహ వసతిలేని కుటుంబాలలో మూడింట రెండు వంతుల మందికి సౌకర్యం సమకూర్చాలని సంకల్పం.

రాష్ట్రప్రభుత్వ పథకాలతోపాటు గ్రామీణ ప్రాంతాలలో కులాలతో సంబంధం లేకుండా కూలీలకు ఇళ్లస్థలాలు కేటాయించే కేంద్ర ప్రభుత్వ పథకం ఒకటి హైదరాబాదు, ఆదిలాబాదు జిల్లాలలో 1973-74 అమలు జరపబడుతున్నది. హైదరాబాదు జిల్లాలో 22,557 కుటుంబాలు, ఆదిలాబాదు జిల్లాలో 9,075 భూమిలేని కుటుంబాలు ఈ పథకం క్రింద ప్రయోజనం పొందాయి.



జీవిత భీమా సంస్థ నుంచి పొందిన 10 కోట్ల రూపాయల ఋణ సదుపాయంతో గ్రామసీమలలోని హరిజనులు, గిరిజనులు, వెనుకబడ్డ వర్గాల ప్రజలకు 55,546 గృహాలు నిర్మించే ఒక పథకాన్ని 1971-72 సంవత్సరంలో ప్రభుత్వం చేపట్టింది. 50,232 ఇళ్ల నిర్మాణం ఇంతవరకూ పూర్తయింది. మిగిలిన గృహాలు తయారవుతున్నాయి. ఇక పట్టణ ప్రాంతాలలోని హరిజనులకు 220 చ. అడుగుల స్థలంలో ఒక్కొక్కటి ఐదు వేల రూపాయల ఖరీదుతో ఇళ్లను కట్టియిచ్చే పథకం ప్రభుత్వ పరిశీలనలో వున్నది. అప్పు వాయిదాలను తీర్చగలిగే స్థితిలో వుండే విధంగా 300 రూపాయలకు పైన నెలసరి ఆదాయం కలవారికి వాటిని కేటాయిస్తారు.

అపరిశుభ్ర వృత్తులలో వున్న హరిజనుల కోసం ఒక గృహ నిర్మాణ పథకం కేంద్రప్రభుత్వంచే 1973-74 నుంచి అమలు జరుపబడుతున్నది. 36 లక్షల రూపాయల ఖర్చుతో ప్రతి పంచాయతీ సమితిలోను ఒక గ్రామం వంతున 324 గ్రామాలలో ఈ పథకం క్రింద 1,800 గృహాలు నిర్మిస్తారు. ఇప్పటి వరకూ 33.50 లక్షల రూపాయల వ్యయంతో 1643 ఇళ్ళు నిర్మించారు. మిగిలిన 157 గృహాలు కూడా తయారవుతున్నాయి.

ఆర్థికాభివృద్ధి పథకాలు

బలహీన వర్గాలు సమాజంతోపాటు నిజంగా ముందంజ వేస్తున్నవా అని అంచనావేసేటప్పుడు ఆర్థికాభివృద్ధిని ముఖ్యంగా లెక్కలోకి తీసుకోవలసి వుంటుంది. సాంఘిక బలహీనతలు ఆర్థికంగా వెనుకబడిన తనానికి దారితీస్తాయి. అందువల్ల హరిజనుల సంక్షేమానికి ప్రణాళికలను తయారుచేసే తరహాలో ఈ మధ్య విప్లవాత్మకమైన పరిణామాలు ఏర్పడ్డాయి. విద్య,

ఆరోగ్యం, గృహవసతి వంటి సదుపాయాలను కలగజేయడం మాత్రమే కాకుండా, హరిజనుల ఆదాయం అభివృద్ధి చెందడం ద్వారా వారి జీవన ప్రమాణాలు వెంటనే మెరుగయ్యే విధంగా ఆర్థిక సహాయ కార్యక్రమం అమలు జరపడం నేటి విధానం.

రాష్ట్రంలో 5 కోట్ల రూపాయల వాటా ధనంతో నిమ్న జాతుల ఆర్థిక సహాయ సంస్థ ఏర్పాటు హరిజనాభ్యుదయ సాధనలో నవశకోదయానికి నాంది పలికింది. హరిజనులకు తమ ఆర్థిక పరిస్థితులను అభివృద్ధి పరుచుకోవడానికి వివిధ పథకాలను చేపట్టే నిమిత్తం ఆర్థిక సహాయం అందజేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం. స్థిరాస్తిని హామీగా యివ్వలేని స్థితిలో హరిజనులు బ్యాంకు ఋణ సదుపాయం పొందలేకపోతున్నారు. అలాంటి సందర్భాలలో అర్హులైన వారికి ఈ ఆర్థిక సహాయ సంస్థ హామీ యిస్తున్నది. ఈ విధంగా బ్యాంకుల తోడ్పాటుతో 5.85 కోట్ల రూపాయలు వ్యయంతో పలుపథకాలను అమలు జరపడం ద్వారా నిమ్నజాతుల ఆర్థిక సహాయ సంస్థ 38,912 కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చింది.

ఈ సంస్థ వ్యవసాయం, పశుపోషణ, లఘు పరిశ్రమలు, వర్తక వాణిజ్యాల వంటి రంగాలకు చెందిన అనేక పథకాలను అమలు జరుపుతున్నది. హరిజన కుటుంబాల అవసరాలు, ప్రభుత్వ కార్యక్రమాల ద్వారా వారు పొందిన ప్రయోజనాలు అంచనావేసే ఉద్దేశంతో వారి ఆర్థిక, సాంఘిక విద్యా ప్రతిపత్తికి సంబంధించిన ఒక పరిశీలన జరపదలచారు.

ఆరు సూత్రాల పథకం క్రింద సామూహిక సాగునీటి బావులు, చర్మకారులకు ఋణాలు, ఆయిలు ఇంజన్లూ, విద్యుత్ మోటార్ల సరఫరా, పాడి పశువుల సరఫరా, గొర్రెల పెంపకం, భూములు దున్నడానికి ట్రాక్టర్ల కొనుగోలు, కోళ్ళ సరఫరా, నూతుల త్రవ్వకం, భూమి అభివృద్ధి పథకాల అమలు నిమిత్తం 1976-77 సంవత్సరం బడ్జెటులో 70.76 లక్షల రూపాయలు కేటాయించబడింది. అంతకుముందు సంవత్సరం ఆర్థికాభివృద్ధి పథకాలకోసం మూడు ప్రాంతీయ ప్రణాళిక, అభివృద్ధి సంఘాలు 62.18 లక్షల రూపాయలు విడుదల చేశాయి. జిల్లాలలో ఈ పథకాలన్నిటినీ కలెక్టర్లు అమలు పరుస్తున్నారు.

విద్యా సౌకర్యాలు

సరైన తరహా చైతన్యాన్ని పెంపొందించడంలోనూ, ఆర్థికాభివృద్ధిని సత్వరం చేయడంలోనూ విద్య వహించే పాత్రను ప్రత్యేకంగా వివరించవలసిన పనిలేదు. ఉపకార వేతనాలు, విద్యా సంస్థలలో రిజర్వేషనులు, హాస్టలు సదుపాయాలు, జాతీయం చేయబడ్డ పాఠ్య గ్రంథాల ఉచిత సరఫరా వంటి వివిధ రూపాలలో ప్రభుత్వం విద్యా సౌకర్యాలు సమకూర్చుతున్నది.

పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు చదువుమీద ఆసక్తి కలిగించడానికీ, వారికి ఆర్థికంగా తోడ్పడడానికీ ఉపకార వేతనాలు యిచ్చే పథకాలు అమలుపరుస్తున్నారు. అర్హులైన హరిజనుల విద్యార్థులకు ఆరవ తరగతి నుంచి పట్టభద్రానంతర దశ వరకూ హాస్టళ్లలో వుండే వారికి, ఇతరులకూ కూడా ఉపకారవేతనాలు యివ్వబడుతున్నాయి. పారిశ్రామిక శిక్షణాలయాలలో చదువుకుంటున్న వారు కూడా ఈ ప్రయోజనం పొందుతున్నారు. మెట్రిక్‌లోపున చదువుతున్నవారి కోసం 73.82 లక్షల రూపాయలు, ఐ. టి. ఐ. విద్యార్థుల ఉపకార వేతనాల నిమిత్తం 5 లక్షల రూపాయలు కేటాయించారు. 1974-75 సంవత్సరంలో 39-83 లక్షల రూపాయల వ్యయంతో మెట్రిక్‌లోపు వారికి ఉపకార వేతనాలు యివ్వగా 59,034 మంది లబ్ధిపొందారు.

మెట్రిక్‌కంటే ఎక్కువ తరగతి చదువుతున్న నిమ్నజాతి విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాల రేటును రెండేళ్ళక్రితం పెంచారు. ప్రస్తుతం వారికి కోర్సునుబట్టి నెలకు 40 నుంచి 140 రూపాయల వరకూ చెల్లిస్తున్నారు. ఈ కేంద్ర పథకంక్రింద 1974-75 సంవత్సరంలో 2.13 కోట్ల రూపాయలు ఖర్చు కాగా 30,973 మంది హరిజన విద్యార్థులు సదుపాయం పొందారు.

హరిజనాభ్యుదయ కార్యక్రమాల్లో విద్యార్థులకు ఉపకార వేతనాలతోపాటు హాస్టలు వసతి కల్పించడంకూడా ఒక ముఖ్యాంశం. స్కూలు విద్యార్థులకోసం గత సంవత్సరం 3.33 కోట్ల రూపాయల ఖర్చుతో 967 హాస్టళ్లు నిర్వహించగా 44,238 మందికి ప్రయోజనం కలిగింది. రాష్ట్రంలో ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణకు 1976-77 సంవత్సరం 3.46 కోట్ల రూపాయలు మంజూరు చేశారు.

1974-75 సంవత్సరంలో 46 కళాశాల బాలుర వసతి గృహాలను ప్రభుత్వం రద్దు చేసింది. అప్పట్లో 3,707 మంది కళాశాల విద్యార్థులు భోజన వసతి సదుపాయాలు పొందేవారు. తరువాత భోజన ఖర్చులక్రింద విద్యార్థికి నెలకు 30 రూపాయల వంతున చెల్లించారు. మెడికల్, ఇంజనీరింగు, ఇతర వృత్తి విద్యల నభ్యసించే విద్యార్థులు తమ కళాశాలల హాస్టళ్లలో ఉంటున్నప్పుడు పూర్తి హాస్టలు ఖర్చులతోపాటు నెలకు 25 రూపాయల [illegible] పై ఖర్చు పొందడానికి అర్హులు. ప్రభుత్వపు మరో విధానం ప్రకారం తామే నిర్వహించుకునే హాస్టళ్లలో వుంటున్న విద్యార్థులకు భోజన ఖర్చులుగా నెలకు 70 రూపాయలు, ఇతర ఖర్చుల నిమిత్తం సాలీనా 180 రూపాయలు చెల్లిస్తున్నారు. మొత్తంమీద కళాశాలల్లో చదువుకుంటున్న హరిజన విద్యార్థులలో 12,632 మంది హాస్టలుసదుపాయం అనుభవిస్తున్నారు. ప్రభుత్వ వసతి గృహాలలోని విద్యార్థులకు రెండేసి జతల దుస్తులు సరఫరా చేయడానికి యీ యేడు 16.50 లక్షల రూపాయలు కేటాయించారు.

హరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న హాస్టళ్లలో [illegible] భాగం—922 అద్దె భవనాలలోనే వున్నాయి. చక్కని [illegible]

యాలతో వీటి సొంత భవనాలు నిర్మించే ఉద్దేశంతో 1974-75లో 20.85 లక్షల రూపాయలు, ఆ తరువాత సంవత్సరం 80 లక్షల రూపాయలు, ఈ సంవత్సరం 32.35 లక్షల రూపాయలు మంజూరు చేశారు. 1 నుంచి 10 వ తరగతివరకూ చదువుకునే నిమ్నజాతి విద్యార్థులకు జాతీయం చేయబడ్డ పాఠ్య గ్రంథాలు సరఫరా చేస్తున్నారు. గత సంవత్సరం 2,71,554 మందికి దీని మూలంగా ప్రయోజనం కలిగింది.

వృత్తి కళాశాలల్లో చదువుకుంటున్న హరిజన విద్యార్థులు ఖరీదైన పుస్తకాలు కొనుక్కోలేరన్న అభిప్రాయంతో వారి సదుపాయంకోసం గత సంవత్సరం హైదరాబాదు, విశాఖపట్టణం, కర్నూలులలో బుక్ బ్యాంకులు నెలకొల్పడానికి 1.50 లక్షల రూపాయలు కేటాయించారు. ఈ సంవత్సరం వరంగల్లు, తిరుపతి, అనంతపురం పట్టణాలలో వాటిని ఏర్పాటు చేస్తారు. ఐ.ఏ.ఎస్., ఇతర అనుబంధ సేవల పరీక్షకు ముందు హరిజన అభ్యర్థులకు శిక్షణ యిప్పించే ఒక కార్యక్రమం అమలు జరుపుతున్నారు. ఉచితంగా సదుపాయాలన్నీ సమకూర్చి ప్రస్తుతం 25 మందికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆవరణలో శిక్షణ యిప్పిస్తున్నారు.

సంఘ సంక్షేమ కార్యకలాపాలు సాగిస్తున్న స్వచ్ఛంద సంస్థలు అనేకం ఆంధ్రప్రదేశ్‌లో వున్నాయి. నిధులు, సుశిక్షితులైన కార్యకర్తల కొరత మూలంగా సరిగా పని చేయలేక పోతున్న స్వచ్ఛంద సంస్థలకు తోడ్పడే నిమిత్తం "ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ నిధి" నెలకొల్పారు. ప్రభుత్వం దీనికి 20 లక్షల రూపాయలు విరాళమిచ్చి, మరో 20 లక్షలు వసూలు చేస్తున్నది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన గల ఒక రాష్ట్రస్థాయి సంఘం దీని వ్యవహారాలు చూస్తుంది.

సాంఘిక భద్రతా కార్యక్రమాలు

నిరుపేదలూ, నిస్సహాయులూ, అంగవిహీనులూ అయిన వారి సహాయార్థం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొన్ని సాంఘిక భద్రతా కార్యక్రమాలు అమలు జరుపుతున్నది. వృద్ధులు, వికలాంగులకోసం హైదరాబాదు, విజయవాడలలో నడుపుతున్న గృహాలలో 250 మందికి ఉచితంగా భోజనం, వసతి, వైద్య సదుపాయాలు కలుగజేస్తున్నారు. అంధులకు మరో ప్రత్యేక గృహం నిర్వహిస్తున్నారు.

హైదరాబాదు, వరంగల్లు, కాకినాడలలో అనాథ శరణాలయాలు, హైదరాబాదులో భిక్షుక గృహం నడపడమేకాకుండా,



హరిజనులకు పట్టాల పంపిణీ

వయోవృద్ధులకు పింఛనుల నిమిత్తం ఏటేటా 70 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

ఇతర పథకాలు

కులాలులేని సమాజాన్ని రూపొందించే ఆశయంతో ప్రభుత్వం వర్ణాంతర వివాహాలను ప్రోత్సహిస్తున్నది. ఈ కార్యక్రమం క్రింద వధూవరులలో ఒకరు హరిజనులయిన సందర్భాలలో వారికి వెయ్యి రూపాయలు బహుమతిగా యిస్తున్నారు. వర్ణాంతర వివాహాలు చేసుకున్న వారికీ, వారి పిల్లలకు ఉద్యోగాలలో ప్రాధాన్యం యివ్వడానికి ఆలోచిస్తున్నారు. వివిధ ప్రోత్సాహక చర్యల ఫలితంగా రాష్ట్రంలో వర్ణాంతర వివాహాలు అంతకంతకీ అధికమవుతున్నాయి.

ప్రభుత్వోద్యోగాలలో హరిజనులకు రిజర్వేషను పద్ధతిని పటిష్ఠంగా అమలు జరపడానికి పరిపాలనా సంబంధమైన చర్యలను తీసుకున్నారు. వీటికితోడు కొన్ని ఉద్యోగాల విషయంలో వీరి విద్యార్హతల సడలింపు, నియామకాల నిమిత్తం ఇంటర్వ్యూలకు హాజరు కావడానికి ప్రయాణభత్యం, తాత్కాలికోద్యోగాలనుంచి తొలగించేటప్పుడు ప్రత్యేక రక్షణవంటి సౌకర్యాలు కలుగజేయబడుతున్నాయి.

మన ప్రభుత్వం హరిజనోద్ధరణకు నిరంతర నిర్విరామకృషి సలుపుతున్నది. సాంఘిక సంక్షేమ రంగంలో గణనీయమైన ఫలితాలను సాధించినప్పటికీ ఇంకా చేయవలసింది ఎంతో వుంది. ప్రజా సహకారంతో ఇకముందుకూడా సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తుందనడంలో సందేహం లేదు.

మనుషులనూ,మనసులనూ సన్నిహితం చేస్తున్న మన రహదార్లు

శ్రీ తిరుమల రామచంద్ర

అశోకుడు బాటలు వేయించెను. బాటలకు ఇరుప్రక్కలచెట్లు నాటించెను అని మనం చరిత్ర పాఠాలలో చదువుతుంటాము' నాగరిక జీవనానికీ, భౌతికాభివృద్ధిసాధనకు రవాణా వ్యవస్థ అత్యవసరమని అనాదిగా గుర్తించినట్టిది. వ్యవసాయము, వాణిజ్యము,పరిశ్రమలు మున్నగు రంగాలలోఅభివృద్ధి సాధనకు, జీవన స్థాయికి, ఇంతెందుకు మానవ జాతి సకల సువ్యవస్థిత కార్యకలాపాలకు స్థలజలమార్గాల అభివృద్ధితో సంబంధమున్నట్లు చరిత్ర కారులు భావిస్తున్నారు. ఆర్థికాభివృద్ధికి సరకుల రవాణా ఎంతఅవసరమో. యాత్రలు, రాకపోకలు మానవుని ఆరోగ్య భాగ్యాలకు, అభిప్రాయ అవగాహనకు అవసరం. వీటి పైనే సకలాభ్యుదయపరంపర ఆధారపడి ఉన్నది.

స్థల, జల గగనమార్గాలలో స్థలమార్గాలకే ప్రాధాన్యం ఎక్కువ. వ్యయభారం లేకపోవడం,నిర్వహణ వినియోగాలు సులభం కావడం దీనికి కారణాలు. మన గ్రామాల జీవనస్థాయి పెరగడానికి రహదారులు, విద్యుచ్ఛక్తి ప్రధానవిషయాలని ఆర్థికవేత్తలంటారు. రహదార్లవల్ల పరిశ్రమ లోను వ్యవసాయం లోను విప్లవమే ఏర్పడింది. రహదార్లు ప్రపంచమంతటా వివిధదేశాలు వాటి ఉత్పత్తిని ఇనుమడింప జేసుకొనడానికి, ఇంతవరకు మరుగున ఉన్న దేశాలు వెలుగుకు రావడానికి కారణ మయాయి.

భారత దేశంలో రహదార్ల వ్యవస్థకు 1943 వరకు ఎలాటి ప్రత్యేకమైన వ్యవస్థ లేదనే అనవచ్చు. 1928లో జయకర్ సంఘం రహదార్ల అభివృద్ధి ఆవశ్యకతను వాటి అభివృద్ధికి ఆర్థిక సదుపాయం ఒనగూర్చడాన్ని సహేతుకంగా సూచించింది. తర్వాత 1943 లో నాగపూర్ ప్రణాళిక, పిదప 1958లో బొంబాయి ప్రణాళికా రూపొందాయి. మొట్టమొదటి రహదార్ల రవాణా అభివృద్ధి ప్రణాళిక నాగపూర్ ప్రణాళికే. ఈ ప్రణాళిక ముఖ్యోద్దేశాలివి:


1. ఎక్కువ జనసంఖ్యగల గ్రామాలు జిల్లా రోడ్లకు రెండు మైళ్ల దూరంలోను, తక్కువ జనసంఖ్యగల గ్రామాలు ఐదు మైళ్లలోను ఉండాలి. 2. ఐదు వందల జనాభావున్న ప్రతి గ్రామానికీ రోడ్డు ఉండాలి. బొంబాయి ప్రణాళిక మరికొంత ముందుకు సాగింది, 1961 నుండి 1981 వరకు 20 సంవత్సరాల రోడ్ల అభివృద్ధి పథకాన్ని ఈ ప్రణాళిక సిద్ధపరచింది. వ్యవసాయం అభివృద్ధి చెందిన ప్రాంతంలోని ఏ గ్రామమూ ముఖ్యమైన రహదారికి నాలుగు మైళ్ల దూరానికి మించి ఉండరాదనేది ప్రధానసూత్రం. 1981కి వంద చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 32 కిలోమీటర్ల రోడ్డయినా ఉండాలనేది లక్ష్యం. ఈ ప్రణాళికకు అనుగుణంగా రహదార్లను ఐదుగా వర్గీకరించారు: 1. జాతీయ రహదార్లు, 2. రాష్ట్ర రహదారులు, 3, పెద్దజిల్లా రోడ్లు, 4. ఇతర జిల్లా రోడ్లు, 5. గ్రామాల రోడ్లు. జాతీయ రహదారులు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. రాష్ట్ర రహదారులను, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వం క్రింద ఉన్న పెద్ద జిల్లా రహదారులను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది, తక్కిన జిల్లా రోడ్లను, గ్రామ రోడ్లను జిల్లా పరిషత్తులు, తదితర స్థానిక సంస్థలు నిర్వహిస్తాయి.

మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభకాలంలో ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో మొత్తం 18,589 మైళ్ల రోడ్లు ఉన్నవి. ప్రణాళిక పూర్తి అయినప్పటికి 1956 రోడ్ల మొత్తం నిడివి 20,238 మైళ్లు.

రెండవ పంచవర్ష ప్రణాళికలో రాష్ట్ర పథకాలకు కేటాయించిన మొత్తం 561.34 లక్షలు. దీనిలో ఆంధ్రప్రాంతానికి 335.94 లక్షలు, తెలంగాణా ప్రాంతానికి 185.40 లక్షలు. ఈ ప్రణాళికా కాలంలో ప్రభుత్వం స్థానిక సంస్థల నుండి 1058 మైళ్ల రహదారుల పర్యవేక్షణ తీసుకున్నది.

రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి

ఆంధ్రప్రదేశ్ రోడ్ల అభివృద్ధి నిజానికి భాషా ప్రయుక్త రాష్ట్ర పునర్నిర్మాణం జరిగిన తర్వాతనే అని చెప్పవచ్చు. 1956 లో రహదార్లు భవన నిర్మాణం నిమిత్తం ప్రత్యేక శాఖ నెలకొన్నది. ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం రెండు లక్షల



గోదావరిపై రైలు-రోడ్డు వంతెన

77 చదరపు కిలోమీటర్లు. 1971 జనాభా లెక్కల ప్రకారం జన సంఖ్య నాలుగు కోట్ల 35 లక్షలు. విస్తీర్ణంలోను, జనసంఖ్య లోను మనరాష్ట్రం దేశంలో ఐదవ పెద్దరాష్ట్రం, 1957-58 నాటికి మన రాష్ట్రంలో వున్న రోడ్ల నిడివి 34,906 కిలోమీటర్లు. 1974 మార్చికి రోడ్ల నిడివి 89,602 కిలోమీటర్లు.

ఆంధ్రప్రదేశ్‌లో రోడ్ల నిర్మాణ నిర్వహణలకు మూడు సంస్థలున్నాయి. 1. రోడ్లు, భవనాలశాఖ, 2. పంచాయతీ రాజ్‌శాఖ, 3. నీటిపారుదల, విద్యుచ్ఛక్తి, అటవి మున్నగు శాఖలు. వివిధ సంస్థల నిర్వహణలో వున్న రోడ్ల వివరాలు ఇలా పేర్కొనవచ్చు.

రాష్ట్రంలోని మొత్తం 89,602 కిలో మీటర్ల రోడ్డులో 23,717 కిలోమీటర్లు ప్రభుత్వ రోడ్లు, భవనాల శాఖక్రింద ఉన్నవి. వీటిలో 2800 కిలో మీటర్ల మేర జాతీయ రహదార్లున్నాయి. వీటిలో సిమెంటు రోడ్లు 400 కి.మీ. తారు రోడ్లు 17,999 కి.మీ. కంకరరోడ్లు 44,693 కి.మీ. ఇతరరోడ్లు 831 కి.మీ. జిల్లా పరిషత్తు నిర్వహణలోని 26,888 కి.మీ. సమితుల నిర్వహణలోని 29,060.27 కి.మీ. మునిసిపాలిటీల అధీనంలోని 3,456 కి.మీ. అటవీశాఖ నిర్వహణలోవి 5,078 కి.మీ. నీటిపారుదలశాఖ అధీనంలో 815 కి.మీ విద్యుచ్ఛక్తి శాఖ నిర్వహణలోవి 104 కిలో మీటర్లు, రైల్వేశాఖ 219 కి.మీ. ఎం.ఇ.ఎస్ 256 కి.మీ. మొత్తం 89,602 కిలోమీటర్లు.

రహదార్లలో లోపాలు

బొంబాయిలో నిర్ణయించిన అఖిల భారత రోడ్ల అభివృద్ధి ప్రణాళిక ప్రకారం 1961 నుండి 1981 వరకు 20 సంవత్సరాల నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌కు 480 కోట్ల రూపాయల వ్యయంతో బృహత్ప్రణాళిక రూపొందించబడింది. ఈ ప్రణాళిక ప్రకారం మన రాష్ట్రంలో 90,000 కిలోమీటర్ల రోడ్లు వేయాలి. 1975 చివరకే మన రోడ్ల నిడివి 89,602 కిలోమీటర్ల అయింది. కనుక మనం బొంబాయి ప్రణాళికల లక్ష్యం అందుకొన్నట్లే. కాని ఈ రోడ్లలో మధ్యావ అతుకులుగా వుండడం, ఇరుకయిన వంతెనలు, దుర్భలమైన వంతెనలు తూములు, తగినంత దళసరితనం లేకపోవడం ఒకశకటమే పోగలిగినంత ఇరుకుగా వుండడంవంటి లోపాలు చాలా ఉన్నాయి. ఈ లోపాలను 1981 లోగా తొలగించుకోవాలి.

ఇతర రాష్ట్రాలలోలాగే మనరాష్ట్రంలోను రవాణా ఎక్కువయింది. ఇతర వాహనాల మాట అలా వుండగానాలుగు చక్రాలమోటారు శకటాల సంఖ్య పెరిగింది. 1961 లోవీటి సంఖ్య 26,640 1966లో 47,810, 1966లో 60.400 కాగా. ప్రస్తుతం లక్షకు పైగావుండవచ్చు. రవాణా మితిమీరడంవల్లరోడ్ల నిర్వహణ ప్రధానవిషయమయింది. రవాణా వేగానికి మన. రోడ్లు తట్టుకోలేక పోతున్నాయి, వీటి నిర్వహణకు, పైన పేర్కొన్న లోపాల నివారణకు 360 కోట్ల రూపాయలు అవసరమని 1968 లో అంచనా వేశారు. ప్రణాళికలో తగినంత మొత్తాలు కేటాయించనందున ఈ లోపాలు సరిదిద్దడం జరుగలేదు. శకటాల బరువు 1940 లో దాదాపు నాలుగున్నర టన్నులు. కాని నేటి శకటాల బరువు ఎక్కువ. ఈ బరువుకు మన రోడ్లు తట్టుకోలేకపోతున్నాయి.

ఇంతేకాక మనకు మరొక చిక్కు వున్నది. మన రోడ్లలో 1600 కి.మీ. లకు పైగా డెల్టా ప్రాంతమైన తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలలో వున్నది. ఇవి కాలువ గట్ల మీద, బలంలేని నేలమీద ఉన్నవి. ఇవి బరువుకు కుసిబడిపోతాయి. రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థనపై కేంద్ర రోడ్ల పరిశోధన సంస్థ ఈ సమస్యను పరిశీలించి, చక్కబరచడానికి సూచనలు చేసింది. దాని సూచన ప్రకారం ఈ రోడ్లను బలపరచడానికి 1966 లో 30 కోట్ల రూపాయలు ఖర్చుకాగలవని అంచనా వేశారు. ధనాభావంవల్ల ఇంతవరకు ఆ సూచనను అమలు జరుపలేదు. దీనికితోడు. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకింద గుంటూరు నల్లగొండజిల్లాల భూములు మాగాణి కావడంవల్ల దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు చెడిపోతున్నాయి. ఈ ఆయకట్టు ప్రాంతంలోని రోడ్లను బలపరచడం అవసరం.

చతుర్థ పంచవర్ష ప్రణాళికలో రోడ్లలోని లోపాలు తొలగించడానికి ప్రయత్నాలు జరిగాయి. (1) 196 కి.మీ రోడ్లకు తారువేయడం, (2) 90 కి.మీ రోడ్ల నిర్మాణం, (3) 170 కి.మీ రోడ్ల అభివృద్ధి, (4) 52 వంతెనల నిర్మాణం, (5) 288 తూముల నిర్మాణం చాలావరకు జరిగాయి. కేంద్ర


ప్రభుత్వం చతుర్థ ప్రణాళికలో కేటాయించిన 18 కోట్ల రూపాయలలో 12 కోట్ల 13 లక్షలే ఇవ్వడం వల్ల తగిన ఆర్థిక సదుపాయం లేనందున ఏడుకోట్ల విలువగల పనులు ఐదవ ప్రణాళికకు చేర్చడం జరిగింది.

ఐదవ ప్రణాళికలో రాష్ట్రప్రభుత్వ రోడ్లకు 57 కోట్లు కేటాయించింది. దీనిలో 30 కోట్లు కనీసపు అవసరాల కార్యక్రమానికి, 25 కోట్లు పెద్దరోడ్లకు, రెండుకోట్లు నాల్గవప్రణాళిక నుండి చేరిన పనులకు ప్రత్యేకించారు. కనీసపు అవసరాల కార్యక్రమానికి ప్రత్యేకించిన 30 కోట్లలో 20 కోట్లు గ్రామాల రోడ్లకు, తక్కిన 10 కోట్లు గిరిజన ప్రాంతాల రోడ్లకు వెచ్చిస్తారు.

ఐదవ పంచవర్ష ప్రణాళిక మొదటి సంవత్సరంలో-అనగా 1974-75 లో రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర రహదార్లకు 250 లక్షలు, రాయలసీమ రోడ్లు ప్రత్యేక అభివృద్ధిపథకాలకు మూడు లక్షల 90 వేలు, గిరిజన ప్రాంతంలోని రోడ్లకు 9 లక్షలు కేటాయించింది. కేటాయింపు 272 లక్షలు 90 వేలు కాగా, ఖర్చు 281 లక్షల 17 వేలయింది. ఐదవప్రణాళిక రెండవ సంవత్సరానికి 400 లక్షలు కేటాయించారు. దీనిలో 50 లక్షలు గిరిజన ప్రాంతం రోడ్లకు, 15 లక్షలు మత్స్యాభివృద్ధిశాఖ రోడ్లకు ప్రత్యేకించారు. నిజానికి ఈ రోడ్లను కనీసపు అవసరాల కార్యక్రమంలో చేర్చవలసింది. ఐదవ ప్రణాళికలోని తక్కిన మూడు సంవత్సరాలకు రాష్ట్రప్రభుత్వం ఏటా 4 కోట్లు ఖర్చుపెట్టి ప్రణాళిక సంఘం సూచనలను పూర్తి చేయదలచినది.

1974-75 లో 263 కి. మీ. రోడ్లకు తారు చేయడం, బాగుపరచడం, 9 వంతెనల, 69 తూముల నిర్మాణం జరిగాయి. 1975-76 లో 200 కి. మీ. నిడివి రోడ్లను బాగుపరచడం, 13 వంతెనలు తూములు కట్టడం, ఉద్దేశించబడ్డాయి. ధనాభావంవల్ల 1973-74 లో ఆగిపోయిన గిరిజన ప్రాంతం రోడ్లు పనులు ఈ సంవత్సరం చేపట్టడం జరిగింది. దీనికి 50 లక్షలు కేటాయించారు. ఈ మొత్తం విశాఖపట్నం, శ్రీకాకుళం లలోని ఏజన్సీ ప్రాంతాలలోను, వరంగల్లు ఖమ్మం జిల్లాలలోను ఇప్పటి రోడ్లను చక్కబరచి, కొత్త రోడ్లు వేయడానికి వినియోగిస్తారు.

1976-77 లో 150 కి. మీ. రోడ్ల ఉత్తమ స్థాయి మరమ్మతు, బొబ్బిలి, రాజోలు రోడ్డున 14 లక్షల 90 వేలలో వేగావతి నదిపై వంతెన, మండపేట—జొన్నాడ రోడ్డు మీద రెండు లక్షల 30 వేలతో వంతెన, నాయుడుపేట—వెంకటగిరి రోడ్డులో మామిడికాల్వ మీద ఆరు లక్షల 80 వేలతో వంతెన, 18 లక్షల వ్యయంతో భద్రాచలం—చండ్రపట్ల రోడ్డున తల్లి యేరు మీద వంతెన నిర్మాణం పూర్తి కాగలదని ఆశిస్తున్నారు. ఇదికాక 28 చిన్న వంతెనలు తూముల పని కూడా జరుపాలనే ప్రతిపాదన వుంది.



ప్రత్యేకాభివృద్ధి కార్యక్రమాలు

రాష్ట్రం గుండా వెళ్లే జాతీయ రహదార్లు, 4, 5, 7, 9, 13 ల నిడివి 2300 కిలో మీటర్లు. బొంబాయి ప్రణాళిక ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ఈ రహదార్లకు రెండు శకటాలు ఒకేమారు పోదగినంతమేర తారు వేసి నిర్వహించాలి. వంతెనలు, తూములు కట్టాలి. దీనికోసం చతుర్థ ప్రణాళిక ప్రారంభంలో కేంద్రం 38 న్నర కోట్ల పథకం సిద్ధపరచి, 20 కోట్ల 17 లక్షలు మాత్రమే కేటాయించింది. 17 కోట్ల పని ఐదవ ప్రణాళికకు చేరవేసింది. మంజూరు కాని పనులు 25 కోట్ల మీద ఉన్నాయి. కేంద్రం జాతీయ రహదార్లకోసం కేటాయింపును తగ్గించింది. కనుక రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదార్ల లక్ష్యాన్ని 1981 కి మారు 1984 కు గాని సాధించలేదు. ఇదిన్నీ కేంద్ర ప్రభుత్వం ఐదవ ప్రణాళికలో 18 కోట్లు ఆరవ ప్రణాళికలో 35 కోట్లు కేటాయించినప్పుడే.

కేంద్ర ప్రభుత్వం 1938 లో కేంద్ర రహదారి నిధిని ఏర్పాటు చేసింది. గ్యాలను పెట్రోలుపై 19 పైసల ప్రకారం వసూలు చేసే పన్నులో 80 శాతం రాష్ట్రాలకు కేటాయించగా మిగిలినది ఈ నిధికి జమకడతారు. దీనిని ప్రత్యేక కార్యక్రమాలకు పరిశోధనకు వినియోగిస్తారు. ఈ నిధినుంచి కేంద్రం 1974-75 కు 25 లక్షల 80 వేలు కేటాయించింది. ఈ సంవత్సరం అంతమేర మొత్తం కేటాయించవచ్చు.

రోడ్లు, ఓవర్ బ్రిడ్జిలు నిర్మాణం, లెవెల్ క్రాసింగ్ లో మనిషిని నియమించడం మొదలైన వాటికోసం కేంద్రం 1966 లో రైల్వే భద్రత నిధిని నెలకొల్పింది. ప్రయాణికుల పన్ను నుంచి రైల్వేలు ఈ నిధికి డబ్బు చెల్లిస్తాయి. ఈ నిధి నుంచి రైల్వేలు రాష్ట్ర ప్రభుత్వాలకు

పైన పేర్కొన్న వంతెనల, రోడ్డు నిర్మాణానికి తమ వాటా చెల్లిస్తాయి ఈ నిధి నుండి రాష్ట్ర ప్రభుత్వానికి 1973-74 లో 125 లక్షల 25 వేలు, 1974-75 చివరకు 146 లక్షల 47 వేలు జమ అయ్యాయి. ఈ డబ్బు వాడడానికి సమగ్ర పథకం సిద్ధమయింది. దీనిని దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ రైల్వే, ఆగ్నేయ రైల్వేల అధికారులు ఆయా ప్రాంత పనుల విషయంలో తుది నిర్ణయాలు జరుపుతారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి 12 పథకాలు మంజూరు చేసింది. అనకాపల్లి, సామర్లకోట, తాడేపల్లిగూడెం, చిత్తూరు, కొండపల్లి, ఆదోని, కుప్పం, జనగామ, హసన్‌పర్తి, కాజీపేట, నెల్లూరు, కాకినాడ, నర్సీపట్నం, ఆముదాలవలసలలో చెరి ఒక రోడ్డు ఓవర్ బ్రిడ్జి కూడా ప్రతిపాదించింది. వీటి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం వాటా 125 లక్షల 50 వేలు. దీనితో 1975 మార్చి వరకు 60 లక్షలు ఖర్చయాయి.

1975-76 లో రైల్వే భద్రతా నిధి కార్యక్రమాలకు 45 లక్షల 9 వేల రూపాయలు కేటాయించబడ్డాయి. రైల్వేలు ఎప్పటికప్పుడు డబ్బు లేదంటున్నాయి. రైల్వేలు సమానమైన వాటా చెల్లిస్తే తప్ప ఈ నిధిని రాష్ట్ర ప్రభుత్వం వాడుకోజాలదు.

రాష్ట్ర పంచవర్ష ప్రణాళికలలో కేటాయింపులు లేని జాతీయ రహదారులుకాని, ఇతర రోడ్లు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 1953 లో సహాయ పథకం ప్రారంభించింది. ఈ పథకం క్రింద 150 లక్షల 48 వేలు విలువచేసే 26 పనులు జరిగాయి. ఐదవ ప్రణాళికలో ఈ పథకం క్రింద 15 కోట్ల 56 లక్షలు వ్యయమయ్యే 16 పనులను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. ఏటా రెండు కోట్ల రూపాయలు మంజూరు చేయాలని కోరింది.

రోడ్ల మరమ్మత్తులు, నిర్వహణ

రహదార్లు సంవత్సరం పొడువునా వినియోగపడేవి గనుక వాటి మరమ్మత్తు నిర్వహణ తప్పనిసరి. 1974-75 లో వీటికోసం రాష్ట్ర ప్రభుత్వం 790 లక్షలు, ఈ సంవత్సరం 880 లక్షలు మంజూరు చేసింది.

జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితుల క్రింద 36,800 కి. మీ. ల రోడ్లున్నవని ఇదివరకే మీకు తెలుసు. ఈ సంస్థలు రోడ్లను నిర్వహించలేకపోతున్నాయి గనుక, రాష్ట్ర ప్రభుత్వం వాటిని ఆ బరువునుంచి తప్పించదలచింది. ఐదవ ప్రణాళిక కాలంలో జిల్లా పరిషత్తులనుంచి 500 కి. మీ. ల రోడ్డును రోడ్లు భవనాల శాఖ నిర్వహణకు బదిలీ చేయదలచింది. 31-3-74 వరకు ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ నుండి 2563 కి. మీ. ల రోడ్లను స్వాధీనం చేసుకుంది. 1975-76 లో 1800 కి. మీ. ల రోడ్డును జిల్లా పరిషత్‌నుండి రోడ్డు, భవనాల శాఖ స్వాధీనం చేసుకుంటుంది. తక్కినవి ప్రణాళిక మిగులు మూడేళ్లలోను స్వాధీన పరచుకుంటుంది.

రోడ్ల ఇంజనీరు నేడు పెక్కు సమస్యలను ఎదుర్కోవలసి వుంది గనుక మంచి రోడ్లకోసం పరిశోధనకూడ ప్రారంభమయింది. దీనికోసం రోడ్డు రవాణా శాఖలో రోడ్లు పరిశోధన కేంద్రం, ట్రాఫిక్ ఇంజనీరింగ్ విభాగం ఏర్పడ్డాయి. వరంగల్‌లోని ప్రాంతీయ ఇంజనీరింగ్ కాలేజివంటి సంస్థల సహకారంతో రోడ్డురవాణా శాఖ పెక్కు పరిశోధనలు ప్రారంభించింది.

ఏమైనా నేడు రహదారులు ఆర్థికంగా అత్యవసరమయ్యాయి. వ్యవసాయ, వాణిజ్య పరిశ్రమలు అభివృద్ధి త్వరితగతిని కొనసాగి క్రమబద్ధమైన ఆర్థిక వ్యవస్థ నెలకొనాలనే మన లక్ష్యం ఫలించడానికి రోడ్లకోసం తగినంత పెట్టుబడితప్పుడు. తగిన రవాణా సౌకర్యాలు, రహదారులూ లేనిదే ఎంత అధికోత్పత్తి జరిగినా ప్రయోజనంలేదు. వ్యవసాయ ఫలితాలను వ్యాపార కేంద్రాలకు చేరవేయడానికి గాని, పరిశ్రమల వస్తువులను చేరవేయడానికి గాని, తక్కిన రవాణా సౌకర్యాలకు గాని రహదార్లు అత్యావశ్యమైనట్టివి. కనుక ఉన్న రహదార్ల నిర్వహణ, కొత్త రహదార్ల నిర్మాణం అవసరం. ఈ సందర్భంలో అమెరికా రవాణా విషయ నిపుణుడు థామస్ హెచ్‌మాక్‌డోనాల్డ్ అన్నమాటలు గుర్తుంచుకోవాలి. “మనం మన రహదార్లను అభివృద్ధిపరచడం ప్రారంభించినప్పుడు మన జాతి ఐశ్వర్యవంతమైనదేమీ కాదు. కాని ఆ రహదార్లే, వాటంతట అవే, వ్యాపార వాణిజ్యాలలోను, పరిశ్రమల్లోను నూతన సంపదను సృష్టించడానికి, భూమి ధర పెరగడానికి తోడ్పడ్డాయి. కనుక మన సంపద రహదార్లే. అవే సంపదను నిర్మించాయి!

ఆరవ ప్రణాళిక “రవాణా ప్రణాళిక” అంటున్నారు. రానున్న సంవత్సరాలలో రహదార్లు తగిన పరిగణనను పొందుతాయని ఆశిద్దాం.

నా దేశం నవ్వుతోంది

— శ్రీ జె. బాపురెడ్డి

నా దేశం నవ్వుతోంది
నందనవనంలా
నాదస్వరంలా
కన్నీళ్ళు మాత్రమే పండిన
కష్టజీవుల బ్రతుకుల్లో
కాంతి రేఖల్ని పండించి
అసమానతకు బలియైన
అదృష్ట హీనులకు
అసమాన శక్తి నందించి
నా దేశం నవ్వుతోంది
నందన వనంలా—నాదస్వరంలా—

చెమట బిందువుల్లో
నవజీవన సింధువుల్ని సృష్టించి
బంజరు భూముల్లో
బ్రతుకు బాటలు వేయించి
కర్షకున్ని, కార్మికున్ని
కష్టించే ప్రతివాన్ని
రక్షారథం ఎక్కించి
నా దేశం నవ్వుతోంది
నందన వనంలా—నాదస్వరంలా—

అడవుల్ని శోధిస్తున్నవి
అలసటలేని తారురోడ్లు
హరిజనులను అభిమానిస్తున్నవి
గిరిజనులను ఆహ్వానిస్తున్నవి
చీకట్లను ఛేదించిన
చైతన్య జ్యోతులు
నా దేశం నవ్వుతోంది
నందన వనంలా—నాదస్వరంలా

నాగార్జున సాగర తరంగాలలో
ఆర్యభట్టు విజ్ఞానాంతరాళాలలో
భిలాయి ఉగ్రోష్ణ ఉక్కు తారల్లో
బాంబేహై విజయ తైల ధారల్లో
అర్వాచీన భారతి
సమీచీన రూపం సాక్షాత్కరిస్తున్నది—
నా దేశం నవ్వుతోంది
నందనవనంలా—నాదస్వరంలా—


ఎగుమతులు పెరుగుతున్నాయి
దిగుమతులు తరుగుతున్నాయి
నల్ల బజారులో నాట్యమాడిన
నాగుబాముల
నడుములు విరుగుతున్నాయి—
ఉత్పత్తులు పెరుగుతున్నాయి
ధరలు తరుగుతున్నాయి
సగటు మనిషి బ్రతుకులో
కరుడుగట్టిన చీకట్లు కరుగుతున్నాయి
రాలిపోయే నీటి చుక్కలు
కాలిపోయే బొగ్గు ముక్కలు
కాంతిధారలు రచిస్తున్నాయి
క్రాంతిని నిర్వచిస్తున్నాయి
నా దేశం నవ్వుతోంది
నందన వనంలా - నాదస్వరంలా.

నేటి రాష్ట్ర ఆర్థిక స్తోమత

శ్రీ పి. రంగారెడ్డి

ఈ నాడు మనదేశం నూతనోత్సాహంతో ప్రగతి పథంలో పయనిస్తున్నది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలన్నిటికీ ప్రజలు ఉత్సాహంతో పూర్తి సహకారాన్ని అందిస్తున్నారు. ప్రజలలో కలిగిన నేటి చైతన్యమూ, అన్ని వర్గాల ప్రజలకూ ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు, ఆర్థిక సాంఘిక న్యాయం చేకూర్చవలెనని ప్రభుత్వంలో ఏర్పడిన నేటి పట్టుదల గత ముప్పయి సంవత్సరాలలో యెప్పుడూ కనీవినీ ఎరుగం ఇంతవరకూ అనాథలం అనే నిరాశా, నిస్పృహలలో కొట్టుమిట్టాడుతున్న బడుగువర్గాల ప్రజలుకూడా జాగృతమైనారు. తమకు సమాజంలో ఒక స్థానమున్నదనీ, అభివృద్ధి కార్యక్రమాలపట్ల కలిగిన లాభాలు తమకూ చెందాలనీ వారు కోరుతున్నారు. వీరికి తరతరాలుగా జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం గుర్తించింది. వీరికి న్యాయం కలుగజేసి సమాజంలో వీరికి గౌరవమైన స్థానాన్ని కల్పించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బద్ధకంకణమై వున్నాయి. ఏ వర్గ ప్రజలకైనా సంక్షేమం కలిగించాలంటే దేశ ఆర్థిక పరిస్థితి బలంగా వుండాలి. దేశంలో ఉన్న సహజ సంపదలు యే ఒక్క వర్గం ప్రజల లాభానికే గాక దేశ ప్రజలందరి అభ్యున్నతికి వుపయోగపడాలి. మన ప్రధాని నూతన ఆర్థిక కార్యక్రమం యీ ఆశయాల సాధనకే రూపొందించబడింది.

మన రాష్ట్రంకూడా యే యితర రాష్ట్రానికి కూడా తీసిపోని విధంగా తన ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకొని, తద్వారా అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సుకోసం కృషి చేయడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తున్నది. నేటి మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మున్నెన్నడూ లేని విధంగా చాలా సంతృప్తికరంగా వున్నది. ఉదాహరణకు మన వార్షిక ప్రణాళికలలోని పెట్టుబడులనే తీసుకొందాం. మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో మనరాష్ట్ర ప్రణాళిక ఐదేండ్లకు కలసి 3?3 కోట్ల రూపాయలు మాత్రమే. నాలుగవ ప్రణాళిక మొత్తం ఖర్చు 420 కోట్ల రూపాయలు. వీటితో పోల్చుకొని చూస్తే 1976–77 సంవత్సరం వార్షిక ప్రణాళిక 282 కోట్ల రూపాయలు వుండడం గమనించదగ్గ విషయం. ప్రణాళికా సంఘంతో ఫిబ్రవరి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి, నేను జరిపిన చర్చలలో 1976–77 సంవత్సరపు రాష్ట్ర వార్షిక ప్రణాళికను పెంచవలసిన ఆవశ్యకతను గురించి కేంద్ర ప్రభుత్వానికి నచ్చచెప్పాము. దీనిఫలితంగా వార్షిక ప్రణాళిక 1975–76 కన్నా 60 కోట్లు ఎక్కువైంది. వార్షిక ప్రణాళిక పెరగడం వల్ల ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాల రంగాలలో ఎక్కువ ఖర్చు చేయడానికి, ఎక్కువ



అభివృద్ధి సాధించుకోడానికి, ముఖ్యంగా బీద ప్రజలకు ప్రయోజనకరంగా ఉండే అనేక పథకాలను చేపట్టడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ 282 కోట్ల ప్రణాళిక దక్షిణాదిలో వున్న రాష్ట్రాలు అన్నింటి వార్షిక ప్రణాళికలలోను పెద్దది.

నాల్గవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరం 1973–74లో మనరాష్ట్ర ఆదాయం సుమారుగా ఇప్పటి ధరల ప్రకారం 3,711 కోట్ల రూపాయలు. మరుసటి సంవత్సరము 1974–75 లో ఇది

4,119 కోట్ల రూపాయలకు పెరిగింది. ఇదే విధంగా 1975–76 సంవత్సరంలో కూడా రాష్ట్ర ఆదాయం బాగా పెరిగింది. రాష్ట్ర ఆదాయంలో యీ పెరుగుదల కేంద్రప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలు పెరగడంవల్ల గాని, ప్రజలనుంచి అప్పులు తీసుకోవడం ద్వారా గాని కలిగిందికాదు. మన రాష్ట్రంలో పన్నుల వసూలు కార్యక్రమం ఖచ్చితంగా, శక్తివంతంగా జరగడానికి యేర్పాటు చేయడవల రెవిన్యూ ఖాతాలో వచ్చేజమలు అంతకంతకు పెరుగుతున్నవి. చాలా రోజులుగా వసూలుకాకుండా నిల్చిపోయిన బకాయీలు కూడా వసూలు చేయడానికి ఖచ్చితమైన చర్యలు తీసుకొంటున్నాము. అందువల్ల సహజ పరిస్థితులలోనే మనరాష్ట్ర ఆదాయం బాగా పెరుగుతున్నది.

ఇదేవిధంగా తలసరి సగటు ఆదాయం ఇప్పుడు పేర్కొన్న కాలంలో 818 రూపాయల నుంచి 877 రూపాయల వరకు పెరిగింది.

కొంతకాలం క్రితం మనరాష్ట్రం ఆర్థికంగా చాలా ఒడుదుడుకులకు లోను అవుతూ వుండేది. మనం మోయలేనంత భారంగా రిజర్వుబ్యాంకులో ఓవర్ డ్రాఫ్టు వుండేది. ఏ కార్యక్రమం తలపెట్టవలసి వచ్చినా కేంద్రప్రభుత్వం వైపో, రిజర్వు బ్యాంకు వైపో చూడవలసిన పరిస్థితిలో వుండేవాళ్ళం. ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. మనకు రిజర్వుబ్యాంక్ ఓవర్ డ్రాఫ్టు ఇప్పుడు యేమాత్రం లేదు. అంటే దాదాపు మనకాళ్ళమీద మనం నిలబడే స్థితికి వచ్చామని చెప్పవచ్చు. వాటికితోడు ప్రతియేడు రెవిన్యూ ఆదాయం పెరుగుతూ వస్తున్నది. ఉదాహరణకు భూమిశిస్తు రిజిస్ట్రేషన్ ఫీజు, వ్యవసాయ భూములు, యితర స్థిరాస్తుల మీద వేసే పన్నులు మొదలగు వాటివల్ల 1976–77 సంవత్సరానికి సుమారు 51 కోట్ల రూపాయలు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. 1972–73 సంవత్సరంలో ఈ ఆదాయం సుమారు రూ. 19 కోట్లు మాత్రమే వున్నది. అంటే దాదాపు మూడు రెట్లవరకు మన ఆదాయం పెరిగిందన్నమాట. అంతేగాక ఎక్సైజు అమ్మకాలపన్ను, వాహనాల పన్ను మొదలగు వాటిమీద వేసే పన్నుల రూపంలో 1972–73 సంవత్సరంలో 113 కోట్ల రూపాయల ఆదాయం కాగా 1976–77 లో యీ ఆదాయం 262 కోట్ల రూపాయలకు పెరిగే అవకాశమున్నది. పన్నులు కాని యితర రెవిన్యూ అంశాలు కూడా వున్నాయి. ఈ మొత్తం కూడా 79 కోట్లనుండి 126 కోట్ల వరకు పెరిగింది.


ఇవి కాక కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి లభించే పన్నుల వాటా సహాయక గ్రాంట్లు, విరాళాలు మొదలగు వాటివల్ల వచ్చే ఆదాయం కూడా క్రమంగా పెరుగుతున్నది. 1976–77 సంవత్సరంలో యీ రెవిన్యూ ఆదాయం 656 కోట్ల వరకు వుండవచ్చు. 1972-73లో మొత్తం 357 కోట్లు మాత్రమే. అంటే యీ నాలుగు సంవత్సరాల కాలంలో 300 కోట్ల రూపాయల ఆదాయం మనకు పెరిగిందన్నమాట. అందువల్లనే వ్యవసాయం, విద్యుచ్ఛక్తి, సేద్యపు నీటిపారుదల మొదలగు ముఖ్య రంగాలలో మనం ఎక్కువగా పెట్టుబడులు పెట్టుకొని ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహించు కోవడానికి అవకాశం కలుగుతుంది. ఇటువంటి పెట్టుబడులమీద పెట్టే ఖర్చు మనం బాగా పెంచుకోగలుగు తున్నాము. 1972–73 సంవత్సరంలో యీ పెట్టుబడులు 42 కోట్ల రూపాయలు మాత్రమే. 1976–77 సంవత్సరానికి ఇది 129 కోట్లు అవుతుంది. అంటే సుమారు మూడు రెట్లు అధికం అయింది.




ఆర్థిక వ్యవస్థలో కలిగిన యీ అభివృద్ధివలన మన రాష్ట్రం గత కొన్ని సంవత్సరాలలో అనేక రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధించగల్గింది.

ఆహారధాన్యాల వుత్పత్తిలో క్రమంగా పెరుగుదల కలిగి మన రాష్ట్రం, ఒక రికార్డు స్థాయిని చేరుకున్నది. ప్రతి సంవత్సరం పంట విస్తీర్ణం పెంచుకోవడం ద్వారానూ, అధిక దిగుబడి వంగడాల కార్యక్రమాన్ని విజయవంతంగా, విస్తృతంగా అమలు చేయడం వల్లనూ క్రిమిసంహారక మందులు, ఎరువులు మొదలగు అవసరాలను, పరపతి సౌకర్యాలు రైతులకు, ముఖ్యంగా సన్నకారు రైతులకు కలుగ జేయడం ద్వారానూ మనం ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ముందడుగు వేయగలిగాము. 1971-72 సంవత్సరంలో సుమారు 73 లక్షల టన్నుల ఆహారధాన్యాలు పండించారు. 1974-75 సంవత్సరంలో 90 లక్షలకు పెరిగిన ఆహార ధాన్యాల ఉత్పత్తి 1976-77లో కోటి టన్నులను చేరుకోగలదని ఆశిస్తున్నారు.

పరిశ్రమల రంగంలో కూడ మన రాష్ట్రం ముందంజ వేస్తున్నది. 1974 లో పరిశ్రమల రంగంలో కనిపించిన 14.8 శాతం అభివృద్ధి 1975 సంవత్సరంలో 17.2 శాతానికి పెరిగింది. గత సంవత్సరం 1975-76లో 135 కోట్ల పెట్టుబడి కలిగిన 74 పరిశ్రమల స్థాపనకు కేంద్రప్రభుత్వ అనుమతి లభించింది. కొత్త పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం కలగజేస్తున్న సౌకర్యాలు






అధికంగా పారిశ్రామిక వేత్తలను మన రాష్ట్రానికి రప్పిస్తున్నాయి చిన్నతరహా పరిశ్రమలకు, స్వయం ఉపాధి కల్పనా కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా ప్రోత్సహిస్తున్నది.

అత్యవసర పరిస్థితి ప్రకటన తర్వాత పరిశ్రమల రంగములో యజమానుల, కార్మికుల మధ్య సామరస్య వాతావరణం, స్నేహ సుహృద్భావాలు ఏర్పడడం వల్ల గత సంవత్సరం ద్వితీయార్థంలో పారిశ్రామిక ఉత్పత్తుల అభివృద్ధి దేశ వ్యాప్తంగా ఎక్కువైంది. మన రాష్ట్రంలో కూడా యీ పెరుగుదల కనిపించింది. ఉదాహరణకు 1974తో పోల్చుకుంటే 1975 సంవత్సరంలో పంచదార వుత్పత్తిలో 32.3 శాతం, మందుల వుత్పత్తి 20.5 శాతం, జనపనార వస్తువులలో 18.1 శాతం, సిమెంట్‌లో 8.6 శాతం, యంత్ర పరికరాలలో 51 శాతం, బొగ్గు వుత్పత్తిలో 23.1 శాతం అభివృద్ధి జరిగింది.

నీటి పారుదల విషయంలో కూడా మనం సాధించిన అభివృద్ధి తక్కువేమీ కాదు. మనం అమలు చేస్తున్న భారీ ప్రాజెక్టులు, మధ్యతరహా ప్రాజెక్టులు త్వరత్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకొంటున్నాము. నాగార్జునసాగర్, పోచంపాడు మొదలగు



భారీ నీటిపారుదల ప్రాజెక్టుల క్రింద కొన్ని దశల నిర్మాణం పూర్తి అయింది. దీనివలన ఎక్కువ విస్తీర్ణానికి నీరు లభ్యం అవుతున్నది. అనేక మధ్యతరహా, చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేశారు. కొన్ని నిర్మాణపు ఆఖరి దశలో వున్నాయి. ఏరకమైన ప్రాజెక్టులూ లేని చోట గొట్టపు బావుల నిర్మాణం చేపట్టారు. నాగార్జునసాగర్, పోచంపాడు ప్రాజెక్టుల మీద యీ సంవత్సరం చెరి 18 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తారు. ఇటీవల గోదావరి ఆనకట్ట గండిపడటం, దాని మరమ్మతుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసికోవటం మనకు తెలిసిన విషయాలే. ఈ ఆనకట్ట బదులు నిర్మిస్తున్న గోదావరి బ్యారేజ్ నిర్మాణం త్వరితంగా పూర్తి చేయడానికి ఒక కమిటీని నియమించారు. ఈ బ్యారేజ్‌ను వచ్చే సంవత్సరం మే నెల ప్రాంతానికి పూర్తి చేయడానికి గట్టిగా కృషి జరుగుతున్నది.

విద్యుచ్ఛక్తి అటు వ్యవసాయానికి, యిటు పరిశ్రమలకు కూడా ప్రాణప్రదమైనది. అందువల్ల మన ప్రణాళికలలో విద్యుచ్ఛక్తి రంగానికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వడం జరుగుతున్నది. దీని వలన విద్యుచ్ఛక్తి ఉత్పాదన శక్తి క్రమక్రమంగా పెరుగుతున్నది. కొత్తగూడెం, దిగువ సిలేరు విద్యుత్ ప్రాజెక్టులలో ఉత్పత్తి క్రమంగా పెరుగుతున్నది. ఈ సంవత్సరం ప్రణాళికలో విజయవాడ థర్మల్ విద్యుచ్ఛక్తి కేంద్రానికి రూ. 19 కోట్లు, శ్రీశైలం ప్రాజెక్టుకు రూ. 25 కోట్లు, నాగార్జునసాగర్ జలవిద్యుత్ పథకానికి 4½ కోట్లు ఖర్చు పెడుతున్నాము.

మామూలుగా సాధారణ పరిస్థితులలో ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందంటే ప్రజలకు అర్థం కాదు. వారికియేదైనా అనుభవ పూర్వకంగానే అర్థమవుతుంది. నేడు దేశంలో ద్రవ్యోల్బణ పరిస్థితి లేదనే చెప్పవచ్చు. దీనివలన డబ్బువిలువ పెరగడం, తద్వారా ధరలు తగ్గిపోవడం జరిగింది. ఈ ధరల తగ్గుదల సామాన్య ప్రజలు కూడా యీ నాడు ప్రత్యక్షంగా చూస్తున్నారు దీని ఫలితాలను పొందుతున్నారు. అత్యవసర పరిస్థితి ప్రకటించడానికి పూర్వం, ప్రకటించిన తర్వాత ఉన్న ధరలను పోల్చుకుంటే యీ విషయం స్పష్టంగా తెలుస్తుంది. కొన్ని ముఖ్యమైన వస్తువుల నెలసరి సగటు టోకు ధరలను పరిశీలిద్దాం. 1975 మార్చిలో మొదటి రకం వరి ధాన్యం క్వింటాల్ 136 రూపాయల నుండి 1975 డిసెంబరు నాటికి 107 రూపాయలకు తగ్గిపోయింది. అదే విధంగా రెండవరకం వరి ధాన్యం 122 రూపాయలనుండి 88 రూపాయలకు తగ్గిపోయింది. జొన్నలు 159 రూపాయల నుండి 119కి, రాగులు 158 నుండి 88కి, సజ్జలు 172 రూపాయల నుండి 90కి, అదే కాలంలో తగ్గిపోయినవి వీటి ఫలితాలు చిల్లర మార్కెట్ ధరలలో కూడా కనిపించడంవల్ల సామాన్య ప్రజలకు ఆహార వస్తువుల ధరలు పడిపోయాయనే విషయం అర్థవుతున్నది.

దీనికితోడు 20 సూత్రాల పథకం క్రింద నిత్యావసర వస్తువుల పంపిణీ వ్యవస్థను పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం కొత్తచర్యలను తీసుకొంటున్నది. తాలూకా కేంద్రాలలో, సబ్-తాలూకా కేంద్రాలలో, సూపర్ బజార్లను తెరవడం ద్వారా ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడానికి కృషి జరుగుతున్నది. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు 1975 సంవత్సరంలో అనేక సౌకర్యాలు కలిగించడం కూడా జరిగింది. గ్రామాలలో నివసిస్తున్న చిన్న రైతులకు రుణభార విముక్తి చేయటం, ఇతరుల స్థలాలలో ఇండ్లు వేసుకొని నివశిస్తున్న వారికి ఆ యిండ్ల స్థలాలపై యాజమాన్యపు హక్కులను సంక్రమింప జేయడం మొదలగు చర్యల ద్వారా గ్రామీణ ఆర్థికవ్యవస్థలో బీద ప్రజల స్థాయిని పెంచడానికి కృషి జరుగుతున్నది.

రాష్ట్రంలో భూసంస్కరణలు అమలు జరుగుతున్నాయి. వీటిద్వారా లభ్యమైనటువంటి మిగులు భూమిని భూమిలేని వారికి పంపిణీ చేయడం అప్పుడే ప్రారంభమైంది. భూసంస్కరణల ద్వారా సుమారు 5 లక్షల ఎకరాల అదనపు భూమి వెంటనే లభ్యం అవుతుందని అంచనా. అనేక శతాబ్దాలుగా దున్నుకోడానికి, సేద్యం చేసుకోడానికి సెంటు భూమి కూడా లేని బీదలకు హరిజనులకు, వెనుకబడిన వర్గాలకు త్వరలోనే సొంత భూమి యేర్పాటు కాబోతున్నది. దీని ద్వారా వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడి, సంఘంలో వారు కూడా ఇతరులతో పాటు సమాన స్థాయిని పొందడానికి అవకాశం యేర్పడుతుంది.

ఈ విధంగా వివిధ రంగాలలో మనం సాధించిన ప్రగతి మన ఆశయమైన సామ్యవాద వ్యవస్థను త్వరలోనే మనం చేరుకొనేట్లు చేయగలదని నా నమ్మకం. గాంధీజీ కలలుగన్న రామరాజ్యం కనుచూపు దూరంలో కనబడుతున్నది. రాష్ట్ర ఆర్థిక స్తోమత ఈనాడు ఎంతగానో బలపడింది. పెరిగింది. ప్రజల ప్రగతికి ఇది మంచి నిదర్శనం.

మన చరిత్రా - సంస్కృతీ

(8 వ పేజీ నుండి)

పూర్వం మూడవ శతాబ్దంలో ఆంధ్ర రాజ్యాన్ని స్థాపించి, మగధ సామ్రాజ్యాన్ని కూడా ఆక్రమించుకొని ఉత్తర హిందూ దేశానికి కూడా ఆంధ్ర యశస్సును విస్తరింప జేసిన పరాక్రమవంతుడు శ్రీముఖుడు.

శాలివాహనుల తరువాత తెలుగు దేశంలో చెప్పుకోదగిన రాజులు ఇక్ష్వాకు వంశం వారు. ఇక్ష్వాకు రాజ్యాన్ని మన తెలుగు దేశంలో స్థాపించిన మొదటి రాజు వాసిష్ఠిపుత్ర శాంతమూలుడు. ఇక్ష్వాకుల చరిత్రతో పెనవేసుకొని ఉన్న తెలుగువారి ఉత్కృష్ట సంస్కృతికి చిహ్నం నాగార్జునకొండ. ఆ నాడు బౌద్ధులందరికీ నాగార్జునకొండ గొప్ప పుణ్యస్థలం. నాగార్జునాచార్యుని దివ్య తేజంతో ఆ ప్రాంతం ఖండాంతర యశస్సును సంపాదించింది. ఇక్ష్వాకుల తరువాత ఆంధ్రదేశంలో ప్రత్యేకంగా చెప్పవలసినవారు బృహత్పలాయనులు, శాలంకాయనులు, కందార వంశీయులు, విష్ణుకుండిన వంశపు రాజులు. క్రీస్తుశకం అయిదవ శతాబ్ది చివరి భాగం నుంచి ఏడవ శతాబ్ది మొదటి భాగం వరకు దాదాపు నూరు, నూటయాభై సంవత్సరాలు విష్ణు కుండినులు పరిపాలన సాగించినట్లు మనకు తెలుస్తున్నది.

చాళుక్యులు

విష్ణుకుండినుల తరువాత పూర్వాంధ్ర దేశాన్ని పరిపాలించిన వారు చాళుక్యవంశ క్షత్రియులు. వీరు మహారాష్ట్ర ప్రాంతంలోని వాతాపి-ఇప్పటి బాదామి-రాజధానిగా పరిపాలన సాగించిన మహారాజులకు సంబంధించినవారు. రాజరాజ నరేంద్రుని పాలన క్రీ. శ. 1022 లో ప్రారంభమైంది. మన ఆదికవి నన్నయ రాజరాజ నరేంద్రుని ఆస్థానాన్ని అలంకరించాడు. వేంగీ చాళుక్యుల కాలంలోనే తెలుగుభాష క్రమ క్రమంగా అభివృద్ధి పొంద సాగింది. పద్య రచనకు పాదులు పడసాగినవి. రాజరాజ నరేంద్రుని ప్రోత్సాహంతో నన్నయ ప్రారంభించిన ఆంధ్ర మహా భారతమే మనకు దొరికిన మొట్ట మొదటి గ్రంథం.

చాళుక్య రాజ రాజ నరేంద్రుని తరువాత వేంగీ రాజ్యం చిక్కులో పడిపోయింది. కొన్నాళ్ళకు పూర్వాంధ్ర దేశమంతా చిన్న చిన్న నాడులతో, చిన్న చిన్న రాజ్యాలతో ఛిన్నా భిన్నం కాసాగింది. ఇదే సమయాన కన్నడ సామ్రాజ్యానికి సామంతులుగా తెలంగాణాను పరిపాలిస్తున్న కాకతీయ ప్రభువులు స్వతంత్రులవుతున్నారు. ఛిన్నా భిన్న మవుతున్న తెలుగు ప్రాంతాలన్నింటిని స్వాధీనం చేసుకొని ఆ క్లిష్ట సమయంలో కాకతీయ గణపతి దేవ చక్రవర్తి సమగ్రాంధ్ర రాజ్యానికి స్థాపన కావించాడు. తెలుగు వారి చరిత్రలో ఇది నిజంగా చరిత్రాత్మక ఘట్టం.

గణపతిదేవ చక్రవర్తి క్రీ. శ. 1199లో రాజ్యాధికారం స్వీకరించాడు. ఆయన రాజ్యాధికారం చేపట్టిన తరువాత కాకతీయ రాజధాని హనుమకొండ నుండి ఓరుగల్లుకు మారింది. వరంగల్లులో గణపతిదేవ చక్రవర్తి గొప్ప కోటను కట్టించాడు. అది మహమ్మదు ఘోరి దండయాత్రలు జరుపుతున్న సమయం. పరదేశీయుల దండయాత్రలను తట్టుకోవడానికి వీలుగా తెలుగు దేశాన్నంతటినీ ఒక పటిష్ఠమైన మహా సామ్రాజ్యం క్రిందికి తీసుకొచ్చే ప్రయత్నం మొట్ట మొదటిసారి చేసినవాడు గణపతిదేవ చక్రవర్తి.

కాకతీయులు నూటికి నూరు పాళ్ళు స్వచ్ఛమైన తెలుగు రాజులు. గణపతిదేవ మహారాజు ఆంధ్ర చక్రవర్తి. విద్యానాథుడన్నట్లు ఓరుగల్లు ఆంధ్ర నగరం. తెలుగు మహా సామ్రాజ్యాన్ని అరవై రెండు సంవత్సరాలు అఖండ వైభవంతో పరిపాలించాడు గణపతి దేవుడు.

రుద్రమదేవి

గణపతి దేవుని తరువాత కాకతీయ మహా సామ్రాజ్యానికి వీర రుద్రమదేవి మహారాణి అయింది. రుద్రమదేవి తన శక్తి సామర్థ్యాలతో, శౌర్య ప్రతాపాలతో శత్రు సంహారం చేసింది. భారతీయులకు ఝాన్సీరాణిలా తెలుగువారికి వీర రుద్రమదేవి పరాక్రమ పతాక. రుద్రమదేవి మనుమడు ప్రతాపరుద్రదేవ మహారాజు. ఆయన నాయకత్వాన తెలుగు సేనలు గెలిచినేగాక మరింత దక్షిణాన ఉన్న తిరుచినాపల్లి వరకుగల దేశాన్ని హస్తగతం చేసుకొన్నవి. వీరరుద్రునివలె భాసించిన యీ ప్రతాపరుద్ర దేవ చక్రవర్తి కాలంలో ఢిల్లీ సుల్తాను లక్షలాది సైన్యంతో చాలా సార్లు ఓరుగంటి మీదికి దండెత్తి వచ్చాడు. ప్రతాపరుద్రుని కదన పాండితికి తట్టుకోలేక ఢిల్లీ సుల్తానుల సైన్యాలు ఎన్నో సార్లు పిరికిపందల వలె పారిపోవడము జరిగింది. అయితే అదృష్టం కలిసిరాక క్రీ. శ. 1323 లో జరిగిన యుద్ధంలో ప్రతాపరుద్రుడు ఢిల్లీ సుల్తానులకు పట్టుబడ్డాడు. ఓరుగల్లు కోటతోపాటు తెలుగు దేశమంతా ఢిల్లీ సుల్తానుల వశమయింది. తెలుగు తేజము చిన్న బోయింది.

తుంగభద్రానది ప్రాంతంలో, రాయలసీమలో-విజయనగరం రాజధానిగా క్రీ. శ. 1335-36లో హరిహరరాయలు, ఆయన సోదరుడూ స్వతంత్ర తెలుగు రాజ్యాలు స్థాపించారు. తెలుగు దేశం అంతా మహమ్మదీయుల పాలననుండి స్వతంత్రమైంది. కాని కాకతీయుల కాలంలో వలె ఒక్కటిగా రూపొందలేదు. ఇదే సమయాన క్రీ. శ. 1347 లో దక్కనులో బహమనీ రాజ్యం ఏర్పడింది. తెలంగాణాలోని రాచకొండలో రేచర్ల అనవోతానేని రాజ్యం, గుంటూరులోని అద్దంకిలో వేమారెడ్డి రాజ్యం వెలసినవి. పద్నాలుగవ శతాబ్ది చివరి భాగాన తెలుగుదేశం అంతా కొన్ని ముఖ్య రాజ్యాల క్రింద చీలిపోయింది. అందుకే అప్పుడు మనం కాకతీయుల నాటి అఖండ సామ్రాజ్య ప్రాభవానికి నోచుకోలేక పోయాము. అనవోతారెడ్డి రాజధానిని అద్దంకి నుండి కొండవీటికి మార్చాడు.

రెడ్డి రాజుల కాలంలో సంగీతం, సాహిత్యం, నృత్యం వంటి కళలు బాగా పెంపొంది రాణించినవి. రెడ్డి రాజులు సంస్కృతాంధ్రాలు క్షుణ్ణంగా చదివి పాండిత్యం సంపాదించిన వారు.

ఆంధ్ర భోజుడు

సంగమ వంశం వారయిన హరిహరరాయలు, బుక్కరాయలు, వారి సోదరులు కలిసి స్థాపించిన విజయనగర రాజ్యాన్ని నాలుగు వంశాలవారు పాలించారు. వీటిలో ముఖ్యమైనది తుళువ

వంశం. మన ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు, యీ తుళువ వంశానికి చెందినవాడు. తుళువ వంశపు వీర నరసింహరాయలు మరణించిన తరువాత ఆయన స్థానంలో ఆయన తమ్ముడు కృష్ణదేవ రాయలను విజయనగర సింహాసనం ఎక్కించినవాడు సాళువ తిమ్మరుసు మంత్రి. కృష్ణదేవరాయలను సింహాసనం ఎక్కించి మహోన్నతమైన ఆంధ్ర సామ్రాజ్య నిర్మాణానికి రాజమార్గాలను వేసిన తిమ్మరుసు మంత్రి ధీయుక్తికి ప్రతి ఆంధ్రుడు పారవశ్యంతో అంజలి ఘటించక మానడు. ఇదే కాలంలో మన ఆంధ్రులు అన్ని వర్ణాలవారు, దక్షిణ దేశమంతటా వ్యాపించి రాచరికం చేశారు. తుంగభద్రా తీరాన హంపీ విరుపాక్ష క్షేత్రంలో ఆనాడు విజయ నగర సామ్రాజ్యానికి రాజధానిగా విలసిల్లిన విజయనగర వైభవాన్ని గురించి వర్ణించనలవిగాదు విజయనగర వీధుల్లో రత్నాలను రాసులుగా పోసుకొని వర్తకం చేసేవారట. "దేశం తెలుగుదేశం, నేను తెలుగు వల్లభుణ్ణి, దేశభాషలందు తెలుగు లెస్స" అని స్వయంగా కవిపండితుడై చాటిచెప్పిన కృష్ణదేవరాయలు నిజంగానే ఆంధ్రభోజుడు.

గోలకొండ రాజ్యం

విజయనగరం తరువాత ఆంధ్రజాతి అదృష్టదీపం తిరిగి మరొకసారి గోలకొండలో వెలిగింది. గోలకొండ రాజ్య చరిత్ర అంటే మహమ్మదీయ సుల్తానుల పరిపాలనలో ఆంధ్రదేశ చరిత్ర అన్నమాట. బహమనీ రాజ్యం విచ్ఛిన్నం అయిన తరువాత క్రీ. శ. 1512 లో మలిక్ కులీ కుతుబుల్ ముల్క్ సుల్తాను కులి కుతుబ్‌షా అనే పేరుతో గోలకొండను స్వతంత్ర రాజ్యంగా ప్రకటించు కొన్నాడు. కొన్ని సంవత్సరాల తరువాత తూర్పు తీరంలోని పూర్వాంధ్రదేశం గూడా గోలకొండ రాజ్యం ఆధీనంలోకి వచ్చింది. క్రీ. శ. 1550లో గోలకొండ సింహాసనం ఆక్రమించిన ఇబ్రహీం కులీ కుతుబ్‌షా అతని తరువాత 1580 లో రాజ్యానికి వచ్చిన మహమ్మద్ కులీ కుతుబ్‌షా వీరుభయులూ పూర్వాంధ్రదేశాన్ని, రాయలసీమ తూర్పు ప్రాంతాన్ని తమ స్వాధీనం చేసుకొన్నారు. నిజానికి తెలుగుదేశమంతా ఈ విధంగా గోలకొండ రాజ్యం క్రిందికి వచ్చిన తరువాతనే, అంటే ఇబ్రహీం కులీ కుతుబ్‌షా కాలంనుంచే గోలకొండ రాజ్యప్రభ కోహినూరు వజ్రంవలె దేదీప్యమానంగా వెలిగింది గోలకొండ ఆంధ్రరాజ్యమే. గోలకొండ చివర ప్రభువు తానీషాగా ప్రసిద్ధుడైన అబుల్ హసన్ కుతుబ్‌షా. 1672 లో గోలకొండ సింహాసనం ఎక్కిన తానీషాకు మాదన్న ప్రధాన మంత్రి, అక్కన్న సర్వ సైన్యాధిపతి.

సమైక్యత

గోలకొండ పాదుషాల పాలనలో హిందువులూ, మహమ్మదీయులూ సోదరులవలె కలిసి మెలిసి జీవించారు. అప్పుడే సమైక్యతా ప్రధానమైన ఒక ఉత్తమ సంస్కృతికి అంకురార్పణ జరిగింది. గోలకొండ ప్రభువుల కొలువులో తెలుగువారికి చాలా ప్రాధాన్యం ఏర్పడింది. హిందూ పండితులను, కవులను, వేద విద్యలను గూడా కుతుబ్‌షాహి పాదుషాలు గౌరవాభిమానాలతో పోషించారు. తెలుగు రాజ్యమయింది. గోలకొండ పాదుషాలు తెలుగు ప్రభువులయినారు. ఔరంగజేబుకు యీ పరిస్థితి యెంత మాత్రము నచ్చలేదు; ఆయన అసూయకు, దురాక్రమణకు అదే ప్రధాన కారణం.

ఆసఫ్ జాహీలు

దక్కనులోని యితర పరగణాలతో పాటు గోలకొండ రాజ్యంగూడా మొగలాయీ పాలనలోకి వచ్చింది. దక్కనులో మొగలాయీ సుబేదారుల పాలన ప్రారంభమైంది. దక్కనులో సుబేదారుగా ఉన్న చిన్‌కిలిక్ ఖాన్ అనే అసఫ్‌జా నిజాముల్ ముల్క్ 1724 లో ఢిల్లీ పాదుషా సైన్యాలను ఓడించి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. అప్పటినుంచి దక్కన్‌లో అసఫ్‌జా నిజాముల్ ముల్క్ స్వతంత్రపాలన ప్రారంభమైంది. ఈయన రాజధాని మన హైదరాబాద్. అంటే మన సకలాంధ్రదేశం ఆ నాటినుంచి అసఫ్‌జా వంశంవారి పాలనలోకి వచ్చిందన్నమాట. మొదటి అసఫ్‌జా మరణించిన తరువాత నుంచి సింహాసనం కొరకు తగవులు ప్రారంభమైనవి. ఈ తగవులలో ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు జోక్యం చేసుకోవటం, కుట్రలు పన్నడం మొదలైనవి జరిగినవి. ఈ కుట్రల ఫలితంగానే సలాబత్‌జంగ్ కాలంలో తూర్పు ఆంధ్రదేశమూ (సర్కారు జిల్లాలు), ఆటు తరువాత నిజామలీ కాలంలో టిప్పు సుల్తానుతో 1799 లో జరిగిన శ్రీరంగ పట్నం యుద్ధంలో రాయలసీమ ప్రాంతమూ ఇంగ్లీషువారి వశం లోకి వచ్చినవి అప్పటి వరకు గోలకొండ రాజ్యంలోనూ, తరువాత అసఫ్‌జాల హైదరాబాద్ రాజ్యంలోనూ ఒకే పాలన క్రింద ఉన్న తెలుగుదేశం 1799 లో తిరిగి రెండు ముక్కలయింది. ఇందులో ఒక భాగం అయిన తెలంగాణా హైదరాబాద్ రాజ్యంలో మిగిలిపోయింది. మరొక భాగం ఇంగ్లీషువారి పాలన క్రిందకు వెళ్ళింది. పరదేశీయుల రాజ్య కాంక్షకూ, తదనుగుణమైన వారి కుట్రలకూ ప్రతిఫలంగా ఒక గుండె రెండు ముక్కలైనట్లు తెలుగు జాతి రెండుగా చీలింది.

సాహిత్య వీథుల్లో

నన్నయ ఆంధ్రీకరించిన రెండున్నర పర్వాల భారతమే మనకు గ్రంథ రూపంలో దొరికిన మొట్ట మొదటి తెనుగు రచన. నన్నయ తరువాత 12 వ శతాబ్ది ఆరంభంలో మనకు మరొక చక్కని రచన లభ్యమైంది. ఇది నన్నెచోడుడు రచించిన కుమార సంభవం. నన్నెచోడుని తరువాత వచ్చినవాడు మల్లికార్జున పండితారాధ్యుడు; శివభక్తి పూరితాలైన పండితారాధ్యుని రచనలు తరువాతి కాలపు శివకవులకు ఆవేశాన్ని కల్గించినవి. నన్నయ ప్రారంభించిన భారతాంధ్రీకరణాన్ని చేపట్టి 13వ శతాబ్దంలో తిక్కన మహాకవి పదిహేను పర్వాలు పూరించాడు. నన్నయ పూర్తి చేయకుండా వదలిన అరణ్య పర్వంలోని కొంత భాగాన్ని పద్నాలుగో శతాబ్దంలో ఎఱ్ఱాప్రగడ పూర్తిచేశాడు. ఆంధ్రభాషలో, సాహిత్యంలో ఈ కవిత్రయంవారి స్థానాన్ని గూర్చి ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. పద్నాలుగో శతాబ్దం నాటిదే మరొక మంచి కావ్యం నాచనసోముని ఉత్తర హరివంశం.

శ్రీనాథ కవి సార్వభౌమునితో తెలుగు సాహిత్యరంగంలో కావ్య యుగం మొదలైంది. ఆంధ్రభోజుడు శ్రీ కృష్ణదేవరాయలు ప్రవేశంతో తెలుగు సాహిత్యసీమలో ప్రబంధాల మందమారుతాలు వీచసాగినవి. అల్లసాని పెద్దన, ముక్కుతిమ్మన పింగళి సూరన, తెనాలి రామకృష్ణుని వంటి అష్టదిగ్గజాలు అడ్డులేకుండా సంచరించినకాలం ఇది తరువాత 17 వ శతాబ్దంలో తంజావూరి రఘునాథ రాయల కాలంలో గూడా తెలుగు క్రొత్త సొగసుల్ని విరజిమ్మింది. రఘునాథుడు స్వయంగా కవి. ఆయన ఆస్థానంలోని చేమకూర వెంకటకవి, ముద్దు పళని, రంగాజమ్మ ప్రత్యేకంగా గణించవలసినవారు...వీరు తెలుగు సాహిత్య పిపాసువులందరికీ చవులూరించే వారు ఇటు తరువాత వచ్చినవారే మన క్షేత్రయ్య, త్యాగయ్య సంగీత సాహిత్యాలను సమానంగా పంచిపెట్టిన వీరి కృషి తెలుగు వారికి గర్వకారణం. చిక్కని, తెలుగు నుడికారంతో ఆట వెలదుల్ని అలంకరించి మనను ముగ్ధుల్ని చేస్తున్న మహాకవి వేమన పదెనిమిదవ శతాబ్దం వాడు. ఉద్దండులు, వైతాళికులు అయిన కందుకూరి, గురజాడ, గిడుగువంటి వారల రాకతో పందొమ్మిదవ శతాబ్దంలో మన సాహిత్యరంగాన పునరుజ్జీవనం కలిగింది; అపూర్వమైన చైతన్యం వెల్లివిరిసింది; అధునికత్వం అంకురించింది. ఇదే నూతన వికాసం మన సాంస్కృతిక, సామాజిక రంగాల్లో సైతం ప్రస్ఫుటంగా ప్రతిబింబించింది. దామెర్ల రామారావు, అడివి బాపిరాజుల వంటి చిత్రకారులు బళ్ళారి రాఘవ, హరి ప్రసాదరావు వంటి నటులూ, కాశీనాథుని నాగేశ్వరరావు, కల్లూరి సుబ్బారావు వంటి కళాప్రియులూ, రాజకీయవేత్తలూ, సర్వేపల్లి రాధాకృష్ణన్, కట్టమంచి రామలింగారెడ్డి వంటి సాహితీ తత్వవేత్తలూ తెలుగు దేశంలో సాంస్కృతిక వికాసానికి ఎనలేని సేవ చేశారు.

ప్రత్యేక రాష్ట్రవాంఛ

సాంస్కృతిక పునరుజ్జీవనం ఫలితంగా తెలుగు దేశంలోని అన్ని రంగాల్లోనూ నూతన చైతన్యం పొంగివచ్చింది. రాజకీయ, సామాజిక రంగాలలో యీ చైతన్యం మరింత ప్రస్ఫుటంగా కన్పించింది. 1913 లో బాపట్లలో ఆంధ్రమహాసభ జరిగింది ఈ సభలో ఆంధ్రులలోని జాతీయభావాలు స్పష్టంగా జాగృతమైనవి నిద్రాణమై ఉన్నజాతి లేచి నిల్చున్నట్లుగా కన్పించింది. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలనే ఉద్యమం బాపట్లసభలోనే అంకురించింది. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుతూ 1915 లో విశాఖపట్నంలో జరిగిన ఆంధ్రమహాసభ తీర్మానించింది భాషా ప్రాతిపదికమీద భారత రాష్ట్రాలను పునర్విభజించాలన్న వాదాన్ని మొట్ట మొదట ప్రతిపాదించినది తెలుగువారే. ప్రభుత్వ పరిపాలనలో సామాన్య ప్రజలు భాగస్వాములు కావాలన్న కోర్కె ప్రత్యేకరాష్ట్రవాంఛకు పునాది.


దేశభక్త కొండ వెంకటప్పయ్య పంతులు, ప్రకాశం, పట్టాభి ప్రభృతులైన జాతీయనాయకులు ఆంధ్రోద్యమానికి మూలస్తంభాలుగా నిలిచారు. ఆంధ్రోద్యమంతో పాటు 1920 నుండి ఆంధ్రదేశంలో గాంధీజీ నాయకత్వాన జాతీయ ఉద్యమం గూడా విజృంభించింది. జాతీయ ఉద్యమంలోని భాగంగానే వివిధ స్వరూపాలలో రాజకీయ ఉద్యమాలు మొదలైనవి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత 1952 లో మొట్టమొదటి సాధారణ ఎన్నికలు జరిగినవి. ఈ ఎన్నికల తరువాత ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఆందోళన రెట్టింపు బలంతో ఎగసి వచ్చింది. ఏ ఎనిమిది రోజుల ఉపవాసదీక్ష తరువాత అమరజీవి పొట్టి శ్రీరాములుగారు ఆంధ్రరాష్ట్ర స్థాపన కొరకు 1952 డిశంబరు 15వ తేదీన ఆత్మార్పణ కావించారు. చివరికి యీ అమరజీవి ఆశయం ఫలించింది 1953 సంవత్సరం అక్టోబరు ఒకటవ తేదీన ఆంధ్రరాష్ట్రం సిద్ధించింది.

తెలంగాణాలో......


బ్రిటిష్‌వారి పాలనలో ఉన్న ఆంధ్రప్రాంతంలో ఆంధ్రోద్యమం కొనసాగినట్లే నిజాం రాచరిక వ్యవస్థలో ఉన్న తెలంగాణంలో గూడా ఆంధ్రోద్యమం విజృంభించింది. 1901వ సంవత్సరంలో హైదరాబాద్ నగరంలో కొమర్రాజు వెంకట లక్ష్మణరావు ప్రోత్సాహంతో శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా ఆంధ్ర జనసంఘం తెలంగాణా ఆంధ్రోద్యమ చరిత్రలో మహత్తరమైన సంఘటన. ఆంధ్రజన సంఘస్థాపన సమావేశంలో మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, ఆదిరాజు వీరభద్రరావు మొదలైన పెద్దలు పాల్గొన్నారు శ్రీ కొండా వెంకట రంగారెడ్డిగారి అధ్యక్షతన1922లో ఆంధ్రజన సంఘం ఒక కార్యవర్గాన్ని ఎన్నుకొని పని ప్రారంభించింది. నిజాం రాష్ట్రంలోని తెలుగువారి అభివృద్ధి కొరకు ప్రయత్నించడం ఆంధ్ర జనసంఘం ప్రధాన ఆశయం. జోగిపేటలో 1930లో మొట్టమొదటి ఆంధ్ర మహాసభ జరిగింది. ఈ సభకు కీ. శే సురవరం ప్రతాపరెడ్డిగారు అధ్యక్షులు ఈ మహాసభకు ఎంతో కష్టంమీద అనుమతి దొరికింది. ఈ సభతో పాటు మొట్టమొదటి ఆంధ్ర మహిళాసభ జరిగింది ఆంధ్ర మహాసభలో రాజకీయాల ప్రసక్తి ఉండరాదని నిజాం ప్రభుత్వం ఒక పెద్ద షరతు విధించింది. 1930 నుండి 1946 వరకు మొత్తం పదమూడు ఆంధ్ర మహాసభ మావేశాలు జరిగినవి. 1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆరవ ఆంధ్ర మహాసభ చరిత్రాత్మక మైనట్టిది. హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు ప్రాంతంలో నివసించే వారందరూ, వారి మాతృభాష ఏదైనప్పటికీ, ఆంధ్రులేనని ఈ సమావేశం నిర్ణయించింది

ఆంధ్రప్రదేశ్

పోలీసు చర్యతరువాత ఘనపురంలో జరిగిన తెలంగాణా ప్రాంత కాంగ్రెసు సమావేశంలో ఆంధ్ర–తెలంగాణాల ఏకీకరణ జరగాలని తీర్మానించ బడింది. తరువాత నిజామాబాద్‌లో జరిగిన ప్రదేశ్ కాంగ్రెస్ సమావేశంలో గూడా ఇటువంటి తీర్మానమే ఆమోదాన్ని పొందింది ఆ తరువాత విశాలాంధ్రోద్యమం మొదలైంది. విశాలాంధ్ర మహాసభ ఏర్పడింది. తెలంగాణాలో విశాలాంధ్రోద్యమం కొనసాగింది. 1956 నవంబరు ఒకటవ తేదీన ఆంధ్ర–తెలంగాణా విలీనీకరణ జరిగి ఆంధ్రప్రదేశ్ అవతరించింది. నూటయేబది సంవత్సరాల క్రిందట విడిపోయిన తెలుగుదేశం తిరిగి ఒక్కటయింది. ఇది తెలుగువారి చరిత్రలో మహత్తరమైన చరిత్రాత్మక సంఘటన. ★



తెలుగోడి గోడు
-మల్లిక్
మొన్నో తెలుగు జానపదం సినిమా చూశానోయ్... పరమ చెత్తగా ఉంది... నిన్న ఇంగ్లీషు సినిమాకి వెళ్లా... డైలాగులర్థం కాలేగానీ హబ్బ... ఏం గొప్పగా ఉందనీ...
!!
తెలుగోడికి జై...
నమస్తే...నా పేరు విలియమ్స్...నేను అమెరికానుండి వచ్చినాను... తెలుగన్న నాకు చాల యిష్టము
ఓ ఐసీ... గ్లాడ్ టు మీట్ యూ...
నిన్నేదైనా వరం కోరుకోమని అంటే నీప్రక్క వాడు నాశనం కావాలని కోర్తావేం?.. నువ్వు తెలుగువాడివా భక్తా...
Mallik


మనిద్దరం మాట్లాడుతుంటే వాడెవడలా చెవులు రిక్కించి వింటున్నాడు!! మ్యానర్‌లెస్ ఫెలో
తెలుగు వాడేమోలే
ఒరేయ్... ఒరేయ్... ఎందుకురా
తెలుగువాళ్లలా అలా దెబ్బలాడుకుంటున్నారు?...
తెలుగోడికో జై...
నువ్వు ఉద్యోగంలో చేరిన దగ్గర నుండీ గమనిస్తున్నాను... నువ్వు మాట్లాడడమే గాని పని చెయ్యడం కనబడ్డం లేదు- నువ్వు తెలుగు వాడివనుకుంటూ...
IN
నాకు ప్రమోషన్ రాకపోతేమానే... పరమ చవట... వాడికెలా వచ్చింది గురూ...
Mallik

క్రీడా రంగంలో

తెలుగువారి పాత్ర

శ్రీ శార్ద్ ప్రసాద్

1932 లోనే తెలుగు క్రీడాకారుడికి అంతర్జాతీయ కీర్తి రావడం ప్రారంభమయింది. క్రికెట్ ప్రపంచంలోకి భారతదేశం ఆ రోజున కఠారి కనకయ్యా నాయుడు నాయకత్వంలో అడుగు పెట్టింది. "సి.కె." అనే రెండు పొడి అక్షరాలు క్రికెట్ కింగ్‌గా రూపాంతరం పొందాయి తెలుగు క్రీడాకారుడి పురోగమనం ఆ రోజునే మొదలయింది. 1953లో స్వరాష్ట్రావతరణ అనంతరం రంజీట్రోఫీ పోటీలలో తొలిసారిగా పాల్గొన్న ఆంధ్ర క్రికెట్ జట్టుకి నాయుడు నాయకత్వం వహించడం తెలుగువారు చేసుకున్న అదృష్టం. 1932 నుంచీ కాలం నలభయినాలుగు సంవత్సరాలు జరిగింది. ఈ నలభయినాలుగు సంవత్సరాలలో గణనీయమయిన విజయాలు సాధించిన క్రీడాకారులెందరో తెలుగు తల్లికి ఘనకీర్తి తెచ్చారు. ఆ విజయాలు ఒకసారి గుర్తుకు తెచ్చుకుంటే తెలుగు జాతికి కావలసిన ఉత్తేజం లభిస్తుంది. భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించగల క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్ నుంచి రాక మానరు

"డబుల్ ఇంటర్నేషనల్" విజ్జీ

ఆఫ్‌స్పిన్ బౌలర్‌గా ప్రఖ్యాతి గాంచిన కఠారి సుబ్బయ్యా నాయుడు అన్న సి. కె. పేరుమీద నిలబడ్డ ఆటగాడు కాదు. క్రికెట్ భిక్ష పెట్టాడు. 'డబుల్ ఇంటర్నేషనల్'గా కీర్తి సంపాదించిన కోటతామస్వామి నాలుగు పదులు దాటిన వయసుతో టెస్ట్ పోటీలో పాల్గొని ఇంగ్లండు మీద బాటింగ్ సరాసరిలో మొదటివాడుగా రావడం చూస్తే ఒక తెలుగువాడే వయసుని జయించగలదేమోననిపిస్తుంది.




క్రికెట్‌లో తెలుగువారొక్కడే వయస్సును జయించగలడేమో!

జాతీయ పోటీలలో బౌలర్‌గా సి.యస్. నెలకొల్పిన రికార్డు నిన్నటి వరకూ చెక్కు చెదరలేదు. క్రికెట్ భారత దేశంలో ప్రజాదరణకి నోచుకోడానికి ప్రధాన కారకుడు గూడ మన విజ్జీయే. 1936 లో ఇంగ్లండు పర్యటించిన భారత క్రికెట్ జట్టుకి విజ్జీ నాయకత్వం వహించడమే కాక రేడియో ప్రత్యక్ష వ్యాఖ్యానాలలో ప్రత్యేకతని సంపాదించుకున్న ఈ తెలుగు బిడ్డ ఎందరో తెలుగు యువకులకి

హైద్రాబాద్ ప్రాంతం నుంచి జాతీయ రంగం మీదికి అడుగు పెట్టిన గులాం అహమ్మద్ భారత దేశానికి సారథ్యం వహించాడు. జయసింహ బాట్స్‌మన్ గా టెస్ట్ పోటీలలో రాణించి అన్ని తరహాల బౌలింగ్‌ని అవలీలగా ఎదుర్కొన్నాడు. ఆబిద్ అలీ ప్రత్యర్థులకి సింహస్వప్నంగా టెస్ట్ పోటీలలో నిలిచాడు. పాల్గొన్న మొదటి టెస్ట్‌లోనే సెంచరీ సాధించిన ఘనత అబ్బాసలీ

బేగ్‌కి దేశానికి దక్కింది. ఈ రోజున దేశంలో అగ్రశ్రేణి వికెట్ కీపర్లలో కృష్ణమూర్తి ఒకరు. టెస్టు పోటీలలో పాల్గొన్న మరొక ఆటగాడు ప్రారంభ బౌలర్ గోవిందరాజ్.

అంతర్ రాష్ట్ర పాఠశాలల పోటీలలోనూ, దక్షిణాది రాష్ట్రాలకి రంజీట్రాఫీ పోటీలలో పాల్గొనని యువ ఆటగాళ్ళకి జరిగే రామచంద్రరావు పోటీలలోనూ ఆంధ్రప్రదేశ్ కి చెందిన విద్యార్థులు, యువకులు సర్వతోముఖ ప్రతిభ కనపరుస్తూ సి.కె. వారపత్వాన్ని నిలుపుతున్నారు.




క్రికెట్ తర్వాత తెలుగువారు ముందడుగు వేసిన క్రీడగా టెన్నిస్‌నే చెప్పుకోవాలి. కోట రామస్వామి క్రికెట్‌లోనే కాక టెన్నిస్‌లోనూ అంతర్జాతీయ కీర్తి సంపాదించారు. డేవిస్‌కప్ పోటీలలో పాల్గొన్న భారత జట్టులో రామస్వామి ప్రముఖ సభ్యుడు. వింబుల్డన్ పోటీలలో పాల్గొన్న తొలి ఆంధ్రుడు. నల్లం రెడ్డి కృష్ణస్వామి, దుగ్గిరాల పూర్ణచందరావు, నారుమంచి నారాయణమూర్తి, విష్ణుమోహన్, యం.వి.జి. అప్పారావు, భుజంగరావు జాతీయ స్థాయిలో రాణించిన ప్రముఖ టెన్నిస్ ఆటగాళ్ళు. శిక్షకుడుగా టంగుటూరి అచ్యుత రామరావు విజయ అమృతరాజ్‌ని తీర్చిదిద్దాడు. ఈ సంవత్సరం విదేశాలు పర్యటించిన భారత జూనియర్ జట్టులో తెలుగు యువకుడు భూపతి వుండడం గర్వించదగ్గ విషయం. అనతి కాలంలో విదేశ పర్యటన అనుభవంతో భూపతి టెన్నిస్‌లో ముందడుగు వేయగలడని ఆశించవచ్చు.

హైదరాబాద్ ఫుట్‌బాల్

"కాకినాడ అప్పారావు" పేరు వినని ఫుట్‌బాల్ అభిమాని దేశంలో వుండడు. కలకత్తాని భారతదేశంలో ప్రధాన ఫుట్‌బాల్ కేంద్రంగా పేర్కొంటారు. అక్కడ లక్షలాది ఫుట్‌బాల్ అభిమానులని తన ఆటతో అలరించిన అప్పారావు భారతజట్టులో సభ్యుడుగా విదేశాలు పర్యటించాడు. అప్పారావు స్థాయి నందుకున్న వరహాలు, అప్పలరాజు కలకత్తాలో ఫుట్‌బాల్ అభిమానులకు కనుల విందు చేయడమే కాక సతీష్ ట్రాఫీ పోటీలలో పాల్గొని ప్రముఖ ఆటగాళ్ళుగా రాణించారు. అప్పలరాజు ప్రీ-ఒలంపిక్ పోటీలలో పాల్గొని ఆరు గోలులు చేయడం విశేషం. ఈ రోజున చిన్నారావు రెడ్డి అప్పలరాజు స్థానంలో వుండడం గర్వించదగ్గ విషయం.

భారత దేశంలో కలకత్తాకి వున్న విశిష్టత హైదరాబాద్‌కీ ఫుట్‌బాల్‌లో వుంది. దేశంలో ప్రధానమయిన ఫుట్‌బాల్ పోటీలు —డ్యూరాండ్, డి.సి.యం. రోవర్స్—ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టు నెగ్గగా జాతీయ పోటీలలోనూ ఆంధ్రప్రదేశ్ విజయం సాధించింది.



అత్యంత ఆసక్తికరంగా జరుగుతున్న ఆటల పోటీలు

హైదరాబాద్ కేంద్రంలో ఎందరో ఆటగాళ్ళని తీర్చిదిద్దిన ఖ్యాతి రహీంది. రహీంని స్మరించుకోని నాడు ఆంధ్రప్రదేశ్‌కి ఫుట్‌బాల్‌లో భవిష్యత్ వుండదు.

టేబుల్ టెన్నిస్‌లో రైల్వేకి చెందిన గూడెలూరి జగన్నాథ్ 1971 లో జాతీయ పోటీనెగ్గగా, ఆంధ్రప్రదేశ్‌కి చెందిన మీర్ ఖాసీం అలీ జాతీయ పోటీలో రెండుసార్లు విజయం సాధించాడు. ఈ రోజున అశోక్, దిలీప్‌రాజ్ సక్సేనా ఆంధ్రప్రదేశ్ దేశంలో ప్రముఖ "టేబుల్ టెన్నిస్"రాష్ట్రంగా వుండడంలో ప్రధాన పాత్ర

వహిస్తున్నారు. అనేక విజయాలు సాధిస్తున్నారు. టేబుల్ టెన్నిస్‌లో తెలుగు వనితలూ వెనక ఉండలేదనే సత్యాన్ని బేబీ ఉష నిరూపిస్తోంది. పదమూడు సంవత్సరాల ఈ బాలిక దేశంలో కొద్ది మంది ప్రముఖ ఆటగత్తెలలో ఒకరుగా అప్పుడే నిలిచింది.

శరీర సౌష్ఠవ పోటీలలో 'ఆసియాశ్రీ' అర్జా జనార్దన్‌రావు 12 సంవత్సరాలు చెక్కు చెదరకుండా వున్న రికార్డుని నెలకొల్పిన వెయిట్ లిఫ్టర్ కామినేని ఈశ్వరరావు, వెయిట్ లిఫ్టింగ్‌లో తిరుగు లేని వాడినని నిరూపించుకున్న దండమూడి రాజగోపాల్ భారత దేశం గర్వించదగ్గ తెలుగు క్రీడాకారులు.

వాలీబాల్‌లో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ఆంధ్రుడు బుచ్చి రామయ్య. బుచ్చిరామయ్య వేసిన బాటలో 'అర్జున' అవార్డు విజేత శ్యాంసుందర్‌తోపాటు రమణారావూ ఈ రోజున పురోగమిస్తున్నారు. అర్జున అవార్డు అందుకున్న తొలి తెలుగు వనిత శ్రీమతి మాలినీ రెడ్డి. వాలీబాల్‌లో భారతీయ మహిళలలో ప్రథమ స్థానం శ్రీమతి రెడ్డికే దక్కుతుంది.

బాస్కెట్ బాల్‌లో మాథ్యూ సత్యబాబు దేశంలో ప్రముఖ ఆటగాడుగా గుర్తింపబడ్డాడు. పిచ్చయ్య అర్జున అవార్డు అందుకొని బాల్ బ్యాడ్‌మింటన్‌కే గుర్తింపు తీసుకొచ్చారు.

మొదటి జాతీయ చదరంగం ఛాంపియన్ శ్రీ దర్భా వెంకయ్య

మేథావుల క్రీడ క్రింద పరిగణింపబడే చదరంగంలో తెలుగు వారు సాధించిన విజయాలు దర్భా వెంకయ్యతో ప్రారంభమయ్యాయి. దర్భా వెంకయ్య భారత దేశపు మొదటి జాతీయ ఛాంపియన్. ఆంధ్ర ప్రదేశ్‌కి చెందిన ఆటగాళ్ళు చదరంగంలో అసమాన ప్రతిభ ప్రదర్శించారు.


అథ్లెటిక్స్‌లో జాతీయ ప్రమాణాన్ని తెలుగు బాలిక జయశ్రీ అందుకోవడం గర్వించదగ్గ విషయం. ఈ పరుగు ప్రవీణురాలు రానున్న సంవత్సరాలలో అపూర్వ విజయం సాధించవచ్చు.

స్పోర్ట్స్ కౌన్సిల్ పాత్ర

1958 లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ కౌన్సిల్ వివిధ క్రీడా సంఘాల అవసరాలు గుర్తిస్తూ, వివిధ క్రీడల్లో శిక్షకులని నియమిస్తూ రాష్ట్రంలో క్రీడల స్థాయి పెరగడానికి కృషి చేస్తూంది. గ్రామీణ ప్రాంతాలలో క్రీడల ప్రాచుర్యానికి స్పోర్ట్స్ కౌన్సిల్ ఎంతో శ్రద్ధ తీసుకొంటూంది. దేశానికి గ్రామాలే వెన్నెముకని మహాత్ముడు చెప్పాడు. గ్రామీణ ప్రాంతాల్లోనే ఆరోగ్య వంతులైన బాలబాలికలు కనిపిస్తారు. వీరికి ఆటలమీద అభిరుచి కలిగించి, ఏ క్రీడలో ఎవరు ప్రకాశించగలరో గుర్తించి వారికి సరియయిన శిక్షణ ఇస్తూ స్పోర్ట్స్ కౌన్సిల్ చేస్తోన్న కృషిని అభినందించాలి. అఖిల భారత గ్రామీణ పోటీలలో ఆంధ్రప్రదేశానికి లభించిన విజయాలు స్పోర్ట్స్ కౌన్సిల్ కృషికి నిదర్శనంగా నిలుస్తాయి.

క్రీడారంగంలో ప్రముఖులకి ప్రతి సంవత్సరమూ అర్జున అవార్డు ఇచ్చి సత్కరిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్‌కి చెందిన పది మంది క్రీడాకారులకి ఈ విశేష గౌరవం లభించింది. మరెందరికో లభిస్తుంది. తెలుగు క్రీడాకారుడు పురోగమిస్తున్నాడు. సి.కె. పేరు తెలుగు క్రీడాకారుడికి కావలసిన ఉత్తేజం అందిస్తోంది. క్రీడా రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడానికి జరుగుతోన్న కృషి ఫలిస్తుంది.





డాక్టర్ దాశరథి

ఇదువది యేండ్లకాలము గమించినదాంధ్ర సవిత్రి ఏక మం
దిరమున వాసముండి; మనవీ తెలుగిల్లని గొంతువిప్పి సం
బరమున చెప్పుకోగలుగు భాగ్యము కల్గిన నాటిమాట నా
స్ఫురణకు వచ్చినంతటనె పొంగును క్షీరపయోధి గుండెలో

ఆంధ్రమాతృశీర్షమ్మున అందగించు
రత్నమాణిక్య ఖచిత చిరత్నమకుట
కాంతిపుంజమ్ము ప్రజలను కాచుగాక!
పుత్రపుత్రికాగణమును బ్రోచుగాక!

ఐకమత్య పతాకలో ఆంధ్రజనత
పయనమైనది ప్రత్యూషాంబరముపైపు
అమ్మశీర్షానగల కిరీటమ్ము జూచి
బాలభాస్కరుడని నేను భ్రమసినాను

ఇది ఉదయాచలాగ్రమున నెత్తిన స్వర్ణపతాక; భామినీ
మృదుకరముల్ ధరించినవి దీనిని; పంటపొలాల గట్లపై
కదలిన కామినీ జన నికాయము తెల్లుదనాలు చిమ్ముచు
న్నది జగమంతటన్; తెలుగునాట మహోత్సవ మీ దినమ్మునన్

నన్ను గెలిపించినట్టి అన్నలకు మ్రొక్కి
ఏకతా పతాకమ్ముల నెగుర వైచి
అందరొకచోట నడచుచున్నట్టి వేళ
వారితో నేను పయనింతు ప్రగతివీథి.

తెలుగు గడ్డపై స్వాతంత్ర్యోద్యమం

శ్రీ మాదల వీరభద్ర రావు

వేల మైళ్ళ దూరాన గల ఆంగ్లేయులు కోట్ల జనాభా గలిగిన సువిశాల భారతభూమిని 200 ఏండ్ల పైగా పరిపాలించడం ఎవ్వరికయినా ఆశ్చర్యం కలిగించకపోదు. కాని బ్రిటిష్, సామ్రాజ్యవాదుల కుటిల నీతి కిది నిదర్శనంగా చరిత్రలో నిలిచివుంది. పర ప్రభుత్వ పాలనక్రింద, వారి విద్యాలయాలలోనే శిక్షణ పొందిన భారతీయ విద్యావంతులు వారికి దాసానుదాసులై అడుగులకు మడుగులొత్తుతుండగా, మరికొందరు జాతీయ స్వాతంత్ర్య భావప్రేరితులయి స్వరాజ్య సమరం సాగించారు. నిద్రాణమైన భారత జాతిని మేల్కొల్పారు. ఈ పర్యవసానమే మన స్వాతంత్ర్యోద్యమం. స్వరాజ్య సంరంభంలో ఆంధ్రదేశం అత్యంత ప్రముఖ పాత్రను నిర్వహించింది. దేశ దాస్య విముక్తి కోసం వివిధ దశలలో జరిగిన స్వాతంత్ర్యోద్యమాలన్నింటిలోను ఆంధ్ర ప్రజలు దీక్షతో పాల్గొన్నారు.

వందేమాతరం ఉద్యమం

'స్వరాజ్యం నా జన్మహక్కు' అన్న లోకమాన్య బాలగంగాధరతిలక్ నినాదం జాతీయ కాంగ్రెస్‌కు, స్వరాజ్య ఉద్యమానికి జవసత్వాలు కలిగించింది. బెంగాలు విభజనకు వ్యతిరేకంగా వంగ దేశంలో ప్రజ్వరిల్లిన 'వందేమాతరం' ఉద్యమప్రభావం, ఆంధ్ర ప్రదేశంపై కూడ ప్రసరించి 1907లో కలకత్తా నుండి మద్రాసు వెళ్ళుతూ, ఆంధ్రప్రదేశ సభలలో శ్రీ బిపిన్ చంద్రపాల్ గావించిన ప్రసంగాలు ఇక్కడ నూతన రాజకీయ చైతన్యాన్ని కలిగించినవి.

రాజమహేంద్రవరం బోధనాభ్యసన కళాశాల విద్యార్థులు పవిత్రగోదావరి నదిలో స్నానంచేసి, స్వరాజ్యసాధనకు దీక్షాకంకణ ధారులైనారు. ప్రభుత్వం గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు బందేపూడి నారాయణరావుగార్లను జైళ్లలో నిర్బంధించింది. 1906లో కలకత్తా కాంగ్రెస్‌కు వెళ్ళివచ్చిన కొండవెంకటప్పయ్య, మునగాల హనుమంతరావు గారు న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి, కౌతా శ్రీరామ శాస్త్రి, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య గార్లతో కలిసి బందరులో జాతీయ కళాశాలను స్థాపించారు. తెలుగుదేశంలో స్వదేశ వ్రత సందేశం వ్యాపించింది. గుంటూరులో 'దేశాభిమాని', బెజవాడలో 'స్వరాజ్య' బందరులో 'నవయుగ' రాజమహేంద్రవరంలో 'ఆంధ్రకేసరి' మున్నగు పత్రికలు వెలసినవి.


1916లో దివ్యజ్ఞాన సమాజానికి అధ్యక్షురాలై ఆనీ బిసెంట్ భారతీయులకు స్వపరిపాలన కావాలని 'హోంరూల్' ఆందోళన



ప్రారంభించారు. మోతీలాల్ నెహ్రూ నాయకత్వాన దేశంలో 'స్వరాజ్య పార్టీ' ఏర్పడింది. హరిసర్వోత్తమరావుగారు కార్యదర్శిగా ఆంధ్ర



గద్దె రంగయ్య నాయుడు



ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ కార్యవర్గం

శాఖ నేర్పరిచారు. 53 ఉపశాఖలను కూడా నిర్మాణం గావించి వీరు హోంరూల్ ప్రచారం చేశారు. అనేక కరపత్రాలు ప్రకటించి రాజకీయ ప్రబోధం గావించారు.

1914-18 ప్రథమ ప్రపంచయుద్ధకాలంలో ధన ధాన్య సైనిక సహాయం చేసిన భారతీయులకు స్వపరిపాలనను ప్రసాదించని బ్రిటిష్ ప్రభుత్వం పరిపాలన పైన ఇక్కడి విద్యావంతులలో అసంతృప్తి హెచ్చు పెరిగింది.

జలియన్ వాలాబాగ్ క్రూర దురంతాలను, రౌలత్ చట్టం దుర్నీతిని ఖండించి గాంధీమహాత్ముడు ప్రభుత్వంతో సహాయనిరాకరణకు పూనుకున్నారు. దేశమంతటా హర్తాళ్లు జరిగినవి. గాంధీజీ బార్డోలీలో పన్నుల నిరాకరణ ప్రారంభించారు.

సహా గ్రామోద్యోగులు రాజీనామా చేశారు, న్యాయవాదులు వృత్తిని విసర్జించి ఉద్యమానికి నాయకత్వం వహించారు, విద్యార్థులు పాఠశాలలను బహిష్కరించారు.

'దేశభక్త' కొండ వెంకటప్పయ్య గారి అధ్వర్యాన ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారు నడిపిన చీరాల-పేరాల పురనిర్గమనోద్యమం; బారిస్టర్ ఉన్నవ లక్ష్మీ నారాయణ నాయకత్వాన జరిగిన పల్నాటి సీమలోని పుల్లరి సత్యాగ్రహం, గొల్లపూడి సీతారామ శాస్త్రి, పర్వతనేని వీరయ్య చౌదరి ప్రత్యక్ష నాయకత్వాన పెదనందిపాడు ఫిర్కా పన్నుల నిరాకరణోద్యమం, ఈ మహోద్యమంలో చిరస్మరణీయ ఘట్టాలు.

గుంటూరు జిల్లాలో జరిగిన పన్నులనిరాకరణోద్యమం బ్రిటిష్ సామ్రాజ్య పునాదులనే కదిల్చి వేసినదని, అప్పటి గవర్నరు వాపోయాడు. పశ్చిమ గోదావరిలోని భీమవరం ప్రాంతంలో, కడపజిల్లాలోని రాయచోటి ప్రాంతంలో కూడా ఈ ఉద్యమం వ్యాపించి, రైతులు అరెస్టు చేయబడినారు. పల్నాడులో మించాలపాడు గ్రామపెద్ద కన్నెగంటి హనుమంతు పోలీస్ కాల్పులకు బలియైనారు. 1921 మార్చిలో అ.భా. కాంగ్రెస్ మహాసభ బెజవాడలో జరగడం, అనంతరం మహాత్ముని ఆంధ్రదేశ పర్యటన తెలుగు దేశంలో గొప్పరాజకీయ సంచలనానికి కారణభూతమైనవి.

అప్పట్లో జరిగిన ఉద్యమాన్ని గురించి 'ఆంధ్రదేశంలో అసహాయోద్యమ వ్యాప్తి' అనుశీర్షిక క్రింద 1921 ఆగస్టు 17 వ తేదీన ఆంధ్రపత్రిక వ్రాసిన విషయాలు గమనార్హమైనవి.

వందల గ్రామాల్లో వెట్టి, మోహతాదులతో సహా గ్రామోద్యోగులు రాజీనామా చేశారు

అసహాయోద్యమం

సహాయ నిరాకరణోద్యమంలో ఆంధ్రదేశం అద్వితీయ పాత్రను నిర్వహించింది. వందల గ్రామాలలో వెట్టి మోతాదులతో

"ప్రజా శక్తి అనర్గళముగా ప్రవహించుచున్న విధమును కన్నులు గలవారు చూడ గలరు..... స్వరాజ్యసంపాదన దీక్ష యందు ఆంధ్రదేశము ధర్మోత్సాహమును చూపుచున్నది...గుంటూ

రంతయు గత మాసాంతమునందు ఆయుధములతో నిండినను ప్రజల నిగ్రహము దైవానుగ్రహము దేశమును సంక్షోభమునుండి రక్షించినవి" అని వ్రాశారు. గాంధీగారి ఆదేశంతో ఈ ఉద్యమం విరమించబడింది

ప్రకాశంగారు పోలీసు వలయాన్ని ఛేదించుకొని, ముందుకు వెళ్ళి కాల్చుకోమని రొమ్ము చూపి తదాది 'ఆంధ్రకేసరి'గా ప్రసిద్ధిగాంచారు. 1929లో లాహోర్‌లో పండిత జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జాతీయ కాంగ్రెసు మహాసభ సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని ఆమో

రాబోవు స్వాతంత్ర్య సంగ్రామానికి నాందిగా మన్యవిప్లవం

మన్య విప్లవం

సహాయనిరాకరణోద్యమంతో ప్రభావితుడైన శ్రీ అల్లూరి సీతారామరాజు పీడిత ప్రజల సేవానురక్తుడై, మన్యం ప్రాంతానికేగి, కోయప్రజలను సంఘటిత పరిచారు. వారినందరినీ ఆయన ఒక్క త్రాటిపైన నడిపించారు. 1923 లో కాకినాడలో బులుసు సాంబమూర్తి గారి నాయకత్వాన గల ఆహ్వాన సంఘం, అఖిల కాంగ్రెస్ మహాసభను దిగ్విజయంగా జరిపించింది. తన ఏకైక కుమారుడు మరణించినప్పటికీ, సాంబమూర్తి గారు ఆ దుఃఖాన్ని దిగమ్రింగి, మహాసభలను నిర్విఘ్నంగా కొనసాగించిన తీరు, ఆయన స్థిరచిత్తం వేనోళ్ల ప్రశంసలందుకొంది.

ఆ సమయంలోనే సీతారామరాజు ఏజన్సీ ప్రాంతంలో తెల్లదొరల క్రూరకృత్యాలను ఎదుర్కొని రెండేళ్లపాటు వారికి సింహస్వప్నమై నిలిచారు. రాజు మాట కోయదొరలకు వేదవాక్కు అయింది. పోలీస్ స్టేషనులను కొల్లగొట్టారు. సైనికులు కోయ ప్రజలపై అనేక అత్యాచారాలు సాగించారు. కడకు 1924 మే 7వ తేదీన సీతారామరాజును బంధించి, క్రూరుడైన రూథర్‌ఫర్డు కాల్చి చంపివేశాడు. రాజు సహచరులకు ద్వీపాంతర వాసశిక్షలు విధింపబడినవి. పలువురు కారాగార శిక్షలకు గురియైనారు.

ఆ మన్య విప్లవ కాలంలో 1700 తోటాలు, 150 తుపాకులు 40 పట్టా కత్తులు, రూ. 13 లక్షల డబ్బు నష్టపోయినట్లు ప్రభుత్వం గెజెట్‌లో ప్రకటించుకొంది. మన్య విప్లవ గాథలు, సీతారామరాజు ప్రదర్శించిన సాహసోపేత కార్యాలు, ఆయన త్యాగశీలం యువకులనెంతగానో ఉత్తేజపరచి రాబోవు స్వాతంత్ర్య సంగ్రామానికి సన్నద్ధులను గావించినవి.

సీతారామరాజు అనుసరించిన సాయుధ విప్లవ పద్ధతులతో ఏకీభవించనని పేర్కొంటూనే గాంధీజీ "రామరాజు చూపిన అకుంఠిత సాహసం, త్యాగదీక్ష, ఏకాగ్రత, ఉత్తమశీలం ఎల్లరకూ ఆదర్శప్రాయమైనవి." అని 28-7-1925 లో 'యంగ్ ఇండియా'లో అభినందించారు.

ఉప్పు సత్యాగ్రహోద్యమం

1928 లో సైమన్ కమీషన్ బహిష్కరణ సందర్భంలో ఆంధ్ర దేశం ప్రధాన పాత్ర వహించింది. మద్రాసు నగరంలో దించడం, ఆ మరుసటి సంవత్సరమే గాంధీజీ 'దండియాత్ర'ను సాగించడంతో ఉప్పు సత్యాగ్రహం ఆరంభమైనది.


1928 లోనే ఆంధ్ర కాంగ్రెస్ సంఘం అధినివేశప్రతిపత్తిని కాదని సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని ఆమోదించడం, బులుసు సాంబమూర్తిగారిని చెరసాలలో బంధించడం కూడా జరిగింది.

అప్పటివరకు లోలోన రగుల్కొంటున్న స్వాతంత్ర్యేచ్ఛ ఈ సత్యాగ్రహోద్యమంలో వెల్లుబికి నట్లయింది. తెలుగు దేశమంతటా ఎక్కడ జూచినా జెండా ప్రతిష్ఠాపనలే! విదేశ వస్త్ర, వస్తు బహిష్కరణలే!! ఉప్పు కొఠార్లపైన స్వచ్ఛంద సేవకుల దాడులు ఊరేగింపులే!!! దీనితో ప్రభుత్వ దమననీతి పెచ్చు పెరిగి, అనేక నిర్బంధ శాసనాలను అమలుపరిచి, పశుబలంతో ఉద్యమాన్ని అణచజూచింది. ఖాసా సుబ్బారావు, సాంబమూర్తి, బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యం మున్నగు నాయకులపైన పోలీసులు అనేక దుష్కృత్యాలు జరిపారు. వేలాది వాలంటీర్లపైన కేసులు బనాయించి, కఠిన శిక్షలు విధించారు. దేశసేవికలను అవమానం పాల్జేశారు. రాజకీయ చైతన్యం గలిగి గ్రామాలన్నింటిపైన సామూహిక జరిమానాలు విధించారు. ఖద్దరు కట్టి గాంధీటోపి ధరించిన వారినల్లా అరెస్టులు చేశారు.

ప్రభుత్వ నిషేధాజ్ఞలను ధిక్కరించి, స్వచ్ఛంద సేవకులు, వీరనారీమణులు బారులుదీరి ఊరేగింపులు, సభలు జరుపుతుంటే, అశేష ప్రజలు హర్షధ్వానాలు చేస్తూ, సత్యాగ్రహోద్యమానికి సర్వ విధాలా సహాయం అందజేశారు. కులమత వర్ణ విచక్షణలేకుండా అన్ని జిల్లాలలో అన్ని వర్గాలవారి నుండి నూతన నాయకత్వం ఆవిర్భవించి, అహింసాయుత స్వాతంత్ర్య సమరంలో ముందు నిలిచారు.

తూర్పు గోదావరి జిల్లా దేశభక్తులు శ్రీ సాంబమూర్తి, బ్రహ్మజోశ్యులవారి నాయకత్వాన కళా, పళ్ళంరాజు, క్రొవ్విడి, పాలకోడేటి, మద్దూరు అన్నపూర్ణయ్య మున్నగువారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో ఆత్మకూరి గోవిందాచారి, సర్దార్ దండు నారాయణరాజు, ముదిగంటి జగన్నశాస్త్రి, మాగంటివారు, మోతేవారు, చెరుకువాడవారు, అల్లూరి సత్యనారాయణరాజు, సుబ్బతాతరాజుగార్లు అగ్రశ్రేణిలో నిలిచారు.



మదరాసు నగరంలో ఉప్పు సత్యాగ్రహోద్యమం (గద్దె రంగయ్య నాయుడు, ఆంధ్రకేసరి, దేశోద్ధారక, దుర్గాబాయి ప్రభృతులు.)

కృష్ణా జిల్లాలో డాక్టర్ పట్టాభి, అయ్యదేవర కాళేశ్వర రావు, గంపలగూడెంవారు, మానికొండ, కాకాని, కాట్రగడ్డవారు, అన్నె అంజయ్య, పేట బాపయ్య, బుచ్చిరామ శ్రేష్ఠి, వెలిదెండ వారు నాయకత్వం వహించారు.

గుంటూరు జిల్లాలో 'దేశభక్త', ఉన్నవ దంపతులు, సీతా రామశాస్త్రి, నడింపల్లి నరసింహారావు, పున్నయ్యశాస్త్రి, అన్నా ప్రగడ, ఆచార్య రంగా దంపతులు, శరణు, మంతెన, వావిలాల, గౌస్‌బేగ్, చంద్రమౌళి ప్రభృతులు ఈ మహోద్యమంలో ముందున్నారు.

ఈ విధంగానే శ్రీకాకుళం, విశాఖ జిల్లాలలో వరహగిరి వారు, తెన్నేటివారు, పుల్లెల, లచ్చన్నగార్లు;

నెల్లూరు జిల్లాలో తిక్కవరావు వారు, ఓరుగంటి వారు, గండవరపు హనుమారెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, వెన్నెలకంటి వారు;

రాయలసీమలో కల్లూరి సుబ్బారావు, కలచవీడు వేంకటరమణాచార్యులు, కల్యాణానందస్వామి, కడప కోటిరెడ్డి, అనంత శయనం అయ్యంగార్, పాపన్నగుప్తా ప్రభృతులు ఈ సత్యాగ్రహోద్యమంలో నాయకత్వం వహించారు. ఆంధ్ర మహిళామణులలో దేశబాంధవి దువ్వూరి సుబ్బమ్మ, ఉన్నవ లక్ష్మీబాయమ్మ, పొణకా కనకమ్మ, వేదాంతం కమలాదేవి, ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ, బుచ్చికృష్ణమ్మ, బసవరాజు రాజ్యలక్ష్మి, మూల్పూరి చుక్కమ్మ, గోగినేని భారతీదేవి, కలగం పిచ్చమ్మ, గోళ్ళమూడి రత్నమ్మ, సీతామహాలక్ష్మమ్మ, రాజ్యలక్ష్మీదేవి మొదలగు వారెందరో ఈ ఉద్యమంలో అఖండ త్యాగాలు చేశారు. వేలాది మహనీయులు పాల్గొన్న ఈ సత్యాగ్రహోద్యమంలో పేర్లు పేర్కొనడం సాధ్యం కాని పని. అజ్ఞాత దేశారాధకులెందరో పాల్గొని మాతృదేశ ఋణం తీర్చుకొని ధన్యజీవులైనారు.

"గత సంవత్సరమునందు వర్ధమానంబైన సత్యాగ్రహ ప్రస్థానము భరతవర్షము నందంతటను ఆంధ్రుల ప్రతిభను విస్తరింపచేసినది. ప్రఫుల్లరాయిగారు చెప్పినట్లు ఆంధ్రులు పరమోత్సాహంతో సత్యాగ్రహ రంగ మందాత్మార్పణము చేసిన విధము ప్రశంసార్హముగ నున్నది. ఏప్రిల్, మే నెలలోనే వందలకొలది సత్యాగ్రహులు నిర్బంధింపబడిరి. కాంగ్రెస్ సంఘము లక్రమ సంఘములుగా నిషేధింపబడినది. ఆంధ్రరత్న భవనము, సత్యాగ్రహ శిబిరములు ప్రభుత్వ ఆక్రమణను పొందినవి. దేశమునందు ముఖ్య ప్రదేశములందు 144 సెక్షనులు జారీ చేయబడినవి.

గుడివాడ, ఏలూరు లందు తుపాకులు ప్రేల్చబడినవి. గుంటూరు, బందరు, రాజమహేంద్రవరము మొదలగు ప్రదేశము

లందు లాఠీ ప్రయోగములు జరిగినవి. పోలీసువారు ప్రదర్శకులపై చూపిన అవమాన, దౌర్జన్యములు పరమాసహ్యమును కలుగ చేసినవి.

శ్రీమతి దుర్గాబాయమ్మగారు చెన్నపురి యందును. శ్రీమతి లక్ష్మీబాయమ్మగారు గుంటూరునందును, శ్రీమతి రుక్మిణమ్మగారు వేదారణ్యమునందును ఇతర యువతులు భిన్న ప్రాంతములయందును చూపిన సాహసోత్సాహము లాంధ్రుల ప్రతిష్ఠ విస్తరింప చేసినవి. అఖిల భారత కాంగ్రెసు స్థాయీ సంఘ సభ్యులు, రాష్ట్రీయ కాంగ్రెసు సభ్యులందరు నిర్బంధింపబడిరి. యువజనులెందరో శ్రీ కృష్ణ జన్మస్థానమును పరమానందముతో స్వీకరించి, మాతృ దేశాశీర్వాదములను పొందిరి. గాంధీ మహాత్ముని అహింసా సందేశము ఆంధ్రదేశము సంపూర్ణముగ గ్రహించిన విధము దుఃఖానుభవ సమయమునందును దేశమునందు వ్యాప్తమైన ప్రశాంత స్థితి విశదము చేయుచున్నవి."

(ఆంధ్రపత్రిక—ఉగాది సంచిక నుండి)

కాకినాడ బాంబుకేసు

మహర్షి బులుసు సాంబమూర్తి గారిపైన, వలంటీర్లపైన అనేక అత్యాచారాలు జరిపిన డి.వై.ఎస్.పి సుబ్బారాయుడుపై పగ తీర్చుకునేందుకు శ్రీ భయంకరాచారి నాయకత్వాన తూర్పు గోదావరి జిల్లా యువకులు ప్రయత్నించారు. 1933 ఏప్రిల్ 6 వ తేదీన, 14 వ తేదీన జరిగిన వారి విఫల ప్రయత్నం కాకినాడ బాంబుకేసుగా ప్రసిద్ధి గాంచింది. శ్రీ భయంకరాచారికి ద్వీపాంతరవాస శిక్షను మరి 8 మంది యువకులకు కఠిన కారాగార శిక్షలు విధించబడినవి.

మద్రాసు కుట్రకేసు

ఇలాంటిదే మరొకటి మద్రాసు కుట్రకేసు జరిగింది. 1933 మార్చి 10 వ మద్రాసులో హిందూస్థాన్ సోషలిస్టు సైన్యమనే పేరున ఒక విప్లవ సంఘ మేర్పడింది. మైలాపూర్ ఇంపీరియల్ బ్యాంకును దోచుకోవలెనని, మైఖేల్‌ను తుదముట్టించాలని కుట్ర పన్నినట్లు వీరిపైన అభియోగం తేబడింది. ముందుగానే పసిగట్టి వీరిని అరెస్టు చేయడం జరిగింది. ఈ విప్లవ సంఘంలో 7 గురు ఆంధ్ర యువకులు కూడా గలరు. న్యాయవాద వృత్తిని విసర్జించిన ప్రకాశంగారు మరలా లాయర్‌గౌను తొడుగుకొని, కోర్టుకు హాజరై ఆ విప్లవ యువకుల పక్షాన స్వయంగా వాదించారు.

1933 లో సత్యాగ్రహ విరమణానంతరం, 1934–41 మధ్య కాలంలో ఆంధ్రదేశంలో సోషలిస్టు భావాలు బాగా వ్యాప్తి చెందినవి. కాంగ్రెస్ సోషలిస్టు కమ్యూనిస్టు పార్టీల యువకులు రైతు కార్మిక విద్యార్థి మహిళా సంఘాల నేర్పరచి పనిచేయసాగారు. 1937 లో జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెసుకు అఖండ విజయం చేకూరింది. మద్రాసు రాష్ట్రంలో సైతం కాంగ్రెసు మంత్రివర్గం ఏర్పడింది. బ్రిటీష్ ప్రభుత్వానుకూలురైన జమీందార్ల నాయకత్వాన గల జస్టిస్ పార్టీ, పీపుల్సు పార్టీల వారిని ఓడించి జిల్లా బోర్డులను, పురపాలక సంఘాలను కాంగ్రెసు స్వాధీనం చేసుకున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలు జరిపి, ప్రజల విశ్వాసాన్ని చూరగొంది.

క్విట్ ఇండియా ఉద్యమం

ఈ స్థితిలో 1937 లో ద్వితీయ ప్రపంచ సంగ్రామం రావడం, జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయని బ్రిటీష్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెసు మంత్రులు రాజీనామా చేయడం, వినోబాభావేగారు ప్రథమ సత్యాగ్రహిగా 1940 లో గాంధీజీ ఆదేశాన్ని అనుసరించి, యుద్ధ ప్రతికూల నినాదాలు చేస్తూ వ్యక్తి సత్యాగ్రహం సాగించడం జరిగింది ఆంధ్రదేశంలో ఈ విధంగా 882 మంది అరెస్టయినారు. రూ. 76,533 లు జరిమానాలు విధించబడినవి.

1942 ఆగస్టు సంఘటనలు స్వాతంత్ర్యోద్యమంలో తుది మహోజ్వల ఘట్టం. మహాత్ముడు బొంబాయి ఎ.ఐ.సి.సి. సభలో 'యశోవామృత్యోవా' అన్నారు. నాయకులు అరెస్టు కాగానే ఆసేతు హిమాచల పర్యంతం ఈ 'క్విట్ ఇండియా' ఉద్యమం వ్యాపించింది. ఎల్లెడలా విప్లవ జ్వాలలు రగుల్కొన్నవి.

ఆంధ్రలో ఆగస్టు 11 న తెనాలి రైలు స్టేషనుపైన, 13 న గుంటూరు స్టేషనుపైన, 17 న భీమవరం ప్రభుత్వ కార్యాలయాలపైన, చీరాల సబ్-మేజిస్ట్రేట్ కోర్టుపైన, చెరుకుపల్లి, ఆచంట సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులపైన అశేష జనసమూహం దాడులు చేసింది. రైలు పట్టాలు పీకివేశారు. పలుచోట్ల తంతి తీగెలు త్రెంచివేశారు. రైళ్ళను నడవనీయలేదు. యువకులు, విద్యార్థులు ఒక నిర్దిష్ట కార్యక్రమం, నాయకత్వం అంటూ లేకుండానే ఎవరికి వారు దేశభక్తితో ఆవేశపరవశులై రంగంలోకి దూకారు. ప్రభుత్వ నిర్బంధ విధానాలను ఎదుర్కొన్నారు.

పోలీసులు తెనాలి, గుంటూరు, భీమవరం, చీరాల, పాలకొల్లు మొదలగు అనేక ప్రాంతాలలో విచ్చలవిడిగా జనసమూహాలపై కాల్పులు చేయగా, వీరమరణం చెందారు. వేలాది మంది శిక్షలకు గురియైనారు. అనేక గ్రామాలపైన సాముదాయిక జరిమానాలు విధించబడినవి. ప్రతి పట్టణం, పల్లె, ఏదో రూపంలో ఈ అంతిమ పోరాటంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో తోడ్పడినవి.

కాంగ్రెస్ సంస్థకు 1921 లో జాతీయ పతాకాన్ని రూపొందించి గాంధీ మహాత్ముని చేతి కందించినది స్వర్గీయ పింగళి వెంకయ్యగారు. రాజా మహేంద్ర ప్రతాప్, శ్యాంజీ కృష్ణవర్మ మున్నగు విప్లవ నాయకులతో కలిసి గదర్ పార్టీలో పాలుపంచుకున్నవారు దర్శి చెంచయ్యగారు. సుభాష్ చంద్రబోస్ విదేశాలలో ఏర్పాటుచేసిన 'ఆజాద్ హింద్ ఫౌజ్' భారతీయ సైన్యంలోను, నాగపూర్ జెండా సత్యాగ్రహ సందర్భంలోను ఆంధ్రులకు స్థానం వుంది. స్వరాజ్య ఉద్యమంలో 34 మంది మృతవీరులను తెలుగు దేశం బలిదానమిచ్చింది ఈ రీతి ఆంధ్ర ప్రజలు అన్ని జాతీయ స్వాతంత్ర్యోద్యమాలలో పాల్గొని. అఖండ త్యాగాలు చేశారు. ఆంధ్ర మహిళామణులు వీరోచిత పాత్రను నిర్వహించారు. అహింసా ధర్మసంగ్రామంలో ఆంధ్రనాయకులు అతిరథ, మహారథులుగా నిలిచారు. వేలాది అజ్ఞాత సేవకులు, దేశసేవలో తమ

సర్వస్వాన్ని ధారపోసి, ఈ స్వరాజ్యయజ్ఞాన్ని తుదివరకు సాగించి, కడకు విజయం సాధించారు.

హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నివారణ, ఖద్దరు, హిందీ ప్రచారం, జాతీయ విద్యాలయాల స్థాపన, మహిళాభ్యుదయం మొదలగు సంఘసంస్కరణ, నిర్మాణ కార్యక్రమాలన్నిటిలోను ఆంధ్ర దేశం సముచిత పాత్రను నిర్వహించింది.

గౌతమీ ఆశ్రమం, వినయాశ్రమం, సేవాశ్రమం, శారదా నికేతనం, కృష్ణాశ్రమం, గ్రామస్వరాజ్య పీఠం, పినాకినీ ఆశ్రమం మొదలగు అనేక ఆశ్రమాలు దేశారాధకులకు నిలయమై ప్రజలలో భక్తి విశ్వాసాలు కలిగించినవి

గరిమెళ్ళ సత్యనారాయణ, బలిజేపల్లి లక్ష్మీకాంతం, దామరాజు పుండరీకాక్షుడు, బసవరాజు అప్పారావు మొదలగు జాతీయ కవులెందరో స్వాతంత్ర్యోద్యమంలో స్వయంగా పాల్గొనడమేగాక, దేశభక్తిని రగుల్కొల్పే పాటలు, పద్యాలు, నాటకాలు రచించి, గొప్ప ప్రబోధం గావించారు. ఈ రీతి కవుల, గాయకుల, చిత్రకారుల సేవలు చిరస్మరణీయం.

'ఆంధ్ర దేశమందత్యధికమైన భావోద్రేకము, శ్రద్ధాసక్తులు గలవు. ఆంధ్రులు పౌరుషవంతులు. ఉత్తమ సంప్రదాయాలు గలవారు ఎంతటి త్యాగానికైనా వెనుదీయనివారు, వారికి కవితాత్మ వుంది. త్యాగశీలం వుంది...ఆంధ్రులు నన్ను ముగ్ధుణ్ణి చేశారు.' అని గాంధీ మహాత్ముని ప్రశంసలు పొందగలిగారు.


యావద్భారత దేశంలో ఇట్టి మహనీయుల త్యాగ ఫలితంగానే 1947 అగస్టు 15 వ తేదీన స్వరాజ్యం సిద్ధించింది. కనుకనే ప్రజా హృదయాలలో ఆనాటి దేశారాధకులు, త్యాగశీలురు, అజ్ఞాతవీరులు చిరస్థాయిగా నిలిచివున్నారు.

హైదారాబాద్ సంస్థాన విమోచనోద్యమం

హైదరాబాదు సంస్థానంలో ఆంధ్ర భాషాభివృద్ధికి కృషి చేయుటకుగాను గ్రంథాలయాలు వెలసినవి. 1901లో శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయం 1904లో వోరుగల్లున రాజరాజ నరేంద్ర గ్రంథాలయము, ఈ విధముగానే హైద్రాబాదు నగరంలో వేమన గ్రంథాలయము, బాలసరస్వతీ గ్రంథాలయం మున్నగునవి స్థాపించబడినది.

ఈ గ్రంథాలయములు భాషా వికాసానికే కాక ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని కలిగించడానికి గూడ తోడ్పడినది. సంస్థాన ప్రజల దాస్యవిమోచనోద్యమము ఈ గ్రంథాలయ కార్యకలాపాలతోనే ప్రారంభమైనదనవచ్చును.

లక్ష్మణరాయ పరిశోధన మండలి, ఆంధ్రబాలికా పాఠశాల, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర భాషోజ్జీవనీ నాటక సంఘం



నెహ్రూతో హైదరాబాదు రాష్ట్రి కాంగ్రెసు నాయకులు

మున్నగు సంస్థలు గావించిన కృషి విస్మరించరానిది. 1916లో సూర్యాపేటలో ఆంధ్ర విజ్ఞాన ప్రకాశిని గ్రంథాలయం ఏర్పడి సేవా ధర్మంగల కార్యకర్తల కూడలిగా వర్ధిల్లినది.

గ్రంథాలయములు, సాహిత్య సంస్థలు, రాజకీయ కార్య కలాపాలలో జోక్యం కలిగించుకోక పోయినప్పటికీ, ప్రజలలో రాజకీయ చైతన్యము కలిగించేందుకు హెచ్చుగా దోహదం చేసినవి. 1923లో కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభకు శ్రీ మాడపాటి హనుమంతరావు ప్రభృతులు హాజరైనారు. 1920 సహాయ నిరాకరణోద్యమం, భారత జాతీయోద్యమం ప్రభావాలు సంస్థాన ప్రజానాయకులపై ప్రసరించినవి.

నిజాం నిరంకుశ ప్రభుత్వం, సాంఘిక విద్యాకార్యక్రమాలను గూడ సాఫీగా సాగనివ్వలేదు. అనుమతి లేనిది ఏ సభా సమావేశాలు జరుపనివ్వలేదు. సభలకు అనేక ఆటంకములు కలిగించినది. సంస్థానం వెలుపలి వారెవరూ స్టేట్‌లో ప్రసంగించరాదని నిషేధం విధించినది.

1944లో సింగరేణి కొలరీస్‌లో జరిగిన 27వ ఆంధ్రప్రదేశ గ్రంథాలయ మహాసభలో ముక్కోటి యావదాంధ్ర ప్రతినిధులు ఒక్కటైనారు. విశాలాంధ్ర నిర్మాణమే తమందరి ధ్యేయమని నిర్ద్వంద్వంగా చాటారు.

సంస్థాన ప్రజలలో కలిగిన చైతన్య ఫలితంగానే 1930లో నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ స్థాపన జరిగింది. ప్రథమాంధ్ర మహాసభ మెదక్ జిల్లా జోగిపేటలో జరిగింది. నిజాం ప్రభుత్వం సభలకు ఎన్నో ఆటంకాలు కలుగజేస్తున్నప్పటికీ, వాటినన్నింటినీ తట్టుకుంటూ 1931లో దేవరకొండలో 1934లో ఖమ్మంమెట్టులో, ఈ విధంగా 13 మహాసభలను జయప్రదముగా జరుపుకోగలిగారు.

1944లో మితవాదులు, జాతీయ వాదులు, కమ్యూనిస్టులు వేర్వేరుగా విడిపోయి ప్రత్యేక సభలు జరుపుకొనేటంత వరకు నిజామాంధ్ర మహాసభ ప్రజల ఏకైక ప్రతినిధిగా వ్యవహరించింది. వివిధ రాజకీయ దృక్పథాలుగల వారందరిని కూడదీసుకొని రాగలిగింది.

జడ్చెర్లలో జరిగిన నిజామాంధ్ర మహాసభలో నిజాం సంస్థానాన్ని విడగొట్టి పరిసర భాషా రాష్ట్రాలలో ఆయా భాషా ప్రాంతాలు చేర్చదగునని శ్రీ ఎం. ఎస్. రాజలింగం ఒక ప్రధాన తీర్మానాన్ని ప్రవేశ పెట్టడం, శ్రీ భండారు చంద్రమౌళీశ్వరరావు దానిని బలపరచడము జరిగినది. ఆ వెంటనే వారి నిద్దరిని నిజాం ప్రభుత్వం అరెస్టు చేసి 18 మాసాలు కఠిన శిక్షలు విధించినది. ఇది స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం ప్రారంభించక పూర్వమే జరిగిన సంఘటన.

సంస్థానాన్ని విడగొట్టాలని, ఆంధ్రభూమి అంతా ఒకటిగా ఉండాలని కోరడమే ఆనాడు మహా నేరమైంది.

కీర్తిశేషులు శ్రీ కొమర్రాజు లక్ష్మణరావు, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, కొండా వెంకట రంగారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి, మొదలగు ప్రముఖులు హైద్రాబాద్ సంస్థానంలో ఆంధ్రాభ్యుదయానికి పలురీతుల కృషి చేసినారు. నిజాం ఆంధ్రులకు ఆంధ్రమహాసభవలె, అప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక పరిషత్తులేర్పడి ఆయా భాషా ప్రజల అభ్యున్నతికై కృషి చేయ సాగినది.

స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం

దేశంలో మహాత్మాగాంధీ నాయకత్వాన 1930-1932 లో ఉప్పు సత్యాగ్రహం జరగడం, 1937 అనంతరం సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అఖండ విజయం చేకూరి 8 రాష్ట్రాలలో కాంగ్రెస్ మంత్రివర్గాలేర్పడడం మొదలగు రాజకీయ పరిణామాలు నిజాం సంస్థానంలో గూడ గొప్ప సంచలనాన్ని కలిగించినవి.

1938 అక్టోబరు 28వ తేదీన దీపావళి పర్వదినాన శ్రీ గోవిందరావు నానక్ మొట్టమొదటి సారి స్టేట్ కాంగ్రెస్‌ను ప్రకటించటం వెనువెంటనే నిజాం ప్రభుత్వం దానిని నిషేధించడం జరిగింది.

నిషేధాజ్ఞలు ధిక్కరించి ప్రథమ దళం సత్యాగ్రహం చేసింది. శ్రీయుతులు గోవిందరావు నానక్, జనార్ధనరావ్ దేశాయ్, రావి నారాయణరెడ్డి, రామకృష్ణదూత్, శ్రీనివాసరావు, చోరికార్ ప్రథమ దళంగా సత్యాగ్రహంచేసి. అరెస్టు అయినారు. 3 రోజుల అనంతరం స్వామిరామానందతీర్థ సత్యాగ్రహం చేసి 18 నెలలు కఠిన శిక్షలకు గురి అయినారు. ఈ విధంగా 4వేల మంది స్వచ్ఛంద సేవకులు అరెస్టు చేయబడినారు.

హిందువుల పౌరహక్కుల కోసం సివిల్ లిబర్టీస్ యూనియన్, ఆర్యసమాజ్‌వారు గూడ సత్యాగ్రహం ప్రారంభించారు. సుమారు 10వేల మంది జైళ్ళ శిక్షలకు గురిచేయబడినారు. పండిత నరేంద్రజీ మున్నగువారు నాయకత్వం వహించి నిషేధాజ్ఞల ధిక్కరణ ఉద్యమం కొనసాగించారు. ఈ పరిస్థితిలో ఇది హిందూ-ముస్లిం మతకల్లోలం క్రింద మారుతుందేమోనని గాంధీజీ సత్యాగ్రహాన్ని విరమించమని స్టేట్‌కాంగ్రెస్‌కు సలహా ఇచ్చారు. ఆ సలహాను పాటించి ప్రథమ సత్యాగ్రహం విరమించబడింది. అయితే సత్యాగ్రహాన్ని ఆపు చేసినప్పటికీ స్టేట్ కాంగ్రెస్ పైగల నిషేధాన్ని నిజాం ప్రభుత్వం తొలగించలేదు. సత్యాగ్రహులను మాత్రం విడుదల చేసింది. ఆ కారణంగా ఆంధ్ర మహాసభ, కర్ణాటక పరిషత్తు, మహారాష్ట్ర పరిషత్తు యాజమాన్యంలోనే బహిరంగ రాజకీయ కలాపాలు సాగుతుండేవి.

1940 నవంబర్ 11న యుద్ధ ప్రతికూల ప్రదర్శన సందర్భంగా స్వామీజీ వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొని నిర్బంధింపబడినారు. 1942లో గాంధీజీ "క్విట్ ఇండియా" తీర్మానాన్ని ప్రబోధించిన సమయంలో ఆగస్టు 9న మరల స్వామీజీ డిటైన్ చేయబడినారు. యావద్భారతం తీవ్ర నిర్బంధ విధానాలకు గురిచేయబడినది.

ఈ పరిస్థితులలో శ్రీ జమలాపురం కేశవరావు తెలంగాణా ప్రాంతంలో, శ్రీ గోవిందరావు ప్రాష్ మహారాష్ట్ర ప్రాంతంలో, శ్రీ జగన్నాధరావు చంద్రకి కర్ణాటక ప్రాంతంలో ప్రజా ప్రతిఘటనోద్యమాన్ని నిర్మించారు.

గాబోవు తుది స్వాతంత్ర్య పోరాటానికి కార్యకర్తలను, ప్రజలను సంసిద్ధులను గావించారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం, భారత జాతీయోద్యమం ఉచ్చదశకు చేరుకొంది. సార్వత్రిక ఎన్నికలలో తదనంతరం రాష్ట్రాలలో కాంగ్రెస్ మంత్రిత్వాలు స్వీకరించింది.

హైదరాబాద్ సంస్థానంలో ఇత్తెహాద్ ముస్లిమీన్ ఆధ్వర్యాన విచ్చల విడిగా ప్రజలపై దౌర్జన్యాలు సాగింపబడినవి. అప్పట్లో చతారీనవాబ్ ప్రధానిగా ఉండేవాడు. ఇప్పటి రాజ్ భవన్ అప్పట్లో "షామంజిల్" అని పిలువబడుతుండేది చతారీ నవాబ్ వైదొలగాలని ఇత్తెహాద్ ముస్లిమీన్ వాలంటీర్లు షామంజిల్‌పై దాడి చేసి నిప్పు పెట్టారు. అరాచకశక్తులు విజృంభించినవి. చతారీ నవాబ్ వైదొలగి మీర్జా ఇస్మాయిల్ ప్రధాన మంత్రి అయినాడు. ఆయన స్టేట్ కాంగ్రెస్‌పైగల నిషేధాజ్ఞలన్నీ 1946 మార్చి 21న తొలగించాడు.

1947 లో స్టేట్ కాంగ్రెస్ బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడాలని కోరింది దీనితో రజాకార్ల మూక పిస్తోళ్ళతో సాయుధులై అల్లర్లు సాగించారు వీరి నాయకుడు కాశిం రజ్వీ. ఆయన నిజాం నవాబ్ ప్రభువు కీర్తి బంగాళాఖాతంలో కడిగించేవరకు నిద్రపోనని ప్రగల్భాలు పలుకుతూ ప్రసంగాలు సాగించాడు రజాకార్ మూక అల్లర్లకు నాయకత్వం వహించి ప్రజలను నానా బాధలు పెట్టసాగాడు.

శ్రీ షోయబుల్లాఖాన్ అను పత్రికా సంపాదకుడు, సంస్థానాన్ని విడగొట్టి ప్రక్క భాషా రాష్ట్రాలలో సంలీనం చేయాలని పత్రికలో వ్రాసినంత మాత్రాన ఆయనను నడివీధిలో రజాకార్లు చిత్రహింసలుచేసి, చేతులు కాళ్ళు నరికి చంపివేసిన ఘోర దురంతం ఎన్నటికీ క్షమించ రానిది.

ఈ స్థితిలో ప్రత్యేక ఆంధ్రమహాసభను స్థాపించి కృషి చేస్తున్న కమ్యూనిస్టులు సాయుధులై ప్రతిఘటనోద్యమానికి పూనుకొన్నారు. దేశ్‌ముఖ్‌లపైన ఫ్యూడల్ భూస్వాములపైన దాడులు సాగించారు.

హైదరాబాద్ సంస్థానం భారత, పాకిస్తాన్ రాజ్యాంగ పరిషత్తులో చేరదని, స్వతంత్ర రాజ్యంగా ఉండాలని నిజాం నవాబ్ కలలుగన్నాడు. ఇత్తెహాద్ ముస్లిమీన్ నాయకులు నిజాంకు అండగా నిలిచారు, తమే ప్రభుత్వం అన్నట్లు వ్యవహరిస్తూ ప్రజలను పీడించ సాగారు. నిజాం ప్రభుత్వం స్టేట్ కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయ మొదలుపెట్టింది.

ఈ పరిస్థితులలో స్టేట్ కాంగ్రెస్ మరల ఉద్యమానికి పూనుకొంది. కొందరు నాయకులు రహస్యంగా ఉండి ఉద్యమం నడపాలని నిశ్చయించుకున్నారు. సరిహద్దు ప్రాంతాలలో స్థావరాలు ఏర్పాటు చేసుకొన్నారు. అప్పటి వ్యూహాన్ని గురించి రామానంద తీర్థ అంతిమ పోరాటం అను వ్యాసంలో ఇలా వ్రాశారు.

"స్వతంత్ర పోరాటంలోని అంతిమ ఘట్టంలో హైదరాబాదు రాష్ట్రానికి భారతదేశంలో సాయుధ సంఘర్షణ తప్పదు అన్న విషయంలో మాకెవ్వరికీ సందేహంలేదు. అయితే ఈ సంఘర్షణ ముందు మూకుమ్మడిగా సత్యాగ్రహోద్యమం జరగాలి.

ఇక్కడి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా భారతదేశంచే సైనిక చర్య, తప్పమరేది హైదరాబాదు సమస్యకు పరిష్కారమార్గం లేదని మేము విశ్వసించాము. అయితే అదే సమయంలో రాష్ట్ర ప్రజలు కూడా సర్వోత్కృష్టమైన త్యాగాలు చేస్తే తప్ప హైదరాబాదు పైన భారత దేశం సైనిక చర్య తీసుకోవడానికి అనువైన పరిస్థితులు ఏర్పడవని మానమ్మకం"

స్టేట్ కాంగ్రెస్ సమావేశం మహారాష్ట్ర సరిహద్దునగల షోలాపూర్‌లో జరిగింది. శ్రీ డి. జి. బిందూ అధ్యక్షుడుగా ప్రాణేశాచర్య, గోవిందరావు ప్రాష్, జమలాపురం కేశవరావు సభ్యులుగా ఉద్యమ నిర్వహణకు ఒక కార్యాచరణ సంఘం ఏర్పరుచుకొన్నారు.

బొంబాయి పి. సి. సి. ఆఫీసులో ఈ కార్యాలయం నెలకొల్పారు. బెజవాడలోని శ్రీ కాశీశ్వరరావుగారి గృహంలో తెలంగాణా ప్రాంతమండలి కార్యాలయం, కర్ణాటక ప్రాంతాల వారికి గదగ్‌లో ఒక మండలి కార్యాలయం ఏర్పాటు చేశారు.

"కాశీశ్వరరావుగారి గృహం తేనె పట్టయింది. ప్రకాశం పంతులుగారు ఎల్లప్పుడు తమ ఆశీర్వాదాలు నాకు ప్రసాదించారు. ఆ రోజులలో నాకు పంతులుగారు పెట్టని కోటగోడవలె ఉండెడివారు" అని స్వామీజీ పేర్కొన్నారు.

1947 ఆగస్టు 7న హైదరాబాద్‌లో భారత విలీకరణోద్యమం జరిగింది. సుల్తాన్ బజార్‌లో వందలాది వాలంటీర్లు తెల్లవారేసరికి గుమికూడి జాతీయ పతాకాన్ని ప్రతిష్ఠించి ఊరేగింపులు జరిపారు. కొందరు అరెస్టులకు గురియైనారు. ఒక్క వారంలో వెయ్యిమంది అరెస్టు చేయబడినారు. స్వామీజీ హైదరాబాద్ నుంచి 'మధిర' వరకు రైలు ప్లాట్‌ఫారాల పైన ప్రబోధం గావిస్తూ పర్యటన చేశారు. ఖమ్మంలో బ్రహ్మాండమైన జనసమూహం స్వాగత మిచ్చింది. ఆయన ప్రసంగించడానికి వీలులేదని నిషేధం విధించబడింది.

ఆగస్టు 15 వ తేదీన అనగా స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఢిల్లీలో తనకు నెహ్రూచే ఇవ్వబడిన జెండాను రామానంద్ తీర్థ ప్రతిష్ఠించారు. ఆ రాత్రి స్వామీజీ ప్రభృతులు అరెస్టు చేయబడినారు. ఈ జెండా ప్రతిష్ఠాపన సందర్భంగా 21 వేల మందికి పైగా వాలంటీర్లు అరెస్టు అయినారు.

నిజాం ప్రభుత్వం విపరీత నిర్బంధాలకు పూనుకొని అణచివేయ చూచింది. ప్రభుత్వాజ్ఞలను ధిక్కరించి సామూహిక సత్యాగ్రహాలు సాగించాలని కేంద్ర కార్యాచరణ సంఘం ఆదేశించింది.

సంస్థాన ప్రజలు నిషేధపుటుత్తర్వులను ఉల్లంఘించారు. సత్యాగ్రహులు వీధుల లోకి వచ్చి ఊరేగింపులు, ప్రదర్శనలు సాగించారు. సరిహద్దులో ఉద్యమం విస్తృతమవడమే గాక మారు మూల గ్రామాలకు సహితముగా వ్యాపించింది.

వాలంటీర్లు, ప్రజలు ఎక్సైజ్ చట్టాలను ధిక్కరించారు. వరంగల్లు, కరీంనగరం, మహబూబ్ నగరం, నాందేడ్, ఔరంగాబాద్, పర్భిణి, రాయచూర్ జిల్లాలలో ఈత చెట్లను ఒక్క నెలలో 1 లక్ష నరికి వేశారు. ఫారెస్టు ప్రాంతాలలో సత్యాగ్రహం జరిగింది.

అక్టోబర్ 1వ తేదీన నిర్బంధ ప్రతి కూల దినోత్సవాలు జరిగినవి.

"కాలా రాజ్ ఖతం కరో, లోక్ రాజ్ ఖాయం కరో" అను నినాదాలు ఎల్లెడలా వ్యాపించినవి. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్ లో చేరకుండా వెలుపల ఉండాలని చటారీ నవాబ్ అక్టోబరు 1న ప్రకటన చేశాడు. దీనితో ఉద్యమం మరింత తీవ్రమైనది.

నిజాం ప్రభుత్వంలో సహాయ నిరాకరణమల్లా గ్రామ పంచాయతీలు, రైతు దళాల నేర్పరితనంచే ఉద్యమంగా పరిణామం చెందింది.

వందల కొలది గ్రామోద్యోగులు కూడా రాజీనామా చేశారు. మహారాష్ట్ర ప్రాంతం లోని బీడ్, హద్గోన్, తాలూకాలలో, అంబాద్ మోమినాబాద్, కృష్ణగిరి తాలూకాలలో స్వతంత్ర గ్రామ పంచాయతీలు ఏర్పడినవి. రైతు దళాలను నిర్మాణం చేసుకొన్నారు. సరిహద్దు ప్రాంతాల్లోని దేశ భక్తి పూరితులైన ప్రజలు, నిజాం వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటాలకు సర్వ విధాల అండ దండగా ఉన్నారు మహారాష్ట్రంలో రావు సాహెబ్ పట్వర్ధన్, ఆంధ్రలో కాశీశ్వర రావు అనేక విధాల తోడ్పడినారు. జయప్రకాశ్ నారాయణ నిధిసేకరణలో సహాయపడినారు.

ఈ బలంతో ఉభయ ప్రాంతాల నడుమ బానిస చిహ్నాలుగా ఉన్న 25 కస్టమ్స్ నాకాలపైని కాంగ్రెస్ వాలంటీర్లు దాడులు జరిపినారు.

ఈ స్థితిలో నిజాం పోలీసులు ప్రజలపై విచ్చల విడిగా కాల్పులు సాగించారు. ఐరోపాలో నాజీ ఆక్రమిత ప్రదేశాలలో జరిగినటువంటి చిత్రహింసలకు ఇక్కడ పూనుకొన్నారు.

నాందేడ్ లోని బరాడ్ ప్రాంతంలో, పర్భిణిలో కలం యూరిలో, బీదర్ జిల్లాలో ఆస్టిల్, మహబూబ్ నగర్ జిల్లాలోని హుజురాబాద్ రాంకల్ ప్రాంతంలో నిర్దాక్షిణ్యంగా పోలీసులు 15 చోట్ల లాఠీచార్జీలు చేశారు. ఈ కాల్పులలో 57 మంది మరణించారు, 142 మందికి తీవ్రంగా గాయాలు తగిలినవి నాందేడ్‌లో సోనారి వద్ద 3 సార్లు కాల్పులు జరిపినా, రైతులు ధైర్య సాహసాలతో ప్రతిఘటించారు. నల్గొండ జిల్లా సూర్యాపేట వద్ద తహశీలుదారును, అమీన్‌ను ప్రజలు చుట్టు ముట్టి జాతీయ పతాకానికి శాల్యూట్ చేయించి, వదలి పెట్టినారు. ఈ విధంగా చరిత్రాత్మకమైన వీరోచిత ప్రతిఘటన జరిగింది.

ఈ దశలోనే షేక్ అబ్దుల్లాను జైలు నుండి కాశ్మీర్‌లో విడుదల చేయడం, మైసూరు సంస్థాన ప్రజోద్యమానికి మైసూరు రాజా తలొగ్గడం జునాఘడ్ సంస్థాన ప్రజల కోర్కెకు మద్దతు నివ్వ గలమని భారత ప్రభుత్వం ప్రకటన గావించడం 'ఈ మూడు ముఖ్య సంఘటనలు హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ వాలంటీర్లలో ఉత్సాహాన్ని ప్రజలలో ఉద్యమంలో విశ్వాసాన్ని గలిగించినవి. ఈ పరిస్థితి నంతా డి. జి. బిందూ, మాడపాటి రామచంద్రరావు, పూల్‌చంద్ గాంధీ ఢిల్లీకివెళ్ళి కేంద్రనాయకులకు వివరించారు. అక్టోబరు 14 తో నిజామ్ నవాబ్‌కు ఇచ్చిన 2 నెలల గడువు ముగియ నున్నది. హైదరాబాద్‌కు కూడ జునాఘడ్ గతి పట్టక తప్పదని ప్రజలు భావించారు.

విద్యార్థులు పాఠశాలలను బహిష్కరించి ఉద్యమం వెనుక సమీకృతులైనారు. రైతులలో ప్రతిఘటనా ధోరణి హెచ్చింది.

విచ్చలవిడిగా అరెస్టు, కాల్పులు, లాఠీచార్జిలతో పాటు నల్గొండ, కరీంనగరం, నాందేడ్ జిల్లాలో స్త్రీలను పోలీసులు గుండాలు అవమాన పరచినట్లు, కొన్ని చోట్ల మానభంగాలు జరిగి నట్లు తెలుస్తూంది. ఈ సారి కరీం నగరం జిల్లాలోని రంగాల గాలేపల్లి, అల్లీపూరం గ్రామాలలో కాల్పులు జరిగినవి. నాందేడ్ జిల్లాలో సోనారి, దోర్లి మున్నగు చోట్ల, మహబూబ్ నగరం జిల్లాలో గద్వాల, ఆత్మకూరు ప్రాంతాలలో మధిర, సూర్యాపేట గ్రామాలలో పోలీసులు కాల్పులు సాగించారు. రోహిలాలను, పఠానులను వెంటనే తీసుకొని వచ్చి గ్రామాలలోని ఇండ్లు తగుల పెట్టడం కొల్ల గొట్టడం వంటి కిరాతక కృత్యాలు చేసినారు.

అప్పటి దుశ్చర్యలు, ప్రజల ప్రతి ఘటనా గాథలు కొన్ని సంగ్రహంగా వివరిస్తాను.

గాలేపల్లి

400 మంది సైనికులు సాయుధ గుండాలు కలసి సెప్టెంబరు 14వ తేదీ కరీంనగరం జిల్లా గాలేపల్లిపై దాడిచేశారు. ప్రజలపై పోలీసులు కాల్పులు చేయగా 20 మంది మరణించారు. 50 మందికి గాయాలు తగిలినవి. మరణించిన వారిలో ఒక స్త్రీ కూడా ఉన్నది. కాల్పుల తర్వాత వారు గ్రామంపై బడి దోపిడీ చేశారు.

టికుటాల

వరంగలు జిల్లా టికుటాల గ్రామానికి ఫారెస్టు సత్యాగ్రహ విచారణకని సెప్టెంబర్ 9న పోలీసులు వెళ్ళారు ఎవరూ సమాచారం చెప్ప లేదని రెచ్చిపోయి, మరల 15వ తేదీ వచ్చి స్త్రీలను గూడ రైఫిళ్ళతో పొడిచారు. ఈ దురంతాలు విని చుట్టు ప్రక్కల ప్రజలు ప్రోగైనారు. జనంపైన కాల్పులు చేయగా ఒక వ్యక్తి మరణించాడు. ముగ్గురికి గాయాలు తగిలినవి.

అల్లీపురం (కరీంనగర్ జిల్లా).

సెప్టెంబరు 16వ తేదీన 7, 8 వేల మంది ప్రజలు గ్రామంలో జాతీయ జెండాను ప్రతిష్ఠించారు. పోలీసుల బలగం రంగం మీదకు వచ్చినది. ప్రజలు చెదరిపోక పోలీసుల చేత జెండాకు వందనం చేయించి వదిలారు.

ఈ అవమానంతో మరుసటి రోజు సైన్యంతో తిరిగి వచ్చి విచక్షణా రహితంగా కాల్పులు చేశారు. ఇద్దరు మరణించారు. 8 గురికి గాయాలు తగిలినవి. కనుపించిన వారందరిని నిర్బంధించినారు.

చేతవోలు (నల్గొండ జిల్లా).

అక్టోబరు 12న జెండా ప్రతిష్ఠాపన జరిగింది. పోలీసులు వచ్చి జెండాను తీసివేశారు.

కాంగ్రెస్ కార్యకర్తలు మరల జెండాను ప్రతిష్ఠించారు. పోలీసులు కాల్పులు చేయగా ముగ్గురు మరణించారు. మరి ముగ్గురికి గాయాలు తగిలినవి.

ఆత్మకూరు (మహబూబ్‌నగరం జిల్లా) ఫారెస్టు సత్యాగ్రహంలో చుట్టుప్రక్కల గ్రామాలవారు గూడ వచ్చి పాల్గొన్నారు. అక్టోబరు 11న పోలీసు బలగం వచ్చిపడినది. విచ్చలవిడిగా కాల్పులు సాగించారు. 15 మంది మరణించారు. అనేకమందికి గాయాలు తగిలినవి. 2 రోజులు శవాలన్నీ ఆ విధంగానే పడియున్నవి. గాయపడిన వారికి మందులు ఇవ్వటానికి గూడ ఎవరినీ దగ్గరకు రానివ్వలేదు.

విద్యార్థుల వీరోచిత పాత్ర

స్టేట్ కాంగ్రెస్ సాగిస్తున్న సత్యాగ్రహ పోరాటంలో పాఠశాలల విద్యార్థులు ప్రముఖంగా పాల్గొన్నారు. ఊరేగింపులు, ప్రభాత భేరీలు చేశారు. లాఠీఛార్జీలకు, అరెస్టులకు గురైనారు.

1947 సెప్టెంబరు 18న బెజవాడలో హైదరాబాదు విద్యార్థి ప్రతినిధుల సభ జరిగింది. 120 మంది స్టేట్‌లోని అన్ని ప్రాంతాల నుండి ప్రభుత్వ నిర్బంధాలను తప్పుకొని రహస్యంగా వచ్చి సభలో పాల్గొన్నారు.

'భారత యూనియన్‌లో హైదరాబాదు సంస్థానం విలీనం కావాలని, బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పడాలని' విద్యార్థి సభ తీర్మానించింది.

పోలీసుల అకృత్యాలను, దౌర్జన్యాలను ఖండించింది. ఈ పోరాటం ప్రజల ప్రాథమిక హక్కుల రక్షణకై జరుగుతున్న పోరాటమని, ఇది ప్రజాతంత్ర ఉద్యమంలో భాగమని పేర్కొన్నారు. అంతేకాదు. ఇది అంతర్జాతీయ విద్యార్థి ఉద్యమంలో అంతర్భాగమని తీర్మానించారు.

ఇత్తెహాద్ ముస్లిమీన్, పైతరగతుల స్వార్థపర వర్గాలకు ప్రాతినిధ్యం వహించేదనీ, కొందరు విద్యార్థులను తమ స్వార్థ మతతత్వానికి వినియోగించుకొంటున్నదనీ, సోదర ముస్లిం విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు.

7 గురితో హైదరాబాద్ స్టేట్ విద్యార్థి సంఘ కార్యాచరణ సంఘం ఏర్పడినది స్టేట్ కాంగ్రెస్ యాక్షను కమిటీతో సన్నిహిత సంబంధం పెట్టుకొని ఉద్యమాన్ని కొనసాగించాలని నిశ్చయించుకొన్నారు.

ఈ సభ అనంతరం 2 వేల మంది హైస్కూలు విద్యార్థులు పాఠశాలలను బహిష్కరించారు.

సికిందరాబాద్‌లో జరిగిన నిర్బంధ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా 23 మంది విద్యార్థులు అరెస్టు చేయబడినారు. అక్టోబరు 1న సంస్థాన మంతటా నిర్బంధ వ్యతిరేక దినోత్సవాలు జయప్రదంగా జరిగినవి. విద్యార్థులు ప్రముఖ భూమికను నిర్వహించారు. సభలలో శపథం తీసుకొన్నారు. విద్యార్థి నాయకులు అరెస్టుకాగానే సమ్మెలు సాగినవి.

ప్రారంభంలో వరంగల్లు, కరీంనగరం, జగిత్యాలలో మొదలైన చోట్ల జరిగిన సమ్మెలు క్రమేణా సంస్థాన మంతటా వ్యాపించినవి.

సూర్యాపేటలో 340 మంది విద్యార్థుల పేర్లను రిజిస్టర్ నుండి తీసివేయటం జరిగింది.

నారాయణఖేడ్, వరంగల్లు హైదరాబాదులలో విద్యార్థులను అరెస్టు చేశారు. నాందేడ్, రాయచూర్, ఔరంగాబాదులలో గూడా పెద్ద ఎత్తున విద్యార్థులు అరెస్టు చేయబడినారు. కరీంనగర్ జిల్లా మంథెనలో 20 మంది విద్యార్థులపైన గ్రామం విడిచి వెళ్ళాలనే ఉత్తర్వులు జారీ చేయబడినవి.

మహిళల పాత్ర

రాజకీయోద్యమంలోనే కాక అప్పట్లో ఏ సాంఘిక కార్యాలలో గూడ స్త్రీలు బయటకు వచ్చే సంప్రదాయం హైదరాబాదీయులలో లేదు. లేడీ హైదరీక్లబ్ మున్నగునవి సంపన్న కుటుంబాలకే పరిమితమై యుండేవి. అట్టి స్థితిలో గూడ ఆగస్టు 7, 15, సెప్టెంబర్ 21, అక్టోబరు 1వ తేదీలలో జరిగిన నిరసన ప్రదర్శనలలో మహిళా వాలంటీర్లు పాల్గొన్నారు. రాయచూర్‌లో 200 మంది, ఔరంగాబాద్‌లో 100 మంది అక్టోబర్ 1న జరిగిన ఊరేగింపులకు నాయకత్వం వహించారు.

హైదరాబాద్‌లో శ్రీమతి యశోదాబాయ్, బ్రిజ్‌రాణి ప్రభృతులు సత్యాగ్రహం చేసి అరెస్టు అయినారు. తర్వాత 3, 4, బ్యాచీలుగా మహిళలు సత్యాగ్రహం చేశారు.

డాక్టర్ మేల్కోటే సతీమణి శ్రీమతి విమలాబాయ్, ఉషా సాంగ్రికర్, అహల్యాబాయ్, సర్జుబెన్, సుల్తాను బజారులో కర్ఫ్యూ ఛేదించుకొని ప్రదర్శనలు జరిపినారు. పోలీసులు లాఠీచార్జీ చేశారు. బాష్పవాయు ప్రయోగం చేసినారు. లక్ష్మీబాయి, రాధాబాయ్ దేశ్‌ముఖ్ జాతీయ జెండాను ప్రతిష్ఠించారు.

ఖమ్మంలో రాజేశ్వరి పోలీసు నిషేధాజ్ఞలను ధిక్కరించారు. జ్ఞానకుమారి హెడా, సత్యవతి మున్నగు వారు హైదరాబాద్‌లో; చికల్‌బాడ్ కుస్సంగి రాయచూర్ జిల్లాలో డిఫెన్స్ ఆఫ్ హైదరాబాదు చట్టం క్రింద అరెస్టు చేయబడినారు. ఈ స్థితిలో నిజాం ప్రభుత్వాధికారులు రాజా సంప్రదింపులంటూ ప్రారంభించారు. కాంగ్రెస్ వాదిగా నున్న జి. రామాచారిని మంత్రి వర్గంలో చేర్చుకొన్నారు.

జైలు నిర్బంధంలో ఉన్న రామానందతీర్థతో గూడ రాజీ మంతనాలు సాగించారు. ఆ ప్రతిపాదనలు ఇవియని తీర్థాయే పేర్కొన్నారు.

మొదటి 3 సంవత్సరాలు 75 శాతం ముస్లిములకు 25 శాతం ముస్లిమేతరులకు ప్రాతినిధ్యం ఉండేటట్లు ఒక పథకం పన్నారు. కాని సంభాషణలకే శ్రీ తీర్థ తిరస్కరించారు. బేషరతుగా స్టేట్ కాంగ్రెస్ నాయకులను విడుదల గావించిన తప్ప తాను ఎట్టి సంభాషణలను ఆమోదించబోనని ప్రధానిగా ఉన్న లాయఖలీకి ఆయన వ్రాశారు.

రాజీ సంప్రదింపులు జరుపుతున్నారనే కారణంతో ముగ్గురు ప్రముఖ నాయకులను కాంగ్రెసునుండి బహిష్కరిస్తూ స్టేట్ కాంగ్రెసు కార్యవర్గం నిర్ణయించింది. రాజీలు జరపడానికి ఎవరికీ అట్టి హక్కు లేదని స్పష్టీకరించింది

1947 డిశంబరులో లాయఖలీ ప్రధాన మంత్రి అయినారు. యధాతధపు "ఒడంబడిక" కూడదని ఇత్తెహాద్ ముస్లిమీన్ సంఘం ఆందోళన సాగించింది.

వీరు గృహదహనాలు, అరాచక చర్యలు ఎక్కువ చేశారు.

బ్రిటిషు సార్వభౌమాధిపత్యం తొలగిపోయిన తర్వాత దేశంలోని 560 స్వదేశీ సంస్థానాలు స్వతంత్రమైనవిగా ప్రకటించబడినవి. సర్దార్ పటేల్ సంస్థాన వ్యవహారాలశాఖలో మంత్రిత్వం స్వీకరించారు. నయాన, భయాన చెప్పగా జునాఘడ్, కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు తప్ప మిగతావన్నీ గూడ 1947 ఆగస్టు 14 వ తేదీ నాటికే భారత యూనియన్‌లో చేరేందుకు సమ్మతించినవి.

అయితే సంస్థానాధీసులకే సర్వ స్వతంత్రాధికారం ఉండాలని పాకిస్థాన్ నాయకులు, ముస్లింలీగ్ నాయకుడు జిన్నా కోరారు. సంస్థానాధిపతుల క్రింద బాధ్యతాయుత స్వపరిపాలన కావాలని మాత్రమే భారత ప్రభుత్వం కోరింది.

ఈ స్థితిలో 28 సంస్థానాలు ఒరిస్సాలో 150 సి.పి. బీరార్‌లో 2 మదరాసులో, 174 బొంబాయి రాష్ట్రంలో కలసిపోయినవి. 21 సంస్థానాలు కలసి హిమాచలప్రదేశ్ ఏర్పడింది. 217 కలసి సౌరాష్ట్ర యూనియన్ అని, 85 కలసి వింధ్యప్రదేశ్‌లో, 10 రాజస్థాన్‌లో, 8 పాటియాలా యూనియన్‌లో, 20 మధ్యభారత్‌లో చేరిపోయినవి.

హైదరాబాద్ విలీనీకరణకు భారత ప్రభుత్వం 2 మాసాలు గడువు పెట్టింది. సంస్థానాధిపతిగా మీర్ ఉస్మానలీఖాన్ వున్నారు. సంస్థానశాఖ పంపిన ముసాయిదా మీద నిజాం సంతకం చేశాడని ఢిల్లీకి బయలుదేరనున్న రాయబార వర్గం ఛత్తారీ నవాబ్, సర్ వాల్టర్ మాంక్టన్‌లపై రజాకార్ మూకలు దాడులు జరిపారు.

యధాతధపు ఒడంబడికపైన 1947 నవంబర్ 29 వ తేదీన నిజాం నవాబు సంతకం చేసి ఢిల్లీకి పంపారు. రజాకార్లు గృహదహనాలు, అల్లర్లు హెచ్చు చేశారు. ఎలాగైనా భారత యూనియన్‌లో చేరకుండా హైదరాబాద్‌ను స్వతంత్ర రాజ్యంగా ఉంచాలని ఒక కుట్ర జరిగింది.

సర్దార్ పటేల్ ఈ కుట్రను భగ్నం చేయుటలో దృఢవైఖరి నవలంబించారు.

ఏజెంటు జనరల్‌గా, కె. ఎం. మున్షీ వచ్చారు. 1948 సెప్టెంబరు 13 వ తేదీన భారత యూనియన్ సైన్యాలు హైదరాబాద్ సంస్థానంపై పోలీసు చర్య తీసుకున్నవి. నగరానికి సైన్యాలు 40 మైళ్ళ దూరంలో ఉండగా 18 వ తేదీన నిజాం నవాబు శరణు జొచ్చాడు.

ఆనాడు హైదరాబాదుపై జరిగిన పోలీసు చర్యపైన శ్రీ ప్రకాశం పంతులుగారిలా అన్నారు :

" Our gallant Indian Troops have accomplished a work with lightening speed and liberated the enslaved population."

హైదరాబాదు సంస్థానం దాని రాజ్య పాలకుడైన నైజాం భవిష్యత్తు ప్రజలచే ఎన్నుకోబడిన రాజ్యాంగ పరిషత్తుచేత నిర్ణయించబడుతుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

1949 వరకు జె.ఎన్. చౌదరి ఆధ్వర్యాన సైనికప్రభుత్వం ఏర్పడింది. అప్పటికి సరిహద్దులలో ఉన్న కాంగ్రెసువాదులు తిరిగి చేరుకున్నారు. తర్వాత వెల్లోడి ముఖ్యమంత్రిగా మంత్రి వర్గం ఏర్పడింది. బూర్గుల రామకృష్ణారావు. వి. బి. రాజు, వినాయకరావు విద్యాలంకార్, ఫూల్‌చంద్ గాంధీ, నల్గురు కాంగ్రెసువాదులు 1952 లో ఎన్నికలు జరిగే వరకు మంత్రివర్గంలో ఉన్నారు.

1952 మార్చి 12న పూర్తి ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. శ్రీ బూర్గుల ముఖ్యమంత్రి అయినారు.

భారత సైనికులకు నిజాం ప్రభువు శరణు జొచ్చిన తర్వాత జైళ్ళ నుంచి కాంగ్రెసు నాయకులు విడుదల గావించబడినారు.

దేశభక్తులైన సంస్థాన ప్రజల అపూర్వ త్యాగ ఫలితంగా చివరకు శస్త్ర చికిత్స వంటి పోలీసు చర్యతో హైదరాబాద్ సమస్య పరిష్కరింపబడింది. ప్రజల చిరకాలవాంఛ సిద్ధించింది. నూతన ప్రజాతంత్ర ప్రభుత్వ నిర్మాణం జరిగింది. ★

మహాంధ్రులారా!

— కళాప్రపూర్ణ జ్ఞానానందకవి

ఒకనాడు శాత్రవనికర గర్వముజీల్చి
తీండ్రించె నలుదెసల్ తెనుగుకత్తి
ఒకనాడు దివ్యరాజ్య కవాటముల విప్పి
తేనెలొల్కించెను తెనుగువాణి
ఒకనాడు పరభూములకు సోయగముదిద్ది
ఘనతసాధించెను తెనుగులక్ష్మి
ఒకనాడు ప్రకట శౌర్యకథోజ్జ్వలత జాటి
ప్రణతులంది కొనియె తెనుగుశక్తి
ఒక్క నాడుర్వి సత్కళాభ్యుదయమంద
నాటెమగు వేదమధుర భాండములనించి
గొనబుదేశాల బంచిన తెలుగు తల్లి
కారతులనీయరండు మహాంధ్రులార!

శబ్దశాసనుని భాషాజీవ రసధునీ
జలబిందువులయందు జలకమాడి
ఉభయవాఙ్మయ ప్రవీణోద్దండు హోమకుం
డాన దీక్షా మహేంధనము వైచి
ప్రౌఢసాహిత్య సామ్రాజ్య ధూర్వహుని యొ
యార్యంపు రచనకు నంజలించి
సహజ సత్కవితా విశారదు భక్తి మో
హనభావ పంక్తికి తనువుమఱచి
జిగిబిగిన వ్రాయు సుకవి విశేష రచన
యసదృశంబగునని దాని పసనెఱింగి
దేశదేశాల్ సవాల్ చేయు తెనుగు తల్లి
కంజలి ఘటింప రండు మహాంధ్రులార!

కాకతీయుల వీరగాథా ప్రబంధ శౌ
ర్యాంకితం బైన ప్రఖ్యాతిపటిమ
కృష్ణభూపుని కళారేఖా ముఖస్ఫూర్తి
బెడగు పొట్నూరు దిగ్విజయ ఘోష
రఘునాథ భూజాని ప్రజ్ఞా విశేషంబు
స్వారి సల్పెడిని తంజాపురాన
పాపరాయని వినిర్వక్ర విక్రమ పుష్టి
గఱపించు మహానీయ గౌరవంబు
వీరరుద్రాంబికా లసద్వీరచరిత
ఖడ్గతిక్కన యుత్సాహ కార్యదీక్ష
తెలుగుజాతికి జీవగఱ్ఱలగ నిలిచె
ఆ మహాశక్తి గొనుడు మహాంధ్రులార

పాషాణములకు జీవముబోసి చివురించి
చేవనందిన మహాశిల్ప రచన
స్వర్గంపు రససిద్ధి సరికాదు నాకంచు
పలికిపోయిన జగా తెలుగుకవిత
కమనీయ చిత్రాలు ఘంటికాముఖమున
వెలువరించిన మేలి తెలుగుకుంచె
కటికిఱాళ్లను సైన గఱగించి గాంధర్వ
మునఖ్యాతి గైకొన్న తెనుగు గీతి
ఖండ ఖండాంతరముల నఖండకీర్తి
తేజరిల్లి వర్ధిల్లిన తెలుగులక్ష్మి
మాసిపోలేదు తొల్లింటి మహిత చరిత
అభ్యుదయ మిక గొనుడు మహాంధ్రులార!

వెలయింపవలె నాంధ్ర విమల గాంధర్వ వి
ద్యావైభవైక విన్యాస దీప్తి
చాటింపవలెనాంధ్రి సాహిత్య సంపద
నఖిలభూవలయమ్ము నవఘశింప
కొండాడవలె నాంధ్రి నిండారుశిల్పక
ళాఖండములు సముల్లాస మంద
మెఱయింప వలెనాంధ్రి మేల్మి చిత్తరువులు
ఇతరవాసుల గుండె గతుకుమనగ
మిన్నుముట్టగావలె కళోన్మేషమారి
భావశబలతా భావవిభాస మాన
సంపదౌన్నత్యమట్టి ప్రశస్తగతికి
అడుగిడుడు ముందునకు సమస్తాంధ్రులార!

మళ్ళీ రతనాల సీమ అవుతున్న మన రాయలసీమ

శ్రీ కె.బి. నరసప్ప

అనంతపూరు, చిత్తూరు, కడప, కర్నూలు జిల్లాలతో కూడిన రాయలసీమ ప్రాంతాన్ని క్షామదుర్భిక్ష ప్రాంతంగా గుర్తించి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు యీ ప్రాంతం అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధను చూపిస్తున్నాయి. ఆంధ్రరాష్ట్రం యేర్పడక ముందు రాయలసీమ ప్రయోజనాలను రక్షించే వుద్దేశంతో శ్రీబాగ్ ఒప్పందం చేసుకోబడింది ఆంధ్రప్రదేశ్ యేర్పడిన తర్వాత తెలంగాణాతో పాటు రాయలసీమ సత్వరాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రాంతీయ అసమానత్వాలు వేర్పాటు ఉద్యమాలకు దారితీసే ప్రమాదం వుండటం వల్ల భారత ప్రభుత్వం 6 సూత్రాల పథకం క్రింద ఒక సమగ్ర అభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించింది.

సాంఘిక, సాంస్కృతిక అభివృద్ధికి దారితీసే ఆర్థిక అభివృద్ధి, ప్రగతికి అత్యవసరం కాబట్టి భారత ప్రభుత్వం ఆరుసూత్రాల పథకంలో భాగంగా ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యాన్నిచ్చింది. ఆరు సూత్రాల పథకం క్రింద గ్రామీణ విద్యుదీకరణ, నీటి పారుదల, పారిశ్రామీకరణ, వ్యవసాయాభివృద్ధి, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, పశుపోషణ, కోళ్ళపెంపకం, పట్టుపరిశ్రమ వంటి ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలను మాత్రమే ప్రారంభించాలని ప్రణాళికా సంఘం మార్గదర్శక సూత్రాలను జారీచేసింది. రోడ్లు, భవనాల నిర్మాణం కూడా అత్యవసరమే అయినా, వాటి నిర్మాణానికి భారీ ఖర్చు అవుతుంది. ఈ ధనంతో యితర ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు యింకా ఎక్కువగా ప్రారంభింపవచ్చు. రాయలసీమ క్షామదుర్భిక్ష ప్రాంతం గనుక యీ ప్రాంతంలో 6 సూత్రాల పథకం క్రింద మంచినీటి సరఫరా పథకాలకు ప్రణాళికా సంఘం ప్రత్యేక అనుమతిని యిచ్చింది.

ఆరు సూత్రాల పథకం క్రింద ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం భారత ప్రభుత్వం రు. 90 కోట్లు కేటాయించింది. ఈ ధనాన్ని తెలంగాణా, రాయలసీమ, కోస్తా ఆంధ్ర ప్రాంతాలలో 5:3:2 నిష్పత్తిలో 5 సంవత్సరాలలో ఖర్చు చేస్తారు. దీనిలో రాయలసీమకు రు. 27 కోట్లు కేటాయించారు. ఈ సందర్భంలో రాయలసీమ వార్షిక ప్రణాళిక రు. 5½ కోట్లుగా నిర్ణయించారు. దీనిలో 25 శాతం పరిశ్రమలు, ఉన్నత విద్య కొరకు కేటాయించారు.

రాయలసీమ ప్రణాళిక, అభివృద్ధి సంఘం కేబినెటు హోదా కలిగిన అధ్యక్షుని నాయకత్వంలో రాయలసీమ అభివృద్ధికి కార్యక్రమాలను తయారుచేసి, ప్రణాళికా సంఘం అనుమతి పొందిన తర్వాత వాటిని అమలు చేస్తుంది. ఇంతవరకు 1974-75, 1975-76 మూడు సంవత్సరాలకు చేపట్టిన కార్యక్రమాల అమలు వివిధ దశలలో వున్నది. ఈ మూడు సంవత్సరాలలో అనంతపూరు జిల్లాకు రు. 196. 81 లక్షలు, కడప జిల్లాకు రు. 153.40 లక్షలు, చిత్తూరు జిల్లాకు రు. 215.79 లక్షలు, కర్నూలు జిల్లాకు రు. 174 62 లక్షలు కేటాయించారు. వీటిలో 1976 మార్చి నెల వరకు వరుసగా రు. 71.38 లక్షలు, రు 108.02 లక్షలు, రు. 124,27 లక్షలు, రు. 11.47 లక్షలు యీ నాలుగు జిల్లాలలో ఖర్చు చేశారు.

1976-77 సంవత్సరానికి రాయలసీమ, ప్రణాళిక, అభివృద్ధి సంఘం రు. 431,52 లక్షలు కేటాయించింది. దీనిలో అనంతపూరు జిల్లాకు రు. 112.88 లక్షలు, కడప జిల్లాకు రు. 81 11 లక్షలు, చిత్తూరు జిల్లాకు 126.04 లక్షలు, కర్నూలు జిల్లాకు రు. 111.49 లక్షలు కేటాయించారు,

పథకాల వివరాలు

రక్షిత నీటి సరఫరా పథకాలు

భారత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో రక్షిత నీటి సరఫరా పథకాలకు ప్రత్యేక అనుమతి యివ్వడం వల్ల యీ విషయం మొదట వివరిస్తాను. 1974-76 రెండు సంవత్సరాలలో యీ పథకంలో భాగంగా బావుల త్రవ్వకానికి రు. 26 40 లక్షలు, రిగ్గులకు (గొట్టపుబావులు) రు. 79,10 లక్షలు, పంపులద్వారా నీటి సరఫరాకు రు. 59.68 లక్షలు కేటాయించారు. 1976 మార్చి వరకు వీటిలో వరుసగా రు. 13.10 లక్షలు, రు. 47 59 లక్షలు,

రు. 32.36 లక్షలు ఖర్చు చేశారు. 1976-77 సంవత్సరంలో బావుల త్రవ్వకానికి రు. 19.00 లక్షలు, గొట్టపుబావులకు రు. 32.50 లక్షలు, పంపుల ద్వారా నీటి సరఫరాకు రు. 43.54 లక్షలు కేటాయించారు. రాయలసీమలో వెనుకబడిన ప్రాంతాలలో ఉప్పునీరు వుండటంవల్ల మంచినీటి బావులు లేవు. అనంతపురం జిల్లా ఉరవకొండ వంటి ప్రాంతాలలో నీటిలో ఫ్లోరైడ్ అధికంగా వుండటం వల్లనూ, నారిపురుగువల్లనూ మనుషులకు, జంతువులకూ కూడా ప్రాణాపాయం అధికమౌతున్నది. కర్నూలు జిల్లాలో ఆలూరు, మరి యితర 39 గ్రామాలకు లాభం కలిగించే రు. 108.89 లక్షల ఆలూరు రక్షిత నీటి సరఫరా పథకం నిర్మాణంలో వున్నది. కడప జిల్లాలో రు. 5.40 లక్షల ఖర్చుతో 12 రక్షిత నీటి సరఫరా పథకాలు, కర్నూలు జిల్లాలో రు. 114.12 ఖర్చుతో 15 పథకాలు, అనంతపూరు జిల్లాలో రు. 78 07 లక్షల ఖర్చుతో 19 పథకాలు అమలులో వున్నాయి. కర్నూలు జిల్లాలో రు. 4 లక్షల ఖర్చుతో ఒక పథకం. చిత్తూరు జిల్లాలో రు. 20 లక్షల ఖర్చుతో 7 పథకాలు, అనంతపూరు జిల్లాలో రు. 24.50 లక్షల ఖర్చుతో 4 పథకాలు కొత్తగా ప్రారంభిస్తున్నారు. ఈ మొత్తం 58 పథకాలపై రు. 246.09 లక్షల ఖర్చు జరుగుతుంది. ఇవి కాక, 1975-76 లో కడప జిల్లాలో రు. 50 వేల ఖర్చుతో పథకం. కర్నూలు జిల్లాలో రు. 21 50 లక్షల ఖర్చుతో 51 పథకాలు ప్రారంభించారు. 1976-77 లో కడప జిల్లాలో, 1.60 లక్షల ఖర్చుతో 5 పథకాలు, అనంతపూరు జిల్లాలో రు. 10.96 లక్షల ఖర్చుతో 6 పథకాలు ప్రారంభిస్తారు.

నీటి పారుదల

రాయలసీమ ప్రజలలో అధిక భాగం వ్యవసాయం మీద ఆధారపడుతారు. అందువలన యీ ప్రాంతపు ఆర్థికాభివృద్ధికి నీటి పారుదల సౌకర్యాలు అధిక ప్రాధాన్యాన్ని కలిగి వున్నాయి. స్వాతంత్ర్యం రాకముందు, ఎగుమతి చేసే పత్తి రవాణాకు వుద్దేశింపబడిన కె. సి. కెనాల్ ఒకటే రాయలసీమలో నీటి పారుదల ప్రాజెక్టుగా వుండేది. దీనివలన కడప, కర్నూలు జిల్లాలలో 2 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కలుగుతుండేది. ఆంధ్రప్రదేశ్ యేర్పడిన తరువాత తుంగభద్ర ప్రాజెక్టు ఎగువ కాలువ దిగువ కాలువ రాయలసీమకు ముఖ్య నీటిపారుదల ప్రాజెక్టులైనవి. కృష్ణా జలాల విచారణ సంఘం చేసిన నిర్ణయంవలన కృష్ణాజలాలను రాయలసీమ జిల్లాలలో నీటి పారుదల కోసం వాడుకొనే వీలు కలిగింది. దీనివలన రాయలసీమ ప్రాంతంలో ప్రవహించే నదుల నుండి అత్యధికంగా నీటిని వాడుకొనటం సాధ్యమౌతుంది.

ప్రస్తుతం నిర్మాణంలోవున్న అన్ని నీటి పారుదల పథకాలు పూర్తి అయిన తరువాత కూడా రాయలసీమ లోని 2/3 వంతుల భాగానికి ఎట్టినీటి పారుదల సౌకర్యాలు కలగవని గుర్తించుకోవాలి. కాబట్టి యీ ప్రాంతాలలో చిన్న నీటి పారుదల సౌకర్యాలు, బావుల త్రవ్వకం చేపట్టాల్సి వుంటుంది. ప్రణాళికా సంఘం 1974-75, 1975-76 సంవత్సరాలలో, ఆరు సూత్రాల పథకం క్రింద చిన్న నీటి పారుదల ప్రాజెక్టులను ప్రారంభించటానికి అనుమతి నిచ్చింది. వీటి కోసం రు. 151 లక్షలు కేటాయించారు. ఇందులో రు. 90 లక్షలు యింతవరకు ఖర్చు చేశారు. 1976-77 సంవత్సరంలో ఇందుకోసం రు, 126,68 లక్షలు కేటాయించారు.

గ్రామీణ విద్యుదీకరణ

పైన పేర్కొన్నట్లుగా, పెద్ద, మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులు అన్నీ పూర్తి అయిన తర్వాత కూడా రాయలసీమలోని 2/3 వంతు భాగానికి నీటి సరఫరా వసతి యేర్పడదు. అందువలన యీ ప్రాంతాలలో బావుల ద్వారా భూగర్భ జలాలను వాడు కొనే యేర్పాట్లు చేయాల్సిన అవసరమున్నది. రాయలసీమలో అనేక బావులు వున్నాయి. భూగర్భ జలాల వినియోగానికి యీ బావులకు విద్యుచ్ఛక్తి సరఫరా అవసరం. ఆంధ్రప్రదేశ్ మొత్తంలో బావుల ద్వారా సేద్యం జరిపే జిల్లాలలో చిత్తూరు జిల్లా మొదటి స్థానాన్ని కలిగివున్నది. నీటి పారుదల ప్రాజెక్టుల పరిధిలోనికి రాని గ్రామాల అభివృద్ధిలో గ్రామీణ విద్యుదీకరణ అతికీలక స్థానాన్ని కలిగి వున్నది. ఆకారణంచేత ఆరు సూత్రల పథకం క్రింద గ్రామీణ విద్యుదీకరణకు అధికప్రాముఖ్యత నిచ్చారు. 1974-75, 1975-76 సంవత్సరాలలో అమలులోవున్న పథకాల అభివృద్ధికి, గ్రామాలకు నూతనంగా విద్యుత్ సరఫరా కలిగించడానికి రు. 168.83 లక్షలు మంజూరు చేసి యిప్పటివరకు రూ. 113 95 లక్షలు ఖర్చు చేశారు. 1976-77 సంవత్సరంలో గ్రామీణ విద్యుదీకరణకు రు. 103.00 కేటాయించారు. రాయలసీమలో లాభసాటియైన గ్రామాలకోసం 'మినీ క్లస్టర్' పథకాలను, గ్రామీణ విద్యుత్ సహకార సంఘాల పథకాలను తయారు చేయవలసిందని భారత ప్రభుత్వ గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్‌ను కోరారు. రాయలసీమ ప్రణాళిక, అభివృద్ధి సంఘం మంజూరుచేసిన యితర పథకాలు, 1974-75, 1975-76 సంవత్సరాలకు కేటాయించిన నిధులతో సహా యీ క్రింది విధముగా ఉన్నాయి: 1. వ్యవసాయం. రు. 15.45 లక్షలు, 2. పశుసంవర్ధన: రు. 13.90 లక్షలు, 3. మత్య పరిశ్రమ: రు. 6.30 లక్షలు. 4. పాడి పరిశ్రమ: రు. 14.44 లక్షలు, 5. అడవులు: రూ. 3.56 లక్షలు, 6. వ్యవసాయ సహకార సంఘాలు: రు. 7.50 లక్షలు. 7. ఆర్థిక సహాయకార్యక్రమాలు: రు. 61.92 లక్షలు, 8. స్త్రీ సంక్షేమం: రు. 4.00 లక్షలు, 9. సాంఘిక సంక్షేమం: రు. 26.73 లక్షలు, 10. పరిశ్రమలు: రు. 35.78 లక్షలు, 11. పట్టు పరిశ్రమ: రు. 11.99 లక్షలు, 12. భూగర్భజలాలు: రు. 12.50 లక్షలు.

వీటిపై 1976 మార్చినెల వరకు జరిగిన ఖర్చు యీ క్రింది విధంగా వున్నది: 1. వ్యవసాయం: రు. 11.27 లక్షలు, 2. పశు సంవర్ధన: రు. 28.06 లక్షలు, 3. మత్స్య పరిశ్రమ: రు. 1.16 లక్షలు, 4. పాడి పరిశ్రమ: రు. 7.63 లక్షలు 5. అడవులు: రు. 2.22 లక్షలు, 6. వ్యవసాయ సహకార సంఘాలు: రు. 5 లక్షలు, 7. ఆర్థిక సహాయ కార్యక్రమాలు: రు. 31.88 లక్షలు, 8, స్త్రీ సంక్షేమం: రు, 0.21 లక్షలు

9. పరిశ్రమలు : రు. 16.44 లక్షలు. 10. పట్టుపరిశ్రమ : రు. 8.74 లక్షలు, 11. భూగర్భ జలాలు : రు. 9.00 లక్షలు.

1976-77 సంవత్సరానికి వివిధ పథకాలకు కేటాయింపులు యీ క్రింది విధముగా వున్నాయి : 1. వ్యవసాయం : రు. 6.55 లక్షలు, 2. పశు సంవర్ధన : రు. 17.34 లక్షలు, 3. మత్స్య పరిశ్రమ : రు. 1.70 లక్షలు, 4. పాడి పరిశ్రమ : రు. 18 లక్షలు, 5. వ్యవసాయ సహకార సంఘాలు : రు. 1.80 లక్షలు, 6. ఆర్థిక సహాయ కార్యక్రమాలు : రు. 40.80 లక్షలు, 7. పట్టు పరిశ్రమ : రు. 7.91 లక్షలు, 8. భూగర్భ జలాలు : రు. 1 లక్ష.

భారీ పరిశ్రమలు

రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామీకరణ లోపించటంవల్ల అభివృద్ధికి తీవ్రఆటంకం కలిగింది. అందువలన ఆరు సూత్రాల పథకం క్రింద పారిశ్రామీకరణకు అత్యంత ప్రాధాన్యత యిచ్చారు. ఆరు సూత్రాల పథకం క్రింద కేటాయింపబడిన నిధులలో 20 శాతం భారీ పరిశ్రమల స్థాపనకోసం ఖర్చు చేస్తున్నారు. అనగా సంవత్సరానికి కోటి రూపాయలు పరిశ్రమల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నారు. ఈ పరిశ్రమలలో రాయలసీమ ప్రణాళిక, అభివృద్ధి సంఘం అనుమతి పొందిన కర్నూలు కాగితపు కార్ఖానా రు. 40 కోట్ల పెట్టుబడితో సత్వర నిర్మాణంలో వున్నది. 6 కోట్ల పెట్టుబడితో హిందుపూరు చక్కెర కర్మాగారం 1978 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుందని ఆశిస్తున్నారు.

ఉన్నత విద్య

ఆరు సూత్రాల పథకం క్రింద రాష్ట్రంలోని మూడు ప్రాంతాలలో ఉన్నత విద్యా కేంద్రాలు స్థాపించాలని నిశ్చయించారు. రాయలసీమకు కేంద్రంలోవున్న అనంతపూరు పట్టణంలో ఉన్నత విద్యా బోధనకు పోస్ట్ గ్రాడ్యుయేట్ కేంద్రం స్థాపించాలని నిశ్చయించారు. 1974-75, 1976-77 సంవత్సరాలలో యీ కేంద్రానికి రు. 30 లక్షలు కేటాయించారు. ఈ కేంద్రంలో క్రొత్తగా యేర్పాటుచేసిన అర్థశాస్త్రం, వాణిజ్య శాస్త్రం. న్యాయ శాస్త్రం విభాగాలను అభివృద్ధి చేయటంతో బాటు సామాజిక శాస్త్రం భూగర్భ శాస్త్రం, బయోఫిజిక్సు, న్యాయశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ, యం. బి. ఏ; జర్మన్, ఫ్రెంచి, రష్యన్ భాషలలో డిప్లొమా కోర్సులను ప్రారంభిస్తున్నారు. ఇటీవల యీ పోస్ట్ గ్రాడ్యుయేట్ కేంద్రానికి స్వతంత్ర ప్రతిపత్తిని కలిగించారు. కొద్ది కాలంలో యిది విశ్వవిద్యాలయంగా రూపొందగలదని ఆశిస్తున్నారు.

భవిష్యత్తులో సమస్యలు, అవకాశాలు

ఈ ప్రాంతం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారంగా నిధులను యిచ్చినప్పటికీ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో కొన్ని యిబ్బందులు ఎదురౌతున్నవి. ముఖ్యసమస్య యీ ప్రాంతంలో తగిన నిపుణులు లేకపోవటమే. చిన్న తరహా నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టగల కంట్రాక్టర్లు లభించటం లేదు. ఇట్టి ప్రాజెక్టుల విషయంలో నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చేత నిర్మాణాన్ని జరిపించడానికి, లేక అంచనావేసిన రేట్ల కన్న ఎక్కువ రేట్లు చెల్లించడం ద్వారా యీ ప్రాజెక్టుల నిర్మాణాన్ని త్వరితగతిని పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది. కర్ణాటక సరిహద్దు వెంబడే వున్న ప్రాంతాలలో మరొక సమస్య ఎదురౌతున్నది. కర్ణాటక రాష్ట్రంలో ఎక్కువ కూలీ లభిస్తున్నందువల్ల యీ ప్రాంతాలలో కూలీలు దొరకడం కష్టమౌతున్నది. కర్ణాటకను ఆనుకొని వున్న జిల్లాలలో కర్ణాటకలోని కూలి రేట్లను చెల్లించితేనే యీ ప్రాంతాలలోని ప్రాజెక్టుల నిర్మాణం సత్వరం పూర్తి చేయడానికి వీలు కలుగుతుంది. కంట్రాక్టర్లు లభించని సందర్భాలలో ప్రభుత్వ శాఖలే అదనపు సిబ్బందిని చేర్చుకొని ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టవలసిన అవసరం కూడా వున్నది. దీనివలన నిరుద్యోగులైన ఇంజనీర్లు, మొదలగు సాంకేతిక సిబ్బందికి ఉపాధి కల్పించే వీలు కూడా కలుగుతుంది. రక్షిత నీటి సరఫరా పథకాల విషయంలో పంచాయతీలు చెల్లింపవలసిన తమ వంతు విరాళాలను యివ్వగల స్థితిలో కూడా గ్రామపంచాయతీలు లేవు. నీటి సరఫరా గ్రామీణప్రాంతాలలో ప్రభుత్వం చేపట్టవలసిన ప్రధాన సంక్షేమ చర్య కావటం వలన పంచాయతీలు చెల్లింపవలసిన విరాళాలనుండి వాటిని మినహాయించడం ఎంతైనా అవసరం. అంతేగాక యిందుకు సంబంధించిన కట్టడాలను పంచాయతీరాజ్ ఇంజనీరింగు శాఖ నిర్వహించేట్లు చేయాలి.

సేద్యం కోసం బావులు రాయలసీమ అభివృద్ధికి అతి ప్రాధాన్యత కలిగివున్నాయి. అందువల్ల రాయలసీమ గ్రామాలలో సేద్యపు బావులను త్రవ్వేందుకు ''సేద్యపుబావుల ప్రాజెక్టు'' యేర్పాటు చేయాలి. ప్రభుత్వమే బావుల త్రవ్వకాన్ని చేపట్టి రైతులకు అందజేయాలి. నీటి పారుదల పన్ను ద్వారా గాని, సులభ వాయిదాలలో చెల్లించడంవల్ల గాని బావుల త్రవ్వకానికి అయిన ఖర్చును తిరిగి రాబట్టుకోవచ్చు.

రాయలసీమ ప్రణాళిక, అభివృద్ధి అధ్యక్షుడు హైదరాబాదులోను, రాయలసీమనాలుగు జిల్లా కేంద్రాలలోను నాలుగు నెలలకొక సారి సమీక్ష సమావేశాలు జరుపుతారు. అమలులోవున్న పథకాలను త్వరితంగా అమలు జరిగేట్లు చూడటం, వీటి అమలులో ఎదురయ్యే సమస్యలను చర్చించి వెనువెంటనే వాటి పరిష్కారానికి నిర్ణయాలు చేయడం, అందుకు సంబంధించిన సూచనలను సిబ్బందికి అందజేయడం యీ సమీక్ష సమావేశాలలో చేస్తారు.

తెలుగు వాణి
వెన్నతో పెట్టిన విద్య

కూచిపూడి నృత్య కళారీతులు

నాట్యాచార్య
శ్రీ కోరాడ నరసింహారావు

ఆంధ్రదేశమున వికసించిన లలిత కళలలో "నాట్య" మొకటి. ఇది కాల మాన దేశ పరిస్థితుల ననుసరించి వివిధ పరిణామాలు చెంది కూచిపూడి నాట్యం, లేక కూచిపూడి భరతంగా రూపొందింది. కూచిపూడి లేక కుచేలపురం అనునది కృష్ణాజిల్లా దివి తాలూకా లోనిది. ఈ నాట్య పద్ధతి అనాదిగా బ్రాహ్మణ కులస్థులైన పురుషులభ్యసించారు.

వారు విజయనగర రాజులైన వీరనరసింహా రాయలుచేత ఆదరింపబడి పోషింపబడినట్టు చరిత్రలో కలదు. పాల్కురికి సోమనాథుని కావ్యాలలో వారిని గురించి వ్రాయబడినది. శైవ మతాధిక్యంవల్ల వారు దాని ప్రచారమునకు తమ నృత్యమును వినియోగించారు. వారి శైవలీలా నృత్యంలో యీ విషయం తేట తెల్లము కాగలదు. తరువాత వైష్ణవ మత ప్రభావముచే ఆ మత ప్రచారమునకే నాట్యము వినియోగింపబడింది. భాగవత పురాణాదుల నుంచి కథలు గ్రహించి విష్ణు లీలలు నృత్యంచేసేవారు. ఈ వైష్ణవ, శైవమతముల ప్రాబల్యం నశించిన వెనుక దేశమంతా అరాచకంలో పడిపోయింది. ప్రజల బాధలధికమైనవి. అప్పుడు వారి బాధలను వ్యక్తముచేయు ఇతివృత్తములను గ్రహించి అవి "పగటి వేషము" లుగా ప్రదర్శించి రాజకీయ, సాంఘిక చైతన్యము కలిగించే వారు. ఈ విధముగా వీరు కాలమాన పరిస్థితుల ననుసరించి తమ నృత్యములను ప్రదర్శించేవారు.

ప్రాచీన కాలమున స్త్రీలు నృత్యములలో ముఖ్యమైన పాత్రలు ధరించే వారు. వారినే " నట్టువ మేళము " లని పిలిచెడివారు. కాని తొమ్మిది, పది శతాబ్దముల నాటికి "నట్టువ మేళము" నశించినట్లు కానవస్తున్నది. దాని ఫలితముగా "బ్రాహ్మణ" మేళము అనునది బయలుదేరింది. కూచిపూడి భాగవత మేళము దానికి సంబంధించినదే. దానిలో స్త్రీలు పాత్రలు ధరించి నృత్యము చేయరాదు. కూచిపూడి భాగవత మేళములోని పురుషులకు సంస్కృతము, తెలుగు సాహిత్యములు బోధించేవారు. సంగీతంలో శిక్షణ కూడ ఇచ్చేవారు. వారు నాట్యశాస్త్రమును, నందికేశ్వర అభినయ దర్పణమును, అలంకార శాస్త్రమును క్షుణ్ణముగా అభ్యసించి నాట్య, నృత్య, నృత్త గీతములలో ప్రావీణ్యం సంపాదించే వారు.



విజయనగర సామ్రాజ్యం పతనమైన తరువాత కూచిపూడి భాగవతులు తంజావూరు వలసపోయారు. తంజావూరు నాయక రాజులు వారిని పోషించారు. అచ్చట మహత్తరమైన నృత్య కళాఖండములను తయారుచేసి ప్రదర్శించి ఘనకీర్తి సంపాదించారు. దీనికి ఫలితంగా (1561-1614) అచ్యుతప్ప నాయకుడనే రాజు కళా ప్రదర్శనానికి ఆనందించి అగ్రహారాన్ని బహుమతిగా ఇచ్చాడు. కళా వేత్తలగు ఈ బ్రాహ్మణ కుటుంబీకులు ఆ అగ్రహారానికి "అచ్యుతపురం" అను నామకరణం చేసి అచ్చట నివశించారు. ఈ అచ్యుతపురమే నేటి "మెలటూరు". యక్షగానములు, తదితర నృత్యనాటికలను పరిసర ప్రాంత గ్రామవాసులు ప్రదర్శిస్తున్నారు. ఇవి అన్నియు తెలుగు భాషలోనే నేటికీ ఉన్నాయి. అంతేగాక ఈ మెలటూరులో వార్షిక నృత్యగీత సభలు, వేడుకలు జరుగుతున్నవి.



వెంకటరమణ,భాగవతులు తెలుగున రచించిన యక్షగానములు, నృత్య నాటికలు ప్రదర్శితమవుతున్నవి. ఈ వెంకటరమణ భాగవతులు శ్రీ త్యాగరాజునకు సమకాలికుడు. ఇవి అన్నీ మన కూచిపూడి యక్షగానాలను, నృత్యనాటికలను తూ. చ. తప్పకుండా పోలివున్నవి. ప్రతి విషయంలోను ప్రవేశ దరువు, రక్తిగానం, రంగస్థల నిర్మాణం, వాయిద్యములు, జతి నడక పోకడలు, నేపథ్య సంగీతం అన్నీ అతి సన్నిహిత సంబంధము కలిగి వున్నాయి. తంజావూరు ప్రాంతాన గల దేవదాసీలు ఇందులోని కీర్తనలు, పదాలు అభ్యసించి మందిరములలో, దర్బారులలో, వేడుక సమయములలో ప్రదర్శిస్తూ వస్తున్నారు. ఇదే కాలపరిస్థితుల ననుసరించి ముఖ్య పరిణామములను చెంది నేటి తంజావూరు నృత్య సాంప్రదాయం విలసిల్లినది.

కూచిపూడి నృత్య సాంప్రదాయమందు "మువ్వగోపాలపద అభినయము" చక్కని విశిష్టతతో కూడి వున్నది. కూచిపూడి అగ్రహారమ్మునకు "మువ్వ" గ్రామం చాలా దగ్గరలో కలదు. ఇచ్చట క్షేత్రయ్య అనే గొప్ప సాహిత్య సంగీత, నృత్యవేత్త జన్మించాడు. అతడు గోపాలుని శృంగార చేష్ట లన్నీ చక్కని పదములుగా రచించాడు. ఈ పదములన్నియు నాట్యలక్షణమున కతిసన్నిహితములు. అష్టవిధ నాయికలలో ప్రధానమగు శృంగార నాయిక యిందులో ముఖ్యస్థాన మలంకరించినది. తంజావూరు రాజు విజయ రాఘవ నాయకుడు వీరిని పోషించాడు. విజయరాఘవుడు సాహిత్యవేత్త, సంగీత

విద్వాంసుడు. నాట్య, అభినయము లతని అభిమాన విషయములు. ప్రఖ్యాత ఆంధ్ర నర్తకీమణులు, పండితరాంద్రు అయిన రంగాజమ్మ, చంద్రలేఖ, మనోరమ వీరి ఆస్థాన నాట్యకత్తెలు. వీరందరు క్షేత్రయ్య పదములను చక్కని సాత్త్వికాభినయములతో ప్రదర్శించి నవరసభరితములుగా చేసారు.


రసము. వాస్తవముగా సత్యభామ ప్రోషిత భర్తృక. కాని కథాగమనమున విరహోత్కంఠిత, కలహాంతరిత. ఖండితగా మారుతుంది. ఈ విధముగా ఆయా నాయిక లక్షణములను, రసములనుపోషించి నేర్పరితనమున భామాకలాపము ప్రదర్శనం చేయాలి. సిద్ధేంద్ర యోగి కూచిపూడి బ్రాహ్మణ యువకులకే విద్య నేర్పారు. జీవితములో ఒక్కసారైనను కూచిపూడిలో ప్రతిపురుషుడు సత్యభామపాత్రను ధరించాలని వారిచే శపథము చేయించారు. వారు అబ్దుల్ హాసన్ తానిషా (గోలుకొండ నవాబు)ను తమ నృత్య ప్రదర్శనముచే రంజింపచేసి వారివద్ద నుంచి కూచిపూడి భాగవతుల పోషణార్థం అగ్రహారము నాను కొని వున్న భూములను యీనాముగా బహుమతి పొందారు. దాని ఫలితముగా యీ విద్య నశించి పోకుండా, తరతరాలుగా శ్రుతులవలె అభ్యసింపబడుతున్నది. నేటికిని స్థిరముగా వుండడానికి ముఖ్య కారణమిదే.

భామా కలాపము కూచిపూడి సంప్రదాయమున ఉన్నత శిఖరాగ్ర మలంకరించినది

భామాకలాపం

క్షేత్రయ్య పదములు సాత్త్విక రసాభినయనమునకు వన్నె తెచ్చినవి. కూచిపూడి, మెలటూరు భాగవతులు ఈ పదములను అభ్యసించి, శృంగార రసమును దాని వివిధ స్థాయిలను సాత్త్వికాభినయమున మిక్కిలి నేర్పుతోను, అతి సున్నితముగాను, జీవకళ వుట్టిపడినట్టు ప్రదర్శించారు. ఇవి కూచిపూడి నృత్యములలో భాగములుగా లీనమైనవి.

కూచిపూడి నృత్యం అంటే భామాకలాపమే అనే పేరు వచ్చింది. భామాకలాప నృత్యము కూచిపూడి సంప్రదాయమున ఉన్నత శిఖరాగ్రమునలంకరించినది. పదహారు, పదిహేడు శతాబ్దములలో నృత్యవేత్తలు నూతన నృత్య ప్రదర్శనమునకు తహతహలాడినట్టు తోస్తున్నది. దీని ఫలితముగా "భామాకలాప" నృత్య నాటకము జన్మించింది. వివిధ రసాలతో, పాత్రలతో ప్రత్యేకమైన నవ్యరీతిలో, నాటికి శిథిలమైన నృత్య నాటకములకుపోటీగా భామాకలాపము బయలుదేరింది. సిద్ధేంద్ర యోగీంద్రులచే యిది రచింపబడింది. ఇందు పారిజాతాపహరణమను కథ ఒకటి కలదు. సత్యభామ దానికి నాయిక. సత్య తన వల్లభుడు కృష్ణభగవానుని పారిజాత వృక్షమును స్వర్గము నుంచి తెచ్చి తన ఉద్యానవనములో నాటవలసిందిగా కోరుతుంది. విప్రలంభ శృంగారము దీనికంతటికి ప్రధాన





తరంగ నృత్య తరంగిణి

తరంగ నృత్యము కూచిపూడి నృత్యకారులకు వెన్నతో పెట్టిన విద్య. నారాయణతీర్థుల వార "కృష్ణలీలాతరంగిణి" పాడడానికి, నృత్యము చేయడానికి వీలుగా వున్నది. తరంగములలో ఆంగికాభినయమునకు ప్రాధాన్యము ఎక్కువ. కృష్ణుని జీవితమంతా శ్లోకములలోను, కీర్తనలలోను వ్రాయ

బడింది. ప్రతి కీర్తనకు చివర తీవ్రమైన నృత్యము చేయుటకు ఉపయోగపడే భాగం ఉంటుంది. బాలబాలికలచే ఘటముల పైన, నీరు పోసిన పళ్ళెరములపైన చిత్ర విచిత్ర తాళములచే



నృత్యమాడిస్తారు. చూచుట కెంతో ముచ్చటగా వుంటుంది. "బాలగోపాలమా" అనేటప్పుడు నర్తకులు కృష్ణుని జన్మ మొదలుకొని రాసక్రీడల వరకు వివిధ లీలలను చక్కని ముద్రలతో భంగిమలతో నృత్యమును మేళవింపచేసి, చక్కని ఉద్ధతమైన నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

జయదేవుని అష్టపదులు రసాభినయమునకు మణి పూసలు.

కూచిపూడి ఒక మహత్తర ఆంధ్ర నృత్య సంప్రదాయముగా అభివృద్ధి చెందినది

అష్టపదులు

మధుర వేణురవము స్రవింపచేయు నందకిశోరుడు రాధ పొత్తును ఆశించడం ; వారిరువురు పంచబాణుని శరాఘాతములను తట్టుకోజాలక విరహతాపం పొందడం ; చివరకు రాధాకృష్ణులు కలియడం, వారి ప్రేమలీలలు ఇవన్నీ వర్ణిస్తూ అష్టపదులు మనల్ని అమృతరస వాహినిలో నేటికీ ముంచెత్తి తన్మయులను చేస్తున్నవి. సంధ్యా సమయము, బృందావనము, యమున తరంగడోలికలు, సుగంధ మంద మారుతములు, పూచిన పూపొదరిండ్లు, అళి ఝుళికారము, కీచక స్వనము, శారికారవములు, కేకినాదములు, పికశుక స్వరములు, లేళ్ళు, నెమళ్ళు, రాధాశ్యాముల చెలికత్తెలు, చెలికాండ్రు పదపదమున హృదయము పొంగించే రాసలీలావర్ణనలు అష్టపదులలోని ముఖ్యాంశాలు.

అష్టపదులు బాహ్యదృష్టికి కామప్రశక్తితో కూడినట్లు కనబడినప్పటికి, వాటిలోపల మానవజన్మను తరింపజేసే మహోత్కృష్టమైన భక్తిరస ప్రతిపాదన కలదు. కళాద్రష్ట యీ రహస్యాన్ని గ్రహించి రసాన్వితమైన కళానందాన్ని సాధించి బ్రహ్మానందాన్ని పొంది తరించడానికి మాత్రమే అష్టపదులను గ్రహించాలి. గొల్లకలాపమనే నృత్యము కూచిపూడి నృత్య సంప్రదాయములో చేరి వున్నది. అనాదిగా వస్తున్న ఈ నృత్యము 17, 18 శతాబ్దములలో కూచిపూడి భాగవతులభ్యసించి ప్రదర్శించి తమ సొత్తుగా చేసుకొన్నారు. గొల్లకలాపమనేది వేదాంత చర్చ. ఈ చర్చ ఒక గొల్లభామకు, బ్రాహ్మణునికి జరిగినది. దాన్ని గొల్లకలాపమనే పేరుతో నృత్యమాడుతారు. ఇందులో పిండోత్పత్తి అనే భాగము చూపరుల హృదయాన్ని హత్తుకపోతుంది.

ఈ విధముగా కూచిపూడి నృత్య సంప్రదాయములో స్వర పల్లవి, తానపద వర్ణములు, తిల్లానాలు, శబ్ద పల్లవి, ఆధ్యాత్మ రామాయణ కీర్తనలు, జావళీలు, మండూక శబ్దము, దశావతార శబ్దము, దరువులు, కందార్థములు త్యాగయ్య కీర్తనలు లీనమైనవి. ఉషాపరిణయము, రామనాటకం, హరిశ్చంద్ర, కుచేలోపాఖ్యానము, ప్రహ్లాద, రుక్మాంగదచరిత్ర మొదలైన అనేక నృత్య నాటకము లిందు లీనమైనవి. ఇదొక ప్రత్యేకమైన భాగవత కట్టుగా ప్రచారమై కాలమాన పరిస్థితుల ననుసరించి వివిధ పరిణామములను చెందుతూ ఒక మహత్తరమైన ఆంధ్ర నృత్య సంప్రదాముగా అభివృద్ధి చెందింది.

ప్రగతి గీతాలు

కళాప్రపూర్ణ
బోయి భీమన్న

రాఁవమ్మా ప్రగతీ !
లేవమ్మా సుగతి !
పేలగ మా తెలుగు పంట
చేలలోన లక్ష్మిగా,
లీలగ మా తెలుగు కళా
శాలలో వాణిగా ॥రా॥

కృష్ణవేణి, మంజీర,
గోదావరి, వంశధార
శతానేక నవజీవన
జనావనీ ! సుధావనీ ॥రా॥

అందాలకు వివిధ రసా
నందాలకు నిలయమిది,
ప్రేమము ఈ తెలుగు, మా
శ్రేయము నీ వెలుగు
కృషిరూపా, మానవతా
కృతిదీపా ! రావమ్మా !
యువశక్తుల నవదీక్షకు
ఉత్తేజము నీవమ్మా ॥రా॥

కొత్త పాట

విన్నావటే ?
బోటి, మన తోటలో ఇ
దేదో ఒక క్రొత్త పాట ॥వి॥
తోట పాతదైన ఈ
పాటెంతో కొత్తది !
స్వరం సనాతమైనా
సరళి నేటి జనతది, ॥వి॥

ఎన్నెన్ని యుగాలు
ఇందువచ్చి పోలేదు ?
ఇందిరా మహోదయ మిం
టింట సుప్రభాతమాయె ! ॥వి॥

చీకటి చింతలు కరిగి
చిగురించిన ఆశలతో
ప్రతి నవయువ కంఠంతో
ప్రగతి వీర శంఖ ధ్వని ! ॥వి॥

పసిడి పళ్ళెం

ఊళ్లు ఊళ్ళే లేచిగమ్మున
లేళ్లవలె,పరిగెత్తుచున్నవి !
వేదనాదం విరిసెనో;
విజయ శంఖం మొరసెనో !

కనులు తెరిచిన రెండు కరములు
కలము పట్టెను, హలముపట్టెను !
అసమ తమసిని తుంచుకో,
అభ్యుదయమును పెంచునో !

నాగుబాముల బోలువాగుల
భోగముల నరికట్టి నిల్పెను !
బాలకృష్ణుల పదములో,
ప్రజలప్రాభవ దీక్షలో !

రాళ్లు, రప్పలు నరికి, బంజరు
బీళ్లు దున్ని ముఖాలు కడిగిరి !
వసుధ గుడియ పండెనో,
పసిడి కంచము నిండెనో !


భారత చరిత్రలో ఆంధ్ర శకానికి వచ్చినంత ప్రాధాన్యం యితర శకాలు పొందలేదు

తెలుగు దేశం మీద బౌద్ధ మత ప్రభావం

డాక్టర్ ఎన్. రమేశన్

ఆంధ్ర దేశపు సాంఘిక, సాంస్కృతిక జీవితం ఉత్తర, దక్షిణ భారతాల ప్రభావాలకు ఎల్లప్పుడూ లోనౌతూనే వున్నది. అందువలన ఉత్తర, దక్షిణ భారత దేశ ప్రాంతాలలో కనుపించే అనేక విశిష్ట లక్షణాలు ఆంధ్ర దేశంలో కూడా కనిపిస్తాయి.

బౌద్ధ మత కాలంలో నేటి తెలుగు, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు నివసించే ప్రాంతాలు కలిసి ఒక సమగ్ర భూభాగంగా వుండేవి. అ ప్రజల సాంఘిక, సాంస్కృతిక జీవితాలలో తేడాలుండేవి కాదు, ఈ కారణం వలన ఆంధ్ర దేశంలో లభ్యమైన బౌద్ధ పురాతత్వ, సాహిత్య ఆధారాల నుండి లభించే వివరాలకు పశ్చిమ దక్కన్ ప్రాంతంలో ఆకాలపు ఆధారాల వివరాలను జోడించటం వాంఛనీయమే గాక, అత్యవసరం కూడా, దీనివల్ల మనకు ఆనాటి సమగ్రమైన స్వరూపం ద్యోతకమౌతుంది. చారిత్రిక మార్పులవలన, ఇతర కారణాల వలన యిది తరువాత కాలంలో క్రమక్రమంగా మార్పు చెందినా ఆధునిక ఆంధ్ర దేశంలో బౌద్ధ కాలంలో యేర్పడిన అనేక విశిష్ట లక్షణాలు నేటికీ మనకు గోచరిస్తాయి.



బౌద్ధ మతంలో ఆంధ్ర శకం

భారత చరిత్రలో ఆంధ్ర శకానికి వచ్చినంత ప్రాధాన్యం యితర శకాలు పొందలేదు. సర్దార్ కె. యం. పణిక్కర్ చెప్పినట్లు "దక్షిణ భారత దేశంలో నవీన ఆర్య నాగరికత" పెంపుదలకు ఆంధ్ర శకం ఎంతో తోడ్పడింది. ఆంధ్ర రాజ వంశపు క్రమాను పట్టిక వివరించటం యీ వ్యాసంలో సాధ్యం కాదు. ఆంధ్రుల గురించి మొట్ట మొదటి తెలియ జేసింది ఐతరేయ బ్రాహ్మణంలోనే. దానిలో ఆంధ్రులను దక్షిణ భారతంలోని ఒక తెగగా పేర్కొన్నారు. క్రైస్తవ శకం ప్రారంభానికి కొన్ని శతాబ్దాల క్రింద వారు ఆర్యుల నివాస స్థానాలకు వెలుపల నివసించినట్లు తెలుస్తున్నది. అశోకుని ఒక శిలా శాసనంలో ఆంధ్రులను "రాజ పరిపాలనా ప్రాంతంలో" నివసిస్తున్న ఒక తెగగా వర్ణించటం జరిగింది. మెగస్తనీసు, ప్లినీవంటి విదేశ రచయితలు ఆంధ్రులను గొప్ప శక్తివంతమైన జాతిగా పేర్కొన్నారు. పురాణాలలో కూడా

ఆంధ్ర దేశంలోని స్థూపాలకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి

ఆంధ్రుల ప్రసక్తి వున్నది. టాలెమీ తన రచనలలో యితర విషయాలతోపాటు ఆంధ్రుల నౌకాశ్రయాలను వర్ణించాడు. అశోకుని తర్వాత ఆంధ్రులు స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నారు. వారి రాజులైన శాతవాహనులు అన్ని దిక్కులా తమ అధికారాన్ని విస్తరించుకొని దక్షిణ మధ్య భారత దేశ ప్రాంతాలంతటా తమ సామ్రాజ్యాన్ని నెలకొల్పారు. శాతవాహనుల పరిపాలనా కాలం (క్రీ. పూ. 3 వ శతాబ్ది నుండి క్రీ. శ. 3 వ శతాబ్ది వరకు) లో వ్యాపారం, వలస రాజ్యాలతో సంబంధాలు అధికం కావటం, బౌద్ధ సంస్కృతి, కళలు అభివృద్ధి చెందటం జరిగింది. ఈ కాలంలో బౌద్ధ మతంలోని రెండు శాఖలు—హీనయానం, మహాయానం—అభివృద్ధి చెందాయని చెప్ప వచ్చును. ఆంధ్రదేశంలో వలె భారత దేశంలోని యే యితర ప్రాంతంలో కూడా అన్ని బౌద్ధ స్థలాలు కన్పట్టవు. ఆంధ్రదేశంలో బౌద్ధ మతం మొట్ట మొదటిసారి యెప్పుడు ప్రవేశపెట్టబడిందో స్పష్టంగా చెప్పడం కష్టమైన విషయం. కాని ఆంధ్రదేశంలో లభించిన అతి పురాతన చారిత్రిక అవశేషాలు బౌద్ధమత సంబంధమైనవే. వాటిలో కొన్ని అశోకుని కంటె ముందువి. ప్రఖ్యాత ఫ్రెంచి చరిత్రకారుడు, జూవో డూబ్రిల్ మాటలలో, "ఆంధ్రులు అద్భుతమైన జాతిగా మనకు గోచరిస్తారు. అమరావతి శిల్పానికి, నాగార్జునుని వేదాంతానికి మనం ఆంధ్రులకు ఋణపడి వున్నాము." ఇంతవరకూ కనుగొనబడిన, లేక పురాతత్వ వేత్తల పరిశోధనకు యెదురు చూస్తున్న బౌద్ధ స్థలాలలో అమరావతి, నాగార్జున కొండ, జగ్గయ్యపేట, గోలి, ఘంటసాల, గుమ్మడి దుర్రు, గుడివాడ, భట్టిప్రోలు, గుంటుపల్లి, అద్దూరు, శంకరం, రామతీర్థం, శాలిహుండం కొన్ని మాత్రమే.

ఆంధ్ర స్థూపం ప్రత్యేక లక్షణాలు

పైన పేర్కొన్నట్లుగా ఆంధ్రపథంలో అశోకుని పూర్వానికి చెందిన వాటితోపాటు అనేక బౌద్ధ అవశేషాలు విస్తారంగా కన్పిస్తున్నాయి. ఇవి అమరావతి, జగ్గయ్యపేట, గోలి, నాగార్జున కొండ, భట్టిప్రోలు, గుంటుపల్లి, శంకరం, ఘంటసాల మొదలైన అనేక స్థలాలలో లభ్యమైనాయి. ఈ స్థలాలలోని బౌద్ధ స్థూపాలలోని వాస్తు విశేషాలతో బాటు, జగ్గయ్యపేట, అమరావతి, నాగార్జునకొండ గోలి ప్రాంతాలలోని శిల్పాలలోని, విశిష్టలక్షణాలు, దక్షిణ భారతదేశంలో లభించిన తర్వాత కాలపు శిల్పాలకు మార్గదర్శకమయ్యాయని చెప్పవచ్చు. అందువల్ల వీటిపరిశీలనవాస్తు శిల్పంలో ఆసక్తి వున్న వారికి సహాయ పడవచ్చు.

బౌద్ధ స్థూపాలను, వాటి విశిష్టలక్షణాలనుబట్టి మూడు తరగతులుగా విభజించారు. అవి (1) శారీరక, (2) పరిభోగ, (3) ఉద్దేశిక. బుద్ధుని అవశేషాన్ని కలిగివున్నవి శారీరక



స్థూపాలు, బుద్ధుడు ఉపయోగించిన వస్తువులను కలిగి వున్నవి పరిభోగిక స్థూపాలు. బుద్ధుని పర్యటన వలన పవిత్ర స్థలాలుగా మారినచోట నిర్మించినవి ఉద్దేశిక స్థూపాలు. ఆంధ్రపథంలో కనిపించే అసంఖ్యాక స్థూపాలలో అమరావతి, భట్టిప్రోలు స్థూపాలు శారీరక స్థూపాలని అనిపిస్తున్నవి. ఎందుకంటే యీ ప్రదేశాలలోని శాసనాలలో యీ స్థూపాలు బుద్ధుని అవశేషాలు కలిగివున్నట్లు పేర్కొనబడింది. మిగతావన్నీ ఉద్దేశిక స్థూపాలే. ఇక్కడ పరిభోగిక స్థూపాలు నిర్మించినట్లు కనబడదు. భారత స్థూపాలలో మూడు భాగాలున్నాయి. (1) గోళాకారము (డ్రమ్), (2) ఒక ఛత్రము లేక అనేక ఛత్రములు కలిగిన ఊర్ధ్వ భాగము, (3) స్థూపం నుండి కొద్ది దూరంలో చుట్టూ నిర్మించిన దడి (కంచె) స్థూపానికి, దీనికి మధ్యగల స్థలంలో భక్తులు ప్రదక్షిణ చేసేందుకు ఖాళీస్థలంవుంటుంది.


ఆంధ్ర పథంలోని స్థూపాలకు కొన్ని ప్రత్యేక లక్షణాలున్నాయి. నిర్మాణంలోను, మత ప్రాశస్త్యంలోనూ యిక్కడి స్థూపాలు యితర ప్రాంత స్థూపాలవలెనేవున్నా, నాగార్జునకొండవద్ద వున్న స్థూపం కొన్ని విశిష్టలక్షణాలను కలిగివున్నది. భారతదేశంలోని యితర స్థూపాలుగాని, శ్రీలంక మరియు యితరదేశాలలోని స్థూపాలుగాని యీ లక్షణాలను కలిగిలేవు. వీటిలో మొదటి ప్రత్యేక లక్షణం పునాది నిర్మాణం బండిచక్రము, ఆకులరూపంలో వుండటం, నిర్మాణం పూర్తియైన పిదప ఛత్రం రూపం కలిగి వుండటం. రెండవ విశిష్టలక్షణం స్థూపం యొక్క నాలుగు ద్వారాలకు ఎదురుగా గోళాకారానికి ముందుకు వచ్చే ఖాళీ స్థలాలు, వాటిపై నిర్మించిన 'ఆయక కంభాలు' అనే స్తంభాలు ఈ స్థంభాల మధ్యవుండే వేదికలను కూడా "ఆయక వేదికలు" అంటారు. ఆంధ్ర స్థూపాలలోని యీ స్థంభాలు వాటి ప్రత్యేక లక్షణాలు. ఈ స్థంభాలు మొదట్లో చతురస్రాకారంగాను. మధ్య భాగం అష్టాసంగాను, పై భాగం గుండ్రంగానూ వుండి, స్తంభం అగ్రస్థానాన పూర్ణ ఘటం, చక్రం, త్రిరత్నం, స్థూపం వంటి బౌద్ధ చిహ్నాలు వుంచుతారు. మూడవది, యిక్కడి స్థూపాల ప్రవేశ ద్వారాలు సాంచీస్థూపం

వలె విశాలమైన తోరణ అలంకారాలను కలిగివుంటవు. కాని, శిల్పాలలో ప్రదర్శించిన రాదాప్రాసాదాలుమాత్రం అలంకారం లేకుండా సాంచీ ప్రవేశఆస్వీరాలవంటివి కలిగివున్నాయి. తోరణ ద్వారాల బదులు జనమైన సింహాలు అగ్రస్థానాన కలిగిన సామాన్య స్తంభాలు ప్రతి ప్రవేశద్వారానికి యిరు వైపుల నిర్మించారు. నాలుగవ విశిష్ట లక్షణం, స్థూపమంతటా శిల్ప ఫలకాలతో బుద్ధుని జీవితంనుండి, జాతక కథలనుండి దృశ్యాలు రమణీయంగా శిల్పకళతో చిత్రించారు. ఈ ప్రత్యేక లక్షణం బార్హుత్ స్థూపంలో, గాంధార స్థూపంలో మాత్రమే కనిపిస్తున్నది. ఇతర ప్రాంతాలలోని స్థూపాలలో కని పించదు. పైన తెల్పిన విస్తారమైన అలంకారాలు, పెద్ద యెత్తున నిర్మించిన స్థూపాలతోపాటు, బొజ్జంకొండ, గుంటు పల్లి వంటి కొన్ని ప్రదేశాలలో—కొండ గుహాలలో అతి సామాన్యమైన రాతితో మలచిన స్థూపాలుకూడా కనిపించాయి. అతి పురాతన కాలపు స్థూపాలలోని లక్షణాలను కలిగిన యీ రాతి స్థూపాలు క్రైస్తవ శకం ప్రారంభంనాటివి. ఆ కాలం నాటి నిర్మింపబడిన స్థూపం యెలా వుండేదో అమరావతివద్ద లభించి పూర్తి స్థూపాన్ని కలిగివున్న శిలాఫలకం వల్ల తెలు స్తుంది.

ఆనాటి విహారాలు ఎలా వుండేవో తెలుసుకొనేందుకు వీలులేకపోయినా, అమరావతివద్ద లభించిన క్రీ. శ. రెండవ శతాబ్దికి చెందిన శిలాఫలకం వల్ల మనం విహారం రూపాన్ని ఊహించుకోవచ్చు. ఈ శిలాఫలకంలో ఒక వృక్షముచుట్టూ నిర్మించిన అనేక అంతస్తుల భవనం చూపబడింది. ఇది విహారమై వుంటుందని భావిస్తున్నారు. ఈ భవనంలోని ప్రతి అంతస్తు 'కూడు' అని పిలువబడే చైత్య గవాక్షము కలిగివున్నది. ఈ భవనం సామాన్య ప్రజలకొరకు వుద్దేశింపబడినది కాదని తెలిపేందుకు యీ గవాక్షంవద్ద మానవచిత్రాలు చూపబడలేదు. 'కూడు' వద్ద మానవ రూపాలు చూపబడక పోవటంవలన యీ భవనం సామాన్య మానవులకొరకు వుద్దేశింపబడింది కాదని స్పష్టమౌతున్నది. కాని యీ భవనం విహారంవలె చతురస్రంగా కాక గుండ్రంగా వుండటంవలన, యీ భవనం బోధి వృక్షం చుట్టూ నిర్మింపబడిన ఒక పవిత్ర భవనం అయివుంటుందనీ, అప్పు డప్పుడు బౌద్ధ సన్యాసులు, లేక స్థానికులు అందులో బసచేస్తూ వుండేవారనీ ఊహింపవలసి వస్తున్నది. ఈ భవనం యెందు కొరకు వుపయోగింపబడినా, యితర ప్రాంతాలలోని శిల్పాల లోను, చిత్రపటాలలోను యిట్టివి కనబడనందున, యీ భవనం ఆంధ్రదేశానికి ప్రత్యేకమైనదని, అతి విచిత్ర నిర్మాణం కలిగిన దనీ భావించవచ్చు.

ఆంధ్రదేశంలో బౌద్ధమతానికి ఇక్ష్వాకుల సేవ

శాతవాహనుల తరువాతి రాజవంశాలలో బౌద్ధమతానికి పోషణ కల్పించినవారిలో ఇక్ష్వాకులు అతి ప్రముఖ రాజవంశం. కృష్ణా జిల్లా నందిగామ తాలూకా జగ్గయ్యపేట వద్దను,



గుంటూరు జిల్లా పల్నాడు తాలూకా గురజాలవద్దను, నాగార్జున కొండ వద్దను లభించిన శాసనాలవలన నాగార్జునకొండ ప్రాంతం లోని శ్రీపర్వతంవద్ద విజయపురి రాజధానిగా పరిపాలించిన నలుగురు ఇక్ష్వాకువంశ రాజుల పేర్లు మనకు తెలుస్తున్నాయి. వీరు శాంతమూల, వీరపురుషదత్త, ఎహువల శాంతమూల మరియు రూదపురిశదత్త. ఇక్ష్వాకు వంశస్థాపకుడు శాంత మూల అగ్నిస్తోమ, వాజపేయ, అశ్వమేధ యాగాలను చేసి నట్లు తెలుస్తున్నది. దీనివలన ఆతడు అతిప్రముఖ రాజని మనం భావింపవచ్చు. అతడు తన పొరుగునవున్న కులహకులు, హిరణ్యకులు, హుకియలు వంటి బలమైన రాజవంశాలతో వివాహ సంబంధాలను నెలకొల్పినట్లు తెలుస్తున్నది. వీరపురుష దత్త పుత్రుడు, వారసుడు పరిపాలనా కాలంలో అతడు తన తండ్రికాలంలో యేర్పడిన రాజ్యాన్ని ఉజ్జయిని, వనవాసి రాజ కుటుంబాలతో సన్నిహిత సంబంధాలద్వారా బలపర్చుటయేగాక, నాగార్జునకొండ, జగ్గయ్యపేటలవద్ద అనేక బౌద్ధారామాల నిర్మాణంలోకూడా తోడ్పడ్డాడు.

ఇక్ష్వాకు వంశం కొద్దికాలమే పరిపాలించినా, ఆ రాజుల కాలం బౌద్ధమత చరిత్రలో చాలా ప్రాముఖ్యమున్న సమయం. వారి కాలంలో నూతన స్థూపాలు, విహారాలు నిర్మించటం, పాతవాటిని పునరుద్ధరించటం జరిగింది. వారి కాలంలోనే నాగార్జునకొండ, జగ్గయ్యపేట ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన మహాయాన బౌద్ధ భిక్షువులకు యాత్రా స్థలాలు అయినవి. ఇక్ష్వాకుల కాలంలో నాగార్జునకొండవద్ద సింహళ విహారం నిర్మించటం, సింహళానికి చెందిన థెరి భిక్షువుల కోసం ఒక ప్రత్యేక చైత్య గృహం యేర్పాటు చేయడం ఆ కాలంలో భారత సింహళ దేశాలమధ్య నెలకొనివున్న స్నేహ సంబంధాలకు సంకేతాలు. ప్రొఫెసర్ వోగెల్ పేర్కొన్నట్లు ఆ కాలంలో యీ ప్రాంతంలో బౌద్ధమతం ఉచ్ఛదశలో వున్న దని చెప్పవచ్చు.



ఆంధ్ర బౌద్ధ ఆచార్యులు

నాగార్జునుడు : ఆంధ్ర దేశాన్ని తమ నివాసం చేసుకున్న బౌద్ధ ఆచార్యులలో నాగార్జునుడు అగ్రగణ్యుడు. ఒక కథనం ప్రకారం ఆయన విదర్భలో జన్మించాడు. హుయన్‌సాంగ్ ప్రకారం ఆయన దక్షిణ కోసలవద్ద ఒక బౌద్ధారామంతో నివసించేవాడు. ఏడు సంవత్సరాల చిరుత ప్రాయంలో ఆయన మృత్యువును జయించాడు. ఒక కథనం ప్రకారం ఆయన బ్రహ్మ విజ్ఞానాన్ని సాధించి కంచివద్ద 'తార' సహాయంతో సిద్ధించాడనీ, మరొక కథనం ప్రకారం నలందావద్ద 'చండిక' దయవలన సిద్ధి పొందాడనీ తెలుస్తున్నది, ఆయన నాగ లోకాన్ని సందర్శించి 'ప్రజ్ఞాపారమిత' అనే బౌద్ధ గ్రంథాన్ని సంపాదించాడని చెబుతారు. ఆయన రచనలలో విశిష్టమైనది 'రస రత్నాకరం'. దానిలో అయన "పర్వత" అనే ప్రదేశంలో తన నివాస స్థలం గురించి, పాదరసాన్ని, వజ్రాలను గురించి చేసిన ప్రయోగాలను వివరించాడు. తనకు పూర్వం నివసించిన "స్కంధ" అను శాస్త్రజ్ఞుని విషయాన్ని గూడా ప్రస్తావించాడు. ఆయన ఖనిజాలపై ఎన్నో ప్రయోగాలు చేశాడు. ద్రవములను కాపుబట్టుట, భస్మీకరణం అను విధానాలను కనిపెట్టాడు. ఇనుమును కాల్చటం, పాదరసపు భస్మం తయారుచేయటం మొదటిసారి ఆయన వర్ణించాడు. ఆయన రచించిన అనేక గ్రంథాలలో 24 మాత్రమే మనకు లభ్యమౌతున్నాయి. వాటిలో కొన్ని : ప్రజ్ఞాపారమిత శాస్త్ర; ప్రజ్ఞామూల శాస్త్ర-టీక ; ప్రజ్ఞా ప్రదీప—శాస్త్రకారిక ; మూలమాధ్యమిక ; సూన్య సప్తతి ; మధ్యాంతానుగమ శాస్త్ర ; దశభూమి విదశ శాస్త్ర ; ద్వాదశ నికాయ శాస్త్ర ; వివాద సమాన శాస్త్ర ; ఉపాయ కౌసల్య హృదయ శాస్త్ర; విగ్రహ వ్యావర్తిని కారిక. ఆయన మరొక గ్రంథం 'సహృల్లేఖ'. అది తన రాజుకు ఆయన వ్రాసిన లేఖ. ఇట్సింగ్ అనే చైనా యాత్రికుడు క్రీ. శ. 700 సంవత్సరంలో భారత దేశాన్ని సందర్శించినప్పుడు యీ దేశంలోని యువకులు వృద్ధులు అందరూ యీ లేఖను కంఠోపాఠం చేసేవారట. ఘనమైన అష్టాంగ మార్గాన్ని, చతుర్విధ సత్యాలను అర్థం చేసుకొనేందుకు త్రివిధమైన విజ్ఞానాన్ని అనుసరించాలి. దీనివలన దివ్యమైన పరిపూర్ణత్వాన్ని పొందగలము. అవలోకితేశ్వరుని వలె మనం స్నేహితులకు, శత్రువులకు మధ్య భేదాన్ని పాటించకూడదు. అప్పుడు మనం 'సుఖావతి' లో శాశ్వతంగా జీవించగలము. బుద్ధి అమితభ శక్తివలన ప్రపంచంపై ఉన్నతమైన నిర్మాణ శక్తిని అమలు చేయవచ్చు" అనే సలహాలు యీ లేఖలో ఆచార్య నాగార్జునుడు రాజుకు అందజేశాడు.

నాగార్జునుని జీవితకాలం గూర్చి ఒక ఒప్పందం లేదు. బహుశా ఆయన క్రీ. శ. 200 సంవత్సరానికి చెంది వుండవచ్చు. లేక అయన మూడవ శతాబ్ద ప్రారంభంలో కూడా జీవించి వుండవచ్చు. జగ్గయ్యపేటవద్దనున్న క్రీ. పూ. 5వ శతాబ్దపు శాసనంలో నాగార్జునుని శిష్యునియొక్క ప్రశస్తి వున్నది. నాగార్జున కొండవద్ద శాసనాలలో భదంత ఆనంద, ధర్మనంది, చంద్రముఖ, నాగ వంటి ప్రముఖ బౌద్ధ భిక్షువుల పేర్లు కనిపిస్తాయి. ఆర్య దేవుడుగాక, నంద, నాగ అని పేర్లుగల యిద్దరు యితర ప్రముఖ శిష్యులు నాగార్జునుడు కలిగివున్నట్లు తెలుస్తున్నది. ఆయన కుషాణ చక్రవర్తి కనిష్కునికి, ఒక శాతవాహన రాజుకు సమకాలికుడని నిస్సందేహంగా చెప్పవచ్చును.

ఆర్యదేవ : ఈయనకు దేవ, కణదేవ, నీలనేత్ర అని యితర పేర్లు కూడా వున్నాయి. ఈయన ప్రధాన గురువులలో 15వ వాడు, ఒక మతోన్మాది ఆయనను హత్య చేశాడు. గొప్ప పండితుడుగా, గొప్ప రచయితగా పేరు పొందిన ఆర్యదేవ అనేక ప్రదేశాలలో పర్యటించి చుళియ, కోసల, పాటలీ పుత్ర, మరి యితర స్థలాలలో తైర్థికులపై ఘన విజయాలు సాధించాడు. నలందా విశ్వ విద్యాలయంలో ఉన్నత స్థానాన్ని పొందాడు. తన సత్ శాస్త్రంలో ఆయన సాంఖ్య, వైశేషిక సిద్ధాంతాలను ఖండించాడు. తన చిత్త విశుద్ధి ప్రకరణంలో గంగానదిని గూర్చి బ్రాహ్మణులకు గల మూఢ విశ్వాసాలను గేలిచేశాడు. "అంధ కవింద సుత్తాంత" ప్రబోధించటం ఈయనకు అతి ప్రియమైన విషయం.

భావవివేక : ఇట్సింగ్ ప్రకారం ఇతడు దిగ్నాగునికి, ధర్మపాలునికి ముందటివాడు. హుయన్ సాంగు ఇతడు ధర్మపాలుని సమకాలికుడని తెలియజేశాడు. ఇతడు ధాన్యకటకానికి నైరుతి దిక్కున ఒక గుహలో నివసించేవాడు. ఈయన ప్రజ్ఞాదీపిక శాస్త్ర, సాంఖ్య తర్కజ్వాలవంటి అనేక విజ్ఞాన గ్రంథాలు రచించాడు, ఈయన నేర్పుగల తార్కికుడు. బాహ్యంగా తన రచనలలో సంఖ్యావాదాన్ని కనబర్చినా అంతరంగికంగా నాగార్జునుని బోధలకే ప్రచారం కలుగజేశాడు.

దిగ్నాగుడు : ఆయన కొంత కాలం వేగివద్ద నివసించినట్లు తెలుస్తున్నది. ఆయన కాళిదాసు సమకాలికుడు, వసుబంధు

శిష్యుడు. ఆయన యోగాచార్యుడుగా ప్రసిద్ధి పొందాడు. మహారాష్ట్ర, ఒరిస్సా ప్రాంతాలలో పర్యటించి తైర్థికులను బౌద్ధ మతానికి మార్చగలిగాడు. ఒరిస్సాలో ఒక మంత్రిని బౌద్ధుడుగా మార్చి 16 మహా విహారాలను స్థాపించాడు. స్వచ్ఛమైన తర్కాన్ని స్థాపించి, దానిని మతంనుండి, వేదాంతాన్నుండి వేరు చేయగలిగాడు వేంగివద్ద ఒక కొండపై రాతి స్థూపంవద్ద ప్రమాణ సముచ్చయం అనే గ్రంథాన్ని యీయన రచించాడు. ఈ గ్రంథం న్యాయ సంబంధమైన మొదటి గ్రంథం. దీనిలో 'ప్రమాణం' లేక సాక్ష్యంయొక్క ప్రాముఖ్యత వివరించబడింది. బీల్ అనే రచయిత ప్రకారం ఆంధ్ర దేశంలో 'సాంఖ్యకారిక' అనే గ్రంథం రచించిన ఈశ్వరకృష్ణ అను వ్యక్తిని దిగ్నాగుడు బౌద్ధం స్వీకరించేట్లు చేశాడు. ఇట్సింగ్ కథనం ప్రకారం దిగ్నాగుడు నూరు గ్రంథాలు రచించాడు. పరమార్థం అనే రచయిత యీయన గ్రంథాలలో కొన్నిటిని క్రీ. శ. 600 ప్రాంతంలో చైనా భాషలోకి అనువదించాడు.

భారత చరిత్రలో ప్రప్రథమంగా ఆంధ్ర కళ ఒక సజీవమైన అకృతికి రూపమిచ్చింది. దీనిపై ఎట్టి విదేశీ ప్రభావం కనిపించక పోవడం ఆంధ్ర కళ ప్రత్యేకత. తరువాత కాలంలో దక్షిణ భారత దేశంలోనూ తూర్పు ఆసియా దేశాలలోను రూపొందిన కళారూపాలకు ఆంధ్ర కళ ఒరవడి దిద్దిందని చెప్పవచ్చు. ఆంధ్ర దేశంలోనే భారతకళలోని ప్లాస్టిక్ చిత్రకళ మూల సూత్రాలు రూపొందాయి. శిల్పంలో జరిగిన యీమార్పులకు బౌద్ధమతం, దానిలో వచ్చిన క్రమమైన పరిణామాలు ప్రోత్సాహమిచ్చాయని చెప్పవచ్చు. పశ్చిమ భారతదేశంలో బిదిశ, కొండనె, పితల్‌కోరా, అజంత, నాసిక్, కార్లీవద్దనున్న ఆంధ్ర చైత్య మండపాలలో వాస్తు శిల్పంలో ఒక నిర్మల స్వభావం కనిపిస్తుంది. శిల్పులు తమ శిల్పాలను మత విషయాలకే పరిమితం చేశారు.

ఆదే సమయంలో, శాతవాహన సామ్రాజ్యపు తూర్పు ప్రాంతాలలో ఆంధ్రులు స్మారక సంబంధమైన కొత్త కళకు రూపమిచ్చారు. ఈ నూతన కళ మొత్తం భారత దేశపు కళారూపాన్నే మార్చి వేసింది. కృష్ణాలోయలో భట్టిప్రోలు, అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల మొదలైన ప్రదేశాలలో గొప్ప స్థూపాలకు యీ కాలంలోనే శంకుస్థాపన జరిగింది. ఇక్కడ బౌద్ధ మతం మరొక గణనీయమైన మార్పును పొందింది. మహాయానం బౌద్ధంలో ఒక చీలిక మాత్రమే అనే భావంపోయి మానవమోక్షానికి ఒక గొప్ప ధర్మపథంగా మారింది. ప్రతిదేశంలోని మానవుల ఆత్మలను జన్మ పునర్జన్మల నుండి విముక్తి చేసే గొప్ప ప్రచారసాధనంగా రూపొందింది. బౌద్ధ మతంలోని సూత్రాలు బౌద్ధ పుణ్యక్షేత్రాల వాస్తువును గూడా ప్రభావితం చేయసాగాయి. క్రింద నున్న చక్రంనుండి పైభాగంలో నున్న ఛత్రం వరకు బౌద్ధ స్థూపానికి జగత్సంబంధమైన అర్థంవున్నది. సృష్టి నిర్మాణ క్రమంతో సంబంధం కలిగివున్నది బౌద్ధస్థూపమే తరువాత నిర్మింపబడిన హిందూ దేవాలయానికి మాతృకఅయింది. ఒకప్పుడు సమాధిగా నున్న స్థూపం విగ్రహ ప్రతిష్ఠాపనతో దేవాలయంగా మారింది. దీని చుట్టూ ప్రదక్షిణ మార్గం ఏర్పాటు చేయబడింది, దాని వెలుపల నాలుగు దిక్కులా నాలుగు ప్రవేశ ద్వారాలున్న యినుప కటకటాల ప్రాకారం యేర్పాటు చేయబడింది. ఈ నాలుగు ప్రవేశ ద్వారాలే తరువాత నిర్మించిన హిందూ దేవాలయాలలోని నాలుగు గోపురాలకు దారి తీశాయి.

అమరావతి స్థూపంయొక్క తేజస్సు నాగార్జునకొండ యొక్క అద్భుతమైన చిత్రకళ సముద్రాంతాలవరకు వ్యాపించయి, బౌద్ధమతం సందేశం తూర్పు ఆసియాదేశాలలో స్థిరపడిన సాంస్కృతిక రాయబారులచే ఆ దేశాలలో వ్యాప్తిచెందింది. కొద్దికాలంలోనే, ప్రపంచంలోని వివిధదేశాలనుండి ఆచార్యులు స్థవిరులు నాగార్జునకొండకు వచ్చి జ్ఞానసముపార్జనకోసం దానినే తమ నివాస స్థలం చేసుకొన్నారు. సింహళంనుండి చైనావరకు వివిధదేశాలకు చెందినవారు వీరిలో వున్నారు. కృష్ణానది ముఖద్వారం వద్దనున్న గూడూరు (టాలెమీ పేర్కొన్నకొద్దూర) రేవు పట్టణం నుండి, పురాతన వ్యాపారకేంద్రమైన ఘంటశాల (కంటకసిల)నుండి ప్రపంచవివిధదేశాలకు బౌద్ధసందేశాన్ని భారతీయులు కొనిపోయారు. వీరు ప్రారంభంలో బర్మాలోని సాల్విన్, ఇరావతి డెల్టా ప్రాంతాలనుదాటి, థాయ్‌లాండులో ప్రవేశించి, అక్కడనుండి ఇండోనీసియాలోను, ఇండోచైనాలోని పురాతన రాజ్యాలు చంప, ఫూనాన్ రాజ్యాలలోను స్థిరపడ్డారు. తుదిగా వారు చైనాకు వెళ్లారు.

అమరావతి స్థూపంలోని బౌద్ధ చిత్రకళ తూర్పు ఆసియాలో పెంపొందిన కళపై చూపినట్టి ప్రభావమే యితర కళ లోనూ చూడలేము. నేడు అన్నాం అని పిలువబడుతున్న చంపరాజ్యంలోని డోంగుడునాగువద్దను, థాయ్‌లాండులో పాసాక్ నదీ లోయలోని పోంగుటుక్ గ్రామం, రాత్‌బురి, శ్రీ దేబ్ (శ్రీదేవ) గ్రామాల వద్దను, జావాలో దక్షిణ జెంబర్ వద్దను, సెలిబస్‌లో సికెండెంగ్ వద్దను, సుమత్రాలో పాలెంబంగ్ వద్దను, బోర్నియోలో కోట బంగోన్ వద్దను, సింహళంలో అనూరాధపురం వద్దను అమరావతి శిల్పశైలి ప్రభావం స్పష్టంగా కనిపించే విగ్రహాలు లభ్యమయ్యాయి.


బుద్ధుని నిర్యాణం తరువాత కొంత కాలానికి అజాతశత్రు అనే రాజు ఆధ్వర్యంలో ఒక బౌద్ధ మహా సభ జరిగింది. దీనిలో త్రిపిటక లేక బౌద్ధ సూత్రాల మూడు విభాగాలు రూపొందించారు. బుద్ధుని ప్రముఖ శిష్యుడైన మహా కాశ్యపుడు దీనికి అధ్యక్షత వహించాడు. ఆనందుడు ధర్మంపై బుద్ధుని ప్రబోధాలను, ఉపాలి బౌద్ధ భిక్షువులలో క్రమశిక్షణ గూర్చి బుద్ధుని భావాలను భిక్షులకు వినిపించారు.

మహా సాంఘిక శాఖ మహా కాశ్యపుడు తన స్థాపకుడని చెప్పుకున్నది. మొదట్లో వైశాలి దీని కేంద్ర స్థానం. తరువాత

యీ తెగ ఆంధ్ర దేశానికి మారింది. అమరావతి, నాగార్జున కొండ దాని కేంద్రస్థానాలైనవి. ఈ తెగ ఆంధ్ర దేశంలో సుస్థిరం కావటంవలన బహుశా దీనికి అంధక తెగ అని పేరు వచ్చింది నాగార్జున కొండవద్దనున్న శాసనాలవలన యీ తెగకు ఒక సుత్తపిటకం వున్నట్లు, దానిలో అయిదునికాయాలు వున్నట్లు తెలుస్తున్నది. ఈ తెగకు ఒక వినయ పిటకం కూడా వుండేది. ప్రస్తుతం దీని చైనా భాష తర్జుమా ప్రతిసూత్రమే లభిస్తున్నది. మహాసంఘికులలో ముఖ్యమైన ప్రసిద్ధి పొందిన శాఖలు పూర్వ శైలులు, అపర శైలులు, ఉత్తర శైలులు చైత్యకులు. వీరి పేర్లు నాగార్జునకొండ అమరావతి వద్ద శాసనాలలో పేర్కొన్నారు.

బౌద్ధమతంలో మహాయాన, హీనయాన శాఖలు యేర్పడకముందే యితర నాలుగుశాఖలు యేర్పడ్డాయి. అవి స్థవిరవాద సర్వాస్థివాద మహాసంఘిక సమ్మితీయ అనేవి. బుద్ధుని బోధనలలో అతిప్రసిద్ధిపొందిన మాధ్యమిక సిద్ధాంతాన్ని ఆచార్యనాగార్జునుడు ప్రచారం చేశాడు. బౌద్ధమతంలో యేర్పడిన వివిధశాఖలపరిణామం. వాటి కాలాలు యీ క్రింది పట్టికవల్ల స్పష్టంకాగలదు.


బౌద్ధమతంలోని వివిధ శాఖల పరిణామం



ఆంధ్ర దేశంలో బౌద్ధమత ప్రభావం

ఆంధ్ర దేశంలో లభించిన పురాతన చారిత్రిక అవశేషాలన్నీ బౌద్ధమతానికి చెందినవే. అపారంగాలభ్యమైన యీ అవశేషాలను బట్టి ఆంధ్ర దేశం బౌద్ధ మతానికి చాలా కాలం కేంద్రంగా వుండేదని చెప్పవచ్చు. క్రీస్తుశకం మూడవ శతాబ్దం తరువావ చాలా కాలం బౌద్ధమత కేంద్రాలు ఆంధ్ర దేశంలో వర్ధిల్లాయి. ఫాహియాన్ కాలం నాటికే దక్కన్‌లో వైదికమత పునరుద్ధరణ ఆరంభమైంది. కాని హుయన్‌సాంగ కాలం నాటికి కూడా కళింగ ప్రాంతంలో (దక్షిణ గంజాం,

విశాఖపట్నం జిల్లాలు) 10 బౌద్ధారామాలు వున్నాయనీ, వీటిలో 500 మంది బౌద్ధ భిక్షువులు నివసించేవారనీ తెలుస్తున్నది. అదే సమయంలో ఆంధ్ర దేశంలో 3,000 మంది భిక్షువులు కలిగిన 20 బౌద్ధారామాలు, ధన్యకటకంలో 1,000 మంది భిక్షువులతో 20 బౌద్ధారామాలు వుండేవని తెలుస్తున్నది. ధాన్యకటకంలో నిర్జనమైన బౌద్ధారామాలుకూడా చాలా వుండేవి. రాయలసీమ జిల్లాలలో బౌద్ధారామాలు శిథిలావస్థలో వుండేనని వైదిక జైన మతాలు ప్రజా రంజకంగా వుండేవని తెలుస్తున్నది. ఈ విధంగా ఆంధ్ర దేశంలో క్రీ. పూ. 300 నుండి క్రీ. శ. 300 వరకు ప్రచారంలో వుండి, మరొక నాలుగు శతాబ్దాల కాలం తన ప్రభావాన్ని చూపిన బౌద్ధమతం ఆంధ్ర సంస్కృతిపై చెరగని ముద్ర వేసింది.



ఆంధ్ర వాస్తువు, శిల్పము, చిత్రకళ బౌద్ధమత ఆధ్వర్యంలోనే ప్రారంభమై అభివృద్ధి చెందాయి. ప్రతి బౌద్ధ ఆరామం ఒక పాఠశాలగా పని చేయడంవల్ల లేఖనము, సాహిత్యము, విద్యకూడా బౌద్ధమత ప్రభావాన్ని పొందాయి. తెలుగుభాష అభివృద్ధి చెందుతున్న తరుణంలో దానితో చేరువగా వచ్చిన పాళి, సంస్కృతము, కన్నడము, మరాఠీ, తమిళము, బహుశా గ్రీకు భాషలవల్ల ప్రభావితమైంది. ఈ భాషలలో తెలుగు భాషకు కచ్చితమైన రూపురేఖలివ్వటంలో బౌద్ధపాళీ భాష ప్రధాన పాత్రవహించింది. బౌద్ధ సంఘాలలోని క్రమశిక్షణ, మర్యాదా పద్ధతులు, వాటిలోని జాతి, సాంఘిక, లింగ సంబంధమైన సమానత్వ భావాలు, నీతినియమాలు, వాటి నిరాడంబర జీవిత విధానము, ప్రజల మధ్యకు పోయి వారి భాష ద్వారానే నీతి ప్రబోధం చేసి దేశ విదేశాలలో బౌద్ధమత ప్రచారం చేసిన వారి సాహసం — అవన్నీ ఆంధ్ర నాగరికతకు మూల స్థంభాలైనవి. పాలకులపైన, పాలితులపైన బౌద్ధ పరివ్రాజకులు చెరగని ముద్ర వేశారు. దీనివలన ధర్మ సంస్థాపన సాధ్యమైంది. ఉత్తర భారత దేశంలోని బౌద్ధ ఆరామాలను గూర్చి వివరిస్తూ వాటిలో వసతి, పడకలు, దుప్పట్లు, ఆహారము, పానీయము, వస్త్రాలు మొదలైనవన్నీ ఉదారంగా సరఫరా చేశేవారని ఫాహియాన్ తెలియజేశాడు. దక్షిణ భారతంలోని బౌద్ధ ఆరామాలలో కూడా యివే పరిస్థితులు వుండేనని చెప్పవచ్చు. గౌరవాన్ని, అగౌరవాన్ని ఒకటిగా భావిస్తూ, వారిసౌశీల్యానికి, విజ్ఞానానికి ప్రజల చేత, రాజుల చేత గౌరవింపబడుతూ స్వచ్ఛందంగా అజ్ఞాతవాసంలో నివసించే యీ సత్యశోధకులకు ప్రతి చోట ఆదరణ లభిస్తుండేది. వారు కోరకుండానే వారికి దానధర్మాలను రాజులు లభింపజేసేవారు. నాగార్జునకొండ వద్ద నున్న ఒక ధర్మశాసనంలో పేర్కొన్న "జీవించివున్న ప్రాణులందరి సంక్షేమం కొరకు" అనే మాటలవలన ఆ నాటి విస్తృతమైన మానవత్వ ధోరణి స్పష్టమౌతున్నది.

మన పూర్వీకుల హృదయాలను ఆలోచనా శక్తిని కదలించి వేసిన విషయాలు, తరతరాల ప్రజలను ప్రభావితం చేసిన మాటలు శతాబ్దాల తరబడి వారి హృదయాలకు, గృహాలకు చేరువగానున్న దేవాలయాలు, దేవతలు యీ నాడు ఎందుకు శక్తి విహీనలయ్యాయి ? దేవాలయాలు శిథిలాలు కావటం, విగ్రహాలు విరగ్గొట్టబడటం, పవిత్ర రచనలు చెరిగి పోవడమేనా యిందుకు కారణాలు ? నిజం ఆలోచిస్తే నేడు ఆంధ్ర దేశంలో విస్తరించి వున్న ఆ ధర్మాలు, విశాలదృక్పథం, స్వేచ్ఛాభావం, ఆంధ్రుల కళాసాహిత్యాలలో కనిపించే ప్రత్యేకత వీటన్నిటిపై బౌద్ధ ప్రచారం కనిపించడం లేదా ? ఆంధ్ర సంస్కృతి అనేభావనానికి బౌద్ధమతమే పునాది అని చెప్పవచ్చు.

ఆంధ్రప్రదేశ్‌లో ఇరవై రంగుల ఇంద్ర ధనుస్సు

శ్రీ వై. రామకోటయ్య

తేనె లొలికే తెలుగు దేశం. ఆ, తెలిదేశీయులు త్యాగి భారతావనికే గర్వకారణమైన మమత లెరిగిన తెలుగు ప్రజలు. తెలుగువారి తలలో నాలుకలా మెలగేదక్షత గల ప్రజా నాయకుడు వెంగళరావుగారి నాయకత్వం, మూడు పూవులూ—ఆరు కాయలూ!!

బలహీనవర్గాల సంక్షేమానికీ, భావిభారత భాగ్యోన్నతికీ, దేశ సమైక్యతకూ, శాంతిభద్రతల పరిరక్షణకూ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ తీసికొన్న చర్యలు, ప్రకటించిన ఆర్థిక కార్యక్రమం శక్తియుక్తులు గల రాష్ట్ర నాయకత్వానికి తమ పరిపాలనా దక్షతను ప్రదర్శించే మరొక మహదవకాశం కల్పించాయి. అక్షర రూపంలో వున్న కార్యక్రమాన్ని అక్షరాలా నిజం చేసే తరుణం! కార్యక్రమాన్ని మొదలు పెట్టిన రోజు నుండి ఈనాటివరకు వెను తిరిగిన రోజు లేదు. ఇది సాధ్యమయ్యే కార్యమని చేతల్లో నిరూపించే వరకూ ఎవ్వరూ కూడా ప్రధాని పథకం రాష్ట్రంలో ఇంత త్వరగా, ఇంత దక్షతగా అమలు జరుపబడుతుందని ఆశించలేదు.

అంతేగాదు, అరాచక శక్తులకు సింహ స్వప్నంలా వెలసిన శ్రీ వెంగళరావుగారు నాయకత్వం చేపట్టగానే అవి పటాపంచలై, ప్రధాని ప్రగతి సూత్రాలు ప్రజల్లో ప్రమోదాన్ని, నవచైతన్యాన్ని చిందులు త్రొక్కిస్తూ వుండగా, తెలుగు దేశం పాడిపంటలతో, సిరిసంపదలతో తొణికిసలాడుతూ వుండగా మళ్లీ ఆ అరాచక శక్తులు తమ పరివారమైన కరువు కాటకాలతో, దారిద్ర్యంతో ఎక్కడైనా కాలూనాలని ప్రయత్నం చేసి, ఈ పుణ్య భూమిలో పరమ పవిత్రములగు కార్యములు ప్రవర్తిల్లుట చూచి వెఱగంది ఎచ్చటనూ అడుగు పెట్టే అవకాశం లేక పలాయనం చిత్తగించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆర్థిక కార్యక్రమం శాశ్వత ప్రాతిపదికపై అర్థవంతంగా ఎలా అమలు పర్చబడుతున్నదో సూచనప్రాయంగా పరిశీలిస్తే చాలు. శీతాకాలంలో తెగబ్రాకిన సొరపాదులా రాష్ట్రం సాధించిన ప్రగతి అర్థమవుతుంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ధాన్య సేకరణ ఇతోధికం చేయటానికీ, అత్యవసర వస్తువుల సరఫరా కుంటుపడకుండా నిరంతరం కొనసాగటానికీ, వాటి పంపిణీ సక్రమంగా, ముఖ్యంగా బలహీనవర్గాల వారికి, జరగటానికీ అనేకానేక చర్యలు తీసికొన్నది. రాష్ట్రంలో గత కొద్ది సంవత్సరాలలో ధాన్య సేకరణ చెప్పుకో తగినంతగా ఎక్కువయ్యింది. 1971-72 లో సేకరణ కేవలం 2.62 లక్షల టన్నులు వుంటే, 1974-75 నాటికి 8.83 లక్షలకు పెరిగింది. ఈ సంవత్సరం ఇప్పటికే పది లక్షల టన్నుల వరకు సేకరణ జరిగింది. సంవత్సరాంతానికి సేకరణ 13 లక్షల టన్నులకు మించవచ్చని అంచనా వేయబడింది.

చౌకదుకాణాలు

పర్యవసానంగా, రాష్ట్రం కేంద్ర గిడ్డంగినిల్వలకు అధికంగా తోడ్పడగలుగుతూ వుంది. ఈ సంవత్సరం కేంద్ర గిడ్డంగికి ఒక మిలియను టన్నుల ధాన్యాన్ని ఇవ్వగలమనే ఆశాభావం రాష్ట్రంలో ద్యోతకమవుతూ వుంది. అంటే క్రిందటి సంవత్సరం కంటే ఇంచుమించు ఐదు లక్షల టన్నులకు మించి వుంటుందన్న మాట. ప్రకటించిన ధరల మేరకు రైతులవద్ద నుండి ధాన్యాన్ని కొనటానికి 284 కేంద్రాలు నెలకొల్పబడినాయి. ధరలను అదుపులో పెట్టటానికి ఈ చర్యఎంతగానో తోడ్పడింది. అత్యవసర వస్తువుల పంపిణీ సక్రమ పద్ధతిలో నిరాటంకంగా సాగటానికి ముప్పది వేలకు పైగా చౌక దుకాణాలను ఏర్పాటు చేశారు. వీటిలో చాలా సహకార పద్ధతిలో నడుపబడేవికూడా వున్నాయి.

ఈ చౌక దుకాణాలు పనిచేసే తీరు తెన్నులు గమనించటానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఆహార సలహా సంఘాలను కూడా ఏర్పాటు చేశారు. అత్యవసర సరకుల పంపిణీ విషయంలో కార్మికుల, విద్యార్థుల, బలహీన వర్గాల అవసరాలను సకాలంలో తీర్చటానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోబడింది. పారిశ్రామిక కేంద్రాలలో నడుపబడుతున్న అల్పాహార శాలలకు గోధుమ పదార్థాల సరఫరా ద్వారా సుమారు 50,000 మంది కార్మికులకు మేలు జరిగింది. విద్యార్థి హాస్టళ్ళకు బియ్యం, గోధుమ, పంచదార, గోధుమ పదార్థాల సరఫరా ద్వారా ఇంచుమించు ఒక లక్షా 42 వేల మంది

విద్యార్థులకు మేలు జరిగింది. వీరిలో 70 వేలకు పైగా షెడ్యూలు కులాల, జాతుల విద్యార్థులున్నారు.



ఈ చర్యల ప్రభావం వినియోగదారుల ధరలపై ఎంతగానో పడింది. అంటే వాటిని చాలావరకు అదుపులో వుంచాయి. ఉదాహరణకు 1976, ఏప్రిల్ నెలలో ధాన్యం ధరలు క్రిందటి సంవత్సరం ఏప్రిల్ ధరలకంటే సుమారు 30 శాతం తక్కువగా వున్నాయి. రాష్ట్రప్రభుత్వం అంతటితో ఆగలేదు. గత రెండేండ్లలో ఆ పనులతోపాటు తిండిగింజల సత్వర అధికోత్పత్తికి కొత్త పన్నుగడలను, కార్యక్రమాలను చేపట్టింది. ఇంతకుముందే సాగులో వున్న పొలాల అభివృద్ధికి, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత యిస్తూ, మెట్ట సాగుకుకూడా తగినంత శ్రద్ధ చూపడం జరిగింది. తత్ఫలితంగా 1972–1973 లో 67 లక్షల టన్నులకు పైగా ధాన్యం పండితే, 1975–1976 నాటికి పంట దిగుబడి 93 లక్షల టన్నులు దాటుతుందని అంచనా వేయబడింది.

ఇంకో శుభసూచకమైన ప్రయత్నమేమంటే 1976–77 నాటికి తిండిగింజల ఉత్పత్తి 100 లక్షల టన్నులకు పెంచాలని ధ్యేయంగా ప్రభుత్వం పెట్టుకుంది. మనకున్న వనరులన్నీ సమీకరించుకునే ఒక పెద్ద కార్యక్రమాన్ని అమలు జరిపినారు. తద్వారా లభ్యమయ్యే ఇతర వనరులను కూడ అధికోత్పత్తి కార్యక్రమాలకే వినియోగించే జాగ్రత్త తీసికోబడింది. ఈ రకమైన ఆర్థిక క్రమశిక్షణ ఫలితంగా 1973–74లో మనవార్షిక ప్రణాళికావ్యయం 90 కోట్ల రూపాయలు వుంటే, 1976–77లో 262 కోట్ల రూపాయల వ్యయానికి పెంచబడినప్పటికీ ఐదవ ప్రణాళికలో రాష్ట్రప్రభుత్వం అవసరానికి మించి బాకీలు చేసే పని కన్పించటంలేదు. అంటే ఎగుడు దిగుడు పరిస్థితులు లేకుండా ఆర్థిక సుస్థిరత చేకూరిందని చెప్పవచ్చు

భూపరిమితిపై నూతన చట్టం 1975, జనవరి 1 వ తేదీ నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం క్రింద భూకామందుల నుండి నాలుగు లక్షల 38 వేల భూమి వివరాల ప్రకటనలు అందినాయి. వాటిలో మూడు లక్షల ఐదువేల ప్రకటనలు పరిశీలింపబడినాయి. ఒక లక్షా డెబ్బదివేల ప్రకటనల విషయములో నిర్ణయాలు తీసికొని, ఇంచుమించు లక్షా 60 వేల ఎకరాలను మిగులుభూమిగా నిర్ణయించటం కూడా జరిగింది.



మిగులు భూమి పంపిణీ

పేదవారికి ఆ మిగులు భూమి పంపిణీ సవ్యంగా జరగటానికి తాలూకా స్థాయిలో అనధికార సలహా సంఘాలను కూడా నియమించటం జరిగింది. ఇలా ఒకప్రక్క భూపరిమితి చట్టాన్ని అమలుపరుస్తూ, వేరొకవైపు భూకామందుల నుండి రక్షిత కౌలుదార్లకు భూమిని బదిలీ చేయించటానికి కూడా ఏర్పాట్లు చేయబడినాయి. ప్రభుత్వం తీసికొన్న ఈ చర్య ఫలితంగా 4.27 లక్షల ఎకరాల భూమి లభ్యంకాగా 97,000 రక్షిత కౌలుదార్లు తమ సేద్యపు భూములకు హక్కుదార్లుగా ప్రకటించబడినారు.

షెడ్యూల్డు కులాలు, తెగలవారికి, వెనుకబడిన తరగతుల వారికి తగిన ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రప్రభుత్వం బంజరుభూములన్నింటినీ భూమిలేని పేదవారికి పంచిపెట్టే కార్యక్రమాన్ని కూడా దీక్షగా అమలుచేస్తూ వుంది.

ఈ ముమ్మర కార్యక్రమం చేపట్టినప్పటినుండి పంపిణీ చేసిన భూమి 22 లక్షల ఎకరాలకు మించివుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత కొద్ది సంవత్సరాలుగా నిమ్నజాతులవారికి ఉచితంగా నివేశన స్థలాలు కేటాయించే కార్యక్రమం కూడా ఒకటి అమలులో వుంది 1975 జూన్ అంతానికి ఆరుకోట్ల 44 లక్షల రూపాయల ఖర్చుతో 1,96,000 కుటుంబాలవారికి ప్రభుత్వం ఉచిత నివేశన స్థలాలను కేటాయించింది. ప్రధానమంత్రి 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం ప్రకటించిన లగాయతు

ఈ నివేశన స్థలాల పంపిణీ కార్యక్రమం తీవ్రతరం చేయబడింది బడ్జెటు కేటాయింపులు ఈ మేరకు అధికం చేయబడటమేగాక భూసముపార్జన చట్టాన్ని కూడా సవరించడం జరిగింది. ఈ



చర్యల ఫలితంగా 1976–77 సంవత్సరానికి మూడు లక్షల ఇండ్ల స్థలాల కేటాయింపు లక్ష్యంగా పెట్టుకుంటే, 1976 ఏప్రిల్ నుంచి నాలుగు లక్షల 60 వేల కుటుంబాలకు ఇండ్ల స్థలాలు కేటాయించబడినాయి.

ప్రస్తుత సంవత్సరంలో ఈ పథకానికి బడ్జెటు కేటాయింపు ఎక్కువ చేయబడింది. భూమి లేని నిరుపేదలకు, వ్యవసాయ కూలీలకు, తదితర నిరుపేదలైన వృత్తి పని వారికి తమ ఆక్రమణలో వున్న ఖాళీ స్థలాలను హక్కు భుక్తం చేయటానికి కూడా తగిన చర్యలు తీసికోబడినాయి. ఈ మేరకు అవసరమైన శాసనం కూడా చేయబడింది. ఈ చట్టం క్రింద సుమారు 55,000 కుటుంబాల వారికి మేలు జరుగగలదని ఒక సర్వే ఫలితంగా తెలియ వచ్చింది. మరి కొద్ది నెలలలో ఈ చట్టాన్ని అమలుపర్చటం పూర్తికాగలదని తలచబడుతూ వుంది. మన సంస్కృతి, నాగరికతకూ కళంకాన్ని ఆపాదించే వెట్టిచాకిరి పద్ధతి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో చెప్పుకోతగినంతగా లేక పోయినా, 1975, ఆగస్టులో దాన్ని రూపుమాపే ఉత్తరువు జారీ చేయబడింది. మళ్లీ 1975, అక్టోబరులో వచ్చిన ఒక కేంద్ర శాసనం ఈ ఉత్తరువు స్థానాన్ని ఆక్రమించింది. ఇంతవరకు ఆంధ్ర ప్రదేశ్‌లో అడపా దడపా కొన్ని వెట్టిచాకిరీ దృష్టాంతాలు మాత్రం వెలికి వచ్చాయి, కేవలం నామ రూపాలు లేకుండా తుడిచి పెట్టుకుపోవటానికి !!

అప్పు లేని వాడికి 'నేనే' నమస్కారం చేస్తానని భగవంతుడే ఎప్పుడో ఏదో ఉప నిషత్తులో అన్నట్లు మనం వింటూ వుంటాం. ఆయన ఎప్పుడు, ఎందుకు చెప్పి వున్నాడో గాని, ఆ సూక్తి మాత్రం మనకీనాడు పరమ సత్యంగా శిరోభారంగా వుంది. మూలిగే నక్క మీద తాటి కాయ పడినట్లు అసలే దారిద్ర్యంతో మ్రగ్గిపోయే గ్రామీణ పేద వర్గాల వారిపై అప్పుల భారం గుండెల మీద కుంపటిలా తయారైనది. చిన్నతరహా రైతులు, భూమి లేని కూలిజనం, పల్లెటూళ్లలో వృత్తి పనివారు అనుభవిస్తున్న ఋణ భారాన్ని తొలగించటానికి వారి నుండి అప్పుల వసూళ్ళను కొంతకాలం వరకు నిలిపి వేయాలని ఒక శాసనం చేయబడింది. వడ్డీ వ్యాపారస్తులు, తాకట్టు పెట్టుకుని అప్పులు ఇచ్చే వ్యాపారులు తమ అప్పులు రాబట్టుకొనే నెపంతో తాకట్టు వస్తువులను స్వాహా చేయకుండా ఈ చట్టంలో ఆంక్షలు విధింపబడినాయి. దాదాపు ఆరు కోట్ల రూపాయల మేరకు ఋణాలకు సంబంధించిన 32 వేల దావాలు, 1,500 లకు పైగా శిక్షణలు జరిపించే అభ్యర్థనలు ఈ శాసనం ఫలితంగా నిలిపి వేయబడినాయి.

ప్రత్యామ్నాయ ఋణ సదుపాయం

ఇది ఒక విచిత్రమైన సన్నివేశం. ఈ బడుగు వర్గాల వారు, సన్నకారు రైతులు చేసే అప్పులు పప్పుకూడు తినటానికి కాదు. విలాసాలకు, వినోదాలకు అంతకంటే కాదు. అప్పు చేయనిదే వారి మనుగడకే ముప్పు. వారి జీవనాధారమైన ఆ కొద్ది వ్యవసాయం సర్వనాశన మవుతుంది. ఋణాల చెల్లింపుపై వచ్చిన శాసనం సన్నకారు రైతులకు, గ్రామీణ పేదలకు పెద్ద భారం తొలగినట్లయినప్పటికీ, వారికి భారం లేని ప్రత్యామ్నాయ ఋణ సదుపాయం కలుగ చేయటం కూడ ప్రభుత్వ బాధ్యత అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం మరల చొరవతీసికొంది. వెంటనే శాశ్వత ప్రాతిపదికపై ఋణ సదుపాయానికి తగిన వనరులు ఏర్పాటు చేసింది. సహకార పరపతి సంఘాల ఋణాల పరిధిని, వాటి మూల ధన పరిమాణాన్ని అధికాధికం చేయటమే కాకుండా బడుగు వర్గాల వారికి, సన్నకారు రైతులకు అధిక లాభం చేకూర్చే లాగున సహకార సంఘాల ఉనికికే ఒక క్రొత్త అర్థం సంతరింప చేయటం జరిగింది. 1972–73లో దాదాపు 25 కోట్ల రూపాయలు వ్యవసాయోత్పత్తికి స్వల్ప కాలిక ఋణాలను పంపిణీచేస్తే, 1975-76 నాటికి ఋణాల పంపిణీ 78 కోట్ల రూపాయలకు పెరిగింది, అంటే మూడింతలు పెరిగిందన్నమాట. 1976-77 నాటికి 100 కోట్ల రూపాయలకు పెంచాలని ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ రకంగా ఋణపంపిణీ విస్తృతం చేస్తూ వ్యవసాయ రంగంలో బడుగు వర్గాల వారి అవసరాలను తీర్చటానికి ఒక ప్రత్యేక స్థానం ఇవ్వబడింది. సహకార సంఘాల సభ్యత్వానికి అందరినీ అర్హులను చేస్తూ చట్టాన్ని సవరించారు. పైగా అందులో 50 శాతం బలహీన వర్గాల వారికి కూడ కేటాయించ బడింది.

ఈ సంవత్సరం 27.6 కోట్ల రూపాయల ఋణాలు పంపిణీ చేయటంతో అధికోత్పత్తుల కార్యక్రమాలకు దీర్ఘకాలిక ఋణాల పంపిణీ కూడ చెప్పుకోతగినంతగా విస్తృతం చేయ

బడింది. వ్యవసాయ అవసరాలకు గాను ఆరున్నర లక్షల చిన్న తరహా, సన్నకారు రైతులకు 1975, ఏప్రిల్ నుండి 50 కోట్ల రూపాయలపైచిలుకు ఋణాలుగా యివ్వబడినాయి. దానితోపాటు పాడి, కోళ్లపెంపకం పశుగాణాభివృద్ధి మొదలగు అనుబంధ పరిశ్రమలకు కూడ 1975-76 లో 10 29 కోట్ల రూపాయల ఋణాలు మంజూరు చేయబడినాయి.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం 21 జిల్లాలలోను 16 జిల్లాలలో పలుప్రాంతాలలో గల చిన్న తరహా రైతుల ఏజన్సీలు వ్యవసాయ కూలీల అవసరాలను తీర్చుతూ వున్నాయి. ఇంచుమించు రెండున్నర లక్షల కుటుంబాలవారు ఈ ఏజన్సీలద్వారా లాభాలు పొందగల్గుతున్నారు. బావులు త్రవ్వకం, ఆయిలు ఇంజన్లు, ఎలక్ట్రిక్ మోటార్ల సరఫరా, పాలు పాలపదార్థాల కేంద్రాలు, గొర్రెల, కోళ్ళ పెంపకం మొదలగు పథకాలతో వీరికి సహాయ సంపత్తిని ప్రభుత్వం అందజేస్తూవుంది. ఈ కార్యక్రమాల అమలుకై సంస్థాగతమైన ఋణ సదుపాయం 17 కోట్ల రూపాయలకు పైగా కలుగజేయబడింది.

వెడ్యూల్డు కులాల వారికి, వెనుకబడిన తరగతుల వారికి ఆర్థిక సహాకారం కలిగించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కార్పొరేషన్‌ను నెలకొల్పింది. స్త్రీల సంక్షేమం కొరకు కూడా అదేరకమైన కార్పొరేషన్ ఒకటి నెలకొల్పబడింది. ఈ కార్పొరేషన్లు ఇతర వ్యాపారబ్యాంకుల వంటి ఆర్థిక సహకారసంస్థల తోడ్పాటుతో రకరకాల పథకాలచేపట్టి అమలు పరుస్తున్నాయి. వెడ్యూల్డు కులాల కార్పొరేషన్ ఇంతవరకు 30,000 మందికి మేలు జరిగేలా ఐదు కోట్ల 65 లక్షల రూపాయల మేరకు పథకాలు తయారు చేసి అమలు పర్చుతూ వుంది. అదే విధంగా వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ కూడ 47,000 మందికి సహాయ పడే పథకాలు ఆరు కోట్ల పదిలక్షల మేరకు రూపొందించి అమలు పరుస్తూ వుంది.

స్త్రీ సంక్షేమ కార్పొరేషను కూడ 2,200 మహిళలకు సహాయపడే 26 లక్షల రూపాయలతో పాడి పరిశ్రమలు, కోళ్ల పెంపకం, కుట్టుపని, చిన్న చిన్న వ్యాపారాలు చేసికోవటం, స్వయం ఉపాధి పథకాలకు తగిన సరంజామా కొనుగోలుకు తగిన పథకాలు సిద్ధం చేసింది.

కనీస వేతనాలు

1974 లో సవరించబడిన వ్యవసాయ కూలీల కనీస వేతనాలు 1975, డిసెంబరు 2వ తేదీన పెంచబడినాయి దాని ప్రకారం వయోజనులైన వ్యవసాయ కూలీలందరికీ సాలుకు 1400 రూపాయలు, ఒకటవ మండలంలో, 1,100 రూపాయలు రెండవ మండలంలోను. 900 రూపాయలు మూడవ మండలం లోనూ జీతాలు నిర్ణయించబడినాయి. యాదృచ్ఛికంగా కూలీ నాలీ చేసికొనే వారికి కూడ ఆయా ప్రాంతాల ననుసరించి రోజుకు మూడు నుండి ఐదు రూపాయల వరకు కూలీ పెంచబడింది. ఇప్పుడు ఆడవారికి, మగ వారికి కూడ సమాన వేతనాలు లభిస్తున్నాయి.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం పుష్కలంగా వున్న నీటి వనరులతో ఇంకా ఎక్కువ భూమిని సాగులోనికి తేవటానికి సర్వసన్నద్ధంగా వుంది. ఇప్పటికే ఈ మేరకు చాలా చర్యలు తీసికోబడినాయి. నీటి పారుదల సౌకర్యాలకు మొత్తం వ్యయం 1973-74 లో 21.61 కోట్ల రూపాయలు వుంటే 1976-77 కి పెద్ద తరహా ప్రాజెక్టులను దృష్టిలో పెట్టుకుని ఆ మొత్తం 71.80 కోట్ల రూపాయలకు పెంచారు. ప్రణాళికా వ్యయం కూడ ఇటీవలి సంవత్సరాలలో చెప్పుకోతగినంతగా ఎక్కువ చేయబడింది. ఉదాహరణకు నాగార్జున సాగర్‌ను తీసికొంటే, 1974-75 లో ప్రణాళికా వ్యయం 7.5 కోట్ల రూపాయలు వుండగా, 1976-77 నాటికి 18 కోట్ల రూపాయలకు పెంచబడింది. ప్రపంచ బ్యాంకు కూడ ఈ ప్రాజెక్టు సత్వరం సంపూర్ణ నిర్మాణానికి 145 మిలియన్ డాలర్ల సహాయానికి ఒప్పుకున్నది అంతేగాకుండా ఈ ప్రాజెక్టు పూర్తి నిర్మాణానికి ఇంకా వ్యయం ఎక్కువ చేయాలని నిర్ణయించబడింది. తద్వారా కొద్ది సంవత్సరాలలోనే అదనంగా 11 లక్షల ఎకరాల భూమిని సాగులోకి తేవాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. భారతదేశ ధాన్యాగారమని ఇప్పుడు పంజాబు ఆక్రమించుకున్న స్థానాన్ని కొద్ది రోజులలోనే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఆక్రమించ గలదనే ఆశాభావాన్ని ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు వెలిబుచ్చినారు ఇటువంటి ఆత్మ విశ్వాసం, ధైర్యం చాలా కొద్ది మంది నాయకులలోనే కన్పిస్తూ వుంటుంది 20 సూత్రాల అమలుకు, వ్యవసాయాభివృద్ధికి వారు అహర్నిశలు నిర్విరామంగా కృషి చేస్తున్నారు, కృషితో నాస్తి దుర్భిక్షం, జపతో నాస్తిపాతకం అని గదా ఆర్యోక్తి!!

అలాగే మధ్యతరహా నీటిపారుదల రంగంలో కూడ ఈ సంవత్సరంలో తలపెట్టబడిన 14 క్రొత్త పథకాలతో 1,48,000 ఎకరాల భూమిని సాగులోనికి తేవటానికి వీలవుతుంది. చిన్న తరహా నీటిపారుదల సౌకర్యాలకు కూడ ఆర్థిక వనరులు ఇటీవలి కాలంలో మూడింతలు చేయబడినాయి. ఈ విషయంలో వెనుకబడిన ప్రాంతాలలోను, కొండ ప్రాంతాలలోను కొన్ని పథకాలు ప్రత్యేకంగా చేపట్టబడినాయి. భూగర్భ జల సంపదను సద్వినియోగ పర్చుకోవటం కొరకు, రాష్ట్రంలో అనేక అనుబంధ పథకాలు అమలు జరుపటానికి స్టేట్ గ్రౌండ్ వాటర్ బోర్డు. ఇర్రిగేషన్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ అనే రెండు సంస్థలు నెలకొల్పబడినాయి. గోదావరి జలాల వినియోగం విషయంలో దీనికి సంబంధించిన రాష్ట్రాలమధ్య స్నేహ సుహృద్భావాలతో కుదిరిన ఒప్పుదల అనేక చిన్నతరహా, మధ్య తరహా ప్రాజెక్టుల సత్వర నిర్మాణానికి కుంటుపడని విధంగా పని సాగటానికి దోహదమిచ్చింది ఈ ఒప్పందం ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఏ ఏ పథకాలు చేపట్టాలో ఖచ్చితంగా నిర్ణయించుకోగల శక్తి ఏర్పడింది. ఐదవ ప్రణాళికా

కాలంలో అదనంగా తొమ్మిది లక్షల హెక్టారుల భూమిని సాగులోకి తేవాలనే తలంపుతో ప్రభుత్వం వుంది. నీటి పారుదల సౌకర్యాల ఫలితాలను సత్వరమే పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం ఆయకట్టు ప్రాంతాభివృద్ధి విభాగాన్ని సృష్టించి ఆ యా ప్రాంతాలలో సాగులోనికి తెచ్చే విస్తీర్ణాన్ని అభివృద్ధి చేసే పూర్తి బాధ్యత అప్పగించింది. రాష్ట్రంలో ఆయకట్టు అభివృద్ధి పథకాలకు ప్రపంచ బ్యాంకు సహాయం కూడ లభ్యమవుతుంది.

విద్యుచ్ఛక్తి

జీవరాసులకు ప్రాణవాయువులా మన నిత్యజీవితానికి విద్యుచ్ఛక్తి అవసరం అనివార్య మయ్యింది. పంచవర్ష ప్రణాళికారంభంలో విద్యుదుత్పాదక శక్తి 683 మెగావాట్లు వుంది. ప్రణాళికా కాలంలో అదనంగా 137 మెగావాట్ల శక్తిని పెంచాలనే ఒక పథకం కూడ తయారు చేయబడింది. 1973-74 లో విద్యుదుత్పాదనకు వార్షిక ప్రణాళికా వ్యయం 45 కోట్ల రూపాయలుంటే 1974-75 కు అది 66 కోట్లకు పెరిగింది. 1975-76 నాటికి 78 కోట్ల రూపాయల మేరకు ఉత్పాదన మీద వ్యయం పెరిగింది. ఇంకొక విచిత్రమేమంటే 1976-77 నాటికి 106 కోట్ల రూపాయలకు విద్యుదుత్పాదక శక్తిని పెంచారు. అంటే 1973-74 వార్షిక ప్రణాళిక మొత్తం అంచనా ఎంతవుందో 1976-77 కి ఒక్క విద్యుచ్ఛక్తికే అంత ఖర్చు చేస్తున్నారన్నమాట. విద్యుచ్ఛక్తి అవసరం రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఎంత అవసరమో రాష్ట్రప్రభుత్వం గుర్తించిందనటానికి ఇదొక నిదర్శనం. ఐదవ పంచవర్ష ప్రణాళికలో ఉత్పాదకశక్తి 320 మెగావాట్లకు పెంచబడింది. అంతేగాకుండా థెర్మల్, జలవిద్యుత్ ఉత్పాదక శక్తినికూడ విస్తరింపచేయటానికి సన్నాహాలు శీఘ్రంగా జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యమైనవి కొత్తగూడెం, విజయవాడ థర్మల్ కేంద్రాలు; దిగువసీలేరు, శ్రీశైలం, నాగార్జునసాగర్ జలవిద్యుత్ పథకాలు. పంచవర్ష ప్రణాళికారంభంలో సుమారు 10, 485 పట్టణాలు, గ్రామాలు 1974-75 లో విద్యుదీకరింపబడినాయి. రాష్ట్రంలో వున్న గ్రామాలు, పట్టణాలలో, అది 40 శాతం అన్నమాట. ప్రధాన మంత్రి 20 సూత్రాల కార్యక్రమాన్ని పురస్కరించుకొని 1975-76 లో 169 గ్రామాలు మరల విద్యుదీకరింపబడినాయి. ఈ పథకం పాదరసంలా జరజరా ప్రాకి పోతూవుంది. 2,000 గ్రామాలకు విద్యుచ్ఛక్తిని లభింపచేయటానికి అప్పుడే సన్నాహాలు జరుగుతూవున్నాయి. హరిజనవాడలకు విద్యుచ్ఛక్తిని అందచేయటానికి ప్రత్యేకమైన కృషి జరుగుతూ వుంది. 58 లక్షల రూపాయల ఖర్చుతో 1619 హరిజన వాడలను విద్యుదీకరించటానికి పథకాలు అంగీకరింపబడినాయి. వీటిలో 1976 మార్చి అంతానికి 1,076 హరిజన వాడలకు అప్పుడే విద్యుచ్ఛక్తి లభించింది. ఐదవ ప్రణాళిక మొదట రెండు సంవత్సరాల కాలంలో 25,000 నీరు తోడే పంపులకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయటంతో విద్యుదీకరింపబడిన పంపు సెట్ల సంఖ్య 2,88,000 కు పెరిగింది. ఈ కార్యక్రమం కూడ ఉధృతం చేయబడుతూవుంది. వచ్చే ఏడాదికి మరి 25,000 పంపుసెట్లకు విద్యుచ్ఛక్తి లభ్యమవుతుంది.

కేంద్ర ప్రభుత్వంకూడ సూపర్ థర్మల్ స్టేషన్‌ను కేంద్ర రంగంలో నెలకొల్పడానికి రామగుండాన్ని అనువైన స్థానంగా ఎన్నుకున్నది.

బట్ట కట్టటం నాగరిక లక్షణం. వస్త్రముఖ్యా స్త్వలంకారం అనికూడ అన్నారు. ఇట్టి వస్త్రోత్పత్తికి తెలుగుదేశం ఒక ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. చేనేత పనివారు మన రాష్ట్రంలో సంఖ్యాపరంగా వృత్తిలో రెండవ స్థానాన్ని ఆక్రమించుకొని వున్నారు. అంటే వ్యవసాయం ప్రథమ స్థానం ఆక్రమించింది. అయినా చేనేతపనివారి జీవనస్థాయి నానాటికీ తీసికట్టు నాగంభొట్లూ అన్నట్లే వుంది. రాష్ట్ర ప్రభుత్వం వీరి సాధక బాధకాలను బాగా గుర్తించి, వారి సంక్షేమానికి మంచి కృషి చేస్తూవుంది. దానికితోడు 20 సూత్రాల కార్యక్రమంలో కూడ చేనేతను ఒక ప్రధాన అంశంగా చేర్చటంతో రాష్ట్ర ప్రభుత్వం చేనేత పనివారి సంక్షేమానికి ఇనుమడించి పని చేయటం ప్రారంభించింది. సహకార రంగంలోను, ఇతరత్రాను చేనేతపనివారి సంక్షేమంకొరకు ప్రభుత్వం అనేక పథకాలు చేపట్టింది. 48 లక్షల రూపాయల ఆర్థికసహాయంతో 500 సంఘాలను సముద్ధరించటం, 25 సరికొత్త సంఘాలను స్థాపించటం జరిగింది. ఈ కార్యక్రమంలో 37,500 మంది చేనేత పనివారికి ముమ్మరంగా పని కల్పించబడింది. జిల్లా స్థాయిలో 20 చేనేత వస్త్రాల సహకార క్రయ విక్రయశాలలు నెలకొల్పబడినాయి. ఉన్నతస్థాయి సంఘాలయిన ఎపెక్సు చేనేత సహకార సంఘాలకు ఆర్థిక సహాయం; ఎపెక్సు సంస్థలనుండి చేనేత సహకార సంఘాలవారు సహాయం పొందేటట్లు; ఎపెక్సు సంస్థలకు రిజర్వుబ్యాంకునుండి సహాయం అందేవిధంగాను సౌలభ్యం కలుగ చేయబడింది. ప్రాథమిక ఉత్పత్తిదారుల వద్దనున్న నిల్వలను ఎపెక్సు సంస్థ చేనేత అభివృద్ధి కార్పొరేషనువారు సుమారు 460 లక్షల రూపాయల మేరకు తీసికొనేవిధంగాకూడ ఒక వసతి కల్పించబడింది.

రాష్ట్ర చేనేత అభివృద్ధి కార్పొరేషన్ నెలకొల్పబడింది. అది ఇతర కార్యక్రమాలతోపాటు సహకార పరిధికి బయట వున్న చేనేత కార్మికులకు సహాయపడుతుంది. ఈ కార్పొరేషన్ 10 చేనేత వస్త్రాల ఉత్పత్తి, సేకరణ కేంద్రాలను స్థాపించటంతో 2000 చేనేత పనివారలకు ఉపాధి లభించింది. కేంద్రం కూడ 185 లక్షల రూపాయల వ్యయంతో మరో బృహత్తర చేనేత పరిశ్రమాభివృద్ధి పథకానికి అనుమతి ఇవ్వటంతో 10,300 మంది చేనేత కార్మికులకు పని కల్పింపబడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం పనిచేస్తూవున్న వాటితోపాటు, సహకార రంగంలో మరి కొన్ని కొత్త నూలు మిల్లులకు కూడ ఆర్థిక సహాయం

అంగ జేసింది. ఎగుమతులవిషయంలో కూడ చాలా అభివృద్ధిని రాష్ట్రం సాధించింది. ఎగుమతికి అనువైన రకరకాల చేనేతవస్త్రాల ఉత్పత్తికి ప్రత్యేకమైన శ్రద్ధ తీసికోబడింది. ఇంచుమించు నూరు సంఘాలకు పైగా ఇప్పుడే ఎగుమతి రకాల చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రస్తుతం 4,000 మగ్గాలు ఈ రకాల వస్త్రాల ఉత్పత్తిలో నిమగ్నమై వున్నాయి కేంద్ర సహకారంతో నెలకొల్పబడే ఎగుమతి ఉత్పత్తుల సంస్థ క్రింద 1,000 మగ్గాలు ఎగుమతి రకాల వస్త్రాల ఉత్పత్తిలో వినియోగించబడతాయి. చేనేత సహకార సంఘాలు, ఇతర ఉత్పత్తిదారులు కలుగచేసే పనికి అదనంగా పై పథకాలు మరి 60,000 మంది చేనేత కార్మికులకు పని కల్పించుతాయి స్టేట్ టెక్స్టైల్ అభివృద్ధికార్పొరేషన్ రాష్ట్రంలో 1,600 మర మగ్గాలు నెలకొల్పటానికి చేనేత సహకార సంఘాలకు సహాయాన్ని అందజేస్తూ వుంది. కార్పొరేషన్, ఇతర సంస్థలు కలిసి ఇప్పటికే 16 లక్షల రూపాయలు విలువచేసే చేనేత దుస్తులను ఎగుమతిచేశాయి 1976 సెప్టెంబరు నాటికి ఎగుమతులను అభివృద్ధిచేయటానికిగాను ఒక బోర్డును స్థాపించినారు. రిజర్వుబ్యాంకు చేనేతరంగానికి మూడుకోట్ల రూపాయల ఋణ సహాయం చేసింది. స్టేట్ కో ఆపరేటివ్ సొసైటి ఒక కోటి రూపాయల చేనేతవస్త్రాలను సెప్టెంబరులోనే ప్రాథమిక సంఘాలనుండి సేకరిస్తుంది. రాష్ట్ర ఏపెక్సు సొసైటీకి, ఇతర ప్రాథమిక సంఘాలకు ప్రభుత్వం 60 లక్షల రూపాయల రిబేటు మంజూరుచేసింది.

పట్టణాలను ఆరోగ్యవంతంగా, అందంగా తీర్చిదిద్దడం మరొక ముఖ్య సమస్య. విచ్చలవిడిగా పెరిగిపోతున్న హైదరాబాదు, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, వరంగల్లు కేంద్ర పట్టణ భూపరిమితి, క్రమబద్ధ చట్టం క్రిందకు తేబడినాయి. అంతేగాకుండా ఒకటి-రెండు లక్షల మధ్య జనాభాగల పట్టణాలనుకూడ రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టపరిధిలోకి తేవాలని అభిప్రాయ పడుతూవుంది. వీటి కార్యక్రమ నిర్వహణకు యోగ్యులైన, అర్హతగల అధికారులను ఆయా ప్రాంతాలలో నియమించటం జరిగింది. పట్టణ భూముల ట్రిబ్యునల్ కూడ రూపొందించబడినది.

క్రమబద్ధంగా, అందంగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చెందేలా చూడటానికి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీని హైదరాబాదు, సికిందరాబాదు జంటనగరాలకు ఏర్పరిచారు. విచ్చలవిడిగా, అంతూ పొంతూ లేకుండా పెరిగిపోయే మరికొన్ని పట్టణాలకు ఆ రకమైన అధికార సంస్థలను రాబోవు కాలంలో నియమించాలని కూడ ఒక ఉద్దేశం ప్రభుత్వానికి వుంది.

ఆస్తి విలువను తగ్గించి పన్ను ఎగవేసే దురలవాటును రూపుమాపటానికి 1975, ఆగస్టులో స్టాంపు డ్యూటీ చట్టాన్ని సవరించి ఆస్తి నిజమైన విలువకు తగిన పన్ను వసూలు అయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చేసింది. రాష్ట్రంలో ఇతరములైన శిస్తులు, పన్నులు సరిగా వసూలు అయ్యేలా అనేక కట్టుదిట్టాలు చేయబడినాయి. రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు వారు విద్యుత్తును దొంగతనంగా వాడుకొనే వారిపై విద్యుదాఘాతం లాంటి చర్యలు తీసికొని ఆ దురలవాటును అరికట్టుతున్నారు. 1975-76 లో 5,000 లకు పైగా విద్యుత్తును దొంగతనంగా వాడుకొనే నేరాలను నమోదు చేశారు. తగిన చర్యలు కూడ వారిపై తీసికోబడినాయి.

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక నేరస్థులపై తీసికొనే చర్యలలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తూవుంది. రాష్ట్రంలో పారిశ్రామిక సంస్థలు; కొరతగల, అరుదైన ఖనిజాది ముడి సరుకుల వాడకం నమోదు చేయబడటానికి ప్రభుత్వం కొన్ని మార్గ దర్శక సూచనలు చేసింది. కేంద్ర మార్గ దర్శక సూత్రాలననుసరించి ఐదు వందలు లేక అంతకుమించి కార్మికులు పనిచేసే పారిశ్రామిక విభాగాలలో ఉత్పత్తిస్థాయిలోను, దుకాణాలలోను మండలులను ఏర్పరచవలసి వుంటుంది. కేంద్ర సూత్రాల ఆసరాగా రాష్ట్ర ప్రభుత్వం మూడు వందలు లేక అంతకుమించి కార్మికులు గల విభాగాలలో ఈ మండలులు ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ఈ మండలులు ఋతు నిర్ణయం లేకుండా పనిచేసే పారిశ్రామిక విభాగాలు 83 లో 56 విభాగాలలో ఏర్పాటు చేయబడినాయి. వీటిలో 21 విభాగాలు పబ్లికు రంగంలోను, ఏడు సహకార రంగంలోను ఉన్నాయి మిగిలిన 27 విభాగాలలో కూడ ఈ మాదిరి మండలులు నెలకొల్పుటకు ప్రయత్నాలు జరుగుతూ వున్నాయి.

దేశంలో తిండిగింజలు, తదితర నిత్యావసర వస్తువుల కొరత తీరాలంటే శీఘ్రగతిని సరుకు రవాణా జరుగుతూ వుండాలి. చురుకుగా సరుకు రవాణాకై వాహనాలకు జాతీయ పర్మిట్లు యిచ్చే విషయంలో కేంద్రం రాష్ట్రానికి 250 పర్మిట్లకు అనుమతి యిచ్చింది. మొత్తం 1538 దరఖాస్తులు రాగా రోడ్డు రవాణా సంస్థ కేంద్ర నిర్ణయానుసారం 250 పర్మిట్లు యివ్వటానికే నిర్ణయించింది.





హాస్టళ్ళలో వుండే విద్యార్థులకూ, ప్రభుత్వేతర సంస్థలచే నడుపబడే వసతి గృహాలలో వుండే విద్యార్థులకూ నిత్యావసర వస్తువులైన బియ్యం, గోధుమ, గోధుమ పదార్థాలు, పంచదార వంటి సరుకులు ప్రభుత్వం ప్రకటించిన ధరలకు సకాలంలో సరఫరా చేయబడుతూ వున్నాయి. ఈ కార్యక్రమంలో 2286 హాస్టళ్ళకు సహాయం లభించింది. అంటే 1,42,000 హాస్టల్ విద్యార్థులకు మేలు జరిగింది వీరిలో 44,000 మంది షెడ్యూల్డు కులాలవారు, 27,400 మంది షెడ్యూల్డు తెగల వారు వున్నారు. ఈ సౌకర్యం వల్ల ప్రతి విద్యార్థికి 1975 జులైలో వున్న నెలసరి హాస్టలు ఖర్చులో పదినుండి 12 రూపాయలవరకు తగ్గింది. పైగా ఆహారపదార్థాలు సకాలంలో తిన యోగ్యమైనవి లభ్యమవుతూవున్నాయి. తిండి, బట్ట మనిషికి ఎంత అవసరమో చదువూ సంస్కారం అంత అవసరం, తిండి లేకపోతే బ్రతుకే లేదు. సంస్కారం లేకపోతే ఆ బ్రతుకే వ్యర్థం. అందువల్ల విద్యార్థి దశలో పిల్లలకు అన్ని సౌకర్యాలు కలుగచేసి, చదువులకు అనువైన వాతావరణం కలుగచేస్తే జాతి గౌరవం నిలబెట్టే విజ్ఞాన వంతులూ, ధీరులూ, వీరులూ తయారవుతారనే విషయాన్ని బాగా గుర్తించిన ప్రభుత్వం విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించింది. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల అచ్చు పుస్తకాలను జాతీయం చేసి వీటి ముద్రణకు, పంపిణీకి ప్రభుత్వం బాధ్యత వహించి, ధరలు నిర్ణయించి సరఫరా చేస్తూ వుంది. 1975లో ఒక కోటి పుస్తకాలు అచ్చువేసి సరఫరా చేసింది ప్రభుత్వం. అంటే ఆ క్రిందటి సంవత్సరం కంటే సగటున 40 శాతం ఎక్కువ. ముద్రణ విషయంలో ఎక్కువ పేజీలు వేయటంతో ఖర్చులు విపరీతంగా పెరిగినప్పటికీ, గత ఐదేండ్లలో వున్న ధరలనే అమలులో వుంచింది ప్రభుత్వం.

ఉచితంగా పుస్తకాలు

పదవ తరగతి వరకూ పాఠ్య పుస్తకాలు షెడ్యూల్డు కులాల, తెగల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందచేస్తూ వుంది. 1975-76 విద్యా సంవత్సరంలో 12.87 లక్షల ఖర్చుతో రెండులక్షలమంది షెడ్యూల్డుకులాల, తెగల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు సరఫరా చేసింది ప్రభుత్వం. 3,100 ఉన్నత పాఠశాలలలో పుస్తకాల బ్యాంకులను ఏర్పాటుచేయవలసిందిగా ప్రభుత్వం ఆదేశించింది. జూనియర్ కళాశాలల్లోను, ప్రభుత్వ కళాశాలల్లోను అదనంగా 108 పుస్తకాల బ్యాంకులను ఏర్పాటు చేశారు. తెల్లకాగితాల పుస్తకాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అమ్మే ఏర్పాటు చేయబడింది, కేంద్రం నుండి వచ్చిన ఆదేశాలననుసరించి మళ్ళీ వీటి ధరలను సవరించి ప్రభుత్వం ప్రకటించింది.

నేర్పరులైన కార్మికులను, ఇతర వృత్తి పని వారలను తయారు చేయటానికి ప్రభుత్వం (ఎప్రంటీస్ షిప్ పథకం) ఏర్పాటు చేసింది. ఇందువల్ల నేర్పరులైనకార్మికులు తయారవటంతో ఉత్పత్తి బాగా పెరుగుతుంది. 20 సూత్రాల పథకం ప్రకటించక ముందు రాష్ట్రంలో 1782 మంది శిక్షణపొందేవారుంటే ఇప్పుడు వారిసంఖ్య నిర్ణయించిన 4,312 సంఖ్యను దాటి 4,487కు పెరిగింది. అంటే ఎప్రెంటిస్ చట్టాన్ని అమలు పర్చటంలో రాష్ట్రం 104 శాతం అభివృద్ధిసాధించింది. బలహీన వర్గాలవారి అవసరాలుప్రత్యేకంగా చూడబడుతూ వున్నాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో 870 మంది షెడ్యూల్డు కులాల వారు, 48 మంది షెడ్యూల్డు తెగలవారు, 14 గురు వికలాంగులు శిక్షణ పొందుతూ వున్నారు. మొత్తం శిక్షణ పొందేవారిలో 1,563 మంది గ్రామీణప్రాంతాలకు చెందిన వారు, 1,102 మంది వెనుకబడిన తరగతులవారు, అల్ప సంఖ్యాకులు ఉన్నారు.

• ప్రధాని 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని అమలు పర్చటంలోగాని, రాష్ట్రాన్ని తదితర రంగాలలో ముందంజ వేయటంలోగాని, దక్షతగల పరిపాలనా యంత్రాంగాన్ని రూపొందించటంలో గాని తెలుగుదేశం తెగించి ముందుకు సాగుతూ వుంది. అసలు చెప్పుకోవలసిందేమంటే తెలుగు దేశానికి అటువంటి సారథ్యం లభించింది. అందుకే అందరి కంటే ముందు ఆంధ్ర ప్రదేశ్.

ఆంధ్ర వైభవము

* శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి

దాదియొ కామధేను వమృతమ్మను నందిని యేచు త్రావి ఋ
గ్వేదమహర్షి హస్తములు పెంపగ నామగధమ్ము తాన యై
స్వాదువచఃప్రసన్నతల సాటియనుంగులలోన మేటి యై
ప్రోది నెసంగి చిర్నగవు పూవులుచల్లిన యాంధ్రి నెన్నెదన్.

శ్రీనగదివ్యరత్నములచే నమరావతిశిల్పి శిల్పవి
ద్యానిపుణుల్ సుపర్వు లగున ట్లమరించిన సర్వరాజమ
స్తానతిచిత్రచిత్రితము లందెలు మ్రోయ సరస్వతీవిపం
చీనవగీతికానుకృతి చిందులుద్రొక్కిన దాంధ్రి బాల యై.

శ్రీముఖశాతకర్ణినృపసింహుడు కాకుళనాయకుండు ని
స్సీమపరాక్రమ మ్మిడి ససీమను భూమిని గొన్ననాడు బా
లామణి కాంధ్రి కూడిగములన్ మగధప్రజ చేసె సింహపీ
ఠీమణి బింబితస్వముకుటీచలనాదృతరాట్పురంధ్రికిన్.

తూర్పుపడమరలన్ దగు తోయనిధుల
దృశ్యములు రెండు నంచులఁ దీర్చబడిన
పైడి జలతారు సన్నదువ్వలువవోణి.
ఆంధ్ర రాజ్య రమాబాల కందగించె.

అట్టి తెనుంగుబాల యిపు డప్రతిమానవచశ్చమత్కృతుల్
గుట్టలుగాగ ప్రౌఢ యయి కూరిమి నెచ్చెలు లెల్లబాసలుం
బిట్టు భజింప నోలగము మేకొనె,వాకొనరే జయధ్వనుల్
పట్టణ సింధు తీరగిరి భాస్వర విశ్వకళాలయప్రజల్!

కూర్పులో సంపంగి ఘుమఘుమల్, తీర్పులో
శిల్పాల తళతళల్ చెలువుగలది
నేతిగారెల బుట్ట యే తదర్థమ్ముతో
పాల కోవా పల్కుబడిని గలది
పసరు సమసకమ్ము పసతో నమరభాష
నెదురించి రసము చిమ్మింపఁ గలది
సెలయేటికి నదికి జలపాతమునకు దే
ని వడిని దానికి నేర్పినయది

తెలుగు,గుఋకొట్టి ఋండేలు పులిని, దాని
యెలుగు తెలుగు 'కరెక్టు' శ్రీకృష్ణ మురళి
నల్లమలవెదురగుట శంఖమ్ము హరికి
ప్రాప్త మయ్యె బందరు రేవునందు ననుట.

ఈనాటికిని క్రొత్త వే యైన ధ్వనులతో
నీ బాస నన్నయ్య యెల్ల దెలిపె
నీ బాసలో ప్రజ యెదకు పాలకురికి
మీగడకుఋకులు మెసవ నొసగె
విశ్వరూపమ్ము చూపించి యీ బాసలో
తిక్కన్న బ్రహ్మను ధిక్కరించె
యీ భాష పద్యాల కెత్తుకెత్తుగ కమ్మ
కస్తురి శ్రీనాథకవి గ్రహించె

దున్ని దున్ని పండించె పోతన్న, యిదియ
బాసపొలము, పుట్లకుపుట్లు భక్తిపంట
నాడు ప్రభులకు. ప్రజలకు నేడు వెలుగు
తెచ్చి నన్ని సంస్కృతులలో తెనుగు మిన్న.

తేనెవనము సమృద్ధమౌ తెనుగుదనము
ననుగుదనము ముదిరిననాడు తెనుగుదనము
నటుల నిటుల నందురు, నెటు లన్న నొకచె
ఆర్య ముపమాన ముపమేయ మపర మగుట.

ఇది జనరంజనీ మృదురాగ కచ్ఛపీ
భువనమోహన గాన పుణ్యవేళ
యిది నిసర్గమధురహృదయ కంఠస్వర
గిరిజనతా నృత్యకేళివేళ
యిది యవధీరితా స్పృశ్యత్వబ్రహ్మజ
నమిళిత హరిజనానందవేళ
యిది నగిదేకసౌఖ్యదమానవత్వసం
పూర్ణసర్వప్రజాస్వర్ణవేళ

ఆంధ్రరాష్ట్ర మవతరించి యైన దిరువ
దేడు లీవేళ, అప్పటికిప్పటికిని
పోలిక పొసంగనంత యభ్యుదయలీల
శాల యీనాడు ముత్యాల చంద్రశాల.

కలము హలము రసప్రవాహలవితంబు
కానిచో మదికి మెయికి కాంతిలేద
యేమనందువోయని యాంధ్రు నితరు డడిగి
వినవలెను నా కనను భూత మను జవాబు.

3(— 40

అన్నకోశ మదియొ ఆనందమయకోశ
మదియె భౌతికంబె మమృత మనుచు
ఋజువుచేసి చూపె నీనాడు తెనుగునా
డుపనిషత్తు లతిశయోక్తు లగుచు.

పికమునకు గానగంధర్వబిరుద మిడుట
అన్నపూర్ణ యను బిరుద మాంధ్రరత్న
గర్భ కిడుట యొకటె నిందుగాదె తక్క
నెఱుగ దరగాదె విరుపేద కృషికుడేని.

వరుడు భాయీ, వధువు హాయి. పరిణయంబు
సమత యనెడి పందిరిలోన, చవులు గురిసె
మహిత మంగళసూత్ర సంబంధముఖ్య
మంత్రము—ఆంధ్ర పౌరోహిత్య మంజురవము.

ప్రళయము వచ్చుచో హరుడు వారణసీపురి నొక్కదాని నె
ట్టులొ పయి కెత్తు మున్గనియటుల్ తన ముమ్మొనవాలుతోడ వి
ట్టు లను పురాణముల్ ఘనమటో! యది, నాగటి కఱ్ఱు మోపి య
ప్రళయముగా జగమ్మునవురా! నరు డాంధ్రుడొనర్చి చూపెడిన్.

ఎండ తెక్కునఁ దా వుండు నింక నొకని
కనుచు పుష్పకవిమానాభ నాలకించి
నాము, ధాన్య మెగుమతి యెంతైన మరియొ
కింత యిదు నాంధ్రభాగ్య మీక్షించినాము.

అతిథికిఁ బెట్టి తా తినెడి యట్టి వ్రతం బెటనేని యున్ననున్
వితథమె యయ్యె, నెవ్వడును వేడద యన్నము, పిల్చినం బనుల్
కొతుకు న టంచు రాడ, యొనగూడక యుండునొ చేయి చాపు నే
యతగుడు కానుపింపని యహస్సును, నిందిరధర్మ మంతయున్.

మాతృపితృభక్తి లేకున్న మానె, మాతృ
భాషలో 'కథ' 'ఖద' యని పలుకకున్న
చాలు, సిగిరెట్ల పొగ రెట్ల సంశ్రయించి
కొంప గుల్లబడకయున్న కొంత మేలు.

గోదావరి కృష్ణా పె
న్నాదినదులు బంధితమ్ము లై గోవు లటుల్
మేదుర మిడెడు పయసున శ
తాధిక సంవత్సరాల్ వయసు ప్రజ కగుతన్!

చేనేతకు చేయూత

శ్రీ రావూరి భరద్వాజ

ఇప్పటి మాట కాదు.

ఒకప్పుడు మన దేశం నుండి సరుకుల్ని నింపుకొన్న నావలు, మధ్య ప్రాచీన దేశాల రేవుల్లో లంగర్లు వేసినప్పుడు మన సరుకుల్ని కొనడానికి, అక్కడ వ్యాపార వర్గాలవారు, పోటీలు పడే వారని చెబుతారు.

సుగంధ ద్రవ్యాలు, ఉక్కు శిరస్త్రాణాలు, కత్తులు, లోహపు సామగ్రి, శిల్పఖండాలు, చేనేత వస్త్రాలు, ఆభరణాలు —ఇలాంటి సరుకులకు, ఆ దేశాల్లో మాంచి గిరాకీ ఉండేది. సెనగడొక్కులో ఇమిడేటంతటి సున్నితమైన వస్త్రాలను కూడా మనవారు తయారు చేశారట. ఈ చేనేత కార్మికులు తెలుగువారే కావచ్చు. అజంతా చిత్రాలను, ఎల్లోరా శిల్పాలను, శిలారథాలను, సప్తస్వరాలను ఆలపించగల రాతి స్తంభాలను మలచిన తెలుగు శిల్పులు, ఎక్కడా తమ పేర్లను గానీ, ఉనికిని గానీ నమోదు చేసుకోలేదు. అలాగే. గాలితోసైతం, వస్త్రాలను మలుచగల మన తెలుగు చేనేత వస్త్ర నిర్మాతలు కూడా, తమ చిహ్నాలను ఎక్కడా ముద్రించుకోలేదు.

ఒకానొక మహ్మదీయ చక్రవర్తి, తన కూతురు, వస్త్ర ధారణ చేయనందుకు కోపగించుకొన్నాడని చెబుతారు. నిజానికామె అతి సున్నితమైన చేనేత దుస్తుల్ని ధరించింది. ఇది నిజం కావచ్చు. కాకపోనూ వచ్చు. సెనగ బెరడులో ఇమిడేటంతటి చీరెను నేయగల కార్మికునికి, అదృశ్యతంతువులతో దుస్తుల్ని రూపొందించడం పెద్ద కష్టమేమీ కాదు.........

ఒకప్పుడు ఎంతో మహోన్నత దశను అనుభవించిన ఈ పరిశ్రమ ఈ మధ్య కాలంలో, పూర్తిగా కుంగిపోయింది. ఇలా జరగడానికి చారిత్రికమైన కారణాలు ఎన్నో ఉన్నాయి. మన రాష్ట్రానికి సంబంధించినంతవరకూ, వ్యవసాయం తరువాతి స్థానం, చేనేత పరిశ్రమదే !

చేనేత పరిశ్రమ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో విస్తరించి ఉంది. ఒక్కో ప్రాంతంలోని కార్మికులు ఒక్కో రకపు వస్త్రాల తయారీలో ప్రావీణ్యతను గడించారు.


వెంకటగిరి, గద్వాల, పోచంపల్లి, అలంపూర్, మోరి, మంగళగిరి, ఎమ్మిగనూరు, ఏలూరు, ఇలా ఎన్నెన్నో కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో నైతేనేమీ విడిగానయితేనేమి సుమారుగా 30 లక్షల మంది ఈ పరిశ్రమను ఆధారం చేసుకొని, జీవిస్తున్నారు.

విదేశీవస్త్ర బహిష్కరణ

జాతీయోద్యమం, ముమ్మరంగా కొనసాగుతున్న రోజుల నుండి, అందులో అంతర్వాహినిగా. చేనేత ఉద్యమం కూడా వర్ధిల్లుతూనే ఉంది. లక్షలాది చేనేత కార్మికులకు సమృద్ధిగా పనిపాట్లు లభించాలంటే – విదేశాల నుండి వస్త్రాల దిగుమతి ఆగిపోవాలి. ఇది కారణంగానే మహాత్ముడు విదేశీ వస్త్ర బహిష్కరణను, ఒక మహోద్యమంగా, కొనసాగించాడు.

బాపూజీ బోధనల ఫలితంగానూ, చేనేత కార్మికులలో వచ్చిన చైతన్యం కారణంగానూ, 1980వ సంవత్సరం నుండి, ఈ కార్మికులు సహకార సంఘాలుగా ఏర్పడడం ప్రారంభించారు కానీ. దానికొక ఊగూతూగూ రావడమన్నది గడిచిన పాతికేళ్ల నుండీ ప్రారంభమయింది. ముఖ్యంగా, దేశాభివృద్ధికోసం, పంచవర్ష ప్రణాళికలను, మనం తయారు చేసుకొంటున్నప్పుడు, చేనేత పరిశ్రమకు సముచిత స్థానం ఇవ్వడం జరిగింది.

చేనేత పరిశ్రమాభివృద్ధి కోసం రాష్ట్ర స్థాయిలోనూ, కేంద్రం స్థాయిలోనూ, రకరకాల కార్యక్రమాలను అమలు



పరిచారు; అమలు పరుస్తున్నారు. 1952లో ఏర్పడిన అఖిల భారత చేనేత బోర్డువారు, ఈ పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేకంగా రకరకాల, మార్గదర్శక సూత్రాలను రాష్ట్ర ప్రభుత్వాలకు

అందజేశారు. ఇవన్నీ పరిశ్రమను మెరుగుపరిచేవే! సహకార సంఘాల పరిధిలోనికి రాకుండా, ఈ సంఘాలకు వెలుపలగా ఉన్న కార్మికులు, తమ శ్రేయస్సు కోసం సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవడం మొదలుపెట్టారు. 1953-54 సంవత్సరం నుండి, 54.44 లక్షల రూపాయలను ప్రభుత్వం అప్పుగా మంజూరు చేసింది. అప్పుడున్న సహకార సంఘాల సంఖ్య 649 కాగా, ఇప్పటి సంఖ్య 977.


20 సూత్రాల కార్యక్రమం

భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రకటించిన, సాహసోపేతమయిన, 20 సూత్రాల నూతన ఆర్థిక కార్యక్రమంలో, చేనేత పరిశ్రమాభివృద్ధికీ, చేనేత కార్మికుల జీవన పరిస్థితులు మెరుగు పరచడానికీ సముచిత స్థానం ఇవ్వడం జరిగింది. విడివిడిగా ఉన్న చేనేత కార్మికులు, సహకార సంఘాలను ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన, అన్నిరకాల మద్దతును రాష్ట్రప్రభుత్వం కలిగిస్తున్నది. ఇలాంటి వారికోసం 18 సహకార సంఘాలను ప్రారంభించడమయింది. ఈ సంఘాలలోని సభ్యుల సంఖ్య 13 వందలకు పైచిల్లరగా ఉంది. వీరికి మంజూరైన ఋణాలు 1లక్ష రూపాయలు. వర్తమాన సంవత్సరంలో 18 వేల మంది కార్మికులు తమంతట తాముగా సహకార సంఘాలను రూపొందించుకోవడం కోసం, అవసరమైన 13 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. రానున్న రెండు సంవత్సరాల కాలంలోను, మరో 54 లక్షల రూపాయలను ఇందుకోసం కేటాయిస్తున్నారు. కనీసం 60 శాతంమంది కార్మికులైనా ఈ సహకార సంఘాలలో సభ్యులుగా ఉండాలని ప్రభుత్వ సంకల్పం.

ప్రధాని 20 సూత్రాల నూతన ఆర్థిక కార్యక్రమ ప్రకటనానంతరం, రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలను తీసుకొన్నది. ముఖ్యంగా చెప్పుకోదగినది, నిద్రాణంగా పనిచేస్తున్న చేనేత సహకార సంఘాలను చైతన్యవంతం చేయడం. ఇందుకోసం 32లక్షల రూపాయలను మంజూరు చేశారు. 2 వందల సంఘాల పరిస్థితులు మెరుగుపడతాయి.

ప్రణాళికా పథకాలు ప్రారంభమయ్యాక 2 కోట్ల రూపాయలను, రాష్ట్రప్రభుత్వం వర్కింగ్ కాపిటల్‌గా ప్రత్యేకించింది. ఇది తాత్కాలికమైన ఏర్పాటు మాత్రమే! ఈ ప్రణాళికాంతానికి ఇందుకోసం 5 కోట్ల రూపాయలను ప్రత్యేకించాలని ప్రభుత్వ సంకల్పం.

ఖర్చులు తగ్గడం, ఉత్పత్తి పెరగడం, ఏ పరిశ్రమకైనా అవసరమే. అందుకోసం, కొత్త పరికరాలుకావాలి. కొత్త పద్ధతులు అవలంబించాలి. వివిధ సహకార సంఘాలకు ఈ సదుపాయాలు లభించడం కోసమని, 91,227 లక్షల రూపాయలను, ప్రభుత్వం మంజూరు చేసింది. విజయవాడ, హైదరాబాదు, ఏలూరు



ఎమ్మిగనూరుల్లో, 4 ఆధునిక అద్దకపు కేంద్రాలున్నాయి. మరో 81 సహకార సంఘాలు, చిన్నచిన్న అద్దకపు యూనిట్లను నెలకొల్పుకోడానికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందజేస్తున్నది. ఇదిగాక ప్యాకేజీ పథకం క్రింద, 50 వేల నుండి 70 వేలరూపాయల దాకా ప్రత్యేక సహాయాన్ని అందజేయడం జరుగుతున్నది. ఇంతవరకూ 35 సంఘాలకు 21.22 లక్షల రూపాయలను అందజేశారు. మేలురకం పరికరాలు, గేట్ల నిర్మాణం, సాంకేతిక నిపుణుల ఆధ్వర్యాన, ఉత్పత్తి కొనసాగింపు వంటి కార్యక్రమాలకు ఈ మొత్తాలు వినియోగ పడుతున్నాయి.

సహకార సంఘాల పరిధిలోకి రాకుండా ఉండిపోయిన చేనేత కార్మికులకు కూడా సహాయ సహకారాలను అందజేసే కార్యక్రమం కొనసాగుతున్నది. అందులో ఒక భాగమే ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్. 1.40 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పడిన ఈ సంస్థ ఇంతవరకూ, 9 చోట్ల ఉత్పత్తి సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎక్కడెక్కడంటే శ్రీకాకుళం, పాలకొల్లు, మచిలీపట్నం, పేటపాలెం, పుత్తూరు, కొవ్వూరు, కార్వాన్, కరీంనగర్ లలో ఈ కేంద్రాలున్నాయి. ఇక్కడుండే పనివారికి నూలు సరఫరా చేస్తారు. తయారైన వస్త్రాలను తీసుకొంటారు. మజూరీలు చెల్లిస్తారు. మార్కెట్ అస్తవ్యస్తాలతో ఈ పనివారికి నిమిత్తం లేదు.

చేనేత కేంద్రాల్లో సమృద్ధిగా వస్త్రాలరాసులున్నాయి. వీలైనంత చవకగా వస్త్రాలను మార్కెట్‌లోకి పంపించాలి, అలాగని, ఈ చేనేత కార్మికులు నష్టపోకూడదు. ప్రభుత్వం కొంత "ముదరా" ఇస్తున్నది. మరికొన్ని ఆర్థిక సదుపాయాలను, ఈ పరిశ్రమ సహాయంగా కల్పించుకోవాలి. వివిధ ప్రాంతాల్లో ఉన్న అమ్మకపు డిపోలద్వారా అమ్మకాలను పెంచాలి. ఉన్న మార్కెట్‌లను

సంపూర్తిగా వాడుకోవడంతో చాలదు ; కొత్త మార్కెట్లను అన్వేషించాలి. అక్కడ సరుకుల్ని నింపాలి. ఆంధ్రప్రదేశ్ టెక్స్టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారు ఇంతవరకూ 9 లక్షల ఖరీదైన, రెడీమేడ్ దుస్తులను ఎగుమతి చేశారు. ఇవన్నీ చేనేత వస్త్రాలతో తయారైనవే! అలాగే "ఫెడరేషన్ ఆఫ్ గార్మెంట్ మాన్యుఫాక్చరర్స్ కో‌ఆపరేటివ్ సొసైటీ" వారు జర్మనీ, ఇటలీ వంటి దేశాలకు. 25.27 లక్షల రూపాయల రెడీమేడ్ దుస్తులను ఎగుమతి చేశారు.

గృహవసతి

చేనేత కార్మికులకు గృహవసతి కల్పనలో కూడా ముమ్మరమైన కృషి జరుగుతున్నది. 25 గృహ నిర్మాణ పథకాలకు గాను, అప్పు గ్రాంటుల రూపంలో సహాయపడేందుకు, 51.68 లక్షల రూపాయలను కేటాయించడమయింది. రాష్ట్రం మొత్తం మీద, కరీంనగర్, గుంతకల్, నెల్లూరు, రాజమండ్రి చీరాల-ఈ 5 చోట్ల సహకార నూలు మిల్లులు పని చేస్తున్నాయి. వాటా ధనంక్రింద, రాష్ట్ర ప్రభుత్వం 1.10 కోట్ల రూపాయలను ఈ మిల్లుల్లో పెట్టుబడి పెట్టింది. ఏడాదికి 2500 బేళ్ల నూలును, ఈ మిల్లులు సరఫరా చేస్తున్నాయి. ఇవిగాక—శ్రీకాకుళం, పామర్రు, పరుచూరు, చిత్తూరు, నంద్యాల, ఆదిలాబాద్ ఈ ఆరు చోట్ల సహకార నూలు మిల్లుల్ని స్థాపించడానికి లైసెన్సులను మంజూరు చేయడం జరిగింది. సక్రమంగా పనిచేయని మిల్లులు తిన్నగా పనిచేయడానికి అవసరమైన చర్యలన్నింటినీ ప్రభుత్వం తీసుకొంటున్నది.

అంతేకాదు, చిన్న చిన్న నూలు మిల్లుల్ని ప్రయోగాత్మకంగా నడిపి చూడవలసిందిగా, టెక్స్టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వారికి రాష్ట్ర ప్రభుత్వం సలహా యిచ్చింది. ఆ సలహా మేరకు, అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో వొక చిన్నతరహా నూలు మిల్లును ఏర్పాటు చేస్తున్నారు.

పవర్ మగ్గాలు

పవర్ మగ్గాలకు సహాయపడేందుకుగాను, 45.31 లక్షల రూపాయలను రాష్ట్రప్రభుత్వం కేటాయించింది. ఇదిగాక మరో కోటి రూపాయల మేరకు గ్యారంటీ కూడా మంజూరు చేసింది. రాష్ట్ర టెక్స్టైల్ కార్పొరేషన్ వారు, పవర్ మగ్గాలను ఏర్పాటు చేయడంలో సహాయం చేస్తారు.

ప్రోసెసింగ్ యూనిట్‌ను నెలకొల్పడంకోసం, 5 లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగింది. ఈ పథకం మొత్తం వ్యయం 80 లక్షల రూపాయలు.

స్వయం ఉపాధి పథకాల క్రిందా, ఉద్యోగావకాశాలను పెంపొందించే కార్యక్రమం క్రిందా, ఆరు సైజింగ్ యూనిట్లను నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీటి వ్యయం 39 లక్షల రూపాయలు.

చేనేత కార్మికులకు అవసరమైన జరీని సరఫరా చేయడం కోసం, నెల్లూరులో, సహకార ప్రాతిపదికమీద, వొక జరీ తయారీ కేంద్రాన్ని నడుపుతున్నారు.

పట్టు పరిశ్రమ

పట్టు పరిశ్రమకు కూడా రాష్ట్రప్రభుత్వం గణనీయమైన సహాయం అందజేస్తున్నది. సంవత్సరం కిందట 3 వేల ఎకరాల్లో మాత్రమే మల్బరీ తోటలను పెంచారు. ఇప్పుడు తోటలు 5 వేల ఎకరాలకు విస్తరించాయి. షాద్‌నగర్ దగ్గర ప్రభుత్వం ఆధ్వర్యాన, 8 లక్షల వ్యయంతో, 50 ఎకరాల మల్బరీ తోటను పెంచుతున్నారు. కేంద్ర సిల్కు బోర్డు వారు రాజేంద్రనగర్‌లో, రాష్ట్రప్రభుత్వం తోడ్పాటుతో. వొక విస్తరణ కేంద్రాన్ని నెలకొల్పారు.

మహబూబ్‌నగర్ దగ్గర ఉన్నితో దారాన్నితీసే యంత్రాగారం వొకదాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ తయారైన ఉన్ని దారాన్ని సహకార రంగంలోని కార్మికులకు, విడిగా ఉన్న వారికీ సరఫరా చేస్తారు. ఇందుకోసం, ప్రభుత్వం వాటాధనం క్రింద 5 లక్షల రూపాయలను మంజూరు చేసింది. 16.50 లక్షల రూపాయలను, ఈ సంఘ సభ్యులు వాటాల రూపంలోనూ, ఇతర ఆర్థిక సహాయక సంస్థల ద్వారానూ, సేకరించారు.

మొత్తంమీద, రాష్ట్రంలోని చేనేత కార్మికుల స్థితిగతులను మెరుగు పరచడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నది. కొత్త రకాలను తయారు చేయడం, అందుకోసం పరిశోధనలు జరపడం, అద్దకంలోనూ చలువ చేయడంలోనూ, అధునాతన మార్గాలను అవలంబించడం, కొత్తగా మార్కెట్లను కనుగొనడం; విదేశాల వారి అభిరుచులకు అనుకూలమైనరంగులను. డిజైన్లను తయారు చేయడం వంటి రంగాలలో, చేనేత పరిశ్రమ మరింతగా, చొచ్చుకుపోవాలి. ఇతర దేశాల పోటీని తట్టుకోవాలి.

చేనేత కార్మికుల సంక్షేమంకోసం ప్రభుత్వం చేయగలిగినదంతా చేస్తున్నది! ఇక ముందు కూడా చేస్తుంది.

నా పాట గోదావరి శీకరాలు

శ్రీ సోమసుందర్

గోదావరీ పూర్వ మండలం
అనారతం నా దప్పి తీర్చే కమండలం

నేను పుట్టి పెరిగిన ఈ కమ్మని మట్టి
నను చల్లగాచూసే తీయని పాల చట్టి
నా అంతర్యంలోని ప్రతి అణువూ
నా తల్లి గోదావరి
దయాస్నపిత శీకరాలతో
జాజ్వల్య మానంగా
పెరిగిన సజీవ చైతన్యమూర్తి

అమేయమైన నా గతాన్ని పరిపోషించింది
అనంతమైన నా భవిష్యాన్ని పరిపాలిస్తుంది
వక్రీ భవత్ కృపాణధారగా
నా వర్తమానాన్ని ఆవర్తిస్తోంది

కురుస్తోంది శతకోటి స్వప్నాలు మాలగా
కురుస్తోంది సహస్ర సదాశయాలు ధారగా ...

నా తల్లి నడయాడిన ఈ ద్వీపకల్పం
ఆడదాని పొత్తి కడుపులా
బహు కోమలమైంది!
ఐనా బలోపేత కవచంగా
సహస్ర జీవాంకురాలను
రక్షిస్తోంది ఓజస్స్పందనంగా ...

దాని కిరు ప్రక్కలా
సైనిక శ్రేణులై నిలచిన పర్వత పంక్తులు
అరుణాచలాలు, నివీలాచలాలు
దుర్గమ దుర్గాలవంటి భయంకర కాంతారాలు
సురుచిర కేళీవనాలు, సారభూత కేదారాలు
లలిత మసృణ శాద్వలాలు
మలయ పవనపులకిత వనస్పతులు
శతకోటి బాహువులు సాచే, వీచే
ఆటవిక ఝంఝూమారుతాలు ...

భూరేఖల ఆకాశాల నానుకొన్న
బోర్లించబడిన కెంపుల పసిడి గిన్నె నింగి
భూహృదయంలో గనుల గ్రంథులలో
పంచలోహాలనూ దాచి కాపాడే మందసం ...
తామ్రమై తుత్తు నాగమై
అయోమయమై రాక్షసి బొగ్గయి
నా కందిన సర్వసంపదలనూ
పురిడించే గోదావరి ఖని!

సుషుప్తులను జాగరించు సప్త గోదావరం!
రాత్రిందివాల పరిభ్రమించే సప్తవర్ణచక్రం
తిరుగుతుంది—అమేయకాంతి ధారగా
తిప్పుతుంది నా సమస్త చైతన్యాలను లీలగా
పెంచుతుంది నన్ను నా దప్పి తీర్చి సొగసులవెల్లి
అడక్కుండానే అన్నీపెట్టే నా కన్నతల్లి!

ప్రణవనాదంనుంచి సుభగ సంగీతం వరకూ
నా శ్రవణాలకు విందు చేస్తాయామె తరంగాలు
సాంద్రతర విటపి సీమాంతరాలు
పిచ్చిగా పెరిగి చేవదేరిన దారువులు
ఈ పుడమికి మొగదారులు
తరగని ఐశ్వర్యాలై సౌఖ్యాలై పరిఢవిల్లు
నిదాఘ ఝరులు చంద్రనిప్పుల చల్లి
కాల్చుతుండా నన్ను రక్షించే హరివిల్లు ...
మహా వృక్షజాతులకు పరాంకోటి నక్షత్రాలు సిగపూలు!

తొలకరి ఋతుపవనాల చలువలొనగూర్చి
క్షితిజరేఖల సరిహద్దులలో
వానకాళ్లయి నడచివచ్చి, నా భూతలి కడదెంచి
కరిమొయిళ్ల దండుల నాహ్వానించి
వరిబయళ్ల గుండెలు పులకింపచేసి
ఆనంద రంగవల్లికలుగా విరియించి
నా పొలాలు తడిపి, నా పరిణతగళాల మెదిపి
నా కపోలాల పులకితస్మితరేఖల లగించి
నన్ను కితరించె నోహో! నాకెంత హాయి!

ఈ పుణ్యతల్లి మృదు హృదయంపై
నా చరణాలను అలవోకగా సారిస్తున్నపుడు
మరకత మణులై మెరిసే జీవన పత్రాలు
చలువ గొడుగులై విప్పుకొని
సేదతీరుస్తాయి నా శ్రమాశిన్న హృదయాన్ని......
జలధారల కేవో విన్నపాలు తెల్పుకునే గులకరాళ్ల
వినిపిస్తాయి మృదంగధ్వానాలు
తుఫానుగాలుల ఆక్రోశాలనుంచి
నన్ను కాపాడి, పాడే సంగీతపేటికలు తెరుస్తాయి!

సర్వ అహంకారాల విడచి
సాష్టాంగంగా ప్రార్థనలుజరిపే
భక్తులవంటి సెలయేళ్లు
తీరాలనున్న అడవి నారింజలను
ఒద్దికగా ఎత్తి కానుకలర్పిస్తాయి
నా గోదావరి తల్లికి......!
తమ చిన్నారి బ్రతుకులకు
రవంత చోటిమ్మని వేడుకుంటాయి
తేనేలూరు కెరటాల ఒడిలో
అనంత కాంతిని పుంజుకుంటాయి
తన తోయాలను తీయని పాలుగామార్చి
అందిస్తాయి వరివెన్నుల మృదులాల పెదవులకు
పరమాన్నాలొసగి వరాల ఆమ్నాయాలొసగి
పరిపోషిస్తాయి నన్నూ నా తమ్ములనూ!

గోదావరి దరుల తూరుపు పడమటి కేదారాలు
కేంద్రీకృత అవిచ్ఛిన్న ప్రణయ సీమంతినుల సీమలు
గోదావరీ తరంగ శీకరాలు
చేతన కేతనాలైన నాకరాలు!

ఆమె నడల సొబగులు
నా స్వాంతంలో జీవన రహస్యాలై
ఉరకలిడే సహస్ర మహోద్రేకాలు
నాటి మహేతిహాసంలో
అనుస్యూత గతాగతాలు......!

[ఇది సాక్షాత్కారం]

2

ఇంత దీర్ఘమైన ఈ వాహినీ దేహంలో
ఏ కేంద్ర బిందువులో
నా స్వచ్ఛరూపముందో ఎలా పోల్చుకోను?
ఎన్నెన్ని మృణ్మయ రేణువులతో
నా సర్వస్వం తాదాత్మ్యం చెందిందో
ఎన్నెన్ని జీవరాసుల దప్పి తీర్చిందో
ఎంతకెంతటిని మార్కొన్నదో కసుగాయలను
మరెంద రెందరిని మార్కొన్నదో క్రూరాత్ములను
నా గోదావరి నాదోత్సవ గాథాలహరి—
ఏ కైఫీయతులో వివరించబడింది?
ఫలానాదే నా స్వస్వరూపమని ఎలా పోల్చుకొనేది?
ఎన్నెన్ని మంటభాషల శేముషీ వైదగ్ధ్యాలో
ఎన్నెన్ని అజ్ఞాత తమో వక్షీరసాలో
విడదీయడ మెలాగ?...కోవడ మెలాగ?

ఆసలు నా ఆంతర్యంలోని
అజ్ఞాన మాంసలమైన జడ పదార్థంలో
సంపూర్ణ వికసిత మనోజపద్మం
ఏ మూల సురభీకరిస్తోందో?
నా ఈ శరీర సద్మం తలవాకిలి పొదిగిట

గోదావరి తల్లి వెలిగించిన దీపాలే కునుకు తీస్తే
ఎలా రాణించగలిగేది నా దేశం
ఎలా విస్మృతమయ్యేదా సరిదమృత సందేశం!
ఒకానొక గడుసువాడు
చెప్పగా విన్ననే విన్నాను:

"సంప్రదాయం పాదరసం వంటిది
దానిని పాత్రలోని కెత్తినపుడే
దానికో ఆకారమూ భారమూ
అనుస్యూత గుణమూ—ద్యోతక మయ్యేది;
లేదా ఒక్కసారి ఠక్కున నేలకు విసరి కొట్టేవా
శత సహస్ర లవలేశాలై, భిన్నాలై
దేనికదే పరిపూర్ణమైనట్లు భావిస్తుంది
ఇన్ని బిందువులలోనూ ఉన్నది
ఒకే గుణమనీ చెప్పలేం; కాదనీ గట్టిగా
నిరూపించలేం!అంతా అస్తి నాస్తి ద్వంద్వాతీతం!
తీరా ఛిన్నించిన తర్వాత దాని గురుత్వంపైతం
గుణగణ రాహిత్యమే కాగలదు! కాగలదొక
వైపరీత్యం!"

అతగాడు చెబుతున్నపుడు
నేనీ సిద్ధాంతాన్ని నమ్మలేదు
కానీ గోదావరీ విశ్వరూప సందర్శన మాత్రం చేత
నా నిసర్గ సౌందర్యాన్ని పోల్చుకున్నాక
నాలో లక్షలాది ఆలోచనా తరంగాలు
తరంగాలపై తేలే సందేహడోలలు!

ఇక్ష్వాకుల కాలంనుంచీ ఉన్నది
ఇదే గోదావరీ నదీ మాతృక కదా
ఐతే ఆనాటి సరస జలరాశి
ఇప్పుడూ ఉందని ఎలా నమ్మడం?
మరి లేదని నిరూపించడ మెలాగ?

కనుకనే నా కనిపిస్తూ వుంటుంది
నా తల్లి గోదావరితో పాటు నేనూ
అనంతామృత పాదోధినే కావాలని...
క్షణాత్ క్షణాత్ పరివర్తనాశీలదేహాష్టిని
అచ్ఛమైన నా ఆంతరిక రూపాన్ని కోలుపోని
ఒకానొక చైతన్య లక్ష్య బిందువునని...

వెలుగునిస్తూ సీరుగా కారిపోతున్నా
కొవ్వు తన స్వరూపాన్ని కోల్పోని రీతిగా
ఇన్నిన్ని మాన వాకృతులలో నిమగ్నమైన నేను
ఇన్నిన్ని జనన మరణాల చక్రబంధాలలో లగ్నమైన నేను
లసత్ గోదావరీ స్వరూపాన్నేనని
విస్మరించ లేకపోతున్నాను; విశ్వసించనూలేక పోతున్నాను।

ఇంత సువిశాల పర్వతశ్రేణుల మధ్యలో
నేనొక మౌలిక పాషాణ శర్మ్య మూర్తినై
బహుశా అవినాశంగా నిలచే ఉన్నానా ?
ఈ నదీ తీరంలో నిలచి తుషార శీకరకరాలెత్తి
లోకాన్ని నడుపుతున్నానా ? నాకై నడుస్తున్నానా ।

గోదావరీ పులిన స్థలి విశ్రాంతికై వాలి
తీయని సీరు హాయిగా గ్రోలి
సొక్కి సోలిన నా అంతరాళ మరాళం
మళ్లీ నిరంజన వ్యోమ సీమల కెగిరెగిరి పోతూనే వుందా,
ఏమో ఎన్నెన్ని సంశయాలు, కల్లోల ఉల్లోలాలు !

[ఇది జీవరాశి]



శ్రీశైల దేవాలయ దక్షిణ ప్రాకార కుడ్య శిల్పం

చిత్రం: శ్రీ మారేమండ శ్రీనివాసరావు

మన సాహిత్యానికి మనమేం చేశాం?

శ్రీ దేవులపల్లి రామానుజరావు

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజానీకమున వివిధ సాహిత్య ప్రక్రియలందు ఆదరమును, అభిమానమును పెంపొందించి పరిపోషించు సంకల్పముతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీని 1957 లో ఒక స్వయం పరిపాలనా ప్రతిపత్తి గల సంస్థగా వ్యవస్థీకృతము చేసినది. అప్పటిలో భారత రాష్ట్రపతిగా ఉండిన డా. రాజేంద్రప్రసాద్, ఈ అకాడమీ కార్యకలాపాలను, లాంఛన పూర్వకముగ, 7-8-1957న ఆరంభముచేసి తమ ఆశీస్సులను ప్రసాదించినారు.

తెలుగు భాషా, సారస్వతములలో సముచితమైన అనుశీలనా కృషిని పెంపొందించుట, తగు ఆధార గ్రంథాలను, గ్రంథ సూచికలను, విజ్ఞాన సర్వస్వములను, నిఘంటువులను, రూపొందించు కృషిలో ఆసక్తి వహించి పనిచేయుచున్న వ్యక్తులకు, సంస్థలకును ఉచిత సహాయ్యమును సమకూర్చుట, ఆధునిక శాస్త్రీయ పద్ధతుల ప్రకారము ప్రామాణికమగు ఒక వ్యాకరణమును, ఒక సమగ్ర నిఘంటువును ప్రచురించుట, బహుమాన, సాహాయ్య, పురస్కారముల మూలమున తెలుగు రచయిత లందలి సృజన, విమర్శనాత్మక శక్తులకు ప్రోత్సాహమును కల్పించుట, ప్రజా సామాన్యమున సాహిత్య పఠనాసక్తిని వృద్ధిచేయుట-అనునవి అకాడమీ ఆశయాలు.

స్థాపితమైనప్పటినుండి ఈ అకాడమీ పండితులయు సహృదయుల, ఆదరాభిమానముల సాయమున క్రమగతితో ముందంజ వేయగలిగినది. సాహిత్య అకాడమీలో ప్రత్యక్ష సభ్యత్వము కలవారలేగాక ఇతర రచయితలును పండితులును విమర్శకులును అకాడమీ కార్యకలాపముల నిర్వహణలో అధ్యక్షునకును కార్యవర్గ సభ్యులకును చేదోడు వాదోడుగ ఉండి, అకాడమీ లక్ష్యముల సాధనలో పాలు పంచుకొన్నారు. సంస్థా కార్య కలాపముల నిర్వహణకై తగు మొత్తములను ప్రతి సంవత్సరం గ్రాంటుల రూపమున ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఇచ్చినది. కొన్ని నిర్దిష్ట కార్యక్రమముల నిర్వహణకై కేంద్ర ప్రభుత్వము కొంత ధన సహాయము చేసినది. ఇట్టి సాహాయ్య ఫలితముగ అకాడమీ పలువిధములగు సాహిత్యరంగములందు ఒక నూతన చైతన్యమును మొలకెత్తజేసినది.

సాహిత్య అకాడమీ తన లక్ష్యసాధనకై సాహిత్య పరిపోషకములగు వివిధ కార్యక్రమములను అవలంబించి కృషి చేయుచున్నది. ఆ కార్యక్రమాలను, 1 ప్రచురణ 2 బహుమాన, సాహాయ్య పురస్కార ప్రదానము 3 ఉపన్యాస కార్యక్రమము 4 అంతర్రాష్ట్రీయ సౌహార్ద పోషణ అని వింగడింప వచ్చును.

1. ప్రచురణ సాధారణ పుస్తక ప్రకాశకులు ముద్రించుటకు, శక్తి, సాధన సంపత్తుల దృష్ట్యా, వారికి అందుపాటులోలేని, ఆధార గ్రంథాలను ప్రచురించుటయు పూర్వకవుల కావ్యాలను ముద్రింపజేసి తక్కువ ధరకు అందజేయుటయు తన ప్రచురణ కార్యక్రమమున ముఖ్యాంశములుగ అకాడమీ పెట్టుకొనినది. ఇటి ప్రచురణ తెలుగునకు మాత్రమే పరిమితమైనది కాదు. జాతీయ సమగ్రత దృష్ట్యా తక్కిన భారత భాషలలోని ప్రముఖ రచయితల కొన్ని రచనలను సైతము తెలుగున అనువదింపజేసి అకాడమీ ప్రకటించినది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక ప్రముఖ అల్పసంఖ్యాక భాషగనేగాక చారిత్రికముగ సైతము ఒక ప్రతిపత్తిని ఆర్జించిన ఉర్దూలో 14 ప్రచురణలను అకాడమీ వెలువరించినది. ఇక భారతీయ భాషలలో పెక్కింటికి మూలస్రవంతియైన సంస్కృతములో కొన్ని అమూల్య ప్రాచీన గ్రంథాలను వ్యాఖ్యానసమేతములుగ ఈ సంస్థ ప్రచురించినది. ఇప్పటికి మొత్తము మీద తెలుగున 173. హిందీలో 9, ఉర్దూలో 14, సంస్కృతమున 13, ఆంగ్లమున 8 ప్రచురితములు.

2. బహుమాన, సహాయ్య, పురస్కార ప్రదానము రచయితలలో సృజనశక్తిని, అభిలషణీయమగు స్పర్థాళుతను పెంపొందించి తద్వారా ఉత్తమ రచనలు వెలువడునటుల జేయుటకై అకాడమీ మూడు రీతుల బహుమానములను ప్రవేశపెట్టి నిర్వహించుచున్నది.

i. ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలలో-పద్యకవిత, నవల, కథానిక, విమర్శ, నాటక-నాటిక అనువానిలో - ఒక్కొక్కదానియందు బహుమానము ప్రకటితమగు సంవత్సరమునకు ముందుగ అయిదేండ్ల కాలవ్యవధిలోపల ప్రచురితమైన ఉత్తమ గ్రంథమునకు రు. 1,116 బహుమానము ప్రతియేటా ఈయబడుచున్నది. ఈ పథకము క్రింద ఇప్పటికి 12 మంది కవులును, 10 మంది నవలా రచయితలును, 11 మంది కథానికా రచయితలును, 9 మంది సాహిత్య విమర్శకులు నాటక-నాటికా రచయితలలో 6 గురు బహుమతులను పొందినారు

ii. అకాడమీ నిర్దేశించు రెండు విషయములపై రచయితలు రచించి, అకాడమీకి నివేదించు వ్రాతప్రతులలో ఉత్తమమైన వానిలో ఒక్కొక్క దానికి రు. 2,000 చొప్పున బహుమతి ప్రతియేటా ఈయబడుచున్నది. (ఈ బహుమతి ప్రస్తుతము రు. 3,000కు పెంచబడినది.) ఈ పథకము క్రింద ఇప్పటికి 35 మంది రచయితలు బహుమతులను పొందిరి.

iii. రచయిత్రుల కొరకై ప్రతియేటా ఒక్కొక్కటి రు. 100 చొప్పున రెండు బహుమతులు ఈయబడుచున్నవి. అందొక బహుమతి సంవత్సరమునకు మూడు అయిదేండ్ల కాలవ్యవధి లోపల, వెలువడిన గ్రంథములలో ఉత్తమముగ నిర్ణ

యింపబడిన దానికిని రెండవది అకాడమీ నిర్దేశించు ఒక నిర్దిష్ట విషయముపై రచయిత్రులు రచించి అకాడమీకి అందజేసిన దానిలో ఉత్తమమగు దానికిని లభించును. ఇట్టి బహుమతులను ఇప్పటి వరకు 12 మంది రచయిత్రులు గ్రహించిరి.

పై బహుమతులు గాక, స్వీయ గ్రంథములను ప్రచురించుకొనజాలని రచయితలకు, గ్రంథప్రచురణకై, అకాడమీ కొంత ధనసాహాయ్యమును చేయుచున్నది. ఈ విధముగ ఇప్పటికి 500 మంది రచయితలకు రు. 3,62,000 ధనసాహాయ్యము చేయబడినది.

వయోవృద్ధులగు ఉత్తమ రచయితలను, సాహిత్య పోషకులను, అకాడమీ విశిష్ట సభ్యత్వ ప్రదానరీత్యా సన్మానించుచున్నది. ఇప్పటికి 47 మంది ఇట్టి విశిష్ట సభ్యత్వ సన్మానమును పొందిరి.

3. ఉపన్యాస కార్యక్రమము :— పండిత లోకమునేగాక సామాన్య ప్రజానీకమున, విద్యార్థిలోకమున సాహిత్యాభిరుచిని పెంపొందించుటకు ఈ కార్యక్రమములు ఉద్దేశింపబడినవి. ఇవి రెండు విధములు : (i) సాహిత్య చరిత్రలో పేరెన్నికగని కీర్తిశేషులైన ప్రముఖుల శత జయంతులను, సంస్మరణ దినోత్సవము లందును ఆయా ప్రముఖులను గూర్చి చేయు ఉపన్యాసములు. (ii) అకాడమీ నిర్ణయించిన ఒక ప్రత్యేక విషయంపై ఒక నిర్దిష్ట వ్యక్తి కూలంకష ప్రజ్ఞలో చేయు ఉపన్యాసములు ఇట్టి ఉపన్యాసములు హైదరాబాదు నగరమునేగాక రాష్ట్రమునందలి తక్కిన ప్రముఖ కేంద్రము లందును, నిర్వహింపజేయవలయుననుట అకాడమీ ఆశయము. ఆ దృష్టితోనే, ఇప్పటికి, (హైదరాబాదు నగరముననేగాక) నెల్లూరు, తిరుపతి, ఖమ్మంలలో అకాడమీ కార్యవర్గ సమావేశముల సందర్భమున, అట్టి ఉపన్యాస కార్యక్రమములను నిర్వహించుట జరిగినది. ఇట్టి సాహిత్యోపన్యాసములు అన్నియు ముద్రితములైనవి.

4. అంతర్రాష్ట్రీయ సౌహార్ద పోషణము :— తక్కిన భారత భాషల భాషా సారస్వతములతో సాన్నిహిత్యమును, తద్వారా జాతీయ సమగ్రతను పరిపోషించు సంకల్పముతో, యం. ఎ. పట్టమును పొందిన తెలుగు పండితులను ఇరువురను ఇరుగు పొరుగు రాష్ట్రములకు పంపు పథకమును అకాడమీ ప్రవేశపెట్టినది. వారిలో ప్రతియొకనికి నెలకు రు. 250/- విద్యార్థి వేతనమును అకాడమీ చెల్లించుచున్నది. ఈ పథకము క్రింద ఇప్పటికి మరాఠి, మళయాళ, ప్రాకృత భాషాధ్యేతలకు విద్యార్థి వేతనముల ఏర్పాటు జరిగినది.

పై ప్రచురణాది కార్యక్రమములను నిర్వహించుచూనే, రచయిత్రుల అభ్యుదయంపట్ల ప్రత్యేక శ్రద్ధవహించి అకాడమీ, తెలుగు రచయిత్రుల సమావేశములను తన సలహాసంఘపు అధ్వర్యమున, నిర్వహించుచున్నది: సాహిత్య రంగమున పరిగణన ఆర్జించిన ఒక ఉత్తమ రచయిత్రిని ఏటేటా, రు. 1,116 బహూకృతితో సన్మానించుచున్నది.

ప్రతియేటా ఒక ఉత్తమ సంస్కృత పండితుని రు 1,116 బహూకృతితో అకాడమీ సన్మానించుచున్నది.

అకాడమీ తన లక్ష్య సాధనకై ఇంకను ఎంతయో కృషి చేయుటకు సమృత్సుకత వహించియున్నది. ప్రస్తుతమున ఈ క్రింది విషయములపై ఉత్తమ గ్రంథములను వెలువరించుటకు కృషి జరుగుచున్నది.

1. భాషా మూల సూత్రాలు
2. అలంకారశాస్త్ర సిద్ధాంతాలు—తెలుగు సారస్వతమునకు వానిని అనువర్తించు రీతి
3. ఆంధ్రేతిహాసపు ఆధారాలు
4. పద్య శాసనాలు
5. తెలుగు వీరగాథలు
6. తెలుగు భాషపై ముండా భాషల ప్రభావము.

వివిధ ప్రచురణలు

I. ఆధార గ్రంథములు
  1. తెలుగు సామెతలు
  2. పదబంధ పారిజాతము (2 సం.)
  3. పదకోశములు
    i. నన్నయ
    ii. నన్నెచోడుడు
  4. మాండలిక భాషా నిఘంటువులు
    i. మాండలిక వృత్తి పదకోశము (వ్యవసాయము)
    ii. " " (వాస్తువు)
    iii. " " (చేనేత)
    iv. " " (కుమ్మరము)
    v. " " (మత్స్యపరిశ్రమ— ముద్రణలో ఉన్నది.)
  5. ఇతర నిఘంటువులు
    i. బ్రౌన్ నిఘంటువు (తెలుగు-ఇంగ్లీషు) —1852లో ప్రకటితమైనదాని పునర్ముద్రణ
    ii. " (ఇంగ్లీషు-తెలుగు) —1853లో ప్రకటితమైనదాని పునర్ముద్రణ
    iii. శాసన శబ్దకోశము
    iv. తెలుగు నిఘంటువు (తెలుగు-తెలుగు) —డిగ్రీస్థాయి వరకు విద్యార్థులకు ఉపయోగించునది
    v. ఆంధ్రక్రియా స్వరూపమణిదీపిక (ధాతునిఘంటువు)
    vi. సూక్తి సుధాకరము

II. సాహిత్య సహాయక గ్రంథములు
  1. ఇతిహాస, పురాణ, ప్రబంధములు
    i. శ్రీ మహాభాగవతము (పరిష్కృత ప్రామాణిక ప్రచురణ)

ఆంధ్ర మహాభారతము : పదునాలుగు పర్వములు
గల 10 సంపుటములు.
—తక్కిన భాగము ముద్రణలో ఉన్నది.

iii. ప్రాచీన ఆంధ్ర ప్రబంధములు 56 (వెల తక్కువ ప్రచురణములు)

2. సాహిత్య, భాషా చరిత్రలు
   - i. తెలుగు భాషా చరిత్ర
   - ii. దక్షిణ భారత సాహిత్యములు
   - iii. ఉర్దూ సాహిత్య చరిత్ర
   - iv. భారతీయ భాషలలో మహిళా రచయిత్రులు
   - v. సారస్వత వ్యాసములు (4 సం.)

3. సాహిత్యోపన్యాసములు
   - i. నన్నయ
   - ii. చిన్నయసూరి
   - iii. క్షేత్రయ
   - iv. గిడుగు వెంకటరామమూర్తి
   - v. నన్నెచోడుడు
   - vi. వేదం వెంకటరాయశాస్త్రి
   - vii. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
   - viii. కాశీనాధుని నాగేశ్వరరావు
   - ix. తిరుపతి వెంకటకవులు
   - x. ఏసుచరిత్ర—సంగీత, సాహిత్యాలు
   - xi. శరత్ చంద్ర
   - xii. నూరేండ్ల తెలుగునవల
   - xiii. తెలుగువ్యాసము-నూరు సంవత్సరాలు

4. లక్షణ గ్రంథాలు.
   - i. ఆంధ్ర రసగంగాధరం (2 భా.)
   - ii. కావ్యస్వరూపం
   - iii. లక్షణసార సంగ్రహం
   - iv. సుకవి మనోరంజనం

5. తొట్టతొలిగ ముద్రితములైన ప్రాచీన గ్రంథాలు
   - i. రాఘవాభ్యుదయం
   - ii. విష్ణు పారిజాతం

6. విజ్ఞాన సర్వస్వములు
   - i. విజ్ఞాన దీపిక I
   - ii. విజ్ఞానదీపిక II (ముద్రణలో ఉన్నది)

7. జానపద వాఙ్మయం
   - i. జానపద గేయాలు-ఆంధ్రుల సాంఘిక చరిత్ర
   - ii. కాటమరాజు కథలు

8. తెలుగున అనువదింపబడిన ఇతర భాషాగ్రంథాలు
   - i. సూరదాసు పదాలు
   - ii. ఉర్దూ కథానికలు
   - iii. అమ్జద్ రుబాయీలు
   - iv. మౌలానా రూమీ మస్నవీ
   - v. గాలిబ్ గజల్లు

III. సంస్కృతం
   - i. ఆంధ్రదేశ హాస్యకథా
   - ii. ఉత్తర రామచరిత్రమ్ (వ్యాఖ్యాసహితం)
   - iii. రస గంగాధరమ్ (")
   - iv. కావ్య స్వరూపమ్
   - v. కళా పూర్ణోదయమ్ (తెలుగునకు సంస్కృతానువాదమ్)
   - vi. మనుసంభవమ్ (")
   - vii. సుమతి, వేమన శతకములు (")
   - viii. శతక సప్తకమ్ (")
   - ix. ముద్రారాక్షసమ్
   - x. శ్రీహర్ష నైషధమ్
   - xi. శృంగార శేఖరబాణమ్
   - xii. జాంబవతీ పరిణయమ్
   - xiii. స్తోత్ర లహరీ

IV. హిందీ
   - i. ఆంధ్ర భాగవత పరిమళ
   - ii. తెలుగు-కే-బీస్ కహానియాం
   - iii. పద్మాకర్ I
   - iv. " II
   - v. హిందీ తెలుగు వ్యాకరణ కా ఏక్ తులనాత్మక అధ్యయన్
   - vi. ఉర్దూ పథప్రదర్శక్
   - vii. ఆధునిక తెలుగు కవితా I
   - viii. " II
   - ix. రామప్పకా మందిర్

V. ఉర్దూ

i. హైదరాబాద్ కే షాయిర్ I
ii. " II
iii. హైదరాబాద్ కే అదీబ్ I
iv. " II
v. రహనుమా-ఎ-ఉర్దూ
vi. తెలుగు అఫ్‌సానే
vii. రహనుమా-ఏ-కితాబ్‌దారీ
viii. షిష్-వ-తిష్
ix. మోమిన్
x. మురూద్ ఎ వక్త్
xi. దక్కనీ రుబాయాం
xii. దక్కనీ జబాన్ కే ఆగాజ్ ఔర్ ఇర్‌తఖా
xiii. దక్కనీ ఉర్దూ నిఘంట్
xiv. దక్కనీ నసర్ పారే

IV. ప్రత్యేక సంచికలు

i. టాగూర్ శతజయంతి సంచిక
. నెహ్రూ స్మారక సంచిక
iii. అఖిలభారత కవయిత్రులు
iv. హిందీ రచయిత్రుల సదస్సు
v. తెలుగు రచయిత్రుల మహాసభలు (ఒకటవ సభ మొదలు ఏడవసభ వరకు ప్రత్యేక సంచికలు)

VII. ఇతర గ్రంథాలు

I. ప్రాచీనాంధ్ర చారిత్రిక భూగోళం
ii. తూర్పు (వేంగీ) చాళుక్యుల చరిత్ర (ఆంగ్లము)
iii. సమానార్థ వ్యతిరేకార్థ పద నిఘంటువు (ఇంగ్లీషు-తెలుగు)
iv. బ్రౌన్ జీవిత చరిత్ర
v. మానవల్లి రచనలు
vi. వేమన (తెలుగు-హిందీ-ఉర్దూ)
vii. ప్రపంచ తెలుగు మహాసభా సందర్భమున ప్రచురితములైన 43 లఘు గ్రంథాలు (వీనిలో 7 ఆంగ్లమున ఉన్నవి)
ix. భర్తృహరి (తెలుగు, హిందీ. ఉర్దూ)
x. ఘటివాచల మాహాత్మ్యం
xi. మెకిన్జీ వ్రాతప్రతులు
xii. బ్రౌన్ లేఖలు

(xi–xii:) పందొమ్మిదవ శతాబ్ది మధ్య కాలపు ఆంధ్రుల రాజకీయ, సాంఘిక, సారస్వత పరిస్థితులను ప్రతిబింబించు ఈ వ్రాతప్రతులను మద్రాసులోని ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములోని నకలులుగ వ్రాయించడమైనది.




"అలఘుస్వాదు రసావతార ధిషణా హంకార సంస్కార దోహల బ్రాహ్మీమయమూర్తి"

ఆస్థాన కవి అస్తమయం

తెలుగు సాహిత్యలోకాన్ని అర్ధశతాబ్దం పైగా మకుటం లేని మహారాజుగా పాలించి తెనుగుజాతి యశశ్చంద్రికలను దశదిశల వెదజల్లిన పుంభావ సరస్వతి, ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి. పద్మభూషణ, కళాప్రపూర్ణ, కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ అక్టోబరు 18వ తేదీన గుంటూరు జనరల్ ఆస్పత్రిలో పరమపదించారు.


శతాధిక గ్రంథకర్తగా, వేయిపడగలు విప్పి సాహిత్య భూభారాన్ని మోసిన అపర ఆదిశేషువుగా, రామాయణ కల్పవృక్ష మహాకవిగా ఆంధ్రావళి ఆయనను ఆదరించింది.


జ్ఞానపీఠ బహుమతిని స్వీకరించిన మొట్టమొదటి తెలుగు రచయిత శ్రీ విశ్వనాథ. ఆయన కవి, విమర్శకుడు, నవలాకారుడు కథానికా రచయిత, నాటకకర్త — ఒకటేమిటి. అన్ని సాహిత్య ప్రక్రియలూ ఆయనకు దాసోహమన్నవి. ఆయన లేని లోటు ఎన్ని శతాబ్దాలకు యీ తెలుగుదేశానికి తీరుతుందో!



సముద్రాంతర వ్యాపారానికి
తెనుగు దేశపు
తూర్పు ద్వారం
విశాఖ ఔటర్ హార్బరు
ఆసియాలోకెల్ల అతి పొడవైన
కన్వేయర్ సిస్టం వున్న రేవు

మన దేశంలోని
పెద్ద పది రేవుల్లో మూడవది
విశాఖ రేవు
దేశంలోకెల్లా అతి
లోతైన రేవు యిది





ఎగుమతుల, దిగుమతుల
వ్యాపారంలో అత్యంత
కీలకపాత్ర వహించనున్న
అత్యాధునిక సాధన
సామాగ్రిగల రేవు

ఆంధ్రప్రదేశ్‌లో లలితకళల అకాడమీ కృషి



శ్రీ వి. ఆర్. రెడ్డి

పూర్వం కళా పోషణ ఆనాటి రాజాస్థానాలలోనూ, సంస్థానాలలోనూ వారి వారి అభిరుచులపై ఆధారపడి ఉండేది ఇప్పటి ప్రజాస్వామ్యంలో ఈ కళలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వంపై వున్నది. ఈ కళలను సమగ్రంగా ప్రోత్సహించే నిమిత్తం అప్పటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, కేంద్రంలో సాహిత్య, సంగీత నాటక, లలితకళా అకాడమీలను నెలకొల్పజేసి. రాష్ట్రాలలో గూడా యిట్టి రాష్ట్రస్థాయి అకాడమీలను నెలకొల్పడానికి సూచన లివ్వడం జరిగింది. ఈ సూచనలను అనుసరించి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వివిధ రాష్ట్రస్థాయి అకాడమీలను వ్యవస్థీకరించ దానికి నిశ్చయించింది. దాని ఫలితంగా, సాహిత్య అకాడమీని 1954 లోనూ. సంగీత నాటక అకాడమీని 1957 లోనూ, లలితకళా అకాడమీని 1961 లోనూ నెలకొల్పటం జరిగింది

ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీని అప్పటి గవర్నర్ శ్రీ భీమ్‌సేన్ సచార్ 1961 సెప్టెంబరు 18 న ప్రారంభోత్సవం చేశారు. ఆనాటి నుంచి, ఆంధ్రప్రదేశ్‌లో చిత్రలేఖనం, శిల్పం మొదలైన కళలఅభివృద్ధి, ప్రోత్సాహంనే ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకొని, అకాడమీ అకుంఠిత దీక్షతో కృషి చేస్తున్నది.

1965 సంవత్సరంలో, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ, రాష్ట్ర సాహిత్య, సంగీత నాటక అకాడమీలతో కలిసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధన సహాయంతో, రవీంద్రభారతి ఆవరణలో కళా భవనాన్ని నిర్మించుకుంది అకాడమీ కార్యాలయంతో బాటు, ఒక గ్రంథాలయాన్ని, ఒక ప్రదర్శనశాలను కూడా యిందులో నెలకొల్పుకొన్నది.

బహుమతులు

ప్రతి యేటా, అకాడమీ ఆంధ్రప్రదేశ్ చిత్ర శిల్ప కళా ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నది. ఈ ప్రదర్శనలకు రాష్ట్రం నలుమూలలనుంచే గాక యితర రాష్ట్రాలలో నివసించే ఆంధ్ర రాష్ట్రానికి చెందిన కళాకారుల వద్దనుంచి గూడా శిల్ప చిత్ర కళా ఖండాలు ప్రదర్శన నిమిత్తం వస్తున్నవి. న్యాయ నిర్ణేతల సంఘంచే ఈ కళా ఖండాలను పరిశీలింపజేసి ప్రదర్శనార్హములైన కళాఖండాలను ఏరి, వాటినుంచి బహుమానార్హముగా నిర్ణయించిన 9 కళాఖండాలకు ఒక్కొక్కదానికి రు. 500/- చొప్పున నగదు బహుమతులను, అత్యుత్తమంగా ఎంపిక చేసిన దానికి స్వర్ణ పతకంతోబాటు రు. 500/- నగదు బహుమతిని అకాడమీ యిస్తున్నది. ఈ విధంగా యింత వరకు 14 వార్షిక ప్రదర్శనలను అకాడమీ ఏర్పాటు చేసినది. ఈ ప్రదర్శనల వలన చిత్రకారులకు తమ ప్రతిభను చూపే అవకాశమేగాక, వారి కళా నైపుణ్యానికి తగిన ప్రోత్సాహమూ దోహదమూ లభిస్తున్నవి.

కళలు సజీవంగా వుండాలంటే అవి ప్రజలను రంజింప చేసేవిగా నుండాలి అందుకొరకై ప్రజలను రసజ్ఞులుగా తీర్చి దిద్ద వలసిన బాధ్యత కూడా కళాకారులమీద, కళాసంస్థలమీద ఉన్నది. ఈ ఉద్దేశంతో, యీ ప్రదర్శనలను హైదరాబాదు నగరంలో ఏర్పాటు చేయటం ముగిసిన తర్వాత ప్రతియేట వీటిని రాష్ట్రంలో యితర పట్టణాలలో కూడా ఏర్పాటు చేసి. ఆయా పట్టణాలలోని ప్రజలలో కళాభిరుచిని పెంపొందించడానికి కృషి జరుపుతున్నది.

ఇది గాక, అకాడమీ ఆంధ్ర ప్రదేశ్ కళాకారుల ప్రదర్శనాన్ని యితర రాష్ట్రాలలో— బొంబాయి, మద్రాసు, కలకత్తా ఢిల్లీ, లక్నో, అహమ్మదాబాదు మొదలగు నగరాలలో— ఏర్పాటుచేసింది. ఈ విధంగా ఆంధ్ర చిత్రకారుల కళాప్రతిభను యితర రాష్ట్రాల వారికి చూపుటయే గాక, వివిధరాష్ట్రాల మధ్య సాంస్కృతిక సంబంధాలను పెంపొందించే నిమిత్తం, అకాడమీ ఆయా రాష్ట్రాలలోని కళాసంస్థల సహకారంతో, కళాకారుల ప్రదర్శనలను హైదరాబాదు నగరంలో ఏర్పాటు చేస్తున్నది ఈ విధంగా ఉత్తరప్రదేశ్, గుజరాత్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు మొదలగు రాష్ట్ర కళాకారుల ప్రదర్శనలు జరిగాయి

కేంద్ర లలిత కళా అకాడమీ, కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, యునైటెడ్ స్టేట్స్ యిన్‌ఫర్మేషన్ సర్వీస్, మాక్స్‌ముల్లర్ భవన్, బ్రిటిష్‌కౌన్సిల్ మొదలగు సంస్థల సహకారాలతో నగరంలో అంతర్జాతీయ కళాప్రదర్శనలను పదికి పైగా అకాడమీ ఏర్పాటు చేసింది. ఈ అంతర్జాతీయ కళా ప్రదర్శనల ద్వారామన చిత్రకారులకు ఆ యా దేశాలలోని స్వరూపాలూ, వారి కళాప్రక్రియలూ అవగాహన చేసుకునేందుకు అవకాశం లభించింది.

ప్రదర్శనశాల

ఈ ప్రదర్శనలను ఏర్పాటు చేసేందుకు గాను అకాడమీ తగువ్యయంతో కళాభవనములో ఒక ప్రదర్శనశాలను నిర్మించింది.

చిత్ర శిల్పకళా ప్రదర్శనలు ఏర్పాటు చేసుకునేందుకు తగిన వసతులను కల్పించి, కళాకారులకు, కళాసంస్థలకు ఈ ప్రదర్శనశాలల నామ మాత్రపు అద్దె వసూలు చేస్తున్నది. ఇందులో అకాడమీ నిర్వహించిన ప్రదర్శనలుగాక 600 పైగా కళాప్రదర్శనలు యింత వరకు జరిగాయి.

అకాడమీ ఆంధ్ర ప్రదేశ్ చిత్రకారుల చిత్ర, శిల్ప కళాఖండాలను కొనుగోలు చేసి వీటిని సేకరిస్తూ ఉన్నది. ఈ విధంగా సేకరించిన కళాఖండాల విలువ 2 లక్షల రూపాయలకు పైగా ఉన్నది. ఇందువల్ల ఉత్తమ కళాఖండాలకు శాశ్వతమగు స్థావరం ఏర్పడడమే గాకుండా, ఆ కళాకారులకు ఆర్థిక సహకారం లభిస్తున్నది.



ఉపకార వేతనాలు

లలిత కళల అధ్యయనానికీ, వాటిలో పరిశోధన జరిపేందుకూ, అకాడమీ ప్రతియేటా నెలసరి రు. 200/- చొప్పున ఒక సంవత్సర కాలానికి విద్యార్థులకు ఉపకార వేతనాలను యిచ్చి ప్రోత్సహించు చున్నది. ఈ విధంగా యిప్పటి 100 మందికి పైగా ఈ వేతనాలు లభించినవి.

అమూల్యములైన ప్రాచ్య, పాశ్చాత్య చిత్ర, శిల్ప గ్రంథాలను సేకరించి, అకాడమీ ఒక గ్రంథాలయాన్ని కళాభవనములో నెలకొల్పినది. వీటితోబాటు వేయికి పైగా చిత్ర, శిల్పాలకు స్లైడ్సునూ రెండు వందలకు పైగా ప్రముఖులైన పాశ్చాత్య ప్రాచ్య కళాకారుల రచనలకు ప్రతికృతులను కొన్ని ఫిల్ములను గూడా సేకరించి, ఈ గ్రంథాలయములో చేర్పించడం జరిగింది. సాధారణంగా వ్యక్తులు సేకరించడానికి కష్టతరమైన యట్టి అమూల్య గ్రంథాలు చిత్రకారులకు, లలితకళలలో పరిశోధన జరిపేవారికి ఈ గ్రంథాలయంలో సౌకర్యం లభిస్తుంది.

కళలు కలకాలం వర్ధిల్లాలంటే ప్రజలలో కళాత్మకమైన విషయాలను అర్థంచేసుకొనే శక్తిని పెంపొందించి, కళాభిరుచిని కలిగించాలి. ఈ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు, ప్రముఖులైన కళాకారులను, కళలపై పరిశోధన జరిపిన నిష్ణాతులైన వారిని ఆహ్వానించి వారి ఉపన్యాసములను, అకాడమీ ఏర్పాటుచేస్తున్నది. ఈ విధంగానే పాశ్చాత్య కళారూపాలు, కళాకారులను గురించి, వారి కళా ప్రక్రియలను గురించి తెలిపే ఫిల్మ్‌లను తెప్పించి, ఫిల్మ్ ప్రదర్శనలను అకాడమీ నిర్వహించుచున్నది.

రాష్ట్రంలో పలుచోట్ల నెలకొని, కళాభివృద్ధికి కృషి చేస్తున్న కళా సంఘాలను, సంస్థలను అకాడమీ అనుబంధ సంస్థలుగా పరిగణించి, వాటికి ఆర్థిక సహాయాలను అందచేసి, ఆయా ప్రాంతాలలో కళాభివృద్ధిని పెంపొందించేందుకు తోడ్పడుతున్నది. ఇట్టి అనుబంధ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో 17 ఉన్నవి. ఈ పరిగణిత కళాసంఘాల కార్య కలాపాలను సమన్వయించి, సమగ్రమైన కళాభివృద్ధికి అకాడమీ కృషి చేస్తున్నది. దీనిని అనుసరించే యిటీవల అనుబంధ సంస్థల ప్రతినిధుల సమావేశమును ఒక దానిని జరిపి వారికార్య కలాపాలను సమన్వయించి వారు తీసుకోవలసిన చర్యలను నిర్ణయించడం జరిగింది.



ప్రజలలో కళాభిరుచిని పెంపొందించేందుకు నిత్యం కళా ప్రదర్శనలను ఆయా ప్రదేశాలలో ఏర్పాటుచేయడం ఎంతైనా అవశ్యకరం. ఈ కళాప్రదర్శనల ఏర్పాటుకు అనువైన వసతులతో రాష్ట్రమంతటా ప్రదర్శనశాలలను నెలకొల్పేందుకు కూడా

ప్రయత్నం జరుగుతున్నది. కనీసం ప్రతి జిల్లాకొక ప్రదర్శన శాలైనా ఏర్పాటు చేసేందుకు అకాడమీ ఒక పథకాన్ని రూపొందించి ప్రభుత్వానికి సమర్పించినది. ఈ పథకాన్ని అంగీకరించి, ప్రథమంగా కర్నూలు, గుంటూరు, సిద్ధిపేట పట్టణాలలో ప్రదర్శన శాలలు నిర్మించడానికి ప్రభుత్వం తగు ధనసహాయం చేస్తున్నది.

రాష్ట్రస్థాయి కళాకారుల సదస్సులూ, గోష్ఠులూ జరిపి కళాకారులు పరస్పరం అభిప్రాయాలు తెలుపుకొని చర్చించుకొనేందుకు అవకాశాలను అకాడమీ కల్పిస్తున్నది. ఇట్టివి యిప్పటికి ఆరు సదస్సులు జరిగినవి. వీటికి ఆంధ్రరాష్ట్రంలో నలుమూలల నుండీ కళాకారులు మాత్రమేగాక ఆహ్వానితులగు ప్రముఖులైన రాష్ట్రేతర కళాకారులుగూడా పాల్గొని వారి అభిప్రాయాలను పరస్పరము తెలియజేసికొనగలిగారు.

ప్రకృతి రామణీయకతకు, కళాప్రాభవానికి పేరొందిన స్థలాలలో ప్రముఖ ఆంధ్రప్రదేశ్ కళాకారులను సమావేశమగుటకు, అచట కొంతకాలం (వారం దినములు) ఉండేందుకు వసతి కల్పించి, ఆ కాలమున వారు తమ స్ఫూర్తిని అనుసరించి కృషిచేసి, తమ కళను అభివ్యక్తీకరింపజేయుటకై "రచనా శిబిరము" అను అకాడమీ ఏర్పాటుచేస్తున్నది. ఇప్పటికి అట్టి రచనా శిబిరములు—పాలంపేట, లేపాక్షి, హంపీలలో—మూడింటిని నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ చిత్ర శిల్ప కళాకారులను, కళారంగానికి విశిష్ట సేవచేసిన ప్రముఖులైన వ్యక్తులను గుర్తించి, వారిని సముచిత రీతిలో సన్మానించి గౌరవించడం అకాడమీ చేస్తున్నది.

సాంప్రదాయక, జానపద కళలనుగూర్చి సమగ్రమైన పరిశీలన లనుచేసి, వాటిని సముద్ధరించడం తన ప్రధాన లక్ష్యాలలో నొకటిగా నెంచి, దానికి అకాడమీ తోడ్పడుతున్నది. జానపద కళాస్వరూపమైన "కాకి పడగలు"పై యిటీవలే అకాడమీ ఒక పరిశోధనచేసి అవి జీర్ణించిపోకుండా వాటి పరిరక్షణకు ఒక సమగ్రమైన పథకాన్ని రూపొందించి ప్రభుత్వానికి సమర్పించియున్నది.

ప్రాచీన, మాధ్యమిక, ఆధునిక కళా వైవిధ్యాన్ని తెలిపే చిత్ర గ్రంథస్థంచేసే పుస్తకాలను ప్రచురించడం అతి ముఖ్యమైన లక్ష్యం. ఈ లక్ష్యాన్ని అనుసరించి, అకాడమీ విజయనగర రాజుల కాలంలో వెలసిన "లేపాక్షి" శిల్ప, చిత్ర సంపదను గ్రంథస్థంచేసి ప్రచురించినది. ఈ ప్రచురణకు కేంద్రప్రభుత్వం అకాడమీకి ఒక బహుమతి నిచ్చింది.

"ఆంధ్రుల రామాయణ చిత్రాలు", "మన శిల్పకళాసంపద" "వనవాస్తు సంపద", "ఆంధ్రుల నాట్యశిల్పాలు" మొదలగు గ్రంథములను అకాడమీ ప్రచురించినది.

మొక్కపాటి "భాగవత చిత్రాలు"

ఆధునిక కళాకారుల జీవిత విశేషాలు, వారి కళా నైపుణ్యాన్ని పుస్తక రూపంలో ప్రచురించి వారికి ఒక విశిష్టాదరణను కల్పించడం ఒక ప్రధానమైన లక్ష్యంగా పరిగణించి, అకాడమీ మొక్కపాటి కృష్ణమూర్తి రచించిన భాగవత చిత్రాలను తెలుగు ఆంగ్లభాషల్లో వివరణలతోబాటు ప్రచురించియున్నది. ఇవిగాక ప్రముఖులైన ఆంధ్రచిత్రకారుల జీవిత విశేషాలనూ, వారి కళాకౌశలంపై విడివిడిగా పుస్తకాలనూ ప్రచురించే పథకాన్ని చేపట్టింది. ఈ క్రింది కళాకారుల జీవిత కృషి గురించి లఘు పుస్తకాల ప్రచురణ జరుగుచున్నది 1. పైడిరాజు, 2. పి.టి. రెడ్డి, 3. విద్యాభూషణ్, 4. మధుసూదనరావు, 5. సయ్యద్ బిన్ మహమ్మద్, 6. కొండపల్లి శేషగిరిరావు, 7. కె. రాజయ్య, 8. పట్నాయక్, 9. పి.ఆర్. రాజు, 10. ఉస్మాన్ సిద్ధికీ, 11. దొరైస్వామి, 12. గౌరీశంకర్, 13. సూర్యప్రకాశ్, 14. లక్ష్మణ్‌గౌడ్.

లలితకళా పదకోశం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరినమీదట, "లలిత కళా పదకోశం" ప్రచురించడానికి ఒక పథకాన్ని రూపొందించి, వారి ధన సహాయంతో తయారుచేస్తున్నది. ఈ పదకోశంలో తెలుగు, సంస్కృతవాఙ్మయంలోని చిత్రశిల్ప కళలకు సంబంధించిన శబ్దాలను, ఆంగ్లంలోని శబ్దాలను ఏరి, వాటికి తగిన తెలుగు వివరణ యిచ్చుట జరిగినది. ఈ బృహత్ పథకాన్ని శ్రీయుతులు చీమకుర్తి శేషగిరిరావు, తిరుమల రామచంద్ర, వరు శ్రీనివాసశర్మగార్లకు అప్పగించారు. కొద్దిరోజులలో ఈ శబ్దకోశం పూర్తిఅయి ప్రచురితము కాగలదు.

కళాకారుడు ఒక ఉత్తమ కళాఖండాన్ని సృజించినా, దానిని తగు ప్రచురణకుతెచ్చి, తగు మూల్యమును ఆర్జించుటకు అతనికి వసతులు చాలా తక్కువ. కావున కళాకారుల రచనలను ఒకచోట సంగ్రహణముచేసి, వానికి తగు అమ్మకపు వసతులను, కళాకారులకు ఎట్టి శ్రమలేకుండా, కల్గించుటకై ఒక "విపణి"ని కళాభవన్‌లోనే అకాడమీ నెలకొల్పింది. ఇందువలన కళాకారుల కృషికి తగు మూల్యం వారికి లభిస్తున్నది.

ఆధునిక కళాప్రక్రియలలో "గ్రాఫిక్" అను ప్రక్రియ విరివిగా ఆదిమానము ఆర్జించినది. అయితే దీనికి కావలసిన పరికరాలు సాధారణ కళాకారులకు అందుబాటులోలేవు. లోపాన్ని పూర్తిచేయుటకై, అకాడమీ, యిటీవలే ఒక గ్రాఫిక్ శాలను స్థాపించి దానిలో ఆ ప్రక్రియకు కావలసిన అన్ని ఆధునిక పరికరాలనుచేర్చినది. ఆ ప్రక్రియను అవలంబించిన కళాకారులు, నామమాత్రపు రుసుము చెల్లించి, యిందుకల్పించిన వసతులను వాడుకొనవచ్చును.


ఈ విధంగా, ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర లలితకళా అకాడమీల సహాయంతోనూ, అనుబంధ సంస్థల సహకారంతోనూ చిత్ర శిల్ప కళాభివృద్ధికి తోడ్పడుచున్నది. లలిత కళా అకాడమీ తన లక్ష్యోద్దేశాలలో యింకనూ ఎంతయో సాధింపవలసియున్నది. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధములై ఉన్నవి. ప్రభుత్వ ప్రజా సౌహార్ద్ర, సహకారాలతో ఈ కార్యక్రమాలన్నీ నెరవేరగలవని అకాడమీ ఆశయం.

ప్రపంచ ప్రసిద్ధిచెందిన


ఆంధ్రప్రదేశ్ హస్తకళా ఖండాలు

బందరు కలంకారీకి మచ్చుతునక







నిర్మల్ చిత్రకారుల ప్రతిభకు దర్పణం



బిద్రీ కళాకారుల హస్త విన్యాసం






రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ సెప్టెంబరు 12వ రేస్‌క్లబ్‌లో "రాష్ట్రపతి స్వర్ణ పాత్రి" గెల్చుకున్న మెస్సర్స్ రంజిత్ వి. భట్, యోగేష్ ఎం షాకు బహుమతి ప్రదానం చేశారు

నగరంలో




రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ సెప్టెంబరు 8వ జూబిలీ హాలులో జరిగిన కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ వారి ఉర్దూ క్లాసులకు ప్రారంభోత్సవంచేశారు. శ్రీమతి బేగం అబీదా అహమ్మద్ అకాడమీ పుస్తకాల డిపోకు ప్రారంభోత్సవం చేశారు




సెప్టెంబరు 14న సికిందరాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ విదేశీ ఎగుమతుల అభివృద్ధి కార్యక్రమం ప్రారంభించారు



రాష్ట్రపతి శ్రీ ఫకృద్దీన్ అలీ అహమ్మద్ ఛాయాచిత్ర పత్రికల్లో అత్యుత్తమ బహుమతి సాధించిన "లెన్స్‌లైట్" పత్రిక సంపాదకుడు డా. ఎన్. భగవాన్‌దాస్ (ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి)కి బహుమతిని అందజేశారు



ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు సెప్టెంబరు 16న జాతీయ కుటుంబనియంత్రణ వారి అన్ని ప్రచార సాధనాలద్వారా ఉధృత ప్రచారోద్యమానికి ప్రారంభోత్సవంచేశారు




విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శ్రీ జి. రాజారాం సెప్టెంబరు 19న ఆంధ్రప్రదేశ్ కోళ్ళ పెంపకం సంస్థ ప్రారంభ సమయంలో జరిగిన మహాసభ నుద్దేశించి అధ్యక్షోపన్యాసం చేస్తున్న దృశ్యం

వార్తా చిత్రాలు




కేంద్ర ఆహార, వ్యవసాయ శాఖామంత్రి శ్రీ ఏ. పి. షిండే సెప్టెంబరు 6న జూబిలీ హాలులో రాబీ కాన్ఫరెన్సును ప్రారంభించారు. ముఖ్యమంత్రి అధ్యక్షత వహించారు



విదేశీ ఎగుమతులశాఖ ఉపమంత్రి శ్రీ బిపిన్‌పాల్ దాస్ సెప్టెంబరు 16న హైదరాబాదులో నూతన ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభించారు.




ఆర్థిక, సమాచార మంత్రి శ్రీ పి. రంగారెడ్డి సెప్టెంబరు 18న ప్రెస్ క్లబ్‌లో ప్రముఖ పత్రికా రచయిత కీ.శే. ఖాసా సుబ్బారావు చిత్రపటం ఆవిష్కరించా




రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ **అలీ** అహమ్మద్ సెప్టెంబరు 9వ తేదీన మహబూబ్‌నగర్‌లో మహాసభకు వచ్చిన అశేష ప్రజానీకాన్నుద్దేశించి ప్రసంగించారు.


జిల్లాల్లో



పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరులో విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శ్రీ రాజారాం పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. చేబ్రోలు, నారాయణపురం హరిజనులకు రిక్షాలను పంపిణీ చేశారు



ముఖ్య మంత్రి శ్రీ జలగం వెంగళ రావు సెప్టెంబరు 18 న మహబూబ్ నగర్ లో "తెలుగు తల్లి" ప్రతిమను ఆవిష్కరించారు.



సెప్టెంబరు 20న వరంగల్లులో మంత్రి వర్యులు శ్రీయుతులు బి. తిన సుబ్బారావు, టి. ధర్మా రెడ్డి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బలహీన వర్గాలవారికి మంజూరుచేసిన రుణాలను పంపిణీ చేశారు.



రాష్ట్రపతి సెప్టెంబరు 7న మహబూబ్ నగర్‌లో వక్ఫ్ అభివృద్ధి కార్యాలయ భవనానికి శంకు స్థాపన చేసిన అనంతరం భవనాల నమూనాను పరిశీలిస్తున్న దృశ్యం




వరంగల్లు ఆంధ్రబాలికా కళాశాల విద్యావారోత్సవాల్లో సెప్టెంబరు 7న కాకతీయ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు డాక్టర్ వెంకట్రామయ్యను సన్మానించారు. తెలంగాణా ప్రణాళిక, అభివృద్ధి సంఘం అధ్యక్షులు శ్రీ పి. జగన్నాథరావు అధ్యక్షత వహించారు.



కడప జిల్లా యాసాపేటలో కీ శే. సుగవాసి రాజారాం పేరున నిర్మించనున్న ఉన్నతపాఠశాల భవనాలకోసం 50 వేల రూపాయలు స్థలంకోసం పదివేల రూపాయలు కలెక్టరు శ్రీ పి.యల్. సంజీవ రెడ్డికి శ్రీ సుగవాసి రామయ్య అందజేశారు



భద్రాచల కుడ్య శిల్పం




రామప్పగుడిలో రాతి స్తంభం

శిల్ప, చిత్ర కళా సంపద



లేపాక్షి కుడ్య చిత్రం




అలంపుర దేవాలయం




రామప్ప శిల్పం



ఓరుగల్లు వెయ్యి స్తంభాల గుడి వద్ద నంది




వ్యాలిలో జగన్మోహిని శిల్పం




శ్రీశైలం ఆలయం

ఆంధ్ర ప్రదేశ్ లో
ఆలయ శిల్పకళా వైభవం



నాగార్జునకొండ మ్యూజియంలో బుద్ధుడు

పర్యాటకులకు
కన్నుల విందుచేసే ప్రాంతాలకు
కాణాచి ఆంధ్రప్రదేశ్




సాలార్ జంగ్ మ్యూజియంలో ముసుగు మహిళ రెబెకా శిల్పం



గోలకొండ కోట సింహద్వారం

ఇదే మన తెలంగాణా



శ్రీ ఎం. నాగరాజరావు


రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల ఆదాయాల పెంపుదలకు కార్యక్రమాలు, విధానాలను రూపొందించే సమయంలో ప్రదేశాలు అనే అంశం విడదీయరానిదిగా భావించడం ఆంధ్రప్రదేశ్ ప్రణాళికలలోని ప్రత్యేకమైన మార్పుగా పేర్కొనవచ్చు. తెలంగాణా ప్రాంతానికి సంబంధించి నంతవరకు ఈ ప్రాంతంలో ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి రూపొందించబడిన *తెలంగాణా అభివృద్ధి ప్రణాళిక* లోని కొన్ని అంశాలు యీ వ్యాసంలో ప్రతిపాదించ బడినాయి.

తెలంగాణా ప్రాంతానికి సంబంధించిన సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించడానికి ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్తలు, భూభౌతిక శాస్త్రవేత్తలతో ఒక సాంకేతిక సంఘాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. తెలంగాణాకు సంబంధించి 1988–89 తో అఖరయ్యే 15 సంవత్సరాల ముసాయిదా అభివృద్ధి ప్రణాళికను యీ సంఘం రూపొందించింది. ఇది రెండు సంపుటాలలో వుంది. ఈ ప్రణాళికను తయారుచేయడంలో అనుసరించిన దృక్పథం, విధానాలు, కార్యక్రమాలనుగూర్చి ప్రస్తావిస్తాను.

ప్రాంతీయ ఆర్థికవ్యవస్థ పూర్వాపరాలు :

తెలంగాణా ప్రాంతంలో 9 జిల్లాలు వున్నాయి. అవి, ఆదిలాబాదు, హైదరాబాదు, కరీంనగరం, ఖమ్మం, మహబూబు నగర్, మెదకు, నల్లగొండ, నిజామాబాదు, వరంగల్లు. ఈ తొమ్మిది జిల్లాలు అప్పటి హైదరాబాదు రాష్ట్రంలో భాగంగా ఉండేవి. 1956 లో వాటిని అప్పటి ఆంధ్రరాష్ట్రంలో విలీనం చేసి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణా ప్రాంతం విస్తీర్ణం 44.3 వేల చదరపు మైళ్ళు. ఆంధ్రప్రదేశ్ మొత్తం విస్తీర్ణంలో 42 శాతం ఉంటుంది. 1971 వ సం. జనాభా లెక్కల ప్రకారం యీ ప్రాంతం జనాభా 158.2 లక్షలు ఉంటుంది. రాష్ట్రం మొత్తం జనాభాలో 36 శాతం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయబడినప్పటినుండి నాలుగవ పంచవర్ష ప్రణాళిక అఖరునాటివరకు రాష్ట్రం మొత్తం ప్రణాళిక ఖర్చులో 42.2 శాతం అంటే రు. 523.6 కోట్లు తెలంగాణాలో ఖర్చు చేశారు. ఈ ఖర్చుకుతోడు, సాధించిన ఫలితాలుకూడా గమనార్హంగానే ఉన్నాయని దిగువ పట్టికవల్ల స్పష్టమవుతుంది.



పట్టిక—1

అంశం	యూనిటు	1956-57	1970-71	1971-72
బియ్యం	లక్ష టన్నులు	6.5	13.4	8.5
ఆహారధాన్యాలు	,,	14.8	26.8	21.2
ఆయిల్ ఇంజనులు	సంఖ్య	7041	—	34,385
విద్యుచ్ఛక్తి పంపుసెట్లు	,,	231	—	85,434
సహకార పరపతి సంఘాలు	,,	3,074	—	6,464
పశువైద్య సంస్థలు	,,	106	—	461
గ్రామాల విద్యుద్దీకరణ	,,	18	—	3,069
నమోదైన ఫ్యాక్టరీలు	,,	1,046	1,403	—
రోడ్ల నిడివి	కి. మీ.	5,835	—	26,803
తపాలా కార్యాలయాలు	సంఖ్య	2,153	—	4,549
ప్రాథమిక పాఠశాలలు	,,	7,684	—	10,643
కళాశాలలు (వృత్తి విద్యతోసహా)	,,	30	—	186
ఆసుపత్రులు, వైద్యశాలలు	,,	143	—	428

1970-71 సంవత్సరంలోకన్నా 1971-72 సంవత్సరంలో బియ్యం, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో రుతు పరిస్థితుల కారణంగా తగ్గుదల ఏర్పడింది. మిగతా రంగాలలో పెరుగుదల గమనార్హంగాఉంది. అయినప్పటికీ తలసరి సగటు నికరమైన గృహోపకరణ ఉత్పత్తులను పరిశీలిస్తే యీ ప్రాంతం వెనుకబడి ఉందని స్పష్టమవుతుంది. 1969-72 సంవత్సరాలలో యీ ప్రాంతంలో తలసరి సగటు గృహోపకరణ ఉత్పత్తి రు. 521 లు ఉండగా ఆంధ్రప్రదేశ్ స్థాయిలో రు. 564, అఖిలభారత స్థాయిలో రు. 628 లు ఉంది. ఈ వ్యత్యాసాన్ని తొలగించడానికి యీ ప్రణాళికను రూపొందించారు.

లక్ష్యాలు :—ఈ ప్రణాళికలో 10 లక్ష్యాలను నిర్దేశించారు. వాటిలో ముఖ్యమైనవి దిగువ ఇవ్వబడినాయి :

(1) కాంపౌండు రేటులో వార్షికంగా 7.5 శాతం చొప్పున ప్రాంతీయ ఆదాయన్నీ, వార్షికంగా 5.5 శాతం చొప్పున తలసరి సగటు ఆదాయాన్నీ ఎక్కువచేయడం. ఇందువల్ల 1988-89 నాటికి తెలంగాణాలో తలసరి సగటు ఆదాంయలో గల వ్యత్యాసాన్ని తొలగించి, అఖిలభారత స్థాయికి తేవడానికి వీలుఉంటుంది. అంతేగాక యీ ప్రాంతం జనాభాలోని వివిధ వర్గాల మధ్యగల ఆదాయంలో వ్యత్యాసాలను కనీస స్థాయికి పరిమితం చేయడానికి కృషిచేయడం.

(2) ఈ ప్రాంతం, అభివృద్ధి రంగంలో వనరులు—ఆదాయం మూల ప్రాతిపదికగా మరింత సజావుగా పురోగమించడానికి వీలుగా నీటి పారుదల. రవాణా, కమ్యూనికేషన్, విద్య మొదలైన రంగాలలో అవసరమైన ప్రాతిపదిక వనరులను పెంపొందించడం.

(3) సాంఘిక న్యాయాన్ని సాధించడానికి లభ్యమయ్యే శ్రామిక శక్తిని తగినవిధంగా వినియోగించుకోడానికి వీలుగా సాధ్యమైనంత తక్కువ కాలంలో పూర్తి ఉపాధి సౌకర్యాలు కల్పించడం,

(5) ముఖ్యంగా సమాజంలోని షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలవంటి బడుగు వర్గాలకు, సాంఘిక న్యాయం కల్పించడానికి వీలుగా, ఆర్థికాభివృద్ధి ఫలితాలను సమానంగా పంపిణీ చేయడం.


(9) పారిశ్రామికీకరణను ప్రోత్సహించి, త్వరితగతిని అభివృద్ధి చేయడంద్వారా యీ ప్రాంతం ఆర్థిక వ్యవస్థను పరిశ్రమలవైపు మళ్ళించడం,


(10) సమితుల అభివృద్ధికి వీలుగా యీ ప్రాంతంలోని వివిధ ప్రదేశాల మధ్య సమన్వయం సాధించడం.

దృక్పథం :—రాష్ట్రం స్వయంగా ప్రత్యేక పరిస్థితులను ఎదుర్కొంటున్న దృష్ట్యా పై లక్ష్యాలను సాధించాలని యీ ప్రణాళికను రూపొందించారు. అంతేగాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విడి విడిగా ప్రణాళికను రూపొందించడమనేది మరింత ప్రత్యేకతను సంతరించుకుంటుంది. అంతర్గత పరిమితులకు లోబడి సాంకేతిక సంఘం సాధ్యమైన వివిధ దృక్పథాలను గూర్చి పరిశీలించింది.

ఈ ప్రాంతం ఉత్పత్తి పెంపుదల రేటు, పెట్టుబడి ఉత్పత్తి నిష్పత్తికి సంబంధిచిన వివరాలను లభింపజేసే పక్షంలో దేశం తలసరి సగటు ఆదాయంతో సమానంగా ఈ ప్రాంతం తలసరి సగటు ఆదాయాన్ని పెంపొందించడానికి అవసరమైన పెట్టుబడుల వివరాలను రూపొందించడానికి అవకాశం ఉంటుంది.

15 సంవత్సరాల కాలంలో రాష్ట్రప్రభుత్వ ఆదాయం, రుణాల స్థాయిలను పరిగణనలోకి తీసుకుని పెట్టుబడి అవకాశాలను పరిశీలించడం మరొక దృక్పథం.





దృక్పథాన్ని యీ సంఘం అనుసరించినట్టు స్పష్టమవుతుంది అయితే మొదటి దృక్పథాన్ని కూడా అది పరిగణనలోకి తీసుకున్నది.

విధానం :— ప్రణాళిక రచనలో ప్రదేశాలను ముఖ్యమైన అంశంగా గుర్తించడం తెలంగాణా ప్రణాళికలో ప్రత్యేకమైన మార్పుగా భావించవచ్చు. అందువల్ల యీ ప్రణాళిక అమలు విధానంలో యీ అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలి.

వాస్తవానికి అమలువిధానానికి ప్రదేశం ప్రాతిపదికగా ఉంటుందని చెప్పవచ్చు.

ఈ ప్రాంతంలోకి యేమార్గాల వైపు ప్రయివేటు పెట్టుబడులు మళ్ళుతున్నాయనే విషయాన్ని పరిశీలించడం మూడవ పద్ధతి. స్థానిక మార్కెటు తోడ్పాటు, ఖర్చు ప్రయోజనాల దృష్ట్యా లాభసాటి అయిన మార్గాలలోనే యీ పెట్టుబడులు పెట్టబడుతుంటాయనేది సుస్పష్టం, తెలంగాణాలో ప్రజలు, సంస్థలు లాభసాటిఅయిన మార్గాలలో పెట్టుబడి పెట్టకపోవడానికి కారణం మౌలికమైన వనరులు తక్కువగా ఉండడం. తగిన ప్రోత్సాహం లేకపోవడమేనని చెప్పవచ్చు. యీ సందర్భంగా ఈ సంఘం మూడు ప్రాతిపదిక వర్గాలను పేర్కొన్నది. (1) ఈ ప్రాంతానికి ప్రత్యేకమైనవి. ఉదాహరణకు యీ ప్రాంతంలోని రోడ్లు, (2) ప్రత్యేకమైనవి కానివి అయితే దిగుమతి చేసుకోదగినవి. (3) ఎగుమతి చేయదగినవి. అంటే యీ ప్రాంతానికి చెందినవైనప్పటికీ, యితర ప్రాంతాలకు ఉపయోగకరమైనవి, తరలించదగినవి.

దీర్ఘకాలిక ప్రాంతీయ ప్రణాళికను తయారుచేయడంలో ప్రాతిప్రదిక దృక్పథం మరింత హేతుబద్ధంగా ఉంటుందనీ, యిందువల్ల ప్రభుత్వ, ప్రయివేటు పెట్టుబడులు మరింత ఎక్కువ సహజసిద్ధంగా మదుపుచేయడానికి అవకాశం ఏర్పడుతుందనీ యీ సంఘం అభిప్రాయపడింది. అంటే మూడవ

ఒక ప్రాంతంలోని వివిధ ప్రదేశాలు ఎదుర్కొనే సమస్యలు సహజంగానే వివిధ రీతులలో ఉంటాయి. అందువల్ల ఈ విధానాల ప్రాతిపదికగా ఆర్థిక ప్రాంతీయీకరణ అంటే మండలాల విభజన జరగాలి. ఇందుకోరకు తెలంగాణాను నాలుగు మండలాలుగా విభజించారు. ఆర్థిక ప్రాంతీయీకరణ నిమిత్తం జనాభా, పట్టణ జనాభాశాతం, కార్మికుల శాతం, మామూలు వర్షపాతం, సేద్యం నికర విస్తీర్ణం, నమోదు అయిన ఫ్యాక్టరీల సంఖ్య, రోడ్ల నిడివి మొదలైన 21 అంశాలను ప్రాతిపదికగా పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని నాలుగు మండలాలుగా విభజించడానికి 'అంశాల పరిశీలన' పద్ధతిని అనుసరించారు. దిగువ పేర్కొన్న విధంగా ఆయా మండలాలు ఉంటాయి.

(1) అటవీ-ఖనిజ మండలం :

బొగ్గు, ముడి యినుము, సున్నంరాయి, రాగి, మొదలయిన ఖనిజ నిక్షేపాలు, దట్టమైన అడవులుగల ఆదిలాబాదులో కొన్ని భాగాలు, కరీంనగర్, ఖమ్మం, వరంగల్లుజిల్లాలు ఈ మండలాన్ని అటవీ-ఖనిజమండలంగా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతంలో వర్షపాతం 40-45 అంగుళాలు. జనసాంద్రత తక్కువ.

2 తీవ్రతర వ్యవసాయ మండలం :

నిజామాబాదులో కొన్ని భాగాలు, మెదకు, కరీంనగర్, వరంగల్లు, ఖమ్మం, నల్లగొండలతో తీవ్రతర వ్యవసాయ మండలం. ఈ ప్రాంతంలో ఉపరితల భూగర్భ జలాలతో పాటు తగినంత నీటి పారుదల సౌకర్యాలు ఉన్నాయి. అంతేగాక పోచంపాడు, నిజాంసాగర్, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు యీ ప్రాంతంలో ఉన్నాయి. హైదరాబాదు నగరం మినహా, తెలంగాణాలో ఈ ప్రాంతంలో జనసాంద్రత చాలా ఎక్కువ.

3. మెట్ట వ్యవసాయ మండలం :—వి స్తీర్ణం విషయంలో యీ ప్రాంతంలో అతి పెద్ద జిల్లా మహబూబునగర్, మెదకు జిల్లాలోని కొన్ని భాగాలు, హైదరాబాదు, నల్లగొండ జిల్లాలు, వరంగల్లు జిల్లాలోని జనగామ తాలూకాలతో ఏర్పడినది 'మెట్ట వ్యవసాయ మండలం'. ఈ ప్రాంతంలో వర్షపాతం 23 నుండి 30 వరకు ఉంటుంది. ఈ ప్రాంతంలో భూసార కోత అధికంగా ఉంటుంది. తెలంగాణాలో యిది చాలా వెనుకబడిన ప్రాంతం.

4. పట్టణ పారిశ్రామిక మండలం :— హైదరాబాదు పట్టణం విడిగా ఒక మండలంగా ఉంటుంది. అయితే భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వరుసక్రమంలో హైదరాబాదు నగరం, వరంగల్లు, నిజామాబాదులను 'పట్టణ పారిశ్రామిక మండలం'గా చెప్పవచ్చు.

ఈ మండలాలను ఈ పుటలో పేర్కొనే విధంగా ఉప మండలాలుగా విభజించారు.

మండలం	ఉప మండలం	ఉప మండలంలో తాలూకాల సంఖ్య	ఉప మండలం ప్రాతిపదిక
(1) పట్టణ పారిశ్రామిక మండలం	(అ) హైదరాబాదు మహా నగరం	3	(I)
	(ఆ) వరంగల్లు	1	(II) పారిశ్రామిక పెంపుదల
	(ఇ) నిజామాబాదు	1	
(2) అడవులు ఖనిజాల మండలం		14	
(3) తీవ్రతర వ్యవసాయ మండలం	(అ) సేద్యపు నీటి పారుదల కాలువలు (ఆ) చెఱువులు, బావులు	22	నీటి పారుదల వనరులు
(4) మెట్ట వ్యవసాయ మండలం	(అ) నల్ల రేగడి భూమి (ఆ) ఎర్ర చెల్కా భూమి (ఇ) మిశ్రమ భూమి	32	భూసారం

ఈ విధంగా రూపొందించబడిన ఆర్థిక ప్రాంతీయీకరణ, ప్రత్యేక ప్రణాళికలో ఒక భాగం మాత్రమే. ఈ విషయంలో తగిన ప్రధాన కార్యక్రమాన్ని రూపొందించాలి. అభివృద్ధి అంశాలు గల ప్రాంతాలను గుర్తించి వాటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత అభివృద్ధి కేంద్రాలు, అభివృద్ధి ప్రదేశాలు, మార్కెటు–సేవా కేంద్రాలు, సేవా కేంద్రాలను రూపొందించాలి. ఇటీవలి ఆలోచననుబట్టి, సేవా కేంద్రం వారు వినియోగదారుల సహకార సంఘం, మార్కెటు ఉప కేంద్రం, వ్యవసాయం, పశువైద్యం, వ్యవసాయ సేవా సౌకర్యం, సెకండరీ విద్య, డిస్పెన్సరీ, బస్సులు మొదలైన కనీస సేవలను అందజేయాల్సి ఉంటుంది.

మార్కెటు–సేవా కేంద్రం వారు ఉన్నతస్థాయి ప్రజా సేవలను–అంటే భూమి తనఖా బ్యాంకు, టోకు వ్యాపారం, పారిశ్రామిక వాడలు, పడకలతో కూడిన ఆసుపత్రి వంటి సౌకర్యాలు కల్పిస్తారు.

పెరుగుదల కేంద్రాల వారు ఉన్నతస్థాయి సౌకర్యాలు కల్పించడంతోపాటు రెండవ స్థాయి, మూడవ స్థాయి కార్యక్రమాలనుగూడా చేపడ్తారు.

పెరుగుదల అంశాల కార్యక్రమంలో పరిశ్రమ విస్తరణ, ఆయా ప్రాంతాలనుండి ఎగుమతులు మొదలైనవి ఉంటాయి.

తెలంగాణాకు సంబంధించినంతవరకు హైదరాబాదు మహానగరం పెరుగుదల కేంద్రంగా వ్యవహరిస్తున్నది. ఈ ప్రాంతంలో హైదరాబాదు మినహా అన్ని జిల్లా హెడ్ క్వార్టర్స్, నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడెం, మెదకు జిల్లాలోని సిద్ధిపేట, కరీంనగర్ జిల్లాలోని రామగుండం, పెద్దపల్లిలను పెరుగుదల కేంద్రాలుగా గుర్తించారు. ఈ విధంగా యీ ప్రాంతంలో 11 పెరుగుదల కేంద్రాలు ఉన్నాయి. అంతేగాక 104 మార్కెటు—సేవా కేంద్రాలు, 421 సేవా కేంద్రాలు ఉన్నాయి.


1988-89 లో యీ ప్రాంతం జనాభాను దృష్టిలో ఉంచుకొని పెట్టుబడి అవసరాలను రూపొందించింది. ఈ ప్రాంతంలో 1961-71 సంవత్సరంలో వార్షికంగా 2.4 శాతం జనాభా పెరుగుదల రేటు ఉండగా 1988-89 నాటికి యిది 1.4 శాతానికి తగ్గుతుందని అంచనా వేశారు. ఈ ప్రాతిపదికగా 1974 లో 170 లక్షలకు ఉన్న యీ ప్రాంతం జనాభా 1989 నాటికి 219 లక్షలకు పెరుగుతుందని ఆశిస్తున్నారు. పెట్టుబడి-ఉత్పత్తిని 3 : 1 గా భావించే పక్షంలో 1973-74 లో రూ. 583 ల వరకు ఉన్న తలసరి నికర గృహోపకరణ ఉత్పత్తులు, 1988-89 నాటికి రూ. 1,316 లకు పెరుగుతుంది. (ఇది ఆనాటికి అఖిల భారత స్థాయి తలసరి నికర గృహోపకరణ ఉత్పత్తి సంఖ్య అవుతుంది.) ప్రణాళిక వారీగా పై పట్టిక ద్వారా విదితమవుతుంది.

	తెలంగాణాలో తలసరి నికర గృహోపకర ఉత్పత్తి (రూపాయలలో)	రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక పెట్టుబడి (కోట్లలో)	ప్రభుత్వం రంగంలో పెట్టుబడి (కోట్లలో)	ప్రైవేటు రంగం కేంద్ర రంగం పెట్టుబడులు (కోట్లలో)
5 వ ప్రణాళిక ఆఖరు 1978-79	765	631	530	844
6 వ ప్రణాళిక ఆఖరు 1983-84	1,008	929	780	1,020
7 వ ప్రణాళిక ఆఖరు 1988-89	1,316	1,314	1,104	1,392
		2,874	2,414	3,256

పెరుగుదల అంశాలు, పెరుగుదల కేంద్రాలు, ఆదాయం, ఉపాధి సౌకర్యాలను పెంపొందించడంలో తోడ్పడగా మార్కెటు—సేవా కేంద్రాలు, సర్వీసు సేవా కేంద్రాలు దిగువ స్థాయిలో అవసరమైన సేవలను అందజేస్తాయి. పెరుగుదల అంశాలు, పెరుగుదల కేంద్రాలు అంతర్ ప్రాంతీయ అభివృద్ధిని సమన్వయం చేయడంలో తోడ్పడ్తాయి.

5. ***పెట్టుబడి అవసరాలు*** :— సాంకేతిక సంఘం, లక్ష్యాలను, దృక్పథాన్ని, విధానాలను రూపొందించిన తర్వాత

రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినంతవరకు, పెట్టుబడి ఉపకరణాలకు తోడు, ప్రతి ప్రణాళికలోను ప్రస్తుతం పెట్టుబడులను కూడా కేటాయించాల్సి ఉంటుంది. ప్రణాళికా కేటాయింపులు, పెట్టుబడుల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తుతం పెట్టుబడులుగా వ్యవహరిస్తారు.



6. రాష్ట్ర ప్రభుత్వ రంగం పెట్టుబడులు:— లక్ష్యాల సాధనలో రాష్ట్ర ప్రభుత్వ రంగం పెట్టుబడులు ప్రముఖ పాత్ర వహిస్తాయి. అందువల్ల దీనిని గూర్చి కొంత అవగాహన చేసుకోవాలి. దిగువ పట్టిక ద్వారా యిది విశదమవుతుంది.

ఆ తర్వాత సాంఘిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం యిచ్చారు. 6-11; 11-13 సంవత్సరాల మధ్య వయస్సుగల బాల బాలికలందరికీ పాఠశాలల్లో ప్రవేశం కల్పించాలనే జాతీయ లక్ష్యాన్ని సాధించాలని ఉద్దేస్తున్నారు. ఈ రంగంలో పెట్టుబడి క్రమంగా పెరగడం గమనార్హమైన విషయం. వెనుకబడిన

రంగం	ఐదవ ప్రణాళిక రూపాయలు కోట్లలో	శాతం	ఆరవ ప్రణాళిక రూపాయలు కోట్లలో	శాతం	ఏడవ ప్రణాళిక రూపాయలు కోట్లలో	శాతం
1. చిన్నతరహా నీటి పారుదలతో సహా వ్యవసాయ కార్యక్రమం	80.54	12.8	112.00	12.1	142.11	10.8
2. భారీ మధ్యతరహా నీటి పారుదల	195.99	31.0	219.00	.23.6	225.25	17.1
3. విద్యుచ్ఛక్తి	167.00	26.4	247.60	26.6	401.40	30.5
4. పారిశ్రామిక అభివృద్ధి	41.15	6.5	72.25	7.8	122.70	9.4
5. రవాణా కమ్యూనికేషన్స్	39.93	6.3	110.31	11.9	180.44	13.7
6. సాంఘిక సేవలు	106.84	16.9	167.31	13.0	242.54	18.5
	631.45	100.0	928.87	100.0	1314.44	100.0

ఐదవ ప్రణాళికలో భారీ మధ్యతరహా నీటి పారుదల ప్రాజెక్టులకు ఎక్కువ మొత్తాలను కేటాయించారు. ఐదవ ప్రణాళికా కాలంలోనే నాగార్జున సాగర్ ఎడమ కాలువ, పోచంపాడు ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయాలనే ఆశయమే యందుకు కారణం. ఆ తర్వాతి ప్రణాళికలలో యీ రంగానికి కేటాయించిన శాతాన్ని క్రమంగా తగ్గించారు.

ఐదవ ప్రణాళికలో పెట్టుబడుల కేటాయింపులో విద్యుచ్ఛక్తి రంగానికి రెండవ స్థానం లభించింది. ఆరవ, ఏడవ ప్రణాళికలలో దీనికి ప్రథమ స్థానం యిచ్చారు. ఈ మూడు ప్రణాళికల కాలంలో కేటాయించిన రు. 816 కోట్ల మొత్తంలో గ్రామీణ విద్యుదీకరణ, ట్రాన్స్‌మిషన్, పంపిణీలకు రు. 376 కోట్లు కేటాయించబడగా, మిగతా రు. 440 కోట్లను విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి కేటాయించారు. 1988-89 నాటికి యీ ప్రాంతంలో 6000కు పైగా గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయాలని ప్రతిపాదించారు.

వర్గాలకు సహాయ పడడానికి వీలుగా వృత్తి పనివారలకు, కార్మికులకు విడిగా పెట్టుబడులు సమకూర్చారు. అంతేగాక యీ వెనుకబడిన వర్గాలకు ఇండ్లు నిర్మించడానికి సంస్థాగత సహాయం అందజేయాలని ప్రతిపాదించారు.

వ్యవసాయ కార్యక్రమాలలో వ్యవసాయ విస్తరణ, సస్య రక్షణ, భూసార పరిరక్షణ, చిన్నతరహా నీటిపారుదల, పశు సంవర్ధన, పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, అడవులు, సహకారం మొదలైన అంశాలు ఉన్నాయి. ఎక్కువ భాగంలో ప్రధానంగా మెట్ట సేద్యం మండలంగా ఉన్న ప్రాంతంలో అభివృద్ధి నిమిత్తం వ్యవసాయాన్ని ముఖ్యమైన సాధనగా తీసుకుంటారనే అంశాన్ని అందరూ అంగీకరిస్తారు. అయితే యీ విషయంలో యింత వరకు పెట్టిన పెట్టుబడి చాలా తక్కువేనని చెప్పవచ్చు.

ప్రణాళికా కార్యక్రమాలలో రవాణా, కమ్యూనికేషన్స్ విషయాలలో మౌలికంగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎక్కువ కేటాయించడం హర్షించదగిన విషయం. ఐదవ ప్రణాళిక ఆఖరు

నాటికి 1,500 అంతకు ఎక్కువ జనాభా గల గ్రామాలన్నిటికీ రోడ్ల సౌకర్యం కల్పిస్తారని ఆశిస్తున్నారు.


పరిశ్రమల రంగంలో పెట్టుబడి తక్కువగా ఉన్నట్టు అనిపించినా, 15 సంవత్సరాల కాలంలో ఈ రంగానికి రు. 1,300 కోట్ల మొత్తం పెట్టుబడి అవసర మవుతుందని ప్రణాళిక గుర్తించింది. ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడి రు. 590 కోట్లు. కేంద్ర రంగం పెట్టుబడి రు. 510 కోట్లకు ఉండవచ్చునని ఆశిస్తున్నారు. ఇదివరకే పేర్కొనట్లు, ఈ ప్రాంతంలో 1974–80 కాలంలో యీ మూడు రంగాలలో మొత్తం పెట్టుబడి రు. 5,670 కోట్లకు ఉండవచ్చు. ఈ విధంగా పరిశ్రమలలో రు. 1,300 కోట్ల మేరకు ఉమ్మడి పెట్టుబడి ఉంటుంది (అంటే మొత్తం పెట్టుబడిలో దాదాపు 24 శాతం). తత్ఫలితంగా ఈ రంగానికి తగిన ప్రాధాన్యం యివ్వబడుతున్నదని యిందువల్ల స్పష్టమవుతుంది.

7. కీలకరంగాలు :— ప్రతి ఉప మండలంలో కీలక రంగాలను గుర్తించినప్పుడే ఆర్థిక ప్రాంతీయాకరణ దృక్పథం అర్థవంతమవుతుంది. ఒక మండలంలో ప్రత్యేకమైన, అపూర్వమైన వనరులు ఉండి, అంతర్గతంగా స్థానికంగా ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నప్పుడు వాటిని కీలకరంగాలుగా పేర్కొంటున్నారు. కీలకరంగాల గుర్తింపును గూర్చిన వివరాలు తెలుసుకుందాము.

(1) పట్టణ పారిశ్రామిక మండలం :—(ఎ), హైదరాబాదు మహానగరం. భారీ రసాయనాలు, ఔషధాల తయారీ, ఎలక్ట్రానిక్, భారీ ఇంజనీరింగ్ పరిశ్రమల వంటివి కీలకరంగాలుగా పేర్కొనవచ్చు. భారతదేశ పటంలో హైదరాబాదు నాభిస్థానంలో ఉన్న కారణంగా వనరులు అవసరంలేని పరిశ్రమల స్థాపనకు అనువుగా ఉంటుంది. ఈ ఉపమండలంలో గాజుషీట్లు, శుద్ధిచేసిన చర్మకారీ పరిశ్రమ, పొగాకు ఉత్పత్తులు మొదలైన వనరులు ప్రాతిపదికగల కొన్ని పరిశ్రమలను కూడా ఏర్పాటు చేయడానికి అవకాశాలు ఉన్నాయి. వాణిజ్య పంటలు ముఖ్యంగా పండ్లు కూరగాయలు, పశుగ్రాసం అనుబంధ కార్యక్రమాలుగా చేపట్టవచ్చు.

(బి), (సి) వరంగల్లు, నిజామాబాదు సముదాయం :— ఈ ప్రాంతంలో వ్యవసాయ ప్రాతిపదిక, చిన్న తరహా ఇంజనీరింగ్, కెమికల్ ప్రాతిపదిక, పరిశ్రమలను కీలకరంగాలుగా గుర్తించారు. వరంగల్లులో వాటికి తోడు, అడవుల ప్రాతిపదిక పరిశ్రమలు, పట్టు పరిశ్రమ, వాణిజ్య పంటలు, పశుగ్రాసం మొదలైన వాటిని అనుబంధ కార్యక్రమాలుగా చేపట్టవచ్చు.

*(2) అడవుల, ఖనిజ మండలం :—*కలప తయారీ న్యూస్ ప్రింట్, కాగితం, బొగ్గుగనులు, విద్యుచ్ఛక్తి ఉత్పా



దక పరిశ్రమలు కీలక రంగాలుగా గుర్తించారు. ఈ ప్రాంతంలో వర్షపాతం బాగా ఉన్నందున మెట్ట సేద్యంలో కూడా అనేక పంటల సేద్యం పద్ధతిని ప్రవేశ పెట్టవచ్చు. తగిన పంటలకు సేద్యం చేయడం ద్వారా సేద్యం విస్తీర్ణం తగ్గించవచ్చు.

*(3) తీవ్రతర వ్యవసాయ మండలం :—*నిజామ్‌సాగర్, నాగార్జునసాగర్ ప్రాంతాలలో వరి, చెరకు వంటి మాగాణి పంటలు కీలకరంగంగా గుర్తించబడగా, పోచంపాడు ప్రాంతంలో నీటిపారుదల గల మెట్ట పంటలు కీలకరంగంగా గుర్తించారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి మంచి అవకాశాలు వున్నాయి. వంట నూనె, బియ్యం, తవుడు నూనె, మొక్కజొన్న ప్రాతిపదిక వ్యవసాయ పరిశ్రమలు, వనస్పతి. వేరుశనగ వంట నూనె, న్యూస్ ప్రింటు కాగితం పరిశ్రమలకు కూడా యీ మండలంలో అవకాశాలు ఉన్నాయి.

*(4) మెట్ట సేద్య మండలం :—*ఈ మండలంలో ఆముదం, సజ్జ, జొన్న, పత్తి పంటలు ప్రధానమైనవి. పశు సంపద అపారంగా ఉండడం యీ మండలం ప్రత్యేకతగా పేర్కొనవచ్చు. ఈ ప్రాంతంలో వ్యవసాయం బలహీనమైన స్థితిలో ఉన్న కారణంగా ప్రజల ఆదాయ స్థాయిని పెంపొందించడానికి పశుపోషణ, పాడి పరిశ్రమల విస్తరింపజేయడానికి ప్రత్యేక కృషి అవసరం. ఒకసారి యీ కృషి జరిగితే, స్థానికంగా లభించే ఉన్ని, చర్మాలు ప్రాతిపదికగా ఉన్ని పరిశ్రమ, చర్మకారీ పరిశ్రమలను యిక్కడ అభివృద్ధి చేసే అవకాశాలు ఏర్పడతాయి. ఈ మండలంలో వనరుల ప్రాతిపదిక పరిశ్రమలలో ఆముదం పరిశ్రమలను దేవరకొండ, జడ్చర్ల ప్రాంతాలలో నెలకొల్పవచ్చు. అదేవిధంగా జడ్చర్ల—మహబూబునగరు ప్రాంతాలలో వేరుశెనగ సముదాయ పరిశ్రమలను ఏర్పాటు చేయవచ్చు. మహబూబ్‌నగర్ ప్రాంతంలో పత్తి, జవుళి మిల్లులు, రసాయనాలు, క్రిమి సంహారక తయారీ సంస్థలు,

రబ్బరు, రసాయనాలు పరిశ్రమలతో పాటు గాజు పరిశ్రమలను కూడా ఏర్పాటు చేయవచ్చు. తరచుగా కరువుకు గురిఅయ్యే యీ ప్రాంతాల్లో పైన పేర్కొన్న పరిశ్రమలను యేర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి పరచవచ్చు.

8. పరిశీలన :—భవిష్యత్తులో యీ ప్రాంతం అభివృద్ధి ప్రణాళికలను రూపొందించే సమయంలో జాతీయ పెట్టుబడి ఉత్పత్తి దామాషాలపైగాని, జాతీయ జనాభా పెరుగుదల అంచనాలపైగానీ ఆధారపడకుండా ఈ ప్రాంతంలో వనరుల ప్రాతిపదికపై వాటిని రూపొందించాలి.

తెలంగాణా ప్రాంతం వివిధ ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక అంశాలను, యితర వివరాలను అందజేసినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకార, ప్రణాళిక శాఖకు, సాంకేతిక సంఘానికి కృతజ్ఞతలు అందజేయాలి. తెలంగాణా ప్రాంతం ప్రణాళికను రూపొందించడంలో యీ వివరాలను, సమాచారాన్ని తగు విధంగా క్రోడీకరించినందుకు సాంకేతికసంఘాన్ని అభినందించాలి.

ప్రణాళికా రచనలో ప్రదేశాలను ప్రధాన అంశంగా గుర్తించడం యీ ప్రణాళికలోని ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఇటీవలివరకు ప్రాంతీయ ప్రణాళికా రచనలలో "వివిధ రంగాలకు" ప్రాధాన్యం యివ్వడమనే పద్ధతిని అనుసరించారు. అయితే తెలంగాణా ప్రాంతీయ అభివృద్ధి ప్రణాళికను రూపొందించే సమయంలో సాంకేతిక సంఘంవారు 'ప్రదేశాల'ను ప్రాతిపదికగా గుర్తించడం గమనార్హం. ఆర్థిక ప్రాంతీయ కరణ, పెరుగుదల కేంద్రాలు యిందుకు తార్కాణంగా పేర్కొనవచ్చు.

ప్రాంతీయ ప్రణాళికా రచనలో యీ ప్రయోగం ఫలప్రదమయితే ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించడంలో యితర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా యీ విధానాలను అనుసరించవచ్చు.

దీపకళిక

~ శ్రీమతి ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

ఇంకా ఉషః కాంతులు వసుంధరాదేవికి చక్కిలిగింతలు పెట్టలేదు.

నిద్రాస్మృతీకాని సంధ్యావస్థలో కొట్టుమిట్టాడుతున్నాను

ఏమిటో గుండె గుహల్లో కొట్లాట వినిపించింది. ఆ ఘర్షణ భరించలేక బయటకు నడచివచ్చా!

బయట——ఓహో! అనంత, ఉజ్జ్వల నీలాకాశం!

ఒకమాఱు రెక్కలు విప్పుకొని నా మెదడు బందికానా నుంచి హంసలు బయటకు దూకి, దూదిపింజల్లా పైకి, పైకి తేలిపోతూ ఎగిరిపోయాయి,

అరే, అదేమి చోద్యం! అంతలోనే ఒక్కమాఱుగా వినీల సాంద్ర ఆకాశం నిండా హంసలే! హంసలు! హంసలు!;

ఇంతలో ఎంత అందమైన పూలపాన్పు తయారైనదీ గగన రంగంలో!


ఆ శోభా సౌందర్య దర్శనంతో ఉక్కిరి బిక్కిరై సర్వేంద్రియాలూ. పట్టుదప్పి వివశమైపోతూంటే సౌరభాల ముసుగు ఆవరణతో ఎవరో దొంగ కాబోలు; వచ్చి విజృంభించాడు! అసలెవరీవ్యక్తి! ఏమిటీ అల్లరి! అనే ఆలోచనకే అవకాశం లభించకుండా పోయిందేమిటా! అని విస్తుపోయాను.

ఇంతలో ఆ దొంగ నాసాపుటాల్లోంచీ, నేత్రాంచలాల్లోంచీ,లోపలికి, లోపలికి, ఇంకా లోపలికి అంతస్సులోకి, దిగి మఠీ తిష్ఠ వేశాడు. !

ఆ అనంత సౌరభవీచి, యీ చిన్న యింటిలో ఇమిడే అవకాశం లేక తెపతెపలాడింది—ఉన్న ఊపిరికాస్తా క్రిందా, మీదా అయి సతమత మయ్యింది!

అయినా లోపలచేరిన చోరుని ఎట్లాగైనా బంధించాలని ఊపిరి బిగబట్టాను! వాడెక్కడ సర్దుకొన్నాడో నాకైతే తెలియ లేదు! కాని. ఆ ఉజ్జ్వల సౌరభవీచి, దీపకళికగా నాలో నిలిచిపోయింది.

ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ



• మసూనా •

"తాజమహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన కూలీలెందరు?"
"బాలల అకాడమీ అవతరణకు పాటు పడిన ప్రాజ్ఞులెందరో!"

జ్ఞాతంగా, అజ్ఞాతంగా ఎందరెందరో బాల బంధుల కృషి ఫలమే బాలల అకాడమీ—

నాలుగేళ్ల క్రిందట ఇది ఒక సుందర స్వప్నం! ఒక అద్భుత ఊహా చిత్రం!

నేడు కల్ల కాని కల! చల్లని తెలి వెన్నెల.

బాలల అకాడమీ అవతరణ గాథను వివరించాలంటే మూడు, మూడున్నర దశాబ్దాల తెలుగు దేశపు చరిత్ర స్మరణకు రాక తప్పదు.

ఎందరో స్వార్థ రహితులైన కార్యకర్తల, ఎన్నో త్యాగపూర్ణములైన స్వచ్ఛంద సంస్థల కృషి నేటి బాలల అకాడమీకి ఆధారమయింది.

తొలి ఘట్టాలు

1939–40 ప్రాంతంలో మద్రాసు రేడియో, పిల్లల ప్రోగ్రామును ప్రవేశ పెట్టింది.

1945 లో 'బాల' పత్రికను శ్రీ రాఘవరావు అన్నయ్య, కామేశ్వరి అక్కయ్య ప్రారంభించారు.

మరో పదాదికో 'చందమామ' పత్రిక ప్రారంభమయింది. యీ పత్రికలో పిల్లల గురించిన ఆలోచనలు ప్రజల్లో వ్యాప్తి కావడానికి ఉపకరించేయి.

రేడియో ప్రోగ్రాములు పిల్లల పట్ల తల్లిదండ్రులకు ఆసక్తిని పెంపొందించేయి.

రానురాను పిల్లల పత్రికలు మరికొన్ని వెలసేయి. బాలల కోసం రచనలు చేసేరు చాల మంది. పాటలు, పద్యాలు కథలు, నాటికలు, నవలలు వెలువడ్డాయి. ఇట్లా తెలుగునాట పిల్లల సాహిత్యం పట్ల, కళల పట్లా విద్యావంతుల్లో అభిరుచి పాదుకొంగి.

తెలుగు భాషా సమితి, దక్షిణ భాషా పుస్తక సంస్థ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల పుస్తకాలకు బహుమతులివ్వడం చేశాయి.

తెలుగు బాల రచయితల సంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, తెలంగాణా రచయితల సంఘం పిల్లల పుస్తకాలు వెలువరించేయి. దేశి కవితా మండలి, ఆదర్శ గ్రంథ మండలి, విశాలాంధ్ర ప్రచురణాలయం, త్రివేణి ప్రచురణలు, ఆంధ్ర ప్రదేశ్ డిస్ట్రిబ్యూటర్సు మున్నగు పుస్తక వ్యాపార సంస్థలు పిల్లలకై మంచి పుస్తకాలు ప్రచురించేయి.

శ్రీ న్యాయపతి దంపతులు

బాలన్నయ్య, అక్కయ్యా మద్రాసు రేడియోలో పిల్లల ప్రోగ్రాములు ప్రారంభించడం బాలల లోకంలో ఒక సంచలనం, చైతన్యం ప్రసరింప జేసేయి. న్యాయపతి దంపతులు ఆంధ్ర బాలానంద సంఘం స్థాపించడం. మరో అద్భుతమైన ముందడుగు అయింది.

చింతా దీక్షితులుగారు, గిడుగు సీతాపతిగారు, కవికొండల వెంకటరావుగారు, నాళం కృష్ణరావుగారు, వెంకట పార్వతీశ్వర కవులు, పేటుకూరి వెంకట నరసయ్యగారు, యస్. జి. ఆచార్యగారు. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు, మున్నగు శక్తిమంతులు బాలల కోసం రచనలు చేయసాగేరు

నార్ల చిరంజీవి—సూరిసెట్టి బాబ్జీ-శ్రీవాత్సవ.

విశాలాంధ్ర పత్రికలో నార్ల చిరంజీవిగారు పిల్లల కోసం ఒక ప్రత్యేక శీర్షిక నడిపేరు. చిరంజీవిగారు బాల సాహిత్యానికి ఎన్నో అమూల్య రచనలు అందించేరు.

సూరిసెట్టి సాంబశివరావు బాబ్జీగారు, శ్రీవాత్సవగారు పిల్లలకు ఎన్నో ఆకర్షణీయమైన రచనలు చేసేరు.

ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభ, ఆంధ్ర జ్యోతి, ప్రజామత పిల్లల కోసం. ప్రత్యేక శీర్షికలు, ప్రతి సంచికలో ప్రచురించ సాగినవి.

గిడుగు సీతాపతిగారి అధ్వర్యంలో రాజమండ్రి, హైదరాబాదులో మూడు పర్యాయాలు బాలసాహిత్య రచనా శిక్షణ శిబిరాలు నిర్వహించబడ్డాయి.

బాలల ఉద్యమంపట్ల అత్యంత ఆసక్తి కనపరుస్తూ ప్రచారము జరిపినవారిలో శ్రీయుతులు చేకుమళ్ల కామేశ్వరరావు, బి. వి. నరసింహారావు, వెలగా వెంకటప్పయ్య, రావూరి భరద్వాజ, ఏడిద కామేశ్వరరావు, నండూరి సుబ్బారావు, వద్దిపర్తి వెంకటరావు, జి. మునిరత్నం, న్యాయపతి రాఘవేంద్రరావు, అలపర్తి వెంకటసుబ్బారావు, కె. సభా, కవుల ఆంజనేయశర్మ, నోరి రామశర్మ, పిశ్కా సుబ్బారావు, ముదునూరి సోదరులు, ప్రభృతుల్ని పేర్కొనతప్పదు.

ఇట్లా పేరు పేరునా వ్రాయడం అసాధ్యం. ఎందరో పెద్దలు సహృదయతతో పిల్లల అభివృద్ధికి కృషి చేశారు. బాలల్లో కళాభిరుచి, కొత్త చూపు, బాలల ఉద్యమం పట్ల శ్రద్ధా పెంపొందసాగేయి.

"బాలల అకాడమీ" రూపకల్పన

అయితే— బాలల అకాడమీ రూపకల్పనకు ప్రత్యేక కృషి, సమైక్య ఉద్యమం ప్రారంభించిన సదవకాశం, అదృష్టం విశాఖపట్నంలోని బాలసారస్వత కళాపరిషత్తుకు లభించింది "బాలల అకాడమీ" పేరు మొదటమారు వినిపించింది విశాఖ. ఈ చిరుగాథ వివరించకుంటే యీ వ్యాసం రసవిహీనమయే అనుమానం కల్గుతున్నది.

నా సాహిత్య వ్యాసనం

నేను పాతికేళ్ల పూర్వం నుండీ బాలల అభివృద్ధి పట్ల, ముఖ్యంగా బాలసాహిత్య ప్రచురణపట్ల యథాశక్తి కృషిచేస్తు వస్తున్నా—

నాదో చిత్రమైన తత్వం- ఏది పడితే దాన్ని కొనసంటూ చూడాలనే పట్టుదల నాది. ముప్పదేళ్ల పైగా విశాఖపట్నంలో శతాధికమైన కార్యక్రమాలు చేపట్టేను. నా బుద్ధికి ఏది మంచి అనిపిస్తే, పదిమందికి మేలుకూర్చే పనిని పట్టు సడలకుండా నిర్వర్తించడం నా మనస్తత్వం-

1950 లో పుట్టిన విశాఖ రచయితల సంఘంలో 1970 వరకూ నాకు ప్రధాన పాత్ర వుండేది. 12 ఏళ్లు యీ రచయితల సంఘానికి కార్యదర్శిత్వం వహించేను.

1948 నుండి రచనలు చేస్తూనేవున్నా. పద్యాలు, గేయాలు, కథలు, వ్యాసాలు నాశక్తి మేరకు కొన్ని వందలు వ్రాసేను. అవన్నీ వెనువెంటనే ఏదో పత్రికలో అచ్చుపడ్డాయి.

పత్రికలు నడిపేను. పెద్దలకు, పిన్నలకు పుస్తకాలు ప్రచురించేను. బాలల కోసం ఒక పత్రిక నడిపించేను. ఇప్పుడూ ఓ వారపత్రిక ఆరేళ్ల నుండీ నిర్వహించుకువస్తున్నా.

స్వాభివృద్ధి చూసుకోక డబ్బు, ఆరోగ్యం ఖర్చు చేసుకుంటూ విశ్రాంతి ఎరగని "సాహిత్య వ్యసనపరుని"గా మా వాళ్లందరూ నన్ను గురించి అనుకుంటారు.

రానురాను బాలల ఉద్యమం పట్ల నా ఆసక్తిని ఇనుమడించి ఒక నిశ్చల ధ్యేయంవైపు పయనించేను.

శ్రీ భాట్టం వారి తొలి యత్నం

1972 నవంబరులో విద్యా సాంస్కృతిక శాఖల నిర్వహిస్తున్న మంత్రివర్యులు శ్రీ భాట్టం శ్రీరామమూర్తి గారు బాలల కోసం ఓ పత్రిక నడపవలెనని సంకల్పించి కొందరు బాల సాహిత్య కళావేత్తలను రాజధానిలో సమావేశపరిచేరు. విశాఖ నుండి నన్ను ఆహ్వానించేరు. నా ఆలోచనలు ఆ సమావేశంలో మనవి చేశాను ఆనాటి చర్చలు నాలో ఎన్నో కొత్త ఊహాలు మేల్కొల్పేయి.

బాలల కోసం ఒక అపూర్వ ఉద్యమం లేవదీయాలని నా మనస్సు పొంగులెత్తింది.

1974—మే నెలలో 6వ తేదీని బాలల కోసం ప్రత్యేక అకాడమీ అవసరమని విశాఖ బాల సారస్వత కళా పరిషత్తు తరపున తీర్మానించడం జరిగింది.

"బాలల అకాడమీ" నివేదిక—"నినాదం"

1973 మే 9వ తేదీని అకాడమీల సమీక్షా సంఘం శ్రీ పి. యస్. ఆర్. అప్పారావు గారి నాయకత్వంలో పర్యటిస్తూ విశాఖ వచ్చిన సందర్భంలో "బాలల అకాడమీ" ఆవశ్యకతను నొక్కిచెప్పడం, ఒక సమగ్రమైన నివేదికను అచ్చు వేసి సంఘానికి సమర్పించడం జరిగింది-"బాలల అకాడమీ" నినాదం విశాఖనుండే తొలి మారు ప్రకటించబడింది-ప్రచారం పుంజుకొనే యత్నం జరిగింది. 1973 జూన్ 17వ తేదీని విశాఖలో పెద్ద బహిరంగ సభలో బాలల అకాడమీ నిర్మాణావశ్యకతను వివరిస్తూ పెద్దలు ఉపన్యసించేరు. ప్రజలకు, ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు.

శుభోదయ పత్రిక అకాడమీ నివేదికను ప్రత్యేకంగా ప్రచురించింది. ఆ వెంటనే "బాలల అకాడమీ" ఆలోచనను దేశంలోని పెద్దలలో ప్రచారం చేసి వారి వారి అభిప్రాయాలు, సలహాలు, ఆశీస్సులు, సహకారాలు పొందాలని నిశ్చయించి "నివేదిక" అచ్చువేసి దానితో ఓ లేఖ జత చేసి దేశం నలుమూలలా వున్న సుమారు 200 మంది పెద్దలకు పోస్టు చేశాను. సకాలంలో ప్రత్యుత్తరాలు రానప్పుడు జ్ఞాపికలు అచ్చువేసి (రిమైండర్స్) పంపేను. సుమారు యాభై అరవై మంది పెద్దల నుండి మాత్రమే నాకు ఆదర పూర్వకమైన సమాధానాలు అందేయి. మిగిలిన పెద్దలు ఇది "అసాధ్యమైన యత్న

మనో", "జరిగేమీ ఉండదనో" నా అభ్యర్థన పట్ల శ్రద్ధ చూపు మానేరు. ఏమైనా నిరుత్సాహ పరిస్థితి ఏమీ ఏర్పడలేదు. జవాబు లిచ్చిన వారు నా విశ్వాసాన్ని బలపర్చేరు. నా కార్యోత్సాహానికి శక్తి నిచ్చేరు.

బాలల అకాడమీకి—శుభోదయ ప్రత్యేక సంచిక

బాలల అకాడమీ నిర్మాణం గురించి వచ్చిన పెద్దల అభిప్రాయాలన్నీ క్రోడీకరించి శుభోదయ వార పత్రికను 20 పుటల ప్రత్యేక సంచికగా ప్రచురించేను. 1972 నవంబరులో తలపెట్టిన "బాలల పత్రిక" ప్రచురణ కొన్ని కారణాల వల్ల ఫలప్రదం కాలేదు.

విద్యా మంత్రి శ్రీ మండలి వారికి విజ్ఞప్తి

1974 మార్చి సరికి శ్రీ మండలి వెంటకృష్ణారావు గారు విద్యా మంత్రి పదవిని అలంకరించి వున్నారు, హైదరాబాద్‌లో వారి దర్శనం చేసుకున్నాను. బాలల అకాడమీ గురించిన అభిప్రాయాలు ప్రకటించిన శుభోదయ ప్రత్యేక సంచికలు, నివేదికలు వారికి సమర్పించుతూ, ప్రత్యేకంగా ఒక విజ్ఞాపనా పత్రము అకాడమీ ఏర్పాటుకై వారి కందించేను. సహజ ధోరణిలో చూస్తామన్నారు వారు.

బాలల మహాసభలు—"అకాడమీ నిర్మాణ" వాగ్దానం

1974 అక్టోబరులో బాలన్నయ్య శ్రీ న్యాయపతి రాఘవ రావు గారి ప్రోద్బలముతో, రాష్ట్ర విద్యా శాఖ సహకరించి అఖిలభారత తెలుగు బాలల మహాసభలు జరిపించడమైంది. ఆ సభలు చాల ఘనంగా జరిగేయి. బాలల అకాడమీ నిర్మాణానికి వాగ్దానమూ లభించింది. అప్పుడే. చివరకు-ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి సానుకూల్యత, సమ్మతిపొంది విద్యామంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణరావుగారు బాలల అకాడమీ అవతరణను ప్రకటించేరు. 1976 మార్చిలో బాలల అకాడమీ అవతరించింది. శ్రీ న్యాయపతి రాఘవరావుగారి కృషి, విద్యాశాఖామాత్యులు శ్రీ మండలి వెంకటకృష్ణారావు గారి దీక్షా యీ సత్ సంకల్పం ఫలప్రదం కావడానికి దోహదం చేశాయి. అకాడమీ చేపట్టదలచిన, చేపట్టగల్గిన కార్యక్రమాలు ఎన్నోఉన్నాయి.

వానిలో కొన్నిమాత్రం ఇక్కడ పొందుపరుస్తున్నా—

బాలల అకాడమీ చేపట్టవలసిన కార్యక్రమాలు

1. బాలలలో పఠనాభిరుచి పెంపొందిస్తూ వారి శీల నిర్మాణానికి దోహదంచేసే ఉత్తమగ్రంథాలు అందరి పిల్లలకూ అందుబాటైన తక్కువ వెలకు విరివిగా ప్రచురించడం-

2 పిల్లల మానసిక వికాసానికి తోడ్పడే ఒక చక్కని పత్రికను నడపడం.

3. ప్రాచీన సాహిత్యంనుండి పిల్లలకు ఉపకరించే రచనలు సరళమైన భాషలో తిప్పి వ్రాయించి ప్రచురించడం, దేశీయ విదేశీయ భాషలలోని ఉత్తమ బాలసాహిత్యాన్ని ఆంధ్రీకరింపజేసి ప్రచురించడం, తెలుగులోని ఉత్తమ బాలసాహిత్యాన్ని ఇతర భాషలలోనికి తర్జుమాచేయించే కృషి జరపడం.

4. బాలవిజ్ఞాన సర్వస్వం ప్రచురించే సమగ్రపథకం తయారించి చిన్న సంపుటాలుగా ప్రచురించడం.

5. ప్రతి గ్రామంలోను, పట్నంలోను బాలానంద సంఘాలు స్థాపించడ, ఉన్న సంఘాలను ప్రోత్సహించడం—

6. బాల సంఘాల కార్యకర్తల శిక్షణ నిమిత్తం శిక్షణ కేంద్రాన్ని నిర్వహించడం.

7. జిల్లా స్థాయిలో బాలల పుస్తకాల ప్రదర్శనకు, విక్రయానికీ ఫిల్ముల ప్రదర్శనకు: . సంచార శకటాలు (మొబైల్ వేన్‌లు) నిర్వహణకు ఏర్పాటు,

8. బాలల అకాడమీ ప్రచురించిన గ్రంథాలను, రచయితలు స్వయంగా ప్రచురించుకున్న బాల సాహిత్యగ్రంథాలను విక్రయించడానికి అవసరమైన పంపిణీ పథకం ఏర్పాటు చేయడం-

9. బాలసాహిత్య రచనా, కళా శిక్షణ శిబిరాలు నిర్వహించడం.

10. ప్రతి జిల్లాలోను అకాడమీ శాఖలు స్థాపించి వాని ద్వారా జిల్లాలోని వివిధ ప్రదేశాలలో సాంస్కృతికోత్సవాలు, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, బాలసాహిత్య చిత్రకళా రచనలలోను, సంగీత నాట్యనాటక కళాప్రదర్శనలలోను, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో పోటీల నిర్వహణ

11. తాలూకా స్థాయిలో కల ప్రతి చిన్న పట్నంలోనూ బాలలకోసం ఒక ప్రత్యేక గ్రంథాలయం, అనుబంధంగా కళామందిరం, ఒక సమగ్రమైన పార్కు, దానికి అనుబంధమై క్రీడా క్షేత్రాలు ఏర్పాటుచేయడం — వీటిని సమన్వయపరచే బాల భవనాల నిర్మాణం—

12. పరిశోధనకు ఉపకరించే ఒక ప్రత్యేక గ్రంథాలయం బాలల అకాడమీ సమకూర్చుకోవడం—

13. ముద్రించబడి అలభ్యమైన కీర్తిశేషులగు బాల సాహిత్య కర్తల ఉత్తమ గ్రంథాలను సేకరించి వాటి ముద్రణాది హక్కులు. అకాడమీ సంతరించుకోవడం—ఆ గ్రంథాలు పెద్ద ఎత్తున ప్రచురించి పిల్లలకు అందించడం—

14. బాలల కథలు, నవలలు, నాటికల రచనలకు బహుమతులు ప్రకటించి బాల సాహిత్య రచనను ప్రోత్సహించడం

15. బాలలకు ప్రత్యేక తరహా — శిశు గీతాలు, దేశభక్తి గీతాలు, ప్రకృతి గీతాలు, నీతి గీతాలు, ఆరోగ్య గీతాలు రచించే కృషి త్వరితంగా చేయడం—ఇదివరకున్న గీతాలను సంస్కరించి, ప్రచురించడం—

16. సామెతలు—పొడుపు కథలు—బాలలకు పనికివచ్చే వానిని సంకలనంచేసి సచిత్రంగా ప్రచురించడం—

17. తెలుగులోని ప్రాచీన, ఆధునిక గ్రంథాలనుండి బాలలకు ఉపయుక్తమైన భాగాలను ఎంపికచేసి అనువైన భాషలు కథాంశాలను సంకలనం చేయడం — పాత పద్యాలు, చాటు పద్యాలు—బాలలకు అనువైనట్లు ప్రచురించడం

18. మహనీయుల గాథలు, జాతీయ నాయకుల జీవిత ఘట్టాలు, మహాత్ముల సూక్తులు, ప్రత్యేక నీతి పద్యాలు, జేబు పుస్తకాలుగా బాలలకోసం ప్రచురించడం.

19. బాలలు సాహిత్యంలోని మనోహరమగు పాటలు, పద్యాలు కంఠస్థంచేసే అభిరుచిని పాఠశాలా దశలోనే ప్రోత్సహించడానికి వీలుగా పాఠశాలలో అందుకు సంబంధించిన నిర్ణీత కార్యక్రమాలు రూపొందించడం—

20. ప్రతి ఏడూ బాల సాహిత్య ద్రష్టలకు, బాలల ఉద్యమ కార్యకర్తలకు నల్వురైదుగురికి కనీసం చెరో అయిదు వందల నగదు పారితోషకం వారి సేవలకు పురస్కారంగా అందించడం


బాలసాహిత్యంలోను, ఇతర కళల్లోనూ కృషి జరిపి వృద్ధాప్య దశలో నున్న సాహిత్య కళాకారులకు నెల వారీ ఆర్థిక సహకారం అందివ్వడం

21. బాల సాహిత్యంలోను, కళల్లోనూ, పరిశోధన జరిపే ఇర్వురకు లేదా ఇంకా ఎక్కువమందికి ప్రత్యేక ఉపకార వేతనం (స్కాలర్ షిప్) ఇచ్చి ప్రోత్సహించడం

22. ప్రభుత్వ అధ్వర్యంలో జరుగుతూన్న పాఠ్య పుస్తక రచనలో బాలసాహిత్యంలో నిష్ణాతులైన కొందరి పెద్దల సలహా సహకారాలు పొందడానికి నియమించడం—

23. ప్రబోధకరమైన పిల్లల సినిమాలు తీయడానికి ప్రత్యేకమైన ఆందోళన చేయడం—సలహా సంప్రదింపులు చేయడం

పెక్కు సంస్థలు, వ్యక్తులు, ఎట్టి మంచి కృషి జరుపుతున్నా పటిష్టమైన ఒక కేంద్ర సంస్థ నిర్మాణం కావలసి ఉంది.
అదే "బాలల అకాడమీ".



ప్రత్యేక అకాడమీ

సాహిత్యంతో పాటు ఇతర కళల ద్వారా బాలయువతరాన్ని జాతీయ భావ ప్రభావితులను చేయవచ్చు. ప్రత్యేక శ్రద్ధ వహిస్తే సంగీతం, చిత్రలేఖనం, నాట్యశిల్పాలు బాలలను ఉన్నత ఆదర్శాల వైపు త్రిప్పగలవు. ఇట్లాంటి బహుళ ప్రయోజనాల సాధన కోసం బాలలకు ప్రత్యేక అకాడమీ ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యం పొందిన పాతికేళ్ళ అనంతరం ఈనాటికయినా ఇట్టి పిల్లల అకాడమీ ఏర్పాటు కావల్సిన అవసరం ప్రజలు, ప్రభుత్వం గుర్తించారు.

బాలల అకాడమీ రెండు దశాబ్దాల పాటు తన లక్ష్యసాధనలో శ్రద్ధ వహించి నిక్కపు దేశభక్తులయిన సత్పౌరులను దేశానికి అందించిననాడు ఆ నవతరం యీ మన దేశాన్ని భూతలస్వర్గం చేస్తుంది. అప్పుడు గాంధీజీ ఆశించిన రామరాజ్యం ఏర్పడుతుంది. అంతకంటేమించిన అందాల ఆనందాల రాజ్యం వెలుస్తుంది. కులమత అతీత సమసమాజ, సామ్య వాద రాజ్యం తప్పక ఆవిర్భవిస్తుంది.

కొందరు మహదాశయులు యీ ఉద్యమ నిర్వహణంలో పాలు పంచుకోవాలి. ఈ దేశంమీద, రాబోయే నవతరం మీద గాఢమైన భక్తి వాత్సల్యాలు గల్గిన విశిష్టవ్యక్తులు ఈ లక్ష్య సాధనలో సహకరించి నపుడే ప్రస్తుత అకాడమీ నిర్మాణ పథకం విజయవంతమవుతుంది.

తెనుగుతల్లి

డా॥ ద్వైక వాసమూర్తి వరదాచార్యులు

తేనె మాగాణమౌ తెలగాణ గడ్డపై గౌతమితో సరిసంగ లాడి
వాస్తవ స్వర్గమౌ కోస్తాంధ్ర భూమిపై యస్నపూర్ణమ విందు లారగించి
రతనాల సీమయౌ రాయలసీమలో శ్రీశైలజాసమాశ్లేష మొంది
అర్ధనారీశ్వరుండై చేతముంగూడి స్త్రీ పుం నపుంసక స్థితి జెలంగి
విశ్వ భూతాకృతింగొని విమలగతుల, మహిత కాళేశ భీమేశ మల్లికార్జు
నాఖ్యలం దాల్చి యభ్యుని నలరుచేమొ, ఘన త్రిలింగావనిగ నొప్పు తెనుగుతల్లి.

ప్రవిమల రత్నాల ఖనియగు భాగ్యలక్ష్మి, కవుల కళలకు నిలయమౌ శారదాంబ
అఖిల భారతావని కొక యన్నపూర్ణ, ఇల తెలుగు కల్పవల్లి మా తెలుగుతల్లి.

లింగమూర్తి యన్న లింగైన నాణెంకయర్థులందువుగను నమరె తెనుగు
ఒకడు విసము మ్రింగె నొక్కండు పెధలొల్కె, తెలుగు ఓడుమ లడిపి మనుచు సనగ.

పరముంచి తెనుగమ్మ యిలనుంచి పచ్చెనా, పరణాల ముత్యాల సెమలు దొరలు
వర పదాంఘ్రియా సరణి సర్తించెనా, ధ్వని మనోజ్ఞతి లెన్న మనసు దోచు
సరసాపలోకినా చతురత బల్కెనా, మాటల తేనియలాటలూరు
త్యాగరాజులన్ రాగ తానమ్మ విచ్చెనా స్వరములు కోకిలగడమాడు
ఆంధ్ర వాగ్ఘోష సౌందర్య మతిశయమ్ము, అజర మధురమ్ము విశ్వ మోహనకరమ్ము
ఆమె పదసేవ నంకితమైన సుకవి, వర్ణ్య లక్షణపదములు వదయు చంద్రు.

అరయగ నీ త్రిలింగముల యాఖ్యలు భిన్నములైన నింత కా
హారుదొక దార్మ లక్ష్యమయినట్టులె యీ తెలగాణ, మాంధ్ర నా
బరగెడి ప్రాంత నామములు పాయక యాంధ్ర ప్రదేశ మొక్కటే
ధరణి నటంచు జాటు, నుడ తానొకటే తెలుగేని యాంధ్రమేన్,

గౌతమి, కృష్ణ, తుంగమయి, గాంచగ వేరగు పేరులౌ యద
ద్వైతగతిన్ సముద్రమయి పొల్చెడినట్టులె ప్రాంత నామముల్
వీత విభేదనన్ దనరి విశ్వ మహాంధ్రముగాగ నేత్ర సం
ప్రీతి నొనర్చె నర్తనము వేరుగ దాయట కల్లలింక ముస్

తన, నా, నా, యను స్వార్థపూరములలో గ్రస్తత్వపు నానాత్వముల్
మనిమింపున్ మనముల్ సమైక్యమగు సమ్యగ్భవ్య మేపారగా
ఘన ప్రేమాత్మక రూపమాపితిమి యింకన్ బ్రహ్మదేవుండునున్
మనలన్ వేరు నొనర్పలేడు తెలుగన్నా వీనులన్ మ్రోగవా.

తా నాంధ్రు చేతి దండముగాంచి శిల్పమ్ము కోరి కొండల ద్రవ్వు కొనుచు వచ్చె
రా నాంధ్రు జానపదము మెచ్చి కబ్బమ్ము కమ్రకీర్తి పదముల బడుచు వచ్చె
తా నాంధ్రు కంఠ నాదము వినన్ గానమ్ము నగుగ గతి కన్ర మెలమికొనియె
తా నాంధ్రు భావుకత్వము మెచ్చి నాట్యమ్ము వీధులబడి వెనువెంట దరలె
కావ్యగౌతమి నన్నయన్ గాన్కవెట్టి, నాట్యకృష్ణమ్మ క్షేత్రయన్న జరులీయ
గాన కావేరి త్యాగయన్ కట్నమొసగ, ఆంధ్ర శారద నిత్య కళ్యాణ మలరు

అరయ బ్రహ్మయె నన్నపార్యు గయ్యెనో వాణి యనస మ్మాంధ్ర నాన్నర తలసిడె
అక్కిరీటి శరంబె తిక్కన గంటమో సంగరోద్యోగాల జయము గాంచె
ఆంధ్ర వాగ్వనితా సుమాధరం బెట్లనో భారతారణ్యాల సౌరు జిమ్మె
శ్రీనాథుడే కళా శ్రీనాథుడే యేమొ పదమంటి రసగంగ బయలుదేర
పోతనార్యుని యెడ నవనీతమేమొ, అతని యరచేతిలో వెన్న దాడినాడు
పెద్దనార్యుని కృతులెంత పెద్దసవలె, ప్రతి పదము సువర్ణ స్వాలంకృతి ధ్వనించె

భారత వేదాది పనసలై ఘనలల్లు చాళుక్య నరపాలు సద్గుణాలు
ఓరుగల్ శిలలెన్నొ యొరదీసి చూపును మహిత కాకతి లక్ష్మి మచ్చు పిసరు
శిధిల హంపీ జయసీమ లక్షరములై కర్ణాట సామ్రాజ్య కథలు వ్రాయు
వాసంత కర్పూర వాసనల్ విరజిమ్ము రెడ్డి రాణ్మణుల యా దొడ్డ కీర్తి
మేటి బొబ్బిలిపులి గండు మీసలపయి, ఆంధ్ర రాజ్యమ్ము నిమ్మపండగుచు నిల్చె
ననుచు శారద కాంధ్ర ముఖాబ్జసీమ, వీర విజయాంధ్రశ్రీ తాండవించు నిక

చిలచిలమై వచ్చి చిమ్మి పోసిన వేడి రక్తాల రత్న వర్షాలు గురిసె
కంట కూరుకులేక కష్టించి యోడ్చిన చెమటల ముత్యాల చేలు పండె
ఘన కృషిన్మెఱుపు తీగవలె సాగెడి మేన పైడి యేఱులు జాలువారె నెన్నొ
ఆత్మార్పణము సేయు నస్థిపంజరముల వెండికొండలు గూళ్లు వెట్టుకొనియె
అట్టె యాంధ్రుడు పాదమ్ము బెట్టుచోట, రాళ్లు రత్నమ్ములౌను కరాన మన్ను
ముట్ట బంగారమౌ ప్రాణముల తెగించి, యును స్వకార్యమును సాధించు తెనుగుబిడ్డ

అర్కి వహ్ని నార్ప ముంగురుల జారెడి చెమ్మటలనే వలచె ముత్తెముల తురాయి
రిపు మదేభముల మర్దించు ఖడ్గము మెచ్చి యాహ్వాన మొసగె సింహాసనమ్ము
పిడుగులౌ బాకుల వడిపోట్లటనాపు డాల్గని నృప చ్ఛత్రమ్ము కన్నువేసె
మొన లెందరూపి జూచిన నాజి నదరని పదమెకాదె స్వరాజ్య పదము నిల్పె
చేతనాగ్ని రేపెడి ప్రాణవాతమాడ, కఠినమైన స్వరాజ్య సంకల్పబీజములను పక్వంబొనర్పక ముందెపుడును, ఆంధ్ర రక్తంపుపెసరు చల్లారెనొక్కొ

మా తెలుగమ్మకున్ దౌలత మాన్యత దెచ్చిన శాతవాహనుల్
ఖ్యాతబలుల్ చళుక్యులును కాకతిరాజులు కన్నడ క్షమా
నేతలు రెడ్డిరాణ్మణులు నిల్ప నమోఘ యశః పతాకలై
చేతుల నెత్తి నాటెడి నచేతనమౌ శిలలెన్నొ నేటికిన్

పరపాలనకె చలిజ్వరము బుట్టించెడి యల్లూరు వీరులీ యవనిగలరు
అరి తుపాకులకు పేరుర మొడ్డి నిల్చెడి యాంధ్రకేసరులు మాయందు గలరు
ఆంధ్రరాష్ట్రప్రాప్తికై యాత్మార్పణ మొనర్చు పొట్టి శ్రీరాములీ భూమి గలరు
దేశాల దత్త్వోపదేశాల దన్ను రాధాకృష్ణ గురువు లిద్ధాత్రిగలరు
శత్రు మదకరుల్ హడలెత్త సమరభువిని, సింహ విక్రమార్భటి నాంధ్రసీమనెల్ల
రక్షణమొనర్చు భీములు లక్షలాది, గలరు నేటికి నీ తెన్గు గడ్డపైన

చచ్చిన భీము మేన్ మరల సాధనచేసి గడించి తెచ్చి క్రొ
వ్వెచ్చని నూత్న జీవములు వేసి ఫలించెనొ యుద్ధమందునా
నచ్చునగొట్టి చూపిన మహాబలుడౌ మన కోడిరాము పే
రెచ్చట రేబవళ్లు దివి టీలిడి చూపరు సూర్య చంద్రులున్.

అలలతో సుడులతో నాంధ్ర మహార్ణవ మ్ముప్పొంగి వచ్చెనీయుర్వి ననగ
అనలతో గొనలతో నాంధ్ర కల్పకవల్లి పందిళ్ల్రబాకె నిప్పట్లననగ
ఆ గ్రామ పట్టణమ్మాంధ్ర ప్రపంచమ్ము కదలివచ్చినది యిక్కడకు ననగ
ఆటలంబాటల నాంధ్ర మహావాణి విహరించసాగె నివ్వీట ననగ
ఆర్ద్రమై యైక్యమై యఖిలాంధ్ర హృదయ, కమల దళములు మిత్ర పంభ్రమత విరియ
ఆంధ్ర లక్ష్మి విశ్వాకృతి నవతరించె, నగుచు మొనమొన్న మన భాగ్య నగరసీమ

మా మహోద్యమమ్ములు జగన్మాన్యగతుల
సఫలతంగని ప్రభుతకు జయమొదవగ
అనవరత మాంధ్రప్రజకు వరాలనిమ్ము
దీవనల పూలజల్లి యో తెనుగుతల్లి.

ఏనుగుల వీరాస్వామి - ఒడిశా

కళాప్రపూర్ణ పురిపండా అప్పలస్వామి

ఏనుగుల వీరాస్వామి పద్నాలుగున్నర దశాబ్దాల క్రితం 1830 మే 18న చెన్నపట్నం నించి బయలుదేరి కడప, శ్రీశైలం, హైదరాబాద్, పాట్నా, ప్రయాగలమీదుగా కాశీ వెళ్ళి, బదరీ యాత్ర కూడా చేసుకొని తిరుగు పయనంలో బెంగాల్, ఒడిశాలమీదుగా 1831 సెప్టెంబరు 3న చెన్నపట్నం చేరాడు.

ఆయన 1831 జూన్ 9న ఒడిశాలో అడుగుపెట్టి జూలై మొగని వొదిలిపెట్టాడు. దారి కడాకూ గ్రామాలూ, పట్టణాలూ వర్ణించాడు; జగన్నాథం మొదలైన క్షేత్రాల వివరం తెలిపాడు; నదులూ, ననాలూ, బాటలూ వివరించాడు; ప్రజల వేషభాషలూ, ఆచార వ్యవహారాలూ చర్చించాడు. సాంఘిక మర్యాదలూ, సంస్కృతి లోటుపాటులూ ఎత్తిచూపాడు. అంచేత వీరాస్వామి కాశీ యాత్ర చరిత్ర మనకెంత విలువైందో ఒడియా వారికీ అంత విలువైంది. ఒడియావారి సాంఘిక, సాంస్కృతిక, స్థానిక చరిత్రకు అద్దం వంటిది. ఇంతవరకు వారికి తెలియని ఎన్నో విషయాలు ఈ కాశీ యాత్ర చరిత్రలో ద్యోతకమవుతున్నాయి.

ఈ విషయం ఇప్పుడిప్పుడే ఒడియావారు తెలుసుకున్నారు. ఈ నడుమ మిత్రులు సచ్చిదానంద, మిశ్ర వీరాస్వామి కాశీ యాత్ర చరిత్రలోని ఒడిశాకి చెందిన భాగం ఒడియాలోకి అనువదించి "ఉత్కల ప్రసంగ".* 1976 మే, జూన్, జూలై నెలల సంచికలలో ప్రకటించారు. వీరాస్వామి ఒడిశా గురించి తెలిపిన ఎన్నో విషయాలు పరిశోధనా పూర్వకంగా చర్చించి వ్యాఖ్యానించి ఎన్నో పాదటీకలు వివరించారు శ్రీ మిశ్ర.

సచ్చిదానంద మిశ్ర ఒడిశాలో ప్రఖ్యాత సాహిత్యవేత్త; పరిశోధకుడు. తెలుగు సాహిత్యం గురించే కొన్ని వ్యాసాలు ఒడియాలో రాశారు. శ్రీ మిశ్ర ఒడియాలోకి తర్జుమా చేసిన కాశీ యాత్ర చరిత్ర భాగం ఒడియావారికి కొత్త విషయాలు చూపించి; కొత్త కనువిప్పు కలిగించింది; సంచలనం కలిగించింది.

శ్రీ మిశ్ర తమ అనువాదంలో వీరాస్వామి రచన మీద అక్కడక్కడ చేసిన వ్యాఖ్యానాలు తెలుగువారం తెలుసుకోడం ఎంతైనా అవసరం. అందుకని శ్రీ మిశ్ర తొలి భాగంలో చేసిన వ్యాఖ్యానాలు అవసరాలైన చర్చలతో ఇక్కడ వివరిస్తున్నాను. మిగిలిన రెండు భాగాలూ క్రమంగా పరిశీలిస్తాను.

కాశీ యాత్ర చరిత్రలో వీరాస్వామి తెలిపిన నదుల పేర్లూ, ఊళ్ళ పేర్లూ ఎన్నో సచ్చిదానంద మిశ్ర సవరించి సరైన పేర్లు తెలిపారు. సువర్ణ అన్న నదిని (తెలుగు కాశీ యాత్ర చరిత్ర పు. 284-286) **'సువర్ణ రేఖ' అనీ, 'కులాశ్రి (పు. 287) నదిని 'బుఢాబళంగ' అనీ, 'సారెందీ (పు. 289) నదిని 'సాళందీ' అనీ, 'కరుసా' (పు 292) నదిని 'ఖరసుఅ' అనీ, కటకం ఇవతలి 'మహానది' (పు. 294) ని 'కాఠజుడి' అనీ, భార్గవ (పు. 300) నదిని 'భార్గవీ' అనీ, 'కుశ' (300) నదిని 'కుశభద్ర' అనీ 'వజ్రరేఖ' (పు. 300) నదిని 'రత్నచిరా' అనీ సవరించారు.

అయితే సువర్ణ రేఖను వీరాస్వామి 'సువర్ణ' అనీ 'సువర్ణ రేఖ' అనీ రాశారు. (చూ. పు. 287, 305) అదీకాక ఆనాడు ఆ నదులకు ప్రజలు ఆ పేర్లు కూడా వాడేవారేమో! చివరి నది పేరు వజ్రరేఖ అన్నా రత్నచిరా అన్నా వొకటే అర్థం. ఇది వివరిస్తూ శ్రీ మిశ్ర చిన్న పురాణగాథ చెప్పారు. కృష్ణుడు తన వేలిరత్నం (వజ్రం) తో రేఖ గీస్తే ఈ నది ఏర్పడిందట: రత్నంతో చీరింది కనక రత్నచిరా అయిందట!


ఊళ్ళ పేర్లలో 'సూరంగు' (పు. 289) ను 'సోరా' అని సరిచేశారు మిశ్ర. కాని వీరాస్వామి తెలుగులో రాసిన 'సూరంగు' ను 'సురం' అని ఒడియా తర్జుమా చేశారు; సరి కాదు.

(10-6-31 తేదీ) "ఉదయాత్పూర్వము $3\frac{1}{2}$ గంటలకు లేచి యిక్కడికి అయిదు కోసుల దూరములో నుండే బస్తా అనే వూరు పది గంటలకు చేరినాను." (పు. 284-85). అన్న వీరాస్వామి వాక్యం శ్రీ మిశ్ర వొడియాలో వూరి పేరు 'బస్తా' వొదిలేసి "పది మైళ్ళ దూరంలో వున్న 'ఒకచోటి' కి బయలుదేరి,

---

* ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార పౌరసంబంధ శాఖ నిర్వహిస్తున్న "ఆంధ్రప్రదేశ్" పత్రికలాగే ఒరిస్సా ప్రభుత్వం ప్రచురిస్తున్న పత్రిక "ఉత్కల ప్రసంగ."

** ఇందులో తెలిపిన పుటలు కాశీయాత్ర చరిత్ర మిత్రులు శ్రీ దిగవల్లి వెంకట శివరావుగారి తృతీయ ముద్రణ లోవి.



అక్కడికి పదిగంటల సమయానికి చేరాము" అని తప్పు తర్జుమా చేశారు పైగా ఫుట్‌నోట్ 1 లో "చోటు పేరు వీరాస్వామి రాయలేదు. దాని పేరు 'బస్తా' అని వ్యాఖ్యానించారు. ఎందుకిలా పొరపాటు చేశారో తెలీదు. వీరాస్వామి రాయకపోతే బస్తా అని శ్రీ మిశ్రకు ఎలా తెలిసిదో మనకు తెలీదు.

"మేదినీపురం జిల్లా సువర్ణరేఖ నదితో అంత్యమది అది మొదలుగా బాలేశ్వరపు జిల్లా వోఢ్ర దేశము ఆరంభించి వస్తూ వున్నది." అని వీరాస్వామి (పు. 287).

ఇక్కడ వ్యాఖ్యానిస్తూ శ్రీ మిశ్ర ఇలా రాశారు. "వీరాస్వామి మేదినీపురం మీదుగా రాలేదు. అప్పుడు మేదినీపురం ఒడిశా దేశంలోనే వుండేది. కాని రాజ నైతికంగా ఒడిశా డివిజన్ బాలేశ్వరం నుంచి ఆరంభమవుతూ వుండేది. వీరాస్వామి బహుశా ఒడిశా డివిజనే ఒడిశా దేశమని భావించి వుంటారు".

"ఓఢ్ర భాష అక్షరములు తెనుగుకు సరిబోలుతున్నవి. (పు 287). అని వీరాస్వామి రాసిన దానిని వ్యాఖ్యానిస్తూ శ్రీ మిశ్ర "తాటాకుల మీద గంటంతో వ్రాయడంవల్ల తెలుగు, ఒడియా అక్షరాలలో గుండ్రదనం ఏర్పడింది" అని రాశారు. నిజానికి పై కారణంగానే తెలుగు లిపి మూలంగా ఒడియా లిపి గుండ్రదనం కుదుర్చుకుంది.

"వైతరిణీ నది వద్ద వుండే నాభిగయావళీలు కలకత్తా వద్దికి అహంపూర్వ మహంపూర్వమని యెదురుగా వచ్చినారు. (పు. 289, 290) అన్న వీరాస్వామి రాతకు శ్రీ మిశ్ర "వైతరిణీ నది నుంచి కలకత్తా మధ్య వుండే గయవాలీలు పరస్పరం పోటీపడి [యాత్రికులను] లాగడం పీకడం చేస్తారు. అని ఒడియా అనువాదం చేశారు. అనువాదం అంతంతగా వుంది. తెలుగులో 'నాభిగయాళీలు' అంటే ఒడియాలో 'నాభి' పదం వొదిలేసి పైగా పాదటీకలో ఇలా వ్యాఖ్యానించారు.

"ఈ క్షేత్రం నామాంతరం నాభిగయ కావడంచేత వీరాస్వామి ఇక్కడి పండాలను గయా పండాలన్నారు" అని రాశారు. వీరాస్వామి గయా పండాలనలేదు. నాభిగయా పండాలనే అన్నా ఆ క్షేత్రం నాభిగయ అనీ ఆయనకి తెలుసు. అందుకనే ఆయన నాభిగయ అనే రాశాడు. (పు. 290)

శ్రీ మిశ్ర అనువాదం వీరాస్వామి తెలుగుకి అక్కడక్కడ తప్పింది. బహుశా కేవలం ఆంగ్లానువాదం మీద ఆధారపడడమే దీనికి కారణం కావచ్చు.


ఎందరో
మహానుభావులు
అందరికీ
వందనాలు



తెనుగు జాతి గర్వించ దగిన
అనేక మంది మహనీయుల
త్యాగాల ఫలితంగా......
1956 నవంబరు 1వ తేదీన
ఆంధ్రప్రదేశ్ అవతరణతో
తెలుగు ప్రజల చిరకాల
వాంఛ సిద్ధించింది.



“ఆంధ్రరత్న”



డా॥ పట్టాభి




“దేశభక్త”




గాడిచర్ల



"ఆంధ్ర పితామహ"




భార్గవ




రామానందతీర్థ



ఆంధ్ర, తెలంగాణా, రాయలసీమ
వేర్వేరు ప్రాంతాలు కావు, ఆంధ్ర
ప్రదేశ్ అంతా ఒకే రాష్ట్రం.
తెలుగు ప్రజలందరూ అన్నదమ్ములు.



ఆంధ్రప్రదేశ్
మహోన్నత
సంస్కృతి, సంప్రదాయ
సంకేతాలు



1956

రెండు దశాబ్దాలలో

ఆంధ్ర ప్రదేశ్

అప్రతిహత

పురోగమనం

1976



వీరేశలింగం



గురజాడ

సంస్కృతి మహోద్యమసారథులు



గిడుగు



విక్రమదేవవర్మ

సంస్కృతి మహోద్యమ సారథులు



గిడుగు సీతాపతి



కట్టమంచి



రఘుపతి వెంకటరత్నం



ముట్నూరి



రాధాకృష్ణన్




"విశ్వదాత"

★



"అమరజీవి"



కల్లూరి

ఇంకా
ఎందరో మహానుభావులు
అందరికీ వందనాలు



అల్లూరి సీతారామరాజు

అధికార భాషగా తెలుగు

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య

భారతదేశంలో వడచిన స్వాతంత్ర్యోద్యమంలో ఇరువదవ శతాబ్దం మొదటి పది సంవత్సరాలలో భాషోద్యమానికి ఆంధ్రావని లోని ప్రజలు వైతాళికులైనట్లే, భారత స్వాతంత్ర్యానంతర భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణ సాధనలోనూ ప్రథములు అయినారు.


భాషాధారక రాష్ట్రాలు స్వాతంత్ర్యానికి, జాతీయతకు ప్రాతి పదిక అంటూ ప్రథమంగా పరిపాలన ప్రజలభాషలో జరుగవలెనని విద్యాబోధన మాతృభాషలో నేర్పబడవలెనని ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. 1913లో బాపట్లలో ప్రథమ ఆంధ్ర మహాసభ జరిగింది. శ్రీ దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులుగారు ప్రథమ ఆంధ్ర మహాసభలో పరిపాలన, విద్యాబోధన మాతృభాషలో జరిగితేను. పరభాషలో జరిగితేను, తల్లి చనుబాలతో పెరిగిన బిడ్డకు, పోతపాలతో పెరిగిన బిడ్డకు ఉన్నంత తేడా ఉంటుందని ఘంటాపథంగా నుడివారు. ఆంధ్రోద్యమం జాతీయోద్యమానికి పునాది అయింది.

ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ పరిపాలనను, బోధనను, తమ మాతృభాషలో సాగించవలెననడం సహజం. ఈ సహజ వాంఛతోనే భాషారాష్ట్ర ఉద్యమాలు సాగింపబడినవి. ఆంధ్రోద్యమ ఆశయాలలో ఒకటిగా ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం 1926 లో యేర్పడినప్పుడు ఆశాసనంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు శాసనం 4 (3) సెక్షనులో తెలుగులో బోధన, పరీక్షలు తమ ఆశయమని నిర్దేశించడం ఇందుకు నిదర్శనం. ఆశయంగా శాసనంలో నిర్దేశించడమే జరిగిందికాని అమలు జరుపడం మాత్రం జరుగలేదు.

1950 భారత రిపబ్లిక్ అవతరణ అనంతరం శ్రీ అమరజీవి పొట్టి శ్రీరాములు బలిదాన ఫలితంగా కర్నూలు రాజధానిగా, ఆంధ్రరాష్ట్రం 1953 అక్టోబరు 1వ తేదీన ఏర్పడింది. నేను ప్రతిపాదించిన "రాజ్యాంగ నిబంధనలకు అసంగతంగా లేనంతవరకు ప్రభుత్వ వ్యవహారాలను తెలుగులోనే నిర్వహించాలనే తీర్మానం" శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి "సాధ్యమైనంత త్వరలో" అనే సవరణతో 1955 సెప్టెంబరు 29వ తేదీన ఏకగ్రీవంగా ఆమోదింపబడింది.

ప్రారంభ చర్యలు

1946 ప్రాంతంలో యేర్పడిన మద్రాసు కాంగ్రెస్ మంత్రివర్గం ఆంధ్ర జిల్లాలలో తూర్పుగోదావరి జిల్లాలో, తమిళనాడులో, తంజావూర్ జిల్లాలో, విద్యాబోధన జిల్లాస్థాయివరకు మాతృభాషలోనే నిర్వహించవలెనని ఆంధ్ర కేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు ప్రభుత్వం ఆదేశించింది. అమలు జరపడానికి ప్రయత్నించింది. అదే తెలంగాణా ప్రాంతంలోని ఖమ్మం, నల్లగొండ,



అమరజీవి పొట్టి శ్రీరాములు

వరంగల్లు, కరీంనగర్ జిల్లాలలో తెలుగు తాలూకాస్థాయిలో నడపవలెనని శ్రీ బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా వున్న ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతలో విశాలాంధ్రను సాధించడం

జరిగింది. నైజాం నిరంకుశ పాలనక్రింద ఉర్దూభాష రుద్దబడిన ఆంధ్ర ప్రజానీకం. నైజాం ఆంధ్ర మహాసభ అధ్వర్యాన శ్రీమాడపాటి హనుమంతరావు నాయకత్వాన ఆంధ్ర భాషాభివృద్ధికి, ఆంధ్ర ప్రజల సముజ్జీవనానికి, ఆంధ్రోద్యమం నడపింది.

విశాలాంధ్ర ఏర్పడగానే ప్రథమ కర్తవ్యంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలుగును అన్ని స్థాయిలలో అటు అధికార భాషగా చేసి ఉండినట్లయితే విశాలాంధ్ర సాధించినందుకు నిజమైన సార్థకత ఉండేది.

''దేశభాషలందు తెలుగులెస్స" అనే ఖ్యాతిగాంచి, ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా విశ్వవిఖ్యాతి గణించి, సాంకేతిక పరిజ్ఞానం ఇంగ్లీషు, ఫ్రెంచిభాషలకన్న మిన్నగా సమన్వయింపగలిగినది తెలుగు అని ప్రొఫెసర్ హాల్డేన్‌చే గుర్తింపబడి, 5 కోట్ల ప్రజలు గలిగి భారత దేశంలో రెండవభాషగా గణుతికెక్కిన తెలుగు ఈ నాటికీ పరిపాలనలో, బోధనలో సముచిత స్థానం పొందకపోవడం మన దురదృష్టం. భాషా ఉద్యమాల్లో, కర్ణాటక, మహారాష్ట్రలకన్న ముందే ప్రారంభించాం. అమలులో అందరికన్నాం వెనుక ఉన్నాం.

అయితే ఆంధ్ర ప్రదేశ్ శాసనసభ సభాపతిగా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారు ఎన్నిక అయిన తర్వాత శాసనసభ తరఫున ప్రముఖులతో ఉపసంఘాలు నియమించి ఒక బృహత్తరమైన ''తెలుగు పారిభాషిక పదకోశం" తయారు చేయించి ప్రకటించారు. తెలుగును అధికార భాషగా అమలుజరపటానికి ప్రాతిపదిక వేశారు.

ఇతర రాష్ట్రాలలో......

అప్పటికే మనదేశంలో పదిరాజ్యాల్లో (రాష్ట్రాలలో) ప్రాంతీయ మాతృ భాషలను అధికార భాషలుగా నిర్ణయిస్తూ శాసనాలు చేయబడినవి. బీహారులో 1950లో హిందీ అధికారభాషా శాసనం చేయడం జరిగింది. పూర్వపు మధ్యభారత్‌లో కూడా మధ్యభారత్ అధికార భాషా చట్టం ద్వారా హిందీని అధికార భాషగా నిర్ణయంచేస్తూ శాసనం చేయడం జరిగింది. తర్వాత 1957లో మధ్యభారత్ (నేటి మధ్యప్రదేశ్ రాజ్యంలో) అధికార భాషా చట్టం ద్వారా హిందీని అధికార భాషగా చేయడం జరిగింది. ఒరిస్సా రాష్ట్రంలో ఒడియాను అధికార భాషగా చేస్తూ 1954లో ఒరిస్సా అధికార భాషాచట్టం చేయబడింది. ఉత్తర ప్రదేశ్ 1950 లో ఉత్తర ప్రదేశ్ అధికార భాషా (బిల్లులు-ఆక్టులు) ఆక్టుల ద్వారా హిందీని అధికారభాషగా చేయడం జరిగింది. 1952 లో హిమాచల్ ప్రదేశ్ భాషా (బిల్లులు-చట్టాలు) శాసనం ద్వారా హిందీ అధికార భాషగా హిమాచల్ ప్రదేశ్‌లో చేయబడింది. రాజస్థాన్ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరగక ముందే హిందీని అధికార భాషగా చేస్తూ ప్రకటించడం జరిగింది. ఉమ్మడి బొంబాయి రాష్ట్రంలో గుజరాత్ ప్రాంతంలో గుజరాతీ, మహారాష్ట్ర ప్రాంతంలో మహారాష్ట్ర అధికారభాషగా నిర్ణయిస్తూ ఆ మేరకు బిల్లు రూపొందించబడింది. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలను వేరు చేసిన తర్వాత గుజరాత్ రాష్ట్రంలో గుజరాతీని, మహారాష్ట్రంలో మహారాష్ట్రను అధికారభాషగా నిర్ణయిస్తూ 1960 లో శాసనం చేయడం జరిగింది. అప్పటికే గుజరాత్‌లో భాగంగా మిళితం అయిపోయిన సౌరాష్ట్రంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ జరగకముందే సౌరాష్ట్ర ప్రత్యేక రాజప్రముఖ పాలిత రాష్ట్రంగా వున్నప్పుడే గుజరాతీని అధికార భాషగా చేస్తూ ప్రత్యేక శాసనం ఛేయడం జరిగింది. పూర్వ పంజాబు రాష్ట్రంలో హిందీ మాటాడే ప్రాంతాలలో హిందీ పంజాబీ భాష మాట్లాడే ప్రాంతాలలో పంజాబీ అధికార భాషలుగా చేయబడినవి. దరిమిలా దానిని (అర్డినెన్సును) 1960 లో చట్టం కూడా చేయడం జరిగింది. అస్సాములో అస్సామీ భాషను అధికార భాష చేస్తూ 1960లో అస్సాం అధికార భాషా చట్టం శాసనరూపం దాల్చింది. అందులో పరిపాలనా కార్యాల కోసం కచారు జిల్లాలో బెంగాలీ భాషకూడ ఉపయోగింపబడుతుందని పేర్కొనబడింది. ఇప్పటి తమిళనాడు (ఆనాటి మద్రాసు) రాష్ట్రంలో తమిళమును అధికారభాషగాచేస్తూ 1956లో మద్రాసు అధికారభాషా చట్టం చేయడం జరిగింది. ఆ చట్టం 1957 జనవరి 19వ తేదీన గవర్నరు ఆమోదం పొంది శాసనం అయింది. కేరళ రాష్ట్రంలో మలయాళాన్ని అధికార భాషగా అమలు జరిపేందుకు ఒక కమిటీని వేశారు. వారి నివేదిక ననుసరించి మలయాళాన్ని అధికారభాషగా అమలు జరుపుటకు తగు ఏర్పాట్లు చేశారు.

ఈ పోకడలు దేశంలో ఒకవైపు ఇట్లు జరుగుతుంటే నేను అటు కర్నూలులోను, తర్వాత హైదరాబాదులోను ఆంధ్రప్రదేశ్ శాసనసభలో తెలుగును అధికారభాషగా శాసనంచేయుటకు బిల్లురూపంలోను తీర్మానాల రూపంలోను దాదాపు తొమ్మిది పర్యాయాలు అదేపనిగా ఉపపాదించుచూ వచ్చాను. చివరకు 1964 డిసెంబరు 7 వ తేదీ ఆంధ్రప్రదేశ్ గెజెట్‌లో ప్రకటన కాగలిగింది.

ప్రజాభిప్రాయం తర్వాత ఈ బిల్లు సెలక్టు కమిటీకి పంపబడింది. సెలక్టు కమిటీ స్థాయిలో ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఆనాడు విద్యామంత్రి అధికార భాషశాఖను చూస్తున్న శ్రీ పి.వి. నరసింహారావు, బిల్లు సమూలంగా చర్చ జరిగిన తర్వాత అనధికార బిల్లు బదులు అధికార బిల్లు తేదలచామని ఈ అనధికార బిల్లును ఉపసంహరించుకోవలసిందిగా ప్రతిపాదన చేశారు. అనధికార బిల్లు వుండవలెనని పట్టుదల లేదని, అధికార భాషగా శాసనం కావడమే ప్రధానమని, ప్రభుత్వం బిల్లు శాసన సభలో ప్రతిపాదించటానికి ముసాయిదా అందజేసిన మరుక్షణం ఉపసంహరించటానికి తనకు అభ్యంతరం లేదని కాని, ఏ బిల్లూ లేకుండాపోయేస్థితిలో బిల్లును ఉపసంహరింపజాలనని చెప్పినపుడు వెంటనే ప్రభుత్వం తమ బిల్లుకు నోటీసు యివ్వడం, బిల్లు ముసాయిదా ప్రతిపాదించడం శాసనసభ 1966 మార్చి 27నను, శాసన పరిషత్తు 1966 ఏప్రిల్ 1వ తేదీనను అంగీకరించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా శాసనం 1966 మే 14 వ తేదీ ఆంధ్రప్రదేశ్ గెజిటులో ప్రకటించబడటంతో శాసన రూపం దాల్చింది. 1966లో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా శాసనం చేయబడింది.

ఆంధ్రప్రదేశ్ అధికార భాషాశాసనం

ఈ శాసనంలో ఆంధ్రప్రదేశ్ అన్ని ప్రాంతాలకు ఆనాటి నుండి అధికార భాషగా తెలుగును నిర్ణయించడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పుడప్పుడు ఆంధ్రప్రదేశ్ గెజిటులో ప్రకటన ద్వారా తెలుగుభాషను ఆ ప్రకటనలో నిర్దిష్టపరుపబడిన ప్రభుత్వ అధికార కార్యకలాపాలకు నిర్ణయింపబడిన తేదీనుండిఉపయోగించవచ్చునని ఆదేశింపవచ్చును. శాసన మండలిలోనూ ఏ సభలోనైనా ప్రవేశపెట్టబడు బిల్లులు గవర్నరు జారీచేయు ఆర్డినెన్సులు రాష్ట్ర శాసనం క్రిందగానీ పార్లమెంటు శాసనం క్రిందగానీ రాష్ట్రప్రభుత్వంగాని, అధికార వర్గాలనుంచిగాని జారీ చేసే ఉత్తర్వులు (జీవోలు) నియమాలు, రెగ్యులేషన్లు, నిబంధనలు ఉపనిబంధనలలో ఉపయోగించు భాష ప్రభుత్వం గెజెటులో నిర్ణయించిన తేదీనుండి తెలుగుభాష అయి వుండాలి అయితే యిచట పూర్వం ఆంగ్లభాష ఏయే అధికార భాష కార్యకలాపాలకు వాడుతున్నారో అది కొనసాగుతుంది. శాసన మండలిలో వ్యవహార నిర్వహణ ఆంగ్లంలో జరగవచ్చు.

ఈ చట్టపు ప్రారంభం నుండి అయిదు సంవత్సరాలు గడిచిన మీదట రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వుద్వారా ఒక అనధికార భాషా సంఘం (కమీషను) ఏర్పాటు చేయాలి. అందులో ఒక అధ్యక్షుడు, నలుగురు ఇతర సభ్యులు వుంటారు. వారిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. కమిషను రాజ్యాధికార కార్యక్రమాలకు తెలుగు భాషను ఉపయోగించడంలో సాధించిన ప్రగతిని సమీక్షించి, ఈ క్రింది వాటిని గురించి రాష్ట్రప్రభుత్వానికి సిఫారసు చేయాలి. (ఎ) రాష్ట్రాధికార కార్యాలయాల్లో తెలుగుభాషను క్రమానుగతికంగా వుపయోగించడం (బి) రాజ్యాధికార కార్యాలన్నిటికివి లేదా అందు వేటికైనా ఆంగ్లభాషను ఉపయోగించడంలో నిర్బంధాలు, (సి) తెలుగుభాషోపయోగానికి సంబంధించి. రాష్ట్రప్రభుత్వం ఏవైనా ఆదేశించివుంటే వాటిని గురించి ఒక నివేదిక రాష్ట్రప్రభుత్వానికి అందజేయాలి ఆ నివేదిక ప్రభుత్వం శాసనమండలి సమక్షాన ఉంచాలి. ఆ నివేదికపై రాష్ట్రప్రభుత్వం అంతటికిగాని లేక అందలి కొన్ని భాగాలకుగాని, అనుగుణంగా ఆదేశాలు జారీ చేయవచ్చును.

కేంద్ర రాష్ట్రప్రభుత్వాల శాసనాలు, ఆర్డినెన్సులు నిబంధనలు వగైరాల తెలుగు అనువాదాలు రాష్ట్రప్రభుత్వం నిర్దేశించిన తేదీన గవర్నరు అధికారం క్రింద గెజిటులో ప్రకటింపబడడంతో అధికారపూర్వక పాఠాలుగా భావింపబడాలి. శాసన మండలిలో తెలుగు అధికార భాషగా నిర్ణయించిన తర్వాత ప్రతిపాదింపబడే ప్రతి బిల్లు తెలుగు ప్రతితోబాటు ఇంగ్లీషు ప్రతి అందించాలి.

తెలుగు భాషకు ఆదనంగా ఉర్దూ, మరాటి, కన్నడం, అరవం, ఒరియా లేక యితర భాషలను కూడ ఆయా అల్పసంఖ్యాక భాషల ప్రయోజనానికై నిర్దిష్ట ప్రాంతాలలో, మాటా దేవారి సంఖ్యనుబట్టి వారి నిర్దిష్ట కార్యాలకు నిర్దిష్ట కాలం వరకు ఉపయోగించాలని ఆదేశింపవచ్చు.

ఈ శాసనం అమలుకు వచ్చిన తరువాత తెలుగుభాషను అధికార భాషగా అనువర్తింపజేస్తూ ప్రభుత్వం ప్రకటన చేసింది. తాలూకా స్థాయి వరకు ఈ క్రింది శాఖలలో తెలుగును అధికార భాషగా అమలుజరుపవలెనని ఆదేశించింది.

1. వ్యవసాయశాఖ; 2 పశు సంవర్ధనశాఖ ; 3. చీఫ్ ఇంజనీర్ (భవనములు, రోడ్లు) ; 4. వాణిజ్యపన్నులశాఖ ; 5. సహకారశాఖ ; 6. విద్యాశాఖ ; 7. అబ్కారీశాఖ : 8. మత్స్యశాఖ ; 9. అటవీశాఖ ; 10. దేవాదాయ ధర్మాదాయశాఖ ; 11. భారతీయ వైద్యశాఖ ; 12. కార్మికశాఖ ; 13, పురపాలకశాఖ ; 14. పంచాయతీరాజ్ శాఖ ; 15. పోలీసుశాఖ ; 16 కారాగారశాఖ ; 17. పౌర కట్టడాలశాఖ (పబ్లిక్ వర్క్సుశాఖ) ; 18. పౌర గ్రంథాలయశాఖ 19. రిజిస్ట్రేషన్ స్టాంపులశాఖ; 20. రెవిన్యూశాఖ 21. ట్రజరి అకౌంట్సుశాఖ ; 22. గిడ్డంగులశాఖ ; 23. తూనికలు, కొలతల శాఖ;24. సెటిల్ మెంట్-సర్వేశాఖలు; 25. అగ్నిమాపక దళశాఖ; 26. రేవులశాఖ; 27. స్త్రీసంక్షేమశాఖ.

ప్రభుత్వసాధారణ పరిపాలనాశాఖ 25-5-67 న జారీచేసిన నెం. 464 జి.వో.లో తెలుగుతోబాటు అదనంగా ఉర్దు, ఒరియా తమిళం, కన్నడం, మరాటీ భాషలను కూడా యేయే కార్యక్రమాలకు ఉపయోగించవలెనో నిర్దేశించారు. జి.వో. 541 జి.ఎ.డి 29-6-1970 న జారీచేసిన దానిలో పబ్లికు సర్వీస్ కమీషను పరీక్షలలో గ్రూపు 3 కు చెందిన అభ్యర్థులు ఇంగ్లీషుతోబాటు తెలుగులో కూడా జవాబులు (ఒక్క ఇంగ్లీషు భాషలో ప్రశ్నలకు మినహా) వ్రాయవచ్చునని ఆదేశించారు. జి.ఓ. 1870 విద్యాశాఖ 2-12-71 ద్వారా విద్యాశాఖలోని ఉద్యోగాలలోకి స్కూల్ ఫయినల్ ఇంటర్ మిడియేటు, బి ఏ. తరగతులలో తెలుగు బోధన భాషగా చదివిన వారికి మాత్రమే అర్హత వుంటుందని ప్రకటించారు.

సమీక్షా సంఘం

1966 లో భాషా చట్టం శాసనం అయిన తర్వాత అప్పటికి అమలులోవున్న జి.ఓ.లు గాని, శాసనం అయిన తర్వాత జారీచేసిన ఆర్డరుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యాలయాలలో తాలూకా స్థాయిలో తెలుగు అధికార భాషగా అధికారులు ఎంతవరకు అమలు జరుపుతున్నారో సమీక్ష చేసి ప్రభుత్వానికి నివేదించుటకు శ్రీ పి.వి. నరసింహారావు (ఆనాటి విద్యామంత్రి) అధ్యక్షులుగా సర్వశ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, తులాబందుల నాగేశ్వరరావు, టి. రంగారెడ్డి, సలావుద్దీన్ ఒవైసీ (వీరు శాసన సభ సభ్యులు), శ్రీ చెంగల్ రెడ్డి, యన్. సోమయాజులు (వీరు కౌన్సిలు సభ్యులు), శ్రీ యస్ ఆర్. రామమూర్తి, ఐ.ఎ.ఎస్., (విద్యాశాఖ కార్యదర్శి), శ్రీ వై. శ్రీనివాసరావు (ప్రభుత్వ అనువాదకుడు) సభ్యులుగా 10-11-67న ప్రభుత్వం ఒక సంఘాన్ని నియమించింది. ఈ సంఘం తమ నివేదికను 1970లో ప్రభుత్వానికి సమర్పించింది.

అప్పటికి తెలుగు అమలుజరుపబడుతున్న తాలూకాస్థాయిలో మాత్రమేకాక, జిల్లాస్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ వెంటనే అమలు జరిపే ప్రయత్నం సాగించవలెనని, శాసన మండలికి కూడా వర్తింపచేయవలెనని, ముద్రాలేఖినుల (టైపురైటరులు) అధికంగా తయారు చేయించి అన్ని ఆఫీసులకు అందించవలెనని లినో టైపుకూడా అమర్చి ముద్రణ సౌకర్యం పెంచవలెనని, తెలుగు రాని సిబ్బందికి తగు శిక్షణ అవకాశాలు కలిగించవలెనని ప్రభుత్వ ఉద్యోగాలలో పబ్లికు సర్వీసు కమిషన్ నిర్వహిస్తున్న పరీక్షలలో 1, 2, 3, గ్రూపులలో తెలుగుభాషకు అవకాశం ఇవ్వవలెనని, తెలుగు బోధనా భాషగా చదివినవారికి ఉద్యోగాలలో ప్రాధాన్యం యిస్తూ అవకాశాలు కలిగించవలెనని, అధికార భాష నిర్వహణకు సాధారణ పరిపాలనశాఖలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయవలెనని, పై అధికారులు ఆయా కార్యాలయాలు తనిఖీ చేసినప్పుడు అధికార భాష విషయము కూడపరిశీలన చేసేందుకు నిర్దేశించవలెనని, జిల్లాలో అధికారభాష సమీక్షించేందుకు, అనువాదాలలోను సాంకేతిక విషయాలలోను కలెక్టరుకు సహాయపడేందుకు జిల్లాలో ఒక కేంద్రీయ సంస్థ వుండాలని, ఉర్దు, తమిళం, కన్నడం, మరాటీ మున్నగు అల్ప సంఖ్యాక భాషలకు తగు రక్షణ కల్పించవలెన శాసనంలో ఉదహరించిన అధికార భాషా కమిషన్ను యేర్పాటు చేయవలెనని ఈ సమీక్షా సంఘం తమ నివేదికలో సూచించింది.

తాలూకా స్థాయిలో

1973లో శ్రీ జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా యేర్పడిన ప్రస్తుత మంత్రివర్గము తాలూకా, అంతకన్నా క్రిందిస్థాయిలో వున్న అన్ని కార్యాలయాలలోను విధిగా తెలుగును అధికారభాషగా అమలు జరుపుటకు నిశ్చయించింది. ప్రజలలో ఆందుకు తగిన ఉత్సాహం కలిగించుటకు ఆనంద సంవత్సరాదినాడు విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు కార్యవర్గాధ్యక్షులుగా అఖిల భారత తెలుగు సాంస్కృతికోత్సవాలు నిర్వహించారు. దీనితోబాటు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షుడుగా శ్రీ యం. శ్రీనివాసులురెడ్డి, యం. యల్ ఏ. శ్రీమతి టి. యన్. అనసూయమ్మ, యం. యల్. ఏ., శ్రీ వి. పి. రాఘవాచారి యం. యల్. సి. శ్రీ తులాబందుల నాగేశ్వరరావులు సభ్యులుగా అధికారభాషా సంఘం (కమిషను) ను నియమించారు. ఉగాది నుండి పని సాగించడం జరిగింది.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషను అజమాయిషీలో జరుగుతున్న గ్రూపు 1, గ్రూపు 2, మరియు గ్రూపు 3 పోటీ పరీక్షలలో ఇంగ్లీషు మాత్రమే వుంటున్నదనీ, దానిని మార్చవలెనని, గ్రూపు 3 వారికి జి. వో. జి.ఎ.డి. 29-6-70 లో నిర్దేశించిన విధంగా గ్రూపు 1, గ్రూపు 2 సర్వీసులను నిర్వహించే పోటీ పరీక్షలలో ఇంగ్లీషు వ్యాసరచన మినహా మిగతా అన్ని పరీక్షా పత్రాలు అభ్యర్థులు వారివారి బోధనాభాష తెలుగు అయినా కాకపోయినాదానితో సంబంధము లేకుండా ఐచ్ఛికంగా తెలుగులోనే వ్రాయడాన్ని అనువర్తింపజేయాలని సిఫార్సు చేసింది. గ్రూపు 1 మరియు 2 తరగతులకు కూడా అనువర్తింపచేస్తూ జి వో.77, జి.ఎ.డి., 20-1-72 జారీ చేశారు. తెలుగు బోధనాభాషగా చదివిన విద్యార్థులకు ఉద్యోగావకాశాలలో కొంత ప్రాధాన్యతయిచ్చే విషయం మంత్రిమండలి నిర్ణయించి పబ్లిక్ సర్వీసుకమీషనుకు పంపింది.

ఇంతవరకు ఉత్తరప్రదేశ్, బీహారు, పశ్చిమ బెంగాలు, ఒరిస్సా, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, అస్సాం, హరియానా, జమ్మూకాశ్మీరు, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు తమతమ భాషలను అధికార భాషలుగా నిర్వహిస్తున్నాయి.

తెలుగు అధికారభాషగా చేయబడిన వెంటనే 1. తెలుగు భాషను ఆధునీకరణ చేయుటకు, 2. తెలుగు బోధనా భాషగా విశ్వవిద్యాలయాలలో అమలుజరుపుటకు అవసరమైన పాఠ్య పుస్తకాలు అనువదించి ప్రకటించుటలో అన్ని ప్రయత్నాలు చేయుటకు 3. వీలైనంత త్వరలో తెలుగు పరిపాలనా భాషగా అమలు జరుపుటలో ప్రభుత్వంతో సహకరించి నిర్వహించుటకు తెలుగుభాషకు ప్రాంతీయ భాషా సంస్థ నొకదానిని నిర్మాణం చేయుటకు అనువగు సూచనలు చేయుటకు శ్రీ పి. ఎల్. గ్విన్, ఐ సి యస్ అధ్యక్షులుగా 1966 డిసెంబరు 28 వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక కమిటీని వేసింది. ఆ కమిటీ వివిధ సమస్యలు పరిశీలనచేసి ఒక నివేదికను అందించింది. అందులో తెలుగురాని ప్రభుత్వ సిబ్బందికి తెలుగు బోధన తరగతులు నడపవలెనని, తెలుగుభాష అభివృద్ధికి ఒక సంస్థ యేర్పరచవలెనన్నారు. తాలూకా, జిల్లా స్థాయిలలోనే గాక ఆటుతర్వాత రాష్ట్రస్థాయిలో కూడా తెలుగును అధికార భాషగా అమలు జరుపుటలో యేమీ ప్రతిబంధకాలులేవని, అయితే ఆందుకు కావలసిన వాటిని ముందే క్రమపద్ధతి ప్రకారం యేర్పాటు చేసుకోవాలని అన్నారు. ఇందులో యేర్పడబోవు పరిశోధనా శాఖ ఇపుడు స్థానిక పరిపాలనలో, ఇతర పరిపాలనా విభాగాలలో తెలుగు వాడబడుతున్నవిధం పరిశీలనచేసి ఇప్పటికి స్థిరత్వం పొందిన పదాల జాబితాలనుండి ప్రామాణిక పదజాలం తయారుచేసి ప్రభుత్వానికి అధికారభాష అమలు జరుపుటలో సహాయం చేయవలెనని సిఫార్సు చేశారు. ఈ అన్ని పనులు నిర్వహించుటకు ప్రభుత్వం తెలుగు అకాడమీని స్థాపించింది. కేంద్ర ప్రభుత్వం ఈ తెలుగు అకాడమీ చేసే కార్యకలాపాలకు ఒక కోటి రూపాయలు విరాళంగా యిచ్చింది.

ఆంధ్రప్రదేశ్ అధికారాభాషా శాసనం వచ్చిన సమయంలోనే బోధనాభాషగా తెలుగులో ఇంటర్ మీడియట్ ప్రారంభించడం ఆటుపై బి.ఎ., బి.కాం, బి.యస్సి. లలో కూడా తెలుగు బోధనా భాషగా చేయడం జరిగింది. విద్యావిషయికంగా భారత దేశంలో విద్యావిధానాన్ని సమూలంగా పరిశీలనచేసి కొఠారి కమీషను తన నివేదికను భారత ప్రభుత్వానికి సమర్పించింది. దానిననుసరించి కేంద్రప్రభుత్వం తమ జాతీయ విద్యావిధానాన్ని నిర్వచిస్తూ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, కళాశాలా, ఆచార్య స్థాయిలలో కూడా మాతృభాషను బోధనా భాషగా నిర్దేశించడం జరిగింది.

బోధనాభాషగా మాతృభాషలను అమలు జరుపుటలో కొఠారి కమీషను విద్యావిషయికచర్చలకు వచ్చినప్పటికే ఇంటర్ మీడియట్ ప్రారంభించవలెననీ; అందు బోధనాభాషగా తెలుగు అమలు జరుపవలెనని ప్రథమంగా నిశ్చయించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మే. 1974 వ సంవత్సరంలో కళాశాల స్థాయికూడా పూర్తి అయింది. విద్యాశాఖాధికారులు, విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులు అందరూ కలిసి 1965లో పట్టభద్రానంతర తరగతులలో కూడా తెలుగునే బోధనా భాషగా అమలుజరుపాలని నిర్ణయించారు.

బోధనాభాష తెలుగులోనే సాగించడమే కాకుండా తెలుగు బోధనాభాషగా చదివిన వారికి రాష్ట్రప్రభుత్వ ఉద్యోగాల ప్రాధాన్యత చూపకుండా తెలుగు అధికారభాషగా అమలు జరుగుట ఏవిధంగా సాధ్య మౌతుంది? ఆంధ్రప్రదేశ్ లో 5 సంవత్సరాల నుండి ఇంటర్, బి.ఏ లలో తెలుగు బోధనాభాషగా సాగింది. ఈ సంవత్సరం ఇంగ్లీషు బోధనాభాషగా అమలుజరుపుటకు ప్రభుత్వ కళాశాలలో కన్నా ప్రైవేటుకళాశాలల్లో అనుమతి విచ్చలవిడిగా ఇచ్చారు. 5 సంవత్సరాల నుండి బోధనాభాషగా చదివిన అభ్యర్థులకు ఉద్యోగాలలో ప్రధాన్యం ఇస్తామకపోతే లాభంలేదు.

ప్రాథమిక, ఉన్నత పాఠశాలా స్థాయివరకూ తెలుగు బోధనా భాషగా యెటూ అమలు జరుగుతూనే వున్నది ఇక ఇంటర్ మీడియట్. బి.ఏ. బి.కాం., బి.యస్‌సి. డిగ్రీ పరీక్షలలో తెలుగులోకి శాస్త్రగ్రంథాలు అనువదించడం, అందించడంలో తెలుగు అకాడమీ పని ప్రశంసనీయంగా వున్నదనక తప్పదు.

భాష—పరిభాష

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1965 ఆగస్టు 20వ తేదీ విద్యాశాఖ జి. వో. 2265 ద్వారా శ్రీ ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి అధ్యక్షతన ఒక సంఘం నియమించి, జాతీయం చేయబడిన పాఠశాలా పాఠ్య పుస్తకాల శిష్టవ్యవహారికం యేవిధంగా వాడవలెనో నిర్దేశించవలసిందిగా కోరారు. ఆ సంఘమువారు భాషేతర పాఠాలను రెండవ భాషా పాఠాలను మొదట శిష్టవ్యవహారికంగా వాడవలసిందిగా చేసిన సూచనలను 1967 ఫిబ్రవరి 25వ తేదీన ప్రభుత్వం అంగీకరిస్తూ మెమోద్వారా జారీచేసింది. ఈ సిఫారసుల మేరకు విద్యాశాఖ వారు భాషా పాఠాలలో సరళ గ్రాంథికం, ఇతర పాఠ్య పుస్తకాలలో శిష్టవ్యవహారికం వాడుతున్నారు. తెలుగు అకాడమీ వారు తమ పుస్తకాలలో శిష్టవ్యవహారికాని కొంత రూపకల్పన చేశారు. శ్రీ యస్.ఆర్. రామమూర్తి అధ్యక్షతన 1973 లో నియమింపబడిన ప్రభుత్వ జాతీయ గ్రంథాల కమిటీ కూడా ఈ పై విధానాన్ని ధృవపరిచింది.

పి. హెచ్. డి. కి సమర్పించు పరిశోధనా వ్యాసాలు వ్యవహారిక భాషలో వ్రాయవచ్చని సిఫారసుచేస్తూ శ్రీ పురిపండ అప్పలస్వామి 1971 నవంబరు 1న ఆంధ్ర విశ్వకళా పరిషత్ అకడమిక్ కౌన్సిలలో ప్రతిపాదించగా ఆ తీర్మానం అంగీకరించడం, శ్రీ యం. ఆర్. అప్పారావు అధ్యక్షులుగా ఒక సంఘాన్ని నియమించడం జరిగింది. ఆ సంఘం వ్యవహారిక భాషను



ఆచార్య పింగళి

కళాశాలల్లో ఉపయోగించవలెనని సిఫారసు చేస్తూ 1973 మే 5న నివేదిక సమర్పించింది. ఈ నివేదికను గుంటూరులో జరిగిన సెనేటు సమావేశంలో ఆంధ్ర విశ్వకళా పరిషత్తు అంగీకరించింది.

ప్రభుత్వ వ్యవహారాలలో శిష్టవ్యవహారికం అనేది కాకుండా సామాన్యజన భాషలో వ్యవహరించవలసి వుంటుంది. భావం ప్రస్ఫుటంగా వ్యక్తం కావడం పరిపాలనలో ఉన్న అవసరం. నిర్ద్వందంగా వుండడం మరింత అవసరం. ప్రజలకు సులభంగా బోధపడడం ప్రధాన ధ్యేయం. వీటిని సంతృప్తిపరిచే విధంగా వుండే భాషలో వ్యవహారం జరగాలి.

తెలుగు టైపురైటర్లు, సంక్షిప్త లిపి

అధికారభాష మందకొడిగా అమలుజరపడానికి సాకుగా టైపు మిషనులు లేకపోవడం చూపుతారు. ఇది సాకుగా తప్పించుకోవటానికి తమకున్న అలవాటునుండి అధిగమించలేక చెబుతున్న ఈ వాదనలో కొంత యధార్థం లేకపోలేదు. అందువల్ల టైపురైటర్ల తయారీ, సరఫరాలను దశలవారీ పద్ధతి ప్రకారం యేర్పాటు చేయాలి. అయితే ఇప్పటికివున్న టైపురైటర్లు అన్నీ కలిసి 400 కన్నా లేవు. 1974–75 లలో 1975-76 లలోనూ చెరి 500 మిషన్లు కొనుటకు 15 లక్షల చొప్పున మంజూరు చేయబడింది. కాని 80 కన్నా ఇప్పటికి లభ్యమయ్యేటట్లు లేదు. అందుచేత ఈ మొత్తం కాల దోషం పట్టకుండా ముందు సంవత్సరంలో కొనుటకు అట్లే వుంచారు. అయితే ఇవి అన్ని మిషన్లు అన్ని ఆఫీసులకూ లభించేంతవరకూ ఆగకుండా వాటితోనైనా పని సాగించవలసింది. ఇట్లు వాటితో పనిసాగిస్తూ టయిపు మిషన్లకై కృషిసాగించాలి. టైపురైటర్ల విషయంలో త్వరత్వరగా చేయుట

కున్న. లిపి యింతకన్నా అందంగా వుండుటకుగాను కృషి సలపవలసి వుంది. దీనితోపాటు సంక్షిప్తలిపి శిక్షణ కార్యక్రమం, సంక్షిప్తలిపిని ఆధునీకరణ చేయవలసి వుంది.


లినోటయిపు మిషన్లు కొనాలి. ఈ విషయంగా 1966 నుండి కృషి సాగింది. లినోటయిపు కీబోర్డు తయారీ, మేగజైనుల విషయంలోనూ వివరాలు లినోటయిపు కంపెనీతో 1971 లో సంప్రదింపులు జరిగినవి. ఈ కీబోర్డు మేగజయినుల విషయంలో ఇండోనిప్పన్ కంపెనీ వారి సహకారంతో మాట్రిక్సుల ప్రతిరూపం నమూనాలు తయారుచేయడం, వాటిని బొంబాయిలో ప్రదర్శించడం జరిగింది. కంపెనీవారు మిషన్ ఖరీదు రెండు లక్షలు అవుతుందని ఎనిమిది మిషన్లు ఆర్డరు యిస్తే చేస్తాం అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమ కేంద్ర ముద్రణాలయం తరపున నాలుగు మిషనులు తెలుగు అకాడమీ తరపున నాలుగు మిషనులు కొంటామని నిర్ణయించారు.

కనుక ఆ క్రొత్తవి తెలుగు, ఇంగ్లీషు, రెండు భాషలకు ఉపయోగ పడే విధంగా తయారు చేసుకోవచ్చు. ఆ విధమయిన మిషను అమర్చు కొనగలిగేట్లు ప్రభుత్వం వెంటనే ఆర్డర్లు యివ్వవలసివుంది. లినో టయిపు లేకుండా తెలుగు ముద్రణలో ప్రగతి సాధించడం తేలిక కాదు. అందుకు అవసరమైన పరిశోధన శాఖను గవర్నమెంటు ప్రెస్‌లో అధికార భాషా కమీషను అజమాయిషీ క్రింద 1975 మార్చి 17న ఏర్పాటు చేయడమైనది. తెలుగు లినో టయిపు రానిదే తెలుగు భాష ముద్రణ సులభసాధ్యం కాజాలదు.

ఇప్పుడు కేంద్ర ముద్రణాలయం తరపున కొనుటకు వచ్చిన నాలుగు మిషన్లు ఆధారంగా మాట్రిక్సులను తయారుచేయించి పాతబడి పోయిన ఇంగ్లీషు మిషనులకు బదులు క్రొత్తవి కొని తీరవలసి వుంది కావున, ఆ కొనే మిషనులు తెలుగు, ఇంగ్లీషు రెండు భాషలకూ ఉపయోగపడే యేర్పాటు చేసుకుంటూ యింకా నాలుగు మిషన్లకుకూడా ఆర్డరు కంపెనీకి యిచ్చి పనిలో ముందుకు పోవచ్చు.

అన్ని ఉద్యమాలలో, అన్ని త్యాగాలలో మాతృ దేశాభిమానంతో ముందుండి నాయకత్వంవహించినట్లే భాషా ఉద్యమంలో బోధనా భాషగా, పాలనా భాషగాకూడా తెలుగును అమలు జరుపుటలో ముందుండి ఆంధ్రప్రదేశ్ పేరులోనేగాక, పాలనలో బోధనలోకూడా తెలుగుభాషను అమలుజరుపుతూ "దేశభాషలందు తెలుగు లెస్స" అని రుజువుచేద్దాం.

ఆంధ్రప్రదేశ్ పశు సంవర్ధన శాఖామాత్యులు శ్రీ యస్. వెంకట్రామారెడ్డి అస్తమయం



ఆంధ్ర ప్రదేశ్ పశు సంవర్ధన శాఖామాత్యులు శ్రీ యస్. వెంకట్రామారెడ్డి అక్టోబరు 14 వ తేదీన హైదరాబాదులో మరణించారు.

శ్రీ యస్. వెంకట్రామారెడ్డి. హైదరాబాదు జిల్లా మేడ్చల్ తాలూకా గౌడవల్లి గ్రామంలో 1931 జనవరి 15 న రైతు కుటుంబంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులయినారు. విద్యార్థిగా విద్యార్థి సంఘ సమావేశాలలో ప్రముఖ పాత్ర వహించారు. 1947 లో ఆయన రాజకీయాలలో ప్రవేశించి నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారు. 1954 లో జాతీయ విద్యార్థి సంఘం కన్వీనరుగా పని చేశారు.

మేడ్చల్ పంచాయతీ సమితి అధ్యక్షులుగా ఆయన వున్న కాలంలో హైదరాబాదు జిల్లా మేడ్చల్ సమితి ఉత్తమ పంచాయతీ సమితిగా ఎన్నికైంది.

శ్రీ వెంకట్రామారెడ్డిగారికి సహకార ఉద్యమంతో కూడా సన్నిహిత సంబంధం వుంది. ఆయన 1968 నుండి 1974 వరకు హైదరాబాదు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం అధ్యక్ష పదవిని నిర్వహించారు. 1967-69 మధ్య కాలంలో నైవేలి లిగ్నైట్ సహకార సంస్థ డైరెక్టర్ల బోర్డులో సభ్యులుగాను, 1968 లో హిందూస్థాన్ జింక్ సంస్థ సభ్యులుగాను వ్యవహరించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యులుగా కూడా వ్యవహరించారు. కాంగ్రెసు సంస్థలో అనేక ముఖ్య పదవులను నిర్వహించారు 1952 నుండి 5 సంవత్సరాల పాటు హైద్రాబాదు జిల్లా కాంగ్రెసు సంఘం కార్యదర్శిగా వున్నారు.

నగరంలో



రాష్ట్రపతి దంపతులు

రాష్ట్రపతి డాక్టర్ ఫకృద్దీన్ ఆలీ అహమ్మద్ సపరివారంగా ఢిల్లీనుంచి ఆగష్టు 29 న వచ్చి రాష్ట్రపతి నిలయంలో 17 రోజుల పాటు మకాం చేశారు. నగరంలోను, ఇతరత్రాను వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆగష్టు 31 న ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమ మండలుల సమాఖ్య వజ్రోత్సవ సంవత్సరం కార్యక్రమాన్ని రాష్ట్రపతి ప్రారంభిస్తూ, వాణిజ్య పారిశ్రామికవేత్తలు ప్రజా సామాన్యం ప్రాథమికావసరాలకు అగ్ర ప్రాధాన్యమివ్వాలని హితవు చెప్పారు. సెప్టెంబరు 1 వతేదీన అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజి కంప్యూటర్, లైబ్రరీ భవనాలకు ప్రారంభోత్సవం జరుపుతూ, ప్రజల అవసరాలను గమనించి, అందుకు అనుగుణంగా అంకితమై పనిచేసే సమర్థులైన అధికారులు తగినంతమంది అవసరమని సూచించారు. సెప్టెంబర్ 4 వ తేదీన శ్రీమతి లక్ష్మీరఘురామయ్యా సన్మాన సభకు అధ్యక్షత వహించారు. భారతీయ మహిళాలోకాన్ని త్వరత్వరగా విద్యా సంపన్నం చేయవలసిన బాధ్యత అందరికీ ఉన్నదని శ్రీమతి లక్ష్మీరఘురామయ్యను ఆదర్శంగా గ్రహించి మహిళలు భారతీయ మహిళల అభ్యున్నతికై కృషి చేయాలని ఆయన సూచించారు. సెప్టెంబర్ 5 వ తేదీన జరిగిన ఉపాధ్యాయ దినోత్సవానికి

తిరుమల రామచంద్ర

రాష్ట్రపతి ఒక సందేశమిచ్చారు. దానిలో ఉపాధ్యాయులు నిర్వహించవలసిన బాధ్యత గురుతరమయినదని, వారు తమ విధులను దీక్షతో నిర్వహించాలని కోరారు. సెప్టెంబర్ 6 వ తేదీన రాష్ట్రపతి ఫొటోగ్రఫీపై శ్రీ మెహ్రా వ్రాసిన ఆంగ్ల గ్రంథాన్ని ఆవిష్కరిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ ఫొటోగ్రఫీ అకాడెమిని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నదని అన్నారు. ఫొటోగ్రఫీ కళను అభివృద్ధి చేయడంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న కృషికి హర్షం ప్రకటించారు. సెప్టెంబర్ 7 వ తేదీన మహబూబ్‌నగర్‌లో వక్ఫ్ భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. 8వ తేదీన దోమల్‌గూడాలోని రాష్ట్రస్కౌట్లు, గైడ్ల ప్రధాన కార్యాలయం ఆవరణలో జరిగిన బాలభటుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ స్కౌట్ ఉద్యమంద్వారా సహకారం, స్వయంపోషకత్వం, కఠోర పరిశ్రమ, జాతీయ దృక్పథం అలవరచుకోవాలని ఉద్బోధించారు. ఆ నాడే గుజరాతీ సేవా మండలి సమావేశంలో ప్రసంగిస్తూ జంట నగరాల అభివృద్ధికి గుజరాతీలు చేసిన అపార సేవను పొగిడారు.

సెప్టెంబర్ 9న రాష్ట్రపతి ఉర్దూ అకాడమిలో ప్రసంగిస్తూ ఉర్దూ పరదేశ భాష అని ప్రజలలో వ్యాపించిన దురభిప్రాయాన్ని తొలగించవలసిందని కోరారు. సెప్టెంబర్ 10వ తేదీన ఖిల్వత్ భవనంలో ఇస్లామిక్ సంస్కృతి కేంద్రానికి రాష్ట్రపతి ప్రారంభోత్సవం చేస్తూ, ఇస్లాం మతం సర్వమానవ సమానత్వాన్ని, సౌభ్రాత్రాన్ని బోధిసుందనే విషయాన్ని అందరూ గుర్తించాలని ఉద్బోధించారు. సెప్టెంబర్ 11 వ తేదీన గుంటూరులో నాగార్జున విశ్వవిద్యాలయానికి ప్రారంభోత్సవం జరిపి, 14 వ తేదీన బాలల అకాడెమీకి ప్రారంభోత్సవం చేశారు. బాల బాలికలు జాతికి అపూర్వ సంపద అని వారి సర్వతోముఖ వికాసం పట్ల శ్రద్ధ తీసుకున్నప్పుడే దేశాన్ని సుసంపన్నం చేయగలమని అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో నడుస్తున్నదని రాష్ట్రపతి ప్రశంసించారు. సెప్టెంబర్ 15వ తేదీన రాష్ట్రపతి సపరివారంగా ఢిల్లీకి బయలుదేరారు.

విదేశాలలోని తెలుగువారికి సహాయం

విద్యాశాఖా మంత్రి శ్రీ మండలి వేంకట కృష్ణారావు లండన్‌లోని విదేశాంధ్ర ప్రచురణ సంస్థ ప్రచురించిన శ్రీ పురిపండా అప్పలస్వామి "పులిపంజా" గేయ సంపుటిని సెప్టెంబర్ 1 వ తేదీన కళాభవన్‌లో ఆవిష్కరిస్తూ, విదేశాలలోని తెలుగువారు తమ సాహిత్య సంస్కృతులను రక్షించుకొనడానికి అన్ని విధాల ప్రోత్సాహమివ్వాలని అన్నారు. ఆగస్టు చివరి వారంలో మారిషస్‌లో జరిగిన ప్రపంచ హిందీ మహాసభ ద్వితీయ సమావేశానికి వెళ్ళివచ్చిన తమ అనుభవాలను ఆయన వివరిస్తూ, మారిషస్ తెలుగువారికి, విదేశాలలోని ఇతరులకు తెలుగు పాఠ్య గ్రంథాలను, తదితర తెలుగు పుస్తకాలను ముద్రించుకొనడానికి తగిన సౌకర్యాలు కలిగించారన్నారు.

సమావేశానికి ఆంధ్ర విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ శ్రీ ఎం. ఆర్. అప్పారావు అధ్యక్షత వహించారు. డాక్టర్ రాయప్రోలు సుబ్బారావు, డాక్టర్ నార్ల వెంకటేశ్వరరావు ప్రసంగించారు. డాక్టర్ పురిపండా అప్పలస్వామి తమ కవితోద్దేశం వివరించిన మీదట, విదేశాంధ్ర ప్రచురణ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ గూటాల కృష్ణమూర్తి సంస్థ లక్ష్యాలు విశదీకరించారు.

స్వాతంత్ర్య యోధుడు నరేంద్రజీ

పూర్వపు హైదరాబాదు రాష్ట్రంలో నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజోద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన మహానాయకులలో ఒకరు. ఆర్య సమాజ్ ప్రముఖ నాయకులు పండిత నరేంద్రజీ సెప్టెంబర్ 24 వ తేదీన ఉస్మానియా ఆస్పత్రిలో మరణించారు. ఆయన వయస్సు 69 సంవత్సరాలు. నరేంద్రజీ గడచిన మే నెల 14 వ తేదీన సన్యాసాశ్రమ స్వీకారం చేసి, స్వామి సోమానంద అని ఆశ్రమ నామధేయం పెట్టుకున్నారు. నరేంద్రజీ 1907 ఏప్రిల్ 10 వ తేదీన జన్మించారు. తండ్రిపేరు కేశవ ప్రసాద్ సక్సేన. 1931లో దేశసేవలో దిగారు. 1936లో ఆర్యసమాజ్ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1938లో సత్యాగ్రహం చేసినందున నిజాం ప్రభుత్వం మన్ననూరులో "కాలాపానీ" శిక్ష విధించింది. మూడేళ్ళపాటు శిక్ష అనుభవించి విడుదలయి 1942లో రాష్ట్ర ఆర్య ప్రతినిధి సభ కార్యదర్శి అయ్యారు. 1944 లో అంతర్జాతీయ ఆర్యన్ లీగ్ ఉపాధ్యక్షులుగా వున్నారు. ఆ సంవత్సరమే కాంగ్రెస్‌లో చేరారు. 1945 లో సత్యాగ్రహంలో పాల్గొని సంవత్సరం కారావాస శిక్ష అనుభవించారు. 1946 లో నగర కాంగ్రెస్ కార్యదర్శి అయ్యారు. 1947 మరల శిక్షపొంది, పోలీసు చర్యల తర్వాత విడుదలయ్యారు. 1952 నుంచి రెండేళ్ళు హైదరాబాదు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా వున్నారు. మొదటి సాధారణ ఎన్నికలలో హైదరాబాదు శాసన సభకు ఎన్నికయ్యారు. 1953 లో నానల్ నగర్ కాంగ్రెస్ మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షులుగా వున్నారు. ఆయన అంతిమ యాత్రలో లక్షలాది ప్రజలు పాల్గొన్నారు. గవర్నర్ శ్రీ భండారే, ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, ఇతర మంత్రులు, లక్షలాది పౌరులు జోహారు లొనర్చారు.

తెలుగు మాగాణం

శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి

ఖ్యాతినీ చాటేటి
జ్యోతినీ వెలిగించి
పాడరా తెలుగోడ !
నీ జాతి జయగీతి.

సస్య ప్రపూర్ణమై
సహజ భాగ్యాలతో
సతతమూ అలరారు
స్వర్గసీమర నీది

దేశసేవా దివ్య
దీక్షలో మునిగిన
త్యాగమూర్తుల కన్న
యాగభూమిర నీది

సౌవర్ణ వర్ణాల
సౌందర్య రాసులూ
క్షితిపైన విరజిమ్ము
శిల్పదేశము నీది

శతఘంట కవనాన
జగతి నుర్రూగించు
విద్వత్కవీంద్రులూ
విలసిల్లు భువినీది


ఖడ్గంబు చేబూని
కదన భూమికి దూకి
పగబజీల్చిన యట్టి
మగువ లుండిన సీమ

విజ్ఞాన సంస్కృతీ
విద్యల వెదజల్లు
దివ్య స్థలంబు నీ
తెలుగు మాగాణమ్ము

విమల యశులగన్న
వీరమాతయె నిన్ను
కన్న దన్నది గర్వ
కారణమా నీకు

నీ తల్లి ఘనకీర్తి
నిలుపంగ సలుపరా
నిస్వార్థ సేవని
క్షిప్రముగ తెలుగోడ ! ॥ఖ్యాతి॥

పేరిణి శివతాండవం



భరత కళాప్రపూర్ణ శ్రీ నటరాజ రామకృష్ణ

కాకతీయులనాటి నృత్యకళా వైభవము 'పేరిణి.' వేయి సంవత్సరాల క్రిందట తెనుగు నృత్యకళావేత్తలు, ఆచార్యులు నర్తకులు, శిల్పులు, కవులు, శాస్త్రవేత్తలు, ప్రతిభావంతముగా రూపొందించి, భారతీయ నృత్యకళకు అర్పించిన అమూల్య నృత్తరత్నము 'ప్రేరణ'-కాకతీయుల కాలము తెనుగు నృత్య శిల్ప కళలకు స్వర్ణ యుగము. కాకతి గణపతిదేవ- రుద్రమదేవి, ప్రతాపరుద్ర మహారాజుల ఆదరణలో ఆంధ్ర నృత్య కళావేత్తలు అనేక అపూర్వ నృత్యాలను సృష్టిజేసి, ప్రచారంలోనికి దెచ్చి, భారత దేశ కళాకారులకు ఆదర్శవంతులైనారు.

కాకతి గణపతిదేవుని బావమరిది, గజసేనాపతి, జాయపసేనాని సైన్యాధిపతియేగాక ప్రసిద్ధ నాట్యకళావేత్త. నాట్యశాస్త్ర రచయిత. అతడు కొండయామాత్యుని శిష్యుడు జాయప రచించిన నాట్య శాస్త్రము నృత్యరత్నావళిలో ఆకాలంలో వెలిసిన ప్రసిద్ధ నర్తనము లెన్నింటినో పేర్కొన్నాడు. జాయప నృత్యరత్నావళి గాక, గీత రత్నావళి, వాద్యరత్నావళి అను మరిరెండు శాస్త్రరచనలు చేసినాడు. కాని ఆ రెండు కాల గర్భంలో కలిసిపోయినవి.

జాయపసేనాపతి పేర్కొనిన 'దేశి' నర్తనములన్నింటిలో "పేరిణి" ముఖ్యమైనది. వీర రసప్రాధాన్యత గల్గి, పురుషులచే చేయబడే అతి కష్టతరమైన నర్తనము "పేరిణి శివతాండవము" ఈ నర్తనము శివపరమై ఆ కాలంలో వీరులు, మహేశులు, పశుపతులు, మైలారు దేవులనే తెగల వారిచే ప్రత్యేకంగా శివుని ప్రేరణగా చేయబడేది. అందువల్లనే 'ప్రేరణి' తాండవము 'పేరిణి' తాండవమని పిలువబడింది. ఈ నర్తనం కేవలం ఆరాధన, వినోద పరంగాగాక కాకతీయ సైనికులు "హర హర మహాదేవ" యని యుద్ధ భూమికేగునప్పుడు, ఆ వీరులకు వీరావేశము కలిగించుటకు చేయబడిన 'శుద్ధ వీర' నాట్యము, ఈ నర్తనము చాలా కష్టతరమైన, జతి, గతి యతి, ఛందోరీతి, బంధ రచనా విధానములతో కూడియుండి, పురుషులలో వీరత్వమును, శరీర సౌష్టవమును, పెంపొందించురీతిని వృద్ధి జెందినది.

ఆంధ్ర దేశము నందేగాక, భారత దేశమంతటా 'శుద్ధ వీరము' ను ప్రధాన రసముగా, స్థాయిగా గల్గి రూపొందిన నర్తన విశేష మిదొక్కటియే గన్పించుచున్నది.

భారతీయ నృత్య కళ లాస్యము, తాండవమని రెండు విధ ములుగ అనాదినుండి రూపొందించబడి, ప్రచారములోనికి వచ్చినది.

సుందర సుకుమార కోమల కరణాంగ హారములు గల్గి, కౌశికీ వృత్తిప్రాధాన్యత, శృంగార రస వికాసం గల్గి నట్టిది, లాస్యము. ఉద్ధత గంభీర భావ వికాసము కరణాంగ హార విన్యాసములు గల్గి నట్టిది తాండవము.

ఆంధ్రులు ప్రధానంగా కౌశికీ వృత్తి ప్రియులైనప్పటికీ ఈ రెండు రీతులను సంపూర్ణ వికాసముతో ప్రచారములోనికి తెచ్చిన వారు భారత దేశమంతటిలో ఆంధ్ర కళాకారులొక్కరే కన్పట్టు చున్నారు.

ఉదా:- కేరళ దేశంలో కథాకళి నర్తనము, తాండవ రీతిగా అత్యున్నత స్థాయిలో రూపొందినను, స్త్రీలచే చేయబడే "మోహిని ఆట్టము" -అంతటి ఉన్నతస్థితిలో పోషింప బడలేదు.

తమిళనాడులో స్త్రీలచే చేయబడే 'భరత నాట్యము' ఒక అపూర్వ కళా ఖండమైననూ, పురుషులచే ప్రదర్శింపబడే భాగ వతమేళ కళారీతి అదే స్థాయికి జెందలేదు.

అదేవిధముగా భారత దేశమంతటా ఎదో ఒక కళారీతి, పురుషుల తాండవ రీతి, సంపూర్ణంగా రూపొందినది, గాని- ఈ రెండు కళారీతులు ఒకే స్థాయిలో అభివృద్ధిగాంచినట్లు తోచదు.

ఆంధ్రులు మాత్రము- స్త్రీల శుద్ధ లాస్య రీతి, పురుషుల శుద్ధ తాండవ రీతి నర్తనములనేగాక -నాట్యమేళములను గూడా ప్రసిద్ధ కళా సంప్రదాయములుగా రూపొందించినారు. ఇది ఆంధ్రు లెంతో గర్వించదగిన విశేషము.

'పేరిణి'- వీరమును స్థాయిగా గల్గి రూపొందిన తాండవ రీతి- ధృత, జలద్ లయలందు గూడ జతులు ప్రదర్శింపబడి చూప రులకు ఉత్సాహాన్ని కల్గించే నృత్య విశేషము.

పేరిణి గూర్చి నందికేశుడు తన భరతార్ణవములో వివరంగా చర్చించియున్నాడు. ఈ నందికేశుడు ఆంధ్రుడని పండితుల అభిప్రాయము.



రామప్ప ఆలయంలో పేరిణి శివ తాండవ
నృత్యం చేస్తున్న విద్యార్థులు

నందికేశుని తరువాత దేశి తాండవ రీతుల గూర్చి, ఆ నర్తనములను కూర్చే విధము గూర్చి జాయ సేనాపతి నృత్తరత్నావళిలో వివరంగా చర్చించి యున్నారు—అంతేగాక పేరిణి యందు ప్రదర్శించవలసిన జతులు, తహానములు, యతుల గూర్చి గీత రత్నావళిలో తెల్పియున్నాడట —దురదృష్టవశాతు ఆ గ్రంథము లభ్యముకాలేదు.

వీర శైవము, పశుపతి సాంప్రదాయం ఆంధ్రలో విజయ విహారం చేసినప్పుడు నర్తకులు ప్రత్యేకంగా శివ సంబంధ గీతములను మాత్రము నాట్యమాడే వారు. వీర శైవము, వీరవైష్ణవ మతస్థుల మధ్య సఖ్యతను కూర్చుటకు పాటుపడిన ప్రముఖులు పల్నాటి సీమకు జెందిన బ్రహ్మనాయుడు, నెల్లూరు మండలానికి చెందిన తిక్కన్న. వీరిరువురు, హరి హర సంప్రదాయము దేశములో ప్రజల్లో ప్రచార మగుటకు కారకులైనారు. ఈ సాంప్రదాయంలో శివ కేశవులు ఒక్కటిగా పూజింపబడిరి. ఆ సమయంలో ' పేరిణి ' యందు, శివ పరము విష్ణు పరమునకు చెందిన రచనలు గానము చేయబడి నర్తన మాడబడినవి. పల్నాటి సీమలో మాచర్ల చెన్నకేశ్వర స్వామి ఆలయంలోనూ, ఆ ఆలయ ప్రాంగణంలోనే వెలిసిన వీరభద్రుని ఆలయమందును - విష్ణు, శివ పరంగా ఈ నృత్యకేళిక జరిగేది. కాకతీయులచే నిర్మింపబడిన ఆలయములందు మాత్రము - మూల విరాట్టుకెదురుగా నిర్మితమైన "బలి పీఠము" పై - స్త్రీ కళావేత్తల ఆరాధన నృత్యములేగాక, పేరిణి గూడ ప్రత్యేకంగా ప్రదర్శింపబడేది. ఆ కాలంలో పేరిణి నర నములో సుమారు అరువది వరకూ వాయిద్యకులు పాల్గొనే వారు.

పేరిణి ఝర్ఝరము, విషమ, కవివారక, గీత, వికట లేక భావాశ్రయము అను ఐదు అంగములను కల్గియున్నది.

ఝర్ఝరమనగా —నర్తకుడు ప్రారంభములో, పలు రకములైన పాద విన్యాసములతో గజ్జెలను ధ్వనింప జేయుట.

పట వాట, పటవ, లకాడిమ, సిరిచిర, కులుహుల, హులబిద (అలగ పాట) అను ఆరు విధముల పాద భేదములు యిందుండును.

విషయములో -ఇరువది రకములైన భ్రమణనర్తనము అర్ధనారీశ్వర నర్తనము ముఖ్యముగా ప్రదర్శింపబడును.

కవివారకములో —శృంగనర్తనము

గీతములో —దశవిధ శివ లీలలు, నవరస అంగహారనర్తనం లేక గంగావతరణము ప్రదర్శింపబడును.

వికట, లేక భావాశ్రయమందు శివ పంచశబ్దములు- ఏక దశ రుద్ర నర్తనములు ప్రదర్శించి ముగింపబడును.

పేరిణి యందు ప్రాచీన కాలంలో ఉపయోగించిన వాయిద్యములు—

మద్దెల, మహా మద్దెల, నంది మద్దెల, శుద్ధ మద్దెల రుంజ, భేరి, శృంగ భేరి, నగారా, టక్కు, టమార, సూర్య మండలం, చంద్ర మండలం, పంచముఖవాద్యం, త్రిముఖ వాయిద్యం, పంబలు, పూల బాకా, ముఖ వీణ, కంచు పెద్ద తాళములు, ధవళ శంఖు, అలుగోజా, చిన్న తాళములు, గంటలు. యిత్యాది వాయిద్యముల సమ్మేళనము ఈ నర్తనములో వుండేది.

ఇందలి మృదంగ వాయిద్యము ప్రాచీన ధృపద సంప్రదాయానికి చెందినట్టిది. ఈ వాయిద్య విధానం తెలిసిన వారు ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో కొందరు మాత్రం మిగిలి యున్నారు. అందు శ్రీ ధూపం సూర్యలింగం గారు ప్రముఖులు.

పేరిణి ఆట క్రమము

ఆది ' నాట ' అంత్య ' సురట ' అను సంప్రదాయమునుసరించి- పేరిణి నాటరాగంలో ప్రారంభించబడి ' సురట రాగం ' తో ముగియును. ప్రారంభంలో సమగతి విన్యాసము, ఆది తాళంలో జతులు ఆడబడును.

' అంబర ' విన్యాసము, నాట రాగములో ప్రారంభమగును

అంబర మనగా ఫ్లూటు, ముఖవీణ మొదలైన గాలి వాయిద్యాలపై రాగము ఆలాపము చేయుట.

అటుపై ఆయిత్తము ప్రదర్శితమగును. ఆయిత్తములో ఆదే రాగమును లయలో సమగతిలో ప్రస్తారము చేయుదురు. అంబరము, ఆయిత్తము ముగిసిన పిదప మార్దంగికుల —చాచ్ఛుత్పుట,

చచ్చత్పుట తాళములందు కొంత ప్రస్తరించి తీర్మానములు పరికింతురు. అటుపై-పృధ్వి, ఆప, తేజ, వాయు, ఆకాశలింగ స్వరూపుడైన శివుని స్తోత్రము చేయుదురు. ఆ స్తోత్రము శ్లోక రూపములో గానము చేయబడి ముగింపులో (2+3)=5 అక్షరముల గతిగల్గిన కురుజంపెలో పాటగా పాడబడును—అటుపై మేళప్రాప్తి, అడ్డిత విన్యాసముండును.

అటుపై నర్తకులు ధ్రువ, ఆట, మఠ్యాధి సప్త తాళము లందు తీర్మానముల వాడుటతో నర్తనము ప్రారంభమగును. ఈ తీర్మానములు ముగిసిన పిదప 'పుష్పాంజలి' ప్రదర్శన జరుగును.

పుష్పాంజలి రెండు విధములు—స్త్రీలు ప్రదర్శించే క్రమములో నర్తకి పుష్పములను దోసిలిగొని సమస్థానములో నిల్చి, బొట్టి కలు పఠించి పిదప దేవతలకు ఆ పుష్పములను సమర్పించును. ఇది మొదటి విధానము

శుద్ధ పుష్పాంజలి—అట్లుగాక నర్తకుడు అరువుల క్రమములో హస్త విన్యాసముల ద్వారా, పుష్పాంజలి—సమర్పణ గావించును. పేరిణిలో ఈ రెండవక్రమం అనుసరించబడును

ఈ నర్తనానికి వాయించే మృదంగజతిరీతికి 'తహన' క్రమ మని పేరు—ఇది సమగతి యందుండవలెను పుష్పాంజలి తరువాత ఝర్ఝరము,(పటవాటము, పటవముమొదలైనవి) లో యతి నాట్యము ప్రదర్శించబడును. ఇందు ముఖ్యంగా ప్రదర్శింపబడే యతులు—

సమయతి, విషమయతి, డమరుకయతి, మృదంగయతి, పిపీలకయతి —

ఈ యతులందు పాటవ అక్షరముల కూర్పు. ఛందో బద్ధమై యుండును—

యతినాట్యము తరువాత—మహాసేన కవుతం, వినాయక కవుతం, దేవి కవుతం, శివకైవార నృత్యములు ప్రదర్శించిన తరువాత, తీర్మానింతురు. పేరిణి నర్తనమందలి తీర్మాన కట్టుబాటు సాధారణంగా నృత్యములో కొన్ని మృదంగ శబ్దములు జేర్చి, మూడు సార్లు వాయించిన వాటికి నృత్తమాడి ముగించుట ఆచారము. పేరిణిలో ప్రతి తీరిక ఐదుసార్లు ప్రదర్శించుట ఆచారము. దానిని బట్టియే సాధారణ భరతనాట్య తీర్మాన హస్తములకు, పేరిణి హస్త విన్యాసాలకు తేడా కనపట్టుచున్నది. ఇంతటితో ఝర్ఝరము ముగియును.

ఝర్ఝరములో వచ్చే పాద విన్యాసముల ననుసరించియే పేరిణి యంతయూ కూర్చబడి యున్నది.

పిదప—విషమ నర్తనము ప్రదర్శిత మగును.

పేరిణి అంతటిలో బహు కష్టతరమైనట్టిది ఈ విషమ నర్తనము —ఇందులో:

దక్షిణ, వామ, సమ, భుజంగ, లతా, లీలా, విద్యుత, చక్ర, ఛత్ర, కుంచిత, అంగ, తిరప యిత్యాది. 25 భ్రమణములు నర్తన నుండవలెను. ఒక్కొక్క భ్రమణము ఐదేసి విన్యాసముల గల్గి—ఈ భ్రమర నర్తనము మొత్తం 125 వలయాకార విన్యాసములతో కూడియుండును. మరియు యిందు భుజంగ, ఛత్ర, ఖడ్గ పద్మ యిత్యాది బంధ రచనా విధానము చేర్చి ప్రదర్శింప వలసి యుండును—అంతేగాక హరిణ, సింహ, మత్తేభాది గతి ప్రస్తార ముండును. ఇన్నింటినీ చేర్చి ఏకధాటిగా 125 భ్రమణములలో నర్తకుడు ప్రదర్శించవలసి వుండును. వాయిద్యములుకూడా ఒక జతిని 25 పర్యాయములు ధృతలయలో వాయించవలెను. ఇందు ఏ ఒక్క అక్షరము కాలము పోయినా నృత్తమాడుట అసంభవము—అందుకే పేరిణి నర్తకులు-ఈ నృత్తమును దీర్ఘ కాలము సాధన జేయుదురు. ఇందు మరీ క్లిష్టమైన పద్ధతి సమ, విషమ గతుల ప్రస్తారము చేయుచూ ఒక్కొక్క భ్రమణమునాడుట ।—

భ్రమణ లేక భ్రమర నర్తనం ముగిసిన పిదప అర్ధ నారీశ్వర నర్తన మాడబడును—

శివుని సగ భాగము పార్వతి, దక్షిణ భాగము శివరూపము; వామ భాగము పార్వతి రూపము—గనుక అర్ధనారీశ్వర నర్తనములో కుడి భాగముతో ఆడినప్పుడు తాండవరీతి, ఎడమ భాగముతో ఆడినప్పుడు లాస్యపద్ధతి ఆడుట ఆచారము. కాని యిందట్లు గాదు—పార్వతి తాను తాండవమును ఉత్తమంగా ప్రదర్శించెదనని, శివుడు తాను లాస్యమును చక్కగా పోషించ గలనని యిద్దరూ పోటీ పడినట్లు, శివ భంగిమలందు లాస్యమును, పార్వతి భంగిమ లందు తాండవమును పోషిస్తూ నృత్యమాడుదురు. ఇది చాల కష్టమైన పద్ధతి—ఆఖరికి యిరువురు లాస్య తాండవముల్లో సమానులని తృప్తిజెంది తీర్మానింతురు.

ఈ రెండు భాగములూ ముఖ్యంగా విషమమందు ప్రదర్శింపబడును. గనుకనే ఈ అంగమునకు విషమమని పేరు వచ్చినది.

మూడవ భాగము కవి వాచకము—ఇందు శృంగ నర్తనము ప్రదర్శింపబడును— ఇది అతి మనోహరమైన శివ భంగిమలతో కూడిన ధ్రుపద నర్తనము.

శృంగ నర్తనమనగా నేమి?

పూర్వము వసంతోత్సవ సమయంలో ఒక నాటి సాయంత్రము, పార్వతి పరమశివుని మనోహరమైన అతని తాండవ నర్తనము చూడవలెనని కోరెనట. అంతట శివుడు అస్తమిస్తున్న అరుణకిరణకాంతిలో పార్వతి ప్రీతి కొరకు మనోహరముగా నర్తనమాడెనట—కైలాస శృంగముపై ఆడుటచే ఆ నర్తనమునకు శృంగనర్తనమని పేరు వచ్చినది—ఈ నర్తనము 9 విధములు—9 భంగిమలు గల్గి అందుల కనువైనట్టి స్థానక, రేచక, కరణ, గతి విన్యాసములతో కూడియున్నది. ఈ శృంగనర్తన భంగిమలు రామప్ప దేవాలయములో చెక్కబడివున్నవి. శృంగ నర్తనములో శివతాండ వచనముకూడికతో ధ్రుపదగీతము గానము చేయబడును. ఆ గానముయొక్క గమకము ననుసరించి కూర్చబడిన జతులకు తాండవ కేళిక సలుపుదురు. ఈ తొమ్మిది భంగి

మల్లో ఆఖరిది– ఊర్ధ్వ తాండవము. ఇందులో ' నికుంభిత్ ' కరణము ప్రదర్శింపబడును. ప్రస్తుత కాలంలో ఈ నర్తనము అరుదుగా ఆడుతున్నారు. శివరాత్రి రోజున, లింగోద్భవకాలమందు ఈ నికుంభిత కరణమును ప్రాచీనులు ఆడుట ఆచారముగా వుండినది. అందు పంచముఖ వాయిద్యము విధిగా వాయించెడివారు.

ఈ నర్తనమునకు ' పేరిణి ' అని పేరెట్లు వచ్చినది ? ప్రారంభంలో శివుని ప్రేరణ చేయుచూ నర్తకులు మేళ ప్రాప్తి చేయుదురు గనుక 'ప్రేరణ' లేక ' పేరిణి ' అని యీ నర్తనము పిలువబడుచున్నది.

' ఓ నర్తనమూర్తి నటరాజా నా ఈ శరీరములో
శివశక్తి ప్రవేశించి, నీ పవిత్ర నర్తనము
ప్రదర్శించుటకు నా శరీరమును ఒక వస్తువుగా
ఉపయోగించుము–

అని పేరిణీ నర్తకుడు పరమ శివుని స్తోత్రము చేస్తూ నర్తనమాడును. శివశక్తి అతని ఆవేశించినదని నమ్మినప్పుడు అతడు శివుని కిరీటమును ధరిస్తాడు. అప్పుడే అతడు శృంగనర్తనమాడుతాడు. శృంగ నర్తనము నాడునది ఒక సామాన్య నర్తకుడు గాదు. పరమశివుని శక్తి ఆవేశించిన పేరిణీ నర్తకుడు– అనే భావముతో ఆ శివతాండవకేళిక జరిపిన పిమ్మట మరల శివుని కిరీటమును తీసివేయును.

పేరిణీ తాండవ మంతటిలో ఈ శృంగ నర్తనమందు మాత్రము– నర్తకుడు శివుని కిరీటమును ధరించును.

అటుపై నర్తనమాడే భాగము గీతము–– ఈ గీతములో దశవిధ శివలీలలు నృత్యమాడబడును–విష్ణుపరమైన నర్తనములో దశావతారములున్నట్లే–శివసంబంధమైన కేళికలో దశవిధ శివలీలలు ఒక ప్రత్యేక నృత్యముగా వుండును. శివలీలలు వర్ణించే ఈ గీతమునకు నృత్యము చేయుదురు. నృత్యములో భావప్రదర్శనము పదార్థాభినయము, విశేషాభినయము, గుణాభినయము మొదలైన భేదములు కల్గియున్నది. అందు ఆంగిక ప్రాధాన్యమైనది ఒక పద్ధతి. సాత్విక ప్రాధాన్యమైనది రెండవ పద్ధతి.

ఆంగికములో ఒక పాట యొక్క అర్థాన్ని హస్తములు, (ముద్రలు) భంగిమలు, పాద భేదములచే ప్రదర్శింతురు.

సాత్వికములో ఒక్క పాటలోని భావాన్ని, ముఖాభినయము, అశ్రువులు, పులకాంకితము, స్తంభము, రోమాచంము యిత్యాది సాత్విక భావముల వికాసముతో ప్రదర్శింతురు. గీతములో ఆంగిక ప్రాధాన్యత గల్గిన అభినయం ముఖ్యము.

ఇందులో అతి ముఖ్యమైనట్టిది 'నవరసఅంగహార' నర్తనము.

నేటి కాలంలో మన నర్తకులు, నవరసములను ముఖరాగము ముఖాభినయము ద్వారా ప్రదర్శించుట ఆచారముగా నున్నది. నవరస అంగహారమట్లుగాదు. నర్తకుడు తనయొక్క శరీరముయొక్క కదలికల ద్వారా, గీతి భేదములు, యతి భేదములతో గూడిన పాద విన్యాసముల ద్వారా ఒక్కొక్క రసమును ఒప్పించవలెను ఇది సామాన్యమైన విషయముగాదు నర్తకుని శరీరములోని ప్రతి అవయము అతనియొక్క స్వాధీనముతో కూడి, ఆయారసములకు తగినట్లు భావించుటకు శిక్షణివ్వబడవలెను రసాభినయానికి ముఖ్యముముఖము. ఆ ముఖభావవికాసానికి యిందు ప్రాముఖ్యత లేదు. కేవలము శరీరము యొక్క కదలికలే వివిధ రసముల నొప్పించవలెను. అట్లే మార్దంగికుడు గూడా కేవలం తికాలాల్లో జతులను వాయించుట తోనే తనవాయిద్యం ముగించక ప్రతిరసమునకు అనువైన రీతిని. ప్రతిరసమును ధ్వనిలో ఒప్పిస్తూ తనవాయిద్యమును వాయించవలెను.

ఈ వాయిద్యపద్ధతి, నర్తనరీతి మన దేశంలో కొన్ని శతాబ్దాలుగా ప్రచారంలోలేదు. మన నర్తకులు వాయిద్యకులు ఈసంప్రదాయాన్ని మరచిపోయారు. వల్లభుని మధురభక్తి సంప్రదాయం శుద్ధసాత్వికాభినయము మనదేశంలో విశేషంగా అభివృద్ధి చెందిన నాటినుండి ఈకష్టతరమైన నవరస నర్తనవిధానం మరుగునపడి అంతరించిపోయింది. అట్టిదే 'గంగావతరణ' నర్తనముగూడ — పవిత్రగంగదివినుండి భువికి వచ్చిన విధమును నర్తకుడు తన అవయవముల కదలికద్వారా ప్రదర్శించవలసివుండును. ఈకదలికను గూర్చిన పూర్తివివరములు, దేశీనర్తన విధానములోతెల్పబడినది —

పేరిణిలో ఆఖరిభాగము — వికట లేక భావాశ్రయము —

ఇందు శ్రీ కాంచీ పురం వెలిసిన పృథివిలింగ,
శ్రీ జంబుకేశ్వరంలో వెలసిన జలలింగ
శ్రీ తిరువణ్ణమలైలో వెలిసిన తేజోలింగ
శ్రీ కాళహస్తిలో వెలిసిన వాయులింగ.
శ్రీ చిదంబరంలో వెలసిన ఆకాశలింగ
శివ మూర్తులను స్తోత్రము జేయుచూ

కైవారములు గానము చేయుదురు.

ఆ సమయంలో ఏకాదశ రుద్రనర్తనం

పదకొండు అపూర్వ తాళములందు చేయబడును. అటుపై శివ పంచముఖ శబ్దములు నర్తన మాడబడును. ఈ శబ్దములు అతిప్రభావమైనట్టివి– మన పూర్వులు యజ్ఞ యాగాది క్రతువులందు హోమ సమయంలో పంచ భూతముల ఆరాధన సమయంలో గానం చేసి నర్తన మాడినట్టి శబ్దజాలము లివి. వేదములవలె ఈ శబ్దములు గురు ముఖంగా నేర్చుకొంటే గాని సాధ్య పడవు; మంత్రోచ్చారణ వలె. సుస్వరము, సుగాత్రము స్ఫుటమైనవి లేని యెడల ఫలించవు ఈ శబ్దములు గ్రంథములో చూపబడినంతలో రావు. గురు ముఖంగా ఆ పఠనాక్రమము తెలికొనుట అత్యవసరము–అప్పుడు గాని ఈ శబ్దముల్లో యిమిడియున్న శక్తి మనకు తెలిసి రాదు. ఈ శబ్దములు నూట ఇరువది అయిదు వున్నవి, అందులో నాదము యొక్క ప్రభావము నెరిగి వాయించే వాయిద్యకులుగాని, గానంచేసే నట్టువలు గాని అరుదు.

ఈ పంచముఖ శబ్దముల ఉత్పత్తి

పూర్వమొకప్పుడు పంచముఖుడై, తానే మృదంగము వాయించుతూ, మృదంగ జతులను పలుకుతూ, తన ఆనందము కొరకు కైలాసము పై నాట్యమాడె నట-అతని 5 ముఖములలో నుండి వచ్చిన శబ్ద జాలములే పంచముఖ శబ్దములు. ఇందుకు సంబంధించిన చక్కని పంచముఖ శివ శిల్ప మొకటి లేపాక్షి ఆలయంలో చెక్కబడి వుంది; అందు శివుడు ఐదు ముఖములు గల్గి యున్నాడు. మృదంగం వాయిస్తూ, నర్తన మాడు చున్నాడు. ఈ పంచముఖ శబ్దములు, సృష్టి, స్థితి, లయలకు సంబంధించిన అన్ని వికాసాలను తెలియజేయు విధముగా కూర్చ బడి వున్నది.

పంచముఖ శబ్దముల నర్తనము తరువాత సమన్వయ జతి, తీర్మానముతో ఈ నర్తనము ముగియును అంతకుముందు శుక్రాచార్య రచిత వీరభద్ర కవచము సురటరాగములో, గానము చేయ బడును. అంతటితో ఈ నర్తనము ముగియును.

ఈ నర్తనము 125 రకముల విన్యాసములు; 25 ముఖ్య రాగములు, 26 అపూర్వ తాళములలో ప్రదర్శింప బడుచుండినది.

ఆదరించువారు లేక ఈ అద్భుత నృత్య సంప్రదాయము కాకతీయునితోపాటు అంతరించి పోయినది. శైవాగమములో కొంత భాగము కాళహస్తి మరి కొన్ని ఆలయాల్లో ప్రదర్శింప బడేది. అట్లే వీరుల కొలువులందు పల్నాటి సీమలో, వీర భద్రుని సంబరము వీర ముష్టి వారిచే కోస్తా జిల్లాలందు, రాయలసీమ యందు కొన్ని సులువైన ఘట్టములు ప్రదర్శిత మయ్యేది. మల్లన్న దేవుని వుత్సవాల్లో తెలంగాణా ప్రాంతాల్లో రెండు మూడు అంశములు మాత్రము ప్రదర్శింతురు. నేను బండారా సంస్థానంలో ప్రముఖ నృత్యకళాకారునిగా ఉన్నప్పుడు ఆ రాజావారి కోర్కెపై కొంత భాగము తరుచు ప్రదర్శించే వాణ్ణి.

ఈ నాట్యములో మొదటిసారి నాకు ఆసక్తి కల్గించిన వారు మా పూజ్య గురువు గారు శ్రీమతి కాళహస్తి రాజమ్మగారు. ఆమెభరత నాట్యము, అభినయ శాస్త్రములందేదాక, శైవ ఆగమము, పాంచరాత్ర ఆగమ నర్తన రీతులు సంపూర్ణముగా తెలిసిన కళా వేత్త. "పేరిణీ" గూర్చి ప్రాచీన శాస్త్ర వేత్తల్లో వివరంగా రచన చేసిన వారు నంది కేశుడని తెల్పియున్ననూ, అటుపై 12 వ శతాబ్దములో వెలసిన జాయసేనాపతి, అతని తరువాత సారంగ దేవుడు తన సంగీత రత్నాకరంలో శాస్త్ర రీత్యాచర్చించి యున్నారు. మహాకవి తిక్కన మహా భారత విరాట పర్వములో, బృహన్నల విరాట రాజు కొలువులో ప్రవేశించి నప్పుడు తానెరిగిన విద్యల గూర్చి తెలుపుచూ. పేరిణి గూర్చి ప్రత్యేకంగా ప్రస్తావించినాడు. పండితారాధ్య చరిత్ర, బసవ పురాణములందు ఈ నర్తనము గూర్చి తెల్పబడినది. ఆఖరిసారిగా ఈ నృత్య సంప్రదాయంగూర్చి-సుమారు నూరు సంవత్సరాల క్రిందట వేంకటగిరి సంస్థానములో సర్వజ్ఞ కుమార యాచేంద్రుల వారు ఏర్పాటు చేసిన సంగీత విద్వాంసుల, శాస్త్రజ్ఞుల, కవి, పండితుల, నర్తక నాట్యాచార్యుల సదస్సులో చర్చింపబడినది. అప్పటికి పూర్తిగా సంగీత కళలు ఉత్తరాది, దక్షిణాది బాణీలు వేరు వేరు సంప్రదాయాలుగా రూపొందలేదు. యాచేంద్రులవారు ఉత్తరాది, దక్షిణాది మహా విద్వాంసులను ఆహ్వానించి ఈ సదస్సు జరిపినారు. ఆ సభకు కాళహస్తి నుండి మా గురువు గారు. ఆమె నాట్యములో ప్రయోక్తగా వుండిన శ్రీ విద్వల నారాయణస్వామి నాయుడు గారు వెళ్ళినారు ఆ చర్చల్లో పాల్గొన్నారు. అందు పేరిణి తాండవము శాస్త్ర సంప్రదాయముల గూర్చి విద్వాంసులు శాస్త్ర వేత్తలు వివరంగా చర్చించారు. అప్పటికే ధ్రుపద సంప్రదాయం గానము, నర్తనము రెండు బాణీలుగా చీలిపోయి ప్రచారంలోనికి రావడం వల్ల-శాస్త్ర ఆధారము ఒక్కటే అయినను సంప్రదాయాల్లో మాత్రము ప్రాంతీయముగా-చాలా మార్పులు వచ్చినవి. ఉత్తరాది వారి బాణీలో కృష్ణ భక్తి, భాగవత ప్రభావము యెక్కువగుటచే గంభీరత, ఉద్ధృత తగ్గి లావణ్యము, కోమలత ఆ బాణీలల్లో యెక్కువగా వృద్ధి చెందినది

దక్షిణాదివారు చాలావరకు తమ ప్రాచీనతను కాపాడుకోగల్గి నారు. ఆంధ్రలో భాగవత సంప్రదాయంలో ఈ ధ్రుపద సంప్రదాయ గానము, వాద్యము ప్రచారంలో వున్నను, ముఖ్యంగా ఈ సంప్రదాయం పురుష నర్తకులచే ఆరాధింపబడుటచే ఆ గంభీర గాన వాద్య సంప్రదాయం నిలిచిపోయింది. శైవాగమ నర్తనములో కొంతవరకు ఆ ప్రాచీన సంప్రదాయపు పాద్యము, ఆటక్రమము కాపాడ బడింది. ఈ విషయాలన్నీ ఆ సదస్సుకు వచ్చిన సభ్యులు చర్చించారు. 'సభారంజని' అనే గ్రంథంలో శ్రీ సర్వజ్ఞ కుమార యాచేంద్రులవారు పొందుపరిచారు. నేను నృత్యము నభ్యసించిన కాలంలో మా గురువుగారు ఈ వివరములన్నీ నాకు తెల్పారు. మరియు శైవాగమములో ప్రదర్శించే కొన్ని ఘట్టాలందు శిక్షణిచ్చారు. ఆ కాలంలో శ్రీ కాళహస్తి ఆలయంలో సర్వ వాద్య ఆరాధనకేళిక స్వామి సన్నిధిని పర్వదినములందు జరిగేది. చెంగల్పట్టు జిల్లా చెయ్యూరునందు వెలిసిన సుందరేశ్వరస్వామి ఆలయంలో. శ్రీకాళహస్తిలోని కాళహస్తీశుని దేవళంలో ముఖ్యంగా ఈ సర్వవాద్య ఆరాధన కేళిక వుండేది. చెయ్యూరులో శ్రీ చెంగల్వ రాయకవి ఈ సంప్రదాయమును రూపొందించిన వారిలో ప్రముఖులు. అట్లే శ్రీకాళహస్తిలో మా గురువుగారి పూర్వులు ఈ సంప్రదాయాన్ని రూపొందించినారు. చెయ్యూరు శారద, కాళహస్తి రాజమ్మగార్లు సమకాలికులు. భారత కళావేత్తలు, చెయ్యూరులో శ్రీమతి శారదగారు, కాళహస్తిలో రాజమ్మగారు ఈ సర్వ వాద్య ఆరాధన సేవలో పాల్గొనేవారు. వీరితో ఈ ఆగమ నర్తనము గూడా అంతరించి పోయింది. పంచముఖ వాయిద్యమును ప్రతిభా వంతముగా వాయించేవారు భారతదేశంలో ఒక్కరూ లేరనే చెప్పవచ్చును. ఈ ధ్రుపద సంప్రదాయ మార్దంగికుల్లో ప్రముఖులుగా వుండినవారు బొబ్బిలి. ఆస్థాన నాట్యాచార్యులు, మార్దంగికులు భుదాత రామయ్య, గోపాలంగారు. వారు ప్రత్యేకంగా ఈ జాతి కట్టుబాట్లు పూర్తిగా నెరిగినవారు. మా గురువుగారు, వీరూ ఒకేశాఖకు చెందినవారగుటచే, వారి వాద్యము గూర్చి తరుచు ముచ్చటించేవారు.

సుమారు 20 సంవత్సరాల క్రిందట ఢిల్లీలో ఆంధ్రుల అభిమాన నర్తన రీతి కూచిపూడి భాగవత సంప్రదాయం గూర్చి ఒక అసత్య ప్రచారము జరిగింది. ఢిల్లీలో జరిగిన అఖిలభారత నృత్య సదస్సులో—కూచిపూడి భాగవతము శాస్త్రీయమని కొందరు, జానపద రీతియని మరికొందరు పండితులు అభిప్రాయం వెలిబుచ్చారు. కూచిపూడి నాట్యముయొక్క శాస్త్రీయతను లోకానికి తెల్పి, ఆ నృత్యరీతికి విశేష ప్రచారము జరిగేలా చేయుటకు ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ తరపున కూచిపూడి సదస్సు హైదరాబాదులో ఏర్పాటు చేయబడింది. ఆ సదస్సుకు నేను కన్వీనరుగా వుండినాను. ఆ సదస్సు జరిగిన తరువాత ఢిల్లీ అకాడమీవారి ఆర్థిక సహాయంతో ఆ కళాభివృద్ధికి చాలా మేలు జరిగింది.

అటుపై—"పేరిణి శివతాండవము" మరల ప్రచారములోనికి తేవలెననే అభిప్రాయం నాలో కల్గింది. అందుకు రెండుకారణములున్నవి. అంతరించిపోయిన ఈ అతి ప్రాచీన కళారూపాన్ని మరల ప్రచారంలోనికి తేవలెనని ఒక ఉద్దేశము.

పరమ శివుడు, నటరాజమూర్తియై తాండవమాడి పురుష నర్తకులకు ఆదర్శప్రాయమైనను, భారత దేశంలోని నృత్యకళ నారాధించే చాలా మంది నర్తకుల్లో—మరి బృహన్నల శాపమో యేమో? చెప్పలేము గాని—స్త్రీల లక్షణాలు యెక్కువగా అలవడి, అదొక దోషంగా కనబడుతుంది; ఆ 'పేరిణి' వీరరస ప్రాధాన్యత గల్గి యువకుల్లో పురుష ప్రకృతిని సంపూర్ణంగా వికసింపజేసే అవకాశము కల్గిన నృత్య సంప్రదాయము. అందువల్ల, ఈ నర్తనములో ముఖ్యంగా యువకులకు శిక్షణివ్వాలనే అభిప్రాయం రెండవ వుద్దేశం.

ఈ రెండు ఆదర్శాలను నెరవేర్చ దలంచి, పది సంవత్సరాల పాటు ఈ సంప్రదాయంలో పరిశోధన సల్పినాను.

కాకతీయుల కాలంలో నిర్మింపబడిన దేవాలయాలున్న ప్రాంతాలన్నీ పర్యటించాను-కొలనుపాక గ్రామానికి అవతలగా వున్న శిథిల శివాలయాలన్నీ సందర్శించాను. ఓరుగల్లు కోటలోని శిల్పసంపద, హనుమకొండ వేయి స్తంభాల గుడి, రామప్ప ఆలయము, ఘనపురంలోని ప్రాచీనాలయము, దర్శించాను. ముఖ్యంగా రామప్ప దేవాలయమునకు ఏబది పర్యాయములు వెళ్లి అచ్చటవున్న నృత్య భంగిమలన్నీ వివరంగా పరిశోధించాను—జాయసేనాపతి తన నృత్య రత్నావళిలో వర్ణించిన నృత్య భంగిమలకు రామప్ప గుళ్లలోని భంగిమలకు చాలా దగ్గర సంబంధమున్నట్లు పండితుల అభిప్రాయము. ఆ అభిప్రాయము ననుసరించి, ప్రతీ చిన్న శిల్ప భంగిమను వివరంగా గంటల తరబడి తిలకించాను. అందు అనేక కరణ విన్యాసములున్నవి. అవి అన్నియు దేశి నర్తనరీతులకు చెందినట్టివే. ఆ నర్తనములన్నీ జాయప తెల్పినవే. మరియు శృంగ నర్తనానికి చెందిన భంగిమలు, మృదంగ వాయిద్యకుల భంగిమలు ముఖ్యమైనవి వున్నవి. మార్దంగికుల భంగిమలను పరిశోధించిన అందు ఆయా జతులు యెట్లు ఏ అక్షరముతో ప్రారంభింపబడిన ఏవిధంగా తీర్మానించబడినవో తెలిసికొనుటకు అవకాశము కల్గినది.

ఈ పరిశోధన ఫలితములు, నేను నేర్చిన శైవాగమ నర్తనములు, గ్రంథ పఠన, నేను జూచిన వీరముష్టివారి నర్తనము, ఝంజ, పంబ యిత్యాది వాయిద్య విధానము—వీటన్నింటినీ జతపర్చి ఐదు సంవత్సరాల కాలములో ఈ నృత్యానికి సంపూర్ణ రూపము నొకదాని నేర్పరచి పునః సృష్టి చేయగల్గినాను. కాని యిందు సహకరించే మార్దంగీకులు దొరకుట చాల కష్టమయ్యెను. కేరళలో వీర రస ప్రాధాన్యత గల్గిన ఘట్టములందు, 'చెండ' వాద్యమును వాయింతురు. ఆ వాయిద్య సహకారం ఈ నాట్యానికి ఉపకరించునేమో అని కేరళ ప్రాంతం వెళ్లి, ప్రముఖులైన వాయిద్యకులను కలిసికున్నాను. కాని పేరిణి జంతుల వాయిద్యానికి—'చెండ' పూర్తిగా వుపయోగపడలేదు. పేటల్లో శుద్ధమద్దెల, ఉత్తర ఖండ వాయిద్యాల ఈ జతులు వాయింపించాయి. అవి సంపూర్ణంగా లేవు. నేటి కాలంలో నాట్యంలో ముఖ్యంగా సహకరించే మార్దంగికులచే ఈ జతులు వాయింపించాము. వారి వాద్యంలో కొంతవరకు ఈ శబ్ద జాలము పలికినను అది వీరరస ప్రాధాన్యత గందిగా ధ్వనించలేదు. ఒకరిద్దరు ప్రసిద్ధ "ఝంజ" వాయిద్యకుల వాయిద్యము విన్నాము. అదిగూడ తృప్తినివ్వలేదు. ఆఖరికి శ్రీకాకుళం, విశాఖపట్టణంజిల్లాలు పర్యటించినప్పుడు - భాగవత మార్దంగీకులు కీ॥ శే॥ కోరుకొండ సత్యం, శ్రీ ధూపం సూర్యలింగం గారి వాయిద్యం వినే అవకాశం కలిగింది. వారి వాయిద్యంలో ప్రాచీన ధ్రుపదబాణీ, ధ్రుపదబాణీకో వుండ గంభీర, నాద ఘోషణ కన్పించింది. శ్రీ ధూపం సూర్యలింగం గారి వాయిద్యం పేరిణికి పనికి వస్తుందని యెంచి వారిని రప్పించి వారికి ఒక సంవత్సరకాలం ఈ జతి విన్యాసాలందు ప్రత్యేకంగా ప్రాక్టీసు చేయించాము. అట్లే ఈ నాట్యంలో వాయించే ప్రక్కవాద్యము 'ముఖవీణ' వాయించేవారు నేటి కాలంలో అరుదుగా వున్నారు. ఆ వాయిద్యము గూడ చాలా కష్టముతో సంపాదించాము. పెద్ద కంచు తాళములతో నట్టువాంగము చేయుట మన దేశంలో అంతరించి పోయింది—కేరళ 'కథకళి'లో మాత్రము తాళ గీతిని తెల్పుటకు ఆ తాళముల నుపయోగించుచున్నారు. తిరుచ్చూరు నుండి ఆ తాళములను తెప్పించి, ప్రత్యేక కొనుగోలు సాధనచేశాము.

అటుపై ఈ నృత్యములో కొందరు విద్యార్థులను తయారు చేయాలనే సంకల్పంతో ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ వారిని కోరగా; అప్పట్లో, స్పెషల్ ఆఫీసరుగా వున్న శ్రీ కె.ఆర్. పరమహంస గారు, వారి తరువాత వచ్చిన శ్రీ జె. బాపురెడ్డిగారు అనేక విధాల ప్రోత్సహించారు. వారియొక్క సహాయ సహకారాలతో ఐదుగురు నర్తకులను, నల్గురు మార్దంగికులను, ఇద్దరు గాయకులను ఈ సంప్రదాయంలో రెండు సంవత్సరాల పాటు శిక్షణిచ్చి, అనేక చోట్ల ప్రదర్శనాలిచ్చి, పండితుల ప్రశంసల నందుకున్నాము. ఈ నర్తనము నభ్యసించిన వారిలో యిద్దరు ఆంధ్రప్రదేశ్ కు, ముగ్గురు కేరళ ప్రాంతానికి చెందిన యువకులు. అదే సమయంలో నేను భారత ప్రభుత్వం తరపున ఫ్రాన్సు, రష్యా దేశాలు పర్యటనకు వెళ్లినప్పుడు—ఈ నర్తనం జూచి, ముగ్ధుడైన, పారిస్ కు చెందిన ఒక యువకుడు ఆంధ్రప్రదేశ్ వచ్చి, మన ప్రభుత్వ సహాయంతో ఒక సంవత్సరం పేరిణి నేర్చుకొని వెళినాడు. అతని

(తరువాయి 221వ పుటలో)



భారత దేశంలో స్త్రీ విద్య

శ్రీమతి కె. లక్ష్మీ రఘురామయ్య

సమాజంలో స్త్రీ పాత్ర ముఖ్యంగా యీ శతాబ్ది మొదటి దశాబ్దంలో ఎంతగానో మారింది. స్త్రీ గృహిణిగా మాత్రమే గాక ఇతర విధాల కూడా విభిన్నమైన పాత్ర యిప్పుడు నిర్వహిస్తున్నది. సత్వరాభివృద్ధి చెందుతున్న సమాజంలో ఆమె యింతకన్నా ఎక్కువ పాత్ర నిర్వహించడానికి యేమీలేదని చెప్పడానికి వీలులేదు. శారీరక బలానికి సంబంధించిన పనులు మినహా పురుషుడు చేసే ప్రతి పనిని తాను నిర్వహించగలనని మహిళ రుజువు చేసింది. మహిళను అర్ధనారిగా అభివర్ణించారు.

సమాజాభివృద్ధి, శాస్త్ర సాంకేతిక అభివృద్ధి, మానవాళి వృద్ధితో నిమిత్తం లేకుండా యీ అర్హతలను మహిళలు పరిరక్షించుకోవాలి.

మహిళ తన సహజసిద్ధమైన లాలిత్యం, స్త్రీత్వం, మొదలైన ప్రత్యేక పరిస్థితులను పరిరక్షించుకుంటూనే విద్య అభ్యసించడం ఎలా అనేదే యిప్పుడు ఎదుర్కొంటున్న సమస్య. శాస్త్రీయ, ఆర్థిక అభివృద్ధితో పాటుగా మానవ విలువలను, సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూనే ఆధునిక మహిళ విద్య నేర్చుకునే మార్గాలను చూడాలి


మన లక్ష్యాలను, పద్ధతులను తగిన విధంగా సమీక్షించుకోకుండానే గతంలో అనుసరించిన విధానాలనే యిప్పుడు కూడా కొనసాగిస్తూ ఉన్నాము. స్త్రీ విద్యను విస్తరింప జేయడానికి యింతవరకు మనం కృషి చేస్తున్నాము అయితే జీవితంలో స్త్రీ, పురుషులు నిర్వహించే పాత్రలు ముఖ్యమైనవే అయినప్పటికీ అవి ఒకే విధమైనవి మాత్రం కాదు. ఈ విషయానికి యింతవరకు అంత ప్రాధాన్యం యివ్వలేదు. మహిళలకు విద్యా సౌకర్యాలు కల్పించే సమయంలో మహిళల ప్రత్యేక పరిస్థితులు, వారి మనస్తత్వం, వారి కార్యరంగాలను ప్రత్యేకంగా దృష్టిలో ఉంచుకోవాల్సి ఉంటుంది.

లక్ష్యాలు

అందువల్ల స్త్రీ విద్యా విషయంలో మన లక్ష్యాలను, ఉద్దేశాలను తిరిగి నిర్వచించుకోవాలి. మన దేశంలో స్త్రీ విద్య విషయంలో ఎస్. ఎన్. డి ఐ. మహిళా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ప్రమిలా ఠాకెర్సె ప్రకటించిన దిగువ లక్ష్యాలు సహాయకారిగా ఉంటాయి.

స్త్రీని ఒక వ్యక్తిగా గుర్తిస్తూ సమాజంలో ఒక వర్గంగా తయారుచేయాలి. ఇందువల్ల స్త్రీలు తమలోని ప్రత్యేకతలను అభివృద్ధి చేసుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో ఉత్తమ గృహిణిగా, మాతగా రూపొందడానికి వీలుగా సరైన శిక్షణ యివ్వాలి. దేశ ఆర్థిక ప్రగతికి వ్యక్తిగతంగా తోడ్పడడానికి వీలుగా ఆమెకు శిక్షణ యివ్వాలి.

ఒకసారి లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుంటే ఆ తర్వాత యీ విషయంలో ఎదురయ్యే సమస్యలను క్రమంగా పరిష్కరించుకోవచ్చు. మన రాజ్యాంగంలో స్త్రీ పురుషులకు సమానస్థాయిని, హోదాను యిచ్చారు. దానితో మహిళా లోకంలో నూతన ఉత్సాహం, చైతన్యం వెల్లివిరుస్తున్నవి.



అయితే మహిళలు యింకా అన్ని రంగాలలో పురుషులతో సమానంగా ముందుకు రావాల్సి ఉంది. విద్యారంగంలో వివిధ స్థాయిలలో బాలికల సంఖ్య ప్రాథమిక పాఠశాలలో 1946-47 లో ప్రతి నూరుమంది విద్యార్థులకు బాలికల సంఖ్య 36 మాత్రమే ఉంది. మాధ్యమిక పాఠశాలలలో 22 మంది, సెకండరీ స్థాయిలో 14 మంది, విశ్వవిద్యాలయం స్థాయిలో 12 మంది బాలికలు ఉన్నారు. ప్రణాళికల అమలు తర్వాత కూడా పరిస్థితులలో చెప్పుకోదగిన మార్పు రాలేదు. మొదటి రెండు ప్రణాళికల కాలంలో విద్యా రంగం అన్ని స్థాయిలలో 21.7 మిలియనుల ప్రవేశాలు ఉండగా వారిలో 7.6 మిలియనులు బాలికలు ఉన్నారు. మూడవ ప్రణాళిక కాలంలో అదనంగా 15.74 మిలియనుల ప్రవేశాలు ఉండగా వారిలో 8.25 మిలియనుల బాలికలు ఉన్నారు.

దేశంలో వ్యాప్తిలో ఉన్న కొన్ని సంప్రదాయాలు, నమ్మకాలు కారణంగా విద్యా విషయంలో స్త్రీ పురుషుల మధ్య పెద్ద వ్యత్యాసం ఏర్పడింది. కొన్ని శతాబ్దాల తరబడి స్త్రీ గృహిణిగా, మాతగా, భార్యగా మాత్రమే కుటుంబ పరిధిలో వ్యవహరించేది. స్త్రీకి విద్య అనవసరమనే భావం యిప్పటికీ కొన్ని ప్రాంతాలలో ప్రబలంగా ఉంది.

దానికితోడు యీనాడు పట్టణ ప్రాంతాలలో మాత్రమే విద్యా సౌకర్యాలు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల స్త్రీ విద్య యీ ప్రాంతాలకు మాత్రమే పరిమితమై ఉంది. గ్రామీణ ప్రాంతాలకు కూడా విద్యా సౌకర్యాలను విస్తరింపజేయాలి.

కుటుంబ ఆర్థిక పరిస్థితులు స్త్రీ విద్య విషయంలో పెద్ద అడ్డంకిగా పరిణమిస్తున్నవి. తల్లిదండ్రులు తమ మగ సంతానాన్ని విద్యాభ్యాసానికి పంపినట్టుగా బాలికలను పంపడం లేదు. విద్య విషయంలో బాలురకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. బాలికలను యింట్లో పనులకు వినియోగిస్తారు. అనూచానంగా వస్తున్న సంప్రదాయాలు కూడా యిందుకు కొంతకారణంగా పేర్కొనవచ్చు.

వయోజన విద్య

మహిళల వయోజన విద్య కూడా ఒక సమస్యగానే ఉంది. మహిళలలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉంది. ఇది చాలా ఆందోళనకరమైన విషయం. 1961 జనాభా లెక్కల ప్రకారం పట్టణ ప్రాంతాలలో 36.5 శాతం, గ్రామీణ ప్రాంతాలలో 8.9 శాతం మహిళలు అక్షరాస్యులుగా ఉన్నారు. నవ భారత దేశంలో మహిళల నిరక్షరాస్యత పెద్ద అడ్డంకిగా ఉంది. "మహిళలకు విద్య నేర్పితే ఒక పూర్తి తరానికి విద్య నేర్పినట్టు" అవుతుందనే సామెత ఉంది. మహిళల వయోజన విద్య అందుకే ఎక్కువ ప్రాముఖ్యత వహిస్తుంది.

గ్రామీణ ప్రాంతాలలో మహిళలలో నిరక్షరాస్యత చాలా ఉంది. విద్యా సౌకర్యాలు అంతగా యిక్కడ లేక పోవడమే యిందుకు కారణం.

సంస్కరణలకు సూచనలు

అందువల్ల స్త్రీ విద్యారంగంలో పాఠశాలలలో ప్రవేశాలు పాఠ్యాంశాలు, ఉపాధ్యాయుల శిక్షణ విషయాలలో ఎక్కువ శ్రద్ధ వహించాలి. స్త్రీలకు ప్రత్యేక విద్యా సౌకర్యాలు కల్పించాలి. వారి అవసరాలు. పరిమితులు. ప్రత్యేక రంగాలను దృష్టిలో ఉంచుకుని వారి విద్యాభివృద్ధికి తగిన పథకాలను రూపొందించాలి.

ప్రాథమిక స్థాయిలలో బాల బాలికలకు సామూహిక పాఠశాలలను ఏర్పాటు చేయడం ప్రస్తుతపు విధానంగా ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో స్త్రీ పురుషులకు విడివిడిగా పాఠశాలలు ఏర్పాటు చేయాలని కొందరు కోరుతున్నారు. ఈ కోరికను ఆమోదించి శిక్షణ పొందిన ఉపాధ్యాయినులతో ప్రత్యేక శ్రద్ధతో బాలికలకు విద్య నేర్పాలి.

మాధ్యమిక విద్యాస్థాయిలో సహవిద్య శాతం పెరుగుతున్నది. బాలికల అవసరాలు తీర్చడానికి గృహశాస్త్రం, లలితకళలకు చెందిన కోర్సులను ప్రవేశపెట్టడం చాలా అవసరం. మాధ్యమిక విద్యా స్థాయిలో విద్యార్థినులు సాధారణ విద్యను ఎక్కువగా ఎంపిక చేస్తుంటారు. విద్యార్థులు సాంకేతిక, వృత్తి విద్యలకు ఎక్కువ ప్రాధాన్యం యిస్తుంటారు. అయితే సాంకేతిక విద్య పాఠ్యాంశాలు బాలబాలికలకు వేరువేరుగా ఉంటున్నాయి. అంతేగాక సాంకేతిక, వృత్తి విద్యలను న్యూనతగా చూచే అలవాటు కూడా ఉంది.

కళాశాల విద్యాస్థాయిలో సహవిద్యకు సుముఖత ఉన్నా, అనేక కళాశాలలు విడిగానే ఉన్నాయి. దేశంలో స్త్రీలు తమ వ్యక్తిత్వాన్ని లాలిత్యాన్ని సంరక్షించుకోడంలో కళాశాలలు తోడ్పడుతున్నాయనే చెప్పవచ్చు. సాధ్యమైన చోట్ల మహిళల విద్యా సంస్థలను ప్రోత్సహించాలి. "శాస్త్ర విజ్ఞానం, పరిశ్రమలు మహిళలను గృహ పరిధుల నుండి విముక్తి చేశాయను కోవాలి" అందువల్ల మహిళలకు శాస్త్ర విజ్ఞానం బోధించడాన్ని విస్మరించరాదు.

మహిళలు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించడం తోడ్పడడానికి విశ్వవిద్యాలయాలలో ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేయాలి. ఈ శాఖ వివిధ కోర్సులను గూర్చిన సమాచారాన్ని మహిళలకు అందజేయాలి.

అయితే స్త్రీ పురుషులకు విద్యా విషయాలు, విధానాలు వేరు వేరుగా ఉండాల్సిన అవసరం లేదు. వారి ప్రత్యేక అవసరాలను మాత్రమే గుర్తించాలి. మహిళలు జాతికి, గృహానికి ప్రేమాభిమానాలతో సేవచేసేందుకు వీలుగా నిజమైన జాతి పెట్టుబడిగా వారిని తీర్చి దిద్దాలి.

స్త్రీ విద్యా విషయంలో ఉత్తమ సౌకర్యాలు కల్పించడంతో సమాజ వ్యవస్థలో తీవ్రమైన మార్పులు రావాలి. విద్యా విధానంలో కూడా అవసరమైన మార్పులు చేయాలి. అన్ని స్థాయిలలో స్త్రీ విద్యా విషయంలో అనుకూలమైన వాతావరణం సృష్టించాలి. మహిళా వయోజన విద్యకు ఎక్కువ ప్రాధాన్యం యిస్తూ ప్రత్యేక శ్రద్ధ వహించాలి. దేశంలో స్త్రీ పురుషులకు విద్య నేర్పడంలో సాహితీపరమైన ఉద్యమం నిర్వహించాలి. పాఠశాలల్లో అధిక సంఖ్యలో ఉపాధ్యాయినులను నియమించాలి. గ్రామీణ ప్రాంతాలలో మహిళలలో నిరక్షరాస్యతను నిర్మూలించడానికి ఉపాధ్యాయినులు బాధ్యత వహించాలి. మహిళల ఆశయాలకు అనుగుణంగా విద్యా కోర్సులను ప్రవేశపెట్టాలి. మహిళలలో విద్యావ్యాప్తికి ప్రత్యేక సౌకర్యాలు, వారికి ప్రోత్సహం కల్పించాలి. తల్లి దండ్రులను కూడా ప్రబోధించాలి. వయోజన విద్యా కార్యక్రమాలను తీవ్రతరం చేయాలి.

స్థానిక రాష్ట్ర, జాతీయ స్థాయిలలో స్త్రీ విద్య విషయంలో ప్రత్యేక కృషి జరిగి, మహిళాలోకం మనస్తత్వంలో కూడా కాలానుగుణమైన మార్పు వచ్చినప్పుడే మన లక్ష్యాలు నెరవేర గలుగుతాయి



మన రాష్ట్రంలో గిరిజనుల ఆచార వ్యవహారాలు

శ్రీ సి.వి. కృష్ణారావు

భారతీయ సమాజంలో వేరు వేరు మతాలవారున్నారు. హిందువులలో చాతుర్వర్ణ్య వ్యవస్థవుంది. భారతదేశంలో వున్న ఏ ఒక్క మతానికీ చెందకుండా హిందూమతంలో వున్న ఏ ఒక వర్ణవ్యవస్థకూ చెందకుండా వుంటూ అనాది వాసులైన భారతీయులున్నారు. వారు ఆదిమనివాసులు. వీరిని గిరిజనులు అని కూడా పిలుస్తున్నాము.

ఆంధ్ర ప్రదేశంలో ఆదిమ నివాసులు ఆర్యులకన్నా, ద్రవిడుల కన్నా కూడా పూర్వకాలపువాళ్లు. వీరు వేరు వేరు ప్రాంతాలలో వేరు వేరు తెగలగా పిలువబడుతున్నారు. గోండులు, కోయలు, చెంచులు, లంబాడీలు (సుగాలీలు, బంజారాలు), గదబలు, భగతలు, సవరలు మొదలగువారు. ఆంధ్ర దేశపు జనాభా 4,35,00,000. అందులో ఆదిమ నివాసులు 18 లక్షల పైగా వున్నారు.

మన 21 జిల్లాలలో ఆదిమ నివాసులు మిగతా జనాభాతో కలిసి మెలిసి వుంటున్నారు. కాని గోదావరి ప్రవహించే జిల్లాలలో యిరు ప్రక్కల దట్టమైన అడవులున్నవి. వీరు గోదావరికి యిరు ప్రక్కల ఎక్కువ సంఖ్యలో వున్నారు. కరీంనగరు, ఆదిలాబాద్ జిల్లాల సరిహద్దులో గోదావరి వుంది.

ఈ గోదావరికి ఉత్తర తీరంలో మహారాష్ట్ర సరిహద్దుల దాకా ఎక్కువ ఆదిమ వాసుల ప్రాంతమే. ఇటు రాజమండ్రికి వుత్తరంగా విశాఖపట్నం శ్రీకాకుళం జిల్లాల్లో గోదావరికి వుత్తరంగా గిరిజనుల జనసాంద్రత ఎక్కువ

వీరు 50 శాతం ఎక్కువవున్న ప్రాంతాలను షెడ్యూల్డు ఏరియాలుగా (ఏజన్సీగా) ప్రభుత్వం ప్రకటించింది. ఈ షెడ్యూల్డు ఏరియాలు (అనుసూచిత ప్రాంతంగా మనం వ్యవహరించవచ్చు) ఆంధ్రప్రదేశ్ 21 జిల్లాలలో ఎనిమిది జిల్లాలలో వున్నవి: (1. ఆదిలాబాదు 2. వరంగల్లు 3. ఖమ్మం 4. మహబూబునగరు 5. పశ్చిమ గోదావరి 6 తూర్పు గోదావరి 7. విశాఖపట్నం 8. శ్రీకాకుళం)

వీరు ప్రకృతిలోవున్న రామణీయకతను పంచుకుంటూ, జీవిత వ్యాసంగంలో నాగరిక ఆర్థిక విధానంలో పెద్ద పెద్ద అంగలు వేయక తృప్తితో శతాబ్దాలనుండి నేటివరకు గడిపారు

తద్ద్వారా నవ భాషా పాండిత్యం, సాంకేతిక విజ్ఞానత బహుధా గ్రహించక పోవటంతో గిరిజనులు "అనాగరికులు" అనే ప్రథ ప్రబలివుంది.

పైగా వీరు "అంధకారం" లో వున్నారనీ, వీరిని "ప్రగతి పథంలో" ముందుకు తీసికొని వెళ్లాలనీ, వీరిని "విజ్ఞాన వంతుల్ని" చేయాలనీ వుద్ఘాటిస్తుంటారు.

ఈ దృక్పథం చాలా సంకుచితమైంది: ప్రమాదభూయిష్ఠమైంది.

నేడు గిరిజనుల వునికి కొండల్లో, అడవుల్లో. అందువల్ల వర్ష భీభత్సం/ గ్రీష్మం, వరదలు, వన్యమృగాల నుంచి బెడద– యిటువంటి ప్రాకృతిక భీభత్సాలను ఎదుర్కొంటూ వీటినుంచి మనగలిగిన దార్ఢ్యతను, సంఘటిత బలాన్ని పెంపొందించుకొని అనాది కాలంనుంచి మనగలిగిన వారి జీవితం యొక్క లోతుపాతుల్ని సగౌరవంగా కొనియాడాల్సిందే గాని అల్ప దృష్టితో చూడటం అశాస్త్రీయం.

ఈ రోజు మనం పండిస్తున్న వరి ఆకాశం నుంచి దిగి రాలేదు. అడవి "దుస్సవడ్లు" మిగతా వృక్ష సంతతితో పుట్టినయి. ఆ దుస్సవడ్లను కొట్టి బియ్యం చేసి, వరి పండించే కౌశల్యానికి నాంది పాడింది ఆదిమ నివాసులే. నేడు "శ్వేత విప్లవం" తీసికొచ్చిన పాలగేదెను అడివినుంచి మచ్చిక చేసిన బలశాలి ఆదిమ నివాసులే.

చరిత్ర కందిన ఉదంతాలు

ఆదిలాబాదు గోండులు, గోదావరి జిల్లాల కోయవారు క్రీ.శ. 1000 ప్రాంతాన వింధ్యా సాత్పూరా పర్వతశ్రేణి దక్షిణాన తూర్పున "గోండ్వానా" (Gondwana) అని పిలువబడే ప్రాంతానికి చెందినవారు. క్రీ.శ. 808 లోనే గోండ రాజ్యం ఉచ్ఛస్థితిలో వున్నట్లు తెలుస్తున్నది. క్రీ.శ. 808 నుంచి క్రీ.శ. 1390 వరకు గోండ్వానా చరిత్ర పరిశోధన పూర్తిగా లేదు. క్రీ.శ. 1398 లో నర్సింగ్‌రాయ్ అనే "ఖేర్లా" రాజు గోండు తెగకు చెందినవాడు. అతను చాలా ధనవంతుడు, చాలా వైశాల్యంగల భూమిని పాలించేవాడు. 16వ శతాబ్దంలో "గార్హమాండ్లా" రాజు "సంగ్రాంషా" మధ్య ప్రాంతాన్ని ఏలుతుండేవాడు. తరువాత "భక్త బులంద్" అనే గోండురాజు ఢిల్లీ నుంచి నిపుణులను పిలిపించి నాగపూర్ పట్టణానికి శంకుస్థాపనచేశాడు. పట్టణం పూర్తి కాగానే రాజధానిని "దేవఘర్" నుంచి నాగపూర్‌కు మార్చాడు. నాగపూర్ పట్టణం ఆదిమ నివాసుల తెగలో అతి ప్రాముఖ్యమైన గోండులు నిర్మించారన్నది విశేషం.

చాందా పట్టణం యొక్క అభ్యున్నతికి కూడా గోండురాజులే కారకులు. చాందా పట్టణం చుట్టూ $10\frac{1}{2}$ మైళ్ళ పొడవు 10 అడుగుల వెడల్పుతో వున్న ప్రహరీ "హీర్షా" అనే గోండురాజే కట్టించాడు.

దేవతలు—వారి పుట్టుకలు

ప్రతి తెగకు దేవతలున్నారు. ప్రతి దేవతకు ఒక పుట్టుక్కు మైన పురాణగాధ వుంది. ఆ దేవత యొక్క కారణజన్మవల్ల ఆ తెగకు ఆరాధ్యదైవమై, వారి యొక్క మన్ననకూ క్షేమానికీ పురోగతికీ సహాయం చేస్తుంది.

గోండు దేవతల పుట్టుపూర్వోత్తరాలు చెప్పే పురాణగాధ యిక్కడ టూకీగా చెప్తాను. మేరుగిరి మీద మూడొందల మంది దేవుళ్లు పుట్టారు. వారిలో ఒకరు "నిరంజన్ సేన్". "మీ అందరిలో నేను గొప్పవాణ్ణని" ఉద్ఘాటించాడు ఒక స్త్రీ దేవత—"నిరా నిరంజన్ సేన్"పై ఆయన దృష్టి మళ్ళింది. వారిద్దరి చూపులూ కలిసినయి. ఆమె అరచేతి నుంచి తొమ్మిది గంటల్లో "కాళీ కంకాళీ" పుట్టింది కాళీ కంకాళీ అనతి కాలంలోనే పెద్దదై, తాత "నిరంకార్ తాపేదారీ" యింటో పెరిగింది.

తాపేదారీ ప్రతి రోజూ బంగారు త్రాసులో ఐదు పూలతో తూచేవాడు ఒక రోజున దురారీ పండుగనాడు కాళీ కంకాళీ సముద్ర స్నానానికి పోయింది. అక్కడ స్నానం చేస్తున్న యితర దేవతలను చూచేటప్పటికి ఆమె గర్భవతి అయింది

ఇంటికి రాగానే ఎప్పటిలాగా తాపేదారీ ఆమెను ఐదు పూలతో తూకం వేశాడు. త్రాసు ఎప్పటిలాగా కాకుండా కంకాళీ బరువెక్కిన సంగతి విదితం చేసింది. ఆమె తప్పిదానికి యింట్లో నుంచి వెళ్ళగొట్టాడు.

కాళీ కంకాళీ అడవిలో పన్నెండు పంటల గోండ దేవుళ్ళనూ, ముప్పై మూడు పంటల తెలుగు దేవుళ్ళనూ, ముప్పై ఆరు పంటల మరాఠా దేవుళ్ళనూ ప్రసవించింది వాళ్ళను అక్కడే వదలిపెట్టి. ఆమె తాత నిరంకార్ తాపేదారీ దగ్గరకు తిరిగి వెళ్ళింది. కాని అక్కడ స్వాగతం దొరకలేదు. చివరకు చనిపోయింది

అప్పుడు ధవళగిరి మీద మహాదేవ్ శంభు, ఆయన భార్య పార్వతి భూ విహారానికి బయలు దేరారు. మహాదేవునికి తెలియకుండా తొండ పిల్లలలాగా పాకుతూ సన్నసన్నగా అరుస్తున్న వీళ్ళను భర్త చూడకుండా తన చీరచెరుగులో కట్టుకొని తనవెంట తీసికొచ్చింది. రహస్యంగా వాళ్ళకు తన స్తన్యం యిచ్చి పోషిస్తున్నది.

కాని తన వామస్తన్యం దిన దినం బలహీనమై చిక్కిపోవటం మొదలు పెట్టింది. గోండు దేవతలకు తన వామస్తన్యం యిస్తున్నది. పార్వతి వామస్తన్యం చిక్కిపోవటం మహాదేవు కనిపెట్టి పార్వతిని కారణం అడుగగా జరిగిన సంగతి చెప్పింది. "ఈ గోండు దేవతలకు పాలు ఇవ్వగూడదు. వారికి గట్టి ఆహారం కావాలి. అందువల్లనే నీ స్తన్యం చిక్కిపోతున్నదని పార్వతికి చెప్పాడు మహాదేవు. అన్నం, పప్పు నెయ్యి మొదలైన ఆహారం ఏర్పాటు చేశాడు. మద్యం కావాలన్నారు గోండు దేవతలు. మద్యంకూడా ఏర్పాటు చేసేటప్పటికి మాంసం కావాలన్నారు. అప్పుడు తన తొడమీంచి కొంచెం ధూళినుంచి ఒక ఉడుతను తయారు చేశాడు - దానికి ప్రాణోదకం చల్లాడు. ఆ ఉడతను చూడగానే గోండు దేవతలు దాని వెంబడి పరుగెత్తారు. ఉడుత "సూర్యసూది" గుహలోకి పరుగెత్తింది. వీళ్ళూ దాని వెంబడి బడి గుహలోకి దూరారు. శంభు మహదేవు "సూర్య సూది" గుహకు ఒక పెను శిలను అడ్డంతోసి మర్రి చెట్టు పాతి "రాణి సూర్వాల్" అనే పక్షిని కాపలా పెట్టాడు.

ఇట్లా గుహలో 12 సంవత్సరాలు బంధింపబడ్డ గోండు దేవతలను "పహాండీ కపూర్ లింగాల్" నానా అవస్థలు పడి వదిలించాడు.

తరువాత గోండు దేవతలకు చిహ్నంగా లింగాల్ చామరము వెదురు బల్లెం సంపాదించి పెట్టాడు.

వ్యవసాయం

మైదాన ప్రాంతంలో వున్న గిరిజనులు తదితరుల మాదిరిగా వ్యవసాయం చేస్తున్నారు. గాని కొండ ప్రాంతంలోవారి వ్యవసాయ పద్ధతులు వేరు. కొండ చరియల్లో సుమారు 100 లేక 200 గజాల విస్తీర్ణాన అడవి కొట్టి మొత్తం కట్టెను కాలబెట్టారు. కట్టె అంతా కాలి నుసి అయిపోయిన తరువాత చదునుచేసి "కొరిసె" తో ఒక్కొక్క కన్నం చేయటం, ఆ కన్నంలో విత్తనం వేయటం. మరునటి సంవత్సరం వచ్చేటప్పటికి యీ భూమిలో విత్తనాలు వెయ్యరు, కొత్త భూమిని కాలపెట్టడం చదును చెయ్యటం మొదలు పెడ్తారు. ఎనిమిదో సంవత్సరానికి మళ్లా మొదటి భూమికి వస్తారు. దీన్ని "పోడు వ్యవసాయం" అంటారు.

కాని యిప్పుడు పోడు వ్యవసాయంవల్ల వస్తున్న నష్టాలు గమనించి ప్రభుత్వం గిరిజనులకు మారుగా భూమినియిచ్చి, సాంద్ర వ్యవసాయ పద్ధతులు ప్రచారంచేసి, పోడు వ్యవసాయాన్ని మానుకొనేలాగా చేస్తున్నది.

వివాహాలు

గిరిజనులలో నాలుగు రకాల వివాహాలున్నవి :

(1) ఎత్తుకొనిపోయి పెండ్లి చేసికోవటం ;
(2 లేచిపోయి పెండ్లి చేసికోవటం :
(3) అత్తవారింట ఊడిగంచేసి పెండ్లి చేసికోవటం ;
(4) పెద్దల సంప్రదింపులమీద పెండ్లి చేసికోవటం.

వీటిలో ఎత్తుకొనిపోయి పెండ్లి చేసుకోవటం ముఖ్యమైన సంఘాచారం ఒక గ్రామంలో ఫలానా పిల్లను పెళ్లి చేసికోవాలని ఎవరైనా యువకుడు తలచుకొన్నట్లయితే, తన గ్రామం వాళ్లకు

యీ సంగతి చెప్పి ఆ పిల్ల అడవికి కట్టెలకు వచ్చినపుడో, వాగుకు నీటికి వెళ్లినప్పుడో, అంగడికి వస్తువులు కొనటానికి వెళ్లినపుడో కాచుకొని వుంటాడు అట్లా ఒంటరిగా వెళ్లినప్పుడు తీసికొని పోవటానికి కొన్నాళ్లు ముందే సన్నాహాలు చేసుకుంటాడు. అయితే ఆ పిల్లను తీసికొనిపోయే పథకం అమలుపరచే ముందు పిల్లయొక్క గ్రామ పెద్దకు తాను ఫలానా పిల్లను వివాహం చేసికోటానికి తీసికొనిపోతానని ముందు చెప్పివుంచుతాడు.

ఈ రహస్యాన్ని గ్రామ పెద్ద మాత్రం ఈ పథకం పూర్తయే వరకు రహస్యంగా వుంచుతాడు.

ఆదనుకోసం కాపలాకాసి ఒంటరిగా దొరికే అవకాశం చూచుకొని తన స్నేహితుల సహాయంతో పిల్లను తీసికపోతాడు.

ఈ సంగతి మర్నాడో మూడోనాడో తల్లిదండ్రులతో కుల పంచాయతీ జరుపుతారు. ఆ పంచాయతీలో గ్రామ పెద్ద ఎదుట తాను సదభిప్రాయంతోనే పిల్లను తీసికపోయినానని గ్రామ పెద్ద సాక్ష్యంతో నిరూపించి వివాహం చేసుకుంటాడు.

2. లేచిపోయి పెండ్లి చేసుకోవటం:— కొన్ని పరిస్థితులలో పిల్ల తండ్రి, పిల్లవాని తండ్రి ఒప్పుకోకపోతే యిద్దరూ కూడబలుక్కొని ఏదైనా దూరప్రాంతానికిపోయి పెండ్లి చేసుకుంటారు. కొన్నాళ్ళకు తిరిగివచ్చి తమ జాతివారికి విందుచేసి పెండ్లిలో జరగాల్సిన యిచ్చిపుచ్చుకోటాలు వగైరా పూర్తి చేసుకుంటారు.

3. "లామిసాది":— మూడో విధమైన విధానం పిల్లవాడు పిల్లయింట్లో కొన్నాళ్ళు వూడిగంచేసి తరువాత పిల్లను తీసుకొచ్చుకుంటాడు. ఇలాంటి పరిస్థితి పిల్లవాడు "ఓలి" (కన్యాశుల్కం) యివ్వలేని పరిస్థితుల్లో జరుగుతుంది.

4. నాలుగవ విధానం. పెద్దలు మాట్లాడుకొని చేసేది. ఇది సర్వసాధారణమైంది.

గిరిజనులలో పిల్లవాడే పిల్ల తల్లిదండ్రులకు తాను శుల్కమివ్వాలి. ఈ శుల్కం ఎంతో వుండదు—ఒక ఆవుపెయ్య, రెండు మేకలు, రూ. 50లు, చీరె, రవిక. తరువాత ఎప్పుడైనా స్త్రీ భర్తకు విడాకులిచ్చినట్లయితే "ఓలి" తిరిగి యివ్వాలి—సంఘం విధించిన జుల్మానాతో సహా.

భార్యాభర్తలకు అన్యోన్యత సన్నగిల్లితే విడాకులిచ్చుకుంటారు. కులానికి విందు, జుల్మానా "ఓలి" వాపస్ మాత్రమే విడాకులకు వున్న నిబంధనలు. విడాకులిచ్చుకున్న స్త్రీ పురుషులిద్దరూ మళ్ళా వివాహాలు చేసుకుంటారు.

కళలు

మెళ్ళో పూసలపేరు అంటిపెట్టుకొని వున్నట్లు ఆదిమ నివాసుల నృత్యకళ వాళ్ళను అంటిపెట్టుకొనే వుంటుంది. గోండుల "దండారి", "గుసాడి" నృత్యాలు, గౌడుల "ధింసా" నృత్యం, వాల్మీకుల "గౌడనాటు"—అన్నీ సామూహిక నృత్యాలే. ఒకవ్యక్తి రంగస్థలంమీద గజ్జకట్టడమంటూ వుండదు నృత్యంలో గ్రామస్తులందరూ పాల్గొంటారు. వయో పరిమితిలేదు పిల్లవాళ్ళు పెద్దలూ కూడా ఎంతో ఉత్సాహంతో నాట్యం చేస్తారు

పండుగల రోజుల్లో రాత్రంతా వాయిద్యాల సహాయంతో తమను తాము మర్చిపోయి రాత్రంతా నాట్యం చేస్తూ కాలం గడుపుతారు

ఈ నాట్యాలకు ముఖ్యమైన వాయిద్యాలు పెద్ద పెద్ద డోళ్ళు, జంతు వాయిద్యాలూ—

పండుగలు

వారి గోత్రాల అధి దేవతలను ఆరాధించటానికి పండుగ చేసికుంటారు వ్యవసాయ కార్యక్రమాలు సఫలీకృతం కావాలనీ ఋతువుల మొదటి రోజుల్లో, స్మరణీయులైన పెద్దల జ్ఞాపకార్థం మనస్ఫూర్తిగా జరుపుకుంటారు విందులు, నాట్యం, పాట వాయిద్యం—ఈ తన్మయత్వం లేంది పండుగ జరుపుకోటంగాని దేవతల పూజలుగాని వుండవు. కోందులు (సామంతులు) జకిరి దేవతనూ, గోండులు "పర్సాపేన్", "ఆకిపేన్", "శంభుపేన్", చెంచులు గారెల మైసమ్మ పోతురాజు, నాయకపోడులు లక్ష్మీదేవర, పాండవులు, భగతలు "నిషాన్ దేవత", జంకిరిదేవత, కోయలు సమ్మక్క, పగిడిద్దరాజులను కొలుస్తారు. ప్రతి దేవతకూ ఒక పురాణ గాథ వుంది. ఆ దేవత, ఆ తెగవారిని ఆ గోత్రంవారిని అండగా నిలిచి కాపాడుతుంది. ప్రతి కుటుంబము వారి అధిదేవతకు తమ శక్తి సామర్థ్యాలకొద్దీ దక్షిణ (కోడిపెట్ట, ఒక యాట, కొంచెం బియ్యం మొ॥) ముట్టజెప్పుతుంది.

వీరు గృహాలంకరణకు మంచి ప్రాధాన్యత యిస్తారు ఇళ్ళు శుభ్రంగా అలికి రకరకాల ముగ్గులు వేస్తారు. ఆదిమ నివాసుల ఇళ్ళు కర్రలతో, వెదురు తడికలతో, అడివి తీగలతో వున్నా విశాలంగా, శుభ్రంగా వుంటవి. ఒక్కొక్క జాతికి ఒక్కొక్క విధానమైన గృహనిర్మాణ వాస్తు వుంది ఆదిలాబాదు నుంచి పోలవరందాకా గోండులు, కోయలు, నాయకపోడులు, లంబాడీలు గుడిసెలు చతురస్రంగా కట్టుకుంటారు. ప్రతి గుడిసెకు ఆవరణ వుంటుంది. ఆ ఆవరణలో కూరగాయలు—ముఖ్యంగా చిక్కుళ్ళు—గొడ్డుగోద కట్టివేసుకోటానికి చోటు, ఇంటిముందు నలుగురు కూర్చోటానికి స్థలం వుండి తీరుతుంది, అడవి తీగతో గాని లేక వెదురు బద్దలతోగాని తడికలల్లి గోడ కట్టారు. ఆ తడికలకు ఎర్రమన్ను పేడపూసి తెల్ల సుద్దతో సుందరమైన బొమ్మలు వేస్తారు. ఆ బొమ్మల్లో వన్యమృగాలు, వేటాడటాలు, పూలతీగలు, చిత్రిస్తారు. గుడిసె చుట్టువున్న తడికమీద ఒక అంగుళం గూడా వదలకుండా చిత్రకళ రూపొందిస్తారు.

వానాకాలంలో నీళ్ళు గుడిసెలోకి రాకుండా ప్రతి గుడిసె భూతలం నుంచి అడుగు రెండడుగుల మేరువపోసి కట్టారు. గుడిసె కప్పుమీద పూలతీగలు చిక్కుడు తీగలు పాకిస్తారు.

విశాఖ శ్రీకాకుళం జిల్లాలలో ఆదిమనివాసులు అయిదూ ఆరూ యిండ్లు ఒకే చోట కలిపి ఒకే వసారాతో మధ్యమధ్యన విభాగాలతో కట్టుకుంటారు. బజారు ఇరు ప్రక్కల 10, 15 కుటుంబాలు వుంటాయి యిళ్ళు చూస్తే యీ పది పదిహేను కుటుంబాలు ఒకే కుటుంబమనిపిస్తుంది.

గిరిజనులలో ఏ ఒకరూ సంఘానికి దూరంగావుండి ఏకాకిగా బ్రతుకలేడు. ప్రతి వ్యక్తి సంఘంలో ఒక యిదమిద్ధమైన బాధ్యత నిర్వర్తించాల్సి వుంటుంది.

వారిలోవున్న సామూహిక కట్టుబాటు ప్రకృతి సిద్ధం. పంచ భూతాల బీభత్సం నుంచి తట్టుకోటానికి, తాము ఐకమత్యంగా మెలగటానికీ వారు అనాటినుంచీ చెక్కు చెదరకుండా కాపాడుకుంటున్న యీ సాంప్రదాయం వల్లనే ఆదిమనివాసుల సంఘం ఇప్పటికీ చెక్కుచెదరకుండా వుంది

ఇంకో చిత్ర మేమిటంటే ఆదిమనివాసుల గ్రామాల్లో "బిచ్చగాడు" అనేవాడు వుండడు. వెయ్యిలో ఒకరు వృద్ధాప్యంవల్ల చేతకాక, పోషించే సంతతిలేని తీరుకు ఆ వ్యక్తిని సంఘమే పోషిస్తుంది. ఒక గ్రామంలో వున్న గోత్రవిభజనవల్ల ఒకరి కొకరు అన్నలూ దమ్ములూ, లేక బావలూ, మరిదులూ, ఒకరి నొకరు వరుసతో కలుపకుండా పేరుపెట్టి మాత్రం పిలువరు. ఇలాంటి సంఘంలో అస్వస్థులైనంతమాత్రాన దిక్కులేనివారు మాత్రం కాదు

వీరికి పిల్లల మీద అత్యంత ఆదరణ. ఎన్నడూ పిల్లలను కొట్టరు. చాలా గారాబం చేస్తారు. తాము వేటకు పోయేటప్పుడు నృత్యగాన వినోదాలలో వున్నప్పుడూ పిల్లలు వెంబడి వుండే తీర్పుదు పొందుతారు

ఉన్నతనం నుంచి కూడా తాను ప్రేక్షకుడుగా వుండడు; భాగస్వామిగానే వుంటాడు.

అందుకనే ఆదిమనివాసుల సంఘీభావం నాగరికుల మనుకునే వారికి ఆదర్శమై, వారి పవిత్ర జీవనం మనం ఆకాంక్షించేదై వుంది. వారి జీవన విధానం ప్రకృతి శక్తులతో అల్లిబిల్లిగా అల్లుకొని వుండటం వల్ల నాగరికత ప్రసాదించిన మోసప్రవృత్తికి సుదూరమై ఆదిమనివాసుల సాంఘిక సంస్థను గురించీ, వారి సంస్కృతీ వివరాలను గురించీ తెలిసికోవాలని తృష్ణాతరులమై వున్నాము

సంఘం మారుతున్నది. గిరిజనుల పురాణేతి హాసాలూ, దేవతలూ, ఆదర్శాలూ-యిత్యాదివి గ్రంథస్థం కావటానికి వారి భాషలకు లిపిలేదు-(సవర భాషకు డా గి. రాంమూర్తిగారు, గోండు భాషకు ప్యూరర్ హేమాడార్ఫ్‌ల సేవలు వినా) వారి సంస్కృతి పూర్తిగా దేశప్రజలకు తెలియాలన్నా, అందులో వున్న మహోత్కృష్ట విషయాలు భావితరాలవారు పోగొట్టుకోకుండా కాపాడుకోవాలన్నా గిరిజనేతర మేధావుల కృషే నేడు ఆధారమైవుంది.

కాని ఆదిమనివాసులలో విద్యాధికులు తమనుతాము అనుశ్రుతంగా వస్తున్న పురాణ సంపత్తి, విద్వజ్ఞత, కథలు, గాథలు కళాఖండాలు ప్రేమతో ప్రోది చేయాల్సివుంది. కాబట్టి నేటి మన కర్తవ్యం వుద్వేగంగల మేధావులైన యువకుల్ని గుర్తించి వారికి ప్రోత్సాహమిచ్చి వారు తమ కర్తవ్యం నిర్వహించేటట్లు చేయటమే.

పేరిణి శివ తాండవం

(214 వ పుట నుండి)

పేరు శ్రీ ఆనంద్ బాన్‌సదా. అటుపై బ్రిటన్‌కు చెందిన మరొక యువకుడు శ్రీ సైమన్ సివిగ్ మని ఈ నృత్యము నభ్యసించుటకు లండను నుండి వచ్చి, నేర్చుకొంటున్నాడు.

ఈ విధంగా రెండు సంవత్సరాల అతి స్వల్ప కాలంలో ఈ కళా రూపం, సామాన్య ప్రజలనేగాక, పండితులను, శాస్త్రవేత్తలను యెంతగానో ఆకర్షించింది. కేరళ నుండి వచ్చిన విద్యార్థులు, కేరళ దేశమంతటా పేరిణి ప్రదర్శనాల నిచ్చుచున్నారు. తిరుచ్చూరు. శ్రీ సి.పి. రాఫీ అనే పేరిణి విద్యార్థి ప్రదర్శనం తిలకించిన ఒక పోలీసు ఆఫీసరు 'భారత శ్రీ 1976' శ్రీ టి. ఎల్. జానీ ముగ్ధుడై వీర రసప్రాధాన్యత గల్గిన ఆ నృత్యమును అభ్యసించాలనే సంకల్పంతో ఒక సంవత్సరకాలము ఉద్యోగానికి సెలవు పెట్టి శిక్షణ పొందుటకు హైదరాబాదు - వస్తున్నారు. ఈ విధంగా ఈ నర్తన రీతి అత్యంత ప్రచారములోనికి వచ్చింది. అంతలో అకాడమి వారి ఆర్థిక సహాయం ఆగిపోవుటవల్ల ప్రస్తుతం నృత్య నికేతనం తరుపున పేరిణి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా విద్యార్థులకు శిక్షణ ఏర్పాట్లు చేశాము

భారత దేశమంతటిలో వీరరసప్రాధన్యత గల్గి, ముఖ్యంగా పురుషులచే ఆరాధింపబడిన నృత్య సంప్రదాయం ప్రాచీన కళాకారులు, వేత్తలు రూపొందించిన ఈ పేరిణి శివ తాండవము ఒక్కటియె కన్పించుచున్నది. ఇంతటి ఉన్నత స్థాయిలో శుద్ధ తాండవ రీతి మరెచ్చటను అభివృద్ధిగాంచ లేదు ఇది ఆంధ్రుల కెంతో గర్వకారణం.

ఆంధ్ర ప్రదేశ్‌లో ఖనిజ సంపద

శ్రీ పింగళి పరశురామయ్య

మనం నివసించే భూమిని త్రవ్వుతూ లోలోపలకు వెళ్ళిన కొలదీ మనకు అనేక రకముల మట్టి పొరలు, రాళ్ళు, వాటి ననుసరించి వివిధ పరిశ్రమలకు అతిముఖ్య ముడిపదార్థములుగా వుపకరించే ఖనిజములు కనిపిస్తాయి. ఒక దేశ పారిశ్రామికాభివృద్ధి యిట్టి ఖనిజ సంపదను భూగర్భమునుండి బయటికి తీసి, వాటిని సద్వినియోగం చేసే ప్రక్రియపై ఆధారపడి వుంటుంది. భారత దేశ మంతటిలోనూ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఖనిజ సంపదలో అగ్రశ్రేణికి చెందినదని పేరు పొందినది. ఈ ప్రాంతంలో ఖనిజములను తగు రీతిని అన్వేషిస్తే ఆ అన్వేషణ దక్షిణ భారత భూగర్భ శాస్త్రమును ప్రతిబింబించును. ఈ రాష్ట్రంలో భూగర్భితమైన ఖనిజ సంపద అన్వేషణకు హెచ్చు అవకాశములు కలవు. అయితే భూతత్త్వ శాస్త్రజ్ఞులు, ఖనిజ పరిశోధకులు యీ కార్యక్రమమునకు తమ జీవితమును అంకితము చేసినపుడే అది సాధ్యమగును.

ఇక మన రాష్ట్రంలో లభించే ఖనిజ సంపదను గూర్చి క్లుప్తంగా వివరిస్తాను.

వజ్రములు

మన ప్రాంతంలో దొరికే మణులుగా పరిగణింపబడే, ఖనిజములలో వజ్రము అమూల్యమైనది. అత్యంత ఆకర్షణీయమైనది. గట్టితనము, అందము, మన్నిక, అపురూపము మొదలగు లక్షణములు దీనికి కలవు. అంతేకాదు వజ్రము పారిశ్రామిక ప్రపంచములో ప్రముఖ పాత్ర వహిస్తున్నది. పాతాళగంగ, కిరోసిన్ ఆయల్ మొదలైన వాటిని కనుగొనటానికి జరిపే త్రవ్వకాలలో వుపయోగించే డైమండ్ డ్రిల్సుకు, అతి సున్నితమైన లోహపు తీగెలను తయారుచేయటానికి, అతి శక్తివంతమైన ఫిరంగులు తదితర యుద్ధ యంత్ర సామగ్రికి కావలసివచ్చే అతి గట్టి ఉక్కును కోయడానికి వజ్రములు వుపయోగపడతాయి. ఈ పరిశ్రమలకు వుపయోగించే వజ్రములను ఖనిజ శాస్త్రజ్ఞులు బోర్ట్, బల్లాస్, కార్బనెడో అని పిలుస్తారు.

1725 సం॥లో బ్రెజిల్‌లో వజ్రాలను కనిపెట్టేంతవరకూ, 1870 సం॥లో దక్షిణాఫ్రికాలో వజ్రపు గనులు బయటపడే వరకూ, ప్రపంచానికి అవసరమైన వజ్రాలను ఆంధ్రప్రదేశ్ ఒక్కటే సరఫరా చేసేది. కోహినూరు, పిట్టు లేక రీజెంటు, ఆర్లాఫ్, నైజాము మొదలైన చారిత్రాత్మక వజ్రాలన్నీ 17వ శతాబ్దంలో పనిచేసిన వజ్ర గనులలో దొరికినవే. ఫ్రెంచి రత్నాల వ్యాపారస్థుడు, టేవర్నియర్ 1645 సం॥లో గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లి తాలూకా, కొల్లూరు గ్రామ సమీపంలో పనిచేస్తున్న వజ్రాల గనిని సందర్శించినప్పుడు, అనుదినము 60,000 ల మంది శ్రామికులు పనిచేస్తున్నట్లు తన నివేదికలో ఉదహరించారు. దీనిని బట్టి ఆ పరిశ్రమ ఆ రోజులలో ఎంత అభివృద్ధి చెందినదీ ఊహించవచ్చు.

వజ్ర పరిశ్రమ పునరుద్ధరణకు యిప్పటికీ, ఎప్పటికీ ఎక్కువ అవకాశంగల ప్రాంతములు ఏమిటంటే—

వజ్రకరూరు:— అనంతపురం జిల్లాలో గుంతకల్ రైల్వే స్టేషనుకు దక్షిణంగా పదిమైళ్ళ దూరంలో ఈ గ్రామం ఉన్నది. ఈ గ్రామానికి పడమటగా నున్న ఒక చిన్న కొండ సమీపంలోనూ, యిదే గ్రామానికి తూర్పున ఎఱ్ఱ కొండ గుంటలనే ప్రదేశంలోనూ అతి ప్రాచీన వజ్రపు గనులు కలవు. 1677వ సం॥లో ఎరల్ మార్షల్ హోవార్డ్ దొర రాయల్ సొసైటీకి సమర్పించిన నివేదిక ప్రకారం ఈ ప్రాంతంలోని గనులను పరిపాలకులు తమకై ప్రత్యేకించుకొన్నారు. యిక్కడ దొరికిన వజ్రములు ఎక్కువ కాంతి కలవి, పెద్దవి.

లత్తవరం:— వజ్రకరూరుకు దాదాపు 15 మైళ్ళ దూరంలో దక్షిణంగా నున్న ఉరవకొండ సమీపంలోని లత్తవరం గ్రామంలో మరొక అతి ప్రాముఖ్యంగల, ప్రాచీన వజ్రపు ప్రదేశం కలదు. యిచ్చటనూ, గుత్తి రైల్వే స్టేషనుకు వాయవ్యంగా దాదాపు 10 మైళ్ళ దూరంలో మదరాసు–బొంబాయి రైల్వే రోడ్డు ప్రక్కన ఉన్న కొంగనపల్లిలోనూ, కర్నూలు జిల్లాలోని తుగ్గలికి రెండు మైళ్ళ దూరములోనూ, ఈ వజ్ర పరిశ్రమకు మంచి అవకాశం కలదు.

బరైటెస్ (Barytes)

దీన్ని రాయలసీమలో 'ముగ్గురాయి' అని పిలుస్తారు. ఈ ఖనిజము చాలా బరువుగా ఉంటుంది. ఈ గుణంచేతనే ఈ ఖనిజాన్ని యితర ఖనిజాలనుండి తేలికగా కనుగొనవచ్చు. ఈ ఖనిజం రాయలసీమలో విస్తారంగా లభించును. ప్రభుత్వ భూగర్భ శాస్త్రజ్ఞులు డాక్టర్ ఎ.ఎల్. కౌల్సన్ తన నివేదికలో రాయలసీమలోని అరవై ప్రదేశాలలో యిది దొరుకుతుందని పేర్కొన్నారు. యిటీవల ఖమ్మం జిల్లాలో కూడా దీన్ని కనుగొన్నారు. కడప

తాలూకాలోని నందిమండలం గ్రామం సమీపంలోనూ, పులివెందుల, తాలూకాలోని తాళ్ళపల్లి, వేముల గ్రామముల సమీపంలోనూ ఉన్న ఈ ఖనిజ ప్రదేశాలను 1952 సం॥లో పరీక్షించారు ఈ ప్రదేశాలలో 1,66,000 టన్నుల మేరకు ఉన్నదని అభిప్రాయపడ్డారు

రంగులు బట్టలు, రబ్బరు, కాగితము పరిశ్రమలలోనూ కృత్రిమ దంత వస్తువులు, ముద్రణ సిరా మొదలగు వాటి తయారీలోనూ దీన్ని విరివిగా వాడుతున్నారు.

ఆస్బెస్టాస్ (Asbestos)

దీన్ని 'రాతినార' అని పిలుస్తారు యిది శిలలతో ఉద్భవిస్తుంది కనుక దీనికి ఈ పేరు వచ్చింది. ఉత్తమమైన జాతి రాతినారను "క్రిసొటైల్" అని పిలుస్తారు. యిది కడప జిల్లాలోని పులివెందుల తాలూకాకు చెందిన బ్రాహ్మణపల్లి, యిప్పట్ల, చిన్నకుడాల, లోపతనూతుల, రామనూతులపల్లి, లింగాల, వెలిదెండ్ల గ్రామాల సమీపంలోనూ, కర్నూలు జిల్లాలోని చిన్న మల్కాపురం, జోహార్‌పురం గ్రామాల సమీపంలోనూ విస్తారంగా లభిస్తుంది. బ్రాహ్మణపల్లిలో దొరికే రాతినార మేలురకమైనదని, కెనడా రాతినారతో సమానమైనదని ప్రఖ్యాతి. కడప జిల్లాలో 2,56,200 టన్నుల రాతినార దొరుకుతుందని అంచనా.

వేడిని నిరోధించే శక్తి దీనికి కలదు కనుక దీనిని భవన నిర్మాణమునకూ, పెంకులు యిటుకలు, సిమెంటు మొదలగు పరిశ్రమలలోనూ విరివిగా వాడుదురు. స్టీమ్ పైపుల ప్యాకింగుకు కూడా దీన్ని విరివిగా ఉపయోగిస్తారు.

క్రోమైట్ (Chromite)

కృష్ణా జిల్లా కొండపల్లికి నాలుగు మైళ్ళ దూరంలోనున్న కడింపోతవరం వద్దనూ, కొండపల్లికి, వాయవ్య దిశలోనున్న కొండల మధ్యా గంగినేని రైల్వే స్టేషనుకు పడమటగా ఉన్న ప్రదేశంలోనూ ఈ ఖనిజం లభిస్తుంది.

ఈ ఖనిజాన్ని ఎక్కువగా ఉక్కు తయారీలో ఉపయోగిస్తున్నారు. క్రోమ్‌స్టీల్ అని పిలిచే ఒక రకపు ఉక్కు తయారీలో దీని ఉపయోగం ఎక్కువ

రాగి (Copper)

గుంటూరు జిల్లాలోని, వినుకొండ తాలూకా అగ్నిగుండాల వద్ద భారీ ఎత్తున ఈ ఖనిజమును ప్రభుత్వమే అన్వేషణ జరుపుతున్నది ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉన్నాయని తెలుస్తున్నది. ప్రభుత్వం వారు కొనసాగిస్తున్న అగ్నిగుండాల రాగిపథకం క్రింద వచ్చే నల్లకొండ బ్లాకులో 50 లక్షల టన్నుల రాగిరాయి (Copper ore) భూగర్భితమై ఉన్నట్లు అంచనా వేశారు. ఖమ్మం జిల్లాలోని మైలారం వద్ద కూడా ఈ ఖనిజమునకై అన్వేషణ కొనసాగిస్తున్నది ప్రభుత్వం. నెల్లూరు జిల్లాలోని గరిమనిపెంట వద్ద ఈ ఖనిజాన్వేషణకు అవకాశంకలదు.

ముఖ్యంగా ఈ ఖనిజాన్ని విద్యుత్ పరికరాలు, యంత్ర విభాగాలు మొదలైన వాటిని ఉత్పత్తి చేయడానికి వినియోగిస్తారు ఒక్క యుద్ధ నౌక నిర్మాణంలోనే 20 లక్షల పౌండ్ల రాగి అవసరం.

గ్రాఫైట్ (Graphite)

దీనిని 'మెరుగుడు' మన్ను అని అంటారు. ప్రత్యేకించి ఖమ్మం, ఉభయ గోదావరి, శ్రీకాకుళం జిల్లాలలో విరివిగా ఈ ఖనిజం లభిస్తుంది. శ్రీకాకుళం జిల్లాలోని సాలూరు తాలూకా కొండముసూర్ గ్రామం సమీపంలో మేలురకపు గ్రాఫైట్ ప్రదేశానొక్కదాన్ని ప్రభుత్వం యిటీవల కనుగొని త్రవ్వకం జరుపుతున్నది. శ్రీకాకుళం జిల్లాలోని కురుపం, విశాఖపట్టణం జిల్లాలోని విజయనగరం, పశ్చిమగోదావరిజిల్లాలోని జంగారెడ్డిగూడెం, తూర్పు గోదావరి జిల్లాలోని దోరమామిడి మొదలగు ప్రాంతములందు కూడా యిది లభించును. ఈ ఖనిజాన్ని మూసల పరిశ్రమలోనూ పెన్సిళ్ళ తయారీకి, జిడ్డు పదార్థములు అంటే ల్యూబ్రికెంట్స్ (Lubricants)కు విరివిగా ఉపయోగిస్తారు.

సున్నపురాయి

మన రాష్ట్రంలో సిమెంటు పరిశ్రమకు ఉపయోగపడే సున్నపురాయి ఆదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్, పల్నాడు, విశాఖపట్నం, కడప ప్రాంతాలలో హెచ్చుగా లభించును. కర్నూలు, అనంతపురం జిల్లాలలో రసాయనిక పరిశ్రమలకు ఉపయుక్తమయిన అతినాణ్యమైన సున్నపురాయి లభించును. ఈ రెండు జిల్లాలలో 12,000 కోట్ల టన్నుల సున్నపురాయి దొరుకుతుందని అంచనా.

బొగ్గు

కొంత కాలం క్రితం గోదావరినది వొడ్డు దగ్గర జరిపిన అన్వేషణలో 100 కోట్ల టన్నుల బొగ్గు కలదని ఋజువయినది యిదిగాక 102 కోట్ల టన్నుల బొగ్గు అదనంగా లభించుటకు అవకాశం కలదని కూడా వినికిడి. మన రాష్ట్రంలో సింగరేణి, కొత్తగూడెం బొగ్గుగనులు సుప్రసిద్ధములు. అనేక సంవత్సరాలుగా ఈ గనుల నుండి బొగ్గు తీయబడుచున్నది.

సుప్రసిద్ధ భూగర్భ శాస్త్రజ్ఞులు డాక్టర్ ఎమ్. ఎస్. క్రిష్ణన్ 'ఆంధ్ర ప్రదేశ్‌లో నేలబొగ్గు' అను విషయంపై వ్రాసిన ఒక వ్యాసంలో అశ్వారావుపేట కామవరపుకోట, కొవ్వూరు ప్రాంతం (గోదావరి జిల్లా) లో అనేక చోట్ల నేలబొగ్గుకు మంచి అవకాశములు కలవని పేర్కొన్నారు.

బంగారము

అనంతపురం జిల్లాలోని రామగిరి గ్రామం సమీపంలో బంగారానికి 1915 వ సం॥లో అన్వేషణ జరిగి 23,870 ఔన్సుల బంగారం ఉత్పత్తి చేశారు. యిదిగాక కర్నూలు జిల్లాలోని పగిడిరాయి వద్ద ఈ ఖనిజం లభించే అవకాశం కలదు.

మాంగనీసు (Manganese)

ఉక్కు తయారుచేయడానికి ప్రధాన ఖనిజమైన మాంగనీసు విశాఖ జిల్లా కోడూరు, రామభద్రపురం, చింతలవలస, గరివిడి, గర్భాం, చీపురుపల్లి, గజపతినగరం గ్రామాల సమీపంలో లభిస్తుంది ఈ జిల్లాలో ఈ ఖనిజం దొరికే ప్రదేశాలు 42 కలవని లాటూష్ తెలియజేశాడు.

మాంగనీసు క్షారములను రసాయనిక ఎరువులలో ఉపయోగిస్తారు. ఈ ఖనిజం లేనిదే ఉక్కు పరిశ్రమలేదు.

అభ్రకం

ఈ ఖనిజం ముఖ్యంగా నెల్లూరు జిల్లాలోని రాపూరు, గూడూరు, ఆత్మకూరు, కావలి తాలూకాలలో విరివిగా లభించును. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అభ్రకపు గనులన్నీ రాపూరు తాలూకాలో ఉన్నాయి. సువర్ణముఖి, పెన్నారు నదుల రెండు పొరచే కప్పబడిన ప్రదేశములలో యింతకంటే మించిన అభ్రకపు గనులు కలవని ప్రఖ్యాత భూతత్వవేత్త సర్ థామస్ హాలెండ్ 1902 సం॥లో ప్రకటించారు. కృష్ణా జిల్లాలోని తిరువూరు తాలూకా లక్ష్మీపురం, అంజనాపురం, చిత్యాల, గ్రామాలవద్ద ఈ ఖనిజం బయటపడింది. కల్లూరు కప్పల బండంవద్ద కూడా ఈ ఖనిజం లభిస్తుంది.

విద్యుచ్ఛక్తి పరిశ్రమకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్పార్కింగ్ ప్లగ్గులు, టెలిఫోన్లు మొదలగు ఉపకరణముల తయారీకి యిది ముఖ్యావసరం.

ఫెల్డ్‌స్పార్ (Feldspar)

ఈ ఖనిజం పింగాణి పరిశ్రమయందు వాడుదురు. ఆర్థోక్లేజ్, మైక్రోక్లైన్ అనురెండు రకముల ఫెల్‌స్పార్ నెల్లూరు జిల్లాలోని అభ్రక గనులందునూ, విశాఖపట్టణం, కృష్ణా, వరంగల్, ఖమ్మం జిల్లాలయందును, అసాధారణమైన పరిమాణములలో దొరుకును.

గార్నెట్ (Garnet)

స్వచ్ఛమైన అల్‌మండైన్ జాతి గార్నెట్ శిలలను రత్నములు మున్నగు విలువగల రాళ్ళుగా ఉపయోగిస్తున్నారు. యిది కొత్తగూడెం బొగ్గుగనులకు దక్షిణంగా నున్న గరీబ్‌పేట వద్ద లభించును. గోదావరి జిల్లాలోని గొల్లల మామిడాలలో గార్నెటు నుండి హంస కాగితం (Sand Paper) ను తయారుచేయు చిన్న పరిశ్రమ కలదు.

జిప్సమ్ (Gypsum)

ఎరువులు, సిమెంటు, రసాయనిక పరిశ్రమలయందును, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తయారీకి ఈ ఖనిజం ఉపయోగపడును. పులికాట్ సరస్సు ప్రాంతంలో యిది లభ్యమౌతుంది డాక్టర్ బి.సి.రాయ్ అంచనా ప్రకారం ఈ ప్రాంతంలో కొన్ని లక్షల టన్నుల జిప్సమ్ లభిస్తుంది.

కైనైట్ (Kyanite)

ఈ ఖనిజం 3000°F వరకూ ఉష్ణమును తాకుకోగలదు. యిందు స్వచ్ఛమయిన రకములు రత్నములుగా ఉపయోగపడును కొత్తగూడెంకు దక్షిణంగా, గరీబ్‌పేట వద్ద, కనిగిరి కొండలందు కూడా గార్నెట్ ఖనిజంతోబాటు యిది దొరకును గూడూరు తాలూకాలోని (నెల్లూరు జిల్లా) సైదాపురంవద్ద కూడా ఈ ఖనిజం లభిస్తుంది సుమారు 20 సం॥ల క్రితం ఈ ప్రదేశంవద్ద ఈ ఖనిజాన్ని త్రవ్వి కొంత పరిమాణం విదేశములకు సైతం ఎగుమతి చేశారు.

సీసము

వెండితో కూడిన (గెలీనా సీసము) ఖనిజము కడప జిల్లాలోని కడప తాలూకా నాగసానిపల్లె వద్ద ఎక్కువ పరిమాణంలో లభ్యమౌతుంది నల్గొండ జిల్లాలోని దేవరకొండవద్ద పరిశోధనలు జరిపితే సీసం దొరికే అవకాశమున్నది అగ్నిగుండాల, సమీపంలోని బండ్లమొట్టువద్ద ఈ ఖనిజాన్ని ప్రభుత్వంవారు త్రవ్వి తీస్తున్నారు.

నిర్మాణపు శిలలు (Building materials)

ఆంధ్రప్రదేశ్‌లో లభించిన కొన్ని పురాతన గ్రానైట్లు, గట్టిదనమునందును, అరుగుదలకోనుశక్తి మున్నగు గుణములందు కార్న్‌వాల్, నార్వే దేశములందు లభించు ఉత్తమ శిలలను పోలి యున్నవి ఈ కారణము చేతనే బొంబాయి రేవు నిర్మాణమునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని లింగంపల్లి వద్ద లభించిన గ్రానైట్లను ఎక్కువగా వాడారు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరములందు వివిధ గనులనుండి లభించిన గ్రానైట్లచే నిర్మింపబడిన, ఆకర్షణీయమైన భవనములు అనేకములు కలవు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్, నెల్లూరు, గుంటూరు, కృష్ణా జిల్లాలలోని అనేక ప్రదేశాలలో ఈ శిలలు కావలసినంత లభించును

ఇంతవరకు మన రాష్ట్రంలో లభించే కొన్ని 'ముఖ్యమైన ఖనిజాలను గురించి క్లుప్తీకరించాను యింకా వివిధ పరిశ్రమలలో ఉపయోగపడే కొన్ని ఖనిజములు కలవు వాటిని గురించి యువతరంవారు తెలుసుకొని దేశపారిశ్రామికాభివృద్ధికి తోడ్పడగలరని ఆశిస్తున్నాను.

ఈ రెండు దశాబ్దాల తెలుగు కథ



మంజుశ్రీ

తెలుగు కథకి అంతర్జాతీయంగానూ గుర్తింపు వచ్చింది. నాణ్యతగాంచింది. ఆధునిక సాహిత్యంలో చిన్నకథకు పెద స్థానమే గాక ప్రత్యేకమైన స్థానంకూడా వుంది. దీనికి కారణం ఆధునిక మానవ జీవితంలోని వేగమే. ఈ వేగాన్ని సాహిత్య సీమితం చేయగల ప్రక్రియగా కథానికకున్న వెసులుబాట్లు తక్కిన ప్రక్రియలకుంటటం కష్టం. దృశ్య, శ్రవణ విజ్ఞానంలో అపూర్వ ప్రయోగ విజ్ఞాన ఫలితంగా 'టెలివిజన్' ఆధునిక విజ్ఞాన వినోద, సాధనంగా అవతరించినట్లే, అనేక సాహిత్య ప్రక్రియల సమిష్టి శిల్పంగా చిన్నకథ అవతరించింది

చిన్నకథ టెలివిజన్ వంటిదన్నమాట.

ఈ చిన్నకథ ఆధునిక స్వరూపం తెలుగు సాహిత్యంలో ఆవిష్కరింప జేసింది, అన్నిటా ఆధునికుడైన గురజాడ వేంకట అప్పారావుగారే. ఈ శతాబ్దపు నవ్య సాహిత్యావిర్భావానికి ఆయనొక వేగుచుక్క, ఆయనొక వైతాళికుడు, పాత కొత్తల మేలుకలయికల క్రొమ్మెరుగులు జిమ్మినవాడు.

బందరునుంచి ఆ రోజుల్లో ఆంధ్రభారతి అనే పత్రికవచ్చేది. 1912 ప్రాంతంలో అందులో గురజాడ అప్పారావుగారి కథలు అణిముత్యాలలాంటివి వెలువడ్డాయి. ఆయనరాసిన కథలు చాలా కొద్ది,మూడు నాలుగున్నాయేమో. సంస్కర్త హృదయం, మెటిల్డా దేవుడుచేసిన మనుషుల్లారా, మీ పేరేమిటి మొదలైనవి. అయితే గురజాడను ఎందుకు పేర్కొనవలసి వచ్చిందంటే నేటి శిల్ప సమన్వితమైన చిన్నకథకికూడా అడుగుజాడ చూపిన వాడాయనే.

ఆటుతరువాత రెండు ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో కథానిక బాగా ప్రాచుర్యం పొందింది. కొత్త కొత్త దిన, వార, పక్ష, మాసపత్రికలు వెలువడంతో, కథానిక తన శిల్పాన్నిబాగా పెంపొందించుకుంది.

అంటే తెలుగుకథకి మొన్న మొన్ననే షష్టిపూర్తి అయిందన్నమాట. అంటే ఆధునిక సాహిత్య ప్రక్రియగా మరొకవిషయం కూడా ఆసక్తి కలిగిస్తున్నది. తెలుగువాళ్ళు స్వరాష్ట్రం సంపాదించుకోవాలనే కోర్కెతోపాటుగానే తెలుగు సాహిత్యంలో చిన్న కథకూడా పుట్టింది.

అందువల్ల ఇప్పుడీ ఇరవైఏళ్ళ కాలంలో తెలుగు కథానిక సంతరించుకున్న అ దచందాలను సమీక్షించుకోవడం చాలా ఆనంద దాయకం.

1956 నవంబరు 1వ తేదీ తెలుగువాళ్ళ చరిత్రలో అపూర్వ పర్వదినం. ఎన్ని శతాబ్దుల తరువాతనో మళ్ళీ అన్నదమ్ములు ఏకం కావడం, ముక్కచెక్కలైన మనోభావాలు ముప్పేట ముత్యాల హారంలాగా కూడివచ్చి తెలుగుతల్లి కంఠసీమను శోభింపచేయడం. అందుకే ఆకాశమంత పందిరివేసి, భూదేవినే అరుగునుచేసి ఉత్సవం సారించారు తెలుగువాళ్ళు.

కథక సమ్మేళనం

ఈ జంట నగరాలలో నాలుగు రోజుల పాటు వరసగా సాంస్కృతిక, సాహిత్యసమారోహాలు జరిగాయి. కళా ప్రదర్శనలు జరిగాయి. కలకలలాడే వాతవరణం ఎక్కడ చూసినా తాండవించింది. నవంబర్ నాలుగో తేదీన కథకుల గోష్ఠిని ఏర్పాటు చేయడం జరిగింది సాహిత్యోత్సవాల సందర్భంగా.

అంతకు ముందు ఎన్నడూ ఎక్కడా జరగలేదు ఇది. కవి సమ్మేళనాలు ఎన్నోజరిగాయి. జరుగుతుంటాయి. కాని కథక సమ్మేళనం అపూర్వం.

ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావ శుభవేళ, చారిత్రాత్మకమైన మహోత్సవసంరంభాన, జంట నగరాలలో నాడు ప్రసిద్ధులుగా ఉన్న కథా రచయితలందరూ పాల్గొని పదిహేను పదహారు మందిదాక కథలు వినిపించడం జరిగింది. శ్రోతలంతా ఆనందించారు. ఆసభకి సుప్రసిద్ధ కథాశిల్పి స్వర్గీయ బుచ్చిబాబు అధ్యక్షత వహించడం, హాస్యకథా చక్రవర్తి మునిమాణిక్యం నరసింహారావు చిన్నకథని గురించి ఉపన్యసించటమూ జరిగింది. ఈ సమావేశంలో ఇసుకపల్లి సోదరులు, స్వర్గీయ సింగరాజు లింగమూర్తి, శ్రీమతి తురగా జానకీరాణి, సురమౌళి కీ॥ శే॥ భాస్కరభట్ల కృష్ణారావు, నెల్లూరి కేశవస్వామి, పోతుకూచి సాంబశివరావు ప్రభృతులంతా పాల్గొని తమ కథలు చదివి వినిపించారు. సురమౌళి ఆనాటికే ఈ గడ్డ పలుకుబడిని కథానికకు ఉపయోగించుకున్నాడు. మాండలికమైన నుడికారపు సొంపుసంపదలు సాహితీపరుల దృష్టిని ఆనాటికే ఆకర్షించిన వన్నమాట.

నవ్యసాహితీ సమితి హైద్రాబాదు నగరంలో రచయితల గోష్ఠులను ఏర్పాటు చేస్తూ ఉండేది, అట్లానే సాధన సమితి కూడా ఈ సమావేశాలలో ఆయా రచయితలు కథలు వినిపించడం, నలుగురు చర్చించడం జరుగుతుండేది.



డా॥ శ్రీ బుచ్చిబాబు

1957లో కాలేజి నవ్యసాహితీ సమితివారు సంకలనం చేసిన పార్కులో పచ్చపూలు అనే కథాసంపుటం వచ్చింది. ఈ సంకలనంలో చాలా వైవిధ్యం గల కథలున్నాయి. ఒక గొప్పవిషయం ఏమంటే ఆంధ్రప్రదేశ్ అవతరణ శుభవేళకు, ఇప్పుడు సుప్రసిద్ధులుగా ఉన్న అనేకమంది రచయితలు, తమ రచనారంభంచేసి ఉండటమో లేదా రచయితలుగా పుట్టడమో జరిగింది. నేడు కథకులుగా బాగా ప్రసిద్ధికెక్కిన కొమ్మూరి వేణుగోపాల రావు, వీరాజీ, గొల్లపూడి మారుతీరావు, మొదలైన వాళ్ళంతా ఇంచుమించుగా రచనా వ్యాసాంగానికి అప్పుడు పూనుకొన్నవాళ్ళే. డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు కథ 'ఇల్లు కొన్నాడు' మధ్యతరగతి ఆశలకు, ఆశయాలకు, ఆరాటాలకు పోరాటాలకు, చిత్రణ. ఇతర భారతీయ భాషలలోకి అనూదితం చేయడానికి ఎంపిక చేయబడిన కథ. ఈ ఇరవై సంవత్సరాల కాలంలో చెప్పుకొన దగిన మరొక విశేషం ఏమంటే కీర్తిశేషులు గోపీచంద్, బుచ్చిబాబుల వంటి వారి కథా సంపుటాలు, వెలువడటం. అదే విధంగా జాతికథకుడైన మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కథలు చిన్న చిన్న సంపుటాలలో ముద్దులొలికే ముఖచిత్రాలతో వచ్చాయి. అన్నిటికన్నా ముఖ్యంగా చెప్పుకోవలసింది కథల పోటీలు. అంతకు పూర్వం పత్రికలు ప్రత్యేకంగా కథల పోటీలు నిర్వహించేవి కావు. కాని ఈ ఇరవై సంవత్సరాలలో ఇదొక విలక్షణమైన అనువత్సర కార్యక్రమంగా ఇంతో అంతో పేరున్న ప్రతి పత్రికా కథానికల పోటీ కార్య క్రమాన్ని ప్రారంభించి నిర్వహిస్తూ వచ్చింది అందువల్ల ఎందరో యువరచయితలు పరిచితులైనారు. వారివారి ప్రతిభ ప్రదర్శితమైంది. కొత్తగా రాస్తూనే గొప్పగా రాసినవాళ్ళున్నారు. శ్రీ దుత్త దుర్గాప్రసాద్, శ్రీపాలపర్తి వేణుగోపాల్, కుమారి పి. లీల అటువంటివారు. వీళ్ళు అంతకు పూర్వం ఏ పత్రికలోను రచనలు చేసినట్లు కనపడకపోయినా ఒక సుప్రసిద్ధ వారపత్రిక నిర్వహించిన పోటీలలో బహుమానాలు గెలుచుకోవడం విశేషం. సుప్రసిద్ధ నవలా రచయిత్రులుగా నేడు పేరుతెచ్చుకొన్న శ్రీమతి యద్దనపూడి సులోచనారాణిగారు, శ్రీమతి రంగనాయకమ్మగారు, 1956, 57 ప్రాంతాలలో కథా రచయిత్రులుగా మాత్రమే పరిచితులు. ఆంధ్రప్రభ దిన పత్రికలో వచ్చిన శ్రీమతి రంగనాయకమ్మగారి కథ 'పల్లెటూరు' ఆ రోజులో అందరినీ ఆకర్షించింది.

మద్రాసునుంచి శ్రీ ధనికొండ హనుమంతరావు, జ్యోతి మాస పత్రికను ఆ రోజుల్లోనే పునరుజ్జీవింప చేయడం జరిగింది. శ్రీయుతులు రావూరి భరద్వాజ, తాళ్ళూరి నాగేశ్వరరావు, శివం, కందుకూరి లింగరాజుగారలు జ్యోతిలో, ఆ రోజుల్లో మంచి కథలు ప్రకటిస్తూ వచ్చారు.

స్వర్గీయ దేవరకొండ బాలగంగాధర తిలక్ కథకుడుగా పుట్టింది ఈ ఇరవై ఏళ్ళలోనే. సుందరీ-సుబ్బారావువంటి హాస్య చమత్కార భరితమైన కథలే కాకుండా నల్లజెర్ల రోడ్డు, కదిలే నీడలు వంటి, అత్యద్భుత శిల్ప ప్రతిభగల కథని ఆయన రచించారు. శ్రీ తిలక్ వ్రాసిన 'ఓడిపోయిన మనిషి' లో ఆయన తాత్త్విక చింతనం కనిపిస్తుంది. కవితాత్మగల భావుకుడైన, స్వేచ్ఛా విహంగమ ప్రకృతి నభిలషించే వ్యక్తికి, ఈ సమాజం, నీతులు, ఆచారాలు, మర్యాదలు, హద్దులు, కృత్రిమాలు, ఎంతబాధాకరం, అంటారయన. కేవలం కథను, కథాదృష్టితో మాత్రమేకాక, తాత్త్విక అవగాహనతో, సామాజిక స్పృహతో, వ్రాయాలన్న ధోరణి ప్రబలడం ఈ ఇరవయి ఏళ్ళలో ఈ ప్రక్రియ సాధించిన గొప్ప పరిణామంగానే పేర్కొనాలి.

సతత హరిత వృక్షం వంటి శ్రీ కొడవటి గంటి కుటుంబరావు గారు ఈ ఇరవయి ఏళ్ళలోను కథలు వ్రాస్తూనే వచ్చారు. కాని కథల కన్నా ఆయన నవలికలే ఎక్కువ వ్రాశారు

ప్రక్రియల్లో ప్రయోగాలు

చిన్న కథకు సంబంధించి ప్రక్రియా సంబంధమైన ప్రయోగాలెన్నో ఈ ఇరవై సంవత్సరాల కాలంలోనే, ఆయా రచయితలు, పత్రికా నిర్వాహకులు, ఆకాశవాణి నిలయం వారు చేపట్టడం జరిగింది. 1962 ప్రాంతాలలో హైదరాబాదు ఆకాశవాణి వారు, ఒక అపూర్వమైన కథక సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఐదు నిమిషాల వ్యవధిలో కథ వొదిగి పోవాలి. ఆహ్వానితులైన ప్రేక్షకుల సమక్షంలో రచయితలే చదవాలి. 'ఏకాదశి' అనే పేరుతో పదంకొండు మంది రచయితల, రచయిత్రుల కథలను ఈవిధంగా ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ప్రసారం చేసింది. శ్రీమతి సులోచనారాణి, శ్రీపోరంకి దక్షిణామూర్తి శ్రీ వాకాటి పాండురంగారావు, శ్రీమతి యశోదారెడ్డి వంటి ప్రముఖులెందరో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ఐదు నిమిషాల కథను వినిపించారు. ఇందు కోసంగా వ్రాసిన వాకాటి పాండురంగారావు కథ 'డాక్టరుకు ప్రాణంపోశాడు' చిన్నకథలో అనల్ప శిల్పానికి, ఇతివృత్త ఉదాత్తతకు, ఒకే సంకేతంగా భావుకుల ప్రశంసల నందుకొంది.

శ్రీయుతులు ఇచ్ఛాపురం జగన్నాథరావు, బలివాడ కాంతారావు, అవసరాల రామకృష్ణారావు, హితశ్రీ, ఆర్.ఎమ్. చిదంబరం, వేదుల లక్ష్మణమూర్తి, శాండిల్య మొదలైన రచయిత లెందరో ఈ ఇరవై ఏళ్ళ తొలి సగమైన కాలంలో వివిధ పత్రికలో విరివిగా వ్రాశారు. ఈ ఆధునిక ప్రక్రియ సర్వవ్యాపి ఇతివృత్తంగాని, శిల్పంగాని, పాత్రల మనోభావ చిత్రణగాని, సామాజిక పరిస్థితుల ప్రతి

బింబంగాని, అనంత వైవిధ్యంతో చిన్న కథలో నిర్వహించవచ్చు అందుకే ఇంతగా ప్రీతిపాత్రమైంది. సాహిత్య భావుకులకు చిన్న కథలో ఒక విలక్షణత కూడా వున్నది. మరో సాహిత్య ప్రక్రియలో నిర్వహించడానికి అవకాశం కనిపించనిది.

ఏమంటే చిన్న కథ సమాహార ప్రక్రియ. సమగ్ర ప్రక్రియ. అందువల్లనే వెనకటితరంలో శ్రీ వేలూరి శివరామశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి వంటివారు, కథలు వ్రాయడం జరిగింది. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు సర్వ ప్రక్రియలను చేపట్టినా చిన్న కథలోకూడా తమప్రత్యేకతను చూపుకున్నారు. 'సప్తాశ్వము' 'మా క్లీ దుర్గంలో కుక్క' వంటి వారి కథలు బాగా ప్రసిద్ధి పొందినవి.

ఈ ఇరవై ఏళ్ళ తెలుగు కథను సమీక్షించు కొనేప్పుడు, అత్యంత ప్రతిభాశాలురైన కథకులిద్దరు ముందుగా, మునుముందుగా వచ్చి నిలుస్తారు. రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావు గారలు వాళ్ళు. బడుగుమనిషి బాధలు, బక్కచిక్కినవారి గాథలు వీరి కథావస్తువులు. ఈ ఇరవై సంవత్సరాల పరిణామంలో తెలుగు కథ ఎంతగానో సామాజిక స్పృహను, సామాజిక వాస్తవికతను, బాధ్యతను సంతరించుకుంది. సమాజంలోని వర్గ సంఘర్షణ, అట్టడుగు తరగతుల వారి దయనీయ జీవనము. వారి జీవిత తత్వ చింతనము. వారి విలువలు ఈ రచయితలు అత్యంత వాస్తవికంగా ప్రతిభతో చిత్రించగలరు. విశ్వనాథశాస్త్రిగారి ఆరు సారా కథలు, కాళీపట్నం రామారావుగారి యజ్ఞం, తీర్పు, శిక్ష, మొదలైన కథలు సంపుటాలుగా వచ్చాయి.

మనోవిశ్లేషణ

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం మేధావివర్గ రచయిత. వీరి కథలు మనోవిశ్లేషణతోను, అంతర లోకాల సందర్శనంతోను సాగుతాయి. ఆయాపరిస్థితులలో ఆయావ్యక్తులు, ఎందుకావిధంగా ప్రవర్తిస్తారు–అనే విషయాన్ని విశ్లేషించి చూపి, మన విజ్ఞానాన్ని ప్రదర్శించే కథలు వీరివి. శ్రీమతి ఆర్. వసుంధరగారు, చాలా మంచి కథలు వ్రాశారు. నిత్యజీవితంలో తారసపడే పాత్రను మనో ప్రవృత్తులను, అధివాస్తవిక ధోరణిలో చిత్రించే నేర్పు ఈ రచయిత్రికి పుష్కలంగా ఉంది. ముఖ్యంగా ఈ ఇరవై సంవత్సరాలకాలంలో వస్తువు దృష్ట్యా, శిల్పందృష్ట్యా, ప్రయోగాత్మకమైన కథలు చాలా వచ్చాయి.

భావ విప్లవానికి సంబంధించి సంకేత ప్రాయమైన కథలు 'శ్రీపతి' వ్రాశారు. సర్పోడు, ఉదయం, మొదలైన కథలు, శిల్పం దృష్ట్యాచూసినా, సామాజిక చైతన్యోద్దీపనం దృష్ట్యా చూసినా, ఇవి మంచి కథలు. అతివాద ధోరణులు గల పత్రికలు కొన్ని రాజకీయ సిద్ధాంత వాహికగా కూడా కథా ప్రక్రియ నుపయోగించు కోవచ్చునని నిరూపించాయి.

అవసరాల రామకృష్ణారావుది తెలుగు కథకులలో ఒక ప్రత్యేకమైన బాణీ. ఈయన అర్థమున్న కథలు, ఐయిదు రకాల ఆత్మహత్యలు, తెలుగుదేశపు మధ్యతరగతి కుటుంబాల మర్యాదలు, సమస్యలు, కామనలు, కష్టసుఖాలు, చిత్రించే కథలు. సుకుమారమైన భావుకతతో, చురుకైన హాస్యంతో సంస్కారం మప్పే ధోరణిలో సాహిత్య ప్రయోజనాత్మకంగా వుంటాయి వీరి కథలు.

ఈ ఇరవై సంవత్సరాల కాల వ్యవధిలో తొలి పదేళ్ల విరివిగా కథా రచన చేసినవారు శ్రీ రంధి సోమరాజు. ఈయనది అచ్చమైన కవితా హృదయం. కొన్ని ఇంతకు పూర్వమే వ్రాసినా వీరి కథలన్నీ సంపుటాలుగా రావడం మాత్రం ఈ కాలంలోనే జరిగింది. సోమరాజుగారి కన్నె మనస్సు వంటి కథ ఎన్నడూ తొడిమ వీడని, వాడని పుష్పం వంటిది. దేవుడైన మానవుడు, ఈ లోకం–ఈ మనుషులు, మొదలైన కథలు, భావుకతా స్ఫోరకంగా ఉంటాయి.

ఏక రక్తం, మరో నిష్క్రమణం, రంగుటద్దాలు, మొదలైన కథానికలు వ్రాసిన ఇప్పాపురపు జగన్నాథరావు గారు మంచి కథా శిల్పి. పరువమైన భాష, సున్నితమైన, ఆర్ద్రమైన భావుకత అత్యంత వాస్తవికంగా జీవితంలో ఎదురయ్యే సన్నివేశాలు, ఈయన సమర్థవంతంగా చిత్రించ గలరు.

శ్రీ మధురాంతకం రాజారాం గారు అచ్చమైన తెలుగు కథకుడు. అంటే శిల్పం, వస్తువు, భావుకత, ధోరణీ, అన్నీ తెలుగుదనం తొణికిసలాడే కథలు. తాను వెలిగించిన దీపాలు, కమ్మ తెమ్మెర, దుష్ట సమాసం, రుద్రభూమి, పిచ్చి వెంకట్రావు వంటి కథలు, తెలుగు కథా సాహిత్యానికే వన్నె తెస్తాయి. జీవితానుభవంతోను, గొప్ప పరిశీలనతోనూ, మాంసలంగా వుంటాయి రాజారాం గారి కథలు. రాజారాం గారి కథలు ఇటీవల సంపుటాలుగా వచ్చి తెలుగు కథా సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి.

బలివాడ కాంతారావు మంచి కథలు వ్రాశారు. నిత్యజీవితంలో కనిపించే సన్నివేశాలనే లోతుగా చూసి. ఆర్ద్రంగా అర్థం చేసుకొని, వాస్తవికంగా చెప్పగల నేర్పు వీరికున్నది. వీరు ఢిల్లీ మజిలీ కథల పేరుతో, భారతదేశ రాజధానిలోని ఆధునిక మానవ జీవిత చిత్రణను ఆసక్తికరంగా వ్రాశారు. ఈ సంపుటాలు ఆధునిక కథా సాహిత్యానికి అలంకారాలు కాగలవు. మంచిముత్యం కన్నకడుపు, మొదలైన కథలు గుర్తుంచుకో వలసిన కథలు.

వాకాటి పాండురంగారావు కథల్లో చురుకైన వ్యంగం, సున్నితమైన హాస్యం ఎక్కువ. వ్యక్తులలోని విలక్షణతలను కథా వస్తువులుగా ఈయన వ్యాఖ్యానించ గలరు. ఇటీవల వీరు వ్రాసిన ఏడువారాల కథలు, కథా సాహిత్యంలో వైవిధ్యాన్ని, శిల్పం దృష్ట్యాను, వస్తువుదృష్ట్యాను తెచ్చి పెట్టాయి.

యువ కథకుల్లో వి. రాజారామ మోహనరావు కథ రచనలో మంచి శిల్పం చూపుతున్న రచయిత. ఈయన ఇతి వృత్తం ఎన్నుకోవడంలోనే తన ప్రత్యేకమైన వ్యక్తిత్వపు ముద్రను ప్రదర్శించగలరు. సునిశితమైన పరిశీలనంగల కథా రచయిత.

'సీతు' వంటి మంచి కథలు వ్రాశారు పెద్దిభొట్ల సుబ్బరామయ్య. రచయిత ప్రాథమిక యోగ్యత అయిన మంచి పరిశీలనా శక్తి వీరికి పుష్కలంగా వుంది.

ఈ తరం రచయితలలో విశిష్టమైన కథా రచయిత శీలా వీర్రాజు. సమాధి, పగా మైనస్ ద్వేషం, హ్లాదినివంటి కథా సంపుటాలు ఈయనవి ఇదివరలో వెలువడ్డాయి. ఇటీవల ఊరు

పీడోఁ్కలు చెప్పింది అనే కథా సంపుటం వెలువడింది. ఈ సంపుటంలో ఉన్నవి ఆరు కథలు. ఈ ఆరు కథల్లోనూ ఎంతో వైవిధ్యముంది. సమాజంలోని అవివేకం, నిస్సహాయత, క్రౌర్యం, మోసం, వంచన, దగా మొదలైన మానవత్వపు ప్రవృత్తులను, లోతులను వ్యాఖ్యానించారు రచయిత. ఈయన పాత్రలు జీవిత వాస్తవాలను భ్రాంతులకు బలిచేసి పారిపోయే వ్యక్తులు కాదు. నేటి మధ్య తరగతి కుటుంబాల సామాజిక సమస్యలను, వారి కామనలను, కాంక్షలను, ఆంక్షలను, నేర్పుతో చిత్రించగల రచయిత శ్రీ వీర్రాజు. ఒక్కొక్కప్పుడు కట్టు కథలు కూడా గడ్డు నిజాలకు తీసి కట్టే అంటారు. ఓడిపోయాక, చావద్దు, వీర్రాజుగారు వ్రాసిన ఇటువంటి కథలు. ఊరు పీడోఁ్కలు చెప్పింది అనే కథ కూడా కరుణ రసార్ద్రమైన కథ. కథనమూ, పాత్రల చైతన్యమూ వీర్రాజుగారి కథలను ఆకర్షకంగా చేస్తవి. నీడ అనే కథలో ఈ దేశంలో స్త్రీ వ్యక్తిత్వం తరతరాలుగా ఏ విధంగా సర్దుబాటు చేసుకొంటూ, పురుషుని వ్యక్తిత్వానికి నీడ లాగా పరిణమిస్తూ వస్తూన్నదో చిత్రించే కథ.

ఇక శైలి గురించి, తక్కిన కథకులకన్నా ఈ రచయిత ఒక విలక్షణతను ప్రదర్శిస్తారు. శబ్ద చిత్రాలు, పదగమకాలు, ఉపమానాలు, రంగు రంగుల్లో ముంచి గీసే కుంచె గీతలూ, ఈయన కథల్లో కనపడతవి. సౌందర్య మర్మం ఎరిగిన రచయిత శ్రీ వీర్రాజు. కవీ, కథకుడూ, చిత్రకారుడూ కూడా కావడంతో, రంగూ రుచీ వాసనా, సాహిత్యంలో ఈయన చూపగలడు.

ఈ ఇరవై సంవత్సరాల తెలుగు కథని సమీక్షించేప్పుడు, "త్రిపుర" పేరుతో వచ్చిన కథలు తప్పకుండా ప్రస్తావించ వలసి వుంటుంది. ఇది మనస్తత్వ నిరూపణాత్మకమైన కథలు. 'పాము' అనే అద్భుతమైన కథను వీరు వ్రాశారు. మానవుని అంతరంగములో, ఆలోచనా విధానం, ఎంత చిత్ర విచిత్రంగా అతణ్ణి నడుపగలదో నిరూపించే కథలు. వచన కవిత్వంలోని వేగం, ఈయనగారి శైలిలో చూడవచ్చు.

ఈ ఇరవై సంవత్సరాల తెలుగు కథలో చాలా ప్రయోగాలు వచ్చాయి. ఎత్తుగడలో, ముగింపులో, నిర్వహణలో, అనంతమైన వైవిధ్యం ప్రదర్శితమైంది. తెలుగులో సంతృప్తికరమైన కథానికా, కవిత్వమూ వచ్చాయి కాని నవల రాలేదన్నాడు శ్రీ శ్రీ. ఇది నిజమే ననాలి ఇరుగు పొరుగు భాషల ఆధునిక సాహిత్య రీతులతో తెలుగు సాహిత్య ధోరణులను పోల్చి చూసుకున్నప్పుడు చిన్న కథ విషయంలో తెలుగువారి ప్రత్యేకత కనపడుతూ వుంటుందని విమర్శకులంటారు. ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం తెలుగు సాహిత్యంలో ఎన్నదగిన కథలు ఎన్నోవచ్చాయి. ప్రతివారపత్రికలోను మాసపత్రికలోనూ, బహుళ సంఖ్యలో వెలువడేవి కథలే. కేవలం కథల పత్రికలే నడిపే ప్రయత్నాలు కూడా ఇటీవల కొన్ని బయలు దేరాయి కాని అవి ఫలించ లేదు.

మహిళలు

వర్తమాన సాహిత్య ధోరణిలో వైశిష్ట్యం మహిళలు సాహిత్య సృష్టికి ముందుకురావడం. ఇవాళ మహిళలు వ్రాస్తున్న నవలలకు, పత్రికలలోను, పాఠకులలోను మంచి పలుకుబడి వుంది. శ్రీమతి వాసిరెడ్డి సీతాదేవి, ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి, పరిమళా సోమేశ్వర్, సి. ఆనందారామం, మాదిరెడ్డి సులోచన, యద్దనపూడి సులోచనారాణి, గోవిందరాజు సీతాదేవి, కళ్యాణసుందరీ జగన్నాథ్, చాలా మంచి కథలు వ్రాసి, ఈ ప్రక్రియలో కూడా తమ వైశిష్ట్యాన్ని నిరూపించుకున్నారు. కాని ఏ ఒకరిద్దరో తప్ప రచయిత్రుల కథాసంపుటాలు వచ్చినట్లుగా లేదు. శ్రీమతి శివరాజు సుబ్బలక్ష్మిగారి కథల సంపుటి ఒకటి ఇటీవల వచ్చి, సమీక్షకుల ప్రశంసల నందుకుంది.

వర్తమాన సాంఘిక పరిస్థితులను, రాజకీయాలను, సామాజిక దృక్పథాలను, అత్యంత సమర్థవంతంగా హాస్య చమత్కార వ్యంగ్య అధిక్షేప వైభవంతో, అచ్చమైన తెలుగు నుడికారంతో, తెలుగు వాతావరణంతో గొప్పగా కథానికలు వ్రాసే రచయిత శ్రీ కలువకొలను సదానంద. ఇటీవల వీరి 'నవ్వేపెదవులు - ఏడ్చేకళ్ళు' అనే కథా సంపుటి వచ్చింది. ఇందులో 'తాత దిగిపోయిన బండి' 'రామదాసు చెర' 'బాలామణి' వంటి కథలు ఏ ప్రమాణాలతో చూసినా గొప్ప కథలు. మానవ మనస్తత్వ పరిజ్ఞాత వలె ఈ కథలనాయన గొప్పగా వ్రాశారు. వీటిని తెలుగు వారు సగర్వంగా మా కథలని ప్రకటించుకోవచ్చు. అఖిల భారతీయమైన దృష్టినేకాక, అంతర్జాతీయమైన దృష్టిని కూడా ఆకర్షించ వలసిన కథలవి. సార్వకాలికమైన, విశ్వజనీన మైన కథలవి.

నేటి సామాజికమైన వొడిదుడుకులను, తరాల అంతరాలను, వర్గసంఘర్షణను కలిమిలేముల ఘర్షణలను, కొత్త నుడికారంతో, శ్రీయుతులు ముక్కామల వేంకటేశ్వరరావు, డి. వెంకట్రామయ్య, కొంపెల్ల విశ్వం వంటి యువ రచయితలు వ్రాస్తున్నారు కలల్లో కాకుండా, తాము చూస్తున్న సమాజాన్ని, అర్థం చేసుకుంటూ, పరిశీలిస్తూ చెప్పే ఇతివృత్తమే కాకుండా, చెప్పవలసిన విధానంలో కూడా కొత్తదనాన్ని సృష్టిస్తూ, ఆలోచనాత్మకమైన కథలు వ్రాయడం ఈ రచయితల ప్రత్యేకత. ముక్కామల వేంకటేశ్వరరావు బాణీ విలక్షణమై 'రైల్వే నాగభూషణం', 'టాయిలెట్' వంటి పద చిత్రాలతో కూడిన మంచి కథలు వ్రాశారు. శ్రీ డి. వెంకట్రామయ్యగారికి వర్తమాన సామాజిక పరిస్థితుల పట్ల మంచి అవగాహన వున్నది. ఇటీవలే వచ్చిన విశ్వం కథలలో, ముసుగు, వ్యవస్థ, వంటి మంచి కథలున్నాయి.

ఇటీవల పది సంవత్సరాలలో కథకులుగా ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంపాదించుకున్నవారు విహారి, శాలివాహన అనే జంట రచయితలు. ఇటీవలనే వీరి 'శిలలో సెలయేరు' అనే కథల సంపుటి వచ్చింది. మధ్య తరగతి కుటుంబపు ఇతివృత్తాలనే తీసుకొని, కవితాస్ఫూర్తితో వీరు నిర్వహించగలరు. అతి సామాన్యమైన కథావస్తువు నుంచి అసామాన్యమైన జీవిత సత్యాలను వీరు ప్రతిపాదించగలరు.

తెలుగు కథకు గణనీయమైన గతం వుంది. మురిపించే వర్తమానం వుంది. ఉజ్జ్వలమైన భవిష్యత్తువుంది.

ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి

శ్రీ నార్ల తాతారావు

రాష్ట్ర పారిశ్రామిక, వ్యవసాయరంగాలకు విద్యుచ్ఛక్తి అతి ప్రధానమైన ప్రాతిపదికాంశం.


అదృష్టవశాన ఆంధ్రప్రదేశ్ తన అవసరాలను తీర్చడానికి కావలసినంత విద్యుత్ వనరులను కలిగివుంది. రాష్ట్ర జలశక్తి సుమారు 3 మిలియనుల కిలోవాట్లుందని అంచనా వేయబడింది. మన బొగ్గు నిల్వలు చాలా గణనీయంగా వున్నాయి ధృవీకరింపబడిన నిల్వ 1186 మిలియను టన్నులు వుంది.

మన రాష్ట్రంలో విద్యుదభివృద్ధి ఇటీవలే ఆరంభమైంది. 1956 లో ఆంధ్ర ప్రదేశ్ అవతరణానంతరం మాత్రమే అది ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ అవతరణ నాటికి చాలా కొద్ది పట్టణాలు స్వల్పశక్తిగల తాపక కేంద్రాలచే, డీసిలు కేంద్రాలచే సరఫరా చేయబడి విద్యుత్ సౌకర్యాన్ని కలిగి వున్నాయి.

రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభంనాటికి (1956) విద్యుచ్ఛక్తి తలసరి వాడకం 16.7 కిలోవాట్ల గంటలకు మించి లేదు. అది ప్రస్తుతం 64 కిలోవాట్లగంటలుగా వుంది. రెండవ పంచవర్ష ప్రణాళికా ప్రారంభం నాటికి స్థాపితశక్తి 98.9 మెగావాట్లు. 1976 మార్చి ఆఖరుకు అది 1000 మెగావాట్లుగా వుంది.


లోగడ రాష్ట్రంలో ఉత్పాదక శక్తి అభివృద్ధి స్వభావాన్ని మధ్య మధ్య ఆటంక పరచిన హెచ్చు కొరతగల కాలాలు వుంటుండేవి. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో కొనసాగుచున్న మాచ్‌ఖండ్ తుంగభద్ర జలవిద్యుత్ పథకాలు, రామగుండం తాపక విద్యుత్‌పథకం ప్రారంభించి షుమారు 114 మెగావాట్ల స్థాపక శక్తిని చేర్చడం జరిగింది. మూడవ పంచవర్ష ప్రణాళికా కాలంలో మాత్రమే జల, తాపక వనరుల్ని పెంపొందించడానికి ఒక బలమైన విద్యుత్ గ్రిడ్ అభివృద్ధి చేసే ప్రయత్నంతో ఒక క్రమ విధానం చేపట్టబడింది. ఈ కాలంలో షుమారు 78 మెగావాట్ల స్థాపకశక్తిగల తుంగభద్ర జల విద్యుత్ కేంద్రాన్ని ఎర్రగడ్డలో గాస్‌టర్బో సెట్లను, నెల్లూరులో తాపక విద్యుత్ కేంద్రాన్ని ప్రారంభించడంతో మూడవ ప్రణాళికాంతం నాటికి 291 మెగావాట్ల స్థాపకశక్తిని పెంచడం, 1966–69 సంవత్సర కాలంలో అదనంగా 360 మెగావాట్ల శక్తిని చేర్చి, పాత సెట్లు తొలగింపబడిన తరువాత కూడా 15 మెగావాట్ల స్థాపనశక్తికి తీసుకొని రావడం జరిగింది. కొత్తగూడెం తాపక విద్యుత్ కేంద్రం "ఎ", మరియు ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రం ఈ కాలంలోనే ప్రారంభించబడ్డాయి. తరువాత నాలుగవ ప్రణాళికలో రామగుండం "బి" కేంద్రం 62.5 మెగావాట్లశక్తితో ప్రారంభించబడి నాలుగవ ప్రణాళికాంతానికి స్థాపకశక్తి 668 మెగావాట్లకు హెచ్చింపబడింది. నాలుగవ ప్రణాళికాంతంలో పారిశ్రామిక, వ్యావసాయిక ఉత్పత్తులకు విపరీతమైన నష్టం కలుగజేసిన 30 నుండి 50 శాతం విద్యుత్ సరఫరాతో రాష్ట్రం విద్యుచ్ఛక్తి కరువు పిడికిలిలో వుంది. 1974–75 లో మొత్తం స్థాపక శక్తిని 888 మెగావాట్లకు పెంచుతూ కొత్తగూడెం థర్మల్ స్టేషన్‌లో ఒక్కొక్కటి 180 మెగావాట్ల శక్తిగల 2 యూనిట్లు చేర్చబడ్డాయి. 1975-76లో దిగువ సీలేరులో 115 మెగావాట్లశక్తిగల మరొక యూనిటు చేర్చబడింది. ఈ చేర్పుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రిడ్ 1000 మెగావాట్ల స్థాపకశక్తి స్థాయి నందుకొని తన అభ్యుదయ పథంలో రాష్ట్రం మరొక ప్రధాన స్థాయిని అధిగమించిందని చెప్పవచ్చు.





అయిదవ పంచవర్ష ప్రణాళిక కార్యక్రమం రూపొందించినపుడు విద్యుచ్ఛక్తి ఉత్పత్తి పథకాలకు అందుబాటులోనున్న ఆర్థిక వనరుల కేటాయింపుకు అత్యంత ప్రాధాన్యత ఈయవలసి వున్నదని గుర్తింపబడింది. ప్రజా అవసరములను తీర్చుటకై ఈ ప్రాజెక్టుల నుండి వచ్చు ఫలితాలను ఇప్పటి వరకు వున్నదానికంటె హెచ్చు సమంగా ప్రసరించే విధంగా ఈప్రాజెక్టుల్నిను హెచ్చించుటలో నేమి, రూపొందించుటలో నేమి, నిర్మాణములో నేమి అభివృద్ధి కొనసాగింపబడవలసి వుంది. ప్రస్తుత ప్రణాళికా కాలంలో 1270 మెగావాట్ల స్థాపక శక్తినిచేర్చే ఒక కార్యక్రమాన్ని మనం కలిగివున్నాం.


విద్యుదుత్పాదనతోపాటు దానిని ఒకచోటు నుండి మరొక చోటుకు తీసికొని వెళ్లేలైన్‌తో ట్రాన్స్‌మిషన్ దానినివిభజించుకోడానికి (డిస్ట్రిబ్యూషన్) పథకం కూడా అతి ముఖ్యవిషయం. అందుబాటులో నున్న ఉత్పత్తి చేయబడిన శక్తి, ట్రాన్స్ మిషన్ లైనులు లేనిచో నిరుపయోగమైపోతుంది. మూడవ ప్రణాళికలో వేయబడిన విద్యుత్ప్రసార లైన్లు 400 మెగావాట్ల విద్యుత్‌ను మాత్రమే ప్రసారం చేయుటకు సరిపోయినవిగా ఉన్నాయి. నాల్గవప్రణాళికలో అవసరాలను తీర్చగల అదనపు ఉత్పాదన ప్రసార పంపిణీ పథకాల నిర్మాణం పూర్తయినపుడు 1000 మెగావాట్ల విద్యుత్తును తీర్చగల శక్తి గలదై ఉపయోగపడే క్రమ పద్ధతిగలదై వుంటుంది. అదనపు లైన్ల ఉనికిని గూర్చి యోచించవలసి వున్నది. 1956 లో వివిధ ప్రసారపు లైన్ల మొత్తం నిడివి 5700 కిమీ వుండగా ఇప్పుడది 56700 కిమీటర్లకుపెరిగింది. 1956 వ సంవత్సరం చివరికి మొత్తం విద్యుత్ చేయబడిన గ్రామాల సంఖ్య 630 మాత్రమే. ఈ నాడు మనం 11,360 విద్యుదీకరణ చేయబడిన గ్రామాలను కలిగి వున్నాం. 1956 లో వ్యవసాయోగపు విద్యుత్ పంపు సెట్లు 4300మాత్రమే వున్నాయి. కాని నేడువాటి సంఖ్య 3,00,00 దగ్గర బడింది. గ్రామీణ, విద్యుదీకరణ అధునాతన జీవన విధానాన్ని గ్రామాలకు తోడ్కొనివచ్చింది. అభివృద్ధిని ప్రోత్సాహించింది. వ్యవసాయాన్నీ వ్యావసాయక పరిశ్రమల ఆధునీకరణనూ వృద్ధి చేసింది. అందువల్లనే గ్రామీణ విద్యుత్ కార్యక్రమాలు రాష్ట్రప్రభుత్వంవల్లా, విద్యుత్ సంస్థవల్లా అత్యంత ప్రాధాన్యాన్ని పొందుతున్నాయి. రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభంలో (1956) విద్యుదీకరణ చేయబడిన పట్టణాల, గ్రామాల సంఖ్య 630 మాత్రమే వుండగా 1976 ఏప్రిల్ ఒకటవ తేదీ నాటికి వాటి సంఖ్య 11,360కి పెరిగినదంటే గ్రామీణ విద్యుదీకరణ వృద్ధి ఎంతగా జరిగిందో గ్రహించవచ్చు. గ్రామీణ విద్యుదీకరణాభివృద్ధి సమన్వయ సాధనకై సాయపడే అభిప్రాయంతో 1969 వ సంవత్సరంలో భారత ప్రభుత్వ సంస్థగా గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్). స్థాపించబడింది. గ్రామీణవిద్యుదీకరణ కార్యక్రమాలన్నింటికి కావలసిన డబ్బు నంతటిని ఈ గ్రామీణ విద్యుదీకరణ సంస్థ రాష్ట్ర విద్యుత్ సంస్థకు అప్పుల రూపంలో సహాయం చేస్తుంది. ముఖ్యంగా ఈ పథకాలు వెనుకబడిన ప్రాంతాలలో వ్యవసాయ పంపు సెట్ల, పరిశ్రమల అభివృద్ధికి విశేష ప్రాముఖ్యాన్నిస్తాయి. విద్యుదీకరణ చేయబడని గ్రామాల్లో హరిజన వాడలకు విద్యుదీకరణం, ఆ ముఖ్య గ్రామాల విద్యుదీ




కరణలోపాటు చేపట్టబడుతుంది. గ్రామీణ విద్యుదీకరణ సంస్థ అనేక హరిజనవాడల విద్యుదీకరణ పథకాలను, గిరిజన గ్రామాల విద్యుదీకరణలను మంజూరు చేసింది.

గడిచిన 20 సం॥ రాలలో (1956—76) విద్యుదీకరణ వికాస రంగంలో జరిగిన అభివృద్ధిని ఈ క్రింది పట్టిక తెలియజేస్తుంది.

వరుస	వివరణము	మొదటి పంచవర్ష ప్రణాళికాం తానికి	రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభం నాటికి	మూడవ పంచవర్ష ప్రణాళికాం తానికి	నాల్గవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభం నాటికి	నాల్గవ పంచవర్ష ప్రణాళికాం తానికి	1-4-76 వ తేదీ నాటికి
1	2	3	4	5	6	7	8
1)	స్థాపక ఉత్పాదన శక్తి (మెగావాట్లు)	98.9	213	291	615	668	988
2)	ఉచ్చ స్థాయి అవసరంలేని (మెగావాట్లు)	546	190	258	440	652	822
3)	ప్రసారవు లైన్లు (వేల కిలో మీటర్లు)	5.7	14.7	27.6	40.6	55.6	135.98
4)	విద్యుత్ సరఫరా పొందిన వాడకం దార్లు)లక్షలలో	1.49	2.7	5.25	8.27	14.2	15.61
5)	వ్యవసాయ సర్వీసుల (సంఖ్య)	4300	17.968	57225	1,23,167	2,61,989	2,86,662
6)	విద్యు దీకరణ చేయబడిన పట్టణాలు, గ్రామాలు (సంఖ్య)	630	2,680	4353	5788	10,485	11,360
7)	తలసరి విద్యుత్ వాడకం (కిలో వాట్లు గంటలలో)	7	16.7	31.7	496	60	64
8)	ఉత్పత్తి చేయబడిన యూనిట్లు (మిలియన్లలో)	—	784	1399	2277	3106	3631.9
9)	వచ్చిన మొత్తం రాబడి (కోట్ల రూపాయలలో)	2.48	6.78	15.36	29.84	56.70	89.27





గడచిన దశాబ్దంలో ఆంధ్ర ప్రదేశ్ గ్రిడ్‌లో ప్రధానాంశం కొత్తగూడెం వద్దగల తాపక విద్యుత్ కేంద్రం. ఈ కేంద్రం ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం బొగ్గు గని పట్టణానికి షుమారు 8 మైళ్ళ దూరంలోని పాలంచ దగ్గర వుంది. మొదటి దశలోను రెండవ దశలోను ఒక్కొక్కటి 60 మెగవాట్ల శక్తిగల నాలుగు యూనిట్లు స్థాపించ బడ్డాయి. మూడవ దశలో ఒక్కొక్కటి 110 మెగావాట్ల శక్తిగల రెండు యూనిట్లు చేర్చ బడ్డాయి. నాల్గవ దశలో ఒక్కొక్కటి 110 మెగావాట్ల శక్తిగల మరో రెండు యూనిట్లు ఈ సంవత్సరం (1976–77) లో చేర్చ బడుతాయి. ఈ తాపక కేంద్రానికి బొగ్గు దానికి ప్రక్కనే వున్న సింగరేణి బొగ్గు గనుల నుండి లభిస్తుంది.

కరీం నగర్ జిల్లాలోని రామగుండం వద్ద 100 మెగావాట్ల ఉత్పాదక శక్తిగల, నెల్లూరులో 30 మెగావాట్ల ఉత్పాదక శక్తిగల కేంద్రాలు మనకు వున్నాయి. మాచ్‌ఖండ్‌లో 114 మెగావాట్ల శక్తిగల జల విద్యుత్ కేంద్రం, ఎగువ సీలేరులో గల 100 మెగావాట్ల శక్తిగల జల విద్యుత్ కేంద్రం, తుంగభద్ర జల విద్యుత్ పథకంలోగల 72 మెగావాట్ల శక్తిగల కేంద్రం 110/115 మెగావాట్ల శక్తిగల దిగువ సీలేరు జలవిద్యుత్ కేంద్రం తోకలిపి మన వాటాగా 382 మెగవాట్ల శక్తి వుంది. దీనికి 620 మెగావాట్ల తాపక వుత్పాదక శక్తి కలిపితే మనకు గల మొత్తం శక్తి 1000 మెగావాట్లకు పోతుంది. మన రాష్ట్రంలో ఉత్పత్తితో పాటు మొత్తం అవసరాలు కూడా తగినంతగా పెరిగాయి. ఇంత వరకు అత్యధిక అవసరం 822 మెగావాట్లకు చేరింది. అది రోజుకు 15.81 మెగా యూనిట్లు. ఇది పారిశ్రామిక వ్యవసాయ రంగాల్లో జరిగిన గొప్ప అభివృద్ధిని ప్రోత్సాహకరంగా సూచిస్తుంది.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ సంస్థ రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుదవసరాలకు అనుగుణంగా కొత్త ప్రాజెక్టులను రూపొందించుటలో నేమి, వానిని సకాలంలో ఏర్పరచుటలో నేమి తగినంతగా అభివృద్ధి సాధించిందని చెప్పవచ్చు. 660 మెగావాట్ల కట్ట కడపటి స్థాపక శక్తితో (6 యూనిట్లు) పనం దిగువ సీలేరు పథకాన్ని నెలకొల్పుతున్నాం. ఇందులో నాలుగు యూనిట్లు ఈ ప్రణాళికా కాలంలోను, మరో రెండు యూనిట్లు తదుపరి దశలోనూ పని చెయ్యడం ప్రారంభిస్తాయి. శ్రీశైలం జల విద్యుత్ పథకపు ప్రథమ దశ ఒక్కొక్కటి 110 మెగావాట్ల శక్తి గల నాలుగు యూనిట్ల స్థాపనా లక్ష్యంతో కొనసాగుతుంది. రెండవ దశలో ఒక్కొక్కటికి 110 మెగావాట్ల శక్తిగల మరో మూడు యూనిట్లు చేర్చబడతాయి. నాగార్జున సాగర్ వద్ద సంప్రదాయ సిద్ధమైన 110 మెగావాట్ల శక్తిగల ఒక యూనిట్ స్థాపించడానికి పనిని ప్రారంభించాం. ఒక్కొక్కటి 110 మెగావాట్ల శక్తిగల 4 రివర్సబుల్ యూనిట్లు కూడా త్వరలోనే స్థాపించబడతాయి. విజయవాడ తాపక విద్యుత్ కేంద్రంలో 210 మెగావాట్ల శక్తిగల ఒక యూనిట్ 1978 డిశంబరు నాటికి విద్యుత్ సరఫరా రూపంలో చేరుతుంది. ఆరవ పంచవర్ష ప్రణాళికా తొలి కాలంలో మరొక 210 మెగావాట్ల శక్తిగల యూనిట్ ప్రారంభించబడుతుంది.

రెండవ పంచవర్ష ప్రణాళిక ప్రారంభించే నాటికి (1956) మనం 1,49,000 వాడకం దార్లను కలిగి వున్నాం. ఈ సంఖ్య ప్రస్తుతం 1976 ఏప్రిల్ ఒకటవ తేదీ నాటికి 15,61,222 గా వుంది. ఇందులో షుమారు 3,00,000 నుండి వ్యవసాయ వాడకందార్లు. 1956 చివరకు మరో 2.48 కోట్లుగావున్న మొత్తం సంవత్సరానికి ఆదాయం 1976 ఎప్రిల్ ఒకటి నాటికి అది మరో 89.27 కోట్లుగా వుంది.

ఆంధ్ర ప్రదేశ్‌లో 64 కిలో వాట్ల గంటలలో వున్న తలసరి విద్యుత్ వాడకం అయిదవ పంచావర్ష ప్రణాళికాంతం నాటికి 100 కిలో వాట్ల గంటలకు పెరిగి ప్రస్తుత భారత సరాసరి స్థాయికి చేరుతుందని ఆశించబడుతున్నది. తక్కువగా వున్నా, అఖిల భారత స్థాయిని వీలైనంత త్వరలో అందుకోవడానికి మన రాష్ట్రం తన విద్యుత్ కార్య క్రమాలను త్వరిత పరచ వలసి వుంది. రాబోయే 20 సంవత్సరాలలో మన తలసరి వాడకం షుమారు 500 కిలో వాట్ల గంటలకు హెచ్చించే విధంగా మన యోచనలు వున్నాయి. దీనికి గాను సాంవత్సరిక విద్యుత్ వాడకం స్థాయి 35000 మిలియన్ల యూనిట్లకు స్థాపనా శక్తి 8000 నుండి 9000 మెగావాట్లుగా చేయవలసి వున్నాయి. ఈ విద్యుత్ అభివృద్ధి స్థాయి చేరుటకు చాలినంతగా ముఖ్య వస్తు సాధనాలున్నాయి.

రాష్ట్రం ఒక్కొక్కటి 4050 మెగావాట్ల స్థాపక శక్తిగల రెండు అమిత శక్తిగల తాపక కేంద్రాలను (సూపర్ థర్మల్ స్టేషన్లను) భద్రాచలానికి దగ్గరలోనున్న మంగూరు వద్దను రెండవ దానిని రామగుండంవద్దను స్థాపించడానికి పథకాలనుతయారుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం మిక్కిలి వేగంగా పారిశ్రామికీకరణ సాధించడానికి నిశ్చయ ప్రయత్నాలు కొనసాగించడంతో రాష్ట్ర విద్యుత్ సంస్థ దేశ విద్యుత్ పటంలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రముఖ స్థానంలో వుండే విధంగా తన పాత్రను నెరవేరుస్తుంది.

తెలుగువంటి తియ్యని ఉర్దూ

ఉర్దూ అకాడమీ కార్యకలాపాలు

❋ శ్రీ భరత్‌చంద్ ఖన్నా ❋

ఆంధ్రప్రదేశ్ లోని ఉర్దు భాష మాట్లాడే ప్రజలకు నూతన సంవత్సర కానుకగా 1976 జనవరి 1వ తేదీన ఉర్దు అకాడమీ ఏర్పాటు చేయబడింది. 39 మంది సభ్యులతో బోర్డు ఆఫ్ గవర్నర్లు, 11 మంది సభ్యులతో కార్యనిర్వాహక మండలిని కూడా ఏర్పాటు చేశారు. కార్యాలయం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఒక లక్ష రూపాయిలను మంజూరు చేసింది. 1976–77 సంవత్సరానికి రు. 2 లక్షలు గ్రాంటు యివ్వాలని ప్రభుత్వం ఉత్తర్వు చేసింది.

ఈ అకాడమీ యింతవరకు రెండు సార్లు సమావేశమైంది. నిబంధనలు, ఆర్థిక విషయాలు, ఉర్దు సాహిత్యం, రచయితలు, కవులకు ఆర్థిక సహాయం, తెలుగు–ఉర్దు విద్య పరిపాలన అను అంశాలపై ఉపసంఘాలనుకూడా ఏర్పాటు చేశారు.

ఈ అకాడమీ తమ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఒక కేంద్ర గ్రంథాలయం, పఠనాలయం కూడా తమ కార్యాలయం ఆవరణలో నెలకొల్పారు. ఈ గ్రంథాలయంలో 4,500 లకు పైగా పుస్తకాలు ఉన్నాయి,

1972 నుండి 1975 వరకు ముద్రించిన ఉత్తమ రచనల రచయితలకు బహుమతులు యివ్వాలని నిర్ణయించారు. అర్హమైన రచనలను ముద్రింప జేయడానికి వీలుగా తమ అముద్రిత రచనలను పంపాలని అకాడమీ కోరింది.

తెలుగు సాహిత్య చరిత్రకు సంబంధించి ఉర్దులో చిన్న పుస్తకాలను తయారుచేసే పనిని, ఎంపిక చేసిన కొన్ని తెలుగు కవితలను ఉర్దులోకి తర్జుమా చేసే పనిని అర్హులైన వారికి అప్పగించారు. పని చురుకుగా కొనసాగుతున్నది. ఒక పత్రికను కూడా ప్రచురించాలని ఉద్దేశిస్తున్నారు. అవసరంలో ఉన్న గ్రంథాలయాలకు, పఠనాలయాలకు పుస్తకాలు సరఫరా చేయడానికి అటువంటి గ్రంథాలయాల నుండి దరఖాస్తులు కోరారు.

"భారత రాష్ట్రపతి", "భారత ప్రధాన మంత్రి", "ఆంధ్ర ప్రదేశ్", "హైదరాబాదు" అను అంశాలపై ప్రముఖ రచయితల చేత నాలుగు పుస్తకాలు రచింపజేయాలని అకాడమీ నిర్ణయించింది. అకాడమీ తరపున వాటిని ప్రచురిస్తారు.

ఉర్దు సాహిత్యానికి సంబంధించిన ఉత్తమ పుస్తకాలను విల్వ చేయడానికి ఒక పుస్తకాల కేంద్రాన్ని ప్రారంభించాలని అకాడమీ నిర్ణయించింది. ఆ తర్వాత యీకేంద్రంలో ఉర్దు పాఠ్య పుస్తకాలను కూడా విద్యార్థుల సౌకర్యార్థం ఉంచుతారు.

ఉర్దు భాష అభ్యసించ దల్చుకున్న వారి నిమిత్తం ఉర్దు తరగతులను కూడా ప్రారంభిస్తారు. ఇందుకు ఫీజు ఏమీ ఉండదు.

ఉర్దు భాషను పరిరక్షించి ప్రాచుర్యంలోకి తేవడమే యీ అకాడమీ ప్రధాన బాధ్యత. పాఠశాలలలో యీ భాష ద్వారా విద్యాబోధన జరపడం ద్వారాను, ఈ భాషను బోధించడం ద్వారా ఉర్దు భాషకు సేవ చేయవచ్చు.

ఇదారె–అ ఎదియాత్‌లో అపూర్వ వ్రాతప్రతుల పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్చలు జరుగుతున్నాయి. పరిశోధనలు నిర్వహించడమే గాక వ్రాత ప్రతుల పరిరక్షణ, సేకరణ కూడా జరుపుతారు.

ఉర్దు భాష ప్రాచుర్యానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ యివ్వాల్సి ఉంటుంది. ఉర్దు భాష నేర్చుకున్నవారికి ఉద్యోగాలు లభించడంలో యిబ్బందులు కలుగకుండా చూడాలి. వారికి జీవనాధారం లభించే విధంగా చూడాలి.

రాష్ట్రంలో ఉర్దుకు తగిన ప్రాచుర్యం లభింపజేసి, ఆ భాషను ప్రోత్సహించడానికే యీ అకాడమీ ఏర్పాటు చేయబడింది. ఈ లక్ష్యాల సాధనకు అకాడమీ తీవ్రంగా కృషి చేస్తున్నది.

విదేశాలలో ఆంధ్రులు

*** — శ్రీ ఎస్.వి.ఎస్. ప్రసాదరావు

ఆంధ్రులు అతిప్రాచీనమైన చరిత్ర కలిగినట్టివారు. వీరి ప్రసక్తి ఐతరేయ బ్రాహ్మణంలో కనిపిస్తుంది. పాశ్చాత్యాధారాలను బట్టి చూస్తే ఆంధ్రులకు క్రీస్తుపూర్వం 3వ శతాబ్ది నుండి వైభవోపేతమైన చరిత్ర మనకు కనిపిస్తుంది. ఆంధ్ర శాతవాహన రాజులు అనేక విషయాలలో గణుతి కెక్కినవారు. వీరు సుమారు క్రీస్తు పూర్వం మూడవ శతాబ్ది ప్రాంతంలో పరిపాలన చేశారు. వీరి కాలంలో ఆంధ్రుల నౌకాయాన ప్రతిభ శిఖరస్థాయినందుకొన్నది. వీరి నాణెములపైన ఉన్న ఓడముద్రను బట్టి వీరు సముద్రాధిపత్యం వహించినట్లు వెల్లడవుతుంది. శాతవాహనులు క్రీస్తుశకం 210 వరకు పరిపాలించారు.

శాతవాహనులకాలంలో ఆంధ్రదేశం ప్రపంచంలోని అనేక దేశాలతో సంబంధబాంధవ్యాలు ఏర్పాటు చేసుకొన్నది. సుదీర్ఘమైన సముద్రతీరం ఉండడం తెలుగు వారికి వరప్రసాదం. క్రీస్తుకు పూర్వమే ఆంధ్రులు యూరప్‌లోని చైనా, బర్మా, సింహళం, మలయా తూర్పు ఇండియా దీవులతో వర్తకం సాగించినట్లు ఆధారాలు ఉన్నాయి. తీరానగల పెక్కు రేవులనుండి విదేశాలకు ఆంధ్రులు తరలి వెళ్ళారు. శ్రీనాథుడు, దేవయచామి శెట్టి. అవచి తిప్పయ్యశెట్టి అనే వర్తక ప్రముఖులు విదేశాలతో వర్తకం చేయడం గురించి 'హరవిలాసంలో' ఇలా పేర్కొన్నారు

పంజార గర్పూర పాదపంబుల దెచ్చె
    జలనోంగి బంగారు మొలక దెచ్చె
సింహళంబుల గంధ సింధురంబులు దెచ్చె
    హరు మంజి బలుతేజి హరులు దెచ్చె
గోవసంశుద్ధ సంకుమద ద్రవ్యము దెచ్చె
    మాంప గట్టాని ముత్యాలు దెచ్చె
భోట గస్తూరికా పుటకోశములు దెచ్చె
    చీని చీనాంబర శ్రేణి దెచ్చె

జగిదగోపాల రాయవేశ్యాభుజంగ
పల్లవాదిత్య భుదాన పరశురాము
కొమరిగిరిరాజ దేవేంద్ర కూర్మిహితుడు
జాణ జగజెట్టి దేవయ చామి శెట్టి''

ఇందులో శ్రీనాథుడు సుమిత్రా. మలయా. సింహళం, బోర్నియా, పర్షియా మొదలైన దేశాలు పేర్కొన్నాడు.

తెలుగువారు ఆయా కాలాలలో విదేశాలలో స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు. కొందరు మత పరంగా వెళ్ళారు. కొందరు వర్తకరీత్యా వెళ్ళారు. కొందరు ఉద్యోగం కోసం వెళ్ళారు. కొందరు శ్రామికులుగా వెళ్ళారు. ఆయాదేశాలలో స్థిరపడిన తెలుగువారు అక్కడవున్న సంస్కృతీ విశేషాలను బాగా అవగాహన చేసుకొని జీర్ణించుకొన్నారు. భాషా మాధుర్యాన్ని మరువలేదు. తెలుగు సీమపై అధికారాన్ని వీడలేదు. ఎన్ని భాషలు నేర్చినా తల్లి భాషపై తీపి మమకారం వారికి పోలేదు. శతాబ్దాలక్రితం భారత దేశం నుండి వెళ్ళి తరతరాలుగా అన్యదేశాలలో నివసిస్తున్న వారిలో తెలుగుదనం మూర్తీభవించి వుండడం గమనార్హం. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలకు వివిధ దేశాల నుంచి తెలుగువారు రాజధానికి వచ్చారు. వారందరిలో మాతృభాషాభిమానం మనలను ఆశ్చర్య పరచింది.

కొన్ని దేశాలలోని తెలుగువారిని గురించి సంగ్రహంగా తెలుసుకుందాం.

మారిషస్‌లో

ఈనాడు మారిషస్ దీవి పేరు మనందరకు సుపరిచితమయింది. ద్వితీయ ప్రపంచహిందీ మహాసభలు అక్కడ జరిగాయి. మన విద్యామంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారు కూడా వెళ్లి అక్కడ వున్న తెలుగు వారందరినీ కలుసుకున్నారు. తెలుగు సీమలో మనం మర్చిపోయిన ప్రాచీనమైన తెలుగు పాటలు వారక్కడ పాడుకుంటూ వుండడం, మనం మరచిపోయిన తెలుగు పలుకుబడులు వారిలో వాడికలో ఉండడం ఆయన గమనించారు. ఇది అందాల దీవి. హిందూమహా సముద్రంలో మెడగాస్కార్‌కు సమీపానగల ఈ దీవి విస్తీర్ణం 720 చదరపు మైళ్ళు. తెలుగువారు ఎక్కువగా కోరంగి రేవు నుంచి వచ్చారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాల వారు ఎక్కువగా ఉన్నారు. 1850 ప్రాంతాలలో మొదటి జట్టుగా తెలుగువారు ఈ దీవి చేరుకున్నారు. ఇప్పుడు 50,000కు పైగా తెలుగువారున్నారు. వారు వివిధమైన వృత్తులలో పని చేస్తున్నారు. ఉన్నత పదవులు నిర్వహిస్తున్న వారు కూడా ఉన్నారు. ఇక్కడ 'మారిషస్ ఆంధ్ర మహాసభ' బాగా పనిచేస్తున్నది. 1927 లో తొలిసారి తెలుగు సంఘం ఏర్పడింది. ఈనాడు 80 తెలుగు పాఠశాలలు పనిచేస్తున్నాయి. 'మారిషస్ ఆంధ్ర మహాసభ' కు 60 శాఖలున్నాయి.

ఫిజీ


ఫిజీ పసిఫిక్ మహా సముద్రంలో గల చిన్న ద్వీపం. కంట్రాక్టు లేబరు పద్ధతి బాగా అమలులో ఉన్నప్పుడు 1918లో తెలుగు వారు భూములను సాగు చేయడం కోసం మొట్టమొదట ఇక్కడకు వచ్చారు. ఆనాడు ఇది బ్రిటీషు వారి పాలనలో ఉండేది. సేద్యంలో ప్రవీణులైన తెలుగు వారిని బ్రిటీషు వారే అక్కడకు తీసుకు వెళ్ళారు. ఈనాడు ఫిజీలలోని తెలుగువారిలో ధనికులూ, పేదవారూ కూడ ఉన్నారు. అయితే తెలుగు పిల్లలందరూ ఒకే పాఠశాలకు వెళ్ళి చదువుకుంటారు. ఇక్కడున్న తెలుగువారికి తమ భాషపైన ఎంతో ఆదరాభిమానాలున్నాయి. అటోంకాలో ఆంధ్ర సంఘం పాఠశాల నడుపుతున్నది. ఇక్కడ తెలుగు విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కాలర్‌షిప్పులు ఇస్తున్నది. ఫిజీలో రామాయణ మండలి భక్తి ప్రచారం చేస్తున్నది.

దక్షిణాఫ్రికా

దక్షిణాఫ్రికాకు, భారత దేశానికి సన్నిహిత సంబంధం వున్నది. అక్కడకు తెలుగువారు క్రిందటి శతాబ్దిలోనే వెళ్ళారు. మొదటి తెలుగు వ్యక్తి బాబునాయుడు 1855లో ఈ దేశానికి రావడం జరిగింది. నేటాలులోని ఒక ఆంగ్ల కర్షకునివద్ద పని చేసేందుకు ఆయన వచ్చారు. 1914 లో మహాత్మా గాంధీ నడిపిన సత్యాగ్రహంలో దక్షిణాఫ్రికాలో ఆయనకు కుడి భుజంగా పనిచేసిన శ్రీ వి. బి. తంబినాయుడు తెలుగువాడే. ఈనాడు దక్షిణాఫ్రికాలో దాదాపు 50,600 మంది తెలుగువారు నివసిస్తున్నారు. అప్పటిలో దక్షిణాఫ్రికాలో భారత ప్రభుత్వ ఏజెంటుగా వున్న ఆంధ్ర ప్రముఖులు శ్రీ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారి సహాయ సహకారాలతో 1931 లో అక్కడ ఆంధ్ర మహాసభ ఏర్పడింది. తెలుగు వారిలో సాంస్కృతిక కార్యక్రమాలను కూడ ఆయన ప్రోత్సాహమిచ్చారు. తెలుగువారు పలు ప్రాంతాలలో ఆలయాలు స్థాపించారు. డర్బన్ ప్రధాన కార్యస్థానంగా ఆంధ్ర మహాసభ బాగా పనిచేస్తున్నది. ఇక్కడ 1935 లోనే తెలుగు ముద్రణాలయం ఏర్పాటయింది.

మలేసియా

సిరిసంపదలకు, ప్రకృతి సౌందర్యానికి మలేసియా ఆటపట్టు. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత తెలుగువారు ఎక్కువగా ఇక్కడికి జవనోపాధి నిమిత్తం వచ్చారు. అంతకు పూర్వమే తెలుగు వారున్నప్పటికి 1920-40 మధ్య వలస వచ్చినవారి సంఖ్య అధికం. క్రీ. పూ. 3 వ శతాబ్దిలోనే తెలుగువారు ఇక్కడికి బౌద్ధమత ప్రచారానికి వచ్చినట్లు చరిత్రలో కొన్ని ఆధారాలున్నాయి. మలేసియాలో $1\frac{1}{2}$ లక్షల మంది తెలుగువారున్నారు. 1956 లో మలేసియా ఆంధ్రసంఘం ప్రారంభమయింది. ప్రస్తుతం డా.సి.అప్పారావు ఈసంఘానికి అధ్యక్షులుగాను; శ్రీ మడిన్ సోమునాయుడు, గౌరవ ప్రధాన కార్యదర్శి గాను ఉన్నారు. ఇక్కడ 50 మందికి పైగా తెలుగు ఉపాధ్యాయులు విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్నారు. ఆంధ్ర సంఘం 14 శాఖలతో పనిచేస్తున్నది. ఇప్పుడు వీరు 'తెలుగుతల్లి' అనే పత్రికను నడుపుతున్నారు. వారికి స్వంత ముద్రణాలయం ఉన్నది. రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు 1978లో మలేసియాలో జరుగనున్నవి.



జాంబియా

జాంబియా దేశం ఆఫ్రికాఖండంలో ఉన్నది. అక్కడ ప్రస్తుతం 12 తెలుగు కుటుంబాలున్నాయి. వారు ఉద్యోగాలలో, వర్తక వ్యాపారాలలో ఉన్నారు. అందరూ ఉన్నత విద్యావంతులు. ప్రపంచ తెలుగు మహాసభలకు ఇక్కడ నుంచి ఒక ప్రతినిధి శ్రీ సి.వి.కె. రావు వచ్చారు.

ఇంగ్లండు

ఇంగ్లండుకు భారత దేశానికి గల సంబంధాలను ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఈనాడు అనేక మంది తెలుగువారు వివిధ వృత్తులలో ఉన్నారు. వైద్యులు, అధ్యాపకులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు వంటి ఉన్నత ఉద్యోగాలలో ఉన్నారు. కార్మికులు కూడా చాలామంది ఉన్నారు. "విదేశాంధ్ర" అనే ప్రచురణ సంస్థ మంచి పుస్తకాలు ప్రచురిస్తున్నది. ఇటీవలనే వారు శ్రీ పురిపండా అప్పలస్వామి గేయ సంకలనం "పులిపంజా" అనే గ్రంథం విడుదల చేశారు.

శ్రీలంక

శ్రీలంక మనకు సమీపాన గల దేశం. మన రెండు దేశాలకు అతి ప్రాచీన కాలం నుంచి సన్నిహిత సంబంధాలున్నాయి. తెలుగువారు ఎక్కువమంది వ్యవసాయ వృత్తిలో ఉన్నారు. తోటలలో పనిచేస్తున్న వారి సంఖ్య కూడా అధికమే. ఆంధ్ర సంఘం ఏర్పడింది. తెలుగు సాంస్కృతిక సంఘం కూడ చురుకుగా పని చేస్తున్నది.

బర్మా

బర్మా దేశానికి తెలుగువారు 300 సంవత్సరాలకు పూర్వమే వలస వెళ్ళారు. ఎక్కువ మంది తూర్పుగోదావరి, విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి వెళ్ళారు. రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యేనాటికి ఇక్కడున్న తెలుగువారి సంఖ్య దాదాపు 10 లక్షలు. బర్మా స్వాతంత్ర్యం సాధించిన తర్వాత విదేశీయులను పంపివేస్తున్నందున ఈనాడు సుమారు 6,000 మంది తెలుగు వారున్నారు. బర్మాలో "ఆంధ్ర మహాజన సంఘం" పని చేస్తున్నది.

(తరువాయి 244 వ పుటలో)

మధురకవిత నేర్వగరాని విద్యగలదే



శ్రీ డాక్టర్ పి. యశోదారెడ్డి

శ్రీకరమైన ఈ బహుళాంధ్రోక్తిమయ ప్రపంచములో దాదాపు వేయి సంవత్సరములనుండి ప్రతిభావంతులైన మహానుభావు లెందరో వాగనుశాసనులై కవిరాజ శిఖామణులై, కవిబ్రహ్మలై, సాహిత్య రసపోషణ చక్రవర్తులై, ప్రబంధ పరమేశ్వరులై, రసాభ్యుచితములైన కావ్యములరచించి ఆంధ్రావళిని ఆనంద రసాంబుధియందు తలమునుకలు గావించినారు. ఇంతటి సంపత్సమృద్ధమైన సారసత్వమును పుణికి పుచ్చుకొన్నట్లుగా కొందరాంధ్ర స్త్రీలు కావ్య కళాచతురలై, భారతీదేవి ముంజేతిచిలుకలై, శారద ప్రతిరూపులై కావ్యహారముల గూర్చి ఆంధ్ర సాహిత్య లక్ష్మికి నూతనాలంకారముల గైసేసి తాము యశోవిరాజితలైనారు.

ఆంధ్ర సాహిత్య చరిత్రలో కవయిత్రిగా స్త్రీకి స్థానము లేదను అరడి నుండి తప్పించి కవయిత్రీ పారంపర్యమునకు ఓంకారమును చుట్టిన ప్రథమాంధ్ర కవయిత్రి మొల్ల. ఈమె కృతమైనది రామాయణము. ఇది

'చరితంరఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్'
ఏకైక మక్షరం ప్రోక్తం సర్వపాపవినాశనమ్'

అని ఇదివరకే ప్రాజ్ఞులచే కడలు కట్టబడి, పరమపూజ్యమూర్తి కలిగి, ఆది కావ్యరూపములో వెలసిన కావ్యమునకు సంక్షేపరూపము. కాని సుకృతమైన ఈమె భాగ్య విశేషముచేత ఈ కావ్యము నేటికిని ఈమె పేరతో మొల్ల రామాయణముగా ప్రసిద్ధమై ప్రచారము నందున్నది.

శ్రీ గౌరీశ్వర వరప్రసాదలబ్ధ, గురుజంగమార్చన వినోదయైన ఈమె కనబరచిన వినయమెంతయో శ్లాఘనీయమైనది. సూరిజన వినుత కవితాచమత్కారమైన ఈమె వినయోదయభరితమై తాను కావ్య సంపద క్రియలనేవియు నెరుగననుచు చెప్పి తన కవిత్వమునకు కారణము గోపవరపు శ్రీకంఠమల్లేశు కృపయేయని చాటినది. అంతేకాక భక్తి భావవిలసితయైన ఈ కవయిత్రి రామాయణ రచనావసరమును పురస్కరించుకొని కార్య కారణముల రెంటిని ఆ రఘునాయకునందే ఆరోపించి కేవలము తాను నిమిత్తమాత్రమై—

"చెప్పుమని రామచంద్రుఁడు
చెప్పించిన పలుకుమీదఁజెప్పెదనే నె
ల్లప్పుడు నిహపరసాధన
మిప్పుణ్య చరిత్ర తప్పు లెంచకుడ కవుల్—

అని నిర్లిప్తతతో పలికిన విధానము సహజ కవితాభిరాముడైన పోతన భాగవతమునందలి "పలికెడిది భాగవతమట, పలికించెడువాడు రామభద్రుండట" అను పద్యపాదములను దలపింపజేయుచున్నది. ఇహలోక సౌఖ్యములను మీసాలపై తేనియలుగా భావించి నరపాలక స్తుతి చేయనొల్లని భక్తాగ్రణి పోతనవలెనే మొల్ల కవయిత్రి సయితము – "సల్లలిత ప్రతాప గుణసాగరుడైన రామ నరపాలకు నిన్ 'స్తుతిజేయు జిహ్వకు' చిల్లర రాజలోకమును జేకొని మెచ్చగ నిచ్చ పుట్టునే" అని రాజలోకమునే నిరసించి ధీరయై పలికినది.

వినయ శీలయైన ఈమె ఆత్మ నైచ్యాను సంధానమును కల్పించుకొని వినమ్ర భావమును ప్రకటించినను అవసరము కలిగినప్పుడు మాత్రము వజ్ర కర్కశముగా నిర్ణయము లిచ్చినది. ఉదాహరణమునకు ఆంధ్రీకరణ సందర్భమునందు, కవులు పాండిత్య ప్రకటనము కొరకు తేట తెనుగునందు కాక తిరిగి అదే సంస్కృత పద బాహుళ్య రీతిలో అనువదించుట. పాడిగాదని చెప్పుచు రచించిన పద్యమును బేర్కొనవచ్చును. ఈ పద్యమునందీమె అన్యాపదేశముగా కవి సార్వభౌముడైన శ్రీనాథ కవికృతమై విద్వదౌషధమ్మని పేరు మోసిన శృంగారనైషధ కావ్యానువాద పద్ధతిని విమర్శించినదేమో? అను ఊహ జనించుచున్నది. ఇంతే కాక ఈమె తెలుగు కవిత్వమెట్లుండవలయునో నిర్ణయించినట్లుగ—

"తేనె సోక నోరు తీయనయగు రీతి

తోడనర్థమెల్లఁదోచకుండ

గూఢ శబ్దములను గూర్చిన కావ్యమ్ము

మూగ చెవిటి వారి ముచ్చటగును"

మొ. రా. 1–17

అని రచించి ప్రాగల్భ్యమును ప్రకటించినది. దీనిని పురస్కరించుకొని చూడగా ఈమెకు కావ్యగుణ, దోష ప్రకరణములందు వలసినంత అధికారమున్నట్లు గాన వచ్చుచున్నది.

మొల్ల రామాయణము విస్తృతి యందు మిక్కిలి చిన్నది. ఈమె కథను శరవేగముతో పోనిచ్చినది. వర్ణించిన ఘట్టములందు సయితము అవాల్మీకములైన వర్ణనలను రంగనాథరామాయణకారుననుసరించి రచించినట్లుగా కానవచ్చుచున్నది. ఉదాహరణమునకు మొల్లరామాయణములో ఇంద్రోపభోగముచే గలుషితమైన అహల్య గౌతమమహర్షిచే శప్తయైనిరాహార, వాయు భక్షణ, భస్మశాయినియై పడియుండినది, కాని పాషాణాకృతిని పొందలేదు. శ్రీరామచంద్రుడు ఆ ఆశ్రమము ప్రవేశించి సురాసురులకు దుర్నిరీక్ష్యమైన అహల్యను గాంచి నమస్కరింప ఆమె రామలక్ష్మణులకు శాస్త్రోక్త విధిని అతిథి పూజలిచ్చినది. ఈ సందర్భమున రంగనాథ రామాయణ కారుడు అహల్య పాషాణాకృతియై పడియుండ విశ్వామిత్రనాజ్ఞచే శ్రీరాముడు చరణముసోక జేయగనే

వాల్మీ. రా. సర్గ-49 (27-28)

"మొగులెల్ల విరియు సోముని కళవోలె
పొగయడంగిన హవ్య భుక్కులవోలె
గలంతదొలంగిన కమలినివోలె
బలుమబ్బు గడగిన బంగారు వోలె''

రంగనాథ రామా. 1986-90

లేచి నిలచినదని వ్రాసినాడు.

ఈ సందర్భమును వ్రాయునప్పుడు మొల్ల మూలకాననుసరింపక శిలాకృతి నున్న అహల్య రాముని శ్రీ పదరజముసోఁగనే,

"పదనై యొప్పిదమైకడు
గదలుచు బంగారు పూదెగ కరఁగినరీతిం
బొదలును లావణ్య స్థితి
సుదతిగఁ జూపట్టి నిలిచె సురుచిర లీలన్

(మొ. రా. బా. కా. 62)

అని రంగనాథు ననుసరించి రచించినది.

ఇట్లే మూల గ్రంథమున శివధనుర్భంగ సందర్భమున శ్రీరామచంద్రుడు విశ్వామిత్రునాజ్ఞచే మందసమును దెఱచి యందలి విల్లు నవలీలగా నెత్తి యెక్కుపెట్టి బాణమును సంధించి భగ్నము గావించినట్లున్నది. ఈ సందర్భమున రంగనాథ రామాయణములో శ్రీరామచంద్రుడీవిల్లు నెక్కుపెట్ట నుద్యుక్తుడగుట నెరిగి కౌశికుడు

"అదరకు భూదేవి యాత్మలోనీవు
చెదరి చలింపకు శేషాహినీవు
కదక ధరింపుము కమఠేంద్ర నీవు
కదు నెమరకుఁడు దిక్కరులారు మీరు"

అని మొదల నిడినట్లుగా నున్నది.

ఈ సందర్భముననే మొల్ల —

చ॥ కదలకు మా ధరాతలమ కాశ్యపిఁ బట్టు ఫణీంద భూవిషా
స్పదులనుబట్టు కూర్మమ రసాతల భోగి ధులీ కులీశులన్
వదలక పట్టుపృష్టి ధరణీఫణి కచ్ఛప పోత్రి వర్గమున్
బొదవుచు పట్టు డీకరులు భూవరుడీశుని చాపమెక్కిడన్

ఉర్వీనందనకై రా
మోర్వీపతియెత్తు నిప్పుడుగ్రుని చాపం
బుర్వీం బట్టుడు దిగం
త్యుర్వీ ధరకిటి ఫణీంద్రులూఁతగగడిమిన్

(మొ. రా. బా. 77-78)

అని లక్ష్మణుడు పలికినట్లుగా రచించినది.

ఈ సందర్భముననే తులసీ రామాయణము నందు సయితము లక్ష్మణ కుమారుడు ధైర్యమును వదలకు డనుచు దిక్కుంజరములను, శేషాహిని, ధరణీదేవిని హెచ్చరించినట్లు —

'దిసికుంజరహ కమఠ అహికోలా
ధరహుధరనిధీరనడోడా''

అను పంక్తులు కానవచ్చుచున్నవి. ఇట్లు ఈ మూడు రామాయణము లందు సమానమై అవాల్మీకమైన ఈ రచనకు గారణము జన బాహుళ్యమునందు ఇట్టి విశేషములతో గూడిన రామాయణ గాథ యొక్కటి ప్రచలియుండనోపునని ఊహించ వీలగుచున్నది.

వినయాతిశయముతో ఈమె త నశిక్షిత నని చెప్పికొనినను ఈమెకు వ్యుత్పత్తి కొరవడిలేదు. అందుచే ఈమె కావ్యము అప్రౌఢముకాదు. పూర్వ మహాకవుల ననుకరించి వ్రాసిన పద్యములు పెక్కు కలవు. ఈమె కావ్యము నందు శబ్దాలంకారములు శ్లేషార్థ ఘటనలు, తదితర వర్ణనలకు తోడుగా కందువ మాటలు గూర్చి రచించిన పద్యములున్నవి. ఉదాహరణమునకు

తే॥ తేరులన్నియుగూరాటి తేరులుగను
గుఱ్ఱముల నెల్లఁగావేరి గుఱ్ఱములుగ
నేనుఁగుల నెల్ల వెదరూపు టేనుగులగ
దళములన్నియు మటిహారి దళముగాగ

మొల్ల. రా. సుం. కా. 174

అను పద్యమును పేర్కొనవచ్చును. ఈ పద్యము సరళమై సులభమై కానవచ్చినను సంప్రదాయ పరిజ్ఞానము లేనివారికి అర్థావబోధము సులభసాధ్యము కాదు.

అన్ని వర్ణనములందు కన్న ఈమె ఔచిత్య పోషణము నందు, పాత్రల స్వభావ పరిశీలనమునందు, సీత పాత్ర పోషణము నందు అధికాభినివేశమును కనబరచి రచించినది. ఉదాహరణమునకు—

సాకేతపురిని పరిపాలించుచున్నట్టి దశరథుని వర్ణించుచు

కనఁగోర (డొకనాఁడు (గన్నుల (బరవధూ
లావణ్య సౌభాగ్య లక్షణములు
వినఁగోర (డొకనాఁడు వీనులకింపుగాఁ
గొలుచువారలమీఁది కొండెములను.

మొ.రా.బా.ల. 21.

అని రచించి రాజునకు పరదారాగమనము, పరనిందాశ్రవణము పరమ పాపమను నీతిని చెప్పినది. ఇట్లే సకలలోక విద్రావణుడు పరకాంతోపభోగలౌల్యము కలిగిన దుష్ట రాక్షసుడు నయితము సౌందర్యాధిదేవతయైన సీతను చూచి—

"వ్రీడ యలంకారముగా
నాడుము భయముడిగి మధురమైన మృదూక్తుల్
బేడిసెల నేలు కన్నులఁ
జూడుము కనుఱెప్పలెత్తి సుదతీ నన్నున్"

అని పలికినట్లు రచించినది. ఈ పద్యము రావణపాత్రకు లాఘవము కాక, ఉదాత్తతనే చేకూర్చినది. వాని భావమునకొక సుకుమారతను ఒక సొగసును సంతరించినది. నిజమునకీ రావణాసురుడు తా వలచిన స్త్రీయందు 'వ్రీడ'ను యలంకారముగా తలచినాడో లేదో కాని మొల్లమాత్రము స్త్రీకు సిగ్గే సింగారముగా సంభావించి సభ్యతా రుచిని ప్రదర్శించినది.

ఇట్లే రాజపుత్రులు శివధనుస్సును చూచి ఇది విల్లా? కొండా? అని ఆశ్చర్యపోవుట, శ్రీరాముడు శివధనుర్భంగము కావించినపుడు రాజపుత్రులు శిరములు వంపగా సీత మేను వెంచుట, మున్నగునవి స్వభావ పరిశీలనమునకు ప్రత్యేకముగా బేర్కొనవచ్చును.

ఈ కవయిత్రి పోయిన పోకడలు, చూపిన నేర్పులు ఒక ఎత్తు సీత రామునకు పంపిన సందేశమొక యెత్తుగా గణింపదగి యున్నది. రాము బాసి అశోకవనియందు విరహవేదనాభారముతో కృశించి, దిక్కుతోచకున్న సీతవద్దకు ఆంజనేయు డేతెంచినప్పుడామె విరహాతురమై నాయికా సాధారణముగా చంద్ర, మన్మథ, మలయమారుతోపాలంభనము చేయలేదు. కాని "ఏ యెడ జూచిన ధరణీ నాయకు శ్రీపాదయుగము నాచిత్తములో బాయదని విన్నవింపు" మనుచు పలికినది. ఇంతేకాక ఈ పతిదేవత నిడుపెన్నెరి వేణి జడలుగా నవరించి, మలిన జీర్ణాంబరము కట్టి, భూమిరజము విభూతి పూతగా పూసి, నిరశన స్థితితో రామమూర్తిని చిత్తమున నిలిపి,

"అహితలంకా మహాద్వీప గహనసీమ
దపము సేయుచునున్నాను తన్నుగూర్చి
నాకు ప్రత్యక్షమగుమని నాథునకును
విన్నవింపుము సత్వసంపన్న నీవు"

అని సందేశము పంపినది. ఇందు సీతాదేవి, విప్రలంభ శృంగార నాయికవలెకాక ఒక మహాతపస్వినివలె గోచరించుచున్నది. ఆమె కఠోరతపమునకు ఫలముగా ఐహిక సుఖమునుగాని, చివరకు అమృతత్వమునుగాని కోరలేదు. కాని కేవలము తన నాథుడు, జగన్నాథుడైన 'రామ' దర్శనమును మాత్రమే కోరినది. పతిదేవతలందరికి తలమానికమైన సీత శీలమునింత పరిశుద్ధముగా పోషించి, విరహతాపము నొకతపస్సుగా తీర్చిదిద్దిన మొల్ల చిరస్మరణీయమైనది.

తాళ్ళపాక తిమ్మక్క

మొల్ల కవయిత్రి తరువాత కాలక్రమమును పురస్కరించి చెప్పుకోదగిన కవయిత్రి తాళ్లపాక తిమ్మక్క. ఈమె

"సంగీతము సాహిత్యము
శృంగారము చక్కఁదనము శీలముగల పు
ణ్యాంగనకుం బ్రియుఁడగు కవి
పుంగవుఁడరయంగ నెంత పుణ్యాత్ముఁడో!"

అని తోటి వారలీసునసూయలు పొందునట్లుగా జీవించిన సంకీర్తనాచార్యులగు తాళ్లపాక అన్నమాచార్యుల ధర్మపత్ని. ఈమె కృతమైనది 'సుభద్రా కళ్యాణము'. ఈ కావ్యము ద్విపదమంజరీ రూపమని చెప్పదగిన గేయచ్ఛందములో నున్నది. ఈ కవయిత్రి స్వీకరించిన ఛందస్సువలెనే ఈమె రచన నయితము సరళమై, సులభమై, గేయానుకూలమై సాగిపోవుచుండును. ఉదాహరణమునకు శ్రీకృష్ణుడు తన చెలియలు సుభద్రను—

"అమ్మరాముద్దుల—గుమ్మరావేగ
కొమ్మరా నవకంపు—బొమ్మరావమ్మ
చిలుకల కొలికిరా—శృంగారకన్య
తొలకరి మెఱుపురా—తోయజగంధి
పండువెన్నెల రావె—భాగీరథి రావె
అమృతంపు తెప్పరా—అరవిరిమొగ్గ
బంగారు పెట్టెరా—భాగ్యాలభరణి

అని మురిపెముతో పిలిచినాడని రచించినది. ఈ పాదములలో సుభద్ర సొగసు నిజమునకు కనకపు బొమ్మవలె, అమృతపు తెప్పవలె, పండువెన్నెలవలె, చిత్తజుని బాణమువలె చూపరుల మనో నేత్రములకు అమృత సేచనము సేయునట్టినదని చెప్పినట్లైనది. అంతేకాక అల్లారుముద్దుగా పెరిగిన కలిగినింటివారి ఆడపడుచు సౌభాగ్యమున కిదొక ప్రతీక వంటిదిగా నున్నది. ఇట్లే సుభద్ర అలంకరించుకొనిన విధానమును గూర్చి వ్రాయుచు సుభద్ర ఇంచుక జాఱుకొప్పు ముడుచుకొని పూవులు తుఱుముకొని మన్మధుడియు విరిమొగ్గతూపువంటి గుమ్మడిగింజనామము తీర్చి పసిడిముత్యాల తాటంకాలు, మొగపుతీగె, జిగిమణులమంజిడి లేశి. పుంజీలదండ, నేవళమ్ము, భన్నసరము మున్నగు దండల నలంకరించుకొని —

"ఇన్నిసొమ్ములకును—వన్నె బెట్టినట్లు
మూడువేల్ వెలసేయు-ముక్కెరబెట్టె"


అని వర్ణించినది. సుభద్ర ధరించిన అలంకార విశేషములన్ని ఈ నాటి స్త్రీ లెరుగనివి. బంగారము బంచబంగాళమైపోవుచున్న ఈ రోజులలో ఈ యలంకార విశేషములు స్త్రీల మనస్సుల నూరింపజేయునవిగా నున్నవి.

ఇట్లే సుభద్ర నడచివచ్చిన విధానమునుగూర్చి —

"నడవడ చిన్నారి-నడుము జవ్వాడ
అందెలు మ్రోయగ-హారముల్ తూగ
మొలనూళ్ల ఘంటలు-ముద్దియల్ మ్రోయ
సంది దండలు వెల్గ—సరిపెణల్ దూల
దివ్వెలై హారముల్—తెరువుజూపగను
హంసనడకలతో-నతివ సుభద్ర"

వచ్చినదని వ్రాసినది. ఈ విధానమిందు సుభద్రావ్యపదేశము చేత తిమ్మక్క సర్వాలంకార శోభితలై పూచిన తంగేడులవలె నుండిన నాటి యువతీ సామాన్యపు నడకను, చెవికి, మనస్సునకు ఇంపు నింపునట్లుగా రచించినది.

ఇట్లే ఈమె శ్రీకృష్ణబలరాములు దైవతకోత్సవమునకు వెడలునప్పుడు—



"పప్పు బూరెలు నెయ్యి-పాయసాన్నములు
కాయగూరలు పెక్కు—కలవంటకాలు
ఊరగాయలు నెయ్యి-బొబ్బట్లు వడలు
గారెలు బూరెలు-కందిమండిగెలు
అరటిపండులును—రాజాన్నరాసులును
పిండికూరలు మొదల్—పెద్దకుడుములును"

గరిగల ఘటముల గంపలను నించి పౌరులు నడచినారని వర్ణించి తెలుగువారికి నోరూరింపజేయుటే కాక నాటి ఆచారములను, జాతరలకు వెళ్లు విధానమును మన కన్నులయెదుట ప్రదర్శించినది. ఈ విధముగనే ఈమె హాస్యమునందు సయితము సహజత నుట్టిపడజేయుచు రచన గావించినది. ఉదాహరణమునకు—సుభద్రాసక్తుడై సన్యాసివేషముతో దైవతకాద్రి ప్రవేశించిన అర్జునుని చూచి కృష్ణుడు నవ్వుచు—

"నిన్ననే సుతులగని—నెఱత నమ్మనను
యింతలో సన్యాసి—వెట్లైతివయ్య

అని పలికిన పాదముల బేర్కొ నవచ్చును.

ఈ విధముగా నీ కవయిత్రి రచనము సహజసుందరమై గానానుకూలమై, తెలుగువారి సాంఘిక జీవనమునకు మణి దర్పణమై మరపురానిదై యున్నది.

రంగాజమ్మ

తంజాపురనాయకుడగు విజయరాఘవుని విద్వత్సభా విజయ విలాసమునకే విత్వత్కళికవంటిది రంగాజమ్మ. ఈమె పేరు చెప్పగనే—

> " ఏవనితల్ మమ్ముందలఁప నేమిపనో ? తమరాడువారుగా
> రో ? వలపించు నేర్పెరుఁగరో ? తమకౌఁగిటిలోన
> నుండగా రావడియేమిరా ? విజయరాఘవ ! యంచిలు
> దూరిబల్మిచే దీవరకత్తెనై యిటుల తీసుకవచ్చితినా
> తలోదరీ ! "

అను పద్యము స్మృతికి రాకమానదు ఈ పద్యమును సాధారణముగా రంగాజమ్మ విజయరాఘవుల ధర్మపత్నికాక ప్రియురాలై యుండుననుటకు ఉదాహరణముగా పేర్కొనుచుందురు. ఈ సమాధానము కేవలము వేశ్యయేకాదు భర్తృవాల్లభ్యమును చూరగొనిన మరి యేసపత్నియైనను చెప్పియేయుండును. ఈ పద్యోదాహరణము వలన రంగాజమ్మ కొక న్యూనత కాక ఘనతయే చేకూరినది ఆమె రసాగ్రణియైన విజయరాఘవుల నెట్లెందు కాచుకొనినదో తెలియవచ్చినది.

రంగాజమ్మ శృంగారరసతరంగిత పదకవిత్వ మహనీయ యైనట్టిది. ఈమె సారస్వత ధురీణ. విచిత్రతరపత్రికాతి శతలిఖిత వాచికార్థావగాహన ప్రవీణ, అతులితేష్టభాషాకవితా సర్వంకష మనీషా విశిష్ట విశారద, రాజనీతివిశారద, విజయరాఘవ మహీపాల విరచిత కనకాభిషేక గౌరవ, విద్వత్కవిజన స్తవనీయ వివేక: ఇంతటి గుణోత్తరయైన ఈమె ఉషాపరిణయము, మన్నారుదాసవిలాసనాటకము, సంక్షేప భారత, భాగవత, రామాయణములను రచించుటేకాక శృంగారంబు కన్పట్టు పదములు మధురసాస్పదములుగా రచించినది—ఈమె ప్రతిభా పాండిత్యములను గూర్చి ఆచార్యాగ్రేసరుండగు శతక్రతు శ్రీనివాసతాతాచార్యులవారు " భారతికి ప్రతివత్తువమ్మా రంగారాజమ్మా ? అనియు 'నెఱకొను పలుకుల నెలత నీముఖాంబుజ సీమన్'' అనియు ఈమెను సాక్షాత్తు సరస్వతీదేవిగ సంభావించినట్లు ఉషాపరిణయాది గ్రంథములు సాక్ష్యమిచ్చుచున్నవి.

నానాశాస్త్ర విద్యావిశారద అయిన రంగాజమ్మ గ్రంథములన్నియు శృంగార రసతరంగితములే. ఒక్కొకప్పుడు కాలస్వభావమును పురస్కరించుకొని అతివెల శృంగారచ్ఛాయలు సయితము కూడుకొనినవి అయ్యును ఈమెగ్రంథము లందచ్చటచ్చట ప్రవేశపెట్టిన పద్యములు నాటి సాంఘిక వ్యవస్థను అద్దమునందువలె ప్రతిబింబింపజేసినవి. ఉదాహరణమునకు బాణాసురపుత్రి ఉషాదేవిని కలయందు రమించిన సుందరాంగుడు—

> " సంపంగిపువ్వులు సరసతసిగఁజుట్టి
> బురుసారు మాల్గట్టి పొంకమమర
> న చంద్రుని సొంపునదలించు నుదుటను
> దీరుగాఁది కంబు దిద్దివేడ్క
>
> శ్రీకారముల మించు చెలువంబుఁగల్గిన
> పీమలఁజౌకట్లు వెలయనుంచి
> బటువు ముత్తియముల బాగుగాగూర్చిన
> కంటసరుల్ దాల్చి ఘనతమీరఁ
>
> గీ॥ దనరనురమున వజ్రాలతాళివైచి
> హస్తములకెంపుల కడియాలలరఁబూని
> వసుధజీరాడు చుంగుల వన్నెఁగాంచు
> మేటి కనకాంబరమువలె వాటు దనర "

ధరించి ఏతెంచినట్లురచించినది. ఈ పద్యములోనీమె తంజాపురాంధ్రనాయకరాజాలంకార విశేషవిధానమంతయు అనిరుద్ధునియందన్వయ పరచి మనకు ప్రదర్శించినది.

ఇట్లేఇంకొక చోట విజయరాఘవ నాయకు డలంకరించుకొనిన విధానముమగూర్చి—

> నెలత యొక్కతెచేరి నిలువుటద్దముబట్టె
> చెలువ యొక్కతె యోరసిగయొనర్చె
> చంద్రాస్యయొక్కతె జాజిసరుల్ చుట్టె
> జాణయొక్కతె రుమాల్ జాలుగట్టె
>
> గలికి యొక్కతె దిద్దె గస్తూరి తిలకంబుఁ
> కనకాంగి యొకతె చేకట్లు వెట్టె
> జాణయొకతె బురుసాహిజారును బూన్చె
> సకియ యొకతె యఱచట్ట దొడిగె
>
> తరుణి యొకతె హదువుగ్గాదట్టిగట్టె
> వనిత యొకతె దుప్పటి వలెవాటువైచె
> పడఁతి యొక్కతె చెవుల జవ్వాదియుంచె
> గొమ్మయొక్కతె కుంకుమ నెమ్మినలఁదె

అని రచించినది. ఈ పద్యమును బురస్కరించుకొని నాటి రాజలోకమునకు స్త్రీలే సర్వ పరిచర్యలు చేయుటకాక అలంకార రచన సయితము చేయువారని తెలియచున్నది. ఇంతేకాక నాటి సంఘమున స్త్రీ పురుష భేదములేక అందరు అన్ని ఆభరణములను ధరించెడి వారని విదితమగుచున్నది. రాజ పురుషులు దట్టిగట్టి అరచట్ట (మన waist-coat వంటిది)తొడిగి, దుప్పటిని వలెవాటు వైచి, బురసాహిజారు (బంగారు కత్తిని) ధరించెడివారు. స్త్రీల వలనే రాకుమారులు నిడుదకురులు పెంచి, యోరసిగవేసి, పువ్వులు తురుముకొని, కస్తూరి తిలకము తీర్చుకొనుటకాక పాదమున బిరుదు పెండెము, చేతుల కెంపుల కడియాలు, చెవుల చౌకట్లు, కంటసరులు, ఉరమున గోపాలతాళి, వజ్రాలతాళి, మున్నగు అలంకారములను ధరించుచుండెడి వారని గోచరించుచున్నది. ఆనాటి సంపత్సమృద్ధికి ఇదొక ప్రబల నిదర్శనము.

ఉషా పరిణయములో రంగాజమ్మ విరహవేదన దోదూయమానయై, ఉషాదేవి ఆడనొల్లకుండిన ఆటలను పేర్కొని, నాటి

స్త్రీలు, కన్యలు సాధారణముగా నాడుకొను ఆటలను గూర్చి ప్రస్తావించినది. ఉదాహరణమునకు—

అతివ దాగిలి మూత లాడుదమన్నను
సమ్మతించ దొకింతఁ జంద్రవదన
చెండు గోరింతము చెలియ ! రమ్మని పిల్వ
గనులిచ్చి చూడదు కలువకంటి
గుజగుజరేకుల కొమ్మ ; యాడుదమన్న
మోమెత్తి చూడదు ముద్దుగుమ్మ

పగడ సాలమనము పడఁతి యాడుదమన్నఁ
బలుకదు మనసుతోఁ బద్మనయన
యతివ చదరంగ మాడుద మనుచు బిల్వ
నించుకైనను నంగీకరించ దయ్యో"

అని రచించిన పద్యములను బేర్కొనవచ్చును. ఇందున్న దాగిలి మూతలు, చెండు గోరించుటలు (బంతియాట) గుజగుజరేకులు, పగడసాల, చదరంగము మున్నగునవి ఆంధ్ర స్త్రీల కభిమాన పాత్రములైన ఆటలుగా తెలియుచున్నవి.

ఈ కవయిత్రి మన్నారుదాసవిలాస నాటకములో స్త్రీకి సంఘములోగల స్థానమును అద్దము నందువలె ప్రతిబింబింప జేసినది. కన్యకు, కోరిన వరుడు లభించుటె నాడు కోటి నోముల ఫలముగా భావింపబడుచుండెడి దనుట కుదాహరణముగా రాజపుత్రియైన కాంతిమతి ప్రవర్తించిన విధానమును గ్రహింపవచ్చును. ఉత్తమ వంశ సంజాతయై వయోరూప లావణ్య విభవయైన కాంతిమతి తనకు అనురూప వరుడైన విజయ రాఘవుడు లభించునో లేదోయని ఎఱుకసానిని పిలిచి అడిగినది. ఎఱుకత చెప్పిన ఎఱుక తన ఎద తాకినప్పుడు దాని యొడిని చేటెడు బియ్యము సరి ముత్యాలు నింపి పంపినదట. ఇంతేకాక కాంతిమతి వివాహ సందర్భమున వివాహ ప్రధాన హోమాది శుభకర్మలతో గూడ ముత్తైదువులు ధవళములు, శోభనములు, జోలలు పాడినట్లు వర్ణించి ఆనాటి యాంధ్రుల వివాహ మంగళ కౌతుక తంతువును మన కన్నుల యెదుట జరిపించినది.

బహుభాషా కోవిదయైన రంగాజమ్మ తన గ్రంథములం దనేకచోట్ల ఆ యా ప్రాంతములకు, జాతులకు ప్రత్యేకమైన వేషభాషాదులనుపయోగించి కావ్యమున కొక సహజతను సమకూర్చుటే కాక ఔచిత్య పోషణము గావించుచు నవ్యతను ప్రదర్శించినది. ఉదాహరణమునకు "నిడుదకుళ్ళాయలు నిండు చోగలు బూని సడిసన్న నగరియాన్నగార్లు 'శామి పరాకు, కెళకెక్క మన్నారు కోవిల్లె యిరుందుంపంగు వి త్తితుడాళ్ళక్క తెలంగాయ వాఁగ" అనుచు ప్రవేశింపగ నంబులు—మణిమకుటంబులు, మెఱుగుకుండలములు, వోలకళ్ళాయలు, సరిగ దుప్పటులు ధరించి వచ్చినారట. మౌహూర్తికులు—పుస్తె వర్ధనములు, పంచాంగములు పట్టి ప్రభు సమ్ముఖానకు వచ్చినారట.

సిద్ధాంతికులు—భైరవ జోస్యులు నేఁని మాటలే ఆడుదువు చక్కంగా అశ్విని భరణి, కృత్తికలు గురుతెరుంగవు. నీకు పంచాంగం విప్పేదెన్నానీ భవిషికి" అని తగవులాడుచు ప్రవేశించినట్లు రచించిన వాక్యములనుద్ధరింపవచ్చును.

ఈ విధముగా నీమె ఈ గ్రంథమునందు సంస్కృత, ప్రాకృత, అపభ్రంశ, శౌరసేని, మాగధి, చూళిక, పైశాచి, దేశి మున్నగు భాషలను ప్రవేశపెట్టి తనకున్న అష్టభాషాకవిత్వ విశారద అన్న బిరుదమును సార్థక మొనరించుకొనినది. గ్రంథమునందీమె ఆర్యభట, సూర్యసిద్ధాంతానుయాయులకు బృహస్పతి గ్రహణస్ఫుటీకరణ విషయములోగల వివాదముల చర్చించి దృక్సిద్ధ విషయములో తనకుగల ప్రవేశమును ప్రదర్శించినది; ఇంతే కాక గ్రంథమునందచ్చటచ్చట స్పృశించిన విషయములను పరస్కరించుకొని చూడగా నీమెకు సంగీత, సాహిత్య, వేదాంత, జ్యోతిశ్శాస్త్రాది విషయములందే కాక వ్యాకరణ, శబ్ద, తర్క, పూర్వ మీమాంసాది శాస్త్ర విద్యలందు సముచితము ప్రవేశమున్నట్లు గోచరించుచున్నది.

ఇంతటి కావ్యశాస్త్ర కళామహనీయమైన కవయిత్రి స్త్రీ లోకమునకే తలమానికమైనది.

సాహిత్య విద్యా విశారద ముద్దుపళని

ఈమె చిన్ని కృష్ణుని శృంగార భక్తురాలు. చిన్ని కృష్ణ కరుణా కటాక్ష వీక్షణ ప్రవర్ధమాన నూన శృంగార రసప్రధాన సంగీత సాహిత్య భరతశాస్త్రాది విద్యాపారంగత. చోళసింహాసనాధిపతి యగు ప్రతాపసింహునకు ప్రియురాలై కేవలము సౌందర్య మహిమ్మ చేతనే కాక సంగీత, నాట్య, సాహిత్యాది విద్యా ప్రౌఢిచే నాతని మెప్పించి చామీకరానేకయంబరాభరణముల బహూకృతి నొందినది. ఈమె కృతమైనది రాధికాసాంత్వనము. దీనికే 'ఇళాదేవీయ' మని పేరు. ఈమె స్వయముగా కవయిత్రియై కావ్యలక్ష్మి నారాధించుటేకాక కవిజనసహకారమై కృతుల గైకొని చిరకీర్తి నందినది. ఈమె కవిత్వమునుగూర్చి శ్రీ వీరరాఘవ దేశికాచార్యులు -

"సాహిత్య విద్యావిశారదశారద
యై ముద్దుపళని నా నమరునిన్న"
అనియు, "ఘటియింపనేర్తువు కవన జాతులెఱింగి
పలుకులకల్కి వెల్వెలనఁబాటి"
అనియు ప్రస్తుతించినారు.

రాధికాసాంత్వనము శృంగారరస ప్రబంధము. ఈమె తాను వెలసిన కాలసామాన్యధర్మమును పురస్కరించుకొనియో, కాక తన కాశ్రయులైన ప్రభువుల కోరికను ప్రధానముగా గొనియో తాను సభ్యతాపరిధులను దాటి, స్త్రీ జన సహజమైన 'లజ్జ'ను గూడ పరిత్యజించి అతి వేలమైన శృంగారమును ప్రదర్శించినది. కాని

36—31

శ్రీకృష్ణుని ప్రశంస వచ్చినప్పుడెల్ల తానాస్వామి యందైక్యమై ఆ కృష్ణ భావనా మధు వాహిని యందు తానొక మకరందబిందువై కలిసిపోయినట్లు రచన గావించినది. దీనిచే ఆమె చెప్పినదంతయు పక్షిముఖముగా ముద్దుపళని మధురభక్తి రసావేశముతో స్వామికి సమర్పించిన ప్రేమోపహారమీ కావ్యమని తోపింపచేసినది. ఈమె శ్రీకృష్ణుని ఎప్పుడు, ఎట్లు వర్ణించినను, వర్ణితములైన అలంకారాది విశేషములకన్న అలౌకికమైన దివ్య సౌందర్య మొందు, ఆ స్వామియందు భాసింపజేసినది. ఉదాహరణమునకు పళని కలయందు గాన వచ్చిన చిన్నికృష్ణుని వర్ణించుచు—

"కటిని జుట్టిన కనకాంబరముల తోడ
మెఱుగు చామనిచాయ మేనితోడ
నాసిక తుదగల్గు నవ మౌక్తికముతోడ
జిగిలి కస్తురి బొట్టు మొగముతోడ
గరుణారసము చిల్కు కన్నుఁదమ్ముల తోడ
ప్రతి యెఱుంగని దివ్య రూపము తోడ
సొగసు గనుపించు మవ్వంపు సొంపు తోడ"

అని రచించినది. ఈ రచనలో ఈమె సర్వాలంకార సంశోభితుడైన స్వామి సుందర రూపమును మన కన్నుల యెదుట సాక్షాత్కరింప చేయుటేకాక ఈ సౌందర్యము లౌకికమైనది కాదు, అది అలౌకికమైన దివ్యరూపని స్పష్టపరచినది. ఈమె భావనలో శ్రీకృష్ణుడు శృంగార రసాధి దేవత. అతడు పొచ్చెమెరుగని సొగసుకాడు. వెలితిలేని సరసుడు. రూపుదాల్చిన కారుణ్యమూర్తి. అతడు 'హారనుగొల్వగా మీఱు వక్షమువాడు. తలచుట్టివచ్చు నేత్రములవాడు' చక్కని పాల్గారు చెక్కులు గలవాడు, అతడు మదనకోటుల గొనగోట నడుమువాడు, అట్టి చారుతర మూర్తియైన గోపాలచక్రవర్తి ఈమెకు—

'రాశిజేసిన శృంగార రసమనంగ
జక్షులకు దోచు కరుణాతిశయమనగ'

కానవచ్చినాడు. ఇట్లే ఈమె ఆ దివ్యమంగళ మూర్తిని భావించి, చొక్కి తన్మయత్వమును పొంది చివరకా స్వామితో తానేకత్వమును పొందుటకై తపించిన విధానమును 'రాధికా'వ్యపదేశముతో పొందుపరచి—

'కలుగునా కన్నుల' కఱవెల్లఁదీఱంగఁ
గమలాక్షునెమ్మోము గనుగొనంగ
వేవేగ నబ్బునా వీనులవిందుగా
దనుజారి వేణునాదము వినంగ
నలవడునా చేత నతిపుణ్యమందంగ
వాసుదేవాంఘ్రి సేవల బెనంగ
నౌదవునా గోప గోపికా సదయు నెనసి
యురుతరానంద జలరాశినోలలాడ'

అని రచించినది. ఈ పద్యమునందు రాధిక సర్వాంగములలో స్వామిసాహచర్య సౌభాగ్య ధన్యతగోరిన విధానము కానవచ్చుచున్నది.

ఇట్లే రాధిక శ్రీకృష్ణునకు కీరముతో సందేశమును బంపునపుడు—

'నాకృష్ణదేవుని నాముద్దుసామిని
నాచక్కనయ్యను నాదు హరిని
నా నోముపంటను నా రాజశేఖరుని
నా రామతమ్ముని నాదు విభుని

జేరి కన్నుల కఱవెల్ల దీరగాంచి
చాలనదిగితి మ్రొక్కితిఁ గేలుసాచి
కౌగిలించితి గరములు కనులఁ జేర్చు
కొంటిరమ్మంటి మది వేడుకొంటి"

అని పలికినట్లు రచించినది. ఈరచనలోని మాటల కూర్పునందే విరహాతురయైన నాయిక భావప్రగాఢత్వము నంతటని పొందుపరచి ఆ నాయకుడామె కెంతటి ప్రాణాధిక ప్రియుడో ధ్వనింపజేసినది. అంతేకాక భగవదాయత్త చిత్తులైనవారికి సర్వము తన్మయముగనే కనుపించును. అట్లే ముద్దుపళనికి శ్రీకృష్ణుడు సర్వము తానయై కనుపించినాడు.

ఇంకొకచోట సందేశహరయైన చిలుకను జాగు సేయకుమని హెచ్చరించు నెపముతో శ్రీకృష్ణదేవుని మంగళాంగముల మహిమ యెంతటిదియో కొనియాడుచు—

'మోహనాంగుని తియ్య మోవిబింబమటంచు
మదిఁ జొక్కి నామాట మరువవలదు
నలినలోచనుని లేనగ వానవాలంచు
మఱలెక్కి నామాట మఱవవలదు
కంసారిపలుకులు కండచక్కెరలంచు
మదిఁ దక్కి నామాట మఱవవలదు

రమణు చల్లని చూపులమృత పూరమటంచు
నెఱిఁ జిక్కి నామాట మఱవవలదు
కమలాక్షు కరములు కల్పశాఖలటంచు
మఱినెంచి నామాట మఱవవలదు

వానిఁగనిరేని ఘనమోహ వనధిలోన
మరగిమునుగుదయ్యాది మౌనులైనఁ
బలుక నేటికి మనవంటివారిఁ గాన
గిరమా తెల్విగొని తెల్పు శౌరితోడ

అని రచించినది. ఈ పద్యములో శ్రీహరి సర్వావయవములను అలౌకికములైన ఉద్దీపన విభాగములుగా రూపించి తత్పర్యవసానముగా చూపరులకు కలుగునది ఘనమోహ నవనదిలో మునక. ఈ మోహము చిత్త విభ్రమణ హేతువు కాదు. అది చిత్తై

కాగ్రహేతువు. పరమ సంతృప్తికి సేతువు. అందుకే ఆ మోహజలధిలో మునుగువారు సామాన్యులు కారు, వారు అతి మౌనులు. అతి దైవరంజకమైన దివ్య శృంగారము ఈ దివ్య శృంగారమునకు స్థానమైనవాడు శ్రీకృష్ణుడు. కావుననే అతనిని 'నలినలోచనుడని', 'కంసారి'అని, 'కమలాక్షుడని,' 'రమణు'డని పేర్కొనినది. ఇదొక మధురభక్తి భావన. ఇంతటి అపురూపమైన భావమును కండ చక్కెరలవంటి పదములతో పొందుపరచి రాధామాధవుల ప్రేమైకొక దివ్యత్వము నాపాదించి రచించిన వశని నిజముగా ధన్యయైనది. అట్లే ఇంకొకచోట శ్రీకృష్ణ చర్యలను వర్ణించుచు—

> 'యెప్పుడును జేరి మెప్పించు చొప్పు జూచి
> మరుల పూసరె సతులైన 'మౌనులైన"

అని వ్రాసి జగన్మోహనాకారుడు, లీలావిలాసుడైన ఆ స్వామి చర్యలు పరమసాధ్వీమణులైన సతులను, నిస్సంగులైన మౌనులను సయితము మరులుకొనజేయునట్టి దివ్య రస తరంగితములని ధ్వనింపజేసినది. ఇచట పరమ పునీతమైన మధుర భక్తిరసమును జాలువారింప జేసినది వశని.

ఈమె వర్ణనములందు శ్లేషను కూర్చినను, చేపట్టినరీతి వైభవముతో ఆ క్లిష్టతను దెలియనీయక రసానందమునే కలిగించు చుండును. ఈమె రాధిక మనోభావములను వర్ణించు పట్టునను, మన్మథోపాలంభన సందర్భమునందును వర్ణించిన విధానము వింతయై, స్వభావసుందరమై, వక్రోక్తి సంకలితమై సహృదయ హృదయానంద మొనర్చు చుండును. శృంగార సాంగములను భక్తిరసాంగములుగా దీర్చి, ఆ రసాధిదేవతను శ్రీకృష్ణ రూపమున నారాధించి తాను విముక్తయైనది.

తరిగొండ వేంకమాంబ

బాల్యమాది తన జీవితమును శ్రీనివాస దేవునకే ఎత్తుకట్టి ఇహపరములను సాధించిన పుణ్యశీల. ఈమె సహజ కవితాభిరామ. కవిత్వ మీమెకు పురుషోత్తముడైన నారసింహ దేవుని కృపవలన సిద్ధించినది.

> "చేరి తరిగొండపుర నారసింహదేవు
> డానతిచ్చిన రీతిగా నే నిమిత్త
> మాత్రమై పల్కుదును స్వస్వార్థమిప్పు
> డరసి చూచినగాని నాయందు లేదు—
>
> (వేంకటాచల మహాత్మ్యము)

> 'శ్రీకరుండగు నారసింహుని కరుణ
> నీ కథ ప్రారంభమొనరగ జేసి తలర'
>
> (రాజయోగసారము)

అని రచించుటేగాక 'దారు నిర్మిత వీణె నారాధి బల్కించు గాయక పురుషుని కరణి' గాను పురుషోత్తముడు దయాపూర్ణుడై తన జిహ్వయందు వసించి పలికించునని కంఠోక్తిగా చెప్పినది.

ఈమె యింతటి వినయవతి యయ్యు కడు ంగడు సాహసి బాల వితంతువయ్యు నాటి ఆచారముల కెదురీది శ్రీనివాసుడే తన భర్తయని దృఢముగా నమ్మి స్వాతంత్ర్యమును కనబరచిన ధీర.

ఈమె వేంకటాచలమహాత్మ్యము. రాజయోగసారము. వాసిష్ఠరామాయణము విష్ణుపారిజాత యక్షగానము. ద్విపద భాగవతములనేకాక, నరసింహ శతకము, నరసింహ విలాస కథ, శివనాటకము, కృష్ణనాటకము, పారిజాతాపహరణము, రమా పరిణయమను పెండ్లి పాట, చెంచునాటకము, శ్రీకృష్ణ మంజరి, రుక్మిణీ నాటకము. గోపికా నాటకము. ముక్తికాంతా విలాసమను యక్షగాన రూపములగు నాటకముల రచించినట్లు తెలియుచున్నది ఈమె తన గ్రంథములలో బాహాటముగా తాను మోక్షకాంక్షినై ఉచించినట్లు

> "ధరణిమీద మహాత్మ తరియించుకొఱకు
> సామోదమతిని సుజ్ఞాన వాసిష్ఠ
> రామాయణార్థ సారమ్ము గ్రహించి
> వరుసగా ద్విపద కావ్యముగా రచించి
> యంతేక మీకు సమర్పింతు నిపుడు
>
> (వాసిష్ఠ రామాయణము) అనియు —

> శృంగారముగ రచియించి యింజేటి
> వెంగమాంబిక మోక్ష విభవంబు కొఱకు —

అని విష్ణు పారిజాతమునందును పేర్కొనినది ఈ విధముగా నీమె మోక్ష వైభవమునే ప్రధానముగా కాంక్షించి వేంకటాచలపతికో, తరిగొండ నృసింహహరికో తన గ్రంథముల నంకితము గావించి ధన్యమైనది.

ఈమె కృతమైన వేంకటాచలమహాత్మ్యము తిరుపతికొండ యొక్కయు, అక్కడి దేవుని యొక్కయు మహాత్మ్యమును వర్ణించు గ్రంథము. ఈమె ఈ కథావస్తువును వారాహ, భవిష్యోత్తర పురాణముల నుండి గ్రహించి (1) వేంకటేశ్వర మాహాత్మ్యము (2) శ్రీనివాసవిలాసము (3) వరలక్ష్మీవిలాసమను పేర రచించినది. వేంకటాచలమునకు శేషాద్రి అనియు 'వృష భాద్రి' అనియు 'అంజనాద్రి' అనియు పేర్లు వచ్చుటను గూర్చి చర్చించినది. దీనిలో కావ్యకళా దృశ్యకలకంతగా రమించొల్పని విషయములు, న్యాసములు, మంత్రములు, ప్రాణాయామము, యోగాదు లెన్నియో వర్ణింపబడి యున్నవి. కాని కథా సందర్భము నందచ్చటచ్చట ఈమె కావించిన వర్ణనలు స్వాభావికములై

సుందరమగుటే ముఖ్యోద్దేశ్యముగా నున్నవి. హరివిట వేష ధారియై, సిరిపేర్పరియై వచ్చినప్పటి సందర్భము నందా కొంతమునాటి వైష్ణవుల అలంకారాదివేషములున్నదని తప్పక కూర్చి వర్ణించినది. ఈమె వాసిష్ఠ రామాయణమున రాగ విరాగముల స్వరూపమును స్పష్ట పరచినట్లుగా—

"ఆది యందమృతమట్లానంద మిచ్చి
యాదట గరళమై యతి ఖేద మిచ్చు
ఘన విరాగము తొల్త గష్టమై తోచి
యనుపమానందమై యుమరును తుదను"

అని శ్రీరామచంద్రుడే వసిష్ఠునితో పల్కినట్లు రచించినది. ఇట్లే రాజయోగసారమున జీవన్ముక్తి రహస్యమును చెప్పుచు—

"— — అహమును దగ్ధంబు జేసి
తాను దానై యుండు తత్వంబు దెలిసి
నిగమాంత వేత్తయై నిలచిననాడు
మగుడ పుట్టడు జన్మమెత్త బోడ"ని

తెలిపినది. ఇందీమె గహనములైన తత్త్వార్థములను అతి గూఢముగ తెలిపినది.

విష్ణుపారిజాతమునందు మాత్ర మామె యక్షగాన పద్ధతినను సరించి రచన గావించి కొంత ప్రసన్నతను కనబరచినది. ఆమెయే ఈ గ్రంథము స్వయముగా — తానింతవరకు రచించిన గ్రంథములు కేవలము గహనములైన తత్త్వార్థములను గూడి పారమార్థిక చింతనముతో నిహలోకము నంటక యుండుట మన సామాన్య పాఠక లోకమునకు ఆనందము జనింపలేకపోయినది, కావున ఈ నాటకము శ్రీమన్నారాయణ దేవుని సంసార వృత్తమును గూర్చి రచించినట్లు చెప్పినది.

ఈ గ్రంథమందు, ఎఱుకతలను, సవతి మాత్సర్యములను, ప్రణయ పుటలుకలను సుందరముగా ప్రదర్శించినది. సంఘమునందారాడు సామాన్య స్త్రీ జనమునకే కాక మహారాజులకు సయితము ఎఱుక (సోదె) యందు విశ్వాస ముండినది. ఎఱుక సోది చెప్పుచు "అవ్వో! అవ్వ యీ కన్న కల కల్లగాదు, కైలాటకము గాదు, ధనుకుగాదు, మసుకుగాదు, ధనుకుగాదు, తబ్బిబ్బుగాదు, దరోటు, ధరికిట గాదు, తోరోట్లు గాదు దబ్బరగాదే భాగ్యశాలి" అని ప్రారంభించినది. అసత్యం కాదు అనే ఒక్క పదానికెన్ని పర్యాయపదాలను ఎఱుకత వాడి తన మాటకొక అధికారమును చేకూర్చినది.

ఈ గ్రంథములో ఈమె యక్షగాన సంప్రదాయము ననుసరించి దరువులు, చూర్ణికలు, సుద్దులు, ధవళములు, కందార్థములు, ద్విపదలు సువ్వాలలు మంగళములు మున్నగునవి ప్రవేశపెట్టినది. ఈమె రచనములను పురస్కరించుకొని చూడగా నీమెకు ఆంధ్ర, సంస్కృత, ద్రవిడ భాషలందును, సంగీతము నందును పాండిత్యాధికారమున్నట్లు గోచరించుచున్నది. ఈ విధముగా తన జీవితమును సాహిత్యమును స్వామి కైంకర్యమున కెత్తు కట్టిన పుణ్యాగరిత తరిగొండ వేంకమాంబ.

సాంప్రదాయముననే లోనై అట్టిట్టు కదలరాని పరిస్థితులందు సయితము, ఎట్లో అవకాశము కల్పించుకొని, కావ్యహారముల గూర్చి, ఆంధ్ర భాష నలంకరించి యామె సౌందర్య యష్టికి వన్నెలు తీర్చుచున్న తొల్లిటి ఆంధ్ర కవయిత్రులకు నమోవాకము లందజేయుచు ఈ వ్యాసమును ముగించుచున్నాను.

విదేశాలలో ఆంధ్రులు


(235 వ పుట నుండి)

సుసంపన్న దేశమైన అమెరికాకు తెలుగువారు 1950 ప్రాంతంలో అధిక సంఖ్యలో వెళ్ళారు. ఈనాడు విద్యార్థులు, ఉన్నతోద్యోగులు, వైద్యులు, ఇంజనీర్లు వృత్తికారులు, అధ్యాపకులుగా తెలుగువారు అమెరికాలో నివసిస్తున్నారు. కొందరిక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు.

కెనడాకు బ్రిటీషు గయానా దేశాలకు ప్రపంచ యుద్ధానికి ముందే వెళ్ళినా తెలుగువారు మాత్రం ఆ తరువాతే వెళ్ళారు. అక్కడ ఉంటున్న తెలుగు వారిలో సగం మంది ఉన్నత విద్యాభ్యాసం కోసం వెళ్ళినవారు. మిగిలినవారు ఎక్కువ మంది ఉన్నత పదవులు వహిస్తున్నారు. కొందరు పరిశోధకులుగా, వైద్యులుగా, అధ్యాపకులుగా ఉన్నారు. ఎడ్మంటన్‌లో "ఆంధ్ర సాంస్కృతిక సంఘం" పని చేస్తున్నది. వారు "తెలుగు భాషా పత్రిక" నడుపుతున్నారు. వారు 1972లో ఉత్తర అమెరికాలో తెలుగు మాట్లాడే వారి వివరాలతో ఒక డైరెక్టరేట్ ప్రచురించారు.

ఆంధ్రులు ఎక్కడున్నా వారిలో మాతృదేశంపైన, మాతృభాషపైన, తెలుగు సంస్కృతి సంప్రదాయాలపైన ఆదరాభిమానాలు ఉండడం గమనార్హం.

సంగీత నాటక అకాడమీ



శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి

ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీని 1957 నవంబరు 18వ తేదీని ప్రభుత్వ ఉత్తర్వు 2300 ప్రకారం ఏర్పాటుచేశారు. పూర్వపు హైదరాబాదు రాష్ట్ర నృత్య, నాటక, సంగీత అకాడమీని యీ నూతన సంస్థలో కలిపి వేశారు. సంగీత, నాటక అకాడమీ ప్రారంభోత్సవం 1967 డిసెంబరు 23వ తేదీన అప్పటి మద్రాసు రాష్ట్ర తాత్కాలిక గవర్నరు శ్రీ పి. వి. రాజమన్నార్ అధ్యక్షతన జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అకాడమీకి ప్రారంభోత్సవం చేశారు. కుమారి టంగుటూరి సూర్యకుమారి వందేమాతరం పాటతోను, శ్రీమతులు సీత, అనసూయల ప్రార్థనా గీతం తోనూ ప్రారంభోత్సవం ఆరంభమైంది. ఈ ప్రార్థనాగీతాన్ని శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి ప్రత్యేకంగా యీ ఉత్సవంకోసం వ్రాశారు.

ఆంధ్ర ప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ కొత్తఢిల్లీలోని సంగీత నాటక అకాడమీకి అనుబంధ సంస్థగా స్వతంత్ర ప్రతిపత్తితో పని చేస్తున్నది. హైదరాబాదు సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం ప్రకారం సంగీత, నాటక అకాడమీ 1958 జూన్ 2వ తేదీన నమోదు చేయబడింది.

అకాడమీ ముఖ్య కార్యక్రమాలు : 1) సంగీతం, నృత్యము, నాటకం రంగాలలో పరిశోధనలు, సర్వేలు జరపడం, అరుదైన వ్రాత ప్రతులను, గ్రంథాలను ప్రచురించడం, గ్రంథాల ప్రచురణకు అవసరమైన ఆర్థికసహాయం అందించడం ;

2) ఈ రంగాలలో శిక్షణ నిచ్చే సంస్థలను ప్రోత్సహించడం, వాటికి సహాయం చేయడం ;

3) చర్చా వేదికలు, సమావేశాలు జరపడం, సంగీత, నృత్య నాటకోత్సవాలు నిర్వహించడం, ప్రసిద్ధులైన నాటక రచయితల, నటీనటుల శతాబ్ది ఉత్సవాలు జరపడం, పేరు పొందిన నాటక రచయితలకు, నటీనటులకు సన్మానాలు జరపడం ; ఇతర రాష్ట్రాలతో సాంస్కృతిక సంబంధాలు నెలకొల్పడం ;

4) బీదరికంలో వున్న సంగీత, నాటక విద్వాంసులకు నెలవారీ పించన్లు ఏర్పాటు చేయడం, ప్రసిద్ధి చెందిన సంగీత విద్వాంసుల, నటుల సంగీతాన్ని టేప్ చేయడం ;

5) సంగీతం, నృత్యం, నాటకం రంగాలలో ఉన్నత విద్య నభ్యసించే విద్యార్థులకు ఉపకార వేతనాలు ఏర్పాటు చేయడం ;

6) సంప్రదాయ సిద్ధమైన కళలు, సంగీత వాద్యాలలో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ;

7) నాట్యకళ అనే మాస పత్రికను, నాట్యకళ ముద్రణాలయాన్ని నిర్వహించడం ;

8) సంచార రంగస్థలాన్ని నిర్వహించడం ;

9) భారత ప్రభుత్వంచేగాని, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచేగాని, ఢిల్లీలోని సంగీత నాటక అకాడమీచేగాని కోరిన విషయాలపై తగిన సలహాలను అందించడం.

ఆర్థిక వనరులు :

పై కార్యక్రమాలను నిర్వహించడానికి సంగీత నాటక అకాడమీ ప్రజలు, వ్యక్తులు, సంస్థలనుండి విరాళాలు వసూలు చేయడానికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలనుండి గ్రాంట్లను పొందడానికి అధికారం కలిగి వున్నది. కాని నిజానికి అకాడమీ పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం యిచ్చే వార్షిక, అదనపు, ప్రత్యేక గ్రాంట్లపైనా, ఋణాలపైనా మాత్రమే ఆధారపడుతున్నది.

1957 నుండి 1960 వరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సాలీనా రూ. 50,000 గ్రాంటుగా యిచ్చింది. ఈ మొత్తాన్ని 1960 నుండి 1964వరకు రూ. 1 లక్షకు, 1964 నుండి 1971 వరకు రూ. 1,50,000కు, 1971 నుండి 1974కు రూ. 2,25,000కు పెంచింది. అకాడమీ పరిశీలనా సంఘం సిఫార్సుల మేరకు 1974–75 నుండి యీ అకాడమీకి వార్షిక గ్రాంట్లు రూ. 4,00,000గా నిర్ణయింపబడింది.

1969–70 సంవత్సరంలో నాట్యకళ ముద్రణాలయం అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 33,000 ఋణం మంజూరు చేసింది. 1974–75లో అదనపు వసతి కల్పించడానికి రూ. 50,000 ప్రత్యేక గ్రాంటు యిచ్చింది. కేంద్ర అకాడమీ కూడా కొన్ని ప్రత్యేక అవసరాలకోసం గ్రాంట్లు యిచ్చింది.



ఇతర విధాలుగా అకాడమీకి లభించిన గ్రాంట్లు : 1) 1970లో జానపద కళల ఉత్సవం కోసం గిరిజన సాంస్కృతిక పరిశోధనా సంస్థనుండి రూ. 6,000. 2) 1970లో అభినవ సదస్సుకోసం తూర్పు గోదావరి జిల్లా కలెక్టరు నుండి రూ. 30,000. 3) 1974లో తిరుమల తిరుపతి దేవస్థానం నుండి అభినయ తరగతులు నిర్వహించడానికి రూ. 7,500 లు.

పరిపాలనా వ్యవస్థ :

రాష్ట్రంలోని యితర రెండు అకాడమీల పరిపాలనా వ్యవస్థకు యీ అకాడమీ వ్యవస్థకు చాలా భేదంవుది. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీకి 1957లో నామినేట్ చేయబడిన అధ్యక్షుడు, కార్యదర్శి యింకా ఆ పదవుల్లో కొనసాగుతున్నారు. అదే విధంగా ఆంధ్ర ప్రదేశ్ లలిత కళా అకాడమీకి మొదట్లో నామినేటు చేయబడి, రెండవ కౌన్సిల్‌చే ఎన్నుకొనబడిన అధ్యక్షుడే నేటికీ అధ్యక్షుడుగా వున్నారు. మొదట కార్యదర్శిగా ఎన్నుకొనబడిన వ్యక్తి ఆయన మరణం వరకూ ఆ పదవిలో వున్నాడు. తరువాత ఎన్నుకోబడిన వ్యక్తి యిప్పటికీ కార్యదర్శిగానే వున్నాడు.

కాని ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడమీ మొదటి 12 సంవత్సరాలలో ఇద్దరు అధ్యక్షులను ఎన్నుకొన్నది. 1958లో నామినేట్ చేయబడిన శాసన సభ్యుడు శ్రీ ఆర్. బి. కృష్ణంరాజు 1961 అధ్యక్షుడుగా ఎన్నుకోబడి 1963 డిసెంబర్ 15వ తేదీ వరకు ఆ పదవిలో వున్నారు. ఆయన తరువాత ఆ బాధ్యతలను ఒక కమిటీ నిర్వహించింది. దీనిలో కార్యదర్శి, కోశాధికారి 1964 ఫిబ్రవరి 27వ తేదీవరకు అకాడమీ కార్యక్రమాలు నిర్వహించారు. 1964లో ఏకగ్రీవంగా అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన శ్రీ పసల సూర్యచంద్రరావు 1969వరకు ఆ పదవిలోవున్నారు. ఈ పన్నెండు సంవత్సరాల కాలంలో ముగ్గురు ఉపాధ్యక్షులు పదవిని నిర్వహించారు. వారు శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు. డా. మర్రి చెన్నారెడ్డి, శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ. ఈ కాలంలో కార్యదర్శులుగా పని చేసినవారు : శ్రీ యల్. యన్. గుప్త, ఐ.ఎ.ఎస్., శ్రీ పి. సూర్యచంద్రరావు, డా. పి. యస్. ఆర్. అప్పారావు, శ్రీ యమ్. ఎన్. పద్మారావు. సంయుక్త కార్యదర్శులు : శ్రీ స్థానం నరసింహారావు, శ్రీ యం. ఆనందం, శ్రీ యమ్. యస్. పద్మారావు. శ్రీ కె. వి. సుబ్బారావు.

1969 ఏప్రిల్ నాలుగవ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఒక అధ్యక్షుడినీ, కార్యదర్శినీ, కోశాధికారినీ నియమించి జనరల్ కౌన్సిల్ ఏర్పాటు అయ్యేవరకు అకాడమీ కార్యక్రమాలను నిర్వహించమని కోరింది. కాని 1975 వరకు జనరల్ కౌన్సిల్ ఏర్పాటు కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఒక పార్టు టైం ప్రత్యేక అధికారినికూడా నియమించింది. 1972 అక్టోబరు 28వ తేదీ నుండి 1973 డిసెంబరు 11వ తేదీవరకు శ్రీ కె. ఆర్. పరమహంస. 1973 డిసెంబర్ 12వ తేదీనుండి 1975 జూలై 7వ తేదీవరకు శ్రీ జె. బాపురెడ్డి ఈ పదవిని నిర్వహించారు. ఈ, కాలంలో యీ ప్రత్యేక అధికారులు అకాడమీ అధ్యక్ష,

ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి జనరల్ కౌన్సిల్ బాధ్యతల్ని నిర్వహించారు.

రాష్ట్ర ప్రభుత్వం 1975 మే 20 తేదీన అకాడమీ నాలుగవ జనరల్ కౌన్సిల్ ఏర్పాటు చేసింది. దీనిలో సభ్యుల సంఖ్య 75 నుండి 40కు తగ్గించబడింది. ఈ 40 మందిసభ్యులలో ప్రభుత్వం నామినేటు చేసినవారు 20, గుర్తింపబడిన సాంస్కృతిక సంఘాలచే ఎన్నుకోబడినవారు 15, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు 3, యితర అకాడమీలకు చెందినవారు 2 వున్నారు. జనరల్ కౌన్సిల్ కాలపరిమితి 3 సంవత్సరాలనుండి 5 సంవత్సరాలకు పెంచారు. ఈ కౌన్సిల్‌లో 1975 జూన్ 16 వ తేదీని శ్రీ కె. వి. గోపాలస్వామిని అధ్యక్షులుగా ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షుని, కార్యనిర్వాహక వర్గాన్ని నామినేటు చేసే అధికారం ఆయనకు యిచ్చారు. ఆయన పార్లమెంటు సభ్యుడు శ్రీ యం. ఆనందంను ఉపాధ్యక్షుడుగా నామినేటు చేశారు. ఇతర కార్యనిర్వాహక సభ్యులను కూడా నామినేటు చేశారు. రాష్ట్రప్రభుత్వం డా॥ పి యస్.ఆర్. అప్పారావును కోశాధికారిగా నియమించింది. శ్రీ కె. వి. సుబ్బారావును కార్య



దర్శిగా, శ్రీ బి. కృష్ణంరాజును సంయుక్తకార్య దర్శిగా కార్యనిర్వాహక వర్గం ఎన్నుకున్నది. శ్రీ జె. బాపురెడ్డి 1975 జూలై 7వ తేదీన తమ పదవీ బాధ్యతలను వదులుకున్నారు.

సంగీతం, నృత్యం, నాటకరంగాలకు చెందిన కార్యక్రమాలను అకాడమీ స్వయంగానూ, గుర్తింపబడిన తన యితర సంస్థలద్వారానూ నిర్వహిస్తున్నది. ప్రస్తుతం 67 సాంస్కృతిక సంస్థలున్నాయి. వీటిలో నృత్యానికి చెందినవి 8, నాటకానికి చెందినవి 36, సంగీతానికి చెందినవి 18, హరికథలకు చెందినవి 2, యితర విషయాలకు చెందినవి 3 సంస్థలు చేరివున్నాయి.

శిక్షణాసంస్థలు :— హైదరాబాదులోని నాట్య విద్యాలయానికి అకాడమీ 1963 నుండి 1970 వరకు సహాయం చేసింది. విజయవాడలో 1964 లోను, అనంతపూరులో 1966 లోనూ అకాడమీ నాట్య విద్యాలయాలను నెలకొల్పింది. కాని యివి 1968 లో మూసివేయబడ్డాయి. విజయనగరంలో సురభి నాటక కళా సంఘం ప్రారంభించిన నాటక శిక్షణాలయానికి అకాడమీ మూడు సంవత్సరాలకాలం సహాయంచేసింది.

అకాడమీ, సంగీత నృత్యాలలో శిక్షణ యిచ్చేందుకు ఈ క్రింది గురు కులాలను నిర్వహించింది : (1) విజయవాడలో శ్రీ చిలకలపూడి వెంకటేశ్వర శర్మ అధ్వర్యంలో గాత్ర సంగీత గురుకులం (1959-64). (2) గుంటూరులో శ్రీ టి. యస్. సి. వి. నారాయణాచార్యుల అధ్వర్యంలో వీణ గురుకులం (1959-68); (3) నెల్లూరులో శ్రీ రాళ్ళపల్లి నటేశయ్య

అధ్వర్యంలో గాత్ర సంగీత గురుకులం (1960-68); (4) చిలకలూరిపేటలో శ్రీ షేక్ ఆదంసాహెబ్ అధ్వర్యంలో నాదస్వరం గురుకులం (1960-72); (5) తాడేపల్లిగూడెంలో శ్రీ నవుడూరి ముసలయ్య అధ్వర్యంలో డోలు గురుకులం (1964-71); (6) హైదరాబాదులో శ్రీ భాగవతుల రామకోటయ్య అధ్వర్యంలో కూచిపూడి నాట్య గురుకులం (1964); (7) విశాఖపట్నంలో శ్రీ వాసా కృష్ణమూర్తి అధ్వర్యంలో వీణ గురుకులం (1965); (8) విజయనగరంలో శ్రీ వరదా ఆదినారాయణ అధ్వర్యంలో భాగవత గురుకులం (1966-71): (9) నందిగామలో శ్రీ షేక్ లాల్ సాహెబ్ అధ్వర్యంలో నాదస్వరం గురుకులం (1972); (10) హైదరాబాదులో శ్రీమతి యస్. సామ్రాజ్యం అధ్వర్యంలో భరతనాట్య గురుకులం (1972); (11) తెనాలిలో శ్రీ తిరుపతి స్వామి అధ్వర్యంలో డోలు గురుకులం (1972).

ప్రత్యేక శిక్షణా తరగతులు :—1972 డిసెంబరు నుండి 1973 మార్చి వరకు దేవాలయం నాట్యాలకు సంబంధించిన అభినయంలో ప్రత్యేక శిక్షణా తరగతులు, 1973 నుండి 1975 వరకు పేరిణి శివతాండవంలో తరగతులు అకాడమీ నిర్వహించింది. 1972 లో అకాడమీ ఒక నాటకరంగ ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని నిర్వహించి, 'త్రిజాకీ యమదర్శనం' అనే నాటకాన్ని ప్రదర్శించింది.

అకాడమీ రాష్ట్రంలోని సంగీత, నృత్య, నాటక పాఠశాలలకు ఆర్థిక సహాయం అందజేస్తున్నది. ఈ విధంగా కరీంనగరు, ఖమ్మం, నాగార్జునసాగర్, బొబ్బర్లలలోని పాఠశాలలకు ఆర్థిక సహాయం కలగజేసింది.

బీదరికంలో వున్న కళాకారులకు సహాయం :

రాష్ట్రంలో వివిధ కళలకు ఘనమైన సేవచేసి ప్రస్తుతం బీదరికంలో వున్న కళాకారులకు అకాడమీ పింఛన్లు మంజూరు చేస్తున్నది. అకాడమీ బిరుదులు పొంది, ఆర్థికంగా బాధలుపడుతున్న కళాకారులకు గౌరవభృతి ఏర్పాటు చేస్తున్నది.

చర్చావేదికలు, ఉత్సవాలు :

ఈ క్రింది విషయాలపై అకాడమీ చర్చావేదికలు నిర్వహించింది : కూచిపూడి నృత్యం (1964), నాటక రంగం (1960), అభినయంపై రాజమండ్రిలో (1969), విజయనగరంలో భాగవత నాట్యంపై (1971), అనంతపురంలో వీధి నాటకంపై (1975)

అకాడమీ ఇంతవరకు సంగీతం, నృత్యం, నాటకం, హరికథ, జానపద కళల రంగాలకు చెందిన 28 ఉత్సవాలు నిర్వహించింది. ప్రసిద్ధి పొందిన 11 మంది సంగీత విద్వాంసుల సంగీతాన్ని టేప్ చేసింది.

అకాడమీ 1968 లో సంచార నాటక ప్రదర్శన శాలను తయారు చేయించింది. తగిన నాటక ప్రదర్శనశాల లేని చోట్ల దీనిని వాడుకోవచ్చు.

నాట్యకళ అనే మాస పత్రికను ప్రచురించటంతోపాటు, అకాడమీ అనేక యితర గ్రంథాలను కూడా ప్రచురించింది. సారంగదేవుని "సంగీత రత్నాకరం", జయసేనాని విరచితమైన "నృత్య రత్నావళి", జె. మాధవశర్మ రచించిన "భావ ప్రకాశనం", సుబ్బరామ దీక్షితులు వ్రాసిన "సంగీత సంప్రదాయ ప్రియదర్శిని", "నందీశ్వర భరతం", "క్షేత్రయ్య పదాలు", కె. వేదగిరి వ్రాసిన "తబల బోధిని", "త్యాగోపనిషద్", "రామదాసు కీర్తనలు", వీటిలో చేరివున్నాయి.

నాటక రచనలకు బహుమతులు :

1965 అకాడమీ నాటక రచనా పోటీ జరిపింది. అనంతపూరుకు చెందిన కీ. శే. దేవళ్ళ సత్యనారాయణ వ్రాసిన "లేపాక్షి" నాటకానికి మొదటి బహుమతి, ప్రొద్దుటూరుకు చెందిన శ్రీ మండ్యాల శ్రీనివాసులు వ్రాసిన "త్యాగమయి" మచిలీపట్నంకు చెందిన శ్రీ కందికొండ సత్యనారాయణశాస్త్రి రచించిన "మహామంత్రి తిమ్మరుసు" నాటకాలకు సంయుక్తంగా రెండవ బహుమతి యిచ్చారు.

ప్రధాని 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రజారంజకంచేసే వుద్దేశ్యంతో అకాడమీ హరికథలు, బుర్రకథలు, నృత్య నాటికలు, ఏకాంకికల పోటీ జరిపింది. వాటిలో ఈ క్రింది వాటికి ప్రథమ, ద్వితీయ బహుమతులు లభించాయి.

హరికథలు :

1. "ఆనంద వర్ధన చిత్రము"
   శ్రీ అనుముల విశ్వనాథ భాగవతార్ — మొదటి బహుమతి
2. "ఇందిరా విజయం"
   శ్రీ జి. సూర్యనారాయణ భాగవతార్ — రెండవ బహుమతి

బుర్రకథలు :

1. "నవ భారతం"
   (శ్రీ కొసరాజు రాఘవయ్య చౌదరి) — మొదటి బహుమతి
2. "ప్రపంచ రత్న విజయేందిర"
   (శ్రీ నదీరా) — రెండవ బహుమతి

నృత్య నాటికలు :

1. "ప్రజా విజయం"

(శ్రీ జె. బాపురెడ్డి) మొదటి బహుమతి

2. "చందమామ వచ్చింది"

(శ్రీ రావూరి సత్యనారాయణ రెండవ బహుమతి

ఏకాంకికలు :

1. "మహారథం కదిలింది"

(శ్రీమతి మల్లాది ప్రసాదలక్ష్మి) రెండవ బహుమతి

అకాడమీ ఫెలోషిప్పులు పొందినవారు : సంగీతం : శ్రీరాళ్ళపలి అనంతకృష్ణశర్మ, సంగీతవిద్వాన్, 2) శ్రీ ద్వారం వెంకటస్వామినాయడు, 3) శ్రీ చిత్తూరు సుబ్రమణ్యపిళ్ళె, 4) శ్రీ బాపూరావు, సంగీత విద్వాన్, 5) శ్రీ చింతలపల్లి వెంకటరావు, 6) శ్రీ అంబా ప్రసాద్, 7) శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజు.

నృత్యం : 1) శ్రీ మోటూరి సత్యనారాయణశాస్త్రి, 2) శ్రీమతి చిత్తజల్లు చినవెంకటరత్నం, 3) శ్రీమతి అన్నాబత్తుల బులివెంకటరత్నం.

నాటకం : 1) శ్రీ స్థానం నరసింహారావు, 2) శ్రీ అద్దంకి శ్రీరామమూర్తి, 3) శ్రీ బందా కనక లింగేశ్వరరావు, 4) శ్రీ పులిపాటి వెంకటేశ్వర్లు, 5) శ్రీ గండికోట జోగినాథం, 6) శ్రీ గిడుగు సీతాపతి, 7) శ్రీ దామరాజు పుండరీకాక్షుడు (నాటక రచయిత).

సినిమా: 1) శ్రీ బి.యన్. రెడ్డి, (నిర్మాత), 2) శ్రీమతి పసుపులేటి కన్నాంబ, 3) శ్రీ రేలంగి వెంకటరామయ్య, 4) శ్రీ చిత్తూరు నాగయ్య.

అకాడమీ ప్రదానం చేసిన బిరుదులు : ఎ) గానకళా పరిపూర్ణ : 1) శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, (1960), 2) డా. శ్రీకృష్ణ నారాయణ రతన్‌ఝంకార్ (1962), 3) చిత్తూరు సుబ్రమణ్యపిళ్ళె (1964), డా. శ్రీపాద పినాకపాణి (1966), 5) శ్రీ పర్వతనేని వీరయ్యచౌదరి (1967), 6) శ్రీ క్రోవి సత్యనారాయణశాస్త్రి (1968), 7) శ్రీ షేక్ చినపూర్ సాహెబ్ (1969), 8) శ్రీమహావాది వెంకటప్పయ్య శాస్త్రి (1970), 9) శ్రీ వింజమూరి వరదరాజ అయ్యంగార్ (1971).

బి) భారత కళా ప్రపూర్ణ : 1) శ్రీ వేదాంతం రాఘవయ్య (1964), 2) శ్రీ చింత కృష్ణమూర్తి (1966), 3) శ్రీ నటరాజ రామకృష్ణ (1967), శ్రీమతి అన్నాబత్తుల బులి వెంకటరత్నం (1972).

సి) నాటక కళా ప్రపూర్ణ : 1) శ్రీ స్థానం నరసింహారావు (1960), 2) శ్రీ అద్దంకి శ్రీరామమూర్తి (1967), 3) శ్రీ సి. నాగభూషణం (1973), 4) శ్రీ పీసపాటి నరసింహమూర్తి (1976).

డి) కథాగాన కళా ప్రపూర్ణ : 1) శ్రీపాతూరి మధుసూదనరావు (1964), 2) శ్రీ పెద్దింటి సూర్యనారాయణ దీక్షితదాసు (1969).





పంచాయతీ రాజ్యం - ఒక పరిశీలన

—— శ్రీ సిద్ధాని నాగభూషణం

"గ్రామసీమలలోని జీవనజ్యోతి కాంతి విహీనమై పోతూ ఉంది. జీవితానందం మందగిస్తూ ఉంది. సామాజిక బంధాలు తెగిపోతూ ఉన్నాయి, పీడకు గురి అయిన ఈ ప్రాంతాలలో జీవన రక్తం పునః ప్రసారం కావాలి, గ్రామీణులకు ఆరోగ్యమూ, విజ్ఞానము చేకూర్చాలి" అని విశ్వకవి రవీంద్రుడు అన్న మాటల్లో బ్రిటిష్ పాలకుల తురోజుల పాలనల్లో గ్రామీణ జీవనపరిస్థితులు ఏలా ఉండేవో అర్థంకాగలదు. రెండు వందల సంవత్సరాలు భారతదేశాన్ని ఏలిన పరాయి పాలకులు భారత దేశసంపదను కొల్లకొట్టారు. ఆర్థికవ్యవస్థను అస్తవ్యస్తం చేశారు. ఆ రోజుల్లో భారత ప్రజాసంక్షేమంతో బ్రిటిష్ ప్రభుత్వానికి అంతగా పట్టింపు ఉండేది కాదు. గ్రామసీమల సౌభాగ్యం భారత దేశభాగ్యంగా భావించే దేశంలో గ్రామీణ వాతావరణం బ్రిటిష్ రాచరికపు నిరంకుశ, నిర్దాక్షిణ్య, నిర్లక్ష్య వైఖరివల్ల నాశనమయింది. విజ్ఞానానికి బదులు అజ్ఞానం, సంపదకు బదులు దారిద్ర్యం, ఆరోగ్యానికి బదులు అనారోగ్యానికి నిలయాలుగా గ్రామాలు మారిపోయాయి ఈ దురవస్థనుంచి విముక్తి చేయాలనే పవిత్రాశయంతో స్వాతంత్ర్యానికి ముందు కొందరు సాంఘిక సేవా కార్యకర్తలు దేశంలో అక్కడక్కడ ప్రయోగత్మంగా గ్రామీణ పునరుద్ధరణ కార్యక్రమాలు చేపట్టి నిర్వహించారు.

గ్రామసీమలను పునరుజ్జీవింప చేయడమే బాపూజీ గ్రామ పునరుద్ధరణ కార్యక్రమం అంతిమ లక్ష్యం. గ్రామాలపై గ్రామీణ ప్రజలపై గాంధీజీకి మిక్కుటమైన మక్కువ. గ్రామాలలోనే భారత దేశాన్ని బాపూజీ చూశారు. అందుకే గ్రామీణ పున్నర్నిర్మాణానికి బాపూజీ కంకణం కట్టుకొని పనిజేశారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు ఈ వికాస కార్యక్రమాలకు ముఖ్యమంత్రిగా ఎంతో ప్రోత్సహించారు.



తూర్పు గోదావరి జిల్లా చదలవాడలో శ్రమదానం

స్వాతంత్ర్యం వచ్చింది. చివికి, చితికి పోయిన గ్రామీణ వ్యవస్థను పునరుద్ధరించి చక్కని సమాజంగా తీర్చిదిద్దాలనే ప్రధానాశయంతో సమాజిక వికాస కార్యక్రమాలను ప్రభుత్వం ప్రారంభించింది. గాంధీజీ అత్యంత ప్రాముఖ్యం యిచ్చిన ఈ కార్యక్రమాలను బాపూజీ జయంతినాడు 1972 అక్టోబరు 2వ తేదీన ప్రయోగాత్మకంగా ప్రభుత్వం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ రోజున కాకినాడ-పెద్దాపురం, కడప-కర్నూలు ప్రాజెక్టు, నిజామ్‌సాగర్, ములుగు ప్రాజెక్టులు అనే నాలుగు ప్రాజెక్టులను ప్రారంభించటంతో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లయింది. మొదట్లో ఈ కార్యక్రమం కేంద్రీకృతమై కొన్ని ప్రాంతాలకు పరిమితమయింది. బృహత్తరమైన ఈ కార్యక్రమాన్ని విస్తృత ప్రాతిపదికపై గాక కేంద్రీకృతంగా ప్రారంభించిన తర్వాత ప్రాజెక్టు ప్రాంతాలను బ్లాకులుగా విభజించారు. సాధారణంగా ఈ బ్లాకుల విస్తీర్ణం 100 మైళ్ళు 60,000 మందికి ఉద్దేశింపబడింది. ఈ బ్లాకులు ఏడేళ్ళ తర్వాత సమాజవికాస మండలాలుగా రూపొందుతాయి.

కొన్ని సంవత్సరాలు ఈ కార్యక్రమాలను అమలు పరచిన తర్వాత వాటి నిర్వహణలో లోటుపాట్లను ప్రణాళికల రచయితలు గ్రహించారు. అడ్‌హాక్ సలహా కమిటీలను నియమించి బ్లాకు కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులకు ప్రవేశాన్ని కల్పించారు. కాని ఈ కమిటీలు బ్లాకులలో పనిజేసే సిబ్బందికి సలహాలు మాత్రమే ఇస్తాయి. ఆ కమిటీలన్ను నియమించినా గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక, సాంఘిక స్థితిగతులను మెరుగు పరచాలంటే సరి అయిన నాయకత్వం కావాలి. ఆ నాయకత్వం ప్రజలనుంచి రావాలి ప్రజలే ఒక చైతన్య శక్తి.



విశాఖ జిల్లా చోడవరంలో కొత్తగా వేసిన రోడ్డు

గ్రామపంచాయతీల ఏర్పాటు

గ్రామీణ ప్రజలు చైతన్య శక్తిగా రూపొందాలంటే వారికి నాయకత్వం వహించే ఒక సంస్థకు రూపకల్పన జరగాలి. అందుకే గ్రామాలలో గ్రామప్రజల సమస్యలను పరిష్కరించటానికి గ్రామపంచాయతీలను ఏర్పాటుచేసి పైస్థాయిలలో ఉన్న సంస్థలతో సమన్వయ పరచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీలు చక్కగా పనిచేయనంతకాలం గ్రామీణ సమాజ జీవితం మూడు పూవులు ఆరుకాయలుగా వర్ధిల్లదని ప్రణాళిక రచయితలు అభిప్రాయపడ్డారు. కాని ఆ రోజులలో పంచాయతీలు చాలా నీరసంగా ఉండేవి. అవి సక్రమంగా పనిచేయటం లేదు. అందుకు వాటిని పునరుజ్జీవింప చేయాలి. జిల్లాబోర్డులు కూడా పని చేయుటలేదు. గ్రామ పంచాయతీలను జిల్లా స్థాయిలో ఉన్న జిల్లా బోర్డులను కలిపే సంస్థలు ఏమీలేవు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను ఉత్సాహంగా పాల్గొనేటట్లు చేయాలనే కార్యక్రమం విఫలమయింది. జాతీయ అభివృద్ధి కౌన్సిల్ ఎనిమిదవ మహాసభలో జిల్లాపరిపాలనలో విప్లవాత్మకమయిన మార్పులు తీసుకొని రావాలని నిర్ణయించింది. అందుకోసం శ్రీబల్వంతరాయ్ మెహతా అధ్యక్షతను సమాజ వికాస ప్రాజెక్టులు, జాతీయ విస్తరణ సేవల పరిశీలన బృందాన్ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మెహతా కమిటీ

శ్రీ బల్వంతరామ్ మెహతా అధ్యక్షతను ఏర్పాటుచేసిన పరిశీలక బృందం దేశమంతటా పర్యటించింది. సమాజ వికాస ఉద్యమం ప్రజా ఉద్యమంగా రూపొందాలంటే ప్రజలకు అధికారం, అధికారం వినియోగించుకొనే అవకాశం వికేంద్రీకరించి ఇవ్వాలి. దీని ఉద్దేశ్యం ఏమిటంటే ప్రజలు తమ అవసరాలు తెలుసుకొని వాటిలో ముఖ్యమైనవి ఏమిటో, వాటికి డబ్బు ఎంతకావాలో వారే నిర్ణయించుకుంటారు. కనుక స్థానిక ప్రజలు ఎన్నుకొన్న స్థానిక సంస్థలు ప్రజాహిత కార్యక్రమాల అమలుకై బాధ్యత వహిస్తాయని ఆ కమిటీ అభిప్రాయపడింది. ఈ అభిప్రాయాలతో కూడిన నివేదికను 1957 వ సంవత్సరం నవంబరు 24న ఆ బృందం ప్రభుత్వానికి సమర్పించింది. 1958 సంవత్సరం జనవరిలో బల్వంతరాయ్ మెహతా కమిటీ చేసిన సిఫారసులను కేంద్రప్రభుత్వం ఆమోదించింది. ఈ సిఫారసుల ప్రకారం పరిపాలనా వ్యవస్థను దిగువస్థాయినుంచి స్థానిక సంస్థలను రూపొందించుకోవాలని రాష్ట్రప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రంచేసిన సూచనలను ప్రప్రథమంగా ఆమోదించింది. 1958 సంవత్సరం జూలై నెలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పంచాయతీ సమితులను జిల్లాకొకటి చొప్పున ఏర్పాటు చేసింది.

1956 సంవత్సరం నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 193 మేజరు గ్రామ పంచాయతీలు, 3687 మైనర్ గ్రామపంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వం గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయటంలో మంచి చొరవ తీసుకుంది. తత్ఫలితంగా 1960 సంవత్సరం మార్చి మాసాంతానికి 14552 గ్రామ పంచాయతీలు (ఆంధ్ర ప్రాంతంలో 9825 గ్రామ పంచాయతీలు, తెలంగాణా ప్రాంతంలో 4727) పంచాయతీలు ఏర్పడ్డాయి. ఈనాడు రాష్ట్రం మొత్తంమీద 15960 గ్రామపంచాయతీలు ఉన్నాయి.

పంచాయతీ రాజ్యం

బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫారసుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ అంతటా పంచాయతీ రాజ్యం నవంబరు ఒకటవ తేదీన అవతరించింది. పంచాయతీ రాజ్యానికి మరొక పేరు "ప్రజాస్వామ్య వికేంద్రీకరణం". ఈ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ విధానం మూడంతస్థులలో రూపొందించబడింది. పంచాయతీరాజ్య అవతరణతో గ్రామీణ అభివృద్ధికి ఉద్దేశించిన పరిపాలన పునర్వ్యవస్థీకరించబడింది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తు అనే మూడంతస్థుల విధానం ద్వారా గ్రామ స్థాయినుంచి జిల్లా స్థాయిదాకా పరిపాలన సమన్వయం జరిగింది. ఈ సిఫారసుల ప్రకారం ఆంధ్రప్రదేశ్ 21 జిల్లా పరిషత్తులుగా 321 పంచాయతీ సమితులుగా 15960 గ్రామ పంచాయతీలుగా రూపొందింది.


ఈ పంచాయతీరాజ్య వ్యవస్థలో గ్రామీణ పరిపాలన ప్రజాస్వామ్య సూత్రాలను అనుసరించి ఉంటుంది. ప్రజలచే

ఎన్నుకోనబడిన ప్రజాప్రతినిధులే గ్రామ పరిపాలనను నిర్వహిస్తారు. గ్రామ పంచాయతీలో గ్రామం వార్డులుగా విభజింపబడుతుంది. వార్డులలో పోటీచేసి ఎన్నికైన వారిని పంచ్‌లంటారు. వీరు ఆయావార్డుల ప్రజాప్రతినిధులు. వీరు ఐదు సంవత్సరాలపాటు గ్రామపంచాయతీకి సంబంధించిన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ పంచాయతీ పంచ్‌లు అందరూ కలిసి గ్రామపంచాయతీ సర్పంచ్‌ను ఎన్నుకొంటారు. ఈ గ్రామ పంచాయతీ సర్పంచ్ పంచాయతీకి బాధ్యుడు.

బ్లాకులో ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్‌లూ ఆ బ్లాకు ఏ నియోజకవర్గంలో ఉందో, ఆ నియోజనవర్గం తాలూకు శాసనసభ, మండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, ఆ బ్లాకులో గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు ఎన్నుకొన్న కో-ఆప్టెడ్ సభ్యులు పంచాయతీ సమితిలో సభ్యులు. వీరందరితో పంచాయతీ సమితి బ్లాకు కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంది.

ఇదే విధంగా జిల్లాలో ఉన్న పంచాయతీ సమితి అధ్యక్షులు పదవీరీత్యా జిల్లా పరిషత్తులో సభ్యులు, లోకసభ సభ్యులు, రాజ్యసభ సభ్యులు, శాసనసభ, శాసన మండలి సభ్యులు జిల్లా పరిషత్తులో సభ్యులు, వీరందరూ కలిసి ఎన్నుకొన్న కో-ఆప్టెడ్ సభ్యులు కలిసి జిల్లా పరిషత్తు అవుతుంది. ఈ అనధికారులే కాక జిల్లా కలెక్టర్ కూడా జిల్లా పరిషత్తులో సభ్యులు.

గ్రామ పంచాయతీ స్థాయిలో 20,000 రూపాయలు ఆదాయం మించిన పంచాయతీలకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, సమితి స్థాయిలో బి. డి. ఓ. జిల్లా పరిషత్తు స్థాయిలో సెక్రటరీ, ఆయా సంస్థలు చేసిన నిర్ణయాలను అమలుపరుస్తారు. సమితిలో గుమాస్తా సిబ్బందితో పాటు ఎనిమిది నుంచి పదిమంది విస్తరణ సిబ్బంది బి. డి. ఓ. కు సాంకేతిక సలహాలు ఇస్తారు. రాష్ట్ర స్థాయిలో పంచాయతీరాజ్యశాఖ ఉంది. ఈ శాఖ పంచాయతీ రాజ్య సంస్థల కార్యకలాపాలను సమన్వయపరుస్తుంది. జిల్లా పరిషత్తు, పంచాయతీ సమితుల పరిపాలన వ్యవహారాలను చూడటానికి ఏడు స్థాయీ సంఘాలు ఉన్నాయి- ఈ స్థాయీ సంఘాల ద్వారా పంచాయతీ సమితి, జిల్లా పరిషత్తు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తాయి. (1) ప్రణాళికలు, ఆహార ఉత్పత్తి, (2) సహకారం, పరిశ్రమలు, (3) విద్య, (4) మహిళా, శిశు సంక్షేమం, (5) సాంఘిక సంక్షేమం, (6) రహదారులు, (7) ఆర్థిక విషయాలు, పన్నుల విధింపు విషయాలను చూటటానికి ప్రత్యేకంగా ఏడు స్థాయీ సంఘాలు ఏర్పాటు అయ్యాయి. ప్రతీ స్థాయీ సంఘానికి ఏడుగురు సభ్యులు ఉంటారు. సమితి స్థాయిలో పంచాయతీ సమితి స్థాయీ సంఘాలకు సమితి అధ్యక్షులుఅధ్యక్షులైతే, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తు స్థాయీ సంఘాలకు జిల్లా కలెక్టర్ అధ్యక్షులు.



ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేసిన అత్తిలి ఆసుపత్రి

పంచాయతీరాజ్యం సాధించిన ప్రగతి

పంచాయతీరాజ్యం ఏర్పడిన తర్వాత గ్రామాలలో వివిధ వికాస కార్యక్రమాలు అమలుజరిగాయి. ఒకనాడు రహదారీ సౌకర్యానికి నోచుకోలేని గ్రామాలకు సహితం రహదారీ సౌకర్యాలు కలిగాయి. రహదారులు నిర్మించేటప్పుడు ఈ కార్యక్రమ ప్రాముఖ్యాన్ని గుర్తించి ప్రజలు ముందుకువచ్చి విరివిగా విరాళాలు అందజేశారు. శ్రమదానం చేశారు. రహదారులు నిర్మించిన కారణంగా ఈనాడు గ్రామాల జీవన విధానంలోనే అనేక మార్పులు వచ్చాయి. రైతులు తమ సరుకులను ఇతరచోట్లకు తీసుకొనివెళ్ళి లాభాలను పొందడమే గాక గ్రామంలో సరుకులను, వ్యవసాయ అవసరాలకు తీసుకొనివచ్చి లాభం పొందుతున్నారు. ఈనాడు పంచాయతీ సమితుల ఆధీనంలో 23000 కిలోమీటర్లు రహదారులు ఉండగా, జిల్లా పరిషత్తుల పోషణక్రింద 27,000 కిలోమీటర్ల రహదారులు ఉన్నాయి. గ్రామ పంచాయతీలు గ్రామాలలో రోడ్లను నిర్వహిస్తున్నాయి.

చిన్న నీటివసరుల నిర్వహణ

చిన్న చిన్న నీటివనరుల నిర్వహణ బాధ్యత పంచాయతీ రాజ్య సంస్థలకు వప్పజెప్పటం జరిగింది. కోస్తా జిల్లాలలో 200 ఎకరాల లోపు ఆయకట్టు కలిగిన చెరువుల నిర్వహణ, తెలంగాణా ప్రాంతంలో 100 ఎకరాల లోపు ఆయకట్టు కలిగిన చెరువుల నిర్వహణ బాధ్యత ఈ సంస్థలకు ఉంది. ఈనాడు ఈ పంచాయతీరాజ్య సంస్థల ఆధ్వర్యంలోగల 18.05 లక్షల ఎకరాలు సాగుచేసే 73 వేల చెరువుల మరమ్మత్తుకు పంచాయతీ రాజ్య శాఖ కోటి రూపాయలు ఖర్చుచేస్తున్నది.


మంచినీటి సౌకర్యం

మంచినీటి సౌకర్యం కల్పించటానికిగాను పంచాయతీ రాజ్య సంస్థలు వహించిన శ్రద్ధ ఫలితంగా నాల్గవ పంచవర్ష ప్రణాళిక అంతానికి 42069 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించబడింది. గత రెండుసంవత్సరాలలో 5400 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించబడింది. ఇక 10345 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించవలసి ఉండగా 1976-77 సంవత్సరంలో 3100 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాం.

పరిరక్షిత మంచినీటి పథకాన్ని కూడా గ్రామ పంచాయతీలు ఏర్పరచాయి. చేపట్టిన 282 పథకాలలో 151 మంచినీటి పథకాలు పూర్తి అయితే 40 మంచినీటి పథకాలు పూర్తి అవుతున్నాయి. జీవితభీమా సంస్థ నుంచి అప్పుపొంది 66 పథకాలను పంచాయతీరాజ్య సంస్థలు పూర్తిచేశాయి. దీనికిగాను 174 లక్షల రూపాయల గ్రాంటును ప్రభుత్వం ఇచ్చింది. గ్రామీణ మంచినీటి సరఫరా పథకంక్రింద 68 పథకాలను పంచాయతీరాజ్య సంస్థలు పూర్తిచేశాయి. మూడు కోట్ల పది లక్షల రూపాయల ఖర్చుతో 5 లక్షల జనాభా కలిగిన 200 గ్రామాలకు మంచినీటి సౌకర్యం కల్పించబడింది.

పాఠశాలలు

పంచాయతీ సమితులు తీసుకొన్న చొరవ ఫలితంగా ఈనాడు ప్రతి గ్రామపంచాయతీ ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలలు వెలిశాయి. పాఠశాల భవనాల నిర్మాణానికి ప్రజా విరాళాలను పంచాయతీలు సమీకరించాయి. ఈనాడు పంచాయతీ సమితుల ఆధీనంలో 33,824 ప్రాథమిక పాఠశాలలు, 3036 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా, జిల్లా పరిషత్తు ఆధీనంలో 2392 ఉన్నత పాఠశాలలు ఉన్నాయంటే. వీటిని




పశ్చిమ గోదావరి జిల్లా పెదతాడేపల్లిలో? ప్రాథమికోన్నత పాఠశాల

ప్రారంభించటానికి పంచాయతీరాజ్య సంస్థలు చేసిన కృషిని ఎవరూ విస్మరించలేరు. పాఠశాల భవనాల నిర్మాణానికి పంచాయతీలు తమ నిధులను ఖర్చుచేయడమేగాక ప్రజా విరాళాలను సేకరించాయి. తత్ఫలితంగా ఈనాడు చాలా గ్రామాలలో పాఠశాలలకు శాశ్వత భవనాలు ఉన్నాయి.

ప్రాథమిక ఆరోగ్య భవనాల నిర్మాణం


పంచాయతీరాజ్య సంస్థల ద్వారా ప్రజలకు ఆరోగ్య వైద్య సౌకర్యాలు కల్పించబడుతున్నాయి. బ్లాకుకు ఒక



తూర్పు గోదావరి జిల్లా గొల్లలమామిడాడలో ఆసుపత్రి భవనం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చొప్పున ప్రభుత్వం ప్రారంభించింది. తత్ఫలితంగా ఈనాడు 416 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రారంభించటం జరిగింది. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించటానికి గ్రామ ప్రజలు ఒక్కొక్క దానికి 10,000 రూపాయలు, రెండు ఎకరాల స్థలం యివ్వాలి. ఆ విధంగా విరాళాలను ప్రజలనుంచి పంచాయతీరాజ్య సంస్థలు పోగుచేశాయి. ఆ సంస్థలకు అనుబంధంగా కుటుంబ నియంత్రణ కేంద్రాలను, కుటుంబ నియంత్రణ ఉప కేంద్రాలను నెలకొల్పారు. పంచాయతీరాజ్య సంస్థలు తీసుకొన్న చొరవవల్ల 3 కోట్ల 18 లక్షల రూపాయల ఖర్చుతో 596 ఉప కేంద్ర భవనాలు, 209 గ్రామీణ కేంద్ర భవనాలు నిర్మితమయ్యాయి.

పంచాయతీరాజ్య సంస్థల ఆధ్వర్యంతో హరిజనులకు నివేశనస్థలాలు యిచ్చే కార్యక్రమం ముమ్మర ప్రాతిపదికపై జరిగింది. హరిజనులకు ఇళ్ళు నిర్మించే కార్యక్రమాన్ని పంచాయతీ సమితులకు ప్రభుత్వం వప్పగించింది. 10 కోట్ల రూపాయల అప్పును జీవిత భీమాసంస్థనుంచి తీసుకొని ప్రభుత్వం పంచాయతీ రాజ్య సంస్థలద్వారా 51,054 భవనాల నిర్మాణం పూర్తి చేయించింది.



శ్రీకాకుళంజిల్లా చిలకపల్లిలో ఇందిరానగర్ హరిజనకాలని

గ్రామ పంచాయతీలు సాధించిన ప్రగతి

గ్రామ పంచాయతీలుకూడా గ్రామ పంచాయతీలలో పౌర సౌకర్యాలను కల్పించడంతోబాటు అభివృద్ధి కార్యక్రమాలను అమలు పరుస్తున్నాయి. గ్రామాలలో 1,25,000 కిలోమీటర్ల రహదారులను వేయటంతోపాటు కోటి రూపాయలు సాలీనా ఖర్చుచేసి నిర్వహిస్తున్నాయి. ప్రజల సౌకర్యంకోసం 7,500 మరుగుదొడ్లను నిర్వహిస్తున్నాయి. వెయ్యి పంచాయతీలు ప్రైవేటు పాయిఖానా పథకాన్ని అమలుపరుస్తున్నాయి. గ్రంథాలయాలను,పఠనమందిరాలనుకూడా గ్రామపంచాయతీలే పోషిస్తున్నాయి. ఈనాడు ప్రతి గ్రామ పంచాయతీలో ఒక స్ప్రేయరుగాని, డస్టర్‌గాని, ఏదోఒక వ్యవసాయ పరికరంగాని ఉంది. వాటిని రైతులకు, పంచాయతీ అద్దెకు ఇస్తున్నది. సమాజ వికాస రేడియోలనుకూడా నూటికి 80 వంతుల పైగా పంచాయతీలు నిర్వహిస్తున్నాయి. నాలుగువేల పంచాయతీలు పైద్యాలయాలకు స్వంత భవనాలు నిర్మించుకున్నాయి. 2 లక్షలకు పైచిలుకు విద్యుద్దీపాలను, సాధారణ దీపాలను గ్రామ పంచాయతీలు నిర్వహిస్తూ వెలుగులను విరజిమ్ముతున్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో అమలుపరచే సాంద్ర వ్యవసాయ పథకానికి, 70 పంచాయతీ సమితుల్లో అమలుపరచే బలవర్ధక ఆహార పథకాన్ని, గ్రామీణ ఉద్యోగ ఉపాధుల కల్పనా ప్రాజెక్టులు, సన్నకారు, మధ్యతరగతి రైతుల అభివృద్ధిపథకాలు అమలు పరచటానికి ప్రభుత్వానికి పంచాయతీలు సంపూర్ణ సహకారాన్ని అందజేస్తున్నాయి.

ఆర్థిక వనరులు

పంచాయతీరాజ్యం ఏర్పడిన తర్వాత పంచాయతీరాజ్య సంస్థలపై బృహత్తరమైన బాధ్యతలు పడ్డాయి. ఈ బాధ్యతలను నెరవేర్చటానికిగాను ఆర్థిక వసతులు కావాలి. ఆర్థిక వనరుల కల్పనకు గ్రామ పంచాయతీలు అనేక చర్యలు తీసుకొన్నాయి. పన్నులు పెంచింపు, పచ్చగడ్డి పెంపకం, చేపల పెంపకం, ఫలవృక్షాల పెంపకంలాంటి కార్యక్రమాలను పంచాయతీలు చేపట్టి ఆదాయాన్ని పెంపొందించుకున్నాయి. ఈనాడు గ్రామ పంచాయతీ ఆదాయం గణనీయంగా పెరిగింది. 1957-58 సంవత్సరంలో రాష్ట్రం మొత్తంమీద ఇంటిపన్నువల్ల 35.14 లక్షల రూపాయలు, వృత్తిపన్ను వల్ల 4.50 లక్షల రూపాయలు, వాహనాల పన్నువల్ల 2.76 లక్షల రూపాయలు, పన్నుల బదలీలవల్ల 33.76 లక్షల రూపాయలు, ఫీజులు, పన్నులవల్ల 6.14 లక్షల రూపాయలు, ఇతర ఆదాయ వనరులవల్ల 94.84 లక్షల రూపాయలు గ్రామపంచాయితీలకు ఆదాయం లభిస్తుండేది. మొత్తం మీద 177 84 లక్షల రూపాయలు ఆదాయం అయితే 1974-75 సంవత్సరానికి మొత్తం ఆదాయం 1140.49 లక్షల రూపాయలు అయింది. అదే సంవత్సరం 5417 గ్రామపంచాయతీలు నీటికి నారుమళ్ళ పన్నులు వసూలుచేశాయి. 1974-75 సంవత్సరంలో పంచాయతీలు పారిశుద్ధ్యానికిగాను 19 లక్షల 13 వేల రూపాయలు, వీధిదీపాల నిర్వహణకు 12 లక్షల రూపాయలు, మంచినీటి సౌకర్యంకోసం 15 లక్షల రూపాయలు ఇతర ప్రజా సౌకర్యాల కోసం 15 లక్షల రూపాయలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు 76 లక్షల రూపాయలు ఖర్చుచేశారు.

వివిధ కమిటీలు

1964 సంవత్సరంలో ఒక ఉన్నతాధికార సంఘాన్ని ప్రభుత్వం నియమించి సమాజ వికాస కార్యక్రమాలను విజయవంతంగా, సమర్థవంతంగా, ఉపయుక్తంగా నిధులను వినియోగించటానికిగాను సలహాలు యివ్వమని కోరింది. ఆ కమిటీ సిఫారసుల ప్రకారం రాష్ట్రం మొత్తంమీదవున్న 448 బ్లాకులు 321 బ్లాకులుగా పునర్విభజింపబడ్డాయి. అవి సాధారణ, అభివృద్ధి చెందిన, వెనుకబడిన, గిరిజన బ్లాకులుగా వర్గీకరించబడ్డాయి. ఈనాడు రాష్ట్రం మొత్తంమీద 144 సాధారణ బ్లాకులు, 45 అభివృద్ధిచెందిన బ్లాకులు, 107 వెనుకబడినవి, 28 గిరిజన బ్లాకులు వున్నాయి.


1967 సంవత్సరంలో శ్రీ ఎమ్. టి. రాజు సలహాసంఘం చేసిన సిఫారసుల ప్రకారం ప్రభుత్వం ప్రతి జిల్లాలో జిల్లా అభివృద్ధి మండలిని ఏర్పాటు చేసింది. ఈ జిల్లా అభివృద్ధి మండలికి జిల్లా కలెక్టర్ చైర్మన్, జిల్లా పరిషత్తు చైర్మన్ సభ్యుడు. జిల్లాలో పనిచేస్తున్న అభివృద్ధి శాఖలకు చెందిన జిల్లా అధికార్లను జిల్లా కలెక్టరు అజ్మాయిషీక్రిందకు ప్రభుత్వం తీసుకొనివచ్చింది. జిల్లా కలెక్టరుకు రాష్ట్రస్థాయిలో ఉన్న శాఖాధిపతుల అధికారాలను ప్రభుత్వం దత్తం చేసింది.

దఫదఫాలుగా పంచాయతీరాజ్య పటిష్ఠతకు చర్యలు తీసుకొన్నప్పటికీ పంచాయతీరాజ్యంఅనేకవిధాలుగా విమర్శలకు గురి అవుతూ వచ్చింది. ఈ విమర్శనలలో సత్యాసత్యాలను తెలుసుకొని వాటిని తొలగించటానికి తీసుకొనవలసిన చర్యలు ఏమిటో పంచాయతీరాజ్య పరిషత్తు మాజీ అధ్యక్షులు, ప్రస్తుత

ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి అధ్యక్షతను ఒక కమిటీని 1968 సంవత్సరంలో శాసనసభా కాంగ్రెస్ పార్టీ ఏర్పరచింది. ఈ సిఫారసుల ప్రకారం జిల్లా అభివృద్ధి మండలి రద్దు అయ్యింది. అది చేసే విధులను జిల్లా పరిషత్తు ఒకటవ స్థాయీ సంఘానికి వప్పజెప్పటమయింది.

1971 సంవత్సరంలో ప్రభుత్వం మరొక ఉన్నతాధికార సంఘాన్ని శ్రీ నరసింహాంగారి అధ్యక్షతను ఏర్పాటు చేసింది. ఈ ఉన్నతాధికార సంఘం పంచాయతీరాజ్య సంస్థలు పనిచేసే విధానంపై పరిశీలన చేసి, కొన్ని సిఫారసులు చేసింది.

ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావుగారు పంచాయతీ రాజ్యంపట్ల అచంచల విశ్వాసం వున్న వ్యక్తి—ఈ రంగంలో వారికి విశేషానుభవంవుంది. అందుచేతనే పంచాయతీ రాజ్యాన్ని రద్దు చేయాలంటూ ఎవరెన్ని చెప్పినా అందుకు అంగీకరించలేదు.



కృష్ణా జిల్లా బుద్ధవరంలో మిశ్రమ పశుగ్రాస కేంద్రం

పంచాయతీరాజ్య చట్టానికి ఇటీవల చేసిన సవరణలు

ఒక వ్యవస్థ మంచిదనుకున్నప్పుడు లోపాలేమైనాఉంటే వాటిని సరిదిద్దటానికి కృషి జేయాలిగాని, లోపాలు ఉన్నంత మాత్రాన వ్యవస్థను రద్దు చేయాలనటం సబబు కాదన్నదే శ్రీ వెంగళరావుగారి అభిప్రాయం. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని వెంగళరావు కమిటీ సిఫారసులు ఆధారంగా పంచాయతీల చట్టానికి, పంచాయతీ సమితుల, జిల్లా పరిషత్తుల చట్టానికి సవరణల ద్వారా మార్పులు తీసుకురావటానికి 1976 జూలై నెలలో రెండు బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ బిల్లులను శాసనసభ ఆమోదించింది. ఈ బిల్లుల ద్వారా అనేక ముఖ్య సవరణలు జరిగాయి. ఈ బిల్లుల వల్ల గ్రామ పంచాయతీ సర్పంచ్‌లను, పంచాయతీ ఓటర్లు పంచాయతీ సమితుల అధ్యక్షులను సమితిలో ఓటర్లు ఎన్నుకునే అవకాశం ఏర్పడింది.

పంచాయతీ రాజ్యవ్యవస్థలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతులకు అధిక ప్రాతినిధ్యం కల్పించటం జరిగింది. పంచాయతీ సర్పంచ్‌లు ,సమితి అధ్యక్షులపై అవిశ్వాసం ప్రకటించే విషయం రద్దు అయింది. గ్రామసభలు సంవత్సరానికి రెండు సార్లు పంచాయతీలు జరపాలి. లేకపోతే చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుంది.

పంచాయతీ ఆర్థిక వనరులు పెంపొందించేందుకు తగిన చర్యలు సూచించటం జరిగింది. ఇళ్ల పన్ను వసూలు బాధ్యతలు, గ్రామాధికారులకు అప్పగించి వారికి వసూళ్ళలో 10 శాతం కమిషన్ యిచ్చే ఏర్పాట్లు జరిగాయి.

వెనుకబడిన వర్గాలకు చెందిన కమ్మరి, కుమ్మరి, వడ్రంగం క్షురకర్మ, రజక మొదలైన వృత్తులపైన ఆధారపడ్డవారికి వృత్తి పన్ను రద్దుచేయటం జరిగింది.

జిల్లా పరిషత్తులలో వెనుకబడిన తరగతుల వారిని ప్రభుత్వము నామినేట్ చేసే అధికారం ఇవ్వటం జరిగింది. జిల్లా పరిషత్తు స్థాయి సంఘాలకు వాటి సభ్యులలోనే ఒకరు అధ్యక్షులుగా వుండే విధంగా సవరణ చేసింది.

ప్రస్తుతం బిల్లులో ప్రతిపాదించిన సవరణలువల్ల జిల్లా పరిషత్తులు కలెక్టర్ల ఆజ్మాయిషీలో కాకుండా జిల్లా పరిషత్తులే అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే బాధ్యత వహించవలసి ఉంది

కలెక్టర్లకు స్థానే ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను నియమించటం జరుగుతుంది. అస్పృశ్యతా నివారణ చట్టంక్రింద శిక్షకు గురైన వ్యక్తులు-గ్రామాధికారుల గ్రామ నౌకరు పంచాయతీ రాజ్యసంస్థల పదవులకు పోటీ చేయరాదు.

అభివృద్ధి కార్యకలాపాలకు, విద్యాభివృద్ధికి, సాంఘిక సంక్షేమ, స్త్రీ సంక్షేమ కార్యక్రమాలకు, ప్రజాపనుల అమలుకు ఆర్థిక వ్యవహారాలకు అయిదు స్థాయీ సంఘాలు ఏర్పాటు చేస్తారు. ఈ సంఘాలకు సభ్యులను ఎన్నికద్వారా ఎంపిక జరుగుతుంది. ప్రతి స్థాయీ సంఘంలోను వెనుకబడిన తరగతులకు లేక అల్పసంఖ్యాక వర్గాలకు లేక స్త్రీలకు చెందిన ఒక ప్రతినిధిని ఎన్నుకోవాలనే నియమం కూడా ఈ బిల్లులో ఉంది. స్థాయీ సంఘాలు తమ సభ్యులనుంచే సంఘ అధ్యక్షుని


ఎన్నుకోవాలి. శాసనసభ సభ్యులు, పార్లమెంట్ సభ్యులు ఈ స్థాయీ సంఘాల అధ్యక్షులుగా పోటీ చేయకూడదు. నామినేట్ అయిన సభ్యులు స్థాయీ సంఘ అధ్యక్షునిగా పోటీ చేయకూడదు.

గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలను అమలు జరపటానికి మూడు కార్య నిర్వాహక సంఘాలు ఏర్పాటు చేయటం జరగుతుంది. i వ్యవసాయ కార్యక్రమాలకు ii ప్రజారోగ్య పారిశుధ్య కార్యక్రమాలకు iii రహదారుల నిర్మాణానికి మూడు కమిటీల ఏర్పాటుకు బిల్లులో అవకాశం కల్పించటం జరిగింది.

పంచాయతీల ఆదాయం పెంపుదల కోసం కొలగారం, కాటారుసుం తప్పనిసరిగా విధించే పన్నులలో చేర్చటం జరుగుతుంది. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ఉన్న గ్రామ పంచాయతీలలో ఎక్జిక్యూటివ్ ఆఫీసరు, గ్రామ పంచాయతీ సర్పంచ్ సంయుక్తంగా చెక్కులపై సంతకం చెయ్యాలి.

పార్లమెంటు సభ్యులు శాసన సభ్యులు పంచాయతీ రాజ్య సంస్థల పదవులకు పోటీ చేయటానికి అవకాశం కల్పించినా, ఏక కాలంలో రెండు పదవులను నిర్వహించటానికి వీలు లేకుండా చేయటం జరిగింది.

గ్రామ ప్రజల సంక్షేమమే భారత దేశ సంక్షేమం. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సుసాధ్యం కావాలంటే పంచాయతీరాజ్యం పటిష్టమై స్థానిక ప్రజల వ్యవహారాలను చక్కదిద్దే ఆదర్శ సంస్థగా రూపొందాలి. అందుకు ఈనాడు శాసనసభ ఆమోదించిన బిల్లులోని అంశాలు ఎక్కువగా దోహదం చేస్తాయి. ప్రజాస్వామ్య నియమానికి పంచాయతీ రాజ్య సంస్థలు ఉత్తమ వ్యవస్థలుగా పనిజేయాలి. అప్పుడే సామాన్యుని సంక్షేమం సాధించవచ్చు. ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలతో పంచాయతీ రాజ్యానికి మంచి భవిష్యత్తు ఉందని విశ్వసించవచ్చును. తత్ఫలితంగా గ్రామ రాజ్యం నిస్సందేహంగా సాధించవచ్చు.



లేపాక్షి నాగలింగం

20 ఏళ్ళ విధి వైచిత్ర్యం

శ్రీ కొమరాజుగడ్డ రామచంద్రరావు

విధి అంటే 'లా'. తెలుగులోకూడా 'లా' అనే అంటూ ఉన్నాం. దాన్నింతవరకు. ఇక 'విధి' అనబోతున్నాం. ఇది మొట్టమొదటి విచిత్రం!

చాలా పూర్వం - పురాణకాలంలో దాన్ని ధర్మం అంటూ ఉండేవాళ్ళం. ఆ ధర్మం కాలానుసారంగా ఎప్పటికప్పుడు మారుతూ వచ్చింది.

ఆంధ్రప్రదేశ్ ఉదయించి 1976 నవంబరు 1వ తేదీకి ఇరవయి ఏండ్లయింది. ఈ ఇరవయి ఏండ్లలో ఎన్నో చట్టాలు (Acts అధినియమాలు (Regulations), అధ్యాదేశాలు (Ordinances) అమలులోకి వచ్చినయి. ఎన్నో రద్దయినయి. ఇన్నింటి మూలంగా క్రమక్రమంగా మార్పు వచ్చింది కనకనే ఈ సమాజ ధర్మంలో ఇదమిద్ధమని స్థూల చక్షువులకు కనపడే మార్పు ఏమిటంటే ఏమీ లేదనిపిస్తూ సమాజం ఎప్పటినుండో సవ్యంగా ఇలాగే పయనిస్తూ ఉంటోంది అనే తృప్తి మనకు ఉంటోంది.

హఠాత్తుగా ఒక్క అధ్యాదేశంలో ఉన్న అన్ని విధుల్ని రద్దు చేసి, ఒకానొక క్రొత్త పద్ధతిని ప్రవేశపెట్టినట్లయితే అదొక 'విప్లవం'గా భావిస్తూ ఉండేవాళ్ళం.

అయితే మరి ఈ నవరణ చట్టాలు, అధినియమాలు అన్నీ ఏదైనా ఒక ప్రాతిపదికననుసరించి చేస్తున్నారా లేక ఎవరికో ఒకానొక తలపు కలిగిందని దాన్ననుసరించి చేస్తున్నారా అని సందేహం కలుగచ్చు.

ఎవరికో ఒకరికి వచ్చిన తలపులు హఠాత్తుగా విధిగా అమలు పరిచే రోజులు ఎప్పుడో పోయినయి. నిరంకుశులైన మహారాజుల కాలంలో అలా ఉండేదేమో. 'వేమరాజు' మహా మేధావి. కాలానికి తగినట్లుగాక భవిష్యత్తులో ఉండదగినవాడు. అతడు ఒకానొక విప్లవం తెచ్చాడు. అది ప్రజలు రద్దు చేశారు - ముందు అతడినే రద్దుచేసి ఆపైన అతడి ప్రశాసనాన్ని తొలగించారు.

అలా అని అప్పటి 'విధి' ఏ మార్పూ లేకుండా అలాగే ప్రచలిత మవుతుందా అంటే కావటల్లేదు. తరంపరలుగా మార్పులు 'విధుల' లో కలుగుతూనే వున్నాయి. అన్నీ ప్రజల సమ్మతిని పొందినవే అయి కొంతకాలం అలా నిలిచిపోతూ ఉంటున్నాయి.

మొగలు రాజులు పరిపాలించారు. వారి మేధాశక్తికి తగిన పరిపాలనం భారతదేశంలో చేశారు. తాము ఈ దేశస్థులుగా అనుభూతిచెంది పరిపాలించామని, ప్రశాసించే స్థితి కలిగేవరకూ గల పద్ధతివేరూ-ఆ తరవాత అక్బరు కాలం నుంచి గల పరిస్థితి వేరుగా ఉండేది. షేర్షా ప్రవేశ పెట్టిన ప్రశాసనిక పద్ధతులు ఇప్పటికీ మనం అనుసరిస్తుంటున్నామనేది చిత్రమైన విషయం.

ఆ తరవాత కొందరు చక్రవర్తులు రాజ్యకాంక్ష, ధనకాంక్ష, మతావేశములను ప్రాతిపదికలుచేసి ప్రశాసించటంవల్ల మళ్లీ ధర్మంలో మార్పులు కలిగినయి. అవి సమాజానికి ప్రయోజనమే ఆధారంగా కలిగిన మార్పులయితే ఇంకా కొంత కాలం నిలిచి ఉండేవి. కాకపోవటాన అనేక మార్పులు వచ్చి త్వరలో నశించి పోయినయి నిలవకుండా.



బ్రిటిష్ వారి పాలన

బ్రిటిషువారి పరిపాలనం వచ్చింది. వీరు మొదట్లో వ్యాపార పూర్వకమైన దోపిడి, ప్రధానంగా పరిపాలనం నడిపినా తరవాత తరవాత రాజ్యపరిపాలనం నెత్తిన వేసికొన్నారు. వారి దేశమైన ఇంగ్లండులోని పరిపాలనమే ఇక్కడకూడా ప్రవేశపెట్టారు. అక్కడ సమాజ ప్రయోజనంకోసం ఎంతో కాలంనుంచి నిలిచి ఉన్న పరిపాలనం పటిష్టమైన పరిపాలనం – ఇక్కడకూడ సిద్ధమయింది. అందుకని బ్రిటిష ప్రశాసనంవల్ల భారతదేశంలో హృద్యమైన మార్పు వచ్చిందనేమాట మరిచిపోతగనిది.

కాని పరిపాలనా పాటవాన్ని పచరించటంలో బ్రిటిషు అధికారులు స్వదేశ పరిపాలనం ఒక విధంగాను, భారతదేశ పరిపాలన మరొక విధంగాను పచరించారు. అందువల్ల భారత దేశంలోని సమాజం తమకై ప్రత్యేకంగా ఆలోచించటం అవసరమయింది. తాము బానిసలను కొన్నారు, అ స్థితి పోవాలన్నారు.

పద్ధతి అలాగే ఉన్నా పరిపాలనాధికారం తమకు సంక్రమించాలన్నారు. ఈ భారతదేశంలోగల స్వామిత్వం తమకు రావాలెనన్నారు. చివరకు 15-7-1947న భారత సమాజానికి ఒక ప్రక్క, పాకిస్థాను సమాజానికి మరొక ప్రక్క పరిపాలనాధికారం సంక్రమింపజేయటానికి రంగస్థలం రచించారు. 26-1-1950న భారత సంవిధానం తయారు జేసికొన్నాము. 1-11-1956న భాషాప్రయుక్త రాజ్యములుగా భారత దేశం ప్రకాశించింది.

ఇదంతా ఎందుకు చెప్పుకొచ్చానంటే 'విధి' లో మార్పు రావటం సమాజంకోరిన విధంగానే వస్తూవుంటున్నదనే విషయం అవగతం కావాలని చెప్పుకొంటున్నాము. ఇన్నాళ్లు అలానే మార్పులు జరుగుతూ వచ్చినయి.

సంవిధానంలో మౌలిక సూత్రాలు నిశ్చయించాము. అమలు పరుచుతూ వచ్చాము. ఇప్పుడు ఆదేశిక సూత్రాలను అనుసరించటం అవుసరమై తోచింది. అవి అనుసరించటానికి నిన్నటి మౌలిక సూత్రాల ప్రాధాన్యతే ఇవాళ అడ్డు వస్తోందనిపించింది. అందుకని దానికి పరిష్కారం ఆలోచిస్తున్నాం.

మౌలిక స్వత్వాలతోపాటు ప్రధాన బాధ్యతలుకూడా ఉన్నాయన్న మాట సంవిధానంలోనే ఇరికించాలని ఇప్పుడు సంరంభం జరుగుతోంది.

ఇలా మార్పు 'విధి' లో ప్రచలితమవుతూ సమాజ ప్రగతిని సూచిస్తూ వుంటుంది.

ఈ ఇరవయి ఏండ్లలో శాసనాలద్వారా తెచ్చిన మార్పులు చేర్పులూ సూక్ష్మవిచారణ చేయాల్సినపని లేకుండా స్థూలగమనాన్ని తిలకించటానికి పై చెప్పిన అనుక్రమణం సులోచనంలా పనికి వస్తుందని నా నమ్మకం.

ఇరవయి ఏండ్ల యీ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో 520 శాసనాలదాకా చేశారు. 18 అధినియమాలు చేశారు (Regulations). 6 ప్రెసిడెంటు చట్టాలూ, 4 పార్లమెంటు చట్టాలూ చేశారు. ఇవన్నీ ఎప్పటికప్పుడు అవుసరమయినవిగాతోచి అలా చేయబడ్డవి. వీటిల్లో చాలా భాగం సవరణ చట్టాలు. ఉన్న చట్టాల్లో అక్కడక్కడా చిన్న చిన్న మార్పులకోసం చేయబడ్డవి. స్వతంత్రమైన చట్టాలు ఎన్నో వుండవు.

ఆ చట్టాల స్థూలాకృతియొక్క 'దిగ్‌రేఖను' ఒక్కసారి తిలకిస్తే ఎలా ఉంటుందనేది, వీలయినంతవరకు ఇక్కడ చెపుతాను.

1956 లో ఆంధ్రప్రదేశ్ రాంగానే రాజ్యంలో సామాజికుల ప్రవర్తనలో పద్ధతిని అనుసరించి అదిక లాభాలు పొందేవారిని అరికట్టటం అవసరమైందనిపించింది, నాగార్జునసాగరు ప్రాజెక్టు క్రింద భూములు ప్రభుత్వానికే కావాల్సివచ్చినయి. అలా కావాలంటే సర్కారు తమ వశం చేసుకోవటానికి వీలుగా శాసనాలు వచ్చాయి. అంతేకాదు, మురికిపేటలు కొనేసి వాటిని వృద్ధి చేయాలనే శాసనం వచ్చింది. విద్యాభివృద్ధికి అయిన వ్యవస్థలు సరిగా నడవకపోయినట్లయితే వాటినికూడ ప్రభుత్వమే తీసికొని నడపాలనే విధి కూడ చేశారు. ఇండ్లు కట్టేందుకు గృహ నిర్మాణమండలి ఏర్పాటుచేసి శరపరంపరలుగా ఇండ్లను నిర్మించటానికి ఏర్పాటు చేశారు తెలంగాణాలో. మైనింగు సెటిలుమెంట్సుకు అన్వయింపజేసి వారి గృహవసతి ఏర్పాటు తెలంగాణాలో చెస్తూ చట్టం చేశారు. ఈ రెండు చట్టాలూ ఆంధ్రకుకూడ తరువాత అన్వయింపజేశారు.

ఇవన్నీ సమాజ ప్రయోజనం కోసం చేసిన విధులు. ఖర్చుతో కూడుకున్నవి. ఎందుకంటే ఆయా ఆస్తిదారులకు కాంపెన్‌సేషను ఇవ్వాలికదా! ఆంధ్రప్రదేశ్ అవతరణలోని ఆశయం, సమగ్రమైన రాజ్యం కలిగి సమగ్రమైన పరిపాలనం సమాజ శ్రేయస్సు సడిపించాలనే. ఈ వ్యయపూర్వకమైన ప్రణాళికలు చేపట్టటం జరిగింది.

ప్రభుత్వరాబడి చట్టాలు

1957లో ఆ ఖర్చు నెత్తిన పడటంచేత డబ్బు వసూలుకు కావలసిన చట్టాలు చేయవలసి వచ్చింది. 1957 లో అందుకనే ప్రభుత్వ ఖజానా వృద్ధి పొందించటానికయిన శాసనాలు చేయటం గమనిస్తాము. సాధారణ అమ్మకపు పన్ను చట్టం, మైకా చట్టం, ఆగంతుక విధి చట్టం,–ఇలాటివి తయారయి సర్కారు బొక్కసం వృద్ధి పొందించటానికి వీలు కలిగినయి.

1958లో కూడ కోర్టు ఫీజులు, వాహనాల పన్నులు, వినోదాలపై పన్నులు, పట్నభూములమ్మితే దాని మీద అధిక పన్నులు, అధికం చేయాల్సి వచ్చి, అందుకయిన శాసనాలు చేసారు.

అప్పటికి ఒక కొండ అయిందను కొంటే, ఆంధ్ర తెలంగాణా లలో ఉన్న భిన్న భిన్నమైన విధులను ఏకీకృతం చేయాల్సినపని కన బడింది. ఈ ఏకీకృతం చేయటమనేది 1958 నుంచి 1962 వరకూ చాలా విసురుగా జరిగిందని చెప్పవచ్చు. ఎన్నో ఆ చట్టాలు ఆంధ్రలో అమలులో వున్నవి తెలంగాణాకు అన్వయింప జేశారు. గృహ నిర్మాణ మండలి చట్టం వంటి కొన్ని తెలంగాణాలో ఉన్నట్టివి ఆంధ్రకు కూడ అన్వయింప జేశారు.

అలా 1958లో ఏకీకృతం చేసిన విధుల్లో రెవిన్యూ విభాగం లోని ప్రశాసనానికి సంబంధించిన విధులు మొట్టమొదటివి. సర్వే చట్టం, భూమ్యాక్రమణ చట్టం ముఖ్యమైనవనవచ్చు. కొన్ని కేంద్ర శాసనాలు కూడ ఆలాగే ఆంధ్రప్రదేశ్‌కు అంతకూ అన్వయింపజేశారు. జైళ్ల చట్టం పోలీసు విభాగానికి సంబంధించిన చట్టాలు కూడ అన్నీ ఏకీకృతమై ఆంధ్రప్రదేశ్ కంతకూ అన్వయించినయి.

1959 లో సుమారు 4 చట్టాలు తప్ప మిగతా అన్నీ విధిని ఏకీకృతం చేయటానికిగాను ఉద్దేశించినవేననవచ్చు. పశువులు మేసే దురాక్రమణ చట్టం, కాందిశీకుల హక్కు విడుదలకు సంబంధించిన చట్టం, స్టాంపుల చట్టం, భూమ్యార్జనపు చట్టం, కరువు అనుతో పవిధ చట్టం ఇవి ఏకీకృతం చేసి సర్వత్ర అన్వయింప జేశారు. ఈ చట్టాలుగాక బరువుల, కొలతల అమలు చట్టం ఒకటి చేశారు. దీని వల్ల బ్రిటీషు పద్ధతిని తొలిగించి మెట్రికు పద్ధతిని ప్రవేశ పెట్టారు. ఖాదీగ్రామోద్యోగ పరిశ్రమల చట్టం ద్వారా ఖద్దరు ఉత్పత్తి, ఇంకా ఇతర చేతి పరిశ్రమల ఉత్పత్తిని వృద్ధి చేయటానికి శ్రద్ధ తీసికొన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ చట్టం చేసి, అధివరకున్న విశ్వవిద్యాలయాలను చట్టపూర్వకమైన విశ్వవిద్యాలయాలుగా తయారు చేశారు. ఇంకా చెప్పుకోతగింది పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల చట్టం సంగతి.

పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులను ఏర్పాటు చేసి ఎక్కడో ప్రభుత్వంలో మాత్రమే కేంద్రీకృతమైఉన్న అధికారాలను వికేంద్రీకరణం చేసి ఎక్కడికక్కడ ఆయా పరిధులలోని ప్రశాసనం ఆయా ఔత్సాహిక అభ్యర్థులకు ఇవ్వడం చేశారు. సమితులు, పరిషత్తులలో సభ్యులైన రాజకీయ ధురంధరులు ఆయా భాగాలలో మాత్రం తమతమ ప్రతిభను వెలయిస్తూ, రాజకీయల్లో పాల్గొంటూ ఉండటానికి వీలయింది. రాజకీయ చైతన్యం వెల్లువై పొంగిన ఆరోజుల్లో ఈ వికేంద్రీకరణం ఎంతో చాకచక్యంగా సమకూర్చటం చెప్పుకోతగ్గ విషయం. ఈ చట్టంవల్ల పల్లెపల్లెలో మూలమూలల్లో ప్రశాసనిక చైతన్యం పరిభ్రమించి మూడుపూవులారు కాయలుగా చేసింది. ఈ అధిగమనంలో భారత దేశంలో ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటగా ఉండి మార్గదర్శి అయింది.

1960 లో శాసన సభలదృష్టి ప్రభుత్వ సిబ్బంది పౌరాణిక, చారిత్రిక స్మారక స్థానములు చిహ్నములు, గ్రంథాలయాలు, పట్నాల అద్దెయిండ్లు వైపునకు తిరిగినట్లు కనబడుతుంది. క్రమశిక్షణారాహిత్యమునకుగాను విచారణ చేయడానికి ఒకట్రిబ్యునలును ఏర్పాటు చేశారు ప్రభుత్వ సిబ్బంది విషయంలో. ప్రభుత్వ నిశ్చయించిన ప్రదేశాలు, స్మారకాలు, వస్తువులు రక్షించడాకి ఒక విభాగాన్నేర్పాటు చేసి ఉద్ధరించారు. ప్రజాం విజ్ఞానానికి గ్రంథాలయాలను పెంపొందింప చేయడానికి సర్వత్ర సంస్థల ఏర్పాటుకు వీలు కల్పించి ఒక సంచాలకుని ఏర్పాటుచేసి, విద్యావిభాగానికి అనుసంధింప జేశారు.

అద్దె ఇండ్ల చట్టం

ఇక మిగిలింది అద్దె యిండ్ల చట్టం. ఒక ప్రక్క అవకాశాలు ఎక్కువయి ఇబ్బు విజృంభించి అనుభవించడానికి, సంపాదించడానికి, బుద్ధి వినియోగించడానికి శాసనసభలు తయారుచేస్తున్న విధులు ప్రచలితమవుతుండగా రాజకీయాల్లో గాని, నిష్కామ కర్మల్లోగాని ఆసక్తిలేక వట్టి స్వార్థంలోనే మునిగితేలేవారుపుష్కలంగా తమ ఆస్తి బుద్ధి, అవకాశాలను పెద్ద పెద్దయిళ్లు కొని కట్టించి ఇతర్లకు అద్దెకిచ్చి మళ్లీ దానిద్వారా ధనాన్ని, ప్రాపకాన్ని కూడబెట్టడం ఆరంభించారు. చిన్న ఇల్లు–భార్యా భర్తమాత్రం ఉండదగిన ఇల్లు అద్దెకిస్తాం నెలకు 200 రూపాయలు దానిధర అనటం సాగించారు. ఇళ్లు లేని వాళ్లకు మోకాళ్లదాకా అరిగేదాకా తిరిగినా ఇల్లు దొరకటం మానేసింది తాము భరించే ధరకు. దాంతో పటిష్టంగా ఇండ్ల అద్దెల చటం–అదివరకు ఉన్నదే అయినా–క్రొత్తగా తయారుచేసి, ప్రభుత్వమే ఇల్లు అద్దెకు పుచ్చేసుకొని కావలసిన వారికి ముఖ్యంగా ప్రభుత్వోద్యోగులు – ఇంకా ఇతర ఉద్యోగులు మొదలైన వారికి సముచితమైన అద్దెకుగాను ఇవ్వటం ఏర్పాటు చేశారు.

హైదరాబాదు రాజధాని అయిన రోజుల్లో, నగరానికి విచ్చేసిన ఉద్యోగి జనం–గృహ నిర్మాణ మండలివారు కట్టించి యిచ్చిన కాలనీలతో పాటు ఈ అద్దె ఇండ్ల పరిపాలనా పద్ధతివల్ల కలిగిన అదుపువల్ల నిలవ కలిగినారు. కాని లేకపోయినట్లయితే విజాయితీపరులైన ఉద్యోగులు ఈ ఉద్యోగమూ వద్దు, ఈ ఊరూ వద్దు అని వెళ్లిపోయే పరిస్థితే ఏర్పడేది. ఈ చట్ట నిర్వహణం వల్ల ఎంతో మేలయిందనిపిస్తుంది.

1961లో చాలా చట్టాలు చేయట మయింది. ముఖ్యంగా తెలంగాణాకూ, ఆంధ్రాకు ఒకేవిధిని ఏకీకృతంగా ఏర్పాటు చేయాలనే దాన్ని ప్రధానంగా మనస్సులో ఉంచుకొన్నారు పరిపాలకులు. సుమారు పది చట్టాలద్వారా అనేక చటాలను తెలంగాణాకూ మద్రాసు రాజ్యం నుంచి విడగొట్టి ఆంధ్రప్రదేశ్‌కు కలిపిన కొన్ని భూభాగాలకు ఒకే విధి ఉండేటట్లుగా అన్వయింపజేశారు. చివరకు మద్రాసు అనే పేరుతో మొదలై అమలులోనున్న శాసనాలన్నిటికి ఆంధ్రప్రదేశ్ అనే పేరు పెటి పిలవటానికి కూడ ఒక పెద్ద చట్టం తయారు చేశారు.

ఇవిగాక ముఖ్యంగా ఈ సంవత్సరంలో చెప్పుకోతగ్గ చట్టాలు ఏమిటంటే వ్యవసాయ భూములపై సీలింగు చట్టమని ఒకటి చేశారు. ఈ చట్టాన్ని పటిష్ఠం చేయడానికి 1973 లో తిరిగి సీలింగు చట్టం తయారు చేయటం జరిగింది. రెండవది ప్రాథ

మిక విద్యా చట్టము. దీనివల్ల పిల్లలకు తప్పనిసరిగా విద్యను గరపి తీరవలెననే స్కీములను ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు.

ఇంకా ఇజారా మరిన్ని కౌలు భూములని కొన్ని వుండేవి పూర్వం తెలంగాణాలో. అవి బంజరుగానే వుంటుండేవి కొన్ని. పట్టా మాత్రం ఎవరి పేరనో ఉండది. వీళ్ళు శిస్తు కట్టవలసింది చాల తక్కువగా ఉండేది. వాళ్ళ అధీనంలో ఉన్నా ఆ శిస్తు వీళ్ళు కట్టుతుండేవాళ్ళు. ఇలాంటి వాటిల్లో వెనక యిచ్చిన సౌకర్యాలన్ని రద్దుచేసి పూర్తిశిస్తును వసూలు చేయటానికి ఒక చట్టం చేశారు. బంజరుగావున్న పొలాలన్నీ పరిహారమిచ్చి సర్కారే పుచ్చేసుకొని రిజర్వు అడివుల్లోనో ఇంకెక్కడనో కలిపేశారు.

సర్కారు స్థలాలనుంచి ఆక్రమణదార్లను వెళ్ళగొట్టటానికి ఒక చట్టంకూడా ఈ సంవత్సరం ఒకటి చేయటమైంది. కాని ఇది 1968లో రద్దయి అలాటిదే మరొకటి అమలులోకి వచ్చింది. సహకార కేంద్రీయ భూమి తనఖా బ్యాంకు సంఘటిత చట్టము ద్వారా ఆంధ్ర ప్రాంతంలో ఉన్న భూమి తనఖా బ్యాంకునూ, హైదరాబాదులోని భూమి తనఖా బ్యాంకునూ రెంటినీ ఏకం చేసి సమగ్రమైన బ్యాంకును ఏర్పాటుచేశారు.

చెరకు సరఫరా

చివరది ముఖ్యమైంది, ఆంధ్రప్రదేశ్ చెఱకు సరఫరా, కొను బడుల క్రమబద్ధ చట్టము అనేది. పుష్కలంగా నీరు సరఫరా అయి చెఱకు పంటను పండించే వ్యవసాయకులను ప్రోత్సహిస్తూ రాజ్యంలోని పంచదార ఫ్యాక్టరీలకు ఈ భూభాగాలు పంచి అక్కడ పండించేవారు. ఆ ఫ్యాక్టరీకే చెఱకు అమ్మే ఏర్పాటు చేశారు ఈ చట్టం మొన్నమొన్నకూడ సవరించి పటిష్టంచేశారు. రైతుకు డబ్బివ్వకుండా ఫ్యాక్టరీ వారు అతడి చెరకు వాడుకొంటే ఆ డబ్బు ఇచ్చేవరకూ ఆ చెఱకుతో తయారయిన పంచదార అమ్ముకొనే హక్కు లేకుండ చేశారు. చెఱకు ధర నిర్ణయించారు. ఇలా ఈ చట్టం వ్యవసాయదారులకు ఎంతో మేలు వర్షిస్తోంది.

1962లో నేరాలుచేయటానికి అలవాటుపడ్డవాళ్ళకు సంబంధించి తెలంగాణా ఆంధ్ర ప్రాంతాలలో అమలులోఉన్న విధులను ఏకీకృతంచేయటం ద్వారా ఒక చట్టం తయారు చేయటమయింది. అదివరకున్న రెండు చట్టాలు రద్దుచేశారుకూడ. సవరణ చట్టాలూ ఒక ప్రాంతంలోఉన్న విధిని ఇంకొక ప్రాంతానికి కూడ అన్వయించే చట్టాలూ ఎన్నో చేశారుకూడా.

1963 సంవత్సరంలో సవరణ చట్టాలూ, వ్యాపకంచేసే చట్టాలూ, ద్రవ్య వినిమయ చట్టాలూ గాక ఇతర చట్టాలు మూడేమూడు. వ్యవసాయభూములు కాని భూములపై శిస్తువేసే చట్టం, మృతశరీరాల్లోంచి కండ్లుతీసి ఉపయోగించేందుకు ఆస్పత్రులకు వీలు కలిగించేచట్టం, వ్యవసాయ విశ్వవిద్యాలయ చట్టం. వీటి ప్రయోజనం వాటి పేర్లనుబట్టి సులభంగా తెలియవచ్చు.

గ్రామ పంచాయతీల చట్టం

1964 సంవత్సరంలో చేసిన చట్టాలలో గ్రామ పంచాయతీల చట్టం, సహకార సంఘాల చట్టం ఈ రెండే ముఖ్యమైనవి. మిగతా సవరణ చట్టాలూ లేదా అమలును వ్యాపకంచేసే చట్టాలు. గ్రామపంచాయతీలు ప్రస్తుతం ఈ చట్టం క్రిందనే నిర్వహింపబడు తున్నాయి. ఈ సహకార సంఘాల చట్టం కూడ ఇప్పటికి అమలు అవుతోంది. ఈ మధ్యలో ఎన్నో రకాలయిన సవరణలు వచ్చి నాయి గాక. ఇంకా — స్వతంత్రం వచ్చిన 15 సంవత్సరాల వరకే ఇంగ్లీషు భాషరాజభాషగా ఉండాలని గదా సంవిధానంలో ఉంది. ఆ పై సంగతి ఆయా విధాన మండలులకు వప్ప చెప్పటమయింది. దానిని పురస్కరించుకొని 26–1–1965 తేద తరువాత కూడ ఇంగ్లీషే రాజభాషగా ప్రవృత్తం కావాలని ఒక చిన్న చట్టం కూడ ఈ సంవత్సరంలోనే చేశారు.

1965 లో సుమారు ముప్పాతిక డజను దాకా స్వతంత్ర మైన చట్టాలున్నాయి. జాయింటు పట్టాలను విడగొట్టి ఎవరికి వారికి పట్టా పుచ్చుకోవలెననే చట్టం. మునిసిపాలిటీల పరిపాలనా విధానాన్ని సమగ్రంగా ప్రస్ఫుటం చేస్తూ మునిసిపాలిటీల చట్టమూ, మునిసిపాలిటీల ఎలెక్షనులను వాయిదా వేసేందుకు చట్టం, ఆంధ్రప్రదేశ్ భూదాన గ్రామదానాల చట్టం, అందులో కొన్ని ఇతర దేశాల నుంచి బహుమతిగా లభించిన వస్తువులు, బిస్కట్లు, న్యూట్రిషన్‌కు సంబంధించినవి దుర్వినియోగం చేయకుండా వాటిని అధీనంలో కలిగినవారిని శాసిస్తూ ఒక చట్టం చేశారు. అప్పట్లో అమెరికా నుంచి మనకు అలాంటివి వస్తూండేవి. ఆవస్తువులను దుర్వ్యయం, దుర్వినియోగం చేయకుండా శాసనమిది. నీటివనరుల నిర్మాణం నిర్వహణలకు గూర్చిన శాసనం. చెఱకు మీద పన్ను వేసి రాజస్వం విధింప చేసేందుకు ఒక శాసనం చేశారు. ఇంకా డబ్బుల మనియార్డర్లు చేసేవారు చేస్తుంటే పుచ్చుకొనేవాళ్లు పుచ్చుకుంటూ ఉండేటట్లుగా కొన్ని డబ్బుల ప్రసార పథకాలు కొన్ని పెట్టి, అరచేతిలో స్వర్గం చూపించటం కలిగింది కొందరు తెలివైన వారి వల్ల. దానివల్ల లాభమే కనపడుతూ కలిగే నష్టం కనిపించేది కాదు. ఎవరో కొందరికే ముందు లాభం కలిగి మిగతా వారంతా నష్టపోవడం జరిగేది. ఈ నష్టం జనబాహుళ్యంగా కలిగేది. దీనిని అరికట్టటానికి ఈ ధన ప్రసారణా పథకాలను నిషేధిస్తూ ఒక చట్టం చేయటం జరిగింది. ఇంకా గ్రామాలలోని న్యాయస్థానాలకు అధికార పరిధి వృద్ధిచేస్తూ ఒక చట్టం చేశారు కూడ.

1966 సంవత్సరంలో చేసిన చట్టాలు—అధికార భాషాచట్టం షాపులు సంస్థాపనముల చట్టం, వ్యవసాయ ఫలసాయము పశు ధనముల మార్కెట్ల చట్టం, హిందూ మత విషయక వ్యవస్థలు ధర్మాదాయ సంస్థల చట్టము ముఖ్యమైనవి షాపుల్లోను సంస్థాపనల్లోనూ గల పనివారికీ అనుతోషం ఇవ్వటానికి షాపుల శాసనం మార్కెట్ల సంస్థలు, అక్కడక్కడ యేర్పాటుచేసి వాటి నిర్వహణం అప్పజెప్పి దేశంలోని ప్రజల మేధాశక్తిని, ఉత్సాహ శక్తిని ప్రయోజనకరంగా వినిమయం చేయటానికి మార్కెట్లశాసనం ఎంతో ఉపయోగించినయి. హిందూ ధర్మాదాయాలు, మతాదాయాలు సరి

యైన పద్ధతిలో నిర్వహించటానికి అదివరకేవున్న విధిని రద్దుచేసి ఇంకా ఎక్కువ వ్యాపకం కలిగిన ఇప్పటి ధర్మాదాయాల చట్టం శాసనంగా చేశారు. తిరుపతి దేవస్థానము వారి అనంతమైన ధనరాసులు ధర్మాదాయంగా అనేకమైన ప్రయోజనాలకు ఉపయోగించేటట్లు అలాగే ఇతర దేవస్థానాల అదనపు ఆదాయాలు కూడ ఉపయోగించేందుకు వీలు కలిగేటట్లు శాసనం చేశారు.

అటవీ సంపద

1967 సంవత్సరం నుంచి ఖజానాకు డబ్బు రావాలనే ప్రయత్నం ఎక్కువ జరిగినట్లనిపిస్తుంది అటవీ సంపదను అదుపులో ఉంచుకొనే చట్టం మొదటిది. భూమిశిస్తును ఎక్కువ చేసేచట్టం ఎనిమిదవది. స్టాంపుచట్టంలో ఉన్న స్టాంపు డ్యూటీని ఎక్కువచేయుటం కూడ ముఖ్యమైంది. అన్నిటినిమించి తెలంగాణాలో వున్న ఈనాముల రద్దుచటం ఈ సంవత్సరంలో చేసింది.

1968లో లాటరీ చట్టం, వైద్యుల రిజిస్ట్రేషనుకు సంబంధించిన చట్టంచేశారు. ఇవి అలావుంచి, ఎక్సైజు చట్టం ఎంతో ముఖ్యమైన మార్పు తెచ్చింది. సర్కారు ఖజానాకు డబ్బురావటానికిగాను మద్య నిషేధ చటాన్ని అమలుచేయటం మాని ఈ చట్టాన్నిచేసి మద్యసేవనాన్ని అదుపులో పెట్టటానికి ఉద్దేశించారు.

1969లో కరణాలు, మునసబులు వీరందరికి వారసత్వ రీత్యా పదవిని సంక్రమింపజేయుటమనే పద్ధతి రద్దుచేశారు. ఇంకా అధినియమాలు రెండు చేయటంద్వారా ఏజన్సీ ఏరియాలోఉన్న ముఠాలు మహళ్లు రద్దయినయి. జమీందారీరద్దు ఈనాములకు 1956లో వస్తే ఇప్పుడు ఈ ముఠాలకు కూడ వర్తించటంచేశారు.

రిక్షాలకు ఫీజు రద్దు

1970–రిక్షాలు లాగేవారికి లైసెన్సు ఫీజు లేకుండా చేయటం ఈ సంవత్సరంలో ముఖ్యమైన శాసనం ప్రకాశంజిల్లా ఉదయింపజేయటం కూడ చెప్పుకోతగింది. డిటెన్షను ద్వారా నేర నిరోధ పద్ధతిని ప్రవేశపెట్టుతూ ఈ సంవత్సరంలోనే శాసనం చేశారు ఆంధ్రప్రదేశ్ శాసనసభవారు. ఇంకాచెప్పుకోవలసినట్టి శాసనాలేమిటంటే–షెడ్యూల్డు భూభాగంలో భూమిని బదిలీ చేయించుకొని నాగరికులమనే స్వార్థపరులు ఆదిమ జాతులవారిని, కోయజాతులవారిని కష్టనష్టాలకు గురిచేస్తున్నారని, వారికి హక్కులు సంక్రమించకుండా సవరణ శాసనంద్వారా ఒక అధినియమం చేశారు రైతువారి సెటిల్‌మెంటు అధినియమంలో, ఆదిమవాసుల అప్పు విషయంలో అనుతోషమిచ్చే అధినియమంలో ముఖ్యమైన మార్పులు జరిపించారు.

1971లో విద్యావిషయికమైన మార్పుతేవటంవల్ల ఇంటర్‌మీడియట్ విద్యాచట్టం చేయాల్సి వచ్చింది. చిట్‌ఫండు చట్టం, అడవుల్లోంచి వచ్చే మైనరు ఫలసాయంలో వర్తకం చేయటాన్ని అదుపులో పెట్టుతూ ఒకేచట్టం భూమిలో, హక్కులను రిజిస్టరుచేసే రికార్డుల విషయంలో ఒక చట్టం చేశారు. ఇవిగాక 1969లో వచ్చిన తెలంగాణా ఉద్యమ రూపంగాను ఆ తర్వాత ఆంధ్రుల ఉద్యమం విజృంభించే పరిస్థితి రూపంగానూ ప్రభుత్వ నౌకరులలో కలిగిన విపరీత ఫలితాలను అరికట్టటాని కన్నట్లు ముఖ్య నౌకరీల నిర్వహణ చట్టం కూడ ఒకటి చేయటం జరిగింది.

భూ పరిమితి చట్టం

1972 వచ్చేటప్పటికి భూమి సీలింగు అర్బను సీలింగుల సంరంభం వచ్చింది. భూములను పట్టణ ప్రాంతంలో ఖాళీస్థలాలను బదిలీ చేయటానికి వీల్లేదని శాసనాలు చేశారు. ఈ సంవత్సరంలోనే సివిలు కోర్టుల చట్టం, ఇంజనీరింగు మొదలయిన సాంకేతిక విద్యలకుగాను జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయమును ఏర్పాటు చేస్తూ ఒక చట్టం కూడ చేయటమయింది. విశాఖపట్నం స్టీలు ప్రాజక్టుకుగాను భూమి అధ్యార్జించేందుకు మరొక చట్టం కూడ చేశారు.

1973 లో భూసంస్కరణల 'వ్యవసాయ భూముల సీలింగు' చట్టం ఒకే ఒకటి ఆంధ్రప్రదేశ్ శాసనసభవారు చేసినట్టిది. ఆ సంవత్సరంలో భారతదేశ ప్రశిడెంటు మనకుగాను శాసనాలు చేశారు. పార్లమెంట్ మన బడ్జెటుకు సంబంధించిన ద్రవ్య చట్టాలను కూడ పారితము చేశారు.

1974 ఈ సంవత్సరంలో జిల్లాల ప్రశాసనం పటిష్టం చేయటానికి సర్కారు వారికి ఎక్కువ అధికారాలు ఇవ్వటం జరిగింది. జిల్లాలు, తాలూకాలు, ఫిర్కాల హద్దులు మార్చటానికి వాటిలోంచి భూభాగాలు తీయటానికి, కలపటానికి అధికారం ప్రభుత్వానికి ఇచ్చారు. గ్రామ పోలీసు చట్టం చేసి ముఖ్య గ్రామాధికారికి పోలీసుల అధికారాలు సంక్రమింపజేశారు. ఊరిలో ఏ దుర్మార్గం గాని జరగకుండా తగిన శ్రద్ధ తీసికొని అధికారాలను చలాయించటం అనే బాధ్యతను గ్రామాధిపతి నెత్తిన పెట్టారు.

ఇంకా చరాస్తికిగాని, స్థిరాస్తికి గాని ఎక్కడయినా సరే యజమాని ఫలాన అని లేక పోయినట్లయితే ఆయాస్తి, ప్రభుత్వానికే చెందాలి అని ఒక విధిని చేశారు. ఒకానొకడు ఆస్తి కలిగినవాడు, చనిపోతూ ఏ విల్లుగాని వ్రాయక, ఏ వారసునిగాని వదలక పోయినట్లయితే అది 'ఎస్టేటు' అని అసలు ఆస్తికి ఎవరుగాని, ఎప్పుడు గాని యజమానే లేకపోయినట్లయితే అది 'బోనా వేకెన్షియా' అని నిర్వచించారు. ఈ ఆస్తులను నిర్వహించటానికి లేదా అమ్మి వేలంవేసి, ఆ డబ్బును సర్కారుకు వప్పజెప్పటానికి అధికారులను గ్రామాల్లో పట్టణాల్లో నియమించవచ్చు. ఇలా జిల్లాలు, తాలూకాలు, గ్రామ పరిపాలనం పటిష్టం చేయడంతో పాటు ఆస్తికి యజమాని అంటూ లేనప్పుడు ఆయాస్తిని పరిపాలించే ఏర్పాటు కూడ చట్టపూర్వకంగా ఇప్పుడు తయారయింది అనాలి.

విద్యా సంస్థల పరిపాలన

అదే దృష్ట్యా ప్రైవేటు విద్యాసంస్థల పరిపాలనను పటిష్టం చేయటానికే మరొక చట్టంచేసి ఆ విద్యాసంస్థలలోని పరిపాలనం న్యాయపూర్వకమైనదిగా చేయటమయింది. ఆ సంస్థలలోని ఉపాధ్యా

యులను నౌకరీనుంచి తీసివేయటం లేదా శిక్షించటంలో కొన్ని ప్రత్యేక నిర్బంధమైన నియమాలు పాటించాల్సిన అవసరం కలుగ జేశారు. ఆలంబనం లేని జీవులుగా ఎవరి దయాధర్మం మీదనో బ్రతకాలనే పరిస్థితిని ఉపాధ్యాయులు జీవితం నుండి విడగొట్టారని పిస్తుంది. ఈ విధి ఒక అధ్యాదేశం (ordinance) ద్వారా చేశారు. అదే 1975 లో తిరిగి చట్టం అయింది.


ఇంకా యంత్రాగారాలు, సంస్థాపనములలో గల నౌకరులకు కొన్ని శెలవులుండాలని ఆ శెలవు రోజులకు కూడా వారికి జీతాలు ఇవ్వవలసిందేనని ఒక చట్టం చేశారు.

అదేమిటదేమిటని అడవుల్లో ఎవరుపడితేవారు వెళ్లి వేట నడిపి మృగాలను చంపకూడదని, దానికికూడ అధికారాన్ని ప్రభుత్వం నుంచి పొంది నిర్బంధాలు, నిషేధాలకు లోనయి మాత్రమే వేట నడపాలనీ శాసనం చేశారు. ఇలా పరిపాలనంలో ఒకానొక నిశితమైన పరివ్యాప్తత సర్వత్రా ఈ 1974 లో నుంచి కనిపిస్తూ ఉంటుంది అనవచ్చు.

1976 లో పట్టణ ప్రాంతంలో సౌందర్యకరమైన పరిసరాలను, నిర్మాణాలను కలుగజేసేందుకు పట్టణ భూభాగాల అభివృద్ధి చట్టము ఒకటి చేశారు. భూమిశిస్తు అదనంగా వసూలు చేసేందుకు ఒక చటం, వాణిజ్య పంటల మీద ప్రత్యేక శిస్తు వసూలుకు ఒక చట్టం కూడ ఈ సంవత్సరంలో చేశారు. అనేక అధ్యాదేశాలు చేశారు. అవి 1976 లో చట్టాలయినాయి.

1976 లో విశ్వవిద్యాలయాల చట్టాలను సవరణచేసి వాటి పరిపాలనా వ్యవస్థలలో మార్పు తెచ్చి అన్ని విశ్వవిద్యాలయాలకు ఒకే రకంగా అధికరణములు విధించేశారు.

ఇంకా వ్యవసాయరంగంలో వ్యవసాయ కూలీలు భూస్వామి పొలంలోనే గుడిశవేసుకొని నివసిస్తూ పనిచేసి పెట్టుతూ ఉండే వాళ్లు. వాళ్లను హఠాత్తుగా ఆ గుడిసెవారిని లేచి పొమ్మని



భూస్వాములనేవాళ్లు. ఈ చిక్కు తొలగిస్తూ ఆ భూమి మేర ఆ వ్యవసాయ కూలీకే హక్కు సంక్రమించాలని ఆదేశించారు.

వ్యవసాయదారులు, వ్యసాయకూలీలు, వ్యవసాయపనిముట్లు చేసే శిల్పులు వీరికి అప్పులిచ్చినవారు తిరిగి వాళ్ల దగ్గర ప్రస్తుతం వసూలు చేయటానికి తీవ్ర చర్యలు కోర్టు ద్వారాగాని ఇతరత్రాగాని తీసుకోవటానికి వీలులేదన్నారు. ఒక సంవత్సరం వాయిదా ఇచ్చారు. ఆ సంవత్సరాన్ని పెంచి రెండు సంవత్సరాలని కూడ అన్నారు ఇప్పుడు. తాకట్టు పెట్టిన సామానులుంటే వాటిని అమ్ముకొని దబ్బుతసరబు అప్పులిచ్చిన వాళ్లు — చేసికుంటారేమోనని అలాంటివి చేయరాదని నిషేధించారు. అలా ఆగి ఉండాల్సిందే ఈ రెండేళ్లున్నూ. —

ఈ చివరి రెండు మూడేండ్లలో చేసిన విధుల్లో భారత ప్రధాని ప్రకటించిన ఇరవయి అంశాలను పురస్కరించుకొని ఉదయింపజేసిన విధులు ప్రధానంగా దేశ సౌభాగ్యానికి ఉపయోగించినవని అనిపిస్తుంది.

గ్రంథసమీక్ష

సంస్కృత నాటక ప్రయోగ రంగము

రచయిత: శ్రీ ఓగేటి అచ్యుతరామశాస్త్రి ఎం.ఎ. హైదరాబాదు నందలి సంస్కృత థియేటరు వారి ప్రచురణము– మూల్యం: రూ. 10/–లు. ప్రతులకు: గ్రంథకర్త, 8–2–46, పంజగుట్ట, హైదరాబాదు–4.

ఉత్తమ నాటక మేదైనను సారస్వతరంగ ప్రయోజనములు రెండింటిని నిర్వహింప వలయును. రంగ ప్రయోజనము నిర్వహింప జాలని నాటకము రసపాత్రపోషణ కవితా కౌశలములందు ప్రశస్తమయ్యు శ్రవ్యకావ్య ప్రాయమైపోవును. శాకుంతల లోత్తరరామ చరితాది సంస్కృత నాటకములు కళాదృష్టితో చూచిన అత్యుత్తమ శ్రేణికి జెందినవనుట నిజమే. కాని పూర్వమవి యెప్పుడెట్లు ప్రదర్శింప బడియుండెనో తెలిసికొనుటకాధారములులేవు. సంస్కృత భాష చాల శతాబ్దులకు పూర్వమే జనవ్యవహారము నుండి తొలగుట చేతను, ప్రదర్శనమున కనువైన రంగ పరికరాదులు లేకపోవుట చేతను, సంస్కృత నాటక ప్రదర్శనముల కవకాశం లేకపోయెను. సుమారొక శతాబ్దికాలము నుండి సంస్కృత భాషయందును, నాటక కళయందును ప్రీతిగల మహనీయులు నాటక సమాజములు స్థాపించి, వానిచే కొన్ని నాటకములను ప్రదర్శింప జేయుటకు యత్నించి యుండిరి. ఆ ప్రయత్నములను వివరించుటయే ఈ గ్రంథమందలి ప్రధాన విషయము. దాని కనుగుణముగనే దీనికి "సంస్కృత నాటక ప్రయోగరంగ"మను సార్థకనామ మొసంగబడినది.

గ్రంథకర్తగారు సంస్కృత భాషా విజ్ఞాతులను, తన్నాటక ప్రయోగ నిపుణులు నగుటచే శ్రమపడి యనేక గ్రంథములను, వ్యాసములను పఠించియు, విషయములను సేకరించియు సంస్కృత నాటక ప్రయోగమునకై ఎవరెవ రెప్పుడెప్పు డెచ్చటెచ్చటనే యే సమాజములను స్థాపించి యే యే నాటకములను ప్రదర్శింప జేసి యుండిరో వివరించి యుండిరి. ఈ విషయమున శ్రీ విజయనగర సంస్థానాధీశులైన విజయరామ గజపతి, ఆనందగజపతి మహారాజులను, 'ది ఇండియన్ గారిక్' అను బిరుదము పొందిన శ్రీ గోమఠం శ్రీనివాసాచార్యులుగారును, మహామహోపాధ్యాయులు వేదం వేంకటరామశాస్త్రుల వారును, మదరాసున సంబంధం మొదలియారు నాయకత్వమున స్థాపింపబడిన 'సుగుణవిలాసిని' పొన్నూరు, తెనాలి, తిరుపతి, కొవ్వూరు, గుంటూరు మున్నగు చోట్లగల ప్రాచ్య కళాశాలల విద్యార్థులును, ఆకాశవాణియు, హైదరాబాదు నందలి కొన్ని సంస్థలును, కొందరు విద్వాంసులును చేసిన కృషి మిక్కిలి ప్రశంస నీయమైనది. 1875–1900 సంవత్సరముల నడుమ వేణీసంహారము, శాకుంతలము, మృచ్ఛకటికము, రత్నావళి మున్నగు సంస్కృత నాటకము లాంధ్రీకరింపబడి ప్రదర్శింపబడినవి. కాళిదాసు జీవిత చరిత్రమునకు సంబంధించిన నాటకము లాంధ్రభాషా రచితములయ్యు సంస్కృత శ్లోక భూయిష్ఠములగుటచే సంస్కృత వాతావరణము గలిగియున్నవని గ్రంథకర్త గారి అభిప్రాయము.


ఈ గ్రంథమున సంస్కృత సంగీత నృత్య రూపకములను గూర్చియు, తత్ప్రయోగములను గూర్చియు, శ్రీ నారాయణదాసు, పాతూరి మధుసూదనరావు మున్నగువారు సంస్కృతములో చెప్పిన హరికథలను గూర్చియు వివరింపబడినది. 1874 తరువాత శ్రీ కోరాడ రామచంద్రశాస్త్రిగారు, శ్రీ పరవస్తు వేంకట రంగాచార్యులుగారు, శ్రీ విశ్వనాథ కవి సమ్రాట్టు మున్నగు కీర్తిశేషులును, సజీవులై యున్నవారిలో డాక్టర్ బి. ఆర్. శాస్త్రి గారును, శ్రీ యజ్ఞనారాయణ దీక్షితులును, తిరుమల రామచంద్ర గారును రచించిన సంస్కృత నాటకములు గూడ పేర్కొనబడినవి.

1970 వ సంవత్సరమున హైదరాబాదులో సంస్కృత థియేటరు స్థాపింపబడి వేణీ సంహారము, విక్రమోర్వశీయము, దేవయాని, ప్రతాపరుద్ర పట్టాభిషేకము అనువానిని మొత్తము పదునైదు పర్యాయములు ప్రదర్శించినది. అందలి సభ్యులాకాశవాణిలో

స్వప్నవాసవదత్త, వేణీ సంహారాదులను ప్రయోగించి యుండిరి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున వారు ప్రదర్శించిన ప్రతాపరుద్రపట్టాభిషేక నాటకము విషయము గ్రంథాంతమున విపులముగా వర్ణింపబడినది. 1975 జనవరి నెలలో గౌ॥ శ్రీ భాట్టం శ్రీరామమూర్తిగారు అధ్యక్షులుగా ఆధునిక సంస్కృత నాటకరంగ శతాబ్ది మహోత్సవ సంఘము స్థాపింపబడినది. వివిధ నగరములలో సంస్కృత నాటక గోష్ఠి ప్రయోగములను జరిపించుట, సంస్కృత నాటక ప్రయోగములను గూర్చి గ్రంథములను ప్రకటించుట, ఏకపాత్రాభినయపు పోటీలు నిర్వహించుట, పండితులను సన్మానించుట మున్నగునవి దాని ప్రధానాశయములు.

గ్రంథకర్త గతశతాబ్దిలో సంస్కృత నాటక రచనా ప్రదర్శనముల విషయమున జరిగిన ప్రయత్నముల నీ గ్రంథమున చక్కగా వివరించి సంస్కృతమింకను సజీవమేయని నిరూపింపజాలిరి. వారు పెక్కు గ్రంథములను పరిశీలించియు, పలువురు విద్వాంసులతో చర్చలు జరిపియు సంస్కృత నాటకరంగ ప్రయోగము విషయమున నెంతో పరిశోధన కావించియుండిరి. ప్రసక్తాను ప్రసక్తముగా వారు కొందఱు నటుల జీవితమును, కొందఱు రచయితల వృత్తాంతములును, కొన్ని సమాజముల చరిత్రలును గూడ వివరించియుండిరి. వారును, వారిసోదరులును విద్వాంసులేగాక నటులు గూడ నగుటచే నిందాత్మ విషయము గూడ పలుచోట్ల చెప్పవలసి వచ్చినది. వారి శైలి స్పష్టమై, సర్వసుబోధమై, ధారాళముగా సాగినది. భాషలో గ్రాంథిక వ్యావహారికముల కలగలుపు కనిపించును. 'సాంఘిక కట్టుబాట్లు' (19 వ పుట), అనేక మార్పులు (30). ఆర్థిక వనరులు (40). మహా ఉబలాటము (53). స్వాతంత్ర్య పోరాటము (74). పురోధసాదులు మున్నగు సమాసములను, వాటిని యిక్కడ (20), నారాయణుని యాహ్వానించి (44), కార్యక్రమములు యేర్పాటు (62) మున్నగు ద్రుతము తర్వాత ను యడాగమముతో గూడిన ప్రయోగములు, వాడుకబడినవి (36) వాడుబడసినవి (48) మున్నగు తప్పు సంధులు: పంపమని, పాడమని (21) చంపుతున్న (34), ఐక్యత (45). చూసినట్లు(46) వాయిద్యములు (56), ఉదహరించు (49) మున్నగు వ్యావహారిక ప్రయోగములు, కొన్ని వర్ణక్రమ దోషములు వారు పరిహరించి యుండవలసినది. గ్రంథమూల్యమును సగమైన తగ్గించుట యుక్తము.

—దివాకర్ల వేంకటావధాని



PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVT. OF ANDHRA PRADESH, AT THE GOVT. CENTRAL PRESS, HYDERABAD.
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION & PUBLIC RELATIONS, ANDHRA PRADESH, HYDERABAD.

